
# కథా కౌముది

## 2022 - part -1



శ్రీ

కౌముది

మీ మనసుల్లో సాహితీ వెన్నెల

www.koumudi.net


ప్రచురణ సంఖ్య: 254

# కౌముది మాసపత్రికలో

## 2022 జనవరి నుంచి జూన్ 2022 వరకూ వచ్చిన కథలు


| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | దిగంతమూ ... ఆవల...? | విహారి | 4 |
| 2 | గమ్యం ఏది? | డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి. | 13 |
| 3 | పవిత్ర | విద్యార్థి | 25 |
| 4 | లో క్లాస్ మనిషి | దమ్మవళం శ్రీనివాస్ | 40 |
| 5 | సహజీవనం | నవులూరి వెంకటేశ్వరరావు | 47 |
| 6 | విచిత్రవ్యక్తి | పి. చంద్రశేఖర అజాద్ | 59 |
| 7 | లచ్చిమి | సోమ సుధేష్ణ | 73 |
| 8 | త్రిసూత్ర పథకం | కుంతి | 81 |
| 9 | అద్దం అలిగితే.. | విజయార్కె | 92 |
| 10 | ప్రశ్నించే హక్కు | పుట్టగంటి గోపీకృష్ణ | 101 |
| 11 | గ్రహణ విముక్తం | శాంతిశ్రీ బెనర్జీ | 109 |
| 12 | ఒక నేరం కథ | చిట్టత్తూరు మునిగోపాల్ | 117 |
| 13 | ఎక్స్ ట్రీం చెలగాటం | పాణిని జెన్నాభట్ల | 122 |
| 14 | బాకీ | సయ్యద్ సలీం | 132 |
| 15 | తాటాకుమంటలు | దారల విజయకుమారి | 139 |
| 16 | తూర్పు పడమరా! | జె.యు.బి.వి.ప్రసాద్ | 145 |
| 17 | మరో కురుక్షేత్రం | పాణిని జన్నాభట్ల | 152 |
| 18 | ధారావాహిక హత్యలు | నిర్మలాదిత్య భాస్కర్ పులికల్ | 164 |

| | | | |
|---|---|---|---|
| 19 | భూలోక స్వర్గం | డా. కె.గీత | 174 |
| 20 | ఆట – పోరు | తాడికొండ కె. శివకుమార శర్మ | 184 |
| 21 | క్రైమ్ నెవర్ సేస్... | డా.వి.కె.వీ ప్రసాద్ | 188 |
| 22 | రెండు నిమిషాలు | అమృత వర్షిణి | 197 |
| 23 | ఆడపిల్ల | షేక్ షబ్బర్ హుస్సేన్ | 204 |
| 24 | ముత్యాల గాజులు | అనసూయ ఉయ్యూరు | 211 |
| 25 | జీవితమే సఫలమూ.. | తాటిపాముల మృత్యుంజయుడు | 217 |
| 26 | ఎగరడానికి రెండు రెక్కలు | వి.శ్రీనివాస మూర్తి | 228 |
| 27 | సవరించిన వీణ | ఏ.బి.ఎస్.రామారావు | 231 |
| 28 | ఇచ్ఛ | సి.యమున | 240 |
| 29 | మంచుగుండెల చప్పుళ్ళు | మంత్రవాది మహేశ్వర్ | 248 |
| 30 | పెంపకం | నిరుపమ రావినూతల | 255 |
| 31 | అవసరం తీరిపోయింది | గాదిరాజు మధుసూదనరాజు | 258 |

# దిగంతమూ ... ఆవల...? విహారి

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో విశిష్ట బహుమతి పొందిన కథ

**"అప్పూ!** నీకు తగిన మొగుడు దొరికాడోచ్"–మాటలు ఎగిరి గిరికీలు కొట్టినై.

శాంతికి అమిత సంతోషం! నీకు మొగుణ్ణి వేటాడటంలో దానికి మొహం నిండా–ప్లస్ లూ, ఇంటూలూ, శ్లాష్ లూ, హ్యాష్ లూ మొలుచుకొస్తాయి. స్క్రోలింగ్ ఆగుతుంది. ఒక ప్రశార్థకం!

నీకు బాగానే తెలుసు. మిస్సమ్మలో రామారావు డైలాగ్ లాగా 'వచ్చినట్టే వచ్చి పోయిందోచ్' అవుతుంది. చివరికి మిగిలేది ఒక మైనస్. కాకపోతే ఒక భాగహారవు గుర్తు. అందుకనే నీకు ఉత్సాహం ఉండదు.

"అప్పూ! చూస్తావా? వింటావా?" శాంతి

"ముందు నీ 'అప్పూ' సంబోధన ఆపవే! చక్కటి అపర్ణని ఎందుకు ఖూనీ చేస్తావ్" నీ ఆయాసంలో కనుబొమల చిట్లింపు.

శాంతికి నవ్వు.

అంతరాంతరాల్లో నీకు 'దొరుకుతాడేమో' అని ఆకాశమంత సందేహంలో మాడంత ఆశమబ్బుతునక.

'చదువు'

లిప్తపాటు గాలిని స్తంభింపజేసింది. శాంతి. దీనికిదో ఆట. 'ఉడికించటం' దీని పేరు. ఏఁవిటీ ఉడికించేది? ముడిబియ్యమూ ఉడకటంలేదు; కల్తీపప్పూ ఉడకటం లేదు. నీకు వంటంతా స్త్రీ సూక్తంలా గుర్తుకొస్తుంది.

" వరుడు ఐఏఎస్ 'వైవా'కి కూడా హాజరైనాడు. జస్ట్ మిస్డ్ ద బస్. అందుకని ఢిల్లీలో కూచుని మళ్ళీ ట్రైనింగ్. ట్రై చేస్తున్నాట్ట. అతని జీవిత ధ్యేయం 'సివిల్స్' ట. సాఫ్ట్వేర్ అమ్మాయే కావాలిట.'

'స్టాపిట్ ఐ సే' నీ అరుపుకి ఉలిక్కిపడింది. శాంతి. మాట కట్టువడింది.

"పెళ్లెందుకంటే గొట్టంగాడికి? ఆ సివిల్స్ తో కుస్తీకి ఈ పెళ్లాం సంపాదన కావాలి. అంతే, డర్టీ ఫెలో!"

"అందంగా బాగున్నాడే. హైట్ ఆరూ ఒకటిట" ఫోటో చూస్తున్నది శాంతి. అప్పటికప్పుడే ఆమె అతని ఎఫ్ బి పట్టుకున్నది.

ఠక్కున నీ మాట దుమికింది " అంత బాగుంటే, నువ్ చేసుకో"

మరుక్షణం నాలిక్కరుచుకున్నావ్. నీలోకి నువ్ మాయమైనావ్. 'సారీ' మాత్రం బయటకొచ్చింది.

శాంతి మొహం అప్పటికే మ్లానమైంది. విచ్చాయవరచుకుంది. కళ్లల్లో మంకెనలేమీ పూయలేదుగానీ,

ఒక అసహనవు వీచిక కదిలింది. గాయపడిన హృదయఘోష! జాలి చెమరింపు.

ఆమె గురించి తెలినీ నువ్వు తొందరపడ్డావే అపర్ణా! నీకసలు ఎప్పుడేం మాట్లాడాలో తెలీటం లేదు.

బుద్ధి హఠాత్తుగా విరిచే వంకరల్ని సరిచేసుకోలేకపోతున్నావ్.

– కాలం భీతిల్లింది. గదంతా నిశ్శబ్దవు కుమ్మపొగ.

– రాత్రి తిండి .. తనంతట తాను అయిందనిపించుకుంది. గదిలో పడుకుంటే–

నీ ఆలోచనల నిండా శాంతే! ఆమె చెప్పుకున్న గాథే.

★★★

ఎనిమిదో ఏట నుంచే శాంతి అంటే త్రుళ్లింత. ఇటు సంగీతం; అటు నాట్యం. బిటెక్ రెండో సంవత్సరం వరకూ షోకేస్ లో ఇమడనన్ని మెమెంటోలు ... అన్ని పోటీల్లో నెంబర్ వన్.

'చైల్డ్ ప్రాడెజీ' నుంచీ ప్రస్థానం .... కాదు, అంతా పురోగమనం. అభినందనలూ, ముచ్చట్లూ, మురిపాలూ ..

అదిగో అప్పుడూ – బ్రేక్!

హఠాత్తుగా పెళ్ళి మాటలు. తండ్రి పరిచయస్థుడి కొడుకు. ఎంబిఏ. తండ్రికి పెద్ద బిజినెస్ లూ. ఇతనూ ఒక జిల్లా మొత్తానికి కేబుల్ టీవీ ఓనర్.

"పెళ్లయినా చదువుకోమంటున్నారు. అత్తమ్మ లేదు; ఆడపడుచులూ లేరు. పిల్ల సుఖపడుతుంది." అమ్మ సంతృప్తి. 'సుఖమంటే?'

అమ్మ విజయావారి మాయాబజారు బాపతు. తనకి అందరూ బాగుంటారు. తానూ అందరికీ బాగుంటుంది.

బి.కాం. నిరుద్యోగి అన్నయ్య మనసులో అనేక వంతెనలు కట్టుకుంటున్నాడు. చాలా ఆశలబాటలు పరచుకుంటున్నాడు.

హెడ్మాస్టర్ నాన్నకి గుండె బరువు తీసేసినట్టయింది. పెళ్లి ఏర్పాట్లూ వాళ్లే చేసుకుంటార్ట. కట్నాలు, కానుకలూ నిల్!

తనకి మనసులో–'గిలి'. బయటికి కినుక; నస. సణుగుడు. గొణుగుడు,. ధిక్కార రాగ ప్రస్తారం. నిరసన కాలితాపులు–నేలకి!

పట్టించుకోని స్పందనలు, వినీవినిపించుకోని ప్రతి స్పందనలు. మెత్తికోళ్లు, బుజ్జగింపులు, హితబోధ, బ్రతిమిలాట; బెదిరింపులూ. అదొక నిశ్వాసాల ఆశ్వాసాల గ్రంథ సంకలనం.

తప్పనిసరి 'తలవూపు'!.. అది చాలు వాళ్లకి!

అయిందమ్మ పెళ్లి. అణిగిందమ్మ (తనవాళ్ల) రంధి.

అందగాడు నారాయణ అంతతొందరగా అందేవాడు కాడు. అన్నయ్యకి సూటిగానే చెప్పాడు, "నువ్ మాకు పనికి రావోయ్" అని. అర్థం చేసుకుంది. అతని చూపూ, ఆలోచనా, మేధ –సర్వమూ–' ఇక్కడి నుంచి ఎక్కడికి? ఈ తర్వాత ఏ వ్యాపారం? ఎంత బాటమ్ లైన్? 'అంతే! భార్య అంటే జీహుజూర్ గా ఉండాలి.

వివాహూ విద్య నాశాయః శోభనం నర్వనాశాయ!

– రెండో నెల్లోనే నెలతప్పింది. 'నారాయణకీ, అతని తండ్రి పట్టాభికీ' బోల్డు సంతృప్తి.

– జనాభా సంఖ్యకి ఒకటి కలిసింది. ఆడపిల్ల!

"నాకు ఎవరైనా ఒకటే. ఒక్కరు చాలు. ఈ ఒక్కదానికి నీ తైతక్కలూ, సా ......నీ....పా..... లూ రాకుండా

వుంటే చాలు". పుట్టిన పిల్లని తొలిసారి చూడటానికి వచ్చిన నారాయణ అభినందన. అప్పుడే తెలిసింది. సిజేరియన్ తో పాటు ట్యూబెక్టమీ కూడా 'మేనేజ్' చేశాడని!

ప్రతి పిడుగు డ్రుళ్లటానికి మెరుపు తప్పనిసరేమీ కాదు. ముసురుపట్టబోయే బతుకు బొమ్మేదో రెప్పల మధ్యన అలుక్కుపోయింది.

చిరంజీవి సాధనకు ఆయా వచ్చింది. సుభద్ర. ఇంటి పనీ, వంటపనీ .... అన్నీ ... అన్నింటికీ ఇరవైనాలుగు గంటల ఇంటిమనిషి.

నారాయణకి రోజురోజుకీ కొత్త వ్యాపారాలూ, వ్యవహారాలూ ... క్రమేపీ రాజకీయాల్లోకి ప్రవేశం.

చదువు ప్రసక్తి తెస్తే దానికి కౌంటర్ వేశాడు. "నీ కోసమే ఐస్ క్రీం పార్లర్ ఫ్రాంఛెయిజ్ తీసుకున్నాను నువ్వే చూసుకోవాలి".

చూసుకుంది తప్పనిసరి తద్దినం.

–బహిరంతర యుద్ధాలతో రెండేళ్లు వ్రేళ్ల నందుల్లో నుంచి జారిపోయాయి. 'గుండె మంటలారిపే చన్నీళ్లు కన్నీళ్లు' పాడుకున్న పాట గుండె గొంతుకలో కొట్టాడేది.

నారాయణ మందు పార్టీలూ ... నిచ్చెన పైమెట్లకోసం ఆరాటాలూ ... బీజీ ....

" ఇవన్నీ మనకెందుకండీ?" ఒక హీనస్వరం.

"పగలంతా నాకు ఆ పార్లరే సరిపోతోంది" ఒక ఈరెలుగు.

“ నీ సంగతి నువ్ చూసుకో. నలహాలొద్దు” ఒక గద్దింపు.

సాధనకూ తనకూ దూరం .... దూరం .... సుభద్రకు స్థానబలిమి దక్కింది. మామగారికి చాలా ‘సహకారి'. అది బహిరంగ రహస్యమే అయింది.

నారాయణ చూపు ఎమ్మెల్యే టికెట్ మీద నిలిచింది. అందుకు అడుగులూ ... పరుగూ ... కేబుల్ బిజినెస్ పార్ట్ నర్ కి అప్పజెప్పేశాడు.

–ఓ శనివారం. మేఘచ్ఛిన్నైరుర్దినం! ఆకాశం మబ్బులు కమ్మింది.

“సాయంత్రం ఏడింటికి పార్టీకి వెళ్లాలి. పార్లర్ ని త్వరగా క్లోజ్ చేసి వచ్చెయ్. నేను వచ్చి తీసికెళ్తాను"

“నేనెందుకు లెండి. మీ రాజకీయాలూ, వ్యాపారాలూ, వ్యవహారాలూ ఏ.వి. నాకు అర్థంకావుకూడా.”

" కాదులే ... రా ... "

అంతకుమించి భార్యకి మాట్లాడే అర్హతలేదు.

ఏడున్నరవుతుంటే గెస్టహౌస్ కి చేరాము. ఇంకా ఎవ్వరూ రాలేదు. కేర్ టేకర్ కాఫీలు తెచ్చాడు. నారాయణ వరండాలో ఫోన్లో మాటలు, తాను టీవీనీ, పేపర్నీ, ఫోన్ నీ చూపులతో పలకరిస్తూ కూచున్నది.

ఎనిమిదిన్నరవుతుంటే వచ్చారు. ప్రకాశరావు, చిత్తరంజన్. పరిచయాలు.

“ ఢిల్లీలోని అన్ని చక్రాలూ వీరిద్దరి చేతుల్లోనే తిరుగుతాయి. "

మెచ్చికోలు నవ్వులు .... నమస్కారాలు ..... మరి కాస్సేపు మెరమెచ్చులూ ... ఇచ్చకాలూ ...

“ చిత్తరంజన్ గారు గొప్ప కళాభిమాని, సంఘసేవకులు. వారి వితరణనీ, ఔదార్యాన్ని పొందని కళాకారులు లేరు” అని క్షణం ఆగాడు నారాయణ.” మీరు తప్ప” అని పూర్తిచేశాడు. ప్రకాశరావు.

తెల్లపాంటూ పైజామా, బుంగమీసాలూ, బట్టతల, గడ్డం ...

చిత్తరంజన్ “యా..యా ...” అని కళ్లు చికిలించాడు గర్వంగా. మెడలో చైనూ, చేతి వేళ్ల ఉంగరాలూ కదిలాయి. లేని మీసం మీదికి పోయింది చెయ్యి. ఏభై ఏళ్లకే కళ్లకింద ఉబ్బు ... నల్లపొడలూ ... ఖద్దరు తెలుపు ఖరీదైన మనిషినని చెబుతోంది!

“సంగీతంలోనూ, నాట్యంలోనూ మీ ప్రతిభగురించి చెప్పారు నారాయణ. వెరీగ్లాడ్" అంటూ మొదలెట్టి

చాలా భాషణ చేశాడు చిత్తరంజన్. రేడియో ప్రొడ్యూసర్లు డాక్యుమెంటరీ, ఫిల్మ్ నిర్మాతలు, సంగీతకారులు, ఫొటోగ్రాఫర్లు, కవులు, నర్తకీమణులు, గాయనీగాయకులు ... ఇలా చాలామంది పేర్లని స్మరించాడు. వారంతా తనకు ఎంత సన్నిహితులో వర్ణించాడు.

ప్రకాశరావు ఫోన్ మ్రోగింది. లేచి బయటికి వెళ్లాడు. మరో రెండు నిముషాలకి నారాయణ ఫోనూ సవ్వడి చేసింది. తానూ లేచాడు. వెళ్తూ వెళ్తూ “చిత్తరంజన్ గారితో మనకు చాలా పనుంది. జాగ్రత్తగా మాట్లాడు . నేనిప్పుడే వస్తాను. జస్ట్ టేక్ కేరాఫ్ హిమ్" అని తిరిగి చూడకుండా బయటికి వెళ్లిపోయాడు.

మరో ఐదు నిముషాల్లోనే–

కేర్‌టేకర్ వచ్చి వంగి దణ్ణం పెట్టి నిదానంగా బయటికి వెళ్లిపోయాడు.

పరిస్థితి అయోమయంగా ఉంది. ముఖాన్న చెమట పట్టింది. అనేక సందేహాలు ముసిరినై.

దిక్కులు చూస్తుంటే చిత్తరంజన్ అన్నాడు “మీ అంతటి ప్రతిభ వున్నవారికి ఢిల్లీలో గానీ తగిన గుర్తింపు ఉండదు. నారాయణతో మాట్లాడతాను" అని, "రండి. మీకు బాగా చెమట పట్టింది లోపల కూచుందాం” అంటూ లేచి సూట్ నెంబర్ వన్ వైపు కదిలాడు.

తన దేహాన్నేదో ముంచుతెర కమ్ముతున్నట్టయింది. అంతలోనే, “రా, శాంతీ!" అని వెకిలి నవ్వుతో పిలుపు. పిలుపులో కుటిలత్వపు కులుకు. “నారాయణ అప్పుడే రాడు. ఒక గంట మనిద్దరిదీ ... గెటెలాంగ్.”

నియమం అన్న ప్రతిదాన్నీ అతిక్రమించే అహమా? అధికార మదమా? వంచన నైజమా? రాజకీయమా? రాక్షసీ.. నీ పేరేమిటి?

క్షణంలో సగం సేపు –దిగంతాల చివర పెళ్లలు లేస్తున్నట్టు ... పొగచూరిన దృశ్యం.

అంతలోనే నలుపులో మెఱుపు!

ఠక్కున లేచింది. 'వన్ మినిట్’ అంటూ కిచెన్ వైపు పరుగు.

తరుగులో మెఱుగు. గడియ తీయగానే తలుపు తెరుచుకుంది. దోషులకీ తప్పటడుగులుంటై.

కేర్‌టేకర్ ... ఇప్పుడు తన ‘కేర్’ టేకరైనాడు!

కథ ముందుకు సాగటానికేం? మర్నాడు సాధనతోపాటు అమ్మ ఒడికి చేరితే, మూడేళ్లపాటు వేధింపులు, బెదిరింపులు ... కేను ...

మధ్యలో నారాయణ వ్యాపారాల మీద ఐటి దాడులు ...

తన బిటెక్ కి మోక్షం. సాధన అమ్మమ్మ ఒడికి. తాను హైదరాబాద్ ఉద్యోగానికి. ఫర్వాలేదు. ముప్పైవేలకి సంతకం. పద్దెనిమిదివేలు జీతం ... కంపెనీలకి సవాలక్ష వెనులుబాట్లు ... కాదు కాదు, అడ్డదారులు ... లక్ష క్రిమినల్ బ్రెయిన్ నలహాలు.

తనది అవసరం; వాళ్లది అవకాశం.

★★★

అపర్ణా–మళ్లీ నీ ఘోషలోకి రా ...!

నీకూ, నీ గదికీ తోడు శాంతి. మనసులు కలిశాయి. వంటావార్పుల్లోనూ, కాఫీ టిఫిన్లలోనూ మాటలు – అనుభవాల తుంపర్లనీ, జడివాన ఝుంఝునీ కలుపుకున్నాయి.

ఇప్పుడే ఫోన్ వైబ్రేషన్! అమ్మ!

ఉభయకుశలోపరి.

“అన్నయ్య ఫ్రెండుట. పేరు భాస్కరం. తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు. హైదరాబాద్ లోనే ఉంటార్ట. శేఖరం బావ వస్తాడు. చూపిస్తాడు. ముందు చూడు. మిగిలిన విషయాలు తర్వాత” ... పెట్టేసింది.

టైము పదకొండూ ఇరవై. నీ తలనొప్పి నీకు నేనున్నానంది. ఫ్లాస్కులో టీ .. తాగుతుంటే ... మీ నాన్న గుర్తుకొచ్చాడు.

ఆయన్ని నాతో మాట్లాడవద్దనివుంటుంది అమ్మ. ఆయన చేస్తే– “శరీరం మీదికి ముప్పై ఏళ్ళొచ్చాయ్. పెళ్లి పెటాకుల్లేకుండా ఘోటకవు బ్రహ్మచారిణిగా మిగిలిపోయి లోకాన్ని ఉద్ధరిస్తావా?” తో ..... మొదలై “ రెండు ఆత్మహత్యలకూ మా కూతురు అపర్ణే కారణమని ఎస్పీకి లెటర్ ... ఆ తర్వాతంతా నీ ఏడుపూ .... జుట్టు పీక్కోలేక ఛస్తావ్” ... తో పూర్తయి వుండేది.

అవునూ–నీ పెళ్లిచూపుల ప్రబంధానికి ఆశ్వాసాంతాలు లేవా?

శేఖరం బావతో ‘ముడి’ పడుతుందని పాప మీ అమ్మ చాలా ఆశతో చాలా ఏళ్లు గడిపింది. ఒక శుభరాత్రి– మీ బావ–ఆ బుడగని కాస్తా 'ఠప్’ మనిపించాడు. ‘దానికి నాకూ పెళ్లేమిటే– వరహీనం', అనేసి నీవైపు అదోలా మొహంచాటేసిన చూపు చూశాడు. 'టూమచ్ ఫెమిలియారిటీ బ్రీడ్స్ కామ్ టెంప్ట్ కూడా అని,' “అవును కదా అపర్ణా?” అన్నాడు క్రీగంటి చూపుతో,

ఆ చూపులో ఏవేవో అర్థాలు నీ వెన్నుచరిచాయి. వాటన్నిటిలోని ధ్వనులేవో పాత ఆకృతుల్ని కళ్లముందు పరచాయి. సెకండియర్ ఇంటర్ లో స్టడీ అవర్స్ లో పురుషోత్తం టీచర్ ఎపిసోడ్?! ... ముద్దు వరకూ వచ్చి, మూతి పగిలింది. టీకా తాత్పర్యాల్ని చదువుకున్నాడేమో శేఖరం– అని ఒక చేదు ఊహ! నీ కాంప్లెక్స్? ఏమైనా, బావతో పెళ్లి ప్రసక్తికి చుక్కపెట్టేసింది అమ్మ. వాడి ప్రాణానికీ, నీ ప్రాణానికి వేసీవేయని సంకెళ్ళేవో ఊడినట్లయింది. ప్రాణం తెరిపిన పడింది.

ఆ తర్వాత చాలా కేసులకి మీ నాన్న జాతకాల జోడింపు మొరాయించింది. ఇప్పుడీ భాస్కరం గ్రహరాశుల పాయింట్లేవో తన పాయింట్లకి సరితూగివుంటై.

ఉలికిపాటుతో ప్రస్తుతంలోకి..

శాంతి ఏం చేస్తున్నదో?

అది బ్రూడింగ్ టైపేమీ కాదులే. నిర్వాకారంగానూ ఉండగలదు. ఆ స్వభావంవల్లనే తన చరిత్రని అంతవివరంగా పంచుకున్నది.

మంచు నీరైన చందాన సమస్యల్ని కరగించేయగలదు.

' కార్యకారణ వితర్కాలూ, స్వపర తారతమ్యాలూ అన్నీ జగన్నాటకంలో సహజం. వాటి గురించి ఆలోచన ఓకే. కానీ వాటి గురించి జుట్టు పీక్కోకూడదు.' ఇదీ దాని తార్కికత, తత్త్వం!

టైమ్ పన్నెండున్నర. రెప్పల్ని ముద్దాడుతోంది కునుకు.

★★★

'గుడ్ మార్నింగ్' తో కలత నిద్ర చెడింది. ఎదురుగా కాఫీ కప్పుతో శాంతి! 'ఆదివారం స్పెషల్ బెడ్ కాఫీ" అని నవ్వుతూ వచ్చి మంచం అంచున కూచుంది.

శాంతి మొహం స్వచ్ఛంగా, ప్రశాంతంగా హాయి గొలుపుతోంది. రాత్రి సంభవాన్ని శుభ్రం చేసి, ఎత్తేసి, డస్ట్ బిన్ లో పడేసి వచ్చేసింది. గ్రేట్.

'పాటపాడుమా కృష్ణా ... 'అందుకున్నది.

ఉషోదయంలో కమ్మతెమ్మెర. నీ మనను పలుకుతోంది. 'ఈ జీవితానికింతకంటే ఏంకావాలి?

సమయం గడుస్తుంటే ఏదో కావాలిలే అన్నట్టు దినచర్చ ... అమ్మ ఫోన్లో రిమైండర్ .... శాంతితో సంప్రతింపు ... చకచకా తయారు తినటం ... పదింటికి వచ్చాడు శేఖరం.

'చట్నీస్' లో సమావేశం. భాస్కరం స్ఫురద్రూపి. నుదుట విభూతి పట్టెలు ... భ్రుకుటి మధ్యన కుంకుమ బొట్టు. మెడలో బంగారు చైనూ, రుద్రాక్షలూ కనిపించేట్టు పై బటన్ పెట్టని చొక్కా, ఎడమభుజాన సిల్క్ శాలువా, రెండంచుల పంచె.

ఇడ్లీ, దోశ మీ ముగ్గురికీ. అతనికి పాలు.

సమయం కదులుతోంది. శేఖరమే ప్రశ్నలు వదులుతున్నాడు–నీకోసం. భాస్కరం చెబుతున్న సమాధానాలూ నీకోసమే.

తండ్రి పౌరోహిత్యం. తల్లి గృహిణి. ఒక చెల్లెలు. పదో తరగతి. తాను వేదం చదువుకున్నాడు.

ఘనాపాటి. స్మార్తంలో పదిమందికి హెడ్. బి.కాం. కూడా చేశాడు. వారాసిగూడాలో సొంత ఇల్లు–వన్ ప్లస్ వన్.

నగరం నాలుగు దిక్కుల రెండు ఫ్లాట్లూ, రెండు ప్లాట్ లూ ఉన్నై.

“ భాస్కరంకి రియల్ ఎస్టేట్ ఇంట్రెస్టు ఎక్కువ" అన్నాడు శేఖరం.

" అవును ఇవ్వాళా రేపూ అన్నింటి ధరలూ ఆకాశాన్నంటుతున్నై. రేవతి జీవనశైలికి తగిన ఆదాయం. కావాలంటే ముందుచూపు ముఖ్యం. సంపాదించే వయస్సులో సంపాదించమన్నై శాస్త్రాలు కూడా 'అని

ఆగి,“ నిజం చెప్పాలంటే, నాకు ఫైనాన్స్ మీదే నెలకో పదివేలొస్తాయి. నా వృత్తి ఎంతలేదన్నా ఓ నలభై ఇస్తుంది "

" క్రెడెన్షియల్స్ బాగున్నై"అన్నది శాంతి అదో విధమైన అన్యోపదేశంతో, భాస్కరం ఆమె మాటని అభినందనగానే తీసుకుని సన్నగా నవ్వాడు.

శేఖరం కించిదాశ్చర్యంతో చూశాడు.

నీవేమో మౌనశ్రోతగా ఉండిపోయావు. మరి కొద్దిసేపు భాస్కరం 'డబ్బు'చుట్టూ తిరిగితే, శేఖరం అతని ‘తెలివితేటల' పరిధిని విస్తృతం చేశాడు.

‘ప్రయోజకత్వమంటే ఇట్టా ఉండాలి 'అని ఓ తీర్మానమూ మీ ముందుంచాడు.

పెళ్లిచూపులు అయినై.

నువ్వూ శాంతీ ఇంటికి చేరారు.

“ ఏఁవిటీ నీ అభిప్రాయం?” శాంతికి నీ ప్రశ్న.

అందంగా నవ్వుతుంది శాంతి జలపాతపు నురుగులా. “చేసుకోవలసినవాళ్లు చెప్పాలి"

“చెప్పవే ప్లీజ్" – నీ గునుపు.

“నువ్ గమనించావో లేదో–భాస్కరంకి ఒక కాలు కొంచెం ఎత్తు. జస్ట్ ఒక అంగుళమేమో, కారణం ఏమిటో మరి."

“అవును. నేనూ చూశాను అతను మన దగ్గర సెలవు తీసుకొనేటప్పుడు." నీ సమాధానం.

“సరేగానీ, గతంలో నారాయణ గురించి నువ్వన్న మాట ఈ భాస్కరంకీ అన్వయిస్తుందని పిస్తోంది ”

ఏమిటన్నట్టు చూసింది శాంతి.

“అవును. వీళ్లతో మాట్లాడితే ఇన్ టర్మ్ ఆఫ్ మనీ– నాకేమిటి లాభం అనే అలజడే వాళ్ల కళ్లల్లో సంచలిస్తూ ఉంటుంది"

నీ మాటలకి అదాటున భుజంమీద చరిచింది. శాంతి.

“ రోగనిర్ధారణలో ఘటికురాలివే” కాంప్లిమెంట్.

ఉలిక్కిపడ్డావు.

క్షణాలు కరిగినై.

"ఏమోనే ఆయనగారి ఘనతా ఘనార్ఘుటలకేంగానీ, నాకైతే పోవు గింజలు లెక్కపెట్టి వెయ్యమంటాడేమోననే భయం కలుగుతోంది!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"జోకులు సరేగానీ, నీ అభిప్రాయం చెప్పవే " నీ సూటి ప్రశ్న

తలవంచి నీ కళ్లల్లోకి చూస్తూ చెప్పింది. శాంతి, "మీ బావకేమో నువ్ వనికిరావు. అతని అంతరాంతరాల్లో నీ శీలం మీద అనుమానం–అని నీ భావన. నీకేమో ఇప్పుడు ఈ భాస్కరం పనికిరాడని పిస్తున్నది. కారణం నీ అంతరాంతరాల్లో అతను నిన్ను' డబ్బు'యంత్రంలో కందెన చేస్తాడేమోనన్న భయం" ఆగింది. అవునా అన్నట్టు గద్దింపు చూపు చూసింది.

నువ్ తలవంచుకున్నావ్. నేలచూపు!

"కనుక– టు సే ఓకే ఆర్ నాట్ టూ సే ఓకే–అనేది మిలియన్ డాలర్ ప్రశ్న?"

"నీ విశ్లేషణ బాగుంది. ఏం చేద్దాం? బావ రిపోర్ట్ వెళ్లగానే అమ్మ ఫోన్ వస్తుందిప్పుడు." నీ స్వరంలో తొందరతో పాటు, నిజాయితీ కూడా వుంది.

చూపులోనూ, భంగిమలోనూ ఏదో ముడి విప్పుతున్న ధోరణికి తెలుపుతూ అన్నది శాంతి." ఈ ఆడప్రాణి అస్తిత్వం లేని ఆస్తే అమ్మడూ. జీవం లేని జీవి రూపం. నే చెప్పేది కవిత్వమేమీ కాదు. నిష్టుర సత్యమే."

చెప్పటం ఆపి కిటికీ దాకా వెళ్లి చూస్తోంది. దిగంతాలకేమో! "బతకాలి కనుక– సోకాల్డ్ తోడుతోనా, తోడులేకుండానా? అనేది ప్రశ్న! అవునూ ఏ నిర్ణయమూ తీసుకోకపోవటమూ ఒక నిర్ణయమే కదూ" అన్నది. అని, "అమ్మకి సంజాయిషీ ఇవ్వాల్సొస్తే సవాలక్ష సాకులుండనే ఉంటై. నువ్వేం తక్కువ తిన్నావా యేం ??" అంటూ వెనక్కి నీ దగ్గరగా వచ్చి చేతులు పట్టుకుని ఊపుతూ

"మనమంతా వట్టి పిచ్చిపిల్లలమే! "అని మాటని ఉద్వేగించింది.

అప్పటికే ఇద్దరి కళ్లూ చెమర్చినై !!

# గమ్యం ఏది?

డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి.

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో విశిష్ట బహుమతి పొందిన కథ

**నేనొక అనాధను.** తల్లి మాత్రం తెలుసు. తండ్రి అనుకున్నవాడు ఎప్పుడో కనిపించే వాడు. తల్లి నన్ను ఎంతో ముదిగారంగా ఆడిస్తూ పాడిస్తూ పెంచేది. ఆకాశం నేల హద్దులు లేని నా ఆనంద సామ్రాజ్యంలో హఠాత్తుగా సునామీ వచ్చి తలకిందలు చేసింది. అమ్మా నాన్న ఇద్దరూ నా కళ్ళముందే కారు యాక్సిడెంటులో పచ్చడయిపోయారు. పిచ్చి పట్టినట్టు అమ్మా అమ్మా అంటూ చనిపోయిన దగ్గరే గుండెలు పగిలేటట్లు ఏడుస్తూ కూర్చున్నాను. అందరూ ఆ గోలకు తరిమికొట్టేవాళ్ళే, దయతలచేవారు ఒక్కరూ లేరు. ఏడ్చి ఏడ్చి శోష వచ్చి పడిపోయాను. ఏడుపు ఎవరు కనిపెట్టారో అదే ఈ ప్రాణుల జీవితం, జపం అయిపోయింది.

ఒక రోజు పుట్టెడు దిగులుతో నడిచి పోతున్నాను. ఎక్కడనుంచో వీనులు విందుగా కమ్మని స్వరం వినిపించింది. వర వీణా మృదు పాణీ వనరుహ లోచన .... అట్లాగే నిలిచిపోయాను. సర్వం మరిచి పోయాను. ఏదో సమ్మోహిత శక్తి నన్ను కట్టిపడేసి అడుగు వెయ్యడం మరిచిపోయాను. బహుశా సంగీతం మీద మక్కువ. నేను కడుపులో ఉన్నప్పుడు మా అమ్మ వేదాంతి, మేధావి అయిన ఓ సంగీత విద్వాంసుని ఇంటిదగ్గరే ఉండింది. నీతి కథలు, పురాణాలు విన్నాను. అన్నీ గుర్తు ఉన్నాయి.

“చల్ల గాలిలో యమునా తటిపై శ్యామ సుందరునే మురళీ” ఎంత మధురంగా పాడేవాడో. అలాగే తన్మయత్వంతో లోకాన్ని మరిచి పోయేవాడిని. అభిమన్యుడు, ప్రహ్లాదునిలాగ కడుపులోనే గ్రహించే శక్తి నాకూ ఉందేమో? కాలక్రమేణా ముఖ కవళికలనుబట్టి ఇట్టే మనుషులు ఎలాంటి మానసిక స్థితిలో ఉన్నారో కనిపెట్టగల జ్ఞానాన్ని గ్రహించాను. ఎవరు ఎలాంటి బండబూతులు తిడుతారో, రాళ్ళు రప్పలు తీసుకుంటారో, ఎంత ఎత్తులో రాగం తీస్తారో ఊహించగలిగే శక్తీ

సంపాదించాను. కానీ నా రాత మార్చుకోలేక పోయాను. ఒక్కరూ దయతో చేరతీసి మంచి చెడులు చూసిన పాపాన పోలేదు.

'అది నీ ఖర్మ!'

'ఎప్పుడు చేశాను?'

'పూర్వ జన్మలో! రాత!!'

' ఏవిటో రాత. ఎవరు రాస్తారో మందుతాగి? స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్సన్ని ఆయనే! డిక్టేటర్ అట. మార్చలేవంట. మరి మనం ఎందుకో?'

దొరికితే గొంతుకోరికి చంపాలని ఉంది. జంతువులకు స్పందనలు ఉండవంటారు. ఉండేది వాటికే!!

గ్రహింపు, విచక్షణ క్రూర మృగాలకు,పశుపక్ష్యాధులకు చివరకు చీమకు దోమకు కూడా ఉంటాయి. శ్రీ కృష్ణుడు మురళీరవంతో ఆలమందల్ని, గోపికలను ఎలా మైమరపింప చేసాడు!? పాము, నాగస్వరం ఊదితే నాట్యం చేస్తుంది కదా! దా ..దా అంటే పశు పక్ష్యాదులన్ని దగ్గరకు వస్తాయి.. ప్రతి పక్షి పలుకు ఒక అపూర్వ రాగం. సునిశిత సంగీత మాధుర్యం. అవి పిలుచుకుంటాయి, మన పలుకులు గ్రహిస్తాయి. ఈ మానవజాతి – ప్రేమానురాగాలు, దయ సానుభూతులు, కనీసపు స్పందనలు, డబ్బు వ్యసనంలోపడి పూర్తిగా మరిచిపోయింది . ఆశ ఉన్నాపరవాలేదు, అత్యాశ , దురాశ! లేకుంటే జీవితం మధుర సంగీత సాగరం అనే పరమ సత్యాన్ని మరిచిపోయారు.. కలికాలం మరి. డబ్బు.. డబ్బు. అహంకారం..అహంకారం. ఎందుకో కోవిడ్ శవాలకు ?

ఎంత వేదాంతం తెలిసినా ఆకలిని జయించలేదు. ఎన్ని రోజులు భరించగలను? 'ఎక్కడ ధర్మాత్ములు, అన్నపూర్ణలు' అని ఊరంతా వందసార్లు తిరిగాను. లాభం లేకుండా పోయింది. చివరకు రైల్వే స్టేషన్ మేలేమోననిపించి, వెళ్లాను. అక్కడ నాలాంటి దరిద్రులు చాలా మంది ఉన్నారు. విరక్తి పుట్టింది. 'ఎందుకు కన్నావమ్మా!?' అని బోరు బోరున ఏడ్చాను. ఎందుకు బ్రతకడం? ఎవరికోసం బ్రతకాలి? ఇవే ఆలోచనలు. బాగా కృంగి పోయాను. ఎవరు ఏమన్నా తలొంచుకొని తిరగపడకుండా ఉండిపోవడం, చలిలో, మట్టిలో, ఆకలితో, తల్లిని తలుచుకుని కుమిలి కుమిలి ఏడవడమే జీవితమైపోయింది.

స్టేషన్లో ట్రైన్ రానప్పుడు ఎవ్వరూ ఉండరు. అప్పుడు మాత్రం నిదుర పోయేవాడిని . ట్రైన్ వచ్చే సమయం. ఈ రోజు అయినా కూడు దొరికితే బాగుండును అని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను.

ఒక పెద్దావిడ, ఆమె కొడుకు అనుకుంటా, కూర్చొని ఉన్న బెంచి కింద దూరాను. ప్రశాంతంగా పడుకోవచ్చు. నా తల్లిని ఆ తల్లిలో చూడొచ్చు, ఓదార్పు పొందొచ్చు అని.

"నన్ను దిక్కులేనిదాన్ని చేసి మీ సుఖం చూసుకుంటే, పూట గడవటం కష్టంగా ఉందిరా. తండ్రి లేని బిడ్డవని కొరత లేకుండా.." అది వింటున్న నాకు విపరీతమైన బాధ వేసింది.

కొడుకు చిరాగ్గా విసుక్కున్నాడు. "ఎవరు పెట్టమన్నారు? బి.సిలో ఉన్నావు. ఎవరు సుఖపడుతున్నారు? చాలక అడుక్కుతింటున్నాము. నీ కోడలు బ్యూటీ పార్లర్లకు తప్పక నెలకు పది వేలు. బయట రెస్టారెంటులో తిండి ఐదు వేలు. కారు, పనివాళ్ళు ఒక ఇరవై వేలు. ఎక్కడ చచ్చేది ? పిల్లలకు చదువు, గుడ్డలు..ఎంత అవుతుందనుకున్నావు? ఇప్పుడు చిన్న బిడ్డకు బొమ్మగావాలి ఐదు వేలు."

"నేను చస్తానురా! ఆ ఐదు వేలతో నాకు ఐదు నెలలు కడుపు నిండుతుంది రా!"

"ఛీ! నీచురాలా! మనవరాలు బొమ్మ కొనిమ్మని అడిగితే నీ కడుపుకోసం.. చావు"

చాలా కోపం వచ్చింది నాకు. తల్లిరా! ఆకలిరా.. నా కొడకా. నీ ఇప్పటి ఎదుగుదలకు ఆ మాతృమూర్తి త్యాగం రా! శ్రావణ కుమారుని కథ చదవరా తల్లిదండ్రుల్ని ఎలా చూసుకోవాలో తెలుస్తుంది.

నేటి తరం మరి. కుక్కలే నయం.. పెట్టిన చెయ్యిని కరవ్వు , మరవ్వు . బౌ...బౌవ్.

"నాన్నా! కుక్కరా. కరుస్తుందేమో? పిచ్చిదేమో? నా బిడ్డను కరిస్తే పిచ్చి పడుతుందేమో?"

ఆ వీరుడు తల్లి చాటు దాక్కున్నాడు. ' చెయ్..చెయ్!" లేని శక్తిని తెచ్చుకుని కర్ర తీసుకుని కొడుక్కి అడ్డంగా నిలుచుకుంది. బిడ్డ కోసం దేవుడ్నయినా వదలదు. పుత్రవాత్సల్యం ... పేగు బంధం.!

ఆమె కోపం చూసి నాకూ భయం వేసింది. ఆ తల్లి తప్పుగా నన్ను చితక బాదుతుందని అటుఇటు చూస్తూ పరుగెత్తాను.

చిన్న పెద్ద, ఆడ మగ, బిక్షాధికారి, లక్షాధికారి, చివరకు కళ్ళు తెరవని పసిగుడ్డుల్లో సైతం అందరి చేతుల్లో సెల్ ఫోన్లు. అవే ప్రాణం అదే జీవితం అయినట్లు లోకం గీకం మటుమాయం. సోదరా..సోదరీ. వ్యసనం రా. మెదడు మందగిస్తుంది రా, నరాలు చిట్లుతాయిరా, నోమోఫోభియా అనే తిరుగులేని జబ్బు వస్తుంది రా, వ్యక్తిత్వం నాశనం అవుతుంది రా. కళ్ళముందు హత్య, మాన భంగం, యాక్సిడెంట్ జరిగి, ఎదుటివాడు రక్తపు మడుగులో చావు బ్రతుకుల్లో ఉన్నా, పక్కన బాంబులు పడినా పట్టించుకునేటట్లు లేరు. మరి నా గోడు ఎక్కడ వినిపిస్తుంది? మానసిక చాపల్యం ,అదుపు చేసుకోలేని దుర్బలత్వం. ఈ బానిసత్వంతో, వ్యసనాలతో, మానసిక దుర్బలత్వం పెరిగి, మీకు పుట్టబోయే బిడ్డల జీన్సులో మార్పువచ్చి ప్రహ్లాదుకులకు బదులు దుర్యోదన, కీచకులు, శాడిస్టులు పుడుతారు రా!.

నోరుమూసుకో!! ఐ క్యూ డెవలప్ అయి చడ్డీలిప్పుకుని తిరిగే హీరోలు, అంతా ఇప్పి చూపే, అప్పగించే మరో ఆరబోసే తారా సాధ్వీమణులు మయం అయిపోతుంది. ఆనందాన్ని అనుభవించు అనే ఒకే మంత్రాన్ని, ఈ విశ్వానికి

అందించి, మరణంలేని మరో మరణంలోకి సునాయాసంగా వెళ్ళే జీవన విధాన సమాజాన్ని నెలకొల్పుతారు, మర మనుషుల్ని వంశాంకురాలుగా ఇచ్చి!!

బ్రేకింగ్ వార్తలు, ముడ్డికడిగినా, ముక్కు చీదినా, వాంతి చేసినా వైరల్ వీడియోలు. అందరూ ఫిదా. ఆ బూతుబొమ్మల పురాణం, తారా, తారమణులు పది మందితో అఫైర్స్, కడుపొచ్చింది, తీయించుకుంది, మార్చేసింది, అది చూసి నెటజన్లు, ఓ.సి.డి వ్యాధిగ్రస్తులు కోటి లైకులు, రెండు డిజ్ లైకులు , ఒకరికొకరు వర్గాలు ఆన్ లైను కొట్లాటలు, బూతులు, తిట్లు, వాళ్ళతో పాటు బుడతలు బుడితలు జడ్డీలు రుద్దు కుంటున్న.. జోళ్ళు.. ఛీ... బ్రతుకు చెడ . దిక్కుమాలిన దగుల్బాజీ ఆలోచనలొస్తాయిరా. రేపో మాపో నీ అమ్మను, చెల్లిని, చివరకు బిడ్డల కొలతలు? నిజ స్వరూపం మరిచిపోతావురా? ఈ రాతలు రాసే వారు డబ్బుకోసం.. ఇంత తార్పుడు పనులా? మానసిక వ్యభిచారాన్ని ప్రోత్సహించే ఈ బ్రేకింగు న్యూస్ ఎలా రాస్తారు? ఇలాగేనా రెచ్చగొట్టేది. అడ్డు చెపితే, ఈ ప్రసార మాధ్యమం రాత, రోత, స్వాతంత్ర్యానికి అడ్డు తగిలారని వీధిలో గుడ్డలిప్పేసి కూర్చోవడమేనా?

'ఎవరు చెప్పారు నీకు? ఇదంతా ప్రగతికోసం. చీకటిని తరిమెయ్యడానికి. అబ్బాయి! నువ్వు చాలా తప్పుగా ఆలోచిస్తున్నావు. టెక్నాలజీకి, బూతులు కబ్జాలు తెలియవు. అన్నీ ఒకటే! ఇంకా పామరుడుగా ఉంటే ఎట్లా? ఎదగాలి. అదే నేటి నడక స్వర్గం నరకంకూడా. ఆ క్షణిక సుఖం త్రిల్..జోష్, తపన, అదే జీవితం...సత్యం కూడా. ఎల్లో మీడియా. అక్రమ సంపాదన, కృత్రిమ పాపులారిటీ అన్నావంటే నిన్ను బొక్కలిరగతంతారు. క్రిందో పైనో ఒక చిన్న స్లోగన్, గమనిక. వార్నింగ్——సెక్సు, వయొలెన్స్, న్యూడిటి ,డ్రగ్స్, ఫౌల్లాంగ్వేజ్ అని రాసేస్తే సరిపోతుంది. చూడొచ్చు, చదవొచ్చు, మనం చెయ్యొచ్చు అనే భరోసా! జీవితంలో ఇవన్నీ జరిగేవే, కాక పోతే ..? స్లోగన్ చాలు. పర్మిషన్ ఫుల్!'

'అవునా? ఇవే సహజమా.' కానీ మనసు తిరగబడింది. తెలియ చెప్పకపోతే నేను కుక్క.

'ఏడ్చావు. అమ్మ. అబ్బ,గురువు దైవం వాళ్ళకే దిక్కులేదే నువ్వు ఎంత?'

'సంస్కృతి, సంస్కారం, నైతిక విలువలను గౌరవించకపోతే నాగరికత సర్వనాశనం అయి పోతుంది. డబ్బు ఈ రోజు వస్తుంది రేపు పోతుంది. కానీ...'.

'నువ్వు చాలా అవుట్ డేటెడ్ గా ఆలోచిస్తున్నావు. అవి ఏవీ డబ్బును ఎంత కక్కుర్తితో సంపాదించాలో నేర్పవు. ఇప్పుడు డబ్బు...త్రిల్స్, కిక్ కోసం ఏదైనా చేసేందుకు. తినేందుకు పాయిఖానాలుకూడా తీసే ఉంచుతున్నారు. నువ్వు వెళ్ళు ..నీ పని చూసుకొ..పో! పాపం ! నీ బాధ, దిగులు చూస్తే ఆత్మహత్య చేసుకునేటట్లుంది. ఈ సందేశాలు, సంస్కరణలు నీ వొంటికి మంచిదికాదు. బుద్ధి తెచ్చుకో!.'

'ఇవి సందేశాలు కావు, నగ్న సత్యాలు. చివరకు మిగిలేది ఆక్రోశపు స్మశానాలే!.'

'నీకు తగ్గ మాటలు మాట్లాడరా, ఆకృతులు , ప్రక్రుతులు ఆహుతులు అంటే బూతు అనుకుంటారు. తెలుగు ఎప్పుడో మరిచిపోయారు, బేకు, గీకు, బొక్కలు, గిక్కులు, పొడుపులు, పడకటిల్లు, ఈ బాషే నేటి వాడుక బాష. విమర్శలు ,వ్యాఖ్యానాలు చేయకు, విమర్శించడం సభ్యత, సంస్కారాలు కావు' అని మనసు బెదిరించింది, తలమీద ఒకటిచ్చు కున్నాను. .

అక్కడెవరో ఆడపిల్లలు మగ పిల్లలు పోప్కారాన్ తింటున్నారు. కాస్త పెడతారేమో మెల్లగా దగ్గరకు వెళ్ళా, ప్రకృతికి ప్రతిరూపాలని, సాధ్వీమ తల్లులని !?అదేవిటి ఆడపిల్లలు, పైనా క్రింద చిరిగి పోయిన గుడ్డలేసుకొని తాండవ నృత్యాలు చేస్తున్నారు.ఫారినర్సా...విదేశీయులా ? స్వర్గలోక దిగుమతా ...?

నీ ముఖం .మన తోటల్లోని పూవులే ఇవి. విదేశీయులు ఆ నాగారికతకు అనుగుణంగా మర్యాదగా, పద్దతిగా ఉంటారు. ఇలా ఆరబోసుకుని ఉండరు. వాళ్లకు ఆడతనం మీద, వ్యక్తిత్వం మీద అపార గౌరవముంది. ఇవన్నీ కాపీకాట్స్ . ఇది మన ఎదుగుతున్న దేశ స్వతంత్ర ప్రారబ్దం.

పాపం! ఎంత దయగల తల్లులో ఏదీ దాచిపెట్టుకోలేదు.ప్యూర్ హార్ట్స్ !!

నీ తెలివి! వ్యక్తిత్వదుర్భలత్వం. మగాళ్ళు చూడాలనే తపన, కామ కోరికల్ని పరోక్షంగా తీర్చుకోవడం. పర్వేర్టటెడ్ మానియా అంటే మందులేని ముదురు పిచ్చి ..కక్కుర్తి !!అదేవంటే మా శరీరం మా ఇష్టం అని రెడే లై ట్స్!! అందుకే నోటి దురద.వొళ్ళు గీరుకోవడం.

సమయ సందర్భాలనుబట్టి వస్త్ర దారణే స్త్రీలకూ ఇంపు సొంపు. షోరూంలో వస్తువుల్లా ఉండకూడదు. ఉన్నతిని, ఔనత్యాన్నిచాటేది కట్టు, బొట్టు; నడక, నాణ్యత, పలుకులో, ప్రవర్తనలో దాగి ఉంటాయి. అదే మరిచి పోయారు నేటి నాగరిక యువత.ఇన్ని మానభంగాలు,కిడ్నాప్పలు వీళ్ళు ఇచ్చే అవకాశాలవలన. చట్టం ,న్యాయం, శిక్ష అంటే భయం, గౌరవం లేనందువలన.కొనుక్కోవచ్చు!?

అదేవిటి ముఖాలకు వింత వింత రంగులు పులుముకోనున్నారు. ఏం అవి లేకపోతే అంత దరిద్రంగా ఉంటాయా ముఖాలు? సహజ సౌందర్యమే కదా స్త్రీల ఆత్మోన్నతి. ఇవేంటి ఎబ్బెట్టుగా తాటకిలు, శూర్పణకలు. అసహ్యంగా, వాంతి వచ్చేటట్లు. ప్రకృతి వింత రూపాలు ఎత్తితే, మరీ భరించలేనంత జుగుప్సగా ఉంటుంది. చర్మం కుళ్ళిపోతుంది. ఎందుకో ఆ తెగులు ఈ ఆడకూతుళ్ళకు లేనిది ఉన్నట్లు చూపించుకోవాలని? వ్యక్తిత్వాన్ని అలకరించుకుంటే ఈ విశ్వమే కాళ్ళ ముందు పడదా ? అజ్ఞానం, అహంకారం!! ఆడవాళ్ళకు అదో వింత వ్యాధి. మగవాడి స్వర్గం వాళ్ళ శరీరంలో దాగుందనా ?

మగాళ్ళు తక్కువలేదు మరీ ఆడంగులయిపోతున్నారు.వాళ్ళకంటే వీళ్ళే బ్యూటీ పార్లేస్సుల దగ్గర క్యూకడుతున్నారు. మందేలేని లింగమార్పిడి!! వయసు లేదు వణుకు లేదు అందరూ ఎలిజబుల్స్ !!

దొందూ దొందే అయినప్పుడు ముష్టి యుద్ధాలేందుకు, గంగ జాతరలు ఎందుకు? అది పెండ్లికి ముందు ఇది శోభనం రోజునుంచి. నిండు నూరేళ్ళు కాపురం చేయడానికి కాదా?

నోరుమూసుకో దద్దమ్మా! నిఘంటువును మార్చేసారు అది విముక్తికి పరాకాష్ట, విశృంకలత్వ ఆధారకార్డు. ప్రవర్తన, వ్యక్తిత్వం, అణుకువ_ఓర్పు, సహనం గౌరవాన్ని, శాశ్వీత బంధాలను ఏర్పరుస్తుందని అసలు నమ్మకం లేదు. అతీంద్రియశక్తులకుకూడా లొంగని వ్యామోహం, వ్యసనం,నేటి వ్యక్తిత్వం. ఈ కాలంలో బంధాలు అనుబంధాలు టాటా,చీరియోలే !!ఆ పలుకు , పిలుపు పాదరసాలే!!

వాళ్ళు భాష ఏవిటో, మరీ గ్రీకు లాటిన్... తెలుగు అలా...? ఒక్కముక్క కూడా ..?

దేశ భాషలందు తెలుగు లెస్స !!మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయుల విశ్వాసం ,సుందర తెలుగు పాటకు ఇంపు, మన పొరుగు రాష్ట్ర మహాకవి భారతియార్ గౌరవం, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు, యురోపియన్ చరిత్రకారుని అభినందనలు. పంచదారకన్నా, పనస తొనలకన్నా, కమ్మని తేనెకన్న, తెలుగు మిన్న అన్నారు. మరి ఇప్పుడో ? తల్లినే మరిచిపోయిన ఈ కాలంలో వాత్సల్యంలోని మధురిమలు, మాటల్లోని తియ్యదనాలు, లాలిలోని లాలిత్యాలు మరిచిన తరువాత భాష ఎందుకురా? విరిగిపోయి తరిగిపోయి ఈ ఏడ్పు ఏడుస్తుంది. అందుకే అర్ధంకాదు. బూతులోనే ప్రేమ, మాట్లాడకు !!

నోరు మూసుకున్నాను. భయం భయంగా అడిగాను.

'మరి ఈ సోదరీమణులనేవిటి ... ఫ్రీ ..లిబ్ ...క్రీ అనే ప్రియ పిలుపులు. వైరసా?'

'వైరస్ కాదు. వాళ్ళ బుద్ధులను ,ఆలోచనలను బట్టి పేర్లు. అందులోనూ పొదుపు. పైశాచిక ప్రేమలో, చూపులో మనసులోని స్త్రీ ఎత్తు పల్లాల మీద ఉన్న కక్కుర్తి, లైంగిక వక్రపు తపన ఆ పిలుపులు . ఫ్రీ అంటే ఫ్రీడంకాదు నేను ఫ్రీ ఫార్ ఆల్...దేనికీ అభ్యంతరం లేదు. లిబ్ అంటే అందరికీ అందుబాటులో , క్రీ అంటే పాలనురుగులాంటి శరీరం. మీ సొంతం ..? ఇన్వెన్షన్ ...క్రియేటివిటీ. నేటి యువత మరి! అటుచూడు ఎన్ని రకాల డాన్సులేస్తున్నారో తిమ్మిరేక్కినట్లు షాక్కొట్టినట్లు చలి జ్వరం వచ్చినట్లు.!!

జొల్లుకుక్కల్లా చుట్టూ తిరుగుతున్న మగ పిల్లల్ని చూసి ఒకటే వినరాని బూతులు,నవ్వులు! వాళ్ళూ తక్కువేమీకాదు అసభ్యంగా అంగాలు తడుముకుంటూ, చూపిస్తూ అరుపులూ కేకలు , "వాడు చూడు ఎట్లా చూస్తున్నాడో? సెక్సీగా! అబ్బ. ఎక్కడో ఏదో అయిపోతుంది. బలే త్రిల్ గా ఉందివే! లైఫ్ అంటే ఇంత రొమాంటిక్ గా ఉండాలి. అబ్బ! ఎంత ఎక్జైటేడ్ గా ఉందో! ఫిదా అయిపోతున్నానువే! " అవి ఇవి తడివి తడివి చూసుకుని భయంకరంగా అరుస్తూ, విరగబడి నవ్వుతున్నారు.పబ్లిక్ ఏమయినా ..?

మదిలో కలిగే మెరుపులు, తలపులు దాచి అదిమి ఉంచుకోకూడదు నాయనా హృద్రోగం వస్తుంది. సప్రేషన్తో డిప్రెషన్ వ్యాధి వస్తుంది. ముసలి ముతక చాటుగా ,వీళ్ళు ఓపెన్గా! రజనీష్ సిద్ధాంతం.

అతి ఎప్పుడూ ఎక్జైటెడ్... త్రిల్ గానే ఉంటుంది. అంటుకునేదాక!!గుండు సూదులు, దబ్బనాలు, కర్రులు గడ్డపారలు దిగేదాకా. ఘోరం! పాపం! నిర్భయ, దిశ...ఎన్నెన్నోకోట్లు >>>!? ఎలా మరిచిపోతారు? ఏవిటి ఈ దరిద్రం? మరీ అంత పచ్చి బూతులా ?

“ఛీ..ఛీ ..పాడు. ఏవిటా మాటలు? మరీ దిగజారిపోయి.” ఆ మహాతల్లి ఎవరో అంది.

సుఖీభవ తెలియకనే అనేశాను.చూసాను. తెలుగింటి ఆడపడుచు. సాంప్రదాయ కట్టుబొట్టుతో, ఆకృతిలో ప్రకృతిని నింపుకొని దర్శనమిచ్చింది. చేతులెత్తి దండం పెట్టాను. ప్రశాంతతను అందించే మరుల మల్లెల పందిరి!!

‘అందరూ అప్పలమ్మల్లా ఉండాలంటావా?’

రంభ అయినా రాక్షసి అయినా సోంపు వొంపు; మాట, పలుకు; స్త్రీ ప్రతి కదలికలోను మగాడ్ని మతి పోగొట్టించే సమ్మోహిత శక్తీ దాగుంది. దానికెందుకు ఇటుకరాళ్ళు, దురదగుంటాకు.

“ఏమ్మా ! మేం మాట్లాడితే తప్పు, సినిమాలో చూపిస్తే వేదమా?అడగరా? గుంట, బొక్క, ఇవేనా తల్లి పెళ్ళాం పిలుపులు. ? ఏదో చూపించలేక, బొడ్డు చూపిస్తున్నారు. ఈ కుక్కలు.. అది కూడా ఒకటే అని జొళ్ళు కార్చుకుంటున్నారు. అన్నీ డబుల్ మీనింగులే! అవే కదా చిన్న పిల్లలు ఇంట్లో మాట్లాడుతుంది. పంచ్ డైలాగులు పడకడింటి చేష్టలు!! వాళ్ళు నిజమే చూపిస్తారని పిల్లలం నమ్ముతాం. మాకేం తెలుసు అమాయకులం.ఏ తల్లి ఏది చూపిస్తే అది. ఏ స్టారు ఏం కూస్తే అది. చిలకలం!! దుస్తులిప్పినా, ఏది చూపించినా సహజం! అంతే.. మా యూత్ మార్గదర్శకులు...కులదైవాలు వాళ్ళే! ”

“ ఛీ... బానిసలయిపోయారే! అదెవరో పర్వర్టేడ్ , వ్యక్తిత్వంలేని ఉన్మాదపు పందులు . తల్లి, స్త్రీ అంటే గౌరవం లేని అడ్డంగా పుట్టినోళ్ళు తప్ప, అనుబంధాలను ఆప్యాయతలను వక్రంగా నీఛ దృష్టితో అవమానించరు!! డబ్బుకోసం బూతుతో యువతను తప్పు దోవ పట్టించి రెచ్చగొట్టరు!! బుద్ధి ఉండాలి. అవి అనుసరిస్తే చింపిరి ఇస్తరాకే జీవితం”

“ విముక్తి పొందాము. బ్రాలేని సహజ నటి. బిగుతు ఎదను బజారున పెట్టిన మహానటి. నట సామ్రాట్ రేప్ సీనులో నిజం సెక్స్. అన్ని అందాలను ఆరబెట్టిన చిన్నారి .. . లేటెస్టులో పైన దుస్తులు తీసి బిగుతులు.... సహజనటి..ఫేసుబుక్ నిండా సెక్సు బురద, నెట్టిజెన్లు జోళ్ళు, మందు మాత్రలు కడుపులు కాళ్ళు ...నీళ్ళు...ఇదే బ్రేకింగ్ న్యూస్, అవే చూస్తాం చదువుతాం . అణిచి అణగారిపోయిన మా ఆలోచనా పరిధి పెరగాలనేకదా హీరోయిన్సు దగ్గర చెమటలు కారుస్తున్నారు. నేషనల్ చానల్స్, ఇంటర్నెట్లు చూపించినా పర్వాలేదా ? తప్పు లేదా ?... సమాజం– సహజం

; నిజమే అనుకుని చేస్తున్నాం. అదే నిజం, జీవితం అని మా అమ్మలు, పంతుళ్ళు, పరిపాలించేవాళ్ళు మన్నించేసారు.. నీకెందుకు బాధ”

“మరెందుకు ఏడుపు? మానభంగం , సెక్సువల్ అబ్యూజు అని గోల. ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, టిక్ టాక్ బజారు జీవితం!! తీరిక సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియని అసమర్థుల ప్రేరాపాలు. ఇతర్ల గుడ్డల్లోకి, కొంపల్లోకి చూడటమే శ్వాస, ధ్యాస. తిరుగులేని వ్యసనం. అతి మతి లేనిది. కడుపులొస్తాయివే. మీలాగే మగవాళ్ళు గుడ్డలేసుకుని మేకప్పులేసుకుంటే మీరు మన్నించగలరా?”

“ బావోదు. మూడ్రాదు. కడుపులు అంటే...వస్తాయి. అదీ సహజం... ప్రకృతి! తీయించుకుంటాం ! పెండ్లి చేసుకుంటాం! పాతివ్రత్యం నిలుపుకుంటాం .మొనాటినీ మాకు నచ్చదు. త్రిల్...కిక్ లేని బ్రతుకు వేస్టు. మా ఇష్టం మా శరీరం!! స్కిన్ టు స్కిన్ దేర్ ఈజ్ నో సిన్ మా మతం. మాకు లివింగ్ టు గేదర్ ఇష్టం. చాలా రుచులు...అబ్బ!! అవార్డు సినిమా...కమర్షియల్ అని ఏమీ లేదు పదిమంది మగాళ్ళతో తిరిగే యువతిని ఆదర్శంగా చూపిస్తున్నారు. తాగుడు, ముండలు లేని మగాళ్ళను వెధవలుగా విమర్శిస్తున్నారు. అనుభవించి ఆనందించలేని జీవితం దండుగ ఆత్మహత్య మేలు అని నిరూపిస్తున్నారు. అందుకే అనుభవించి చస్తాము. మగాడు , ఆడదిగా పుట్టి ప్రయోజనం ఏవిటి?క్షణం క్షణికం ఈ జీవితం.ఇదే నేటి నాగరికత,సామాజిక విముక్తి.” అని బూతులు ఇంకా ఎక్కువ చేసారు.

“చావండి. స్త్రీ జన్మకు గౌరవం, సుఖమయ జీవితాన్ని మలినం చేసేది విచ్చలి విడితనం!! సినిమా మీడియా నికృష్టపు భావదుర్భలులతో కలిసి వ్యభిచార సంఘాన్ని నిర్మించి సమాజ సేవకు అంకురార్పణ చెయ్యండి.”

“ఇప్పుడుండేది, నియంత్రిస్తున్నది అదే. మళ్ళీ తిగిరానిదమ్మ వయస్సు. అందుకే జీవితానికి ఒక అర్థం చావుకు ఒక గుర్తింపు తెచ్చుకుంటాం. శిలా ఫలకాలు, ధ్వజస్తంభాలు శాశ్వతంకాదు, అనుభవం ఒక్కటే మనతో వచ్చేది.”

అందరూ ఇంతేనా అనుకోగానే నిరాశా నిస్పృహలతో కృంగిపోయాను. వెంటనే వాళ్ళను మందలించిన తల్లి గుర్తొచ్చింది. ఉంటారు, ఉన్నారు ఎందరో ఆలోచించే సంస్కారులు సాధ్వీమణులు.

అమ్మా అబ్బా తార్పుడు వ్యాపారాలలో అడ్డదిడ్డంగా సంపాదించిన డబ్బు దీనికంతా కారణం. సిగ్గుపడతారనుకున్నా! ఎనుబోతు మీద వానకురిసినట్లే ఉంది. పట్టించుకోనేలేదు.

వీళ్ళా భావిభారత పౌరుల తల్లులు, ఆణిముత్యాలను ప్రసాదించే సాధ్వీమణులు. ప్రకృతి వరాలు!! అదుపులేని అతి ఇచ్చేది క్షణిక ఆనందమే! బాధతో, జుగుప్సతో అటు ఇటు చూసాను.

“లంజ!” ఎగిరి దూకాను.

“ఎవరి దగ్గర పడుకున్నావువే!” ఇరగ్గొడుతున్నాడు స్టేషన్ లో లైట్లు, బెంచీలను. ఒక ఆడకూతుర్ని జుట్టుపట్టుకుని, కిందతోసి కాలితో చేతులతో చావకోడుతున్నాడు. ఒక్కరూ అడగరు !! ఇదేవిటి ఇంత దారుణం?

పాపం తాగేసి ఉన్నాడు!! ఏవిటో ఆ దయ? ప్రభుత్వఖజానా! ఇది భారత దేశం నాయనా!తప్పుడు పనుల క్షమాగుణం, బానిసత్వమై రక్తంలో జీర్ణించుకుపోయి ఉంటుంది. అందుకే కీచకులు,కబ్జాదారులు మానభంగాలను, నడిరోడ్డుమీద హత్యలను, ఆడపిల్లల అమ్మకాలను న్యాయశాస్త్ర పరిధిలోనుంచి తప్పించారు. ఎదుగుదలలు కుంటుపడతాయని.

'మరీ దారుణం న్యాయ వ్యభిచారం.!! మరో దేశంలో అయితే చావగొట్టి చెవులుమూసి స్త్రీలపైన గౌరవ భావం, ఆదర్శంగా మారెంతవరకు తల తిని, తోలు వలిచి, సంఘంలోకి వదులుతారు. చూడు చూడు ఆమె కూడా తగ్గటంలేదుకదా! తప్పులేదు.సమానవ హక్కులు!! లేకపోతే బాధ్యతా రహితులతో ఎలా కాపురం చేస్తారు.? ఇంత బరితేగించి మావత్వాన్ని, సభ్యత, సంస్కారాలను...బజారు ?!

" అవి ఉండేది అక్కడే! బూతులు మాట్లాడకురా!" అనే అరుపులతో ఎక్కడ్నుంచి వచ్చాయో చెప్పులు నా ముఖం మూతి పగలగొట్టాయి. పళ్ళు రాలుతాయని క్షణంలో తప్పించుకుని ,గుండెల్ని పిడికిట పట్టుకుని పరుగు తీసాను.

భూమి బ్రద్దలయ్యేటట్లు వినిపించిన మాటతో గజగజ వణికి పోతూ నేల తడిపేసాను. చుట్టూ చూసాను. బుర్ర మీసాలు,నిప్పులు కురిపిస్తూ తెల్ల శాంతికపోతంలో రాక్షస వీరుడు ఎదురుగా నిలబడి తొడగొట్టుతున్నాడు.ఎందుకో ఈ మధ్య నాచురల్ విల్లన్స్ అందరూ తెల్ల గుడ్డలు వేసుకుంటున్నారు?

"ఆ టీచరగాడిని కుక్కను కొట్టినట్లు కొట్టాను. మూడోఎక్కం రాలేదని తరిమేస్తాడా. చదివేది ఆరో తరగతి. ఎందుకండీ వాళ్ళు ఉండేది? అదీ నా కొడుకుని.!!" రంగేసిన బుర్రమీసాలను ఊదొచ్చేటట్లు తిప్పుతూ గాండ్రిస్తున్నాడు.

వాడెంత? వీడెంత? ఇజ్జత్ ముఖ్యం !! పదిమందిని ముంచి, పాతికమందిని చెరిచి, ముగ్గురుతో కాపురం చేస్తున్న మాజీ టీ బొంకుల బాకీ దారుడు నేటి పాలనాధ్యక్షుడు ,

'అందరూ మన్నిస్తున్నారు వెలి వెయ్యడం లేదు కదా నీకెందుకు దురద!'

'ప్రతిదానికి కొట్టడం చంపడమేనా! క్రమ శిక్షణ లేకపోతే ఇతని కొడుకు ఏమవుతాడో?'

'చంపుతాడు. కబ్జాలతో కోటీశ్వరుడౌతాడు. పరవు ప్రతిష్టలు పెంచుకుంటాడు.అభివృద్ధి దేశాల అధ్యక్షుడు పిల్లనిచ్చి ఆశ్రయం ఇస్తాడు. బొరుగులు తిని చేతులు కడుక్కున్నట్లు. అక్కసు తీరాలి అంతే !'

'ఇంత చిన్నదానికే?'

'చిన్నా పెద్ద అని ఏం లేదు. తండ్రినుంచి పుచ్చుకున్న రక్తంలోని ఆస్తి. పగ ప్రతీకారం.పంతం పట్టుదల... ప్రిస్టేజే. చీరలు ఎగరవేయ్యడం, రక్తం చిందించడం. వీడి పెళ్ళాం చీరలు రేపు. రక్తం రాత్రికి.!'

'మరి దానికెందుకు మారణహోమాలు మానభంగాలు? వీడయినా నిండు నూరేళ్ళు!?'

'ఉండదు. తెలుసు! అయినా రక్తం..రవికలు చూడాలి లేకపోతే అంతవరకు నిద్రపట్టదు.విచక్షణ ,ఓర్పు, క్షమ ఉండవు. ప్రతీకారం తీర్చుకోకపోతే బిపి ,షుగర్, హార్ట్ అటాక్! చంపి చావాలి !!'

అంతా అయోమయంగా ఉంది..నా జీవితగమనం తెలిసిపోయింది గనుక. వీళ్ళతో బ్రతికే బ్రతుకు ఎలా ఉంటుందో తెలుసుకోలేనా? నా తల్లిదండ్రుల చావుతో, దరిద్రాన్ని, అదృష్టంగా తెచ్చుకున్నాను. దానితో నాకు అడుక్కు తినడం వరంగా లభించింది. కానీ అంత దిగజారి బ్రతకలేను. నాకు సంస్కృతి, సంస్కారం, దయ సానుభూతుల మీద నమ్మకం ఇంకా ఉంది. మంచి రోజు రాకపోతుందా ?

పొరపాటు...పొరపాటు. పునరపి జననమే గాని పునరపి మరణంలేని నేటి యుగపు కుసంస్కృతి , సంక్షోభాలు, కుసంస్కార సునామీలు సృష్టిస్తాయేగాని చివరి రోజుల్లో మానసిక సంతృప్తిని ఇవ్వలేవు. ప్రశాంతత మనశ్శాంతి ఏ ఒక్కరికీ దొరకదు. మన దేశం రెండువందలసార్లు విదేశీయ దాడులకు గురి అయ్యింది. మన సంస్కృతి, నైతికవిలువలు చెక్కు చెదరలేదు . కానీ ఇప్పుడు డబ్బు కక్కుర్తి , విశృంఖలత, నామరూపాలు లేకుండా చేస్తున్నాయి.విచక్షణ అనేది మరిచిపోయారు.

వాంతి వచ్చేటట్లుంది పిచ్చి పట్టిపోతందేమోననిపించింది. నిజంగానే పారిపోవాలి!!

ఎక్కడికి?ఈ విశ్వాన్ని కబళించి ఉన్నదంతా ఆ దుర్గంధమే అయినప్పుడు...!

సంస్కృతి సంస్కారాలు లేవా?.........???

'పిచ్చి నీకు. ఎవరు ఎక్కడ చస్తే నీకెందుకు? ఏ కూడుతింటే నీ కెందుకు? తాట వలుస్తారు. అందునా ఈ కాలం యువతులు. పేగుబంధాన్ని తెంచి పారేసి, తాళి బొట్టును తీసేసి, కాలి మెట్టులు చేయించుకోవచ్చని దాచిపెట్టి, మొగుళ్ళను వెరైటీ కోసం మార్చేస్తున్నారు. బాధ్యతలేదు బంధమూ లేదు..పెడాకులు,ముష్టిఘాతాలు మాత్రమే ఉంటాయి. తొలి రోజునే నీ పడక నీది, నా ఒళ్ళు నాది అనే ఆంక్షలతో శోభనం. అదీ మూడ్ ఉండాలి లేదా తెప్పించాలి బ్లూ సినిమాలు వేసి!!

'అయ్యా అమ్మా,గురువు దైవం మీరయినా చెప్పండి. పాపం అజ్ఞానంలో బంగారు భష్యత్తులను సుఖమయ సంసారాలను తగలబెట్టుకుంటున్నారు.'

'ఎవర్రా వినేది? పండ్లు రాలగొడతారు. యాన్టిసోషల్ అని పిచ్చి ఆసుపత్రిలో చేరుస్తారు. తివిరి ఇసుమున తైలంబు దీయ వచ్చు, దవిలి మృగతృష్ణలో నీరు...పో..పో... చెప్పొచ్చావు. మూర్ఖుడా!'

'మీరు కన్నారు, చదివించారు పెంచారు. మరి...?'

'ఎందుకు వినాలి? పుట్టిస్తే...చదివిస్తే...పెంచితే..!వాళ్ళ బానిసలమా?ఫ్రీడం...ఫ్రీడం .మా బ్రతుకు మేం నిర్ణయించుకుకుంటాం. మా జీవితాన్ని గురించి ఒక నిర్దుష్టమైన విజన్ ఉంది. దాని కోసం ఎంత పనయినా చేస్తాము. అడ్డు చెప్పావంటే... చుప్రే ...చెప్పుల్సే పళ్ళు రాలగొడతా!'

మనసు ఆలోచనలతో అలిసిపోయి విశ్రాంతి కోరింది. చూశాను. రెండు బెంచీల మీద అనుభవంతో పండిపోయిన వృద్ద మేధావులు,విజ్ఞానంతో పండిన మహానుభావులు కూర్చొని ఉన్నారు. వాళ్ళు కాపాడుతారని, మంచి మాటలు వినొచ్చని బెంచి క్రింద దూరి ముడుక్కుని దాక్కున్నాను

"ఈ వయసులో మంచి ఆత్మీయ స్నేహం అమరం. మనలో ఐక్యత, సహృద్భావం ఉంది. అహంకారం లేదు. అందరిది ఒకే కులం, స్నేహ కులం. ఈ వయస్సులో దివ్య ఔషధం . విజ్ఞాన గనులం "

"మనల్ని ఎవరు ఉపయోగించుకుంటున్నారండి. ఈ యువత మరీ హీనంగా చూస్తున్నారు. "

"ఏం శాస్త్రులు గారూ ! శాలువా కప్పారు. కొట్టుకొచ్చారా? ఎవరు చేసారేవిటి సన్మానం?"

"సన్మానమా నా బొంద. గంపెడు పడిఉన్నాయి ఇంట్లో. పారెయ్యడానికి ఒప్పదు. కాళ్ళు తుడుచు కోవడానికి కూడా పనికి రావు. ఏదైనా పనికొచ్చేది ఇవ్వకూడదా? దుప్పటో, టవలో, ఇచ్చినా పదికాలాలు పాటు వాడుకొని జ్ఞాపకం చేసుకుని మరీ చస్తాను. పాడు. ఇక సన్మానాల జోలికే పోను."

"వాళ్ళను అవమానిస్తున్నారు. మీకు ఫ్రిడ్జెలు, ఏసీలు ఇవ్వాలా? కులానికో సన్మానం సంఘం!! మీ కులపోళ్ళు డబ్బులిచ్చి చేయించుకుని మరీ పేపర్లో వేయించు కుంటున్నారు. గాడిదలకిస్తే అంతే!"

" గుర్రుగా చూడకు ..చూడు .ఆ పిల్ల అన్నీ కనపడేటట్లు....! ఎంత నీలుక్కుని..అబ్బ నాకే ఏదో ?"

"ఇదేవిటి? యూట్యుబులో విష్ణు సహస్రనామం.. మధ్యలో బూతు కద. కల్చర్ తార్పుడు."

"టేస్టు మారింది. నీతి కదల లింకులో బూతు కథలుండాలి. రక్తికట్టేది అప్పుడే కదా! ఈ వయస్సులో కావాల్సింది తియ్యని వలపు తలపు, రక్తి ; మోక్షమెందుకు. ఉందో లేదో తెలియదు "

" చావు దగ్గరకొచ్చినా, బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు. జాతి గుణం !" ఎవరో చిర చిరలాడారు.

"ఎవర్ని అంటున్నావు . మా కులపోళ్ళను అనే అర్హత లేదు. మూసుకో!" మాట స్థాయి పెరిగింది.

"కాక! ఇక్కడ పొంగి మదించి నోళ్ళు ఎవ్వరూ లేరు. ఎక్కడికి పోయినా చింతపండు కంపే!"

అంతే బెంచీని ఒక్క తన్ను తన్నాడు. కోపంతో వణికి పోతున్నాడు.

చుట్టూ పక్కనోళ్ళు పట్టుకున్నారు." మీరిద్దరూ రోజు అనుకునే మాటలేకదా! దానికెందుకు ఇన్ని నాళ్ళ స్నేహాన్ని... ? ఎన్నో పంచుకున్నారు. ఎంతో ఒదార్చుకున్నారు ? ఇంత చిన్న విషయానికి...?"

“చిన్నదా...చిన్నదా. గనిస్తూనే ఉన్నాను. ఎప్పుడూ ఏదో ఒక జోకు కులాన్ని అవమానించేటట్లు. వాడి కొంపను, కులాన్ని చూస్తే తెలుస్తుంది. నీచులు, ఎదుటివాడు బాగుంటే చూడలేరు.”

“ఏవిటి నువ్వు మాట్లాడేది? నువ్వు అనలేదా నా కులాన్ని. ఆ రోజు నవ్వుకున్నాం కదా!”

“అది వేరు ఇది వేరు. ఈ రోజు గుండెల మీద తన్నావు. మా కులం మీద ఉమ్మేసావు.”

జుట్లు జుట్లు పట్టుకున్నారు బండ బూతులు తిట్టుకుంటున్నారు. రక్త కళ్ళ చూస్తానంటున్నారు.

ఉండలేక, చూడలేక ఒక్క అరుపు అరిచాను. అదిరి పడి, కుక్క..కుక్క. జాతి తక్కువది అంటూ వెనక్కు తగ్గారు, రాళ్ళు తీసుకున్నారు. నిలిచిపోయారు, నేను ఏ జాతికుక్కో తెలియక. మేధావులు, వయో వృద్ధులు, విజ్ఞానఘనులు!! ఛీ వెదవల్లారా! సిగ్గు చేటురా! మీ వయసుకు, అనుభవానికి నీచపు ఆలోచన, తక్కువ బుద్ధులు ఉండకూడదురా! కులమా మీ పుట్టుకకు గుర్తింపు హృదయ వైశాల్యం కాదా?

గుండె పగిలేలా అరుస్తూ, “అమ్మా సరస్వతీదేవి, ఇదేవిటి ఈ అన్యాయం? వాళ్ళ నాలుకలు తెగ్గొయ్యి. సోదరత్వమూ , మానవత్వమూ లేని కడజాతి. కులాన్ని, మతాన్ని అడ్డుపెట్టుకుని మంచిని మరచిన ఈ హీనజాతికి నోరెందుకిచ్చావమ్మా! ఛీ..యాక్కు” అని ఉమ్మి ఊసి, “ద్వేషమూ, ప్రతీకారం,అహంకారం,ఆభిజాత్యము వీళ్ళ గమ్యమా మనిషి పుట్టుకకు అర్థమా!?” అని గుండెలు బాదుకుంటూ, చల్లగాలిని, యమునా తటిని వెతుక్కుంటూ, వరవీణ వినిస్తుదేమో అని సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం ఏడుస్తూ... ఏది గమ్యం. నా గమ్యం ఎక్కడ అని... ???

ఓ యాత్రికుడా ఓహో యాత్రికుడా!

బ్రతుకు ప్రయాణంలో గమ్యమెంత దూరమో తెలుసా? ఓ బాటసారి ...???

ఆ పాట వినిపించిన దిక్కు వెతుక్కుంటూ పరుగులు తీసాను. కన్నీళ్ళతో మసకబారిన కళ్ళను తుడుచుకోవాలనిపించలేదు. కాలికి ఏదో అడ్డు తగిలి కళ్ళు తెరిచాను. రైలు పట్టాలు...సమాంతర రేఖలు? కలుస్తాయా? విసుగు విరక్తి పుట్టితే? రజనీష్ లు ఉంటారేమో వాల్మీకులు కూడా...?

# పవిత్ర

విద్యార్థి

ఆ..., ఆ......, అలాగేనండి. మగపెళ్లివారు మీరే అడుగుతున్నారు, సంతోషం. మీరు మధ్యాహ్నానికి కోర్టుకు వచ్చేయండి, అక్కడ వివరాలు మాట్లాడుకుందాము, నాలుగు "సీత" కేసులు ఉన్నాయి, వాటిని తొందరగానే తీర్చేస్తాను, ఆ తరువాత నా ఛాంబరులో మాట్లాడుకుందాము, ..., ఆ.., ఆ.., అలాగేనండి, ఉంటాను ..", జడ్జమ్మగారు ఫోన్ పెట్టేసి కుర్చీలో తల వెనుకకి వాల్చి, కళ్లు నెమ్మదిగా మూసుకున్నారు. కళ్లల్లో తన గతం కనపడింది.

జరిగినది ఎంత కాలం? ఎటువంటి కాలం? ఎటువంటి కష్టాలు? కుంటుతూ కాలేజీకి తిరిగి వెళ్లితే అవమానాలూ, అవహేళనలూ సహించి లా పరీక్షలు పూర్తి చేసింది. అన్నిటినీ ఎదుర్కొని తన బిడ్డను ఒక విద్యావంతురాలిని చేసిన తృప్తి. చదువు మాములు డిగ్రీనే అయ్యినా, తన అభిలాష మేరకు పద్దతిగా శాస్త్రీయ సంగీతం, నృత్యాలలో మంచి ప్రావీణ్యం పొందింది. ఈ కాలానికి పొందికగా, పద్దతిగా ఉండే అమ్మాయి. తనే తీర్చిదిద్దిన పొందికైన, అందమైన బుట్ట బొమ్మ. తండ్రి తెలియని తన చిన్నారికి అన్నీ తనే అయ్యి పెంచింది. ఈ రోజున మగపెళ్లివారే సంబంధం వెతుక్కుంటూ వస్తున్నారు. బహుశా తన జడ్జీ హోదా చూసేమో?

పాతికేళ్ల క్రితం తను ఆ కిటికీ దూకి ధైర్యం చేయటం వలనే కదా ఈ రోజున ఈ హోదా? తనకు కాలు విరిగింది. వేలు చూపించి అవహేళన చేసినవారే కానీ చెయ్యి అందించి లేపిన వారు లేరు. కుంటి లాయరమ్మ అని పేరు పడింది. తను జడ్జీ అయ్యిన తరువాత కుంటి జడ్జమ్మా అని తన ఎదురుగా అనటానికి ఎవరూ సాహసించరు. ఈ పాతికేళ్లల్లోని అవమానాలు, అఘాయిత్యాలు అన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. పాతికేళ్ల క్రితం తను లా కాలేజీలో చదువుకుంటున్నపుడు తనని ప్రేమించి, గుడిలో పెళ్లి అంటూ హోటల్ రూముకి తీసుకువెళ్లి మోసం చేసి తనను అమ్మివెయ్యబోతే, తను చేసిన ధైర్యం ఆ కిటికీలోనుంచి దూకటమే! అవును, ఆ ధైర్యమే చెయ్యకపోతే, తను కూడా ఒక "సీత" కేసు ముద్దాయిగా నిలబడవలసివచ్చేది. గర్వ పడటం ఎప్పుడూ లేదు, కానీ జీవితంలో లేచి నిలబడి, తల ఎత్తుకుని తిరుగుతున్న సంతృప్తి. తన బిడ్డను తను ఒంటరిగా తీర్చి దిద్దిన సంతృప్తి. ఈ రోజు మగపెళ్లివారే సంబంధం వెతుక్కుంటూ వస్తున్నారు!

"జడ్జమ్మగారు, కారు కడిగి పెట్టానండి, కోర్టుకి బయల్దేరదామాండీ ....." వినయంగా చేతులు కట్టుకుని అడుగుతున్నాడు డ్రైవర్. కళ్లు తెరిచి, డ్రైవరు ఊతం ఇస్తే కుర్చీలోనుంచి లేచి కోర్టుకి బయలుదేరారు జడ్జమ్మగారు.

"అందరూ నిలబడండి, గౌరవనీయులు జడ్జమ్మగారి అధ్యక్షతన రాష్ట్ర మహిళా సెషన్సు కోర్టు సమావేశం అవుతున్నది. భారత ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు అమలు చేయటం జరుగుతుంది. అందరూ నిశబ్ధం పాటించి ఏ అంతరాయం కలిగించకుండా శ్రద్ధగా వినండి" అంటూ గట్టిగా ప్రకటించాడు కోర్టు అమీను.

జడ్జమ్మగారు కుంటుతూ వచ్చి న్యాయాధిపతి స్థానంలో అసీనులయ్యి, ఏవో కోర్టు కాగితాలు చూస్తూ "మొదటి కేసు" అన్నారు. కోర్టు గుమస్తా, కేసు నంబరు చదివితే ముద్దాయిని తీసుకువచ్చి బోనులో నిలబెట్టారు. జడ్జమ్మగారు ఇంకా కాగితాలు చూస్తూనే, పిపిని (పబ్లిక్ ప్రాసిక్యూటరుని} అభియోగం చెప్పమన్నారు.

"యువరానర్, ముద్దాయి వ్యభిచారిణి. భారతీయ చట్టంలోని SITA ACT, Section 2 క్రింద గది అద్దెకు తీసుకున్నందుకు రెండు సంవత్సరముల కఠిన కారాగార శిక్ష, Section 7 క్రింద వాకిటలో నిల్చున్నందుకు బహిరంగ అశ్లీలత ప్రకారము ఒక సంవత్సరము, మొత్తము కలిపి మూడు సంవత్సరాల కారాగార శిక్ష, రెండు వేల రూపాయిల జరిమానా విధించవలసినదిగా కోరుతున్నాము" అన్నాడు పిపి.

"ముద్దాయి తరపు న్యాయవాది వాదన వినిపించండి", తల ఎత్తకుండా ఇంకా కాగితాలు చూసుకుంటూనే అన్నారు జడ్జమ్మగారు. ఎవరూ మాట్లాడలేదు. "యువరానర్, ముద్దాయి డిఫెన్సు న్యాయవాది వద్దని చెప్పింది" అన్నాడు గుమస్తా.

"ముద్దాయి పేరు ఏమిటి?" అడిగారు జడ్జమ్మగారు.

"పవిత్ర" నిశ్చలమైన స్వరంతో పలికింది ఆ అమ్మాయి. జడ్జమ్మగారు కళ్లజోడు సరి చేసుకుని, అప్పుడు తల ఎత్తి చూసారు ముద్దాయిని. ప్రశాంతంగా, సూటిగా చూస్తోంది ముద్దాయి. యువత దాటి నడి వయసులో అడుగుపెడుతున్న అమ్మాయి.

నిశబ్దం ......

"నువ్వు చెప్పదలుచుకున్నది ఏమన్నా ఉన్నదా?" ప్రశ్నించారు జడ్జమ్మగారు.

"చట్టం చాలా పెద్దది. శిక్ష వెయ్యాలనుకుప్పుడు ఎన్నో ఆక్టులు, సెక్షనులూ ఉన్నాయి. పడే శిక్ష ఎలాగూ పడుతుంది, మీకు తోచిన శిక్ష విధించండి"

జడ్జమ్మగారు పరిశీలనగా చూసారు. పోషణ లేక చితికిన శరీరం. చౌక రకం జిలుగు బట్టలుతో కప్పుకున్నా అక్కడక్కడా కనబడుతున్న చేతుల మీద మచ్చలు. అలసిన ముఖం, పదునైన చూపు.

జడ్జమ్మగారు స్వరం పెంచి "ఇది ప్రభుత్వ న్యాయస్థానం. న్యాయ వ్యవస్థ ప్రకారం పాటించవలసిన పద్దతులలో ఈ న్యాయస్థానాన్ని నడిపించటం నా భాద్యత. ప్రాసిక్యూషన్ అభియోగానికి ప్రతివాదన వినిపించటానికి లా చదువుకుని చట్టం తెలిసిన డిఫెన్స్ లాయార్ ఉండటం నీ మంచి కోసమే"

“డిఫెన్స్ లాయర్ వాదించటం సాకు పెట్టుకుని ఇష్టం వచ్చినప్పుడు వచ్చి కోరిక తీర్చమంటే చచ్చిన మనసుని మరొకసారి చంపుకోవటం ఇష్టం లేదు", అన్నది పవిత్ర.

ఇంతలో ఒక పన్నెండు, పదమూడేళ్ల వయసు అమ్మాయి, ఎదుగదలతో చాలీ చాలని పాత యూనీఫార్మ్, చిరిగిన స్కూలుబాగుతో, అందోళనగా, కళ్లలో నీళ్లతో, ఏడుపు ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ, వెక్కుతూ, “అమ్మా” అంటూ కోర్టులోకి ప్రవేశించబోయింది. కోర్టు జవాన్ అడ్డుకుని గట్టిగా "ఇది కోర్టు, బజారుమూక ఎప్పుడు పడితే అప్పుడు రాకూడదు" అంటూ బయటకు తొయ్యబోయాడు. ఆ పిల్ల గట్టిగా ఏడవటం మొదలుపెట్టింది.

"ఈ అమ్మాయి నా కూతురు" అన్నది పవిత్ర. కోర్టు అమీను అడగందే మాట్లాడ వద్దని ముద్దాయిని హెచ్చరించాడు.

జడ్జమ్మగారు "ఆర్డర్ ఆర్డర్" అంటూ చెక్కసుత్తిని బల్ల మీద కొడుతూ, జవానుని వారించి ఆ పిల్లను ముందుకు రమ్మన్నారు. కళ్లజోడు సరిచేసుకుని పరిశీలనగా చూసారు. అందమైన ముఖ కవళికలు, నొక్కుల జుట్టు. ఎక్కడో, ఎక్కడో చూసినట్లనిపించిది. బాగా పరిచయమైన ముఖం లాగా అనిపించింది. ఇంతలోనే, ఔను, తన కూతురు కూడా ఈ వయసులో ఇలాగే ఉండేది కదా అనిపించింది. పోలికలు అలాగే ఉన్నాయి. కానీ, అంతలోనే, తన కూతురుని ఈ అమ్మాయితో పోల్చుకోవటమేమిటి? తను చక్కగా మంచి స్కూలు యూనిఫార్మ్ వేసి, జడలు వేసి, తలలో చిన్న గులాబీ పువ్వు పెట్టి, చక్కగా తయారు చేసి బడికి పంపించేది. ఛ, తన కూతురుకీ ఈ అమ్మాయికీ పొంతన ఏమిటి? కానీ పరిశీలనగా చూస్తే పోలికలవేనేమో అనిపించింది. మాట్లాడకుండా వెనుక వరసలో కూర్చోమని చెప్పితే, కళ్లు తుడుచుకుంటూ, వాళ్ల అమ్మ వంక చూస్తూ వెక్కుతూ దుఃఖాన్ని ఆపుకుంటూ వెళ్లి కూర్చుంది.

జడ్జమ్మగారు కోర్టు వ్యవహారం మళ్లీ నడిపించటం మొదలుపెట్టారు. ముద్దాయి వంక చూస్తూ "సరే, డిఫెన్స్ లాయర్ లేదు, కావున, ప్రాసిక్యూషన్ అభియోగం ప్రకారం SITA ACT, Section 2, 7 మొత్తము కలిపి మూడు సంవత్సరాల కారాగార శిక్ష, రెండు వేల రూపాయిల జరిమానా విధించాలి. నువ్వు చెప్పదలుచుకున్నది ఏమన్నా వున్నదా?"

"నన్ను చెప్పమంటున్నారు. చెప్పి ఉపయోగంలేదని నాకు తెలుసు. చెప్పేటందుకు ఏమీ లేదు. కానీ, మీరే అడిగారు కనుక, నేను అడగదలుచుకున్నది అడుగుతున్నాను. చట్టం నా చేతులలో లేదు. శిక్ష విధించడము మీ ఉద్యోగం. కానీ శిక్ష విధించే చట్టానికి శిక్షింపబడే వారిని కాపాడే భాధ్యత ఉన్నదా లేదా? కారాగార శిక్ష విధించండి, కానీ జైలులో జైలర్ల కోరికలు తీర్చటం శిక్ష మీద లక్ష రెట్లు శిక్ష. ఇప్పుడు ఏ అభియోగం మీద శిక్షిస్తున్నారో అదే పనిని ఉచితంగా జైలర్లకి, చిల్లర రౌడీ రాజకీయ నాయకులకి అందించటంలో చట్టం భాధ్యత ఏమిటి?" అన్నది పవిత్ర.

"ఏ అమ్మాయి? ఏం మాట్లాడుతున్నావు? న్యాయాధిపతిని ప్రశ్నించకూడదు" గట్టిగాడు చెప్పాడు కోర్టు అమీను.

"అడిగిన దానికి చెప్పాను. ఆధిపత్యం ఉన్నప్పుడు శిక్షలు వేయటమే న్యాయవ్యవస్థ అయితే, శిక్ష వెయ్యండి. అదే న్యాయం చెయ్యాలానుకునే భాధ్యత తీసుకోగలరేమో న్యాయస్థానం తనను తాను ప్రశ్నించుకోవచ్చు". నిశ్చలమమైన స్వరంతో చెప్పింది పవిత్ర.

జడ్జమ్మగారు కళ్లజోడు సరిచేసుకుని, ఓర్పుగా ముద్దాయిని చూస్తూ "చూడు అమ్మాయి, చట్టం న్యాయ వ్యవస్థకు పునాది. ఆ చట్టాని అమలు చేయటానికి ఈ న్యాయ వ్యవస్థ ఉన్నది. నువ్వు వినయంగా ఉంటే నిన్ను జైలుకి కాకుండా పునరావాసం కలిపించటానికి సంరక్షణ ఆశ్రయాలకి పంపించే భాద్యత ప్రభుత్వం తీసుకుంటుంది. న్యాయ వ్యవస్థకు శిక్షించే అధికారంతో బాటు సానుభూతి కూడా ఉన్నది. నిర్ధోషులను రక్షించే భాద్యత కూడా ఉన్నది" అంటూ ఉపన్యసించారు.

"మరి నన్ను సంరక్షణ కేంద్రానికి పంపించితే, ఈడు వస్తున్న నా కూతురిని సంరక్షించే భాధ్యత కూడా ప్రభుత్వానికి వుందా? నాకు శిక్ష వేస్తున్నారు సరే, కానీ బిడ్డకు తల్లి సంరక్షణని తొలగించే అధికారం ఏ చట్టానికి ఉన్నది? నన్ను ఏ నేరం క్రింద శిక్షిస్తున్నారో, చదువుకుంటున్న నా చిన్నారికి నా రక్షణ లేకపోతే అవే రాబందులు కబళించరనేమిటి? మళ్లీ తనని ఈ వలయంలో వేసి శిక్షించరనేమిటి? మరి ఇక్కడ ప్రభుత్వ భాధ్యత, న్యాయస్థానాల భాధ్యత ఏమిటి" ప్రశ్న మీద ప్రశ్న సంధించింది పవిత్ర.

"ఏయ్ అమ్మాయి, జడ్జమ్మగారిని ప్రశ్నించకూడదు, చెప్పింది విను" అరిచాడు కోర్టు అమీను.

"ప్రశ్నించితే నిలబడలేనిది న్యాయ వ్యవస్థ ఎలా అవుతుంది?" అదే నిశ్చలమైన స్వరంతో ఇంకొక ప్రశ్న.

జడ్జమ్మగారు సహనం కోల్పోతున్నారు, విసుగుగా, గట్టిగా "చట్టం, లా తెలిసిన వాళ్లు ఈ న్యాయస్థానంలో గౌరవంగా వాదించాలి. నీకేం చట్టం తెలుసునని ఇంత వాదించుతున్నావు, ఇంకెక్కువ మాట్లాడితే కోర్టు ధిక్కార నేరం క్రింద శిక్ష పెరుగుతుంది, జాగ్రత్త", అధికారత కూడిన స్పష్టమైన స్వరంతో హెచ్చరించారు.

"మీకు తోచిన శిక్ష వెయ్యమని మొదటిలోనే అన్నాను. మీరే అడిగారు కనుక నేను చెప్పాను. చట్టం తెలిసిన వాళ్లు వాదించాలని అన్నారు. మరి నన్ను ఏ చట్టం క్రింద శిక్షిస్తున్నారు? 1834లో లార్డ్ మెకాలే మొదలు పెట్టి, 1860లో

బ్రిటిష్ వారు అమలు పరిచిన Indian Penal Code క్రిందా? 1956లో స్వతంత్ర భారత ప్రభుత్వం జారీ చేసిన Suppression of Immoral Traffic అంటే SITA Act క్రింద అని పిపి చెప్పారు? మరి అదే ప్రభుత్వం 1986లో Immoral Traffic Prevention Act, ITPA Ammendment దిద్దుబాటు అంటూ జారి చేసింది. SITA Act క్రింద అభియోగం చెప్పిన పిపి కి ఆ తరువాత వచ్చిన గురించి ITPA తెలువదా? ఈ ఆక్టులు అన్నీ జారీ చేసిన ప్రభుత్వాలు వ్యభిచారిణులు సంరక్షణకే అని చెప్పారు. ఏ ఆక్టులోనూ వ్యభిచారిణులకు శిక్ష వెయ్యాలని లేదు. వారిని దిగజార్చిన వారికే శిక్ష అని వున్నది. మరి ఆ దిగజార్చిన వారు ఈ న్యాయస్థానంలో ముద్దాయిలగా లేరే? కోరిక కోసం డబ్బులు విదిలించి పరాభవించే, హింసించే వారు ముద్దాయిలిగా ఏ న్యాయస్థానంలోనూ కనబడరే? "

కోర్టులో కలకలం మొదలయ్యింది. కోర్టు అమీనుకి సహనం నశించి ముద్దాయి మీద అరవటం మొదలుపెట్టాడు. ఆ ప్రక్కనే నిలబడిన సబ్ఇనస్పెక్టర్ ముద్దాయి నిల్చున్న బోన్ దగ్గరకి దూకుతూ కొట్టటానికి సిద్దమయ్యాడు. జడ్జమ్మగారు చెక్కసుత్తిని కొడుతూ, ఆర్డర్, ఆర్డర్ అని అరుస్తూనే అమీనుని, సబ్ ఇన్స్పెక్టర్ని ఆగమని వారించారు.

"చూడమ్మాయి, అతి తెలివితో ఎక్కువ మాట్లాడితే కోర్టు ధిక్కార నేరంతో శిక్ష పొడిగించ వలసివస్తుంది. ఆక్టులు గురించి మాట్లాడుతున్నావు, ఏవో నాలుగు ఆక్టుల పేర్లు తెలుసుకుని మాట్లాడాటం కాదు. నీకు చట్టం గురించి ఏమి తెలుసని మాట్లాడుతున్నావు?" ప్రశ్నించారు జడ్జమ్మగారు.

"నాకు చట్టం గురించి తెలియదని మీరు ఎందుకు అనుకుంటున్నారు? తెలిసే మాట్లాడుతున్నాను. ఏ ఆక్టులోనూ వ్యభిచారిణులకి శిక్ష లేదు. ఆ పైన ఐక్య రాజ్య సమితి 1950లో తీర్మానించిన "Convention for the Suppression of the Traffic in Persons and of the Exploitation of the Prostitution of Others" లో కూడా మీరు వ్యభిచారిణులు అని పిలుస్తున్నవారు ఆభాగినులు అని, శిక్షార్హులు కాదని వున్నది. మరి భారత ప్రభుత్వము కూడా ఆ ఐక్య రాజ్య సమితి తీర్మానానికి సంతకం చేసింది కదా? మీరు నాకు శిక్ష వేస్తే, ఐక్య రాజ్య సమితి చేసిన తీర్మానానికి ఉల్లంఘన కాదా?" నిశ్చలమైన స్వరంతోనే అడిగింది పవిత్ర.

“"ఈ బజారు మూకకు ఇవి మాత్రం బాగా తెలుస్తాయి. ఎక్కడినుంచీ ఎక్కడకు మాట్లాడుతుందో, ఐక్య రాజ్య సమితి దాకా పోయింది. యువరానారు, మీరు వేసే శిక్ష తొందరగా వేసెయ్యండి, ఆ తర్వాత సంగతి నేను చూస్కుంటా" అంటూ ఏవగింపుగా మాట్లాడటం మొదలు పెట్టాడు ఎస్సై.

జడ్జమ్మగారు చెక్కసుత్తి కొడుతూ, ఆర్డర్, ఆర్డర్ అంటూ ఎస్సైని వారించారు. "చూడమ్మాయి, చట్టం తెలుసని అంటున్నావు. నీకు ఎలా తెలుసు? ఇంతకు ముందు ఈ కేసులలో ఇరుక్కుని కోర్టు భాష ఏవో నాలుగు ముక్కలు తెలిస్తే కాదు. లా చదువుకోవాలి" అన్నారు.

"నేను లా కాలేజీకి వెళ్లలేదని మీరెందుకు అనుకుంటున్నారు?" మళ్లీ ప్రశ్న.

జడ్జమ్మగారు పరిశీలనగా చూస్తున్నారు.

ఇంతలో పిపి, "అభియోగం వ్యభిచారం చేస్తున్నందుకు కాదు, గది అద్దెకు తీసుకున్నందుకు, వాకిటలో నిలబడటం కారణంగా అసభ్యత, అశ్లీలత క్రింద. ఇవి చట్ట పరంగా శిక్షార్హతలే" అన్నాడు.

"చట్టం చాలా పెద్దది, శిక్షించాలనుకున్నప్పుడు ఎన్నో ఆక్టులూ, సెక్షనలూ ఉంటాయని ముందే చెప్పాను. నాకు ఇష్టమయ్యి నేను నిలబడ్డానని ఏ రకంగా ఋజువు చెయ్యగలరు? ఈ ఊబిలోకి దింపినవాళ్లు గదికి ఇంత అని చెసేది వసూళ్లే కానీ, అద్దెకు తీసుకోవటమెలా అవుతుంది? వాకిటలో నిలబడక పోతే జరిగే హింసలకు నేనెలా బాధ్యురాలిని? నిలబడితే మీరు విధించే శిక్షకు నేనెలా బాధ్యురాలిని? అక్కడ జరిగే హింసలూ అవమానాలూ కులాసా గదులలో కూర్చుని చట్టం రాసేవారికి ఎలా అర్థమౌతుంది?”, ప్రశ్న మీద ప్రశ్న సంధిస్తూనే తను చేతులు చుట్టూ కప్పుకున్న పైటను భుజాల పైకి లాగుకున్నది పవిత్ర. సన్నని చేతులమీద కాల్చిన గాయాలూ, గాట్లూ ప్రస్ఫుటమయ్యాయి.

పిపికి విసుగొచ్చింది. ఈ కేసులు తేలిపోతే తొందరగా వెళ్లి రియల్ ఎస్టేటు పనులు చూసుకోవాలనుకున్నాడు. "ఇదిగో పిల్లా, కులాసా గదుల్లో కూర్చుని చట్టం రాసారంటున్నావు. Indian Penal Code అంటే భారతీయ శిక్షా స్మృతి, బ్రిటిష్ వాళ్లు ఆలోచించే రాసారు, అందుకే ఇప్పటి దాకా నిలబడింది. ఆ కాలంలో విక్టోరియా రాణి ఉన్నప్పుడు విక్టోరియన్ పద్ధతులు వుండేవి. వాటి ప్రకారం, వ్యభిచారం అంటే దిగజారుడుతనం. అది

అరికట్టటానికే ఈ చట్టం. ఏదో పేద్ద తెలిసినట్టు వాగుతున్నావు. పోనీ నువ్వే రాయకూడదూ కొత్త చట్టం?" అవహేళనగా ప్రశ్నించాడు.

"బ్రిటిష్ వాళ్లు విక్టోరియన్ పద్ధతులున పాటించిన వాళ్లయితే, Cantonment Act, 1864 ఎందుకు తీసుకువచ్చారు? ఆ ఆక్టు క్రింద వెయ్యిమంది ఎర్ర కోటు తెల్ల సైనికులకి పదిహేను మంది అమ్మాయిలని కేటాయించి, కంటోన్మెంటులలో బంధించి ఎందుకు చెరచి చిత్రహింసలు పెట్టారు? ముంబాయి కామాటిపుర ఈ రకంగా బ్రిటిష్ వాళ్ల అకృత్యాలకు ఏర్పరిచింది కాదా? Circular Memorandom, 21A అంటూ జారి చేసి, వయసు వస్తున్న పది పదుకొండేళ్ల అమాయుకురాళ్లను అపహరించి బ్రిటిష్ సైనికుల పైశాచికత్వం కోసం చక్లాలు కంటోన్మెంటులలోనే ఏర్పరచలేదా? మరి ఇది విక్టోరియన్ నీతి, ఆచారమా లేక విక్టోరియన్ దగా, కపటమా? మరి ఇవి కూడా అప్పటి చట్టంలో భాగాలే, మరి ఇది అవినీతి చట్టం కాదా?" వరుస బాణాలు వేసింది పవిత్ర. పిపి నీళ్లు నములుతూ గుడ్లప్పగించి చూస్తూ ఊరుకున్నాడు.

జడ్జమ్మగారు కళ్లజోడు తీసి ముద్దాయిని పరిశీలనగా చూస్తూ, "IPC తెలిసినదానివని అర్థమవ్వుతున్నది, ఉన్న విషయాలు చెప్పావు. కానీ, మనది భారతీయ సంప్రదాయం, సాంప్రదాయిక సమాజానికి కొన్ని నియమాలు ఉంటాయి, ఈ పడుపు వృత్తిని సమాజం అంగీకరించదు" అన్నారు.





సాంప్రదాయిక భారతీయ సమాజం భరతుడి నుండి వచ్చింది కదా. మరి భరతుడు శకుంతల బిడ్డ, శకుంతల మేనక కుమార్తె కాదా? మేనక అప్సరస అని సంప్రదాయం గౌరవంగా పలుకుతున్నది. ఆమెను దేవతల రాజు ఇంద్రుడు ఇదే వృత్తిలో నియమించాడు కాదా? మరి తన పదవిని నిలుపుకోవటం కోసం విశ్వామిత్రునికి తపోభంగం చేయటానికి పడుపు వృత్తికి పంపలేదా? బిడ్డ పుట్టిన వెంటనే పసిబిడ్డకు ఏ ఆధారమూ లేకుండా దేవలోకానికి అదే పడుపు వృత్తి కోసం తిరిగి రప్పించినప్పుడు ఆ తల్లి మనసు ఎలా అల్లాడిందో ఎవరైనా ఆలోచించారా? కోరిక తీరిన తరువాత విశ్వామిత్రుడు పసిబిడ్డను చూడటానికి కూడా మోహం చాటేస్తే ఋషి ఎలా అయ్యాడు? అదేనా తపోజ్ఞానం? ఏ మాత్రం కనికరం లేకుండా బాలింతరాలిని బిడ్డనుండి వేరు చేసినవాడు దేవేంద్రుడు ఎలా అయ్యాడు?" నిశ్చలంగానే నిలబడి తూటాలు పేల్చింది పవిత్ర. కోర్టులో కలకలం మొదలయ్యింది. ఎవరో గడ్డం మీసం నామాల పెద్దాయన కోర్టు వెనుక వరుసలో నుండి లేచి ముందుకు అయాసంగా తోసుకువస్తూ అరవబోయాడు.

జడ్జమ్మగారు చెక్కసుత్తిని బల్లపై గట్టిగా కొడుతూ, ఆర్డర్, ఆర్డర్ అని అరుస్తూ, కొంత హెచ్చిన స్వరంతో "చూడమ్మాయి, ఇంద్రుడు అంటే దేవతల రాజు అనే అనుకోనవసరములేదు. యోగ సాధన చేసేటప్పుడు, సాధకుడు తన ఇంద్రియాలని నియంత్రించదలుచుకుంటాడు. జ్ఞానేంద్రియములు ఐదు, కర్మేంద్రియములు ఐదు. ఇవి కోరికలకు కారణం. వాటిని నియంత్రిచే శక్తి మనసుకు ఉంది, అందుకే మనసు మనలో ఉన్న ఇంద్రుడు, ఇంద్రియాలకు రాజు. "మ + ఇ + న + క". సంస్కృతంలో ఒకొక్క అక్షరానికి అర్థం "మ" అంటే నా, "క" అంటే ఎవరు, "ఇ" అంటే గొప్ప, "న" అంటే లేరు. అంటే, మ, ఇ, న, క అక్షరాలు కలిస్తే మేనక అవుతుంది. "నా కంటే ఎవరూ గొప్పవారు లేరు" అని అర్థం. విశ్వామిత్రుడు



శకుంతలా జననం, రవి వర్మ

అంటే విశ్వమును మితముగా రమించేవాడు. అటువంటివాడు ఎంతో తపస్సు చేసిన తరువాత తపస్సులో నా కంటే ఎవరూ గొప్పవారు లేరు అనే భావన, ఇంద్రియాలను నియంత్రించే మనసుకు కలగటమే ఇంద్రుడు పంపిన మేనక. మనసుకు అనేకమైన కోరికలను రేపెట్టే ఏ విషయమైనా మేనక. విశ్వామిత్రుడు చేసే సాధన ఈ ఇంద్రియ నియంత్రణే. ఈ విషయమే కథగా మన పెద్దవాళ్లు చెప్పారు. ఏ విషయాన్నైనా అర్థము చేసుకునే పద్ధతిలో అర్థం చేసుకోవాలి. మిడి మిడి జ్ఞానంతో ఇష్టమొచ్చినట్లు వాగకూడదు" అన్నారు.

"ఈ సమాజంలోమీరు చెప్పిన పద్ధతిలో అర్థం చేసుకునేవారెవరు వున్నారు? ఈ విషయం ఇప్పుడు తెలుసుకుని ఇంద్రియాలని నియత్రించుకోవాలనుకునేవారు ఎంతమంది? విషయం తెలుసుకునేవారు ఇంద్రియాలను నియత్రించుకుంటే అప్సరసల ఎందుకు వుంటారు? శిక్షలు నేటి అప్సరసలకు ఎందుకు?" ఎదురు ప్రశ్నలు సంధించింది పవిత్ర.



"ఈ అంఖుముంధలకీ అప్సరసలకి పోలికేమిటీ? దైవసాన్నిధ్యంలో శాస్త్రీయ నృత్యగానాలతో జరిగే సేవ అప్సరసలదీ!" దీర్ఘం తీస్తూ బిగ్గరగా వాపోయాడు కోర్టు వెనక బెంచీలోని నామంగెడ్డంమ్మీసాల పెద్దాయన.

జడ్జమ్మగారు "ఆర్డర్ ఆర్డర్" అంటూ చెక్కసుత్తిని బల్లమీద కొడుతునే విసుగ్గా ఏదో చెప్పబోయారు. ఇంతలో పవిత్ర అదే నిశ్చలమైన స్వరంతో కొనసాగించిది. "ఆ దైవసేవకే కాదా భూలోకంలో సాంప్రదాయులు దేవదాసీ వ్యవస్థను సృష్టించి, పెంచి పెద్ద చేసింది? ఆ దేవదాసీలే కాదా శాస్త్రీయ నృత్యగానాలు, కళలని అభ్యసించి, ప్రదర్శించి, వృద్ధి చేసి కాపాడింది? ఆ దేవదాసీ ప్రతిమలే కదా ఏ గుడికి వెళ్లినా ముందుగా భక్తులనందరినీ పలకరించేది? ఆ నాటి తంజావూరు రాజ్యంలో దేవదాసీలు దేవాలయాల చదురులో చేసిన "సదిర్" నాట్యం లేక "దాసీ ఆట్టం" నేటి శాస్త్రీయ భరతనాట్యం కాదా? నృత్యంతోపాటు

శాస్త్రీయ సంగీతాన్ని అందించినవారూ దేవదాసీలు కాదా? శాస్త్రీయులెవరూ త్యాగరాజస్వామికి ఆలయం కట్టించలేదే? అసలు దైవం పేరు చెప్పుకుని భూలోకంలో అప్సరసలని దేవదాసీ వ్యవస్థను సృష్ఠించి, వ్యవస్తీకరంచి ఆ దేవదాసీ వ్యవస్థను తమ కోరికల కోసం పెంచి పెద్ద చేసింది శిష్టాచారులమని చెప్పుకునేవారు కారా? మరి ఆ రోజులలో దేవదాసీలకు శిక్షలు వేసిన దాఖలాలేవీ లేవే? మరి ఈ శిష్టాచారులే బ్రిటిష్ వాళ్లు చేసిన ఆక్టులను సమర్ధించి దేవదాసీలను రంకుముండలని ఆక్షేపించి, సంప్రదాయమంటూ నేరాలు మోపి ఖైదులో వెయ్యటం న్యాయమా?"

జడ్జమ్మగారు కొంత కోపంతో "మనది సెక్యూలర్ సమాజం, అన్ని మతాచారలను పరిగణలోకి తీసుకోవాలి. నీ వృత్తి ఆ మతాలకి వ్యతిరేకం. సమానత పాటించటానికి చట్టం జోక్యం చేసుకోక తప్పదు" అన్నారు.

"ఏ మతమైన తన అవసారాలకు అనుగుణంగా దేవదాసీ వ్యస్థని ఏర్పరిచింది. 14వ శతాబ్దపు ఫ్రెంచ్ దేశంలోని "Avignon" నగరంలో వేశ్యా గృహాన్ని ఏర్పరిచి, వందలలో యువతులను బంధించి, మతాధిపతి అక్కడే తిష్ట వేసి మతపాలన అక్కడినుండే జరపలేదా? 15వ శతాబ్దపు ఇంగ్లాండ్ లోని Southwark నగరంలో, Stews అనే వేశ్యా గృహాలని ఏర్పరిచి వాటి మీద వచ్చిన ఆదాయంతో మతాన్ని పెంచలేదా? మతం ముసుగులో జరిగిన ఇటువంటి అకృత్యాలు



Les Demoiselles d'Avignon, Picasso. Cubism ఈ చిత్రంతోనే ప్రారంభమయ్యింది.

14వ శ. Avignon నగరంలో మతాధికారి నడిపిన వేశ్యాగృహంలోని లేక బంధిఖానాలోని బాధితురాళ అభావ చితం

కౌముది
www.koumudi.net

ఎన్నో ఉన్నాయి. అలా బలైన బాధితురాళ్లకి కన్నీళ్లు కార్చేవారెవరు ఉన్నారు మతంలో? ఆ అకృత్యాలను మరుగుపరిచి ఈ రోజు బాధితురాళ్లని శిక్షించాలి అనటం వంచన, కపటం కాదా? "

జడ్జమ్మగారు కోపంగా "ఎక్కడో ఏవో కొన్ని జరిగాయని, వాటిని భూతద్దంలో చూపించి నువ్వు చేసే పనిని సమర్ధించుకుంటున్నావు" అన్నారు.

"చట్టం, మతం అనే వ్యవస్థలు తమ అవసరాలకి ఎలా వాడుకున్నారో, అనవసరం అనుకున్నపుడు నేరాలు మోపి బాధితులనే మళ్లీ అదే చట్టం, మతాల ముసుగులో ఎలా శిక్షకు గురి చేస్తున్నారో చెపుతున్నాను. మొఘలులు ఫార్సీ యువతులను దిగుమతి చేసుకుని తవాయిఫ్ అనే వ్యవస్థను సృష్టించి పోషించలేదా? ఆ తరువాతి కాలంలో ఎందరు "ఉమ్రావ్ జాన్"లు అపహరించబడి, బంధించిబడి, హింసలు అనుభవించి బలి కాలేదా? ఇంకా .."

"ఆపు", సహనం కోల్పోయి గట్టిగా అరిచారు జడ్జమ్మగారు. "ఇలా మతాల గురించి వాగితే ఈ కోర్టుకే ప్రమాదం. కాదు, కాదు, అసలు దేశంలోనే అల్లకల్లోలాలు సృష్టించే లాగా ఉన్నావు".

న్యాయస్థానంలో నిశబ్దం ఆవరించుకుంది. జడ్జమ్మగారు కళ్లజోడు సరిచేసుకుని ముద్దాయి వంక తీక్షణంగా చూస్తూ, ఈ అమ్మాయికి పిపి అడిగినట్టు మూడు సంవత్సరాల శిక్ష



పర్షియా నుంచి దిగుమతి చేసుకున్న యువతుల నృత్యం ఆనందిస్తున్న అక్బరు బాదుషా. అక్బర్‌నామ, 1590 పుస్తకం నుండి. లేఖరి తారాలాల్, చిత్రకారుడు బన్వాలి ఖుర్ద్

వెయ్యాలా, లేక అతివాగుడుకి శిక్ష పెంచాలా అని ఆలోచించసాగారు.

ఇంతలో కోర్టు బంట్రోతు జడ్జమ్మగారికి దగ్గరగా వచ్చి, "ఎవరో ఒకాయన మీ ఛాంబర్ దగ్గర చాలా సేపటినించి కూర్చున్నాడమ్మ, ఏదో పెళ్లి సంబంధం కోసం వచ్చారంట, ఉండమంటార వెళ్లమంటార అని అడుగుతున్నాడు" అన్నాడు. అప్పుడు గుర్తుకు వచ్చింది జడ్జమ్మగారికి తన కూతురికి పెళ్లి సంబంధం కోసం ఆయన ఫోన్ చేస్తే తన కోర్టు ఛాంబర్ దగ్గర మాట్లాడుకుందామని చెప్పిందని. బోన్‌లో నిలబడ్డ అమ్మాయి ఈ ఒక్క కేసు కూడా తెమలనివ్వటంలేదు. అలాగని తొందరగా తెమిల్చేసి తన నిజాయితీకి, బాధ్యతకీ లోపం చెయ్యకూడదు. ఇంకా మూడు కేసులున్నాయి. "సరే, వచ్చి కోర్టులో వెనక బెంచి మీద వచ్చి కూర్చోమని సర్ది చెప్పు" అన్నారు.

జడ్జమ్మగారు ముద్దాయి వంక తిరిగి "సరే, ఇన్ని చెపుతున్నావు, ఏ మాత్రం చదువుకున్నావు? నీకు ఈ పని చెయ్యటానికేం ఖర్మ?" అంటూ ప్రశ్నించారు.

"లా కాలేజి మూడవ సంవత్సరం దాకా చదువుకున్నాను. కాదు, పేదరికంలో పస్తులుండి నన్ను మా అమ్మానాన్న చదివించారు. లోకం తీరు ఇంకా తెలియని వయసులో ప్రేమ ఎర వేసినవాడు, పట్టణంలో పెద్ద లాయర్ దగ్గర జూనియర్‌గా చేర్పించుతాను అంటూ తీసుకువెళ్లి, కిటికీలు లేని గదిలో ఉంచి, చెరచి, బంధించి అమ్మేసాడు. అక్కడ వెనక కూర్చుని వెక్కి ఏడుస్తున్నది నా కూతురు, వాడి అంశ. ఏ స్త్రీ కూడా తనకు తాను ఈ వృత్తి ఎంచుకోదు. ఈ వృత్తిలో ఉన్న ప్రతి బాధితురాలి వెనక ఎంతటి బాధాకరమైన కథలు ఉన్నాయో కోర్టులు, ప్రభుత్వాలు, సమాజాలు, మతాలు ఎందుకు గుర్తించవు? ఆ బాధలు పెట్టి ఈ వృత్తిలోకి లాగిన వారిని కోర్టులకి ఈడ్చి శిక్షించిన దాఖలాలు ఎక్కడ? వాకిటలో నిలబడి, అమ్ముకుని రోజువారీ కోటా పూర్తి చేయ్యకపోతే కొట్టి, ఆకలికి మాడ్చే ఠాణేదార్లుని శిక్షించిన దాఖలాలేవి? వచ్చి కోరిక తీర్చుకుంటూ హింసించే కీచకులు ఏరి ఈ కోర్టులలో?

జడ్జమ్మగారికి ఉన్నట్టుండి తల వేడెక్కి, వికారం కలిగింది. చేతిలోనుంచి చెక్కసుత్తి మేజాబల్ల మీద పడి, బల్ల మీద నుండి ముందుకు జారి కిందకి గచ్చు మీద గట్టిగా మోత చేసుకుంటూ పడింది. కళ్లు మూసుకుని కుర్చీ మీద వెనకకు వాలారు. స్వగతంలో "ఏమిటిది? ఈ ముద్దాయి చెప్పేది తన జీవితానికి రెండో పాయ! తను లా చదువుకునేటప్పుడు తనని మోసం చేసినవాడి వలన పుట్టిన కూతురికి ఇప్పుడు తను పెళ్లి చేయాలనుకుంటున్నది. ఆ రోజు దూక గలిగిన కిటికీ ఉండటంవలన తను కుంటిదయినా సమాజంలో నిలబడగలిగి తన కూతురిని ఎంతో పద్ధతిగా

పెంచానని గర్వపడుతోంది. మరి ఈ ముద్దాయి కిటికీలేని గదిలో బంధింపబడి కుంటి జీవితంలోని నరకాన్ని అనుభవించుతోంది.

నిశబ్దాన్ని చెదురుస్తూ పిపి ముద్దాయిని అవహేళనగా "ఇంత వాగావుగా, సరే, శిక్ష ఎంత వెయ్యాలో, ఎవరికి వెయ్యాలో అది కూడా నువ్వే చెప్పు. అసలు ఈ లంజలని మాట్లాడనివ్వటమే తప్పు", అంటూ తన చేతిలోని కాగితాల దొంతరని ముద్దాయి ముఖానికి విసిరివేయబోయి తమాయించుకుని తన బల పైకి గట్టిగా విసిరికొట్టాడు.

"నన్ను లంజ అన్నారు, గౌరవంగానే సంబోధించారని అనుకుంటున్నాను. "ల" అంటే పృథ్వీ బీజం, "లం" అంటే విశ్వాన్ని భరించేది, ప్రకాశమాన మైనదీ అయిన బీజాక్షరం అని అర్థం. "జ" అంటే అందునుండీ పుట్టినది. ఈ అర్థంతో మీ మతానికి అనుగుణంగా మీరు ఏ దేవతని అన్వయించుకుంటూ రోజూ పూజిస్తారో మీకే తెలవాలి.

ముందు చట్టం, మతాల పేరుతో తర తరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని, బలి అయ్యిన అమాయకురాళ్లని గుర్తించి, కొన్ని కన్నీళయినా కార్చండి. ఇంక న్యాయమే చెయ్యాలనుకుంటే బాధితులని శిక్షించకుండా చెయ్యందించి లేపి నిలబెట్టండి. శిక్ష బాధితులకు కాదు, వారిని అలా బంధించి, భంగ పరచి, బాధించినవారికి పడేటట్లు చెయ్యండి. ఈ బంధికాఖానాలని నడిపే ఠాణేదార్లని, రోజూ వచ్చి హింసించే కీచకులను భారతీయ శిక్షాస్మృతి, IPC 375, సెక్షన్ 53 క్రింద జీవిత ఖైదు విదించి, వారి ఆస్తులని స్వాధీనం చేసుకుని బాధితురాళ్లకి పంచి పెట్టండి. బాధితురాళ్ల పిల్లలకు DNA పరీక్షలు చేయించి వారి తండ్రులను గుర్తించి IPC 375 అమలు పరచండి. ఇలా ఎందుకు చెయ్యకూడదు?" అదే నిశ్చల స్వరంతో న్యాయస్థానం పునాదులను మీద దాడి చేసింది పవిత్ర.

జడ్జమ్మగారు కొంత నిస్సత్తువగా, ఆందోళనతో, నిస్సహాయంగా తన కుర్చీ వెనుకకు కూలి ప్రేక్షక పాత్ర వహించారు. ఇంతలో ఒక పెద్ద మనిషి తెల్లని పాంటూ చొక్కాతో, నుదట పేద్ద కుంకుమ బొట్టుతో, మెడలో పలుపు తాడు మందంలోని బంగారపు గొలుసుతో, ఒక చేతికి కాశీ దారాల దొంతర, మరో చేతికి మణికట్టు గొలుసుతో, వేళ్లకు నవరత్నాల ఉంగరంతో, ఠీవిగా, బూట్ల చప్పుడు చేసుకుంటూ వచ్చి, వెనక బెంచీలో వెక్కుతూ కూర్చున్న పవిత్ర కూతురు ప్రక్కన కూర్చున్నాడు. బంట్రోతు జడ్జమ్మగారికి "పెళ్లి సంబంధం అని మీ చాంభర్ దగ్గర కూర్చున్నది ఈయనే" అని లోగొంతుకతో చెపుతున్నాడు. జడ్జమ్మగారికి ఇవేమీ వినబడటంలేదు, ముందుకు వంగి, కళ్లు చిట్లించి ఆ మనిషినే తీక్షణంగా చూస్తున్నారు. అదే నొక్కు జుట్టు, అదే కనుముక్కు తీరు, కాకపోతే వయస్సుతో నెరిసిన గడ్డం మీసాలు. ఎంతకు

తెగించాడు? పాతికేళ్ల తరువాత ఇక్కడ ఇలా ప్రత్యక్షమయ్యాడు. ప్రక్కనే పవిత్ర కూతురు అదే నొక్కుల జుట్టుతో అవే పోలికలతో ఉన్నది! నిర్ఘాంతపోయారు. ఇంతలో పవిత్ర గొంతు చించుకుని ఆ మనిషిని చూపిస్తూ "ఆ నీచుడు నా కూతురు ప్రక్కన వుండటానికి వీల్లేదు" అంటూ అరుస్తున్నది. ఆ మనిషి కూడా జడ్జమ్మగారినీ, పవిత్రని మార్చి మార్చి పరిశీలనగా చూసి ఒక్క ఉదుటన లేచి వెళ్లబోయాడు. కోర్టు అదుపు తప్పింది. క్రింద పడిన చెక్క సుత్తి అందుబాటులో లేదు. జడ్జమ్మగారు అరచేతులతో గట్టిగా బల్లని బాదుతూ ఎగశ్వాసతో "ఆ మనిషిని IPC 375 క్రింద అరెస్ట్ చెయ్యండి" అంటూ అరిచారు. తప్పించుకోబోతున్న ఆ మనిషిని అక్కడే ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు కలియబడి వొరిసి పట్టుకున్నారు.

"ఈ ముద్దాయిని బాధితురాలిగా పరిగణించి విడుదల చేస్తున్నాను" అని తీర్పు చెప్పారు జడ్జమ్మగారు.

--- XXX ----

జడ్జమ్మగారు, పవిత్ర, ఆ పన్నెండేళ్ల అమ్మాయి కారు దిగి ఇంటిలోకి వచ్చారు. ఎదురు వచ్చి సాయం అందించబోతున్న కూతురుతో జడ్జమ్మగారు "వీళ్లిద్దరూ ఇక మన ఇంటిలోనే వుంటారు, ఈవిడని పిన్నీ అని పిలువు. నాకు తోబుట్టువులు లేరే అని ఎప్పుడూ అంటావు కదా, ఇదిగో ఈ పాప నీకు చెల్లెలు. నువ్వు చిన్నప్పుడు వేసుకున్న బట్టలేమైనా వుంటే ప్రస్తుతానికి తీసి ఇవ్వు" అంటూ 'వెళ్లి స్నానం చేసి మంచి బట్టలు కట్టుకుని రండమ్మా" అంటూ ఆ ఇద్దరికీ చెప్పింది.

స్నానం చేసి పాతవి అయినా చక్కని బట్టలు వేసుకుని వచ్చిన ఆ పాప తన ఎదురుగా తన కూతురు ప్రక్కన నిలబడితే, అదే నొక్కు జుట్టుతో, అవే పోలికలతో, ఆ ఇద్దరూ వేరు వేరు తల్లులకు పుట్టినా నిజమైన అక్క చెల్లెళ్లుగా కనిపించారు జడ్జమ్మగారికి.

జడ్జమ్మగారు కుంటుతూ తలుపు ప్రక్కగా నిలబడిన పవిత్ర దగ్గరకి వెళ్లి చెయ్యి అందుకుని "అలా దూరంగా నిలబడవలసిన అవసరంలేదమ్మ, వచ్చి నా ప్రక్కన కూర్చో. నీ కూతురి చదువుతో బాటు నీతో కూడా లా చదువు పూర్తి చేయించే బాధ్యత నాది" అన్నారు.

"నన్ను నా కూతురిని ఆ నరకం నుండి రక్షించి ఆశ్రయం ఇచ్చిన మీకు బోలెడు కృతజ్ఞతలు. మీరు అన్నట్లే నేను లా పూర్తిచేస్తాను. పుట్టుకతో ప్రతి పసిదీ పవిత్రురాలే. కానీ, నాలాంటి బాధితురాళ్లు దేశంలో ఎన్నో లక్షల మంది వున్నారు. అక్కడి బందిఖానాలలో జరిగేవి అత్యాచారేలే కానీ, చట్టం సమాజం వ్యభిచారం అని ముద్ర వేస్తున్నది.. వాళ్లెవరూ IPC 372 మొదలైన చట్టాల క్రింద శిక్షార్హులు కాదని, వాళ్లని దిగజార్చినవారికే IPC 375 క్రింద జీవిత ఖైదు విధించేలాగా పోరాడతాను. ఈ పోరటంలో మీరు కూడా నాకు తోడువస్తారా? కనీసం ఆ బాధితురాళ్ల కోసం కొన్ని కన్నీళ్లు కారుస్తారా?" అర్ధంగా అడిగింది పవిత్ర.




**ఆపదలో ఉన్నవారు మౌనంగా సహాయం కోసం చెయ్యవలసిన సైగ, బొటనవేలు లోపలకు బంధించి నెమ్మదిగా పిడికిలి బిగించి తెరవటం. ఆపదలో ఉన్న బాధితురాళ్లను గుర్తించి సహాయం చెయ్యవలసిన బాధ్యత మన అందరిది కూడా**

## లో క్లాస్ మనిషి

దమ్మవళం శ్రీనివాస్

**సెల్ ఫోన్ మోగటంతో** బద్ధకంగా నిద్రలేచాను. ఏ ఏడో అయుంటుందని మనసులో అనుకుంటూ టైం చూసాను. సరిగ్గా ఎనిమిదిన్నరయింది. శనివారం కావటంతో ఆఫీసుకు వెళ్లాల్సిన పనిలేదు. హాయిగా అనిపించింది. అప్పుడే కొత్త కంపెనీలో చేరి సంవత్సరం దాటిపోయింది. గట్టిగా ఒళ్ళు విరుచుకొని కాల్ తీసుకునేలోపు ఫోన్ మోగటం ఆగి మిస్డ్ కాల్ అని ప్రత్యక్షమైంది స్క్రీన్ మీద. వర్మ నుంచి ఫోను. ఆఫీసుకు వెళ్లబోయేముందు చేసుంటాడు. వెంటనే కాల్ చేసాను.

"ఏరా చక్రి హాయిగా పడుకున్నట్టున్నావ్?" సరదాగా కుళ్ళుగా అడిగాడు వర్మ.

"అవున్రా. శనివారం కూడా ఆఫీసు తెరిచి ఉంచే చెత్త కంపెనీ కాదు మాది. ఏంటి విషయం?" చిన్నగా నవ్వుతూ అడిగాను.

"చాల్లే. నువ్వు మొన్నటి దాకా ఇదే 'చెత్త' కంపెనీలో చేసావని మర్చిపోకు.. మా ఆవిడ ఊళ్ళో లేదు. సాయంత్రం డిన్నర్ కి కలుద్దాం ఇంట్లో. స్విగీలో ఆర్డర్ చేసి తెప్పిద్దాం. త్వరగా వచ్చెయ్.."

"సర్లే. ఆరున్నరకల్లా వస్తాను. నేనొచ్చేదాకా ఆర్డర్ చేయకు" చెప్పి ఫోన్ పెట్టేసాను. చాలా రోజులైంది వర్మని కలిసి. సాయంత్రం కలవబోతున్నందుకు సంతోషంగా అనిపించింది. వెళ్తూ రెండు బీర్ కేన్స్ కూడా తీసుకువెళ్తే సరదాగా టైం గడపొచ్చు అనుకున్నాను.

★★★

చదువు పూర్తయ్యాక ఉద్యోగ వేటలో విజయం సాధించి ప్రస్తుతం వర్మ పనిచేసే కంపెనీలో చేరాను దాదాపు ఐదేళ్ళ క్రితం. నా పక్క సీట్లోనే కూర్చునేవాడు వర్మ. ఇద్దరి వయసు, స్థితీ మొదలైనవి ఒకటే అవటంతో మా స్నేహం బహువచనంలోంచి ఏకవచనంలోకి మారటానికి పెద్ద సమయం పట్టలేదు. రెండేళ్ళ క్రితం అతడి పెళ్ళయ్యేవరకూ సినిమాలకీ, బార్లకీ కలిసే వెళ్ళేవాళ్ళం. ఆ తరువాత కూడా తరచూ వాళ్ళింటికి భోజనానికి వెళ్తూండేవాడ్ని. ఏడాది క్రితం ఉద్యోగం మారాక రాకపోకలు కొద్దిగా తగ్గినా అప్పుడప్పుడూ ఫోన్లో మాట్లాడుతూ, కుదిరినప్పుడల్లా కలుస్తూ మా స్నేహాన్ని కొనసాగిస్తున్నాం.

వర్మ మంచివాడే కానీ కొన్ని విషయాల్లో మాత్రం అతడి అభిప్రాయాలు నాకు నచ్చేవి కాదు. స్నేహపూర్వకంగా సరిచేయాలని చూసిన ప్రతీసారీ తను వందశాతం కరెక్ట్ అనీ, నా పద్ధతే మార్చుకోవాలని వాదనకి దిగేవాడు. చేసేదేమీలేక నేనూ పట్టించుకోవటం మానేసాను. నేను ఉద్యోగం మారటం కూడా అతడికి ఏమాత్రం నచ్చలేదు. అక్కడ నాకు వచ్చే జీతానికే ఇంకో ఉద్యోగం చూసుకున్నాను. ఆదాయంలో తేడా ఏమీ లేనప్పుడు మారటం అనవసరమని గట్టిగా వాదించి నాకు నచ్చజెప్పటానికి చాలా ప్రయత్నించాడు. పైగా, ఆ ఏడాదే మేము పనిచేసే కంపెనీని ఇంకో పెద్ద కంపెనీ టేకోవర్ చేయటం జరిగింది. అలా జరగటం మాకు బాగా అనుకూలిస్తుందనీ, ఉద్యోగంలో మంచి పురోగతి ఉంటుందని అతడి విశ్వాసం. అంత మంచి అవకాశం వదులుకొని ఉన్న జీతానికే నేను వేరే కంపెనీలో చేరటం అతడు జీర్ణించుకోలేకపోయాడు.

అయితే అక్కడ నా సమస్య ఆదాయం కాదు. అరాచకం! ఆ అరాచక సమస్య పేరు సౌమ్యారావు. కంపెనీ మేనేజ్మెంట్ మారటంతో మాకు కొత్తగా వచ్చిన 'బాసు' అనబడే ఓ జీవి అతడు.

తన పేరుకు ఏమాత్రం తగనట్టుగా ప్రవర్తించే జీవుల్లో సౌమ్యారావు మొదటి స్థానాన్ని పోటీలేకుండా కైవసం చేసుకుంటాడు. 'సౌమ్యం' అతడి రక్తంలోనే లేదు. బ్లడ్ గ్రూప్ కూడా 'బీ నెగటివ్' అయ్యుంటుందని అంతా అనుకునేవారు. మొహానికి పౌడర్ బదులు విసుగు, చిరాకు లాంటివి దట్టంగా రాసుకొని ఆఫీసుకు వచ్చేవాడు. తన కింద పనిచేసేవారంటే అతడికి యమ చులకన. ఎలా ప్రవర్తించినా, ఏం మాట్లాడినా పడుంటారు (పడుండాలి) అన్న తేలిక అభిప్రాయం ఉండేది. ఉద్యోగుల స్థాయిని బట్టి మాత్రమే మర్యాద ఇచ్చేవాడు. యుక్త వయసులో ఉండే ఆఫీసు బాయ్స్ ని మరీ చులకనగా అరేయ్, ఒరేయ్ అని కూడా పిలిచేవాడు ఏదో సొంత తమ్ముడ్ని పిలిచినట్టుగా. పనిలో ఏదైనా చిన్న తప్పు జరిగినా లేదా ఆలస్యమైనా అందుకు బాధ్యులైనవారి మీద ఎగిరిపడేవాడు. అమర్యాదగా మాట్లాడుతూ దూషించేవాడు. ఆ టైంలో చూట్టుపక్కల ఎవరైనా ఆడమనిషి ఉంటే తను సినిమా హీరోలా ఫీలవుతూ వాళ్ళ ముందు మరింతగా రెచ్చిపోయేవాడు. అతడు కంపెనీ ఓనర్ కి దగ్గర బంధువు కూడా కావటంతో అతడి అధికారానికి భయపడి ఎవరూ నోరుమెదపకుండా మనసులోనే ఆడిపోసుకునేవారు.

ఆత్మాభిమానం అనేది వెలకట్టలేని గొప్ప ఆస్తి అని నా నమ్మకం. ఎవరైనా అమర్యాదగా మాట్లాడినా, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించినా నాకు నచ్చదు. అలాగే ఉద్యోగం అనేది ఎవరూ ఎవరికీ చేస్తున్న సాయం కాదు. పనికి తగ్గ (లేదా తక్కువ) జీతం మాత్రమే కంపెనీ ఇస్తుంది. పని సరిగ్గా చేయకపోతే ఉద్యోగం ఊడుతుంది. ఇందులో ఇంతకు మించి ఆలోచించటానికీ, బాసును చూసి గడగడలాడటానికీ ఏమీ లేదని నా అభిప్రాయం. ఈ మనస్తత్వంతో, పైన వివరించిన సద్గుణాలు కలిగిన సౌమ్యారావును భరించడం నా వల్ల కాలేదు. రోజురోజుకీ శ్రుతిమించుతున్న అతడి నికృష్టపు ప్రవర్తన వల్ల అతడి మీద అసహ్యం, పనిమీద విరక్తి ఒకే మోతాదులో కలిగేవి.

చాలామందిలా 'వాడో తిక్క వెధవలే' అని ఆత్మవంచన చేసుకుంటూ ఊరుకోలేకపోయాను. అక్కడ్నుంచి అర్జెంటుగా పారిపోవడం అత్యవసరమనిపించి వేరే ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నించాను. త్వరగానే గ్రహాలు అనుకూలించి ఓ దివ్య ముహూర్తాన మంచి కంపెనీలో ఆఫర్ రావటంతో సౌమ్యారావు పీడా వదలటమనే శుభకార్యం నిర్విఘ్నంగా జరిగిపోయింది.

సాయంత్రం వర్మను కలిసినప్పుడు మా మాటల్లో ఎప్పటిలాగే ఈ సౌమ్యారావే ముఖ్య వస్తువు అవుతాడని అనుకున్నాను. వారం క్రితం ఫోన్ చేసి బాసు బాధ భరించడం కష్టంగా ఉందని చాలాసేపు బాధపడ్డాడు కూడా. అతడు చెప్పిన మరో దారుణమైన విషయం కూడా గుర్తొచ్చింది.

"..బాసుగాడు ఈ మధ్య కొత్తగా బూతులు తిట్టడం కూడా మొదలుపెట్టాడ్రా. అయితే నేరుగా తిట్టకుండా ఎదురుగా మనన్ని పెట్టుకొని ఇంకెవర్నో అన్నట్టుగా పచ్చి బూతులు తిట్టేస్తున్నాడు. అదంతా మనల్నే అని అర్థమవుతుంది కానీ ఏమీ అనలేం.. పరమ నీచుడు నిజంగా.."

బీరు తాగుతూ అతగాడ్ని జోరుగా తిడతాడని ఊహించాను. కొత్త రకాల తిట్లు కనిపెట్టి తిట్టడంలో వర్మది అందెవేసిన నోరు. చిన్నగా నవ్వుకున్నాను. అయితే, సాయంత్రం జరగబోయేది పూర్తిగా వేరని ఆ క్షణం నాకు తెలీదు.

★★★

వర్మ ఉండే అపార్ట్మెంట్ కాంప్లెక్స్ చేరుకునేసరికి సరిగ్గా ఆరున్నరైంది. అతడుండేది నాలుగో అంతస్తులో. ఎప్పుడూ పెట్టే పార్కింగ్ ప్లేస్లో బైక్ పార్క్ చేస్తూండగా ఎవరో ఎవరిమీదో పెద్దగా అరవటం వినిపించింది. ఆ అరుస్తున్న మనిషి గొంతు వెంటనే పోల్చుకున్నాను. అది వర్మదే. గబగబా అటువైపు నడిచాను ఏం జరుగుంటుందా అని. లిఫ్ట్ ఎదురుగా అసహనంగా నుంచొని గట్టిగా మాట్లాడుతున్నాడు వర్మ. వెనకనుంచి కనబడుతున్నాడు. పక్కనే చేతులు కట్టుకొని ఉన్నాడో మనిషి. సాధారణ దుస్తులతో వర్మ కంటే బాగా పొట్టిగా ఉన్నాడతడు. వాళ్ల దగ్గరకు వెళ్లకుండా కొద్దిదూరంలో ఆగాను మధ్యలో వెళ్ళటం ఎందుకులే అని. నేను వాళ్ళ వెనకవైపు కొద్దిగా గోడ చాటుగా ఉండటంతో వాళ్ళు నన్ను గమనించలేదు.

వాళ్ళ మాటల వల్ల ఆ పొట్టి మనిషి అక్కడి వాచ్ మెన్ అని అర్ధమైంది. పాత వాచ్ మెన్ అయితే గుర్తుపట్టేవాడ్ని. ఇతడెవరో కొత్తగా వచ్చినట్టున్నాడు పాపం తిట్లు తింటున్నాడు మౌనంగా. వర్మ అక్కడి రెసిడెంట్స్ సొసైటీకి ఈ మధ్య సెక్రెటరీగా ఎన్నికయ్యాడని చెప్పటం గుర్తొచ్చింది. పార్కింగ్ ప్లేస్ శుభ్రంగా లేదనీ, విజిటర్స్ ఎక్కడబడితే అక్కడ బళ్ళు ఉంచుతున్నారనీ, చెప్పిన పని ఏదీ సరిగ్గా చేయడనీ ఇంకా ఏవేవో ఏకరవు పెడుతూ అతడ్ని ఏకిపారేసాడు వర్మ కొద్దిసేపు. లిఫ్ట్ ఎదురుగానే వాచ్ మెన్ ఉండే గది ఉంది. దానికున్న నాసీరకం కర్టెన్ మడతల వెనక ఏదో కదలటం నా దృష్టిని ఆకర్షించింది. పరీక్షగా చూసాను. వాచ్ మెన్ కొడుకనుకుంటా. ఆరేళ్ళవాడు. కర్టెన్ చాటుగా ఉండి జరిగేది తొంగి చూస్తున్నాడు. వాడి మొహం నిండా బాధ. ఏమీ చేయలేక దీనంగా జరిగేది గమనిస్తున్నాడు. వాడ్ని చూస్తే జాలేసింది. తండ్రిని కళ్ల ముందే చెడా మడా తిడుతూంటే ఏ కొడుక్కి మాత్రం నచ్చుతుంది? ఇక ఉండబట్టలేక వాళ్ళ మధ్యకు వెళ్ళాను. తిట్ల తద్ది ముగించాడు వర్మ నన్ను చూడగానే.

"ఏరా ఎప్పుడొచ్చావ్?" అడిగాడు ఆనందంగా.

"ఓ ఐదు నిమిషాలైంది.." చెప్పాను పొడిగా.

"తరువాత మాట్లాడదాం" అని చెప్పి వాచ్ మెన్ని పంపేసాడు.

ఇద్దరం లిఫ్ట్ ఎక్కి తలుపులు మూసాక, నాలుగో అంతస్తు బటన్ నొక్కాడు వర్మ. చిన్న కుదుపుతో లిఫ్ట్ కదిలాక అడిగాను "ఏంట్రా ఆ అరుపులు. ప్రశాంతంగా మాట్లాడొచ్చు కదా?"

"వీడు కొత్తగా వచ్చాడ్రా. చెప్పింది ఒక్కటీ సరిగ్గా చేయడు. బద్ధకమో ఏంటో అర్ధం కాదు. నా ఖర్మ కొద్దీ నేను బాధ్యత తీసుకున్న మర్నాడే ఆ పాత వాచ్ మెన్ జంప్ అయ్యాడు.."

కొన్ని క్షణాలు మౌనంగా ఉండి అన్నాను "నువ్వే చెబుతున్నావుగా కొత్తగా వచ్చాడని. పని నేర్చుకునే దాకా ఓపిగ్గా ఉండొచ్చు కదా?"

ఇద్దరం నాలుగో అంతస్తులో లిఫ్ట్ దిగాక పక్కనే ఉన్న అపార్ట్మెంట్ తలుపు తీస్తూ జవాబిచ్చాడు క్లుప్తంగా "చూద్దాంలే..". ఈ విషయం మీద చర్చించటం అతడకి మరి ఆసక్తి లేదని ఒక్క ముక్కలో తేల్చేసాడు.

అయితే, అంత తేలిగ్గా ఆ విషయం నన్నొదిలిపెట్టలేదు. వాచ్ మెన్ ఆరేళ్ళ పిల్లాడు అదేపనిగా నా మనసులో మెదలసాగాడు. ఎంత అమాయకంగా ఉంది ముచ్చటైన మొహం. డబ్బు చుట్టూ తిరిగే ఈ లోకం తమలాంటి పేదవారిని లెక్కచేయదన్న నిజం ఇంకా గమనించని ఆ స్వచ్ఛమైన కళ్ళల్లోని తడి నా గుండెను బరువెక్కించింది. ముందున్న ఉల్లాసమైన మూడ్ ఇప్పుడు లేదు. చిన్నగా నిట్టూర్చి ఇంట్లోకి వెళ్ళాను.

ఇద్దరం ముందుగదిలో ఎదురెదురుగా కూర్చొని సెటిల్ అయ్యాక నేను తెచ్చిన రెండు చల్లని బీర్ కేన్స్ తీసి బల్ల మీద పెట్టాను. ఇంకో రెండు ఫ్రిజ్ లో పెట్టమని వర్మ చేతికిచ్చాను. అతడు లోపలనుంచి తిరిగివస్తూ చిప్స్, బూందీ లాంటివి పళ్ళెంలో తెచ్చిపెట్టాడు. చీర్స్ చెప్పుకొని తాగటం మొదలుపెట్టాం.

కాసేపు రొటీన్ విషయాలు మాట్లాడుకున్నాక నా మూడ్ బాలేకపోవటం వర్మ గమనించాడు. "ఏంటి ఆలోచిస్తున్నావ్?" అని అడిగాడు.

"ఆ వాచ్ మేన్ని అలా అరవటం నాకస్సలు నచ్చలేదు. అతడిది తప్పే అయుండొచ్చు. అంత మాత్రాన మనిషి కాకుండా పోతాడా? మరీ అంత హీనంగా తిట్టాలా? వాళ్ళ పిల్లాడు పాపం కర్టెన్ చాటుగా ఉండి అంతా చూస్తున్నాడు. వాడి మనసు ఎంత బాధపడుంటుందో.." సూటిగా మనసులో ఉన్నది చెప్పేసాను.

వర్మ దృష్టిలో పేదవారికి డబ్బుతో తప్ప గుణంతో పనిలేదు. వారితో పనిచేయించుకునే పద్ధతి వేరు. రఫ్ గా ఉండకపోతే నెత్తికెక్కుతారు. అతడిలో నాకు నచ్చని విషయాల్లో ఇది కూడా ఒకటి. ఎందుకు పేదవారంటే అందరికీ అదోరకమైన చులకన? పేదరికంలో మగ్గటం వారి చాయిస్ కాదుకదా. వేరే దారిలేక మాత్రమే అలా భారంగా జీవిస్తున్నారు. వారితో సౌమ్యంగా మాట్లాడితే ఏంటి తప్పు? వాళ్ళకంటే మనం ఉన్నతంగా ఉన్నామని ఎందుకు అనుకోవటం? గతంలో ఎన్నోసార్లు ఈ విషయం మీద ఇద్దరం వాదించుకున్నాక ఇక అనవసరమని వదిలేసాను. ఆ పూట మాత్రం ఊరుకోలేకపోయాను.

"రేయ్ చక్రీ. అనవసరమైన వాదనలొద్దు. సూటిగా రెండు ముక్కలు మాట్లాడుకుందాం. నేను గట్టిగా అరవకుండా మర్యాదగా వాడ్ని పని సరిగ్గా చేయమని బ్రతిమాలాలి అంతేనా నువ్వు చెప్పేది?"

"కాదు. బ్రతిమాలాల్సిన పని లేదు. సాటి మనిషన్న స్పృహతో సౌమ్యంగా మాట్లాడితే చాలు.."

"అందువల్ల ఏంటి ఉపయోగం?" ఎగతాళిగా అడిగాడు.

"అది నీ బాధ్యత. ఉపయోగమున్నా లేకపోయినా ఇది తప్పదు. అవతలి వ్యక్తి మనతో మంచిగా, మర్యాదగా ఉండాలని ప్రతీ మనిషీ కోరుకుంటాడు. అలా జరిగితే సంతోషిస్తాడు. రూపాయి ఖర్చు లేకుండా పేదవారికి మనమివ్వగలిగే అలాంటి సంతోషాన్ని ఎందుకు ఇవ్వకూడదు?" కొద్దిగా ఆవేశంగా అడిగాను.

"ఎందుకంటే అలా చేస్తే నిన్నో మూర్ఖుడనుకుంటారు. నువ్వనుకున్నట్టు మనకులా లోక్లాస్ వాళ్ళకి కావాల్సింది మర్యాద, సంస్కారం కాదు. డబ్బు! ఆత్మాభిమానం, వంకాయ్ లాంటివి వారికి ఉండవు. ఈ కారణం వల్ల మనం వాళ్ళకంటే ముమ్మాటికీ ఉన్నతమైన వాళ్ళమే. అది వారూ ఒప్పుకుంటారు గనకే మనం ఎలా మాట్లాడినా పట్టించుకోరు. వాళ్ళకేదో గొప్ప గుణాలుంటాయని నువ్వు ఊహించుకోవటం అనవసరం.. ఎవరి లాభం వారు చూసుకుంటారు. ఆత్మాభిమానం పేరు చెప్పి మంచి అవకాశాన్ని వదులుకోరు నీలాగా.." గట్టిగానే అన్నాడు.

దొరికిందే చాన్సని నేను కంపెనీ మారిన విషయంలో అతడికున్న అసంతృప్తిని కూడా వెళ్ళగక్కాడు. అతడు వాడిన 'లోక్లాస్' అన్న పదం నాకు బాధ కలిగించింది. క్షణంలో తేరుకొని నిక్కచ్చిగా తెగేసినట్టు చెప్పాను "డబ్బుకూ, గుణానికీ సంబంధం లేదు! ఆత్మాభిమానం అనేది పేదవారికి కూడా ఉంటుంది.. ఇది మనం గుర్తించాలి!"

వెంటనే ఏదో అనబోతూ ఆగిపోయాడు వర్మ. నా విషయంలో నోరు జారానని కూడా అనిపించిందేమో. కొద్దిసేపు మౌనంగా ఉండి "సర్లేరా. ఈ వాదనలు తెగేవి కాదు. అనవసరంగా మూడ్ పాడుచేసుకోవటం మంచిది కాదు.." అన్నాడు కుర్చీలోంచి లేస్తూ. ఖాళీ అయిన బీర్ కేన్స్ పారేసి, ఫ్రిజ్ లోంచి కొత్తవి తెచ్చిపెట్టాడు బల్ల మీద.

నా ఆవేశం చూసి ఎందుకైనా మంచిదని వాదన ముగించాడనిపించింది. ఒకరకంగా అదే మంచిది. అయినా అతడు చెప్పిందాంట్లో ఏదైనా నిజం ఉందా? పేదవారికి ఆత్మాభిమానం ఉండదా??

దీనికి సమాధానం మరి కొద్దిసేపట్లో ఊహించని విధంగా దొరికింది.

★★★

కొంతసేపు ఇద్దరం ఎవరి ఆలోచనల్లో వారు ఉండిపోయాం. మూడ్ తేలికవడానికి టాపిక్ మార్చడం మంచిదనిపించింది. "ఏమంటున్నాడు మీ సౌమ్యారావు?" నవ్వుతూ అడిగాను. ఎప్పటిలానే తిట్ల వర్షం కురిపిస్తాడని అనుకున్నాను సరదాగా. మొదలుపెడితే ఓ పట్టాన ఆపడు.

"ఏముందిరా చెప్పడానికి. ఏదో అనుకున్నాను కానీ మనిషి మంచివాడే.."

ఆశ్చర్యపోవాలన్న ఊహ కూడా రానట్టుగా ఉండిపోయాను. అకస్మాత్తుగా దేశంలో కరోనా కేసులు సున్నా అయిపోయినయ్ అని తెలుగు న్యూస్ చానల్ వారు బాధపడుతూ చెప్పినా ఇంతగా దిగ్భ్రమ చెందేవాడ్నికాదు. తన కింద పనిచేసేవారు ఎదురు చెప్పలేరుకదా అన్న ఒక్క కారణంతో సంస్కార హీనంగా ప్రవర్తించే నికృష్టపు సౌమ్యారావు

అకస్మాత్తుగా మంచివాడెలా అయ్యాడు? అదీ వారం రోజుల్లో?? వారం క్రితం ఇదే వర్మ అతడ్ని పిచ్చితిట్లు తిట్టాడు.. ఈ విషయమే అడిగాను.

"అకస్మాత్తుగా మంచివాడేమీ అవలేదు. ఆయన స్వభావమే అది. బయటకి కోపం ప్రదర్శిస్తాడు కానీ, స్టాఫ్ అంటే ఎంతో అభిమానం. కొన్నాళ్లుగా గమనిస్తే అర్థమైందీ విషయం.." వివరించాడు వర్మ.

ఏదో నమ్మలేని అబద్ధం వింటున్నట్టుగా అనిపించింది. పోనీలే మంచివాడుగా మారితే మంచిదే అని ఊరుకున్నా మనసు మాత్రం ఆశ్చర్యంలోంచి పూర్తిగా తేరుకోలేదు.

బీరు తాగడం ముగించాక, డిన్నర్ కి నా ప్రిఫరెన్స్ ఏంటో కనుక్కొని స్విగీలో ఆర్డర్ చేసాడు వర్మ. ఇద్దరం తీరిగ్గా కూర్చున్నాక ఏదో గుర్తొచ్చినట్టుగా లోపలకు వెళ్ళి చేతిలో ఓ స్వీట్ బాక్స్ తో తిరిగొచ్చాడు. "కాకినాడ కాజా.. నిన్నే తెప్పించాను. చాలా బావున్నాయి. నీకు బాగా ఇష్టం కదా" అని బాక్స్ తెరిచి బల్ల మీద పెట్టాడు. కాజా అంటే నిజంగానే నాకు చాలా ఇష్టం. స్వచ్ఛమైన నేతితో చేసినట్టు తాజాగా, నోరూరించేలా ఉన్నాయి ఎదురుగా. ఒకటి తీసి తినబోతుండగా తలుపు చప్పుడైంది. ఈ టైంలో ఎవరా అనుకుంటూ వెళ్ళి తలుపు తీసాడు వర్మ.

ఎదురుగా వాచ్ మెన్ ఆరేళ్ళ కొడుకు. ఏదో కవర్ పట్టుకొని వచ్చాడు. "మీ లెటర్ సార్.." అని వర్మ చేతికిచ్చాడు. మామూలుగా అయితే వెంటనే వెళ్లిపోయేవాడేమో. ఎదురుగా బల్ల మీద కనిపిస్తున్న కాజాల ఘుమఘుమ వాడ్ని కట్టిపడేసిందనుకుంటా. అలాగే వాటివంక ఆశగా చూస్తూ నిలబడిపోయాడు. కొద్దిగా చిరాగ్గానే చూసాడు వర్మ వాడివైపు. నేనక్కడ లేకపోయుంటే వాడి మొహం మీదే తలుపేసుకునేవాడేమో. చప్పున తేరుకొని నా చేతిలో ఉన్న స్వీటు వాడికి ఇవ్వబోయాను. వర్మ నేను చేయబోయేది అర్థమై, నన్ను వారిస్తూ బాక్సులోంచి మరోటి తీసి వాడికి ఇవ్వబోయాడు. అప్పుడు జరిగిందా సంఘటన. ఎవరూ ఊహించనిది. "వొద్దు సార్.." అని గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్లిపోయాడా పిల్లాడు. ఏం జరిగిందో అర్థమై తేరుకోటానికి మాకు కొన్ని క్షణాలు పట్టింది. వర్మ మొహం మాడిపోయింది. నేను గమనించకుండా సర్దుకున్నాడు వెంటనే. "పోన్లే.." అని తలుపు వేసి వాడికివ్వబోయిన స్వీటు తనే తినేసాడు.

పేదవాళ్ళని చిన్నచూపు చూసే మనుషులను లాగిపెట్టి కొట్టినట్టుగా ఆ పిల్లాడు చేసిన పని నాకు చెప్పలేని సంతోషాన్ని కలిగించింది. తన తండ్రిని అంతలా తిట్టిన వ్యక్తినుంచి స్వీటు తీసుకోడం వాడికి మనస్కరించలేదు. వాడి వయసుకీ, పరిస్థితికీ ఎప్పుడో కానీ అలాంటివి తినే అవకాశం రాదు. అయినా తినాలన్న కోరికను జయించి ఆత్మాభిమానం ముందు ఏదీ పెద్దది కాదని తేల్చిచెప్పాడు. గుణానికీ డబ్బుకీ సంబంధం లేదన్న నా నమ్మకాన్ని నిరూపించాడు.

"చూసావా? ఇప్పటికైనా ఒప్పుకుంటావా?" అని అడుగుతానని ఊహించుంటాడు వర్మ. నేనాపని చేయలేదు. మౌనంగా ఉండిపోయాను. అడగటం అనవసరం. ఏదో చెబుతాడు తప్ప ఒప్పుకోడు. అతడి మనసుకి మాత్రం ఖచ్చితంగా అర్ధమైందనే అనిపించింది కళ కోల్పోయిన అతడి మొహం చూసాక.

ఇద్దరం కాసేపు టీవి చూసి డిన్నర్ పూర్తిచేసాక, అతడి దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బయలుదేరాను. లిఫ్ట్ దిగాక ఎదురుగా మళ్ళీ ఆ పిల్లాడు కనిపించాడు. తల్లితో కబుర్లు చెబుతున్నాడు. దగ్గరకు పిలిచి పిల్లలకు ఇవ్వడానికి నా దగ్గర ఎప్పుడూ ఉంచుకునే చాక్లెట్లు నాలుగు జేబులోంచి తీసిచ్చాను. వాడి మొహం గుప్పున వెలిగింది. సంతోషంగా తీసుకున్నాడు. బండి స్టార్ట్ చేసి తృప్తిగా ఇంటికి తిరిగి వెళ్ళాను.

ఇక్కడితో కధ ముగిసిపోయుంటే సౌమ్యారావు ఎలా మారాడన్న సస్పెన్స్ మిగిలిపోయేది. అయితే అలా జరగలేదు. ఆ సస్పెన్స్ వర్మే విప్పాడు అనుకోకుండా. డిన్నర్ చేస్తూ మాటల మధ్యలో నాతో గర్వంగా అన్నాడు "..నాకీసారి ట్వెంటీ పర్సెంట్ ఇంక్రిమెంట్ తో పాటు పాతికవేలు బోనస్ కూడా వచ్చింది. నిన్నూ ఇక్కడే ఉండిపొమ్మంటే విన్నావు కాదు..". ఆ క్షణం నాకు అంతా అర్ధమైపోయింది. మారింది సౌమ్యారావు కాదు, వర్మ! బాసు ఇచ్చిన ఇంక్రిమెంటూ, ఇన్సెంటివ్ అతడ్ని వర్మ దృష్టిలో అకస్మాత్తుగా మంచివాడ్ని చేసినయ్.

ఆరేళ్ళ పేద పిల్లాడికి నోరూరించే స్వీటుముక్క విలువ వర్మకు లభించిన పాతికవేల కన్నా నిశ్చయంగా ఎన్నోరెట్లు ఎక్కువ. తండ్రిని తిట్టాడన్న కారణంగా వాడు తనకి అంత విలువైనదాన్ని తృణప్రాయంగా వదిలేసి వెళ్లిపోతే, తనని అమ్మనా బూతులు తిట్టిన బాసు మంచివాడే అని ఆత్మవంచన చేసుకుంటూ పాతికవేలు బోనస్ గా తీసుకున్నాడు వర్మ. "ఇంతకీ ఇద్దరిలో ఎవరు లోక్లాస్ మనిషి?" చిన్నగా నవ్వుకున్నాను నా మనసులో ఉదయించిన ఈ తేలికైన ప్రశ్నకి జవాబుగా.

# సహజీవనం నవులూరి వెంకటేశ్వరరావు

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
విశిష్ట బహుమతి పొందిన కథ

భార్య చేత లెంపకాయలు తిని, ఆమె శారీరకంగా బలహీనురాలు అని కూడా చూడకుండా కడుపులో తన్నేడు వెంగళ్రాజు. పుస్తెల తాడు తెంపుకోలేదుగాని, బొందెలో ప్రాణం ఉండగా ఆ గుమ్మం తొక్కనని ప్రకటించి, తన రుమాళ్ళతో సహా సర్దుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది రేఖ. మంచం మీద మేను వాల్చాడు.

ఈ 'నాగరిక' మానవ సమాజంలో – వందలాది అత్యాచారాలకూ, దొంగతనాలకూ, హత్యలకూ, మితి మీరిన ప్రవర్తనకూ, అన్యాయాలకూ, ద్వంద వైఖరికి సాక్షీభూతంగా ఉంటూ,వాటిలో పాల్గొంటూ – భార్యను కొట్టడం క్షమించరానిచర్యగా భావించాలా అని ఎవరూ అడగక పోయినా, తనను అడిగినట్లు భావించుకుని సమాధానం చెప్పేసుకున్నాడు. అయినా ఎక్కడో ముల్లులా మనసులో తన తప్పు గుచ్చిగుచ్చి బాధిస్తోంది. లోతుకు వెళ్లకుండా గమనించినప్పుడు అనాగరికత రెండు విధాలుగా వ్యాప్తిలో ఉన్నట్టనిపిస్తుంది. ఒకటి కోపోద్రేకంలో జరిగేది, రెండు అలవాటుగా అది మారడం వలన అమలులో ఉన్నదీ. అంతేనా లేక అది మారని మానవ సహజ ప్రవృత్తా?

ఖాళీ ఇంట్లో ఏమి తోచక కారడవికి వెళ్ళాడు. ఎచ్చోట ఉన్నా ఆకలిదప్పుల పీడన ఏ జీవికీ తప్పదు. ఖనిజోదకం, పిజ్జా, కోక్, తీసుకెళ్లాడు. మనిషి కేవలం రొట్టెతో జీవించలేడు, అన్నాడు ప్రవక్త క్రీస్తు. తిండితో పాటు బైనాక్యూలర్, కెమెరా, 'ఉదాత్త ఆదిమానవుడు' అన్న పుస్తకం, వల ఊయల కూడా తీసుకెళ్లాడు. ఒకనాడు లేని వస్తు సంపద ఈ రోజు నిత్యావసరం.

ఊగాడు, ప్రకృతిని చూసి అబ్బురపడ్డాడు. ఛాయా చిత్రాలు విభిన్న కోణాల నుంచి తీసాడు. చదివాడు; ఆదిమానవుడి ఉదాత్తతకు విస్తుపోయాడు. తిన్నాడు. త్రాగాడు, త్రేన్చాడు [ఈ పని రేఖకు పరమ అసహ్యం]. ఆమె తన చెంతనే లేని లోటు అనిపించింది. దేవుడూ జంటను సృష్టించాడు. భార్య సర్దుకు పోవలసింది. తన్నే తన్నులు, తిట్టే తిట్లను వెనక్కు తీసుకునే వీలు లేదు; చింతించాడు. ఆవలించాడు; ఈ పనీ రేఖకు నచ్చదని గుర్తుకొచ్చింది.

నాగరికత మనిషి స్వేచ్ఛను హరించింది.

"భవిష్యత్తులో, ఆమె కడుపులో గానీ, వేరే చోట గానీ తన్నకుండా ఉండగలనా? చెప్పలేను. అది నా మనసూ చేతుల ఆధీనం. ప్రయత్న లోపం మాత్రం ఉండదు."

అడవి అద్భుతంగా విర్రవీగుతోంది. టేకు మానులు ఆకాశాన్ని మోస్తున్నాయి; ఇతర వృక్షాలు గాలికి తట్టుకోలేక కల్లు తాగినట్లు ఊగుతున్నాయి; కొన్ని పళ్ళ భారంతో క్రుంగి ఉన్నాయి – వాటినవే వదిలించుకోవాలి; మరి కొన్ని పూలతో అలంకరించుకుని ఉన్నాయి శృంగానికై ఎదురుచూస్తూ. సెలయేరు కొత్త యవ్వనవతిలా వంపులు తిరిగి ప్రవహిస్తోంది. ఖనిజోదకం వృధాగా తెచ్చుకోలేదుగా? ఆ ప్రశ్నను కొట్టేసాడు. ఏటి నీరు తాగితే సైనస్ ఊరుకోదు. ఆదిమానవుడికి ఈ రోగం ఉండేదా? కొంటెగా ప్రశ్నించుకున్నాడు. మధురంగా ఈల వేసుకుని ఆనందించాడు.

తమను మించిన ఉన్నతులు లేరన్నట్లు విర్రవీగుతున్న దూరపు నీలగిరి చెట్ల మధ్యనున్న ఖాళీలలో నుంచి ఈటెలు, కర్రలు పట్టుకుని వెంగళ్రాజు దిశగా ఆదిమానవులు పరిగెత్తుకుని [మంచి తరుణం మించిపోవునన్నట్లు] వస్తున్నారు. పురుషులకు సహకరించ దలచినట్లు, స్త్రీలూ ఉన్నారు; వాళ్లలో కొందరి దగ్గర పాలు తాగుతూ చంటిపిల్లలు; వృద్ధులూ ఉన్నారు. ఆకుల ఆఛ్ఛాదనకూడా లేని స్త్రీల వక్షోజాలు ఊగుతున్నాయి. వాళ్లదంటూ వాళ్ళ భాష, సంస్కృతి, సిగ్గు, ఐకమత్యం ఉన్నాయి గనుక వాళ్ళ ముందరి తరాలకన్నా వీళ్ళు నాగరికులే. వేల సంవత్సరాల తర్వాత నేటి నాగరిక జాతి ఆనాటి అనాగరిక జాతవుతుంది.

జారిపోతున్న గుండెను ఎడమ చేత్తో పట్టుకుని ఉయ్యాల నుంచి క్రిందికి దూకేడు. ప్రాణం ముఖ్యం, తరువాతనే సౌఖ్యం. తీసుకెళ్లిన నాగరిక వస్తు సంపదను అడవిపాలు చేశాడు. ప్రాణం మిగిలి ఉండాలి కానీ డబ్బుతో దేన్నికొనుక్కోలేం, సాటి మనుషులతో సహా? లుంగీ అతన్ని వదిలేసింది. మానం కన్నా కూడా ప్రాణం ముఖ్యం. తాను అంత వేగంగా పాదరక్షలు కూడా లేకుండా పరుగెత్తగలడని ఆ క్షణం దాక అతనెరుగడు, భయం పరుగుకు ఇంధనంలా ఉపయోగ పడుతోంది. ముళ్ళూ, పల్లేరు గాయలు అతని రక్తమాంసాలను చవిచూస్తున్నాయి. మానవ శరీరం సరిగ్గా సృష్టించబడలేదని అతనికి ఆవేదన కలిగింది; మరి ఆదిమానవులు ఎలా పాదరక్షలు లేకుండా పరుగెత్తగలుగుతున్నారు, అన్న ఆలోచనా కలిగింది. లోని హంస విలవిలలాడుతోంది. మనిషికి రెక్కలు ఎందుకివ్వలేదో అతనికి అర్థం కాలేదు; పక్షులను బ్రతకనివ్వరనేమో! ప్రాణాన్ని రక్షించుకోడానికి హత్య చేయడం అనివార్యం అయితే, ఆనాటి మానవుడు, ఈనాటి మానవుడూ ఆ పని రెప్ప వేయకుండా చేయగలడు; వాడు రక్తాన్ని ఆకులతో తుడుచుకుంటాడు; వీడు నీళ్లతో కడిగి గుడ్డతో తుడుచుకుంటాడు.

“వెర్రి వెధవలు కానీ – నా బక్క శరీరంలోని బొచ్చు, ఎముకలు, తోలు వగైరాలు తీసేయగా మిగిలిన మాంసం ఏపాటిది?" అంతమంది నా వెనుకపడ్డారే ఒకొక్కళకు దక్కే ప్రతిఫలం ఏపాటిది? అలసట. సూదిరాళ్లు. రక్తసిక్తమైన పాదాలు. వాళ్ళొచ్చారు. ఇరవై అడుగుల దూరానికి వొచ్చింది చావు. ఎందుకో ఈటెలు విసరలేదు. వాళ్ళ దేవతకు గాయమైన శరీరాన్ని అర్పించకూడదేమో. వాళ్లకూ వాళ్ళవంటూ ఆచారాలు, వ్యవస్థలూ ఉంటాయి.

దొరికిపోయాడు. ఆయుధం వాడకుండా, కేవలం చేత్తో గుద్ది, మోచేతులతో పొడిచి వాళ్ళు అవలీలగా తనను యమపురికి పంపగలరు. నిజానికి వాళ్ళు ఏమీ అనకుండానే వాళ్లంటే ఉన్న భయంతో కన్నుమూసేయగలడు శాశ్వతంగా. చావబోయేముందు వాళ్ళను ఒక పనికిమాలిన ప్రశ్న అడగాలని అనుకున్నాడు: సాటి మనిషినైనా నన్ను ఆరగించదలచుకున్నారు కదా, మరి మిమ్మల్ని మీరు తినరా? ఏదో విభజన రేఖ ఉండీ లేనట్లువుండి వాళ్ళు వాళ్ళను ఆ పని చేయనీయడం లేదు. కానీ దాన్ని చెరిపేయడం మహా కష్టం ఏమీ కాదు. బలహీనుడు, జంతువులు, పక్షులు, జలచరాలూ – బలవంతుడు పీక్కు తినడానికి ఉన్నాడు ఆది నుంచి నేటి వరకూ.

వెంగళ్రాజు లెంపకాయ కొట్టినట్టు మేలుకున్నాడు. చొంగ కారి ఉంది; దుప్పటితో తుడిచాడు. అలాచేస్తే రేఖ ఊరుకోదు. గోడగడియారం 'మూడు' అనింది. రాత్రా పావలా? దానికీ ఏడిపించడం తెలుసు. దాన్ని పగల కొట్టడం తప్ప దానిపై వేరే ప్రతీకార చర్య తీసుకోడం సాధ్యం కాదు. తల్లడిల్లాడు; భార్యవుండుంటే నంగిగా 'రాత్రా, పగలా?' అని అరిచేవాడు. ఆమె లేకపోవడంతో అనేక అంగ వైకల్యాలతో బాధపడుతున్నాడు. ఆమె కేవలం ప్రేమించడానికి కావలసిన వ్యక్తే కాదు – నిలువెత్తు అవసరం.

వీధి గోల ఒక గంట నిద్రను నిర్మూలించింది – కొనసాగాకుండా.

అరుపులూ కేకలూ ప్రళయమొచ్చినట్టు. సృష్టించబడిన జనమంతా గుమ్మికూడినారా? ఇంట్లో భిన్నమైన వాతావరణం, చావులాంటి నిశ్శబ్దం, కేవలం ఒక మనిషి లేకపోవడం చేత. సృష్టి లోపం – ఒక మనిషి మరొక మనిషి మీద ఆధారపడకుండా జీవించలేకపోవడం. భార్య ఈ ఇంటి స్వరం, జీవం, వరం, వెలుతురూ––ఆత్మా. కేవలం కడుపులో తన్నడం చేటు తెచ్చింది. మరో జన్మ ఎత్తినట్టుంది. ఆ జన్మకూ ఈ జన్మకూ ఒకే రేఖ అడ్డు; కలకూ నిజానికి రేఖే అడ్డు.

ఊడిన లుంగీని బిగించుకుంటూ వీధి వరండా చేరాడు. ఇంటికీ బజారుకీ ఎంత సామీప్యం! అల్లకల్లోల పరిస్థితి వీధిలో. వీళ్లంతా తనను కలలో వేటాడిన వాళ్ళు కాదు. కానీ వేటాడుతున్న వాళ్ళే – జంతువుల గురించి. అడవిలాంటి విశాలమైన స్థలాన్ని చుట్టుముట్టారు. ఏదో పెన్నిధికై శోధన కూడా జరుగుతోందా? అడవిపందులకై అన్వేషణ. అవి తమ సరిహద్దు రేఖను అతిక్రమించి భీకర జనారణ్యంలోకి వచ్చాయి; వెనక్కువెళ్లే ప్రయత్నంలో మనిషి కంట బడటం మృత్యువును ఆహ్వానించినట్లయింది. చంపడంలో నాగరికత, అనాగరికతల మధ్య విభజన రేఖ ఏదీ? కలలోని వేటలో పోబోయినది తన ప్రాణం కనుక భయపడి చచ్చాడు; ఇక్కడ పోయేది పందుల ప్రాణం కనుక ధైర్యంగా వరండాలో నిలబడి వినోదం చూస్తున్నాడు. ప్రాణాలన్నీ సమానం కావొచ్చు; కొన్ని ప్రాణాలు అధిక సమానాలు.

అది ఖాళీ లేకుండా మొక్కలూ తుప్పలతో చిక్కగా ఎవరో అల్లిన అరణ్యం; దాని విస్తీర్ణం కేవలం రెండు వేల చదరపు గజాలు. అది విదేశంలో ఉన్నవాడి డాలర్లు తెచ్చిన స్థిరాస్తి. జీవం తొణికిసలాడుతోంది అక్కడ. దాంట్లో జీవాలు తలదాచుకున్నాయి అది కవచంలా వాటిని కాపాడతాయన్న ఆశతో. జీవాన్ని, జీవులనూ మట్టుపెట్టడానికి వేట సాగుతోంది. వేటగాళ్లు బ్రతికుండటానికి చేసే ప్రయత్నం కూడా అది. ఆకలి ఎవరినీ వొదలదు. వాళ్ళు పట్టువదలని విక్రమార్కులు. వాళ్లకూ, పందులకూ జరుగుతున్న దోబూచులాట; క్రూరమయినది. నిన్న మరో చోట వాటి రాకను ఆఘ్రాణించిన వేటగాళ్లు అక్కడ పట్టుకో చూడగా పారిపోయాయి; ఇక్కడ వెదికారు; దొరకలా. వాటి గమనంపై నిన్న నిద్రనుమాని నిఘా పెట్టారు. నేడూ ఇక్కడికొచ్చారు. బంగారు జింకలా ఏడిపిస్తున్నాయవి. అవి దొరికిపోవడానికి నిరాకరిస్తున్నాయి. ప్రాణాన్ని ఇచ్చెయ్యమంటే సగర్వంగా చీమ కూడా ఇవ్వదు, కరిచైనా తనను కాపాడుకోజూస్తుంది.

ఇవి సింహాచలపు భూములూ కొండలూ. అందులో జీవరాసులు కొలువున్నాయి. అదొక అడవి. జంతువుల ఆవాలం. ఇక్కడే వరాహ సింహావతారంలో సింహాచలేశుడు వెలిసాడు, రాక్షసుడిని సంహరించాడు. ఒక గీతే అడ్డుగా నాగరికత వెల్లివిరిసిందిక్కడ; వెర్రితలలేసింది. తోట దాకా ఉన్న తారురోడ్డు మీది నుంచి అప్పుడప్పుడు దారి తప్పి కొండచిలువలు, అడవిపందుల మొదలైన జీవులు దారి తప్పి వస్తుంటాయి. ఎప్పుడన్నా నక్క ఊళలు దీనంగానో, కోపంగానో వినిపిస్తాయి నాగరికత పట్ల నిరసనను వ్యక్తం చేస్తూ; వాటి చోట వాటికి  చోటు లేనందుకు. నిరసనలవల్ల వాటికి జరిగే మేలు లేదని అవి ఎరుగును.

గుమ్మికూడిన మానవ సమూహంలో అన్నివయసుల వాళ్ళు, ఆడా మగా ఉన్నారు. వాళ్లందరికీ ఆకలీ ఆశా ఉన్నాయి. వాళ్లలో గాంభీర్యత, హాస్యం, సాహసము ఉన్నాయి; ఆకలే కాక. వాళ్లదంటూ వాళ్ళ మంచితనమూ ఉంది. నాగరికతలో పేదరికం ఎరుగని నాగరీకుల మధ్య, ఎలాగో ఎలాగూ జీవించాలని ప్రయత్నం చేసే బడుగు జీవులూ ఉంటారు. పేదరికం వాళ్ళు కొని తెచ్చుకున్నది కాదు.

జంతూనాం నరజన్మ దుర్లభం అన్నాడు శంకరాచార్యుడు. అలాంటి దుర్లభమైన జన్మను చేజిక్కించుకుని సాటి జీవాలను వేటాడి చంపుతాడు నరుడు. నరుడిని వేటాడలేని జంతువులు లేవని కాదు. మనుషులవి వేటలే కాదు, ఆటలూనూ. ఒక బడితతో ఒక దెబ్బ చాలు నరుడికి భూమ్మీద నూకలు చెల్లడానికి; ఆ పని చేయడానికి ఒక మనిషి చాలు. ఆ పందులకు ఒక దెబ్బ చాలదు. జంతు మరణానికి ఒక బడితే, ఒక దెబ్బ, ఒక మనిషి చాలకపోవచ్చు జంతువుల అదృష్టం కొలదీ. జంతువులకూ అదృష్ట దురదృష్టాలు ఉంటాయి; వీళ్ళ బారి నుండి తొలిసారి తప్పించుకున్నాయి. అదృష్టం ప్రతిసారీ వరించదు. ఆ  రెండూ ఏ శక్తులో, ఎవరంపగా వొచ్చెనో! మనిషికి మోసం ఒక ఆట; అవసరం లేకపోయినా చేస్తాడు; అవి అలా కాదు. జీవించడానికి అది అవసరమైనా చేయవు లేక చేయ లేవు. ఉత్తమ జీవులు కాదని అనగలమా?

వెంగళ్రాజు ఇంటి ముందు అడవి జంతువు భయపడేలాంటి వ్యక్తి నిలబడి వేట దృశ్యాన్ని తిలకిస్తున్నాడు. తనంతటివాడు దిగవలసిన బరి కాదది అని భావిస్తున్నట్టున్నాడు. కండలు తిరగడమే కాక మీసాలు మెలివేసి ఉన్నాయి; పైగా పొదలా దట్టంగానూ ఉన్నాయి లోకం భయపడేట్టు. ఆ విగ్రహం తనను తానూ చూపించి చంపగలదు. అతని లోని జంతువులపై కసిని అతని కళ్ళలోని ఎర్ర జీరలు కావలసినంత వ్యక్తం చేస్తున్నాయి. ఆ జంతువుల ప్రాణాలను అతని పాశాలకు ఎక్కించి తెమ్మని పంపిన దూతలా వున్నాడు; కింకరుడిలా ఉన్నాడు. అతను అతని దయా హీనమైన నేత్రాలను వెంగళ్రాజు వైపు మళ్ళించాడు.

వెంగళ్రాజు ఒణికి, సృష్టి పట్ల మరోసారి అసంతృప్తిని వ్యక్తం చేసుకున్నాడు. తన భయం ఆ యమకింకరుడికి తెలిసిపోతుందేమోనని కనురెప్పలు వాల్చాడు; వొణుకును ఆపలేకపోయినా. తనకు కావలసింది పందులు కానీ మనుషులు కాదు అన్నట్టు, ఆ మనిషి వేట వైపు దృష్టిని మరల్చాడు. అతను వెంగళ్రాజుకు మహాత్ముడిలా తోచాడు. అతను అటు తిరగంగానే అతని ఉక్కు పిర్రల్లోని శక్తిని అంచనా వేయదలచినట్టు వాటిని ఒక నిమిషం చూసాడు వెంగళ్రాజు. అనాది శక్తి కరడుగట్టుందందులో. నాగరికత మనిషి సృష్టించుకున్నది. అతనికి తనకూ మధ్యగల విభజన ఆర్థికమైనదేనా మరొకటా? మానవ స్వభావం వస్తు సంబంధమైన నాగరికత మీద ఆధారపడి లేదేమో. అతను శక్తి, ధైర్యం, క్రూరత్వం, తెలివితేటలూ, ఇంగిత జ్ఞానం కలిగి ఉన్నాడు. వెంగళ్రాజు శారీరక బలహీనత, పిరికితనం, కనపడని క్రూరత్వం కలిగినవాడు. కాలం ఇరువురిదీ.

"అవసలున్నాయా, మీ ఆర్భాటమేనా?"

నోరు జారి తన తెలివితేటలూ ప్రదర్శించాడు రాజు. కాస్త గట్టిగానే నాలుక కరుచుకుని బాధపడ్డాడు. రేఖ తన పక్కన ఉంటే మందలించుండేది. ఆమె అతని కనురెప్ప; రెప్పతో కన్నుకు పేచీ ఏంటి? ఛీ, ఛీఛీ! వాళ్ళ స్వాభావిక తెలివితేటలను కౌన్కిస్కా గన్నాయిగాడు శంకించడం ఆ వ్యక్తికీ బొత్తిగా నచ్చలేదు. అతని సున్నితత్వం అతనిది. అహం "అనాగరిక" దినాలలోను ఉండుంటుంది; అహం వేరు తెలివి తేటలు వేరు. తల ఊపాడు కింకరుడు "ఉన్నాయి" అని, మాట మాధ్యమం ద్వారా సమాధానం చెప్పడం ఇష్టం లేక. వెనుదిరిగి రాజు వైపు చూసే కనీస మర్యాదను పాటించవలసిన అవసరం లేదన్నట్టు. అంతటి అవమానకరమైన మాటలు అన్నందుకు క్షమా గుణ ప్రదర్శన కూడా ఉందేమో.

అసలే ఉక్కు శరీరాన్ని ఆయుధంగా, వరంగా కలిగి ఉన్న ఆ వ్యక్తి మందను చేరితే ఏ శక్తి ప్రతిఘటించగలదు? రాజు భయపడడమే కాక విచారించాడు. ఆ వేటగాడు, రాజు నిలబడి ఉన్న దూరం పది అడుగులమేర. బడిత లక్ష్యం తప్పదు. అతని ఆరడుగుల శరీరం రోడ్డు మీద సూర్యరశ్మి పడకుండా ఆడ్డుతోంది. అతని నీడకు అతనే మద్దతుగా నిలబడినట్టుంది. అతను వెంగళ్రాజును చంప దలచుకుంటే చట్టం అతన్ని భయపెట్ట లేదు.

అరగంట తర్వాత ఒక్క పంది కూడా అక్కడ లేదని తేలిపోయింది. వెళ్ళిపోతూ కింకరుడు ఎందుకో వెంగళ్రాజు వైపు భావరహితంగా చూసాడు. "వీడిది శని నోరు" అని కావచ్చు. "అత్త మీద కోపం దుత్త మీద చూపడం వెర్రి వెంగళాయితనం అవుతుందని నీకు తెలిసినట్టు లేదు" అన్నట్టు రాజు ధైర్యాన్ని కొనుక్కు తెచ్చుకుని అతని వైపు అర క్షణం చూసి కళ్ళు దించేసాడు. వాళ్ళందరి ఆశాభంగం రాజుకు సంతోషాన్నిచ్చింది.

మరుసటి రోజూ వాళ్ళొచ్చారు పొద్దున్నే. వేటకుక్క గుణాలు వేట కుక్కలకే కాక మనుషులకూ అనాది నుంచి ఉన్నాయి. అంచేత వాళ్ళు కాపలా కాసి పందుల జాడను తెలుసుకో గలుగుతున్నారు. అతి తక్కువ సంఖ్యలో ఉన్నాపందులు అసంఖ్యాకమైన మనుషులను తప్పించుకు తిరుగుతున్నాయి. మనుష్య జాతికి వరాహ జాతి విసురుతున్నసవాలా? జాతుల పోరుగా ఆలోచన రాంగానే రాజుకు పందుల మీద ద్వేషం, సాటి మనుషుల మీద సానుభూతి మొలుచుకుని వచ్చాయి. వాటికన్నా ఘనమైన మనుష్య జాతికి పందులు లొంగిపోవడం ధర్మంగా అతను భావించాడు. తామేదో విలువైన జాతిగా అవి మొరాయించడం ఏవిటీ? దైవ నిర్ణయాలను ప్రతి జాతీ గౌరవించడం నేర్చుకోవాలి.

ఖరీదైన జంతువులవి మరియు అరుదుగా దొరికేవి. మహారాజైనా వేటాడుతాడు వాటిని; పేదరికంతో సంబంధం లేదు. శివార్జునులు పందికై పోట్లాడుకో లేదా? మనుషులను వేటాడటం కన్నా జంతువులను వేటాడటం మెరుగు కదా. రాజు కడు తార్కికుడు.

"జాగత్తరోయ్, పంది కుమ్మేయ్ గలదు, కోరలతో పీకీ గలదు. పేనం మీది కొస్తే మనిసయినా పందయినా తెగిస్తయ్," రాలిపోబోయ్యే పండుటాకు లాంటి మనిషి హెచ్చరించింది కోరమీసం యువకుడ్ని.

"పర్నేదునేయే. నే నొక్కన్ని ఈరోజు సత్తే మాయావిడికి రేపటికి ఇద్దరు."

"అయినా నిన్ను కుమ్మితే పందికే నష్టం" ఆమె అంది బోసి నోరును గుహలా తెరిచి.

ఆ యువకుడి వెనకాలే అతని అంగరక్షకుల్లాంటి మరో ముగ్గురు యువకులు మొక్కల్లోకి దూరారు.

"యాప జట్టు కింద, నేపాళం మొక్క కాడ సూదు మొక్కలు కదుల్తున్నాయి," ఒకడన్నాడు.

"గాలికిరా, నీ బొచ్చు నాగ," కోరమీసం గుసగుసలు పోయాడు; ఎందుకైనా మంచిదని జాగ్రత్తపడుతూ. బలుసాకు తిని జీవంతో ఉండొచ్చు.

"మీ రగస్సాలు మూడూళ్లకి ఇనిపిస్తాయ్, నా కొడకల్లాల. ఈ ఏట మాని గాడిదలు కాసుకోండి; అవి కరవ్వు, పొడవ్వు," ఎవరో హెచ్చరించాడు ఈ రోజూ పందులు దొరకవేమోనన్న ఆందోళనతో.

"(బూతు)...అంత గాలెక్కడుంది? బుస ఇనపన్నేదా?" మొదటి అంగరక్షకుడన్నాడు.

"సివాచాలం గాడి బుసది; పందిది కాదు," తనకు  వినికిడి శక్తి తక్కువ అని అన్న సింహాచలం మీద కసి తీర్చుకుంటూ, అన్నాడు క్షతగాత్రుడు.

"బుస కొట్టడాకి అది పావా ?" సింహాచలం అన్నాడు.

"ఓరయ్యా ఆసికాలకన్నా లేరా!"

"అది పంది బుస కాకపోతే దైన్యంగా ఆడికిపో," మొదటి అంగరక్షకుడు కోరమీసానికి సవాల్ విసిరాడు.

"నీయి పాము సెవులని వొప్పుకున్నాలే. నీ మాటేందుకు కాదనాల; సుట్టుముట్టుదాం రండి," మనసు మార్చుకున్న కోరమీసం అంది. ముగ్గురికి మాత్రమే వినపడేట్టు; పందులకు వినపడకుండా జాగ్రత్త తీసుకుంటూ.

"మూడింటిని సూసాముగా, సుట్టుముట్టడాకి నలుగురం సరిపోతామా?" శల్యుడి లాంటి మొదటి వాడన్నాడు.

"నీవి పావు సెవులే కాదు నీది పావు నాలుక కూడారా!" విసుగ్గా కోరమీసం అంది.

"మూడూ సెట్టపట్టా లేసుకుని ఒకే సోట తొంగుంటాయ్ రా, నువ్వు మీ ఆవిడతో తొంగున్నట్టు?" రెండో అంగరక్షకుడన్నాడు.

"పెగరీ గోడ సుట్టూ మనోళ్ళున్నారు కాదా; మనం వొగ్గేసినా ఆలు ఒగ్గుతారా," వినికిడి సరిగా లేని మనిషి అన్నాడు.

"మొన్నేం జరిగింది? అప్పన్న గాడు సావబో లేదా? అందరి మీదికీ ఎగిరి ఒక పంది రెక్కలొచ్చినట్టు పోలేదా?" శల్యుడన్నాడు..

"పిరికిగొడ్లకు పందులేటకెందుకోయ్. ఇంట్లో కూరో నారో తరుక్కోక?" కోరమీసం అంది.

"మొన్న మొన్నే ఈ దినం ఈ దినమే, సావో రేవో తేలిపోవాలా," శల్యుడన్నాడు తెగించి.

"దూరంగా భయంభయంగా నిలబడ్డాడే, కిష్టిగాడితో కలుపుకుని అయిదుగురం పాండవుల్లా," సింహాచలం అన్నాడు.

"పాండవులు ఏట కెల్లలా అర్జునుడొక్కడే," కోరమీసం అంది.

"మనం తప్పుకుని కోరమీసం గాడిని ఎటాడమంటే, ఆడొక్క దెబ్బతో పందుల్ని సావనూకుతాడు," శల్యుడన్నాడు.

"నోళ్లు మూసుకోకపోతే మీ ముగ్గుర్ని ఒక్క దెబ్బతో సంపుత,"  కోరమీసం అన్నాడు.

"మీ యవ్వ కూడా వొచ్చినాది కాదా, ఒక పందిని ఒడిసి పట్టుకుంటాది; నేదా గుహ లాటి నోరు తెరిసి దాన్ని మూసేస్తాది," ఒక అంగరక్షకుడన్నాడు.

గుహ ముసలామె హాయిగా తీయగా నవ్వింది, పంది మాంసం ఒండి వేడిగా వెండి పళ్లెంలో ఒడ్డించినట్టు. నాలుక రుచి మాత్రమే ఎరుగు, భయమెరుగదు.

"ఎంతమంది ...గాళ్లుంటేనేం ...గను దండగ. మొన్ననే అయిపోవాల్సిన పని."

ఆ మాటలను నోట్లో పెట్టుకో గూడనిది పెట్టుకున్నట్టు, మింగ కూడనిది మింగినట్లు, చూడ కూడనిది చూసినట్టు, అనకూడనిది అన్నట్లు మొహం పెట్టి అన్నాడు అతను.

"నూకరాజు గాడు బూతు నేందే మాట్టాడడు, అది నేందే ముద్దా మింగడు, దాని గురింసి మాట్టాడతాడు. బూతాట్టాకే బువ్వ తింటాకే నోరు తెరిసేది," ఒలంగా ఉన్న మధ్య వయసు స్త్రీ అనింది ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"ఆడికో పెళ్యాం, మద్దిల్లాంటి ఇద్దరు ముండలున్నా బూతులాడందే దురద తీరదు," మొదటామెకు అక్కలా ఉన్న మరో ఆమె చేదు తిన్నట్టు దూరానికి ఊస్తూ  అన్నది.

ఆ మాటలకు నోటితో కిసుక్కుమని చేత్తో ఆమెను భుజం మీద చరిచింది అభినందిస్తున్నట్టు పదారేళ్ళ పిల్ల.

అడవి పందిని చూపుడు వేలుతో మోది చంపేయగలిగిన శక్తిమంతురాల్లా కనిపిస్తున్న ఒక స్త్రీకి ఓపిక నశించింది. యావత్ మగతనం మీదే నమ్మకమూ అడుగంటింది, అర్జునుడి సామర్థ్యం మీద నమ్మిక నశించి తానే భీష్ముడిని మట్టుపెట్ట తలపెట్టిన శ్రీకృష్ణుడిలా. గోచీని తొడల పైకి బిగించి ఒక కుర్రాడిచేతి నుంచి బలవంతాన బడితను లాక్కొని బరిలోకి దిగింది.

ఏదో అలికిడయింది. అప్రమత్తమయ్యారు. ఊపిర్లు బిగబట్టబడ్డాయి. ఆశ నూనె వేసిన మంటలా ఉన్నట్టుండి ఎగిసింది.

"ఒరల్లుడూ నూకరాజూ, మొన్నేమంచం బట్టి కోలుకున్నవ్ కాదా! జాగర్త," చొప్పి దవడలామె పరిస్థితి తీవ్రతను గమనించకుండా  అరిచింది ఆందోళనతో – పంది మాంసంకన్నామానవ జీవితం విలువైనదని గ్రహించిన జ్ఞానిలా, మానవతావాదిలా.

"నూకరాజు కాపాడుకోవలసిన అంగమొకటుంది; దానిమీద ఆదార్పడ్డ మనిసుంది కాబట్టి," ఎవరో దగ్గుతూ అన్నారు.

"పనై పోనీ నిన్నక్కడే తంతా," నూకరాజు పళ్ళు బిగించి గస పెడుతూ అన్నాడు.

"పంది ఎక్కడ  పీకినా మిగతా ఇసయాల సంగతటుంసి డాక్టర్ ఎన్కట సామి మిగిలిన ముక్క తీసేడాకి ముందు మన బొడ్లో సేయడతాడు; మల్లీ పిల్లా నీదు జిల్లా నీదు," అజ్ఞాత వ్యక్తి అన్నాడు అనుభవ పూర్వకంగా.

"మరీ ఎక్కువ వొంగోక పంది ముఖం పీకే గలదు," మగతనానికి సవాల్ విసిరిందన్న కోపంతో ఒక ముందు పన్నులేని యువకుడు కసిగా అన్నాడు.

"గూబెలాగుంది? గేదెలు కాసి కాసి మతి సెడ్డట్టుంది,"  బడితె ఎత్తి, కళ్ళు పెద్దవి చేసి అనింది.

"నీ సేతిలో సచ్చినా సుకమే," అన్నాడతను మైకం కమ్మినట్టు.

తన పురుషత్వానికి కళంకం అన్నట్టు "గంగయ్య దొరా, గంగయ్య దొరా" అని ఒక బలమైన యువకుడ్ని పిలిచాడు. గంగన్న గతంలో పోలీసులు వేసుకుంటూ వచ్చిన పొట్టి లాగులో ఉన్నాడు.

"దొరనూ కాదు, రాజునూ  కాదు; అందుకే పని కోసం ఊరంతా తిరుగుతున్నా."

"బామ్మరిది వొరస కాదేట్రా నాకు, నీకు అప్పసెల్లెల్లు లేక పోయిన? ఆ సెట్టెక్కు పందులు వాటి అమ్మలూ కనిపిస్తాయి," చుట్టముక్కను పారేస్తూ అన్నాడతను.

"నీకు ఆలోసిన ఎక్కవ, బావా. అందుకే నీ జుట్టంతా రాలిపోయింది," అంటూ చెట్టెక్కాడతను.

ప్రహరీ మీద గడ్డం ఆనించి, "కనిపిస్తన్నాయా?" అడిగాడు జుట్టు రాలిపోయినాయన.

"నీదు."

"అల్లా కొమ్మదగ్గిరికిరా."

"వచ్చా.'

"కనిపిస్తన్నాయా?"

"నీదు, బావా!"

"గుడ్నాకొడకా, సరిగ్గా సూడు."

"అక్కడేముంది?  నీ రాలిపోయిన బొచ్చు, ఆకులూ అలములూ; గోడ కాడ సెంబులా నీ బట్టతల."

"నాకు మాతరం మూడు కనిపిస్తన్నాయ్ లే. ఆడ్నే ఉండి గమనించు. దిగకా," ఆదేశించాడు బావ మరిదిని.

మరో బృందం గుండాయన నేతృత్వంలో రంగంలోకి దిగి మొక్కలను జల్లెడ పట్టటం మొదలుపెట్టింది.

కాలకృత్యాలు ముగించుకుని వరండాలో కుర్చీ వేసుకుని కాలి మీద కాలేసుకుని ఉత్కంఠతో చూడటం ఆరంభించాడు వెంగళ్రాజు. లోపలకు వెళ్ళేటప్పుడు, లోక కళ్యాణం గురించి పందులు ఆత్మ బలిదానం చేయాలని ఆశించాడు. అలా జరగనందుకు ఆశ్చర్యపడ్డాడు.

మొక్కల్లో దాగి దాగి విసిగిందా, ఆగ్రహం ఒచ్చిందా, ఎదుర్కొనడమే మేలైన స్వీయ రక్షణా వ్యూహం అని భావించిందా, వీరమరణం మెరుగైనదన్ననిర్ణయానికొచ్చిందా? వీరమరణం మెట్లెక్కి స్వర్గం చేరితే అక్కడ ఇంతకన్నా ఎక్కువ భద్రతున్న, మనుష్య జాతి లేని అడవిలో జీవించొచ్చు.

ఒక పంది మొక్కల్లోనుంచి పైకి గెంతేసింది.

ఒంగున్న ఆడ మనిషి సాహసే కాక ఆమెకు వరంలా డేగ కళ్ళూ ఉన్నాయి. ఆమే చూపు పంది నైనా ఎగరేసుకు పోగలను అన్నట్టుగాను, ఆమె మనసు పొతే నా ప్రాణమేగా అన్న తెగింపుతోనూ ఉంది. రెండు చేతులతో బడిసెను ఎత్తి మోదింది;బడిశె మీద, పంది మీద జన్మజన్మాలుగా పగున్నట్టు. బలమైన దెబ్బ తగిలినా అది లొంగ లేదు. వజ్రాయుధపు దెబ్బైన బతకుతానన్నట్టుంది. ఆమెను చూసి చొంగ కార్చిన వాడు ఆమె పక్కన ఆనుకుని తన కర్రతో ఒక దెబ్బ వేసాడు. పంది వెల్లకిలా పడింది. ఆమె పదేపదే కొట్టింది జీవితం మీదున్న కసిని కూడా సాయం తెచ్చుకుని. అది వీర మరణం పాలవుతోంది. జీవం ఎర్రటి ద్రవంగా మారినట్లు రక్తం నోటినుంచి కారి భూమిలోకి ఇంకిపోతోంది. తెరిచిన నోటిలో కోరలూ పళ్ళు కనిపిస్తున్నాయి. తనపక్కన నిలబడి సాయం చేసినాయన్నుఆదరంగా చూసిందామె రెండు క్షణాలు. అనాది మనిషైనా, నేటి మనిషైనా పరాక్రమాన్నిలింగ భేదం లేకుండా ఆరాధిస్తాడు.

ఒక ప్రాణిని మరొక ప్రాణి బతకనీయక పోవడం దురన్యాయం కాదా అన్నప్రశ్నకు సమాధానం అనాది నుంచి నేటికీ వేధించేది. దేముదున్నాడని గాఢంగా నమ్మితే అలాంటి ప్రశ్నలు అంతగా వేధించవు.

రెండు పందులు మొక్కలగుండా, మనుషుల గుండా దూసుకెళ్లాయి దేవుడిచ్చిన అదనపు శక్తితో. వాటి వేగం మెరుపుది, ధ్వనిది. హూంకరించాయి తప్పించుకుపోవుటో, మరణించడమో ప్రత్యామ్నాయాలని తెలుసు అంటున్నట్టు.

రెండింటిలో ఒక పంది కింకరుడి కాలు పీకి తప్పించుకుంది, మొదలు నరికిన మానులా ఒరిగి పోయాడు. అతని శక్తి అతన్ని రక్షించలేక పోయింది. గావు కేక పెట్టాడు. రెండోది కోరమీసం కుర్రాడి మోకాలును గుద్దింది; ఎముక విరిగింది చొప్పదంటులా. పగ కూడా తోడై జనమంతా వాటి వెనుకపడ్డారు. అవి ఇప్పుడు తిండి మాత్తమే కాదు శత్రువులు కూడా. వెక్కిరిస్తున్నట్టు తోక ఆడిస్తూ అవి జంటగా దూసుకు పోతున్నాయి. బడిశలు విసిరారు, అంతకు ముందే అయిన గాయంతో ఒక పంది వెనుక భాగం ఎర్రగా వుంది. దానికి మందులేదు; భరించక తప్పని బాధ, మానేంత వరకూ.

తొలి పంది మరణించడానికి నిరాకరిస్తోంది బతికి ఏమి పావుకుందామనో. రక్తం కారుతూనే ఉంది జీవధారలా. నోరు తెరుచుకుని ఉంది. క్రూరత్వాన్ని చూపించ వలసిన కోరలు, పళ్ళూ బాధను వ్యక్తం చేస్తున్నాయి. భాష ఎరుగని నాలుక మూలగడానికి కూడా ఉపయోగ పడ్డట్టు లేదు. కళ్ళు మాత్రం మూతపడున్నాయి వాటి మీద బరువు మోపినట్టు; తెరవడానికి వీలు లేనట్టు; దుర్మార్గాన్ని చూడ నిరాకరిస్తూ. ఏదో ప్రార్థన చేస్తోందా? ఒంటరిగా చావబోతోంది అంతమంది మనుషుల మధ్య. ప్రాణం పోయేటప్పుడు మాత్రం ఏ జాతిలోనైనా ఏ జీవికి ఆ జీవీ; చావడానికి తోడుండదు.

ఆ బీభత్సం చూస్తున్న వెంగళ్రాజుకు తల తిరుగుతోంది; మూర్ఛకు దారితీసేట్లుంది. భార్య తోడు కూడా లేకుండా ఒంటరిగా చస్తాడా? ఆమె ఒళ్ళో తల పెట్టుకోవాలనుంది.

ఎంత అనాగరికం! నాగరికత కేవలం ఆచ్ఛాదన అనాగరికత మీద. అలా కాదన్నా, ఆ రెండూ ఎప్పటికీ సహజీవనం చేస్తూండేవే విభజన రేఖ లేకుండా.

జీవించడానికి తోడు అవసరం కనుక తన కన్నీటితో ఆమె పాదాలు కడిగైన వెళ్లి తెచ్చుకో దలచాడు.

రేఖ వస్తుందా?

***

**కథ వెనుక కథ**

ఒక ధనికుడు కొని, పాతికేళ్ళపాటు వదిలేసిన మా ఇంటి ముందున్నపెద్ద స్థలం ఇరవై రెండేళ్లకు పైగా 'పిచ్చి' మొక్కలతో పొదలతో, చెట్లతో నిండి పోయింది. [ఈ మధ్యే దాంట్లో అపార్టుమెంటు కట్టారు వాళ్లే.] అది చిన్నపాటి అడవి అనుకుని, ఒక సారి అడవిపందులు వచ్చి వేటగాళ్ల నుండి తమను రక్షించుకోడానికి దాంట్లో తలదాచుకునే విఫల యత్నం చేశాయి. పాతిక మంది జనం పిల్లా పాపలతో కలిసి వచ్చారు వాటిని పట్టుకోవాలని, వీలు లేకపోతే తుదముట్టించాలని. ఆ వేట రెండు రోజులు కొంత సమయం పాటు జరిగింది. 'నాగరిక' ప్రపంచంలోని ఆ అనాగరిక పద్ధతిని, మనిషిని పీడించే దారిద్రియాన్ని[ఆటవిక దశలో అది లేదు!], అది తెచ్చే తెగువను అలా చూడటం నన్ను కలవరపరిచింది. 'నాగరిక' మానవ ప్రవృత్తిలోనూ ఆటవిక తత్వం కొనసాగుతుండటం మనకు కొత్తగా తెలిసిన విషయం కాదు. నాగరికుల మనుకునే వాళ్లలోని ఆటవిక మనస్తత్వాన్నీ, జంతువుల వేటనూ ఒకదాంట్లోకి మరొక దానిని అల్లి - అనాగరికత, నాగరికత సహజీవనం సాగించడం మీద ఎప్పుడు చాతనైతే అప్పుడు కథ వ్రాయాలనుకుని పదేళ్లనాడు తొలి ప్రయత్నం చేశాను. రచన సంతృప్తికరంగా లేకపోవడం వలన అనేక సార్లు దాన్ని దిద్దటం, మార్చడం చేసి; అది సంతృప్తికరంగానే ఉందనిపించడం వలన పోటీకి పంపాను. సరైన న్యాయ నిర్ణేతలను 'కౌముది' వారు నియమించడం వలన, పరీక్షలో ఆ కథ ఉత్తీర్ణమయి నా శ్రమకు తగిన సంతోషాన్నిచ్చింది.

'కౌముది' కి, పిడపర్తి వెంకటరమణ శర్మ గారి కుటుంబ సభ్యులకు, విజ్ఞులయిన న్యాయనిర్ణేతలకు ధన్యవాదాలు.

ఐసింగ్ ఆన్ ది కేక్ [icing on the cake] ఏమిటంటే నవంబర్ ఒకటో తారీఖున కిరణ్ ప్రభ గారు మాకు వ్యక్తిగత పరిచయం లేకపోయినా పొద్దునే ఫోన్ చేసి విషయం చెప్పి నాతో వివరంగా మాట్లాడటం. ఆయన స్వతహాగా కవి; 'టాక్ షో' , 'కౌముది' ద్వారా సాహిత్యసేవ చేస్తున్నారు; శ్రమైకజీవి, రసహృదయుడు. గొప్ప వ్యక్తిత్వం కల

మనిషికూడా. ఈ సందర్భాన్ని ఆ విషయాలు చెప్పడానికి వినియోగించుకోకపోతే తప్పు చేసిన వాడినవుతాను. మంచి ఎక్కడున్నా పంచుకోకపోతే, 'మంచియన్నది' పెంచుకోడం సాధ్యం కాదు.

## విచిత్రవ్యక్తి — పి. చంద్రశేఖర అజాద్

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

**ఈ వార్త ఎలా బద్దలయిందో తెలియదు.**

శ్రీనివాసరావు ఇంటిమీద ఇన్‌కం టాక్స్ వారు రెయిడ్ చేసారంట.

నిప్పులేనిదే పొగరాదు అని మన పెద్దలు చెప్పారు. అవన్నీ నిన్నటి సామెతలు. ఇది ఆధునిక ప్రపంచం. అందులోనూ గ్రాఫిక్స్ మాయాజాలం, సినిమాలనే కాదు ప్రపంచాన్ని ఏదో వైరస్‌లా చుట్టేసిన కాలం. వైరస్‌లన్నీ ఒకటి కాదు. కొన్ని మాత్రమే ప్రపంచం నాలుగు దిక్కులకూ పాకిపోతుంటాయి. అందుకే గ్రాఫిక్స్ కూడా వైరస్ లే అనే అనుమానం జనాలకు వచ్చేసింది. అందులోనూ వర్చువల్ రియాలిటీ అని వచ్చింది.

నువ్వు ఇల్లు కట్టుకుంటావు. అది నీ మిత్రులకు చూపిస్తావు. అందులోనూ గృహప్రవేశానికి ఏర్పాట్లు చేసుకుంటావు. అప్పుడెవడో ఇది ఇల్లుకాదు గ్రాఫిక్ అంటాడు. నిజమా అని పదిమంది అడుగుతారు నీకు అనుమానం వస్తుంది. నాది ఇల్లా? గ్రాఫిక్సా అని.

అప్పుడు నీకు నిన్నటి కథ గుర్తురాదు. ఒకాయన మేకని పెంచుకుని, దాన్ని అవసరాలకు అమ్ముకుందామని తీసుకుపోతున్నాడు. అప్పుడొకాయన ఎదురుపడి "ఇదేంటి మాస్టారూ కుక్కని తీసుకుపోతున్నారు?" అంటాడు. అప్పుడా మనిషిని పురుగుని చూసినట్లు చూస్తాడు. వీడికి మేకకీ, కుక్కకీ తేడా తెలీదు. ఇలాంటి వాళ్ళని మార్చటం మన వల్లకాదు అనుకుని ముందుకు సాగుతాడు. దారి మలుపులో, రచ్చబండకివతల, పొలిమేరల్లో మరో ముగ్గురు "ఇదేంటి

పంతులుగారూ కుక్క తోకని పట్టుకుని గోదారిని ఈదబోతున్నారు?" అంటారు. రెండోసారి అనుమానం, మూడోసారి ఆందోళన, నాలుగోసారి ఇది కుక్కే అన్న కన్‌ఫర్‌మేషన్ చేసుకుని దాన్ని వదిలేసి పోతే నలుగురూ దాన్ని కోసి బిర్యానీ వండుకుంటారు.

ఇంత కథ చెప్పటానికి శ్రీనివాసరావు కారణం అని మనవి చేసుకుంటున్నాను. అతను గొప్ప ఇంటలెక్చువల్ అని కొందరూ, పరాన్న జీవి అని మరికొందరూ ముద్దుగా పిలుచుకుంటారు. మేధావులు పారసైట్లు కాకూడదనేం లేదు. ఇదేమాట శ్రీనివాసరావుతో 'ఫలానా' వాళ్ళు నిన్ను పరాన్న జీవి అంటున్నారని మోసేసినా చిద్విలాసంగా నవ్వి "అది వారి అభిప్రాయం. ప్రజాస్వామ్యంలో ఇలాంటివన్నీ భరించాలి. ఈ లోకంలో పరాన్నబుక్కుకాని వాడిని ఒక్కడ్ని చూపించు" అన్నాడని అందుకు కొన్ని ఉదంతాలు కూడా చెప్పాడని అంటారు.

అందుకని ఏ మాత్రం బిడియపడటం అనే లక్షణం అతని జీన్స్‌లోనే లేదని మిత్రులు ఈ నిర్ణయానికి రావటం జరిగింది. అలాంటి అమాయకజీవి మీద (మేధావిత్వం వేరు – అమాయకత్వం వేరు అని మనవి) ఐ.టి దాడులు జరగటం ఏమిటి? వారిమీద మరో రకం దాడులు జరుగుతుంటాయి కదా అనుకున్న వారు ఎక్కువ.

ముందు ఈ వార్తని కన్‌ఫాం చేసుకుందామని శ్రీనివాసరావుకి ఫోన్ చేయాలనుకున్న వారు కూడా భయపడిపోయారు. ఎందుకంటే ఇప్పుడు మర్డర్లు జరిగినా, మాన భంగాలు జరిగినా మొత్తం వాళ్ళ ఫోన్లను ట్రాప్ చేస్తున్నారు. కాల్ డేటాలో సంభాషణల్ని విశ్లేషిస్తున్నారని అందరికీ తెలిసిపోయింది.

ముందుగా మీకు శ్రీనివాసరావు గురించి కాస్త చెప్పాలి. అలాంటి బడుగు జీవి మీద ఇన్‌కం టాక్స్ వారి దాడి వెనక కారణాలను తెలుసుకోకపోతే ఈ ప్రమాదం కనీసం అరవై కోట్లమంది మీదయినా పడుతుంది కాబట్టి. అందులో మీరూ, నేనూ వున్నా ఆశ్చర్యం లేదు.

***శ్రీనివాసరావు కథ***

అంటే – వారి జీవిత గాధను మొత్తం మీ ముందు పాడటం కాదు. నాకు కూడా అతని గురించి పూర్తి అవగాహన లేదు. నాకూ మిగతా వారిలా ఎవరి ద్వారానో పరిచయం అయ్యాడు. తర్వాత అతని గురించి ఇతర మిత్రులు మాట్లాడు కోవటం విన్నాను. అతని మిత్రబృందంలో నేను కూడా వున్నాను. అతని మిత్ర బృందంలో నేను కూడా వున్నాను అనుకోవటానికి నేను కనిపించినప్పుడల్లా చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించటం, ఎప్పుడన్నా ఓ సారి మా ప్రాంతాలకు వచ్చినప్పుడు ఫోన్ చేస్తుండటం కారణాలు.

అతను ఓ విభిన్నమైన మనిషి. ఈ లోకంలో అనేక బృందాలు పనిచేస్తుంటాయి. అంటే మీకు ఇంకో రకమైన ఆలోచనలు రావచ్చు "ఏ బృందాలు, ఏం పని?" అంటా. నా ఉద్దేశం ఒకటే. స్నేహంలో బృందాలుంటాయి. వయసుని బట్టి వుంటాయి. కులం, మతం, ప్రాంతం ఇలా కొన్ని అభిమానాలూ, దురభిమానాలూ వుంటాయి. అలాగే ఈ లోకంలో

జెండర్ సమస్యలు వుంటాయి. అందులో ఆడ, మగ గేలు, లెస్బియన్స్, ట్రాన్స్ జెండర్లూ వుంటారు. వారందరికీ రకరకాల సమస్యలుంటాయి. వారు అలా బృందాలుగా కలిసి పనిచేయటానికి ఓ తాత్విక సిద్ధాంతం వుంటుంది. దానికి తగినట్లుగానే వారు రకరకాల యుద్ధాలు చేస్తుంటారు. ఈ విషయం అందరికి తెలుసు.

శ్రీనివాసరావు మాత్రం వీటికి అతీతుడు. అతను అందరి మనిషి. ఎవరినీ నొప్పించక, తానొవ్వక అన్నట్లు ప్రవర్తిస్తుంటాడు. "ఎవరినీ నొప్పించడా?" అని ఎవరన్నా దబాయిస్తే నేను వినయంగా చెప్పగలిగేదేమిటంటే అది మాటల వరకు పరిమితం.

ఇప్పుడు మనం నడుస్తుంటాం గాలి పీలుస్తుంటాం. మంచి నీళ్ళు లేదా మందు తాగుతుంటాం. భోంచేస్తుంటాం. అప్పుడు మనకు తెలియకుండా అనేక సూక్ష్మ జీవుల్ని పరలోకం పంపిస్తుంటాం.

ఆ రకంగా ఎవరో ఒకరిని నొప్పించకుండా వుండటం అనేది ఈ సృష్టిలో ఎవరికీ సాధ్యం కాదు. పర్వతాలున్నాయి. వృక్షాలు వున్నాయి. అవి కదలవు. అయితే చెట్లుకి ఉరి తీసుకునే మనుషులుంటారు. కొండలూ, పర్వతాల మీదకు ఎక్కి అక్కడ నుండి దూకే వారుంటారు. ఆ నేరం వాటిది కాదు కదా.

అయితే శ్రీనివాసరావు కొంత మందిని ఖచ్చితంగా నొప్పిస్తాడు. అందులోనూ మొహమాటం వున్న వారిని, మర్యాదస్థుల్ని. "మీరు టీ తాగుదామా?" అంటారు మిమ్మల్ని స్నేహితులు కలిసినప్పుడు మర్యాదకి. అది సాయంకాలం అయితే "ఈ సమయంలో టీ ఏంటి బ్రదర్?... సరదాగా బీరు తాగుదాం. లేదంటే రెండు పెగ్గులు పుచ్చుకుందాం" అంటాడు శ్రీనివాసరావు. ఆ మర్యాదని కూడా పాటిస్తే "నాకు స్కాచ్ అంటే ఇష్టం. అందులో నాకు జీడిపప్పులంటే ప్రాణం" అంటాడు. మంచింగ్‌లకి ఇంకేం బాగుంటాయో వాటి గురించి ఏమాత్రం సిగ్గుపడకుండా అడుగుతాడు. అది టీ గాని, కాఫీగాని, భోజనం మాత్రగాని, ఏదయినా సరే ఎదుటివారి పర్స్ బరువుని అంచనా వేయడు. తన కోరిక బరువునే ప్రకటిస్తాడు. అందుకే కొంతమంది శ్రీనివాసరావుని చూడగానే దూరంగా పారిపోతారు. ఇంకొందరు "సారీ బ్రదర్.. నా దగ్గర డబ్బులు లేవు" అని నిర్మొహమాటంగా చెబుతారు.

ఎల్లకాలం అందరూ అన్ని సమయాల్లో మోసపోరు కదా. మొహమాటాలకు లొంగరు కదా.

ఇప్పుడు కాస్త వెనక్కి వెళ్దాం. శ్రీనివాసరావుకి స్వంత అభిప్రాయాలు చాలా వున్నాయి. అయితే అతనికి ఎవరితో విభేదాలుండవు. అందరిలో దాతృత్వం మాత్రం చూస్తాడు. ఇంటి నుండి బయటకు అడుగుపెట్టిన క్షణం నుండి మళ్ళీ ఇంటికి చేరే దాకా తన జేబు నుండి రూపాయి కూడా ఖర్చు కాకూడదు. తనని లోకం కోసం భగవంతుడు పుట్టించాడు. భగవంతుడికి రోజూ పూజలు చేసి ప్రసాదాలు పెట్టినట్లు తనకూ పెట్టాలి. ఇతను కోరికలు తీర్చే దేవుడు కాదు భోక్త మాత్రమే.

*శ్రీనివాసరావు ప్రత్యేక లక్షణాలు*

ఇతను మనతో హోటల్‌కి వస్తాడు. మనం ఇడ్లీనో, దోసెనో తింటాం. శ్రీనివాసరావు అలా చేస్తూనే ఆ హోటల్‌ని పరిశీలిస్తాడు. "అక్కడ ఎంతమంది జనం వున్నారు? ఒక్కొక్కరు ఎంత కనీస బిల్లు కడుతున్నారు? ఇడ్లీ తయారీకి ఎంత ఖర్చు అవుతుంది? అందులో హోటల్ వాడికి ఎంత లాభం వస్తుంది?" అనేది క్షణాల్లో లెక్కగడతాడు.

అలాగే బజ్జీల బండివాడు, ఇంట్లో పని చేసే స్వీపర్, హాస్పటల్స్‌లో రోగాలకు వాడే మందుల నుండి ఒక్క మాటలో అణువు నుండి అణ్వాయుధం వరకు ఏ విషయం అతని మెదడులోకి ప్రవేశించినా చకచకా మీటలు కదులుతాయి. అతనో కంప్యూటర్.

"ఇన్ని రకాల టాలెంట్స్ వుండి కూడా స్వయంగా సంపాదించుకోవచ్చు కదా!" అని మీకు అనుమానం వస్తుంది. అప్పుచేసి పప్పుకూడు తినమంటారు. అప్పుచేయకుండా సంపాదించి తినకూడదా.

అదంతే లైఫ్ స్టయిల్. కొంతమంది అలాగే బిహేవ్ చేస్తుంటారు. లేకపోతే ప్రపంచంలో ఇంత వైవిధ్యం ఎందుకుంటుంది?

అలాగే శ్రీనివాసరావుకి ఆధ్యాత్మికత నుంచి విప్లవం వరకు తెలియని విషయం వుండదు కదా. అతను ఎందుకని రుషిలా వుండడు. ఇంత మందితో ఇన్ని మాటలు పడుతూ కూడా జీవన విధానాన్ని ఎందుకు మార్చుకోకూడదు. అసలు కోరికలే కదా అన్ని అనర్థాలకు మూలం. ఇవి తెలిసీ ఎందుకిలా అని మీకు అనిపిస్తే మీరు రుషులవుతారు. అతను కాడు. మనుషులకి అనేక రూపాల్లో ఆనందం దొరుకుతుంటుంది. ఎవరి ఆనందాలు వారివి. ఒక్కొక్కరు ఒక్కో అవతారం దాలుస్తుంటారు. ఇతనూ అలాంటి ఓ మహా పురుషుడు అనుకోవాలి.

శ్రీనివాసరావు అంతకు ముందు ఉద్యోగం చేసాడు. మధ్యలో రాజీనామా చేసాడు. ప్రభుత్వం వారు పెన్షన్ యిస్తారు. ఎందుకు చివరి దాకా ఉద్యోగం చేయలేదు అనేది మాత్రం అతనికి మాత్రమే తెలిసిన నిజం. దాని గురించి మాట్లాడడు. శ్రీనివాసరావుకి కూడా రహస్యాలుంటాయి అనుకోవటం కంటే అతనికి రహస్యాలు మాత్రమే వుంటాయి అనుకోవటం బెటర్.

*మరో కోణం*

శ్రీనివాసరావు మీద ఐ.టి దాడుల వెనక ఈ కోణానికే ఎక్కువ అవకాశం వుందని నా వ్యక్తిగత భావన. ఇప్పటివరకు మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, అలానే ఎగువ మధ్య తరగతి ఇలాంటివి ప్రస్తావించుకున్నాం.

శ్రీనివాసరావు సర్కిల్ చాలా పెద్దది.

అందులో కాంట్రాక్టర్లు, కోటీశ్వరులు, సినిమా వారు, పరిశ్రమలు పెట్టినవారు, ఇలా చాలామందున్నారు. అలాంటి వారందరికీ శ్రీనివాసరావు కార్లు పంపిస్తారు. మళ్ళీ ఇంటి దగ్గర దింపుతారు. మధ్యలో స్కాచ్ పార్టీలుంటాయి. అక్కడ మనవాడు వారితో మాట్లాడతాడు. అవును. అతని సంభాషణల కోసమే వారు పిలుస్తారు. అలాంటి వారందరినీ బాగా ఎంటర్‌టైన్ చేస్తాడు. అతని మాటల ప్రవాహంలో వారి ఆస్థులు, అంతస్థులు, అహాలు, ఇంకా సవాలక్ష సంపదలు దిగుదుడుపే

అలాగే వారికి వ్యాపార రీత్యానో, ఇతరేతర వ్యక్తిగత అభిరుచుల వల్లనో ప్రయాణాలు చేయవలసి వస్తుంది. అప్పుడు వారి దృష్టికి వచ్చేది శ్రీనివాసరావునే. అలాగే భూములు కొనాలన్నా, రాజభవనాలు కొనాలన్నా శ్రీనివాసరావు సలహాలు తప్పకుండా తీసుకుంటారు. అతనికి భవిష్యత్ తెలుసు. అలా అని అతను జ్యోతిష్కుడు కాదు. వాస్తు చూడడు. రంగు రాళ్ళు అమ్మడు. దేశంలోని ప్రధాన నగరాలన్నీ శ్రీనివాసరావు వారితో పాటు విమానాల్లో, నౌకల్లో, ఖరీదయిన కార్లలో చుట్టేసాడు.

ఇప్పుడు ఐ.టీ దాడుల వెనక అసలు సిసలు కారణం ఇదే అని నా అనుమానం. అతను బయటకు తన బాధల గురించి మాత్రమే చెబుతాడు. వినే వారందరికీ విసుగు, చిరాకు, కోపం కూడా వస్తాయి.

"మనకెందుకు ఆ దరిద్రాలన్నీ, మనం ఆర్చగలమా తీర్చగలమా? ఎవడికి కష్టాలులేవు. రోగాలు లేవు" అని తిట్టుకుంటారు.

ఇందుకు కూడా కారణం వుంది. కొంతమంది ఎదుటి వారు అప్పు అడుగుతారని ఇలాంటి కథలు చెబుతుంటారు. అయినా శ్రీనివాసరావు కోటీశ్వరుడని తెలిసినా ఎవరూ పది రూపాయలు కావాలని అడగరని నాకు తెలుసు.

శ్రీనివాసరావు చెప్పని విషయం ఒకటుంది.

అది అతను కొంత మందికి బినామీ.

ఇది నా ఊహ మాత్రమే సుమా.

అతని మీద ఐ.టీ దాడికి, దీనికీ లింకు వుంది. అంతేకాదు ముందు అనుకున్నట్టు కోటీశ్వరుల్లో, బిజినెస్ పీపుల్లోనూ బృందాలు వుంటాయి. శ్రీనివాసరావు ఎప్పుడూ ఓ పక్కన వుండడు కాబట్టి కొంతమందికి కడుపు మంట వుంటుంది. వీడు మన మందు తాగి, మన తిండి తిని, మన రహస్యాలను ఎదుటివారికి చేరవేస్తున్నాడని.

అందుకని శ్రీనివాసరావు మీద నిఘా పెట్టి వుంటారు. అతనికి తెలియకుండా అతని చరిత్ర తవ్వి తీసి వుంటారు. ఇన్‌కంటాక్స్ వారికి ఉప్పు అందించి వుంటారు. అందుకని ఈ దాడి జరిగింది. కాకపోతే ఇలాంటి దాడులు జరిగినప్పుడు పత్రికల్లోనూ, టీ.వీల్లోనూ వార్తలు వస్తాయి. ఇన్ని పత్రాలు దొరికాయి, లక్షల్లో డబ్బు దొరికింది, బంగారం, వజ్రాలు దొరికాయి అని కథనాలు వస్తాయి. అలాంటివి లేకపోవటం వలన మాత్రమే ఇన్ని అనుమానాలూ, సందేహాలు.

ఓసారి నేను శ్రీనివాసరావు ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది ఓ మిత్రుడితో. రెండు వందల గజాల్లో చిన్న ఇల్లు. అదీ ముప్పై సంవత్సరాల నాటిది. అప్పుడు బలవంతం మీద టీ తీసుకు వచ్చాడు. అది నోట్లో పెట్టగానే తుప్పుకున వూసేయబోయాను. అంత దరిద్రమైన టీ నేనెప్పుడూ తాగలేదు. అందులో మేకపాలున్నాయో ఇంకేమున్నాయో తెలియదు.

ఇది చెప్పటానికి రెండు కారణాలు. ఒకటి శ్రీనివాసరావు బయటకు వచ్చినప్పుడు యిచ్చే బిల్డప్. అయిదు నక్షత్రాల హోటల్స్‌లో మాత్రమే తాగే వాడిలా కబుర్లు. ఇంట్లో చూస్తే ఇదీ పరిస్థితి. ఇంత పేదగా వున్న, బతుకుతున్న శ్రీనివాసరావు మీద ఇలాంటి దాడి అనుచితమే.

ఇక్కడ నాకు అర్థం అయింది. *ఒకటే మనం ఇతరుల జీవితాల్లోకి తొంగి చూడటం మొదలుపెడితే ఇతరులు కూడా అదే పని చేస్తారు.*

*ఏమయినా ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతంగా సమాధి అవదు. కాస్త ఆలశ్యం అవుతుంది. ఎలాంటి రహస్యం అయినా ఏదొక రోజు బయటపడి తీరవలసిందే.* అందుకే సైలెంట్గా మిగతా వారిలా నేనూ ఎదురు చూస్తున్నాను.

మొదటిసారి శ్రీనివాసరావుని నాకు పరిచయం చేసిన మిత్రుడు మధుని కలుసుకున్నాను. శ్రీనివాసరావు విషయం ప్రస్తావించాను. అతను ఆశ్చర్యపోయాడు.

"ఈ విషయం నాకు తెలియదు. అయినా ఇలాంటి దాడులు దేశంలో ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. అందులో శ్రీనివాసరావులు వుండవచ్చు. దీనికి ఎందుకు కంగారు పడాలి. అయినా మన పక్కనే టెర్రరిస్టులుంటారు. రెండు మూడు సంవత్సరాలు అద్దె ఇంటిలో కార్యక్రమాలు చేస్తుంటారు. వాళ్ళు పట్టుబడేదాకా మనకి తెలియదు. అంటే మనం మనుషులతో సంబంధాలు పెట్టుకోవటం మానేసాం. మొగుడూ పెళ్ళాలు, పిల్లలు, ఇంతవరకు తీసుకుందాం. మనందరం హాయిగా మాట్లాడుకుని ఎన్ని రోజులవుతుంది? ఈ విషయం గురించి ఎప్పుడయినా ఆలోచించామా?" అన్నాడు సీరియస్‌గా.

"మనందరి గురించి శ్రీనివాసరావు ఆలోచిస్తాడు కదా!"

"అయితే?"

నేను మాట్లాడలేకపోయాను.

"అతను ఆలోచిస్తాడు. ఒప్పుకుంటాను. అందులో మనుషులకి ఉపయోగపడేవి వుంటాయా? వాడికి ఇంత జీవితం వస్తుంది. భార్య సంపాదిస్తుంది. ఇళ్ళు, భూములున్నాయి. ఇలా తనకు తెలిసిన వారిని, తెలియని వారి గురించి కూడా మాట్లాడుతుంటాడు."

"తెలియని వారంటే?"

"సినిమా వారు. క్రికెటర్లు, రాజకీయ నాయకులు. ఒక్కో మాటలో సెలబ్రిటీలు అన దగ్గ ప్రతివారినీ. దీని వల్ల వచ్చే లాభం ఏమిటి? ఇదో మేనియా అని నీకు అనిపించటం లేదా? అసలు ఈ లోకం గాసిప్స్‌తో నడుస్తుంటుంది. మనుషులు మంచి పుస్తకాలు చదివి ఆనందించరు. మంచి పాట, సంగీతం, నాటకం, సినిమా ఇలాంటివి ఏవీ అవసరం లేదు. మురికి రాజకీయాలు, స్త్రీ, పురుషుల మధ్య శృంగారాలు – ఇవా!? ఇవా మనకు కావలసింది. ఇదంతా ట్రాష్. ఐయాం సారీ శ్రీనివాసరావుని నీకు పరిచయం చేసినందుకు నేను సిగ్గుపడుతున్నాను మధూ" అన్నాను.

"నాకు కాదు. ఈ సమాజానికి మనసూ, హృదయం రెండూ మృగ్యం అవుతున్నాయి. మనం శ్రీనివాసరావు గురించి మాట్లాడుకుంటున్నాం. ఇలాంటి శ్రీనివాసరావులు అడుగడుగునా వున్నారు. ఒక్కొక్కడిది ఒక్కో కోణం. నాకు ఇప్పుడనాలనిపిస్తోంది. మీరెవరూ ఈ సమాజాన్ని, మనుషుల్ని విశ్లేషించనవసరంలేదు. ఎవరి బతుకు వారిని బతకనీయండి. ఎవరి చావుని వారు చావనివ్వండి అని."

"నువ్వు అందరినీ ఒకే గాటినకడుతున్నావు మధూ."

"అవి నీకు అనిపిస్తే అది నా దురదృష్టం శివా. ఈ లోకంలో అనేక మంది మంచివాళ్ళున్నారు. వారు తమ బతుకు తాము బతుకుతూ ఇతరులకు ఉపయోగ పడుతున్నారు. అలాంటి వారు వార్తల్లో వుండరు. అందుకు మనం అనుభవిస్తున్నాం. ఇది నా అభిప్రాయం" అన్నాడు గంభీరంగా.

తర్వాత నా ముఖంలోని భావాలను అర్థం చేసుకున్నట్లు అనిపించాడు."ఇలాంటి వ్యక్తులతో మనకు స్నేహం వుంది కదా అని నువ్వు అంటావు ఉంటుంది. మన జీవిత ప్రయాణంలో అనేక సందర్భాల్లో అనేకమంది కలుస్తారు. పరిచయం అవుతుంది. అది స్నేహంగా మారుతుంది. అంతదాకా ఎందుకు? మనం పెళ్ళి చేసుకుంటాం. దానికి ముందు ఒకరికొకరం పరిచయం అయివుండం. నిజానికి పెళ్ళి స్నేహంతో మొదలవుతుంది. ప్రేమించి కలిసి బతికేవారి గురించి నేను మాట్లాడటం లేదు. భార్యాభర్తల అభిప్రాయాలన్నీ ఒకేలా వుండవు. అంత మాత్రాన స్నేహాన్ని కాదనుకోలేం. ఒకరి నొకరు మార్చుకునే ప్రయత్నం చేస్తాం. అలాంటిది నేను కూడా శ్రీనివాసరావు విషయంలో చేసాను. కొన్ని ప్రశ్నలు అడిగాను. తన జీవన విధానాన్ని మార్చుకోవడానికి అతను ఇష్టపడలేదు. అందుకని నేను అతన్ని పట్టించుకోవటం మానేశాను. అంతకు మించి తగాదా పడటం ఎందుకు? ఎప్పుడన్నా కనిపిస్తే జస్ట్ మర్యాద పూర్వకమైన పలకరింపు. అంతే. ప్రతిరోజూ పక్క పక్కన వుండే వారితో వ్యవహరించే పద్ధతి వేరుగా వుంటుంది కదా" అన్నాడు.

"అవును" అన్నాను.

నాకు ఏదో అర్థం అవుతున్నట్లు అనిపించింది. మనల్ని మనం మార్చుకోవాల్సిన అవసరం నాకు తెలుస్తోంది. మధు అన్నట్లు ప్రపంచంలో చిన్నవో, పెద్దవో లోపాలున్నాయని అందరినీ బహిష్కరించుకుంటూ పోలేం కదా అనుకున్నాను.

నేను మీకు ఓ కథ చెప్పటం మొదలు పెట్టాను. మధ్యలో నాకు జ్ఞానోదయం కల్గిందని కథ అసంపూర్ణంగా వదిలేయటం మంచిది కాదు. అలాగని శ్రీనివాసరావు విషయంలో మీకు ఎంత ఉత్కంఠ వుందో, నాకూ అంతే ఉంది. అందుకే నేను శ్రీనివాసరావు గురించి మరికొందరితో ప్రస్తావించాను.

"ఈ మధ్య కనిపించటంలేదు. అసలు నగరంలో వున్నాడో లేడో కూడా తెలియటం లేదు" అన్నారు.

అలాంటి సమయంలో నాకే అనిపించింది. ఇంత ఉత్కంఠ వున్నప్పుడు ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు? నేను స్వయంగా వెళ్ళి చూసిరావచ్చు. అక్కడకు వెళ్ళినంత మాత్రాన ఇన్‌కంటాక్స్ వారు నన్ను ఏం చేయగలరు. అంతగా మా ఇంటికి వచ్చినంత మాత్రాన వారికి మా దగ్గర ఏం దొరుకుతుంది. రానీయండి నిజంగా మా మీద వాళ్ళు రెయిడ్ చేస్తే ఈ రోజుల్లో అది కూడా పాపులర్ అవుతుంది. మన దగ్గర డబ్బు చాలావుంది అనుకుంటారు. అప్పులు ఇవ్వటానికి కూడా జనం ముందుకు వస్తారు అనుకున్నాను.

అయితే శ్రీనివాసరావు ఇల్లు చాలా దూరం. ఈ ట్రాఫిక్‌ని ఈదుకుంటూ వెళ్ళిరావటానికి ఓ పూట పడుతుంది. అయినా తప్పదు అని వెళ్ళాను. ఇంటికి తాళం కప్ప వేలాడుతూ కనిపించింది. నిరాశ కలిగింది. పక్కన ఇంకో ఇల్లు ఉంది. ఎదురుగా మరొకటి వుంది. వారిని అడగాలా వద్దా అనుకుని భయం భయంగా వెళ్ళాను ఎదురింటికి.

చిన్న గేటు వుంది. అక్కడ బెల్ ఉంటుందేమోనని చూసాను. కనిపించలేదు. గేటు తీసుకుని లోపలకు వెళ్ళాను. తలుపు మూసి ఉంది. బజర్ కనిపిస్తే నొక్కాను మూడు నిమిషాల తర్వాత తెరుచుకుంది. చాలా సీరియస్‌గా వున్న ఓ పురుషుడి ముఖం కనిపించింది.

"ఎవరు మీరు?" అన్నాడు.

"నేను శ్రీనివాసరావుగారి ఫ్రెండ్‌ని"

"అయితే?"

"ఇంటికి తాళం వేసి వుంది. ఎక్కడికి వెళ్ళారో మీకు ఏమైనా తెలుసేమో కనుక్కుందామని" అన్నానో లేదో

"వాళ్ళు ఆ విషయం మమ్మల్ని అడగమని బోర్డు పెట్టారా?"

నిర్ఘాంతపోయాను.

"మాకు కీస్ ఇచ్చి వెళ్ళారు. ఇవ్వమంటారా? లోపల వున్నవన్నీ ఊడ్చుకుపోతావా? వ్యాన్ కూడా తీసుకొస్తావా?"

"అదేంటి సార్ అలా మాట్లాడతారు?" అన్నాను.

"లేకపోతే ఏంటయ్యా? కలవటానికి వచ్చే ముందు ఫోన్ చెయ్యవా? ఇంట్లో లేరు. అందుకని ఈ కాలనీ వాళ్ళందరినీ హింసిస్తావా? మాకు ఇదే పని అనుకున్నావా? గుడికిపోతారు. ఊర్లకు పోతారు. అవన్నీ అందరికీ చెప్పి

వెళ్తారా? ఇలాంటి వాళ్ళు ఈ మధ్య తయారయ్యారు. రెక్కీ అనుకుంటా. నన్ను అడిగితే అడిగావు. ఈ చుట్టుపక్కల ఎవర్నీ అడక్కు. నేను మర్యాదగా చెప్పా. మిగతా వాళ్ళు అలా వుండరు. గేటు వేసి వెళ్ళు" అని గద్దించాడు.

సర్రున కోపం వచ్చింది. అయినా ఏం చేయగలను. ఇది మా ఏరియా కాదు. రెక్కీ అంటున్నాడు. అంటే ఇంతకు ముందు ఇన్‌కంటాక్స్ వారు కాకపోయినా పోలీసులో, దొంగలో వచ్చి వుండాలి అనుకుంటూ వెనక్కి తిరిగి గేటు జాగ్రత్తగా వేసి బయటపడ్డాను.

ఇంకొకరిని అడగాలంటే భయం అనిపించింది. అందులోనూ ఎదురింటాయన 'మర్యాద' మరి మరీ గుర్తొస్తోంది.

నగరంలో మానవ సంబంధాలు ఎంత సుందరంగా తయారయ్యాయో మరోసారి అనుభవంలోకి వచ్చింది. అంతలోనే ఎలాంటి బృందాలు లేని శ్రీనివాసరావుని కూడా శత్రువుల లిస్టులోకి చేర్చారు అనుకుంటే మాత్రం కాస్త బాధ కలిగింది.

"చేసిన పరిశోధన చాలుగాని ఇంక పద" అని మనసు హెచ్చరించింది.

ఈసారి వైఫల్యం ఎదురయినా నాకు బుద్ధి రాలేదు. మనుషుల సహజాతాలు అలానే ఉంటాయి కదండి. పోయిన చోట వెతుక్కోమని చెబుతుంటారు. అది పేకాట కావచ్చు, మరొకటి కావచ్చు. అలాగే ప్రతి అపజయము రేపటి విజయానికి సోపానం అని కూడా అంటారు.

అందుకని నేను నా శ్రీమతితో బాధని పంచుకున్నాను. అప్పటికే నేను శ్రీనివాసరావు ఫోన్ కోసం ప్రయత్నం చేసాను. నాలుగయిదు సార్లు ఈ ఫోన్ పని చేయటంలేదు అని వచ్చింది. అప్పుడప్పుడు ఇలానే వస్తుంటుంది కనెక్షన్లు ఎక్కువ అయిపోయి ట్రాఫిక్ పెరటం వలన రికార్డెడ్ మెసేజ్‌లు కూడా తారుమారు అవుతున్నాయి.

మన దేశంలో జనాభానే కాదు సెల్ ఫోన్లూ పెరిగిపోతున్నాయి. ఒక్క తిండికే ప్రత్యామ్నాయాలు దొరికి చావటంలేదు.

"ఏవండీ వాళ్ళు తీర్థయాత్రలకు వెళ్ళివుండచ్చు. లేదంటే ఈ సిటీ నుండి వెళ్ళిపోయి వుండవచ్చు. ఆ ఇంటిని అమ్మేసి ఇంకో ప్రాంతానికి మారవచ్చు. ఆ ఇంటి వాస్తు బాగుండకపోవచ్చు. ఏదయినా జరగవచ్చు. మీరు అనవసరంగా రావుగారి గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నారు అది మానుకుంటే మాకూ మీకూ కూడా మంచిది" అని సున్నితంగా హెచ్చరించింది.

ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. మనం రెండుచోట్లా విఫలం అయ్యాం. అయినా నేను చివరి ప్రయత్నంగా నా మిత్రుడయిన ఓ రచయితతో ఈ అనుభవం పంచుకున్నాను.

"శివగారూ ఇంక మీరు ఈ విషయం గురించి మరిచిపోండి. అది నాకు వదిలేయండి. నేను చూసుకుంటాను" అన్నాడు.

శ్రీనివాసరావుతో మా రచయిత మిత్రుడికి పరిచయం లేదు.

వారం రోజుల తర్వాత నన్ను పిలిచి ఓ పార్క్‌కి తీసుకుపోయాడు. అప్పుడు నా చేతిలో ఓ కాగితాల సెట్టు వుంచి చదవండి అన్నాడు.

"ఇదేంటి?" అన్నాను అనుమానంగా.

"మీ శ్రీనివాసరావు కథ" అన్నాడు.

అప్పుడు చదవటం మొదలు పెట్టాను.

అర్ధరాత్రి..

అంతకుముందే మిస్టర్ రావ్‌ని ఖరీదయిన ఓ కారు ఇంటిముందు డ్రాప్ చేసి వెళ్ళింది. అప్పటికి రావుగారి బొజ్జలో మూడు పెగ్గుల స్కాచ్ – ఇతర పదార్ధాలు అటూ ఇటూ కదులుతున్నాయి – అరగాలా వద్దా అని. తలుపులు తీసిన రావుగారి శ్రీమతి ముక్కు మూసుకుని "తాగొచ్చారా?" అంది.

"తిని కూడా వచ్చాను" అన్నాడు.

"మీరు మాత్రం బాగానే భోంచేసి వస్తారు. ఇంట్లో వారి గురించి మాత్రం ఆలోచించరు" అంది.

"ఎవరన్నా భోజనాలకు పిలిస్తే ఇంటిల్లిపాదినీ తీసుకు వెళ్తాను కదా. ఇది ప్రైవేట్ పార్టీ. అక్కడికి కొత్త వ్యక్తులు వచ్చారు. అందులో ఒకాయన గృహప్రవేశం చేస్తున్నారు. మన కుటుంబాన్ని కూడా ఆహ్వానించారు. అది ఇల్లు కాదు ప్యాలస్" అన్నాడు.

"అప్పుడే చూశారా?"

"విన్నాను. అతనికి మొత్తం ఎంత ఆస్తి వుంటుందో తెలుసా?" అంటున్నాడు. అదే సమయంలో బయట ఏదో వెహికల్ ఆగిన శబ్దం వినిపించింది. రెండు నిముషాల తర్వాత తలుపు మీద చప్పుడయింది.

"బజర్ నొక్కవచ్చుకదా?" అన్నాడు.

"అది పని చేయటంలేదు" అంది.

కాస్త తూలుతూ వెళ్ళి తలుపు తీసాడు.

"అయ్యగారు మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు" అన్నాడతను.

"ఇప్పుడా?" అన్నాడు.

"అవసరం అలాంటిది"

"అయిదు నిముషాలాగు" అన్నాడు. తర్వాత కారు బయలుదేరింది. ఓ భవనం దగ్గర ఆగింది.

శ్రీనివాసరావు లోపలకు వెళ్ళేటప్పటికి అక్కడ నలుగురు వ్యక్తులున్నారు.

"ఇతను శ్రీనివాసరావు. అందరం శ్రీ.రా. అని పిలుచుకుంటాం" అని అతని ఫ్రెండ్ పరిచయం చేసాడు.

ఆ తర్వాత వారు కొన్ని ప్రశ్నలు అడగటం మొదలు పెట్టారు.

శ్రీనివాసరావు తన ఫ్రెండ్‌కేసి చూసాడు.

అతను చెప్పమన్నట్లు తలూపాడు. అప్పుడు శ్రీనివాసరావు మాట్లాడాడు.

"మీరు అడుగుతున్న వివరాలను రహస్యంగా వుంచుతారా?" అన్నది మొదటి ప్రశ్న.

వారు 'వుంచుతాం ' అన్నారు.

"వాళ్ళు అందరూ నా మిత్రులు. అయితే వారి ఆస్తుల గురించి, అప్పుల గురించి నాకు ఎప్పుడూ చెప్పరు. మాటల మధ్యలో కొన్ని దొర్లుతుంటాయి. అవన్నీ రేపు మీకు చట్టపరంగా చెల్లకపోవచ్చు" ఇది రెండవ అనుమానం.

"అవన్నీ మాకు వదిలేయండి. మేం చూసుకుంటాం."

"సరే. నేను వారికి బంధువుని కాదు. ఇతరేతర సంబంధాలు, వ్యాపారాలు మాకు లేవు. అప్పుడప్పుడు నన్ను సమావేశాలకు పిలుస్తారు. ముఖ్యంగా విదేశీ మద్యం – స్త్రీల గురించి అడుగుతుంటారు. వారి అనుభవాలు చెబుతుంటారు కొందరు. ఇంకొంతమంది నన్ను వివిధ ప్రాంతాలకు తీసుకుపోతుంటారు. నాకూ చాలా కోరికలు వున్నాయి. అలా నా అవసరం వారికి వుంది. వారి అవసరం నాకుంది. దీన్ని స్నేహం అంటారో, అవసరాల పరిచయాలు అంటారో మీ ఇష్టం. నేను కేవలం నా తృప్తికోసం కొన్నిటిని పరిశీలిస్తాను."

"మీ పరిశీలన మాకు కావాలి."

అప్పుడు చెప్పడం మొదలు పెట్టాడు. వాళ్ళంతా కూడా ముగ్ధులయ్యారు. “ఇకనుంచి మాలాంటి వారి దగ్గరకు మీరు రావాలి. మా ఆతిధ్యం మీరు స్వీకరించాలి. మా కోసం మీరు సమయం కేటాయించాలి” అని విన్నవించుకున్నారు. శ్రీనివాసరావు కూడా వినయంగా అందుకు అంగీకారం తెలిపాడు.

అయితే అందులో ఓ వ్యక్తి మాత్రం శ్రీనివాసరావుని నిశ్శబ్దంగా గమనిస్తున్నాడు. అది శ్రీనివాసరావు దృష్టిని దాటిపోలేదు.

"ఏంటి సార్? నన్ను అలా చూస్తున్నారు" అన్నాడు.

"నేను మిమ్మల్ని చూడటం లేదు. మీలోని దేశభక్తిని చూస్తున్నాను" అన్నాడు. అప్పుడు రావుకి అనుమానం వచ్చింది. నా గురించి ఇంతగా పాపులర్ అయిందా? 'దే ' అంటే దేహి అనా 'దేదే ' అనా అనుకున్నాడు.

"మీ కాంప్లిమెంట్‌కి ధన్యవాదాలు" అన్నాడు శ్రీనివాసరావు.

"ఇది కాంప్లిమెంట్ కాదు. వాస్తవం. మీరు ఈ దేశానికి చేయవలసింది చాలా వుంది. మనం ఇప్పుడు ఓ ముఖ్యమైన ప్రాంతానికి వెళ్తున్నాం" అన్నాడు.

"కొంపతీసి మీరు నన్ను ఎన్‌కౌంటర్ చేయరు కదా?" అన్నాడు రావు. ఒక్కసారిగా అక్కడ నిశ్శబ్దం. అందరూ ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నారు.

"మీరు అలా ఎందుకు అనుకున్నారో తెలియదు. వ్యక్తిగతంగా నేను బాధపడుతున్నాను. మిమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయాలంటే అంత దూరం తీసుకు వెళ్ళాల్సిన అవసరం లేదు. అసలు మీరు 'మిస్' అయారని ఈ ప్రపంచానికి కూడా తెలీయదు" అన్నాడు మామూలుగానే. అయినా అందులో ఏదో కఠినత్వం వుందనిపించింది రావుకి.

"నేను సరదాగా అన్నాను" అని శ్రీ నవ్వాడు.

"మనం వెంటనే బయలుదేరాలి"

"ఇప్పటికిప్పుడంటే కష్టం కదండి"

"దాని గురించి కూడా ఆలోచించాను. మీరు మీ కుటుంబానికి చెప్పాలి అంటారు. ఇప్పుడు మనం మీ ఇంటి దగ్గరకు వెళ్తున్నాం. ఇంట్లో మీరు మీ వాళ్ళకి వీడ్కోలు చెబుతారు. ఎలాంటి లగేజ్ తీసుకురానవసరంలేదు. ఇంట్లో మీరు లేకుండా వుండటం కష్టం అని మాకు తెలుసు. అందుకని మీ అందరికి మేం ఓ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. మీ ఇంటిల్లపాది ఈ దేశంలో చూడాలనుకున్న ప్రాంతాలన్నీ చూడవచ్చు"

"మధ్యలో అడుగుతున్నందుకు క్షమించండి. మనం తిరిగి రావటానికి ఎన్ని రోజులుపడుతుంది?"

"రోజులు కాదు. నెలలు కావచ్చు. అందుకని మీ ఇంటికి తాళం వేయండి. మీ వాళ్ళకు ఎప్పుడు ఇది చాలు అనిపిస్తే అప్పుడు వస్తారు. అంతదాకా మీ ఇంటి మీద నిఘా వుంటుంది. అంతేకాదు నేను అనుకున్నది జరిగితే మీరు ఈ నగరంలోనే వుండకపోవచ్చు. గొప్ప భవిష్యత్ మీ కోసం ఎదురు చూస్తోంది. నేను అంతవరకు చెప్పగలను" అన్నాడు.

వెంటనే కార్లు బయలుదేరి అతని ఇంటి ముందు ఆగాయి. రావు లోపలికి వెళ్ళాడు. అప్పుడు ఆ డిపార్ట్‌మెంట్ కి చెందిన వారు మాట్లాడుకున్నారు.

"మనలో ఎవ్వరూ కూడా రావు ముందు మాట్లాడకూడదు. మాకు అవసరం అయిన ప్రశ్నల గురించే అడగాలి. మనం ఏం మాట్లాడినా అతను మన సంపాదనల మీద, ఆస్తుల మీద ఓ అంచనాకి రాగలడు. అది మనకూ అంత మంచిది కాదు."

అరగంటలో మళ్ళీ కార్లు ముందుకు కదిలి వెళ్ళిపోయాయి.

అదేదో ల్యాబ్‌లా వుంది. అక్కడ కాస్త హడావుడి కనిపించింది.

శ్రీనివాసరావు ఓ బెడ్ మీద పడుకుని వున్నాడు. అతని తలకి ఓ ప్రత్యేకమైన మెషిన్ తగిలించి వుంది. అందులో నుండి పక్కనున్న మానిటర్‌లో సిగ్నల్స్ కదిలి వెళ్తున్నాయి. చూడటానికి ఐ.సి.యూలో నిరంతరం పర్యవేక్షణలో వున్న ప్రమాదకర రోగిలా కనిపిస్తున్నాడు. అవి అతని హృదయ తరంగాలా, మెదడు వైబ్రేషన్సా అనేది మామూలు జనానికి అర్థం కావటం లేదు.

అలా ఓ వారం రోజులపాటు రావు మీద పరిశోధనలు జరిగాయి. ఈ మధ్య కాలంలో కొందరు విద్యార్థులు – అలాగే సైంటిస్టులు కూడా రావ్‌ని చూడటానికి వచ్చారు. అందులోనూ విద్యార్థులు నూతన పరిశోధనలు చేస్తున్నవారు. కొత్త కొత్త వాటిని ఆవిష్కరిస్తున్నారు.

అలాంటి వారు సమావేశం అయ్యారు.

"నిస్సందేహంగా శ్రీనివాసరావు ఓ ప్రత్యేక వ్యక్తి. ఇది మెదడు కాదు. మినీ కంప్యూటర్‌కి ఎక్కువ. సూపర్ కంప్యూటర్‌కి తక్కువ. ఇక్కడ కొన్నివేల మందికి చెందిన సమాచారం ఫీడ్ అయివుంది. అందులో రోజు కూలీల నుండి మల్టీ మిలీయనీర్ల వరకు వారి ఆస్తులు – సంపాదనలు – అభిరుచుల సమాచారం వుంది. ఇన్ని కోట్ల మంది ప్రజల గురించి వివరాలు తెలియాలంటే గ్రామానికి లేదా మండలానికి ఇద్దరు శ్రీనివాసరావులను తయారుచేసుకుంటే చాలు ఉగ్రవాదులు, తీవ్రవాదులు, పన్నులు కట్టనివారు, బినామీలు, ఇంకా అన్ని రకాల అవినీతికి పాల్పడే వారు మాత్రమే కాక అతనికి పరిచయం వున్న మంచి వాళ్ళ వివరాలు దొరుకుతాయి. అవన్నీ చిప్స్ రూపంలో మనం భద్రపరుచుకోవచ్చు. అలాగే మానవ మస్కిష్కం మీద ప్రయోగాలు చేయటానికి శ్రీనివాసరావు తలని జాతికి అంకితం చేయాలి. దానికిముందు రాజకీయ పరంగా ఓ నిర్ణయం తీసుకోవాలి."

ఇదీ వారి అబ్జర్వేషన్ సారాంశం.

అప్పటికప్పుడు హాట్‌లైన్స్ మీద చర్చలు జరిగాయి.

"ప్రతిపక్షాల వారి మీద శ్రీనివాసరావుని ప్రయోగించాలి. వాళ్ళ అన్ని రహస్యాలను మన గుప్పెట్లో వుంచుకుని శాశ్వతంగా మనం అధికారంలో వుండాలి" అని అధికార పార్టీలో కొందరి అభిప్రాయం.

"ఇది భస్మాసుర హస్తంలాంటి ప్రయోగం. ఇలాంటివన్నీ లీక్ అవుతాయి. అయినా మనకు తెలియని రహస్యాలు ఏమున్నాయి? మనం తలుచుకుంటే రెండురోజుల్లో సమాజాన్ని మొత్తం ప్రక్షాళన చేయవచ్చు. ఈ దేశంలో ఇప్పటివరకు ఎంతమందికి శిక్షలు పడ్డాయి" అని గొణుక్కున్నవారున్నారు.

అప్పటికప్పుడు రావుగారి బ్రెయిన్ గురించిన పరిశోధనలు మొదలయ్యాయి. యువకులు ఉత్సాహంగా పని చేస్తున్నారు. వారిలో సరికొత్త ఆలోచనలు వెల్లువలా వస్తున్నాయి. అతని ఆలోచనలను విశ్లేషిస్తుంటే కాస్త భయంగానూ

వుంది. మనుషుల్లో ఇన్ని రకాల ప్రపంచాలు వుంటాయా? ఆరడుగుల మనిషిలోనే ఇంత వైవిధ్యం, ఇన్ని వైరుధ్యాలుంటే ఈ సృష్టిని గురించి తెలుసుకోవటం సాధ్యమా?

శ్రీనివాసరావు గురించి ప్రపంచానికి చెందిన గూఢచారి సంస్థలకూ ఉప్పు అందింది. భారతదేశం మరో సంచలనం సృష్టించబోతోంది. ఇప్పటికే అక్కడ పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు, ఉపనిషత్తుల లాంటి అపార సంపద వుంది. వాటి నుండి ప్రపంచం చాలా స్వంతం చేసుకుంది. నిజంగానే అక్కడి గుళ్ళల్లో, సముద్రాల్లో, పర్వతాల మధ్య భూమి పొరల్లో ట్రిలియన్స్ కొలదీ సంపద వుంది. అవన్నీ వారు వెలికి తీయగలిగితే భారత్ సూపర్ పవర్ అవుతుంది. దీన్నుండి మనం మన 'అగ్ర' కిరీటాన్ని కాపాడు కోవాలి అనుకున్నారు.

ఈలోగానే కొంతమంది యువకులు ఒకటి రెండు ఆవిష్కరణలను చేసారు. ఇప్పుడు శ్రీనివాసరావు మెదడులోని సమస్త సమాచారాన్ని ఓ చిప్‌లోకి ఎక్కించారు. అతని నిన్నటి జ్ఞాపకాలన్నీ ఎరేజ్ అయ్యాయి. ఇప్పుడు సరికొత్త చిప్‌ని ఇన్‌స్టాల్ చేస్తున్నారు. దాని ప్రకారం రావుని ఓ చోట వుంచరు. ముందు భూమ్మీద తర్వాత అంతరిక్షంలోకి పంపిస్తారు. విశ్వ రహస్యాలను కనుక్కుంటారు.

అంటే ఇప్పుడు శ్రీనివాసరావు అస్తిత్వం మారిపోయింది. అతను భార్యాబిడ్డలను కూడా మరిచిపోయాడు. అతనూ – అతని మెదడు ఓ ప్రయోగశాలగా మారిపోయింది. రేపటినుండి ఎన్ని అద్భుతాలు ప్రపంచం ముందుకు వస్తాయో తెలియదు.

**ఉపసంహారం**

క్లుప్తంగా శ్రీనివాసరావు కథ ఇది.

దీనికి కొనసాగింపు చాలా వుంది. ప్రపంచంలోని అగ్ర, ఉగ్ర రాజ్యాలు అతన్ని కిడ్నాప్ చేయటానికి, అది సాధ్యం కాకుంటే చంపేయటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

హాలీవుడ్ – వరల్డ్ సినిమా వారు సరికొత్త సైంటిఫిక్ ఫిక్షన్ సినిమాలను బిలియన్ డాలర్స్ ఖర్చుపెట్టి తీయబోతున్నారు.

కవులు, రచయితలు కవిత్వాలు – కథలు – నవలలు రాస్తున్నారు. కాకపోతే ఇవన్నీ అనుభవించటానికి శ్రీనివాసరావుకి అవకాశంలేదు. అతను ఓ విచిత్ర వ్యక్తిగా చరిత్రలో అజ్ఞాతంగా మిగలనున్నాడు.

**ఇదండి కథ.**

ఇదంతా చదివాక నాకు అనిపించిందొకటే. అనవసరమైన విషయాలను కెలకకూడదు. అప్పుడే మనుషులు ప్రశాంతంగా బతుకుతారు. మిమ్మల్ని అంగీకరించమని నేను అనటంలేదు. ఎవరి ఆలోచనల్ని, ఎవరి పనుల్ని, ఎవరు నియంత్రించగలరు?

అందుకని ఇలాంటి అంశాన్ని మీ ముందుకు తీసుకు వచ్చినందుకు నన్ను క్షమించగలిగితే క్షమించమని ప్రార్థన.

# లచ్చిమి

సోమ సుధేష్ణ

"నీకు రాజుల కథ వినాలనుందా లేక మనలాగ మాములుగా ఉండే ఒక అమ్మాయి కథ వినాలనుందా?" సన్నగా దగ్గుతున్న సౌరబ్ కు నీళ్ళ బాటిల్ అందిస్తూ అడిగింది లచ్చిమి.

"నాకు అమ్మాయి కథే కావాలి. ఆ అమ్మాయి, నేను ఫ్రెండ్సు ఆవుతాము."

రెండు గుక్కల నీళ్ళు తాగి బాటిల్ లచ్చిమి చేతికిస్తూ అన్నాడు సౌరబ్. కథ వినడం కోసం

ఆత్రుతతో ఆ ఎనిదేళ్ళ బాలుడి చెవులు ఆమె చుట్టూ పరుచు కున్నాయి. విప్పారిన వదనంతో లచ్చిమి మొహం వేపు చూస్తున్నాడు. యార్కు హాస్పిటల్ లో చిల్రన్స్అమ్కాలజి డివిజన్ చాలా పెద్దది. అక్కడ ఒక రూములో పెద్దగా ఉన్న హాస్పిటల్ బెడ్ పై ఒక పక్క ఉన్న దిండు దగ్గరగా రెండు కాళ్ళు ముడుచుకుని కూచున్న సౌరబ్ ను చూస్తూంటే లచ్చిమికి తన చిన్న నాడు తన చుట్టూ పరుచుకున్న ఈ పెద్ద ప్రపంచంలో ఒక పక్కగా ఒదిగి పోయి జీవించడం గుర్తుకు వచ్చింది.

అంతలో నర్సు వచ్చి సౌరబ్ నాడి, జ్వరం చూసి క్లిప్ బోర్డుపై రాసింది.

"మార్గరెట్ నాకు కుకీస్ కావాలి." సౌరబ్ బెడ్ పై మోకాళ్ళ మీద కూర్చుని నర్సును అడిగాడు.

"కుకీస్ ఇప్పుడు కాదు, ఆకలిగా ఉందా? కాసేపట్లో నీకు డిన్నరు ఇస్తారు."

"మార్జ్ ఒక్కటి ఇవ్వు." లచ్చిమి అంది.

"యూ నో ద రూల్స్. కుకీస్ తింటే డిన్నరు సరిగ్గా తినడు. అసలే సౌరబ్ కు అపెటైట్ సరిగ్గా లేదు. సరిపడా ప్రోటీన్ లేకపోతె యూ నో." మార్జ్ కు సౌరబ్ అంటే ఇష్టం.

లచ్చిమి ఒక పేపరు తీసుకుని దానిపై 'నేను ఒక కుకీ సౌరబ్ కు బాకీ ఉన్నాను.' అని రాసి అది సౌరబ్ చేతికిచ్చి,

"నీ హెల్త్ బాగవగానే నేను నీ బాకీ తీరుస్తాను. ప్రామిస్." అంది.

సౌరబ్ గర్వంగా ఆ కాగితాన్ని తీసుకుని జాగ్రత్తగా దిండు కింద పెట్టుకున్నాడు.

మార్జ్ అన్న మాట నిజమే. కాస్త బలమైన ఫుడ్ తింటేనే లుకీమియా ట్రీట్ మెంట్ కు సౌరబ్ శరీరం తట్టుకోగలదు.

ఒకసారి మార్గరెట్ అద్దేకున్న ఎఫెయన్సీ అపార్టుమెంటు సీలింగ్ లీక్ అయ్యింది. ఆ రాత్రి వచ్చి పక్క అపార్ట్ మెంటులో ఉంటున్న లచ్చిమి డోర్ బెల్ నొక్కింది. లచ్చిమి పరిస్థితి విని తన గదిలో ఉన్న బెడ్ కం సోఫా మీద పడుకోమంది. మార్గరెట్ ఆ రాత్రే కాదు సీలింగ్ ఫిక్స్ చేసే వరకు ఒక వారం లచ్చిమి దగ్గరే ఉంది. తర్వాత తన ఎఫిష్యన్సీలోకి మారింది. లచ్చిమి వండుకునే ఇండియన్ ఫుడ్ తిని ఒక రెండు రోజులు ఇబ్బంది పడింది కాని ఆ తర్వాత తెగ అలవాటు పడిపోయింది. లచ్చిమి వండే ఫుడే కాదు లచ్చిమి అంటే కూడా చాలా ఇష్టం. లచ్చిమి అందరినీ గుడ్డిగా నమ్ముతుందని మార్జ్ ఉద్దేశ్యం.

"లచ్చిమి! యూ ఆర్ టూ కైండ్ టు ఎవ్రీ బడి. గాటు బి కేర్ ఫుల్ లవ్." తరుచుగా హెచ్చరించే మార్గరెట్ మాటలకు లచ్చిమి నవ్వుకునేది.

ఒక సంవత్సరం తర్వాత లచ్చిమి లీడ్స్ టౌన్ లోనే ఒక చిన్న ఇల్లు కొనుక్కుని అక్కడికి మారింది. మార్గరెట్ లచ్చిమి ఇంట్లో ఒక గది రెంటు చేస్తూ చాలా సన్నిహితురాల య్యింది. కొన్నాళ్ళ తర్వాత స్టీవ్ ను డేటు చేస్తున్నపుడు మరో చోటికి మకాం మార్చింది. ఆ తర్వాత కూడా  తరుచుగా లచ్చిమికి ఫోన్ చేసి మార్జ్ తన కష్ట సుఖాలు ఏకరువు పెట్టి సలహా తీసుకుంటూ, ఊళ్ళోని సంగతులు చెప్పి నవ్విస్తూ ఉంటుంది.

లచ్చిమి సీక్రాఫ్ట్ చిల్డ్రన్ టీచింగ్ హాస్పిటల్ లో వారానికి ఒకసారి ఆఫ్ట ర్ వర్క్ వెళ్లి పేషెంట్లకు బౌతిక, మానసిక సహాయం చేస్తూ వాలంటీరుగా పని చేస్తుంది. వారంలో మరో రోజు యార్క్ లోని ఉమెన్ షెల్టర్ లో సహాయం చేస్తుంది. ఉమెన్ షెల్టరులోని స్త్రీల బాధాకరమైన జీవితంలోని  సంఘటనలు వింటూంటే బాధకు దేశం, భాష, పెద్దలు, పిల్లలు అనే భేదం అంటూ ఉండదేమో అనిపిస్తుంద.

ఎనిమిదేళ్ళ క్రితం లచ్చిమి ఇండియాలో బి. టెక్ పూర్తవగానే యు.కె. లో అప్లై చేసినపుడు లండన్ లో 'ప్రిన్స్ కో' టెక్ కంపెనీలో జాబు వచ్చింది. గజిబిజిగా ఉండే లండన్ సిటీలోని జాబ్ కంటే హరాబరా లేని యార్క్ షైర్ సిటీ లోని 'సిడ్ టెక్' కంపెనీలో వచ్చిన జాబ్ తీసుకుంది. సిడ్ టెక్ కంపెనీ ఆ చుట్టు పక్కల ఉన్న చాలా మెడికల్ సెంటర్ లకు, ఫార్మకుటికల్ కంపెనీలకు టెక్ సపోర్టు చేస్తుంది.

"లాశిమి, నాకు ఒక కథ చెప్పు." అంటున్న సౌరబ్ ను ప్రేమగా చూస్తూ లచ్చిమి చెప్పసాగింది.

"ఒకమ్మాయి పదేళ్ళున్నప్పుడు ఒక రోజు జరిగిన కథ చెప్తాను. ఆ అమ్మాయి పేరు..ఉ..ఏం పేరు పెడదాం.. సౌరబ్, నువ్వొక పేరు చెప్పు."

అడిగిందే తడవుగా "లాశిమి" సంతోషంతో గొంతెత్తి అన్నాడా బాలుడు.

"ఆ పేరు కాదు. నీ కిష్టమైన పేరు చెప్పు."

"నా ఫేవరెట్ పేరు లాశిమి." భుజాలేగారేస్తూ తలూపుతూ అన్నాడు. అనుకోని ఆ జవాబుకు సంభ్ర మాశ్చర్యాలతో నోరు తెరిచి 'సరే' అంటూ లచ్చిమి కథ చెప్పడం మొదలు పెట్టింది.

"పదేళ్ళ లాశిమి పుట్టటమే బీదగా పుట్టింది. బీదలోనే పెరుగింది."

"ఓ..బీదలో పుట్టిందా! నన్నక్కడికి తీసుకేల్తావా? నేనెప్పుడూ వెళ్ళలేదు." సౌరబ్ లోని అమాయకత్వం అడుగేసింది.

"బీద అంటే సిటీ కాదు. లాశిమి పూర్ గర్ల్. ఉండీ లేని తిండి, బట్టలు, అందీ అందని ప్రేమ."

"మమ్మీ, డాడి లేరా?"

"మమ్మీ ఉంది కాని డాడి లేడు. ఒక తమ్ముడు ఉన్నాడు. లాశిమి తల్లి చదువు కోలేదు కానీ తన బిడ్డలని చదివించాలని చాలా కోరిక."

చదువు లేకుండా, జాబ్ లేకుండా పెద్దవాళ్ళు చాలా మంది ఉన్నారని సౌరబ్ ఊహకు కూడా అందనిదీ ప్రపంచంలో ఉన్న పచ్చి నిజం.

"సౌరబ్, ఇది నాకు ఇష్టమైన కథ."

సౌరబ్ 'అవునా' అన్నట్టు కళ్ళు పెద్దవి చేసి తలాడించాడు.

"స్కూలుకు వెళ్ళడం అందరితో కలిసి కూర్చోవడం, మాట్లాడటం, ఆడుకోవడం అంటే లాశిమికి చాలా ఇష్టం. బడికి వెళ్ళడం కోసం ఎదురు చూసేది. పదేళ్ళ లాశిమి రోజులాగే ఆ రోజు బడికి వెళ్ళింది. క్లాసులోకి వెళ్లి వెనుక వరుసలో ఉన్న తన సీటులో కూర్చుంది. రోజులాగే ఆ రోజు టీచర్లు రావడం పాటాలు చెప్పడం, బ్రేక్ లో ఆటలు ఆడటంతో గడిచి పోయింది."

లచ్చిమి తన మనసులోంచి తోసుకోస్తున్నఆలోచనలు పక్కన పెట్టేసి మళ్ళీ కథ అందుకుంది.

సౌరబ్ లచ్చిమి వైపుకి జరిగి "ఊ..చెప్పు" ఉబలాటంతో నోరు చిన్నగా తెరిచాడు.

"ఆఖరి క్లాసు అయిపొయింది. పుస్తకాలు బేగుల్లో సర్దుకుని పిల్లలందరూ ఇంటికి బయల్దేరారు. లాశిమి కూడా తన బేగ్ భుజాన వేసుకుని నెమ్మదిగా నడుస్తోంది. ఇంట్లో లాశిమి తల్లి ఉండదు. ఆరోజు లాశిమి తమ్ముడికి

జ్వరంగా ఉందని తల్లి తన వెంటే తీసుకెళ్ళింది. అందరి ఇళ్ళల్లో పని చేసి సంజె వేళ్ళకి గాని తల్లి ఇంటికి రాదు. వచ్చాక అప్పుడు అన్నం వండుతుంది. ఈ మధ్యే తల్లి లాశిమికి అన్నం వండటం నేర్పింది. కూరలు లేని రోజు మిరప పొడి, రెండు చుక్కలు నూనె వేసుకుని తింటే లాశిమికి ఇష్టం లేక పోయినా తిని తిని అలవాటయి పోయి తర్వాత కమ్మగా అనిపించేది. స్కూలునుండి ఇంటికి వెళ్ళడానికి లాశిమికి ఏమాత్రం ఉత్సాహంగా లేదు. నెమ్మదిగా కాళ్ళీడ్చు కుంటూ క్లాసులోంచి మెట్లవేపు నడుస్తున్న లాశిమికి పక్కన ఎవరో నడుస్తున్నట్టనిపించి తల తిప్పి తన పక్కనే నడుస్తున్న పల్లవిని చూసి ఆశ్చర్య పోయింది. 'ఎ' సెక్షన్ లో ఉండే పల్లవి ఈ సవత్సరమే 'బి' సెక్షన్ లోకి వచ్చింది. లాశిమి కూడా 'బి' సేక్షనే."

(కథ చెప్తున్న లచ్చిమి మనసులో మొదటి సారి పల్లవితో సంభాషణ గుర్తొచ్చింది. ఒక రోజు ఫ్రీ టైములో బెంచి మీద కూచున్న లచ్చిమి పక్కకు వచ్చి కూచుంది పల్లవి,

"నీ పేరేంటి?" అడిగింది.

"లచ్చిమి"

"ఓ.. లక్ష్మి" అంది పలకడం సరిదిద్దుతున్నట్టుగా. నాగరికత నాట్యం చేసింది.

"లక్ష్మి కాదు లచ్చిమి."

"నేనెప్పుడూ ఆ పేరు వినలేదే!"

"మా అమ్మ నాకు ఇచ్చిన పేరు అదే."

"లచ్చిమి...పేరు కొత్తగా బావుంది." కాసేపు సరదాగా మాట్లాడుకున్నారు.

ఈనాడు, "ఇవ్వాళ నాతో మాఇంటికి వస్తావా?" లాశిమితో అడుగులు కలుపుతూ అడిగింది పల్లవి.

క్లాసులో అందరికంటే నీటుగా ఉండి, మొదటి వరుసలో కూర్చునే పల్లవి ఇవ్వాళ లాశిమిని తనతో వాళ్ళింటికి రమ్మంటోంది. లాశిమి నమ్మలేక పోయింది.

"నేనా! ఎందుకు!" ఆశర్యంతో లాశిమి సన్నగా, చిన్నగా అడిగింది.

"మనిద్దరం కాసేపు ఆడుకుందాం. వస్తావా?" అంది.

"సరే." అంది లాశిమి. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పల్లవి ఇంటికి వెళ్ళారు.

గేటు దాటగానే రెండు వేపులా పూల చెట్లు. గాలికి ఉగుతూ రంగు రంగుల పువ్వులు నాట్యం చేస్తున్నాయి. ఎదురుగుండా మెట్లు వాటికీ రెండు వేపులా పూల తొట్లు. లాశిమి వాటిని అబ్బురంగా చూస్తూ పల్లవి వెనకాలే నడిచింది. ఇంట్లోకి వెళ్ళగానే పల్లవి శాండిల్స్ విప్పింది. లాశిమి ఆ పక్కనే తన పాత చెప్పులు విప్పింది. నేలంతా ఏంతో శుభ్రంగా, తన కాలు జారుతుందేమో అన్నంత నున్నగా ఉంది. సందేహంతో నెమ్మదిగా అడుగులు వేసింది. పక్క

రూములో కెళ్ళారు. పల్లవి తన బుక్ బెగ్ ను ఓ పక్కగా ఉన్న టేబుల్ పై పెట్టి లాశిమి బేగ్ ను కూడా అక్కడే పెట్టమంది. ఇల్లు చాలా పెద్దగా, లాశిమి ఊహకు కూడా అందనంత పెద్దగా, అందంగా ఉంది.

"లాశిమి, నా రూమ్ కెళ్ళి ఆడుకుందాం, రా." పల్లవి వెనకే లాశిమి నడిచింది.

"పల్లవి! వచ్చావా! " అంటూ పల్లవి అమ్మ ఎదురుగా వచ్చి లాశిమిని చూసి నవ్వుతూ

"కుకీస్ తింటారా?" లాశిమిని చూస్తూ అడిగింది. లాశిమి మొహమాటంగా తలొంచుకుంది.

"నేను పాలు తాగను, కుకీస్ తింటాను." పల్లవి గెంతుతూ ముందుకు వెళ్ళింది.

లాశిమి నెమ్మదిగా పల్లవి వెనకే వెళ్ళింది. ఇద్దరూ చేతులు కడుక్కుని వాళ్ళమ్మ ఇచ్చిన కుకీస్ తిన్నాక పల్లవి గదిలో కెళ్లారు. 'అంత పెద్ద గదిలో పల్లవి ఒక్కత్తె ఉంటుందా!' లాశిమి తనను తాను మరిచి పోయి ఓ పక్కగా టేబుల్ పై ఉన్న బొమ్మల వైపు వెళ్లి వాటి బట్టలు, అలంకరణలు మైమరుపుతో చూస్తోంది. ఒక బొమ్మను చూపిస్తూ 'అందంగా ఉంది కదూ– రంభ. నాట్య భంగిమలో ఉన్నది ఊర్వశి..' అలా అన్ని బొమ్మల గురించి చెప్పింది పల్లవి. గోడవారగా ఉన్న

మంచంపై పల్లవి కూర్చుని లాశిమిని కూడా కూర్చోమంది. పల్లవి మనసులోని మంచితనం, మంచంపై కూర్చున్నాక పరుపులోని మెత్తదనం లోని హాయిని మొదటి సారిగా అనుభవించింది

లాశిమి. కాసేపు కబుర్లు చెప్పుకున్నాక,

"కార్డ్స్ ఆడదామా?" లేచి వెళ్లి ఒక చిన్న బాక్స్ తెచ్చి అందులోంచి కార్డ్స్ తీసింది పల్లవి.

"నాకు కార్డ్స్ ఆడటం రాదు." లాశిమి ఎప్పుడూ చూడని కార్డ్స్ వేపు ఆసక్తిగా చూస్తూ అంది.

"ఎలా ఆడాలో నే చెప్తాగా, చాలా ఈజీ." పల్లవి కార్డ్స్ ఆట ఎలా ఆడాలో లాశిమికి చెప్పింది.

అక్కడే ఇద్దరూ కాసేపు కార్డ్స్ ఆడారు.

ఆ తర్వాత పక్క రూములోకి వెళ్లి అక్కడ కేరం బోర్డ్స్ ఆడారు. పల్లవి నాన్న, అక్క వచ్చి

"మేము జాయిన్ అవుతాం. మీరిద్దరూ ఒక జట్టు, నేను, ప్రణతి ఒక జట్టు." అంటూ పల్లవి నాన్న, అక్క వచ్చి కూర్చున్నారు. లాశిమికి అందరూ కలిసి అలా సరదాగా ఆడుతూంటే మహా ఆనందంగా ఉంది.

వాళ్ళు ఓడిపోయారు. పల్లవి, లాశిమి గెలిచారు."

"లాశిమి, నేను బాత్ రూమ్ కెళ్ళాలి." సౌరబ్ హడావుడి చేసాడు.

లచ్చిమి నెమ్మదిగా రెండు చేతులతో బలహీనంగా ఉన్న సౌరబ్ ను వీల్ చెయిర్ లోకి చేర్చి

"కథ మరో రోజు చెప్తాను." అంటూ బాత్ రూమ్ కు తీసి కెళ్ళింది.

బాత్ రూమ్ నుండి తిరిగొచ్చి బెడ్ మీద కూర్చోబెట్టాక, “ప్లీజ్ కథ చెప్పు లాశిమి.” దీనంగా మొహం పెట్టాడు.

“సరే. చెప్తాను.” సౌరబ్ కాళ్ళ మీద బెడ్ షీట్ కప్పి కథ చెప్పడం మొదలు పెట్టింది.

“లాశిమి, పల్లవి గెలిచారు. అప్పుడే పల్లవి అమ్మ

“అందరూ డైనింగ్ టేబుల్ దగ్గరకు రండి.” అని పిలిచింది.

గెలిచిన ఆనందంతో పల్లవి గెంతుతూ లాశిమి చేతులు పట్టుకుని డైనింగ్ రూమ్ లోకి తీసు కెళ్ళింది. పల్లవి గెంతుతూంటే గాలిలో తేలి పోతున్నాట్టుగా ఉంది.

టేబుల్ దగ్గర లాశిమిని కూర్చోమని చెప్పి పల్లవి పక్కనే కూచుంది. పల్లవి అక్క, తమ్ముడు,

నాన్న అందరూ టేబుల్ దగ్గర కూచున్నారు. పల్లవి వాళ్ళ అమ్మ ఒక ప్లేటులో కేకు పట్టుకుని వచ్చి లాశిమి ముందు పెట్టింది. లాశిమి కళ్ళు పెద్దవి చేసి అయోమయంగా చూసింది.

”నీ కోసమే లాశిమి” అంటూ ఆమె లాశిమి తలపై ప్రేమగా నిమిరింది పల్లవి అమ్మ. ఆ అనురాగానికి లాశిమి పొంగే దుఃఖాన్ని ఆపుకోవడం కష్టమే అయ్యింది.

వాళ్ళమ్మ కేకుపై ఉన్న కేండిల్ వెలిగించింది.

“లాశిమి, నీ నీకేం కావాలో మనసులో కోరుకుని కేండిల్ ను బ్లో చెయ్యి.” పల్లవి సూచన చేసింది.

“నేనా...!” తడారి పోయిన గొంతుతో బయటకు వచ్చీరాని మాట.

‘ఏం కోరుకోవాలి!! తెలీదు.’ వాళ్ళ ప్రోత్సాహంతో కేండిల్ బ్లో చేసింది. అందరూ హెప్పీ బర్త్ డే పాట పాడారు. కలలు కనడం కూడా తెలీని లచ్చిమి ఇలలోనే తేలి పోతోంది.

పల్లవి అమ్మ కేక్ ముక్క తీసి లాశిమికి తినిపించింది.

“హెప్పీ బర్త్ డే!” అందరూ లాశిమిని విష్ చేసారు. పల్లవి అమ్మ ఒక గిఫ్ట్ బేగ్ లాశిమి చేతికి ఇచ్చి,

“లాశిమి అందులో ఏముందో చూడు” అంది.

లాశిమి చేతులు వణుకు తున్నాయి. కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. పల్లవి అమ్మ లాశిమి దగ్గరగా వచ్చి లాశిమి కళ్ళు తుడిచింది. లాశిమి ఇక ఆపుకోలేక ఆమె చేతుల్లోకి వాలిపోయి గుండె బరువు తీర్చుకుంది.

“కంట నీరు పెట్టకూడదు. అవి చూసి ఎలా ఉన్నాయో చెప్పు.” అలా హత్తుకున్న లాశిమి వీపు నిమురుతూ కళ్ళు తుడిచింది ఆ తల్లి. లాశిమి బేగ్ లోవి తీసి చూసింది.

లేత నీలి రంగు చుడీదార్ సెట్, మేచింగ్ గాజులు, మేచింగ్ గోలుసు, మేచింగ్ చెవులకు రింగులు ఉన్నాయి. ఒక జత చెప్పులు కూడా ఉన్నాయి.

"ఇవన్నీ నాకేనా!" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును, అవి అన్నీ నీకే." అందరూ ఒకే సారి అన్నారు.

కేక్ తిన్నాక లాశిమిని ఇంటి దగ్గర దింపడానికి పల్లవి కూడా కార్లో వెళ్ళింది. పల్లవి అమ్మ కేక్, పులిహోర, చక్రపొంగలి, సమోసాలు పేక్ చేసి ఇచ్చింది. లాశిమి ఇల్లు రాక ముందే కారు ఆపమని అక్కడే తను దిగి వెళ్తానని లాశిమి అనగానే పల్లవి సరే నంది. కారు దిగి నాలుగడుగులు వేసిన లాశిమి గబుక్కున వెనక్కి తిరిగి వస్తూంటే పల్లవి కూడా కారు దిగి 'ఏమిటా!' అన్నట్టు చూసింది. లాశిమి దగ్గరగా వచ్చి పల్లవిని గట్టిగా కౌగిలించుకుని కొన్ని క్షణాలు ఆగి,

"థాంక్ యూ పల్లవి. బై." అంటూ గబా గబా వెళ్ళిపోయింది లాశిమి."

కథ చెప్తున్న లచ్చిమి తడి కళ్ళు సంతోషంతో మెరుస్తున్నాయి.

"అమ్మా! మన దేవుడు కూడా గరీబోడా? లేక కంజూశోడా? మనం ఎంత కష్ట పడుతున్నా ఏమి సాయం చెయ్యడు." అని లచ్చిమి తన తల్లిని అడగిన రోజును తనలోనే దాచుకుంది.

పుస్తకం తల కిందులున్నది కూడా తెలియని తల్లి "బాగా సదువ్వని. పెద్ద సదువులు సదివితే నౌకర్లు పెద్దవి దొరుకుతవి. మంచిగ సదువుకో బిడ్డా, సదువు కొని నువ్వు ఖదర్ మీద బతికితే నా పానానికి నిమ్మడం అయితది." అని బుదగాయించి మరీ చెప్పే తల్లి మాటలు తర్వాత గాని  అర్థం కాలేదు లచ్చిమికి.

"తర్వాత ఏమయింది?" సౌరబ్ కు ఇంకా వినాలని ఉంది.

"సౌరబ్! అంతకు ముందు లాశిమి ఎప్పుడూ పుట్టిన రోజు జరుపుకోలేదు. అదే మొదటి సారి పుట్టిన రోజు పండుగ చేసుకుంది. లాశిమి జీవితంలో అమృతం కురిసిన రోజు. వాళ్ళ మనసు లాగే తన మనసు వేశాలం చేసుకుని బ్రతకడం నేర్చుకుంటోంది.

"పల్లవి, లాశిమి బెస్ట్ ఫ్రెండ్స్ అయ్యారా?" సౌరబ్ కుతూహలంగా అడిగాడు.

"మంచి స్నేహితులయ్యారు. మరు సంవత్సరమే పల్లవి నాన్నకు బెంగుళూరు బదిలీ అయి వెళ్లి పోయారు. తర్వాత వాళ్ళు ఎప్పుడు కలుసు కోలేదు. వాళ్ళు కురిపించిన అమృతం లాశిమి

జీవితంలో ఎప్పటికి ఉండిపోయింది."

"లాశిమి బెస్ట్ ఫ్రెండ్ కాదుకదా మరి లాశిమికి బర్త్ డే పార్టీ ఎందుకిచ్చారు?"

"పల్లవి వాళ్ళ అమ్మ ప్రతి సంవత్సరం తన బర్త్ డే రోజునాడు అదే రోజు బర్త్ డే ఉన్న ఒకమ్మాయిని

పిలిచి ఆ రోజు ఆ అమ్మాయి బర్త్ డే పండుగ చేస్తుందట."

సౌరబ్ గిగుల్ చేస్తూ చప్పట్లు కొట్టాడు.

ఆ ఒక్క రోజుతో లచ్చిమి జీవితమే మారి పోయింది.

"సౌరబ్! నీకు డిన్నర్ తెచ్చాను. నీ మమ్మీ ఫోను చేసింది. కాసేపట్లో నీ దగ్గరుంటుంది." నర్సు డిన్నరు ట్రేతో వచ్చింది.

"సౌరబ్, డిన్నర్ అంతా తినాలి. ఇక నేను వెళతాను. నెక్స్ట్ వీక్ వస్తాను, గుడ్ నైట్." అంటూ లచ్చిమి సౌరబ్ చేతిని నిమిరింది.

"బై...లాశిమి. గుడ్ నైట్." సౌరబ్ వెళ్తున్న లచ్చిమి వైపు చూస్తున్నాడు.

"షి ఈజ్ మై ఏంజెల్." సౌరబ్ నర్సుతో అంటూంటే నర్సు నవ్వింది.

ఒక గంట తర్వాత హాస్పిటల్ డెస్క్ దగ్గర నిలబడ్డ సౌరబ్ తల్లి నర్సుతో,

"సౌరబ్ చెప్పే ఏంజెల్ ఎవరు? కథలు చెప్తుందిట. పేరు లాశిమి అన్నాడు. ఆమె ఇక్కడ పని చేస్తుందా? నాకు మీటవాలని ఉంది." అడిగింది కుతూహలంతో.

ఆ పక్కనే కంప్యూటర్ లో పేషెంటు ఫైల్స్ చూస్తున్న మార్గరెట్ ఆ మాటలు విని సంభ్రమంగా తలెత్తి చూసింది.

డ్యూటి నర్సు జవాబు చెప్పడానికి నోరు తెరిచింది అంతలో –

"హలో పల్లవి! నీ కోసమే చూస్తున్నాను. గుడ్ న్యూస్, సౌరబ్ బ్లడ్ కౌంట్ బావుంది. రేపు ఇంటికి తీసుకెళ్ళి రెండు రోజుల తర్వాత తీసుకొని రా, బ్లడ్ టెస్ట్ రిపీట్ చేద్దాం." పీడియాట్రిక్ ఆంకాలజిస్ట్ అనీష మాతుర్ పల్లవి దగ్గరగా వచ్చి మంచి వార్త చెప్పింది.

"ఎంత మంచి వార్త చెప్పావు అనీషా! రాహుల్ కు ఇప్పుడే ఫోను చేస్తాను. సౌరబ్ గురించి చాలా వర్రీడ్ గా ఉన్నాడు."

"ఫాదర్ కదా! ఇంతకు ముందే ఫోను చేసాడు. రిజల్ట్స్ గురించి చెప్పాను. రాహుల్ వాజ్ హెప్పి టు హియర్ ది గుడ్ న్యూజ్. సౌరబ్ విల్ బి ఒకే. నీతో తర్వాత మాట్లాడతాను." అంటూ డాక్టరు వెళ్లిపోయింది చక చకా నడుచుకుంటూ.

ఈమె పేరు పల్లవి...కళ్ళు పెద్దవి చేసి పల్లవినే చూస్తూ మార్గరెట్ నోరు తెరిచింది.

పల్లవి పట్టలేని ఆనందంతో సౌరబ్ రూము వైపు వెళ్ళింది.

.

# త్రిసూత్ర పథకం

కుంతి

రంగురంగుల బొమ్మల పెట్టెలో సుందరాంగి పొదుపుగా బట్టపీలికలుధరించి ఒళ్ళు దాచుకోకుండా పాటపాడుతూ,ఆడుతోంది. క్లోజప్ లో పెదవులను గుండ్రంగా చుట్టి ముద్దు పెడుతోంది. ప్రేక్షకులను కలవర పెడుతోంది.

టీపాయ్ మీదున్న ద్రాక్ష పళ్ళను నోట్లో వేసుకుంటూ,పిప్పళ్ళ బస్తాలాంటిశరీరాన్ని సోఫాలో కుదేసుకొని,టీవీని యే యాంగిల్ నుండి చూస్తే బాగుంటుందోనని మథనపడుతూ,మన కథానాయకుడు శ్రీజనార్ధనరావు అటూ ఇటూ మెసులుతున్నాడు.

తిష్ఠ కుదిరింది. టీవీలో సుందరాంగి పై నిష్ఠ కుదిరింది."బాగుంది" అనుకున్నాడు.

"నీ వరుసేమి బాగాలేదు భగవాన్లు"! అంటూ అతడి ఆత్మ అతడి ముందుప్రత్యక్షమయింది.

(మన కథానాయకుడి తో అతని ఆత్మ తరుచుగా సంభాషిస్తుంటుంది. అతని ఆత్మ అతనిని ముద్దుగా "భగ వాన్లూ" అని సంబోధిస్తుంటుంది.) కాస్తా మందుకు వచ్చి ,

"అస్తమానం అలా గవిడి గేదెలా నములుతూ ఉండడమేనా? నేను చెప్పింది ఆలోచించావా? లేదా? " అంటూ భాగవాన్లు టీవీకి అడ్డంగా వచ్చి కూర్చున్నాడు.

(పాఠకులకు విన్నపం: ఇక్కడ మనహీరో శ్రీ జనార్ధన రావును,అతడి ఆత్మ 'భగవాన్లు' అని సంభోదిస్తుంది. అయితే మనహీరో గారు అతడి ఆత్మను ముద్దుగా 'రాములు'అని పిలుచుకుంటాడు)

చాలా తెలుగు సినిమాలలో చూపిన విధంగా అతడి ఆత్మ నిండుగా టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో ఆటగాడిలా తెల్ల బట్టలతో కాకుండా చక్కగా , ఐపీ ఎల్ క్రికెట్ లో క్రికెటర్ లా కలర్ డ్రెస్ వేసుకొని ఉన్నాడు.

"ఈ మధ్య ఆత్మలకు కూడా డ్రెస్ సెన్స్ బాగా పెరిగింది" అనుకుంటూ, "చూడు రాములూ,ఈ రోజు ఆదివారం,నాకు దొరికేది ఈ ఒక్క రోజే. కాసేపు కంటికి పండగ చేసుకోనీ" దీనంగా అన్నాడు జనార్ధనరావు.

"నథింగ్ డూయింగ్ భగవాన్లు! ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి"

"నేనూ నథింగ్ దూయింగ్ ! చాలా రోజుల తరువాత ఈ టీవీ పుణ్యమా అని నాకు పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. నన్ను చూడనీయ్ రాములూ"అంటూటీవీకిదగ్గరగా వెళ్లి కూర్చున్నాడు. కాసేపటికి రాములు మళ్ళీ టీవీ తెరపైన ప్రత్యక్షమయ్యాడు. "అంతరాయానికి చింతిస్తున్నాను. జనార్ధనరావు అనే వ్యక్తి దేభ్యం ముఖం వేసుకొని,టీవీ ముందు కూర్చోవడం వలన రాబోవు నష్టాన్ని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.." ఇక లాభం లేదనుకొని టీవీ కట్టేసాడు రావు.

"దట్స్ గుడ్ భగవాన్లూ!"

"రాములూ !నస ఆపి చెప్పి చావు"

"నీ గురించి,నీకుటుంబం గూర్చికొంత వివరంగా చెప్పు భగవాన్లూ!

"నా గురించి నేను చెప్పుకోవడం ఏమిటి రాములూ!?"

"నీ గురించి నీవు తెలుసుకోవాలని భగవాన్లూ!"

"సరే చెబుతాను. నాపేరు శ్రీ జనార్ధనరావు.నావయసు నలభై అయిదు సంవత్సరాలు. భార్యా,తల్లీ,ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదీ నా సంసారం . ఆస్తిపాస్తులు లేవు. కష్టపడి పైకి వచ్చాను. ఇన్ని రోజులుగా సంపాదిస్తున్నా వెనుకవేసిందిలేదు. ఇంకా స్వంతఇల్లు లేదు. ఎప్పటికప్పుడు నా సంపాదన కుటుంబ పోషణకు, ఇతర బాధ్యతలకు హరించుకుపోవడం చేత అప్పులు బాగానే ఉన్నాయి. అవకాశాలు పుష్కలంగా ఉన్నా, అవినీతిని ఇష్టపడను. ప్రభుత్వోద్యోగాన్ని పవిత్రంగా భావిస్తాను. బ్యాంక్ లో నిలువ ఇరవై వేలు. అన్ని రకాల అప్పులు కలిసి నాలుగు లక్షలుదాకా ఉన్నాయి.ఈ మధ్య మా అమ్మ గారు కార్పొరేట్ ఆసుపత్రి వారి ప్యాకేజీ హాస్పిటాలిటీని చవి చూసి వచ్చింది"

"నీ జీతమెంత?"

"ఇన్సూరెన్సులు,పీఎఫ్ ,ఐటీ వగైరాలు పోయిన తరువాత చేతికి డెబ్బై వేల దాకా వస్తాయి"

"పిల్లలు రేపోమాపో కాలేజీలకు రాబోతున్నారు. నీ యిల్లాలు మెడలోకి ఫ్యాషన్ పూసలు తప్ప బంగారంఎరుగదు.నిలువడానికి స్వంత ఇల్లులేదు.పిల్లల చదువులకు,పెళ్ళిళ్ళకు,పదవీ విరమణానంతర జీవితానికి ,అనారోగ్యాలకు, అనుకోని ఖర్చులకు ప్రణాళిక లేదు.అప్పులు తప్ప చెప్పుకో దగిన బ్యాంక్ బ్యాలెన్స్ లేదు. కాస్టాఫ్ లీవింగ్ పెరిగిపోయింది. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ఆలోచించే వాడివి .రేపటి విషయాలు ఎందుకు ఆలోచించలేదు ? "

టాపిక్ గంభీరంగా ఉండడం తో అలెర్ట్ అయ్యాడు రావు.

ఇంతలో రాములు స్వామీజీ గెటప్ లోకి మారిపోయి,టేబుల్ మీద పద్మాసనం వేసుకొని కూర్చొని,ప్రవచనం ప్రారంభించాడు.

" చూడు భగవాన్లూ! నీవు చాలా విషయాలలో ప్లానింగ్ చేస్తావు. ఆర్ధిక విషయాలలో మాత్రం కాదు. లక్ష్మి చంచలమైనది. ఎట్లా వస్తుందో ఎట్లాపోతుందో తెలియదు.ఖర్చు చేయడం చాలా సులభం . ఖర్చును అదుపు చేయడం కష్టం.ఆర్ధిక జీవన కురుక్షేత్రం లో కోరికలనే స్వజనాన్ని చంపలేని అర్జునుడివి నీవు. కావున నేను కృష్ణుడిలా జీవన పార'మార్ధిక'గీత వినిపించాల్సి వస్తుంది. డబ్బు చాలా విలువైనది,పవిత్రమైనది. దానిని వీలైనంత ధర్మ మార్గంలో ఆర్జించాలి.డబ్బును వంద రూపాయలు అయ్యే వరకు నీవు కాపాడు. వంద రూపాయలు అయిన తరువాత అదినిన్ను కాపాడుతుంది. అసలు సొమ్ము బాతులాంటిది. వడ్డీ గుడ్డు లాంటిది. బాతును రక్షించు, గుడ్డును స్వీకరించు, డబ్బున్న వారెవరూ ఖర్చు చేయరు. నీలాంటి వారెవరూ డబ్బున్న వారుగా మారరు"అంటూ చిన్నగా దగ్గి, ఇంగ్లీషు సినిమాలో క్యారెక్టర్ లా లేచి వెళ్లి ,ఫ్రిజ్ లో బాటిల్ తీసి నీళ్ళు త్రాగి మళ్ళీ వచ్చి కూర్చున్నాడు.

ఈసారి మన రాములు అమెరికన్ బ్యూరోక్రాట్ లా హ్యాట్,బూట్ సిగార్ తో దర్జాగా ఉన్నాడు.

మరలా ప్రారంభించాడు. "ప్రతి వ్యక్తికి తను ఖర్చుచేసే ప్రతి పైసపై అదుపు,పైసా పైసా కూడబెట్టే పొదుపూ,పైసకు పైస సంపాదించగల నేర్పు, దానికి కావలసిన మదుపూ ఉండాలి. ముఖ్యంగా మధ్య తరగతి జీవి ఈ త్రిసూత్రపధకాన్ని అనగా అదుపూ,పొదుపూ,మదుపూ అమలు చేయకపోతే అతడికి ఏమీమిగలదు. రిటైర్ మెంట్, వృద్ధాప్యం శాపంగా మారుతుంది. కావున ఇకనైనా మేలుకో భగవాన్లూ"అన్నాడు రాములు.

"సరే! నన్ను ఇప్పుడేమి చేయమంటావు రాములు?" ప్రశ్నించాడు.

ఆర్ధిక సంస్కరణలు,ఆర్ధిక విధానాలు,ఆర్ధిక ఆంక్షలు వివరంగా సూచించి , 'డింగ్' మని లోపలికి ముడుచుకుపోయాడు రాములు.

సోఫాలో రిలాక్స్ అవుదామనుకుంటుండగా ఎదురుగా లక్ష్మీదేవి పటం కనబడింది. ఆమె చేతిలో నుండి బంగారుకాసులు జలజలా రాలుతున్నాయి.ఫోటోలోని అమ్మవారు సజీవ రూపం ను దాల్చింది.

"రాములు చెప్పిన మాటలువిను భగవాన్లూ! నీ యింట్లో కాసుల రాశి నిండుతుంది."అని చెప్పి,తిరిగి పటంలో బొమ్మగా మారిపోయింది.

ఇంతలో మరొక పటం లో ఉన్న వేంకటేశ్వర స్వామి ప్రత్యక్షమై "ఇంతే అబ్బాయి! మా ఆవిడ చెప్పింది అక్షరాల సత్యం.నాకు అప్పట్లో చెప్పే వారులేక,నేను అప్పుల్లో కూరుకుపోయాను.ఇప్పటికీ నా ఆప్పు తీరలేదు"అని తాను గోడపై పటములోకి "డింగ్" మని దూరిపోయాడు.

రావు సోఫాలో రిలాక్స్ అయ్యాడు.

అతడి దృష్టి గది మూలపై పడింది. చీమల బారు ఆహారపదార్థాలను రాబోవు రోజులకు దాచుకోవడానికి మోసుకు వెళుతున్నాయి. కిటికీ వంక చూసాడు. చూరుక్రింద కిటికీ పైన తేనెతెట్టెలో తేనెటీగలు కనబడ్డాయి. తేనెను సేకరించుకొని తుట్టెను నింపుతున్నాయి. వెంటిలేటర్ లో ఒక పిచ్చుక పుల్లా పుడకా తెచ్చుకొనిగూడు కట్టుకుంటుంది.

'ముందు చూపు' అనుకున్నాడు. 'వెంటనేమీటింగ్ పెట్టాలి'అనుకున్నాడు .

మీటింగ్ అంటే గుర్తుకు వచ్చింది మన జనార్ధాన రావు ఆఫీసులో స్ట్రిక్ట్ అండ్ డిసిప్లిన్డ్ అధికారి. ప్రతి పనిని చక్కగా ప్లానింగ్ చేసి ,ఎగ్జిక్యూషన్ చేయగల సమర్ధుడు.అతడి స్టాఫ్ కు అతడంటే గౌరవం. కాని ఒకేవిషయంలో అతడితో వాళ్ళకు ఇబ్బంది. సగటు భారతీయ బ్యూరోక్రాటిక్ విధానాలను బాగా జీర్ణించుకున్నాడు.కావున వారానికి రెండుమూడు సార్లు మీటింగ్ ల పేరుతో స్టాఫ్ ను చావబాదుతాడు. ఏకధాటిగా గంటలతరబడి మాట్లాడడం మధ్యలో స్టాఫ్ నిదురపోకుండా, వింటున్న విధంగా నటించకుండా ఉండేందుకు ప్ర శ్నలు ,స్టాటిస్టిక్స్ అడుగుతుండడం అతడి ప్రత్యేకత.

యేదైనా ఒక పనికి ముందు,పని జరిగేటప్పుడు,పనిజరిగిన తరువాత మీటింగ్ లు కండక్ట్ చేయడం అతడికి అలవాటు.స్టాఫ్ లో ఒక కవికూన "మీటింగ్ లు కావు అవి బ్రెయిన్ ఈటింగ్ లు" అంటూ కవిత కూడా వ్రాసాడు.కానీ ప్రమోషన్ క్రిందికి నీళ్ళు వస్తాయనిగ్రహించి ,ప్రకాశంగా వినిపించలేకపోయాడు.

కొందరు ఈ సుత్తిని భరించలేక అతడికి "జనమర్ధనరావు" అని బిరుదును ప్రధానం కూడాచేసారు.

"ఎన్ని సార్లు చెప్పాలి! అలా చీకట్లో కూర్చొని ఆలోచించవద్దని"ఆ రోజు తాలూకు ఇంటి పనులు తెమలడం తో జనార్ధన రావు భార్య సుమతి ,మందలిస్తూ బెడ్ రూమ్ లోకి వచ్చింది.

ఇంకా భర్త అదే మూడ్ లో గంభీరంగా ఉండడం తో, " యేమిటి గంభీర రావు గారు? యేదో ఆలోచిస్తున్నారు" అన్నది

"వెల్! అర్జంట్ గా కుటుంబ సభ్యులను సమావేశపరుచు ,మీటింగ్ కండక్ట్ చేయాలి"అంటూ,నోట్ ప్యాడ్ లో పాయింట్స్ రాసుకోవడం మొదలుపెట్టాడు.సుమతికి అర్ధమయింది. ఏదైనా ముఖ్యమైన కుటుంబ విషయాలు మాట్లాడేది ఉంటే ,ఇలా అందరినీ పిలిచి రెండు,మూడు గంటలు చర్చించడం అనుభవం లోని విషయమే.

ఒకసారి ఇంటినుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బిర్లామందిర్ కు వెళ్ళాలనుకున్నారు.

అక్కడికి ఎలావెళ్ళాలి? ఎంత ఖర్చుపెట్టాలి? సరంజామా ఏమిటీ ..? ఇత్యాది విషయాలపై రెండు గంటలు చర్చించడం. ఆవిడకు గుర్తుకు వచ్చింది. అతడు ఎంత జాగ్రత్త పరుడంటే ఒక పూట ఇల్లు దాటి వెళ్ళాల్సి ఉంటే ,చెక్ లిస్ట్ తయారు చేసుకొని,సరి చూసుకొని వెళ్ళాల్సిందే.మళ్ళీ అలాంటిదేదో అయి ఉంటుంది. అందుకే ఈ మీటింగ్ కాబోలు అనుకున్నది.

తల్లీ,పిల్లలు,భార్యతో మన రావుగారు సమావేశమయ్యారు. ఒకగుటుకలో నీళ్ళు త్రాగి, “వెల్! డియర్ ఫ్రెండ్స్ ! అనబోయి నాలుక కరుచుకోని ,చూడండి. నేను మీతో కొన్ని సీరియస్ విషయాలు డిస్కస్ చేయడానికి పిలిపించాను”అంటూ, పదవ తరగతి చదువుతున్న కుమారుడిని చూస్తూ,

“బంటీ! నీ స్టడీస్ ఎలాఉన్నాయి?” అని ప్రశ్నించాడు.

“ష్యూర్ డిస్టింక్షన్ డాడీ!”

“ నాట్ ఓన్లీ డిస్టింక్షన్ ,స్టేట్ ర్యాంక్ తెచ్చుకోవాలి,అది నీ టార్గెట్” అని పలికి,

ఎనిమిదవతరగతి చదువుతున్న కూతురు వైపు తిరిగి,“ డాన్స్,మ్యూజిక్ క్లాస్ లకు రెగ్యులర్ గా వెళుతున్నావా?” అని అడిగాడు.

“వెళుతున్నాను నాన్నా! వచ్చే నెలలో డాన్స్ అరంగేట్రమ్ చేయిస్తానని మా మేడమ్ చెప్పింది”

“అమ్మా! యేదో పూజలు చేయించుకోవాలి.ఎప్పుడు చేయించుకుంటావు? ఎంత డబ్బు కావాలి?

“నీ ముఖం నేను చేయించాల్సిన పూజలు ఎప్పుడొ చేయించాను కదరా!ఇంకా ఒక్క వ్రతం కార్తీక మాసం లోచేయాల్సింది ఉంది”

“ఓకే! అప్పుడు చెబితే దానికి ప్లాన్ చేయవచ్చు”

ఇంతలో ప్లేట్ లో దానిమ్మ గింజలు తెచ్చి టేబుల్ మీద పెట్టింది సుమతి.

ఫార్మాలిటీస్ పూర్తి అయినట్లుగా భావించిన రావు గారు,ఆర్థిక సంస్కరణలకై పెట్టిన సభలో ఆర్థిక మంత్రి ప్రసంగిస్తున్న ధోరణిలో ప్రసంగం ప్రారంభించాడు. “దేశం చాలా క్లిష్ట పరిస్థితిలోనున్నది.ఎప్పుడూ లేని ద్రవ్యోల్బణం మనను భయపెడుతున్నది. జాతీయ స్థూల ఆదాయం తగ్గుతూ,తలసరి అప్పు పెరుగుతున్నది. ఈ సమయం లో దేశం జాగ్రత్తపడకపోతే ఆర్థికంగా చితికిపోయి అగ్రరాజ్యాల దగ్గరా,ప్రపంచ బ్యాంక్ ల దగ్గరా ఆర్థిక దాస్యం చేయవలసి వస్తుంది. కుటుంబం దేశానికి ప్రమాణం . కుటుంబ విపత్తు దేశ విపత్తు.కాబట్టి ఒక కుటుంబం శ్రమించి ముందు చూపుతో ఆర్థికంగా నిలదొక్కుకోగలిగితే పరోక్షంగా దేశానికి సహాయము చేసినట్లే... ..........”

కాసేపు ఆగి.......... “చాలా బాగా చెబుతున్నాను కదా”అనుకుంటుండగా,

టీవీ చప్పుడయింది. బంటీ టీవీ పెట్టుకొని స్పోర్ట్స్ చానల్ చూస్తున్నాడు. పప్పీ నానమ్మ ఒడిలో పడుకొని కునుకు పాట్లు పడుతోంది. భార్య వారపత్రిక తిరగేస్తోంది.తల్లి రామకోటి రాసుకుంటోంది.

వెంటనే తాను అలర్ట్ అయి, అందరినీ అలెర్ట్ చేసాడు. “ఇది ఇల్లు.ఇలా ప్రసంగాలు చేయవద్దు” అనుకున్నాడు. టీవీ కట్టేయమన్నాడు.

"చూడండి. నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. చేతిలో నాలుగురాళ్ళు ఉన్నప్పుడే వెనకేసుకోవాలి. లక్ష్మీదేవి చంచలమైనది. ఈరోజు ఉంటుంది.రేపుపోతుంది. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలి. డబ్బును మనం రక్షిస్తే,డబ్బు మనను రక్షిస్తుంది. కావున నేను ఇంట్లో కొన్ని ఆర్ధిక సంస్కరణలు చేయదలుచుకున్నాను. దీనికి మీరు సహకరించాలి.మనకు ఒక స్వంత ఇల్లుకావాలి.బంటీ ఇంజనీరు,పప్పీ డాక్టర్ కావాలి,ఇంటిలో ఖరీదైన వస్తువులు సమకూరాలి, ఒక కారుకొనుక్కోవాలి.

మన అందరి జీవితాలకు భద్రత కావాలి, యే అప్పుసప్పు లేకుండా రిటైర్మెంట్ జీవితం ప్రశాంతం గా ఉండాలి. ఈ రోజు ఎలా ఉన్నామో,ఒక ఇరవై సంవత్సరాల తరువాత అంతకంటే పది విధాలా బాగుండాలి.

ఇది సాధ్యం కావాలంటే ఈ రోజు నుండి మనం జాగ్రత్త పడాలి. దీనికి నా సంపాదన ఒక్కటే మార్గం. దీనికై మనం త్రిసూత్ర పధకాన్ని అమలు చేయాలి.అదుపూ,పొదుపూ,మదుపూ అన్న మూడు సూత్రాలు మన జీవితం లో చాలా ముఖ్యమైనవి.వీటిని అమలు చేస్తే మన జీవితం మూడు డిపాజిట్లు ,ఆరు బాండ్లు కాక తప్పదు"అంటూ గదిలో ఉన్న దేవుడి పటాల వైపు చూసాడు.

పటాల లోని దేవుళ్ళు, "శబాష్ !" అన్నట్లుగా,ఆశీర్వదించినట్లుగా అనిపించింది.

'మన్మోహనం'గా,'యశ్వంతం'గా,'జశ్వంత'భాస్వంతంగా,'చిదంబర'రహస్యాలుచెబుతున్నట్లుగ, 'నిర్మలం'గా చెబుతున్న విషయాలు విన్న కుటుంబ సభ్యులు, "దీనికి మేమేమి చేయాలి' అన్నారు.

"త్యాగాలకు నడుము కట్టాలి" అన్నాడు. "అంటే?" బంటీప్రశ్నించాడు.

" నా చేతికి వచ్చే జీతం మొత్తం ఖర్చుఅవుతుంది.ఖర్చులను అదుపులోకి తీసుకొని రావాలి. నా జీతం లో కనీసం యాభై శాతం పొదుపు చేసి ,ఒక ఐదు,ఆరు సంవత్సరాలలో కొంత డబ్బును వెనుక వేయాలి. అదే విధంగా కొంత డబ్బు సురక్షిత మార్గాలలో మదుపు చేసి ,డబ్బును రెట్టింపు చేయాలి.అది నేను ఇప్పటికిప్పుడు వేసుకున్న ప్రణాళిక. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఒక పది సంవత్సరాలలో మనం మన అర్ధిక స్థాయిని పెంచుకుంటాము,మనకోరికలు కూడా తీర్చుకోవచ్చు. మీరు కూడా ఆలోచించండి. మనం చేసే వ్యర్ధపు ఖర్చులు,మానుకో గల ఖర్చులు తీసి వేస్తే ఎంతపొదుపు చేయగలమో చూద్దాము.వెంటనె కొంత ఆర్డీ ల రూపం లో, సురక్షిత కంపెనీలలో ఛిట్ ల రూపం లో , తక్కువ రిస్క్ గల మ్యూచ్ వల్ ఫండ్స్ రూపం లో ,ఇన్సురెన్స్ ల లో సేవింగ్స్ పారంభిద్దాము.

మనసేవింగ్స్,మన పెట్టుబడి.నేటి త్యాగము రేపటి భోగం .

ఇవన్నీ చెప్పడానికి మిమ్మల్ని పిలిచాను,రాత్రి మీరు కూడా ఆలోచించండి. రేపు బ్రేక్ ఫాస్ట్ లో మళ్ళీ మీటింగ్ పెడతాను. అప్పుడు మీ అభిప్రాయాలు చెప్పండి"అని మీటింగ్ ముగించాడు.

ఆ రాత్రి ఇంటి సభ్యులు అందరు పెన్నూ,పెపర్లు తీసుకొని రకరకాల కుస్తీలు,కసరత్తులు చేసారు. లెక్కలు వేసారు. దాదాపుగా అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు.మరునాడు ఉదయం అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు. బ్రేక్ ఫాస్ట్ లు ముగిసాయి. జనార్ధన్ రావు తన ఫైల్ ఓపెన్ చేశాడు.

అందులో రకరకాల ఫార్మాట్లు ,స్టాటిస్టిక్స్ ఉన్నాయి. కొన్ని కొట్టివేతలు,కొన్ని అండర్ లైన్లు గీసిన వాక్యాలు ఉన్నాయి. గొంతు సవరించుకొని, "వెల్ ! నేను పెంద లాడే లేచి హోమ్ వర్క్ చేశాను. ఫ్యామిలీ బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని సిద్ధంచేశాను. చదివి వినిపిస్తాను. సాధ్యాసాధ్యాలు చర్చించుకుంటూ, సలహాలు,అభిప్రాయాలు పంచుకుంటూ దీనిని అమలు పరిచే ప్రయత్నం చేద్దాం"అన్నాడు. ఆతడొక అరగంట ప్రసంగించాడు. ఆ పైన రావు గారు సుమతిని అన్నీ అంశాలను మళ్ళీ చదవ మన్నాడు.

సుమతి చదవడం మొదలు పెట్టింది.

"నగరం నడి బొడ్డున వేలకు వేలు పోస్తున్న అద్దె ఇంటిని ఖాళీ చేసి,ఊరవతల ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్ కు వెళ్ళాలి. అక్కడ అన్నీ వసతులు ఉన్నాయి. హెచ్ ఆర్ ఎ రాకున్నా కట్టే అద్దె తో పోలిస్తే లాభమే. పిల్లలను దగ్గరలోన ఉన్న స్కూళ్ళలో వేయాలి.దానితో స్కూల్ వ్యాన్ ఖర్చు తగ్గుతుంది.పిల్లలు స్కూల్స్ కు నడిచి వెళ్ళాలి. ఆఫీసు దూరమవుతుంది. స్కూటర్ మానేసి . బస్సులో వెళ్ళి రావాలి. దీనితో శ్రమ అయినా కొంత మిగులుతుంది. ఇల్లు నగరానికి దూరంగా ఉండడం వలన బంధువుల పోట్లు,అతిథుల దండయాత్రలు తగ్గుతాయి"చదవడం ఆపి అందరి వైపు చూసింది.

బంధువుల రాకను బంధువుల పోట్లుగా వర్ణించడంతో చిన్న బుచ్చుకున్న రావు గారి తల్లి కొద్దిగా అసంతృప్తి పడింది. బంటీకి , పప్పీకి ఫ్రెండ్స్ కు దూరంగా వెళ్ళడం బాధగా అనిపించింది.అయినా అందరూ ఆ నిర్ణయాలను చప్పట్లతో ఆమోదించారు.

సుమతీ మళ్ళీ చదవడం ప్రారంభించింది.

"ఇంటిలో రెండు మూడు సెల్ ఫోన్ లు ఉన్నాయి. వాటి ఖర్చుతో పాటు ల్యాండ్ లైన్ ఫోన్ ఖర్చు కూడా ఉంది. కాబట్టీ ల్యాండ్ లైన్ తీసివేయాలి"

" ఇది బాగుంది . మీ దగ్గర సెల్ ఫోన్ లు ఉన్నాయి. మరి అమ్మాయిలకు నేను చేయాలన్నా,నాకు అమ్మాయిలు చేయాలన్నా ఎలారా? అయినా మీ ఇష్టం" అంటూ అక్కడి నుండి లేవబోయింది"రావు గారి తల్లి .

పరిస్థితిని అర్థం చేసుకున్న సుమతి, "లాండ్ లైన్ ఉండనివ్వండి. జాగ్రత్తగా తక్కువ బిల్లు వచ్చేలా వాడుకుంటాము" అనడంతో ఆమె ముఖం వికసించింది. రావుగారు తలూపారు.

సుమతీ మళ్ళీ చదవడం ప్రారంభించింది.

"బంటీ పదవ తరగతి కాబట్టి కరాటేమాన్పించాలి. పప్పీ  డాన్స్ బాగా నేర్చుకుంటుంది. కానీ సంగీతమే పెద్దగా వంటబట్టడం లేదు. కాబట్టి సంగీతం మాన్పించాలి. పిల్లలకు ట్యూషన్లు మాన్పించాలి. సాయంత్రం వేళ మనమే పిల్లలను విధిగా చదివించాలి. దీని వలన బాగానే  మిగులుతుంది" పిల్లలు అసంతృప్తిగా ఉన్నా  చప్పట్లు కొట్టారు. సుమతి మళ్ళీ చదవడం ప్రారంభించింది.

"కిరాణా సరుకులు ,కూరలు,పండ్లు హోల్ సెల్ మార్కెట్ లో తెచ్చుకోవాలి. చాకలికి బట్టలు వేయడం మాని వేసి ఉతకడం,ఇస్త్రీ చేయడం ఇంటిలోనే చేయాలి"చదవడం ఆపి, ఆ విషయాలు తనకు సంబంధించినవి కావడంతో , "నాకు ఒకే" అన్నది. అందరూ చప్పట్లు చరిచారు.

మధ్యలో రావుగారు, "పాలు, పండ్లు ఖర్చు తగ్గిద్దామా?"అన్నాడు.

"ఆ తారువాత  డాక్టర్లకు పెడదామా?"అని సుమతి ఎదురు ప్రశ్నించడంతో రావుగారు ఆ ప్రస్తావన మానుకున్నారు. సుమతి మళ్ళీ చదవడం ప్రారంభించింది.

'నెలకు ఒకేసారి చికెన్"అంటూ బంటీ వైపు చూసింది. వాడు చిన్న బుచ్చుకున్నా,"నేను సైతం త్యాగానికి సిద్ధం" అంటూ బొటన వేలెత్తి చూపాడు.

మధ్యలో రావుగారు మళ్ళీ కల్పించుకొని, "చెప్పడం మారిచాను. గ్యాస్ పొదుపుగా వాడుకోవాలి. ఒక పెద్ద పాత్రలో,మూత పెట్టి  నీళ్ళను వేడి చేసుకోని ఇద్దరు చొప్పున స్నానం చేయాలి. ఇంధన పొదుపుకై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్లక్ష్య సుమతీ గారు ! ఈ సుమతీ శతకం తమరు కొంచెం  జాగ్రత్తగా  పఠించాలి" అన్నాడు. "సరే లెండి" అన్నది.

మళ్ళీ రావు గారే, "వంట అమ్మ చేస్తుంది.  బట్టలు ఉతకడం,పాత్రలు కడగడం, ఇల్లు శుభ్రం చేయడం వంటివి సుమతి  చేస్తుంది. కాబట్టి పని మనిషిని తీసివేస్తే నెలకు మూడు వేలు మిగులుతుంది" అంటూ భార్యా,తల్లి వంక భయం భయంగా చూశాడు.

వారు మౌనంగా ఉన్నారు. మౌనం అంగీకారంగా భావిస్తూ తానే చప్పట్లు కొట్టాడు.

మళ్ళీ తానే, "ఆదివారం  ఈ పనులన్నీ నేనూ పిల్లలు కలిసి చేస్తాము" అనడంతో  భార్యా ,తల్లీ సంతోషించారు . పిల్లలు చిన్న బుచ్చుకున్నారు.

రావు గారు కంటిన్యూ చేస్తూ, " కేబుల్ టీవీ కనెక్షన్  కట్ చేద్దాం"  ఈ వాక్యం అంటూ తాను ఎంతో అర్ధవంతమైన ,ఆదర్శ  వంతమైన సంస్కరణలు చేసినట్లుగా ఫీల్  అయ్యాడు.

అస్తమానం తన తల్లి మరియు  తన భార్య సుమతీ  పిచ్చి సీరియల్స్ , పప్పీ “బూతు కావాలా –రోత కావాలా”వంటి కార్యక్రమాలు,బంటి క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ సమయాన్ని ఎంతగా నాశనం చేస్తున్నారో అతనికి తెలుసు. ఈ చర్య  చేపట్టబోతున్నందుకు తనను తాను అభినందించుకున్నాడు.

“మీ అభిప్రాయం ఏమిటి?” అంటూ  వారి వంక చూశాడు.

భార్యాపిల్లలు... ప్రతిపక్షాలు అసెంబ్లీ లో  వాకౌట్ చేయడానికి సిద్ధపడ్డట్లుగా లేచి నిల్చొని అక్కడి నుండి వెళ్ళడానికి సిద్ధ పడ్డారు.

‘కేబుల్  తీసివేస్తే మాకున్న వినోదం ఏమిటి?”అంటూ సుమతి గట్టిగా ప్రశ్నించింది. చూస్తుంటే బలాన్ని కూడగట్టుకొని మొత్తం బడ్జెట్ నే వ్యతిరేకించేట్టుగా కనబడింది. కాస్త చల్లబడి, “ ఓకే ! ఓకే! కేబుల్ ఉండనీయండి. కాస్త  టీవీ చూడడం తగ్గించండి ” అన్నాడు.  తీర్మానాల కాపీ చదవమంటూ భార్య వైపు చూశాడు.

“ఇక విందులు,వినోదాలు,విహారాలు మొత్తానికి ఫుల్ స్టాప్. నో ఫాస్ట్ ఫుడ్స్,నో హోటల్స్”

అందరూ ‘సరే’ అన్నారు.

ఇంతలో“నాన్నా! బోరుకొడుతుంది .మేము ఇక్కడినుండి వెళతాము” పిల్లలనుండి అభ్యర్ధన వచ్చింది.

“నేనూ వెళతారా! మీరు కూర్చొని మాట్లాడుకోండి” అంటూ రావు గారి తల్లి అక్కడి నుండి వెళ్ళిపోయింది.పిల్లలు ,తల్లీ వెళ్ళిపోయారు. భార్యాభర్తలు  మిగిలారు.

“ఇంత సేపు మీ గురించి చెప్పాను.ఇపుడు నాగురించి చెబుతాను. ఆఫీస్ కు స్కూటర్ లో కాక పొద్దున పూట బస్ లో వెళతాను.సాయంత్రము వాకింగ్ లాగా ఉంటుంది. నడిచి వస్తాను. సిగరెట్లు రోజుకు ఒక్కటి కంటే ఎక్కువ త్రాగను. ఇక తీర్ధసేవనం  ఈ రోజు నుండి కంప్లీట్ బంద్” దీనితో చాలా డబ్బులేమిగులుతాయి”అన్నాడు.

“మై డియర్ హబ్బీ! యూ ఆర్ గ్రేట్!” అంటూ బుగ్గమీదసుమతి సుతారంగా ముద్దు పెడితూ అన్నది. మళ్ళీ ఆమె చదవసాగింది.

కొన్నిచర్చల తరువాత,కొన్ని ఘర్షణల తరువాత చేయబడిన తీర్మానాలు  అంగీకరించబడ్డాయి. మొత్తనికి సుమతి నోట్ ప్యాడ్ లో నాలుగు పేజీల మినట్స్ రాయబడ్డాయి.సుమతి ఒకప్పుడు తాను నేర్చుకున్న షార్ట్ హాండ్ దానికి బాగా ఉపయోగపడింది.“మా మామయ్య  గారికి తెలిసిన ఆఫీసులో ఒక క్లర్క్ పోస్ట్ ఉందని చెప్పాడు. ‘నన్ను చేరతావా’ అని అడిగాడు. నేలకు ఏడు పదివేలదాకా ఇస్తారట. వెళ్లమంటారా? నేనూ మీ కష్టంలో పాలు పంచుకుంటాను“ అన్నది సుమతి.

“ఓకే !వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా ఉంటుంది”అన్నాడు.

“ఇంక నేనువెళతాను, ఇంటి పనులు రా...రా..అంటూ రమ్మని పిలుస్తున్నాయి”అంటూ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయిన తరువాత, "నెలకు దేవుడు హుండీలో అయిదు వందల రూపాయలు, వారానికి రెండుసార్లు పూజలు,కొబ్బరికాయలు ...ఇవన్నీ కూడా బాగా ఖర్చే కాబట్టి అవి కూడా తగ్గిద్దామ"నుకున్నాడు.

యేదో అలికిడైతే తలెత్తాడు. తిరుపతి వెంకన్న చూపుడూ వేలుతో తనను చూపిస్తూ, " పళ్ళు రాలుతాయి రాస్కెల్!" అంటున్నట్లుగా తోచింది.

"సారీ!అలాచేయనులే"అనుకున్నాడు. మినట్స్ పరిశీలనగా చూసాడు."ఇంకా చేతులు కాలలేదు. ఆకులు పట్టుకోవచ్చు'అనుకున్నాడు. ప్రాప్త కాలజ్ఞత ప్రదర్శించగలిగాను అనుకున్నాడు.కఠినంగా వ్యవహరిస్తే నెలకు ఎంతలేదన్నా పది పదిహేను వేలు వెనుకవేయవచ్చుననుకున్నాడు.

'కొంతచిట్ ల రూపములో, కోంకొంత ఆర్డీ ల రూపములో ,కొంత ఇన్సురెన్సులు రూపంలో ..... ఇలా రకరకాలుగా సురక్షితమైన పద్ధతిలో సేవింగ్స్ చేయాల'నుకున్నాడు.'త్వరలో బ్యాంక్ లో లోన్ తీసుకొని ఇల్లు కొనుక్కోవాలి,పిల్లలకు మంచి చదువు చెప్పించాలి,వీటన్నిటికి ముందు నా చేతిలో కొంత బ్యాంక్ బ్యాలెన్స్ చేసుకోవాలి"అనుకున్నాడు.

అతడికి 'అదుపు,పొదుపు,మదుపు అనబడే త్రిసూత్ర పథకం , త్రివర్ణ పతాక అంత ఉన్నతంగా, త్రివేణి సంగమం అంతా పవిత్రంగా కనిపించసాగింది. తనలాంటివారే ప్రణాళిక వేస్తే ఇంత చక్కగా ప్రగతి కనబడుతుందే.. .. , మేధావులు,ఆర్ధిక వేత్తలు,దేశాధినేతలు చక్కని ప్రణాళికతో ఎందుకు ముందుకు నడపలేకపోతిన్నారో ?' అనుకున్నాడు.

"యేది ఏమైనా సరే ,ఒక పౌరుడిగా ఆర్ధిక క్రమశిక్షణ పాటిస్తే,కుటుంబం బాగుపడుతుంది. తద్వారా దేశానికి సహాయం చేసినవాడిని అవుతాను" అనుకున్నాడు.

"ఈ క్షణం నుంచి ఆర్ధిక చర్యలు అమలు చేయాలి" అనుకుంటూ లేచాడు.

ఒక వారం గడిచింది. ఆఫీస్ లో గవర్నమెంట్ క్వార్టర్ కై అప్లై చేస్తే , "సారీ! నో వేకెంట్ క్వార్టర్స్"ఇంకా ఒక సంవత్సరం క్యూలో ఉండాలని అని రిప్లై వచ్చింది.అనుకోకుండా బంధువులపోట్లు వచ్చాయి. వాళ్ళు ఒక వారం రోజులు ఉన్నారు. పొరుగు ఊళ్ళో ఉన్న చెల్లెలు. " మీ బావగారు బాగా తాగి ,తాగి ఊరంతా అప్పులు చేసాడు. ఊరి వాళ్ళు ఇంటి మీద పడి అల్లరి చేస్తున్నారు. దయచేసి ఒక పాతిక వేలు సర్దు.లేకుంటే పరువుపోతుంది "అంటూ ఫోన్ చేసి, అభ్యర్ధన పంపించింది.చెల్లెలు పరువుపోకుండా పాతిక వేలు అప్పుచేసి సర్దాడు. మరొక నెలరోజులు గడిచాయి, సుమతి అన్నయ్యకు యాక్సిడెంట్ అయింది. అతడు స్థితిపరుడు కాదు. సుమతి బాధను అర్ధం చేసుకొని, అతడికి ఒక పాతిక వేలు అప్పుచేసి పంపించాడు.

ఇంతలో డీఏ ఐదు శాతము పెరిగింది. మార్కెట్ లో ధరలు దానికి నాలుగుఇంతలు పెరిగాయి. ఒక రోజు క్లోజ్ ఫ్రెండ్, రావుగారి స్కూటర్ తీసుకుపోయిచెట్టుకు గుద్దేసి,డొక్కు బండిని తీసుకి వచ్చి, "సారీ!" చెప్పి వెళ్ళి పోయాడు.

దాని రిపేరుకు తడిసి మోపెడు అయింది. పులి మీద పుట్రలా మరొక సమస్య అపుడే వచ్చింది.అతడి మిత్రుడు లక్ష రూపాయల చిట్ పాడుకున్నాడు,దానికి ఇతడే ష్యూరిటీ సంతకం పెట్టాడు.కాని ఛిట్ ఎత్తుకున్న తరువాత అతడు ఇన్ స్టాల్ మెంట్స్ కట్టడం మానేసాడు. చిట్ కంపెనీ వాళ్ళు డబ్బు కట్టాలంటూఇతడికి నోటీసిచ్చారు. ఈ గొడవలలో మూడు నెలలు గడిచాయి. ఒకరోజు పెన్నూ,పేపర్ తీసుకొని మళ్ళీ లెక్కలు వేసాడు.

ఖర్చులు విపరీతంగా పెరిగాయి,అప్పులు పెరిగిపోయాయి.ఆర్థిక సంస్కరణలు కొంతలో కొంత అమలు చేస్తునే ఉన్నాడు. అయినా మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాడు.మధ్య తరగతి వాడు ఎదగాలంటే ఎన్ని అడ్డంకులు,ఎన్ని ఇబ్బందులు అనుకున్నాడు.గతకొన్ని రోజులుగా తాను కట్టుకున్నఆశల సౌధాలు కుప్పకూలడం తో రావుకు ఒక్క సారిగా నిస్సత్తువ ఆవరించింది.

గోర్బచేవ్ పెరిస్త్రోయికా ,గ్లాస్తినాస్ లు గుర్తుకు వచ్చాయి.

మళ్ళీ తన రెసెల్యూషన్స్ ను, ప్రిపేర్ చేసుకున్న 'డూస్ అండ్ డోంట్స్' చార్ట్ ను గమనించాడు

తన ప్రణాళిక వలననో,తన త్రిసూత్ర పథకం వలననో తన కు బాధలు రాలేదు.

సంసార సాగరంలో వచ్చే ఆటుపోట్ల ఫలితమే ఇది. ఈ ఆటుపోట్లను కూడా తన ప్రణాళికలోభాగంగా చేసుకోకపోవడం తన తప్పుగానే భావించాడు.

ఆర్థిక క్రమశిక్షణ అలవరుచుకుంటే ఎప్పటికైనా ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది అనుకున్నాడు. సానుకూల దృక్పథం అతడిలో ఉత్సాహాన్ని నింపింది.

ఆలోచనలలో ఉన్న రావుకు అలికిడి కావడం తో తలెత్తి చూసాడు.పటం లోని లక్ష్మీదేవి,

"అప్పుల గురించి, అనవసర ఖర్చుల గురించి ఆరాటపడకు. నీవు సరైన దారిలో నడువు. నీవెంట నేను ఉంటాను"అంటున్నట్లు అనిపించింది.లక్ష్మీదేవి పటం లో బంగారు కాసులు రాలుస్తుంది.

రిలాక్స్ డ్ గా కుర్చీపైన జారిగిలబడ్డాడు. టేబుల్ వంక చూసాడు.

టేబుల్ గ్లాస్ క్రింద పెపర్ పైన స్కెచ్ తో అతడు రాసి పెట్టుకున్న

"డబ్బును నీవు రక్షించు, డబ్బు నిన్ను రక్షిస్తుంది" అన్న వాక్యం ట్యూబ్ లైట్ కాంతిలో ఎంతగానో మెరుస్తుంది.

# అద్దం అలిగితే.. విజయార్కె

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

అరవయ్యేళ్ళుగా ఆ అద్దాన్ని బిడ్డలా చూసుకుంది.బిడ్డ లాంటి అద్దం భళ్ళుమని పగిలింది.తన చేతుల్లోనే...
ఆ తల్లి మనసు విలపించింది..అద్దం అలిగితే ...ఆమె మీద కాదు,అందుకు కారణమైన ఆమె కొడుకు మీద ...
ఆ క్షణమే అద్దాలన్నీ నిరసన ప్రకటించాయి.పర్యవసానం ...?

★★★

పొద్దున్నే బద్దకంగా కళ్ళు తెరిచిన సారథి వాష్ రూమ్ లోకి వెళ్ళాడు. ట్యాప్ తిప్పి నీళ్లు మొహం మీద చల్లుకుని అద్దంలో చూసుకున్నాడు. తన మొహం కనిపించలేదు.భయం వెన్నులో నుంచి కళ్ళలోకి వచ్చింది.కళ్ళు నులుముకుని మరీ చూసాడు.అద్దం కనిపిస్తోంది. కానీ అద్దంలో తన ప్రతిబింబం కనిపించడం లేదు. వెంటనే బెడ్ రూమ్ లోకి పరుగెత్తి . బెడ్ రూమ్ లో వున్న డ్రెస్సింగ్ మిర్రర్ దగ్గరికి వెళ్లి అందులో చూసుకున్నాడు.నిలువెత్తు డ్రెస్సింగ్ మిర్రర్ నిక్షేపంగా కనిపిస్తోంది. అందులో తన ప్రతిబింబం కనిపించడం లేదు. టేబుల్ మీద వున్న కళ్ళజోడు పెట్టుకుని చూసాడు.కళ్ళజోడు కనిపిస్తోంది కానీ తను కనిపించడం లేదు.

తను భయపడుతున్నాడా? భ్రమ పడుతున్నాడా? తన కళ్లకు ఏదైనా సమస్య వచ్చిందా? వెంటనే భార్యను కేకేసి పిలిచాడు. కిచెన్ లో వున్న భార్య గోమతి పరుగెత్తుకొచ్చింది.

" పొద్దున్నే ప్రెషర్ కుక్కర్ విజిల్ లా ఆ అరుపులు ఏమిటి? అవతల పిల్లలకు టిఫిన్ తయారు చేయాలి.మీకు లంచ్ ప్రిపేర్ చేయాలి.మీ అమ్మ గారికి జావా ..జా...వా అంటూ సాగదీసి తయారు చేయాలి."ఆవిడేమో నాకు కళ్లు మసకబారాయి.కళ్ళజోడు మార్చాలి.ఏ పని చేయలేకపోతున్నాను " అంటూ హాయిగా పొద్దెక్కే వరకూ పడుకుంటుంది" దీర్ఘాలు తీస్తోంది గోమతి.

" అబ్బబ్బా నీ నస ఆపుతావా? అమ్మకేమో గానీ ముందు నా కళ్ళకు ఏమైందో చూడు. అద్దంలో నా మొహం నాకు కనిపించడం లేదు " గాబరాగా అన్నాడు సారథి.

ఒక్కసారి మొగుడి వంక కోపంగా చూసింది. పొద్దున్నే తనను ఆట పట్టిస్తున్నాడేమోనని అనుమానంగా చూసింది. తర్వాత మరింత అనుమానంగా " ఏంటి కొత్తగా నాకు తెలియకుండా రాత్రుళ్లు మందు కొడుతున్నారా? అంటూ మొగుడి దగ్గరికి వచ్చింది.

" చ చ నేనేమీ తాగి వాగడం లేదు .అద్దంలో నా మొహం కనిపించడం లేదు. బాత్ రూమ్ లో చూసాను.ఇక్కడా చూశాను " చెప్పాడు సారథి

" పొద్దున్నే మీకు ఏదో అయ్యింది.రాత్రి మీ అమ్మతో తలనొప్పి. ఇప్పుడు మీతో,ఆవిడేమో నా పుట్టింటి వాళ్ల అద్దం తనే పగలగొట్టి,,పగిలిపోయిందని గోల..ఎక్కడ ఆ అద్దంతో మనం కోట్లు సంపాదిస్తామేమోనని...! అంతోటి పాత వెలిసిపోయిన అరవయ్యేళ్ళ అద్దం ఇంకెక్కడా లేనట్టు..మీరేమో మీ మొహమే కనిపించడం లేదని నస..మీ కేమైంది.." అంటూ మొగుడిని బరబరా అద్దం ముందుకు తీసుకువచ్చి " బాగా కళ్లింత చేసుకుని చూడండి..దిష్టిబొమ్మ లా కనిపిస్తారు " అంటూ మొగుడిని అద్దం ముందు నిలబెట్టి స్థాణువైనది. ఆమె నోట మాట రావడం లేదు.

అద్దంలో మొగుడు కనిపించడం లేదు.మొగుడే కాదు తనూ కనిపించడం లేదు. తమ వెనుక వున్న వస్తువులు నిక్షేపంగా కనిపిస్తున్నాయి

ఒక్కసారిగా వెనక్కి విరుచుకు పడబోయి తమాయించుకుని కళ్లు నులుముకుని మరీ చూసింది.

తనూ తన భర్త కనిపించడం లేదు.

" నిజమేనండీ మనిద్దరం అద్దంలో కనిపించడం లేదు" నూతిలో నుంచి వచ్చినట్టు మాట నీరసంగా భయంగా బయటకు వచ్చింది.

" నేనూ ఇందాకటి నుంచి అదే చెబుతున్నాను " సారథి అన్నాడు.

" అదేమిటి అద్దంలో మనం కనిపించకపోవడం ఏమిటి? మిగతా వస్తువులు నిక్షేపంగా కనిపించడం ఏమిటి? అంతా మాయగా వింతగా వుంది " అంది గోమతి బెదిరిపోతూ.

ఈలోగా హాల్లో నుంచి వాళ్ళ పిల్లల అరుపులు వినపడ్డాయి.

" మమ్మీ నా షూ " బంటీ అరుపు

" నా టై ?" స్వీటీ గోల

" అబ్బబ్బ పొద్దున్నే కిష్కిందకాండ " విసుక్కున్న గోమతికి ఒక ఆలోచన వచ్చింది.

" ఏమండీ మన బంటీ స్వీటీని పిలుద్దాం..వాళ్ళు కూడా కనిపిస్తున్నారో లేదో చూద్దాం" అంది

సారథికి ఆ ఐడియా నచ్చింది. వెంటనే పిల్లలను కేకేసి పిలిచాడు.

" మాకు స్కూల్ టైం అవుతుంది డాడీ " అంటూనే తల్లిదండ్రుల గదిలోకి వచ్చారు.

" బంటీ స్వీటీ ... ఓ సారి ఇలా అద్దం ముందు నిలుచోండి" గుండె చిక్కబట్టుకుని అంది గోమతి.

"" ఇప్పుడు ఎందుకు మమ్మీ ?" అంటూనే వెళ్లి అద్దం ముందు నిలబడ్డారు బంటీ, స్వీటీ. ఇద్దరూ కనిపిస్తున్నారు.వాళ్ళ వెనుక వున్న తామే కనిపించడం లేదు.

" బంటీ నువ్వు అద్దంలో కనిపిస్తున్నావా?" సారథి కొడుకును అడిగాడు.

" కనిపిస్తున్నాను.అక్క కూడా కనిపిస్తుంది.నువ్వూ మమ్మీ కనిపిస్తున్నారు. మమ్మీ ముక్కు మీద ఇడ్లీ పిండి కూడా కనిపిస్తుంది. నీ టీ షర్ట్ మీద టీ మరక కూడా కనిపిస్తుంది" కాస్త వివరంగా చెప్పాడు.

" నీకు ?" స్వీటీని అడిగింది గోమతి

" అబ్బా కనిపిస్తుంది మమ్మీ, అయినా ఇదేమైనా మా ప్రద్య వాళ్ళ డాడీ తెచ్చిన మ్యాజిక్ స్లేట్ లా మ్యాజిక్ మిర్రరా ?" స్వీటీ అంది.

భార్యాభర్తలు ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. పిల్లలకు అప్పుడే ఏ విషయం చెప్పదలుచుకోలేదు.అతి కష్టం మీద టెన్షన్ ను దాచిపెట్టుకుని పిల్లలను స్కూల్ కు పంపి హాలులో కూచున్నారు.

ఇద్దరి మొహాల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

★★★

పిల్లలు స్కూల్ కు వెళ్ళగానే భార్యాభర్తలు ఇద్దరు మరోసారి బెడ్ రూమ్ లోకి వెళ్లి తమ ప్రతిబింబాలు చూసుకున్నారు.అద్దంలో తమ ప్రతిబింబాలు తప్ప అన్నీ కనపడుతున్నాయి.షేవింగ్ చేసుకునే చిన్న అద్దంలో చూసాడు.ఉహూ, గోమతి తన హ్యాండ్ బ్యాగ్ లో ఉన్న టచప్ అద్దంలో చూసుకుంది.తను కనబడలేదు...!!

★★★

ఓ వైపు ఆఫీస్ టైం అయిపోతుంది, సారథికి పిచ్చెక్కినట్టుగా వుంది. ఈరోజు హెడ్ ఆఫీస్ నుంచి ఇన్స్పెక్షన్ వుంది.వెళ్ళక తప్పదు. ముందు ఆఫీస్ కు వెళ్ళాలి. అనుకుంటూ అద్దం లేకుండానే తయారయ్యాడు.కానీ తనెలా వున్నాడో తనకే తెలియడం లేదు.క్రాఫ్ సరిగ్గా వచ్చిందా? లేదా? కూడా తెలియదు. డైనింగ్ టేబుల్ మీద వున్న స్టీల్ ప్లేట్ తీసుకుని అందులో చూసుకున్నాడు.భార్యను పిలిచి అడిగాడు " అంతా బాగుందా?" అని.

" మీకేం ఒక క్రాఫ్ చూసుకుంటే సరిపోతుంది.మాకు అద్దం లేకపోతే మా బ్రతుక్కి అర్థం ఉండదు.చీర కట్టుకోవాలి. బొట్టు పెట్టుకోవాలి. అద్దంతో బోల్డు పనులు, అయినా అద్దంలో మన మొహం కనిపించకపోవడం ఏమిటి?" తనలో తనే గొణుక్కుంది.

" సరే నేను ఆఫీస్ కు వెళ్తా,సాయంత్రం వచ్చాక అద్దం సంగతి చూద్దాం" అన్నాడు .

★★★

భర్త ఆఫీస్ కు వెళ్ళాక మరోసారి అద్దంలో తన మొహం కనపడుతుందేమో అని ట్రై చేసింది. కనబడటం లేదని అర్థం అయ్యింది.చీర కట్టుకోవడం నంచి బొట్టు పెట్టుకోవడం వరకూ సమస్యే అయ్యింది. బొట్టు పెట్టుకుంటే నుదురు మీద ఎక్కడికో వెళ్ళిపోయింది.

ఆఫీస్ లో సారథి పరిస్థితి అలాగే వుంది.మధ్యాహ్నం లంచ్ చేసాక, ముక్కుకు అంటిన కర్రీ ని చూపించి నవ్వాడు కొలీగ్.ఎవరికీ ఈ విషయం చెప్పుకోలేదు. చెబితే తనను పిచ్చివాడిని చూసినట్టు చూస్తారు.ఆఫీస్ లో పని కూడా చేయలేకపోయాడు..ఆఫీసులో వున్న అద్దంలో కూడా చూసుకున్నాడు.ఆఫీస్ కు వస్తూ దారిలో కనిపించే ప్రతీ అద్దాల షాప్ ముందు ఆగి అందులోని అద్దాలలో తన ప్రతిబింబం చూసుకొని ,తన ప్రతిబింబం కనిపించకపోయేసరికి నిట్టూరుస్తూ ఆఫీస్ కు వచ్చాడు. తను ఆఫీస్ కు వచ్చేముందు భార్య అన్న మాటలు గుర్తొచ్చాయి

★★★

" నాకు మీ అమ్మ మీదే డౌట్. తానే ఏదో చేసి ఉంటుంది.నిన్న తన పుట్టింటి వాళ్ళు ఇచ్చిన అద్దం తనే పగుల కొట్టుకుందిగా...ఎక్కడ మనం ఆ అద్దాన్ని తీసుకుని కోటీశ్వరులం అయిపోతామేమోనని...ఇప్పుడు మనమీద చేతబడి చేయించి ఉంటుంది.." విచక్షణ కోల్పోతూ అంది భార్య

" మాట్లాడితే అర్థం ఉండాలి. రాత్రంతా అమ్మ ఏడుస్తూ పగిలిన అద్దం ముక్కలను తీసి పారేయకుండా,అలాగే అన్నం తినకుండా ఉంది.ఎంతైనా అరవయ్యేళ్ళుగా కాపాడుకుంటూ వస్తున్న అద్దం కదా " సారథి అన్నాడు.

★★★

ఇదంతా ఎందుకు జరిగింది? అద్దం పగిలితే అనర్థం అంటారు...అదే జరిగిందా? ఇదంతా ఆ గోమతి వాళ్ళ అన్నయ్య శేఖర్ ముంబై నుంచి వచ్చాకే జరిగింది.

ముంబై నుంచి గోమతి వాళ్ళ అన్నయ్య వచ్చాడు. అతడు పురాతన వస్తువులు సేకరించి అమ్మే ఒక పెద్ద పెద్ద షాప్ లో మేనేజర్ గా పని చేస్తాడు.అతను సారథి వాళ్ళ అమ్మను పలకరిస్తూ ఆ గదిలో వున్న నిలువెత్తు అద్దాన్ని చూసాడు. దగ్గరగా వెళ్లి పరీక్షగా చూసాడు.దాదాపు అరవయ్యేళ్ళ క్రితం అద్దం.బర్మా టేకు తో ఫ్రేమ్ చేయబడి తయారుచేసిన అద్దం.ఆ అద్దం చాలా విలువైనదిగా గుర్తించాడు. ఆ అద్దం దృఢంగా ఉక్కులా వుంది.ప్రతీరోజు శుభ్రంగా తుడవడం వల్ల ఇప్పుడే మార్కెట్ లోకి వచ్చిన అద్దంలా వుంది.

అద్దం వెనుక వైపు అద్దం ఎన్నాళ్లయినా పాడవకుండా, పగలకుండా ఏదో రసాయనం ఉపయోగించినట్టు వుంది.

చాలా విలువైన అద్దం.

ఇప్పుడు అలాంటి అద్దాలు రావడం లేదు. అది బర్మాలో తయారుచేయబడిన అద్దం. చుట్టూ నగిషీలు. ఇలాంటి వాటికి ఎక్కువ డిమాండ్ ఉంటుందని అతనికి తెలుసు. పెద్దపెద్ద ధనవంతులు ఇలాంటి పురాతన అద్దాలు సేకరిస్తారు.

వెంటనే చెల్లెలిని బావను బయటకు తీసుకువచ్చి విషయం చెప్పాడు.

" ఆ అద్దాన్ని నాకు ఇస్తే ఖరీదైన అద్దాన్ని కొంత మొత్తం డబ్బును కూడా ఇప్పిస్తానని" చెప్పాడు. ఎప్పటినుంచో బెడ్ రూమ్ లో డ్రెస్సింగ్ మిర్రర్ కొనుక్కోవాలని ఉంది గోమతికి. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది.పైగా డబ్బు కూడా ఇస్తాను అంటున్నాడు.గోమతి భర్త చెవి కొరికింది. సారథి తల్లి గదిలోకి వెళ్ళాడు.

★★★

అక్కడే తల్లికి కొడుక్కి మధ్య అద్దం సాక్షిగా గొడవ జరిగింది. కోడలు ఆ గొడవను రాజేస్తోంది.

" అమ్మా నీకు రాను రానూ చాదస్తం ఎక్కువ అవుతుంది. అరవైయ్యేళ్ల ఆ అద్దాన్ని ఏం చేసుకుంటావు ? రేపోమాపో ముక్కలవుతుంది.ఆ అద్దాన్ని మన శేఖర్ కు ఇస్తే కొత్త అద్దం దానితో పాటు డబ్బు ఇస్తాడు.కావాలంటే నీకు ఓ పెద్ద అద్దం తీసుకుంటాను " అన్నాడు.

" సారథి నా దగ్గర ఉన్న ప్రతి పైసా నీకే ఇచ్చాను. నాన్న పెన్షన్ నువ్వే తీసుకుంటున్నావ్. నాకు డబ్బు మీద వ్యామోహం లేదు.చివరికి మీ నాన్న కట్టిన తాళిబొట్టు కూడా కోడలు అడిగిందని ఇచ్చేసాను. దానిని కరిగించుకుని నెక్లెస్ చేయించుకున్నా నోరు మెదపలేదు. కానీ ఈ అద్దం నాకు తల్లి లాంటిది,బిడ్డలాంటిది.నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఈ అద్దం నాతో వుంది.మా అమ్మ అదే మీ అమ్మమ్మ చనిపోయాక మీ తాతయ్య ,మా నాన్న ఈ అద్దాన్ని నా కోసం తెచ్చాడు.నాన్న వ్యాపారం పనిమీద ఎక్కడికి వెళ్లినా ఈ అద్దంతో నా స్నేహం. నాకు ఆకలి వేసినా,బాధ అనిపించినా,అమ్మ గుర్తుకు వచ్చినా ఈ అద్దం తో చెప్పుకునేదానిని.పుట్టింటి నుంచి తెచ్చుకున్న ఖరీదైన సారె ఇదే. మీ నాన్నకు కూడా ఈ అద్దం సెంటిమెంట్ తెలుసు. అందుకే ఈ అద్దాన్ని నా గదిలో నుంచి తరలించలేదు.ఎన్ని కొత్త వస్తువులు వచ్చినా ఈ అద్దం మారలేదు.చివరికి ...చివరికి మీ నాన్న చనిపోయాక నా బాధను ఒంటరితనాన్ని పంచుకునే అద్దం. ఎన్నిసార్లు ఇళ్లు మార్చినా ప్రతీసారి ఎన్ని దెబ్బలు తగిలినా దృఢంగా వుంది. నా తోడు వుంది. డబ్బుకోసం ఈ అద్దాన్ని నా నుంచి దూరం చేయకురా.." గొంతు గాద్గదికం అవుతుండగా రెండు చేతులు జోడించి చెప్పింది తల్లి.

" మీ అమ్మ అలానే అంటుంది .ఈ అద్దాన్ని మా అన్నయ్యకు ఇచ్చేద్దాం. మహా అయితే రెండు రోజులు బాధపడుతుంది" అంది.

కోడలు అన్న ఆ మాటలు సారథి తల్లి వైదేహి చెవిన పడ్డాయి.

★★★

అర్ధరాత్రి మెలుకువ వచ్చింది భార్యాభర్తలకు . తల్లి గదిలోనుంచి భళ్ళున పగిలిన శబ్దం.వెళ్లి చూస్తే అరవయ్యేళ్ళ అద్దం పగిలి పోయింది. తల్లి చేతికి రక్తం అంటి వుంది.అద్దం ముందు కూర్చుని ఏడుస్తుంది.శేఖర్ వచ్చి చూసి " ప్చ్ ..పగిలిన

అద్దం విలువ కోల్పోయింది.మంచి ఛాన్స్ మిస్సయ్యారు.అయినా రాయితో కొట్టినా పగలని అద్దం ఇలా ఎలా పగిలింది? అతనిలో ఆశ్చర్యం. సారథి కూడా అదే షాక్ లో వున్నాడు. ఇల్లు మారినప్పుడు వ్యాన్ బోల్తా పడినా అద్దం చెక్కుచెదరలేదు. క్రికెట్ బాల్ తగిలినా అద్దానికి ఏమీ కాలేదు. అలాంటిది సున్నితమైన తల్లి చేతి దెబ్బకు అద్దం పగిలి పోవడం ఏమిటి? శేఖర్ నిరాశతో వెళ్ళిపోయాడు. గోమతి అమ్మతో గొడవపెట్టుకుంది." మేము కొత్త అద్దం కొనుక్కోవడం ఇష్టం లేక అద్దాన్ని పగులకొట్టార"ని గొడవ...తను కూడా తల్లిని నిష్టూరం ఆడాడు.

★★★

ఇది జరిగిన తెల్లవారి ఇలాంటి అనర్థం. అద్దంలో తమ ప్రతిబింబాలు కనిపించకపోవడం. అద్దం పగలడానికి ఈ సంఘటనకు ఏమైనా సంబంధం ఉందా? తల్లి దగ్గరే తేల్చుకోవాలని అనుకున్నాడు సారథి.గోమతితో సహా.!!

★★★

ఆ గదిలో ఆమె శోకాన్ని ఆవాహన చేసుకున్నట్టు వుంది. అలాగే నేల మీద పడుకుని వుంది.కిటికీలో నుంచి విభాకర కిరణాలు ఆమెను ఓదారుస్తున్నట్టు వున్నాయి..ఆ గదిలో నేలమీద చెల్లాచెదురైన అద్దం ముక్కలు ఆమె మనసులా పరుచుకుని వున్నాయి. ఎదురుగా గోడకు ఉన్న అద్దం శరీరం ముక్కలై వుంది.అద్దం మనసు విలవిల్లాడింది.

వైదేహికి దుఃఖం రావడం లేదు. విషాదం ఘనీభవించింది. ఎదురుగా అద్దం..గుండె పగిలిన అద్దం.అరవైయ్యేళ్ల అనుబంధాన్ని తనే దూరం చేసుకుంది. తనకు తనే శిక్ష వేసుకుంది.కాలం వెనక్కి వెళ్తే ఎన్నెన్ని జ్ఞాపకాలు.తండ్రి తనకోసం ఓడలో తెచ్చిన అద్దం. లంకంత ఇంట్లో ఒంటరిగా వున్న తనకు అమ్మ ..నేస్తం సమస్తం అద్దమే.

అద్దంలో చూసుకుని నవ్వుకుంది.ఏడ్చుకుంది.తనను తను ఓదార్చుకుంది.అమ్మను గుర్తు చేసుకుంది.

అద్దంతో ఆటలాడుకుంది.గౌను వేసుకుని చెంగుచెంగున గెంతులు వేసింది.అమ్మైనా బిడ్డయినా నేస్తమైనా అద్దమే.

ఓణీ వేసుకున్న తొలిరోజులు,

కాపురానికి వచ్చిన జ్ఞాపకాలు

తన బిడ్డను అద్దం ముందు నిల్చోబెట్టి ఆడించిన రోజులు

తన మనవలను అద్దం ముందు ఆడించిన రోజులు

చివరికి భర్త కన్నుమూస్తే అద్దం ముందు కూలబడి ఏడ్చిన రోజులు

అద్దంతో తన బాధ పంచుకున్న రోజులు...

రోజూ ఉదయమే తన చీరకొంగుతో అద్దాన్ని శుభ్రం చేసి ఒంటరిగా ఉన్నప్పుడు అద్దంతో మాట్లాడుకున్న రోజులు...

★★★

అలాంటి అద్దాన్ని ఇప్పుడు యాంటిక్ పీస్ పేరుతో తన నుండి వేరు చేస్తారా? అద్దం తనతోనే ఉండాలి.అద్దాన్ని గట్టిగా హత్తుకుంది.ఈ అద్దం తనతోనే ఉండాలంటే తన గుండె ముక్కలైనా సరే ,ఈ అద్దం ముక్కలు కావాలి.అప్పుడు అద్దం పగిలినా సరే తనతోనే ఉంటుంది.పగిలిన అద్దాన్ని తీసుకు వెళ్లరు. తనను ఇన్నేళ్లు అంటిపెట్టుకున్న అద్దం తనతోనే ఉంటుంది.ఆ స్వార్థమే ఆమె గుండెకోతకు కారణం అయ్యింది. ట్రంకు పెట్టెలో ఉన్న సుత్తి తీసుకువచ్చింది.కళ్ళు మూసుకుంది.పంటి బిగువున బాధను భరిస్తూ అద్దం మీద సుత్తితో దెబ్బ వేసింది.అద్దం చెక్కు చెదరలేదు.కానీ వైదేహి గుండె చెదిరింది.

" నువ్వు పగిలితే తప్ప నా దగ్గర వుండవు " ఆమె మనసులో బాధ.. సుత్తి కిందపడేసి గుండెలు బాదుకొని.అదే చేతులతో అద్దాన్ని బాదింది.ఆమె గుండె బాధకు అద్దం మనసు కన్నీటి ముక్కలైంది.అద్దం పగిలింది .ఆమె చేతులకు రక్తాన్ని మిగిల్చి.

" అయ్యో చిట్టి తల్లీ..నేనే గాయాన్ని చేసానా?" అద్దం విలపించింది.

★★★

సారథి ఇంటికి వచ్చాడు .గోమతిలో టెన్షన్ భయం కనిపిస్తున్నాయి. పిల్లలు ఆడుకోవడానికి పక్కింటికి వెళ్లారు.సారథి వస్తూనే తల్లిగదివైపు చూసాడు. భార్యను అడిగాడు" అమ్మ భోజనం చేసిందా ? అని.

' పిలిచాను రాలేదు" ముక్తసరిగా చెప్పి అంది" ముందు మన సంగతి ఆలోచించండి. మనకే ఎందుకిలా జరుగుతోంది?" బాధ భయం భార్య గొంతులో.

" దీనికి అమ్మ దగ్గరే సమాధానం దొరకాలి. బాగా ఆలోచిస్తే అద్దం పగిలినప్పటి నుంచే ఇలా జరుగుతోంది "అన్నాడు సారథి

అదీ నిజమే అనిపించింది గోమతికి " ఇప్పుడేం చేద్దాం? అడిగింది

" అమ్మ దగ్గరికి వెళ్లి ఏం జరిగిందో కనుక్కుందాం " అంటూ తల్లి గదివైపు కదిలారు.

అప్పుడే లోపలి నుంచి మాటలు. తల్లి గొంతు తో పాటు మరో గొంతు.ఆశ్చర్యంగా అలాగే తల్లి గదిముందు నిలబడిపోయారు.

★★★

వైదేహి పగిలిన అద్దం వైపు చూసింది.ఆమెకు బాధగా వుంది. ఒక అపురూపమైన వస్తువు..అరవయ్యేళ్లు తనతో వున్న వస్తువు.తనే ధ్వంసం చేసింది.

" నన్ను క్షమించు.నిన్ను నా నుంచి దూరం చేస్తుంటే తట్టుకోలేక నీ గుండెను ముక్కలు చేశాను " అద్దం ముందు నిలబడి విలపిస్తోంది.

సృష్టి వైచిత్రి లో ఒక అద్భుతం స్వరం అయ్యింది.అద్దం గొంతు విప్పింది.

" నాకు నేనుగా ముక్కలయ్యాను. నీ వేదన చూసి,నీకు దూరంగా ఉండలేక నేనే ముక్కలయ్యాను." అద్దం మాట్లాడుతోంది.

" నన్ను దూరం చేసుకోకూడదన్న నీ ప్రేమ నాకు అర్థమైంది..అందుకే నేను ముక్కలయ్యాను"

" నా మీద కోపంగా లేదా? నా తల్లిని నా బిడ్డను నేనే చంపుకున్నాను.ముక్కలు చేసుకున్నాను." అద్దాన్ని ముద్దాడుతూ అంది వైదేహి.

" నా కోపం నీ బిడ్డ మీద,నీ కోడలు మీద. అందుకే వారి మీద అలిగాను.జీవితంలో వాళ్ళు వాళ్ళ మొహాలు శరీరాలను అద్దంలో చూసుకోలేరు..ఏ అద్దం వారికి వారి ప్రతిబింబాలు చూపించదు" అద్దం చెప్పింది.

" ఈ శిక్ష ఏమిటి? తప్పు చేసింది నేను కదా?" వైదేహి అంది.

" కాదు వాళ్ళు. ఒక్కరోజు వాళ్ళ మొహం అద్దంలో చూసుకోలేకపోతున్నందుకు వాళ్ళు అంతగా బాధ పడుతున్నారు. తల్లి మనసును వారి గుండె అద్దంలో చూస్తే తెలిసేది, నీ బాధ వారికి కనిపించేది." అద్దం జీవిత సత్యం సృష్టి రహస్యం చెప్పింది.

' అలాగని నిన్ను దూరం చేసుకున్న బాధలో నుంచి తేరుకోకుండానే వారికి ఈ శిక్ష వేస్తావా?" వైదేహి అడిగింది.

" మరి నీ బాధ వాళ్లకు తెలియలిగా,నీ గుండె అద్దం పగిలి ముక్కలై,కనిపించకుండా పోయిన మాటేమిటి? అద్దం అడిగింది.

" నా బాధ చూడలేక నువ్వు ముక్కలయ్యావు కదా...మరి నా బిడ్డ బాధ నేను చూడలేక ఏం కావాలి" వైదేహి తల్లి మనసు తపన కంటతడితో అడిగింది.

ఒక్కసారిగా గది బయట ఈ మాటలు వింటున్న సారథి తననెవరో చర్నాకోల తో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు.అమ్మ అద్దాన్ని దూరం చేసుకోవడం ఇష్టం లేక ,ముక్కలు చేసింది..

" నిన్ను నేను దూరం చేసుకున్నానని నువ్వెంత బాధ పడుతున్నావో,నా బిడ్డల మొహాలు అద్దానికి దూరంగా ఉంటే నేనూ అంతే బాధ పడుతాను.నీ బిడ్డ మనసు అర్థం చేసుకున్న నువ్వు నీ  బిడ్డ మనసులో నా బిడ్డ మీద వున్న ప్రేమ అర్థం చేసుకోవా? అద్దాన్ని అడిగింది అమ్మ

★★★

తను ,గోమతి కలిసి అమ్మ ప్రేమను ముక్కలు చేసి ...

అద్దం మాటల్లో అర్థం అర్థం అయ్యింది.అమ్మ ప్రేమలో గొప్పతనం తెలిసివచ్చింది.

తలుపులు తోసుకుని వెళ్లి తల్లి పాదాల మీద పడ్డాడు. కన్నీళ్లే క్షమాపణ కోరాడు సారథి..అక్కడ అమ్మ అద్దం వైపు చూస్తూ తన పాదాల మీద పడ్డ బిడ్డను గుండెలకు హత్తుకుంది.

పగిలిన అద్దం ముక్కల్లో కంటతడి. గోమతి పశ్చాత్తాపం. . పగిలిన అద్దం ముక్కల్లో కనిపిస్తోంది.

తల్లి ఒడిలో పడుకుని క్షమించమని వేడుకుంటున్న సారథి ప్రతిబింబం కనిపిస్తోంది.

★★★

ఒక్కో అద్దం ముక్కను బర్మాటేకుతో చేసిన ఫ్రేమ్ కు అతికిస్తున్నారు సారథి గోమతి...

ముక్కలైన అద్దం అతికింది.అతికిన అద్దం ప్రేమగా వైదేహి వైపు చూసింది. ఆమె కళ్ళలో ఆనందం అద్దంలో ప్రతిబింబించింది. కొడుకు  పశ్చాత్తాపంతో ముక్కలైన తల్లి మనసు తేలికైంది  .

ఇప్పుడు అద్దంలో సారథి,గోమతి ప్రతిరూపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అద్దం అలిగితే ...

ఒక జీవిత సత్యం కనిపించింది. తన స్వరం వినిపించింది.

ఇది ఊహే కావచ్చు. ఆలోచిస్తే నిజమే కావచ్చు.

★★★

( తల్లి మనసును అద్దంలా చూసుకునే కొడుకులకు ఈ కథ అంకితం..రచయిత )

# ప్రశ్నించే హక్కు          పుట్టగంటి గోపీకృష్ణ

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
## బహుమతి పొందిన కథ

త్రేతాయుగం...

దశరథుడి యాగఫలంగా రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు జన్మించారు.

అయోధ్య పండుగ చేసుకుంది.

ఆ తరువాత రాముడితో పాటే అయోధ్య ఆడుకుంది, పాడుకుంది. రాముడి బాధను తన బాధగా భావించింది. అతని నిర్ణయాలను శిరసావహించింది. రోజులు గడిచాయి. రావణ వధ జరిగింది. వనవాసం పూర్తయింది. పట్టాభిషేకం జరిగింది. కానీ ఎవరో ఏదో అన్నారని రాముడు అంతకాలం తనను అనుసరించిన సాధ్వి సీతను త్యజించాడు. ఎన్నో సంవత్సరాల తరువాత... తిరిగి సీతను పొందలేక పోయినా, కొడుకులను కలుసుకున్నాడు. ఒక యుగం ముగింపుకు వచ్చింది.

అలాంటి సమయంలో వినవచ్చింది ఒక వార్త.

రాముడు ప్రాయోపవేశం చేయబోతున్నాడట. ఆ వార్త తెలిసి అయోధ్య గుండె గుభిల్లుమంది.

రాముడు ఎప్పుడూ ఇంతే! తను ప్రశాంతంగానే ఉంటాడు. కానీ, కానీ అతని చర్యలను అర్థం చేసుకునే ప్రయత్నంలో ఎంతో మందికి కంటి మీద కునుకు లేకుండా పోయింది.

చిరు ప్రాయంలోనే ఎక్కడో ఆకాశంలో కనిపించే చందమామను తన చేతికివ్వందే కుదరదని మారాం చేసి ముగ్గురు అమ్మల గుండెలు గుభిళ్లుమనిపించాడు. అదృష్టం కొద్దీ అద్దంలో చందమామను చూసి రాముడు త్వరగానే మాయలో పడ్డాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎక్కడ దశరథుడు నిజంగా తనను తీసుకు వెళ్లి రాముడికి ఆటబొమ్మను చేస్తాడో అని ఆకాశంలో చంద్రుడి పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయంట.

ఓర చూపుల సీత మీద ధ్యాసతో ఎక్కుపెట్టమని ఇచ్చిన విల్లుని ఫెళ్లుమని విరిచి సభాసదుల ఒడలు ఝల్లుమనిపించాడు. పొంగుకొస్తున్న ఆనందాన్ని పెదిమ చివరల్లో బంధించిన సీత శరీరం ఆనందంతో పులకరించిందని ఆమెకి తప్ప ఎవరికి తెలుసు?

తండ్రి మాట నిలపటం కోసం అడవి బాట పట్టి తమ్ములను శోకానికి గురి చేశాడు. ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు రాముని అడవి బాట తమ ప్రాణాల మీదకు వచ్చిందని అరణ్యాల్లో నివసించే రాక్షసులు కుమిలికుమిలి ఏడ్చారని వారికి మాత్రమే తెలుసు.

రామబాణానికి కూలిపోయిన మహాబలుడు వాలిని చూసిన వానర సమూహానికి ఒంట్లో శక్తి హరించుకు పోయినట్లు అయింది. తాను నమ్మిన దేవుడి బలం మొదటిసారి చూసి హనుమంతుడికి లేశ మాత్రం గర్వం ఉన్నట్లయితే అది హరించుకు పోయింది.

సీతాదేవిని అగ్నిప్రవేశం చేయమని ఆదేశించి యుద్ధ రంగంలో ఉన్న అందరినీ శోకతప్త హృదయులను చేశాడు. ఆ సాధ్వి తీక్షణతను తను తట్టుకోగలనా అని అగ్ని దేవుడు భయంతో వణికి పోయాడని రాముడికి తప్ప ఎవరికి తెలుసు?

అలాంటి రాముడు ఇప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో ఎవరికీ తెలియటం లేదు. లవకుశులకు పట్టాభిషేకం చేసి తను ప్రాయోపవేశం చేయవలసిన అవసరం ఇప్పుడు ఏమి వచ్చిందో?

ఎవరికయినా అర్థమవటానికి రాముడెప్పుడన్నా రెండు మాటలకు మించి నోరు తెరచి మాట్లాడాడు కనుకనా?

గత కొన్ని రోజులుగా అయోధ్యలో ఏదేదో జరుగుతోంది. ఎవరో వచ్చి రాముడ్ని రహస్యంగా కలుసుకుని వెళ్లారు. ఆ వచ్చింది యముడే అని అందరూ అనుకుంటున్నారు. ఆయన ఏం అడిగాడో, ఈ రాముడు ఏం చెప్పాడో కానీ గందరగోళపు నిర్ణయాలు వడివడిగా జరిగి పోతున్నాయి.

రాముడి ప్రాయోపవేశ నిర్ణయం ముందే తెలుసేమో, ఆ ఘోరం చూడలేనట్లు... లక్ష్మణుడు ఎవరికీ చెప్పకుండా సరయూ నది ఒడ్డున ఊపిరి బిగబట్టి కూర్చున్నాడంట. ఆ తరువాత ఏం జరిగిందో ఎవరూ సరిగ్గా చెప్పలేక పోతున్నారు. అప్పటి నుండి ఆ లక్ష్మణుడు మాత్రం కనపడటం లేదు. దేవేంద్రుడే దిగి వచ్చి లక్ష్మణుడిని సశరీరంగా స్వర్గానికి తీసుకుపోయాడని ఒక పుకారు.

భరతుడు అన్ననే అనుసరించబోతున్నాడనీ, శత్రుఘ్నుడు కూడా తన రాజ్యాన్ని కొడుకులకు అప్పచెప్పి అయోధ్యకి బయలుదేరాడని తెలుస్తోంది.

కోసల దేశం నలుమూలల నుండి జనాలు తండోప తండాలుగా అయోధ్య వేపు బయలుదేరారు.

వందల మందితో మొదలయిన ఆ సమూహం వేలు, లక్షలుగా మారి మహా ప్రభంజనమయింది. నది సముద్రున్ని చేరటం మామూలు. సరయు నది ఒడ్డుకు చేరుతున్న జనాన్ని చూస్తుంటే సరయులో కలవటానికి సముద్రుడే తోసుకు వస్తున్నట్లు ఉంది.

తొక్కుకుంటూ తోసుకుంటూ నలువేపుల నుండి చేరుతున్న జనాల పద ఘట్టనలకు లేచిన ధూళి అలముకుని అయోధ్యలోని భవంతులకు వేసిన రంగులు వెలతెలా పోతున్నాయి. ఎప్పుడూ రాముడి కీర్తనలతో ప్రతిధ్వనించే వీధులు ఉప్పెనలా పరుగులు తీస్తున్న జనాల చేతుల్లోని పిల్లల ఏడుపులకు తల్లడిల్లుతున్నాయి.

అంత సంరంభంతో అయోధ్య సతమవుతుంటే, అదే నగరంలో ఒక పక్క వీధిలో, ఒక మూల ఇంట్లో కూర్మడనే వాడు మాత్రం ఇంకా గాఢంగా నిద్రపోతున్నాడు.

రాముడు పుట్టిన అయోధ్యలోనే కూర్మడు కూడా పుట్టాడు.

వాడు పుట్టినపుడు ఎవరో ఒక అయ్యోరు వాడి జాతకం చూసి, "ఈ బిడ్డడికి తెలివి అపారం. కానీ ఆలోచనలు అపసవ్యం. నలుగురు నడిచిన బాటన నడవడు. అయితే వైరాగ్యంతో విరాగి అవుతాడు. లేదూ... అందరినీ ఎదిరించి ఆత్మాధికార మోక్షం పొందుతాడు." అన్నాడు.

ఆ జవాబు విని కూర్మడి తల్లితండ్రుల అనుమానం తీరకపోగా అయోమయం మరింత ఎక్కువయింది. అయితే ఆ మాటల అర్థం కూర్మడు పెద్దవాడయ్యే కొద్దీ తెలిసింది. వాడి మదిలో అన్నీ ప్రశ్నలే. ఎవరు చేసిందీ వాడికి నచ్చదు. అందరినీ తన ప్రశ్నలతో విసిగించేవాడు.

ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వాళ్ళు తమ అసమర్ధతని బయట పెట్టుకోకుండా కూర్మడికి రెటమతమని ముద్ర వేశారు.

మిగిలిన విషయాలు ఎలా ఉన్నా అందరిలానే కూర్మడికి కూడా రాముడంటే ఇష్టం. యవ్వనంలో తన వయసే ఉన్న, తన ఆరాధ్య పురుషుడికి పట్టాభిషేకం అని తెలిసి పొంగి పోయాడు. ఆఖరి నిమిషంలో పట్టాభిషేకానికి బదులు రాముడు వనవాసం వెళ్తున్నాడన్నారు. అందరూ ఎంతో బాధ పడ్డారు.

అయితే బహిరంగంగా ఆ నిర్ణయాన్ని ప్రశ్నించింది కూర్మడు ఒకడే! 'రాముడొస్తే తమ బతుకులు మారతాయని లచ్చలాది మంది ఎదురు చూస్తుంటే, తండ్రికిచ్చిన మాటకోసం ఇన్ని లచ్చల మంది ఆశని పట్టించుకోనివాడు దేవుడెట్లా అవుతాడు?' అని బహిరంగంగా ఆక్రోశించాడు.

అది తన దేవుడు దూరమయిన బాధ అనుకున్నారు అందరూ.

ఆ తరువాత క్షణమొక యుగంగా రాముని వనవాసం పూర్తికావటానికి నిరీక్షించాడు అతను. అనుకోకుండా సీతాదేవి అపహరణకి గురయిందని తెలిసింది. తన తల్లికే కష్టం వచ్చినట్లు బాధ పడ్డాడు. ఎప్పుడు ఏం జరుగుతుందో

తెలియక నరకం అనుభవించాడు. ఎట్టకేలకు రావణుడు వధింపబడ్డాడు. పోనీలే కథ పూర్తయిందనుకుంటే సీతాదేవిని అగ్నిప్రవేశం చేయమని ఆదేశించాడు రాముడు. అక్కడ సీత సంగతి ఏమో కానీ ఇక్కడ కూర్మడు హతాశుడయ్యాడు. ఆమెని అవమానించటం ఎవరి తృప్తి కోసం అని ప్రశ్నించాడు. అతని ప్రశ్నకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు.

ఎట్టకేలకు అతని కోరిక తీరుస్తూ అయోధ్యకు రాముడొచ్చాడు. అభిషిక్తుడయ్యాడు. రామరాజ్యం వచ్చింది. ఆ ఆనందం పట్టుమని పది రోజులు కూడా అనుభవించకుండా ఎవడో ఏదో అన్నాడని తిరిగి సీతాదేవిని అడవుల పాలు చేశాడు రాముడు. అదేమి నిర్ణయమని బహిరంగంగా ప్రశ్నించాడు కూర్మడు. ఇదే రామరాజ్యం అయితే ఇలాంటి రామరాజ్యం నాకు వద్దు అన్నాడు. అందరూ అతని మాటలకు కోపగించుకున్నారు. కొందరు అతనికి మతిపోయిందని నవ్వారు. ఎగతాళి చేశారు. అతన్ని ఓ పిచ్చివాడి కింద జమకట్టారు. అందరూ ఎగతాళి చేస్తుంటే అతను మరింత మొండికేశాడు. "రామరాజ్యమంటే అందరికీ న్యాయం జరగాలి. అంతే కానీ ఎవరో తృప్తి కోసం తన భార్యని అడవులకు పంపటం రాజు లక్షణం కాదు." అన్నాడు.

ఈ మాటలు ఆ నోటా ఈ నోటా వేగుల ద్వారా రాముడి చెవిన పడ్డాయి.

అప్పటికే ఇలాంటి ఓ పిచ్చివాడి మాటలు విని సీతాదేవిని అడవిపాలు చేసి ఉన్నాడు రాముడు. ఇప్పుడీ మాటలకు ఏం చేస్తాడో అని రాముడి చుట్టూ ఉన్న వారు హడలి పోయారు.

అయితే వారు అనుకున్నట్లు రాముడు ఏమీ చెయ్యలేదు. తనదైన ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ కూర్మడు మరింత మొండివాడయ్యాడు. "ఎవరెవరికో అన్నీ ఇచ్చాడు రాముడు. రాయిగా పడి ఉన్న అహల్యకు అడగకుండానే శాప విమోచనం కలిగించాడు. సహాయం కోరి దరి చేరిన సుగ్రీవుడు అడగగానే అతని అన్నను చాటు నుండి చంపి మరీ రాజ్యం ఇప్పించాడు. రావణుడ్ని చంపి ఆ రాజ్యం తను తీసుకోకుండా అతని తమ్ముడు విభీషణుడికి వదిలేశాడు. ఎంగిలి పళ్లు తిని మరీ శబరికి ముక్తి ప్రసాదించాడు. ఇవన్నీ రాజు కాకముందే చేశాడు. మరి రాజయ్యాక ఏం చేశాడు? భార్యని అడవులకు పంపాడు. కన్న బిడ్డల్ని దూరంగా పెట్టాడు. ఎవరిని సంతోష పెట్టటానికి ఈ నిర్ణయం? ఎవరిని మాయ పుచ్చటానికి ఈ పని? ఎందుకీ మార్పు? అనే అతని ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పటం లేదు.

కానీ అతను వేస్తున్న ప్రశ్నలన్నీ వేగుల ద్వారా రాముడికి చేరుతూనే ఉన్నాయి. వాటికి ఏనాడూ రాముడు జవాబు ఇచ్చే ప్రయత్నం చేయలేదు. అలా అని కూర్చుడిని శిక్షించే ప్రయత్నమూ చేయలేదు.

తన ఇంట్లో ఒక మూల పడుకుని నిద్ర పోతున్న కూర్మడి చెవిలో, సరయు నది తీరానికి చేరుతున్న జన సందోహపు సందడి చేరింది.

నిద్రా భంగమయి లేచి కూర్చున్న అతను, "ఏంటిరా ఈ సంరంభం? ఈ జనాలకి పిచ్చి పట్టిందా? ఎటు పోతున్నారు వీళ్లంతా?" అంటూ అడిగాడు కొడుకుని. అతని కొడుకు అప్పుడే బయట నుండి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

తండ్రి మాటకు బదులివ్వకుండా సరాసరి తల్లి దగ్గరకు వెళ్ళాడు ఆ పిల్లాడు. "అమ్మా! లెగవ్వే! రాములోరు సొర్గానికి ఎళ్తన్నారంట. ఆరితో ఎళ్తే అందరూ సొర్గానికి పోవొచ్చంట..." ఒగరుస్తూ చెప్పాడా కుర్రాడు.

రాముడ్ని విమర్శిస్తున్నాడని ముందుగా కూర్మడ్ని అయోధ్య పట్టించుకోవటం మానేసింది. ఆ తరువాత అతని వాడ, వీధి అతన్ని ఒక మనిషిగా లెక్కించటం మానేశాయి. కాల క్రమంలో ఇంట్లో వాళ్లు కూడా అతన్ని తమలో ఒకడిగా భావించటం మానేశారు.

అందరూ వెలి వేసినట్లు చూస్తుంటే కూర్మడు మరింత మొండికేశాడు. రాముడు చేస్తున్న ప్రతి పనినీ ప్రశ్నించటమే పనిగా పెట్టుకున్నాడు.

ప్రశ్న అడిగిన తనకు సమాధానం చెప్పకుండా తల్లితో మాట్లాడుతున్న కొడుకును చూస్తే కూర్మడి కోపం నషాళానికి అంటింది.

అతను కోపంగా ఏదో అనబోయేటంతలో, "రాములోరు సొర్గానికి పోటమేంట్రా?" ఉలిక్కిపడి లేచి నిలబడుతూ అంది కూర్మడి భార్య. ఆమెకు రెండు రోజులుగా జ్వరం. మగతగా పడుకుని ఉండటంతో బయట జరుగుతున్న విషయాలు తెలియవు.

"అందరూ అనుకుంటున్నారే. అందుకే అలా పరుగెడుతున్నారు..." చెప్పాడు కొడుకు.

బయటకు ఒక చూపు చూసింది ఆమె. కొడుకు చెప్పింది నిజం కాకపోతే ఇంత మంది ఎందుకు పరుగులు తీస్తారు? అది కూడా ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ఆ అవకాశం దొరకనట్లు ఒకరిని ఒకరు తోసుకుంటూ పరుగులు తీస్తున్నారు. "మనం కూడా పోదామంట్రా?" అంది ఆమె కొడుకుతో.

"దేనికి చావటానికా?" అమె మాటకు అడ్డు వస్తూ అన్నాడు కూర్మడు వ్యంగ్యంగా.

ఎప్పటిలానే... అందరిలానే, అతని మాటల్ని కొడుకు పట్టించుకోలేదు. "రాముడంటే దేవుడని చెప్పింది నువ్వే కదమ్మా. ఆ దేవుడు లేని ఈ లోకం మనకెందుకు? ఆయన వెనుకే మనమూ వెళ్దాం... అలా అయితే సరాసరి సొర్గానికి ఎళ్తామంట," అన్నాడు తల్లితో.

"కుర్ర కుంకా! రాముడి సంగతి నీకు తెలియదురా. ఆయన ఎనక ఊరంతా పరుగెత్తటం ఇది మొదటిసారి కాదు..." ఎగతాళిగా అన్నాడు కూర్మడు. "మొదటిసారి నేను కూడా ఇలానే పరుగులు పెట్టాను. పట్టాభిషేకం చేసుకోవాల్సిన రాముడు వనవాసానికి వెళ్తున్నాడని తెలిసి అయోధ్య మొత్తం కట్రాట అయింది. ఇప్పటిలానే అప్పుడు కూడా రాముడు లేని రాజ్యంలో మేము ఉండలేమంటూ ఊరి జనాలు తంబలు తంబలుగా బయలుదేరారు. చివరికి ఏమయింది?

పొలిమేరల్దాకా పోయినాక, ఆ రాముడు ఎనక్కి చూసి, మీరంతా అడవికి రాకూడదు. ఆ భాగ్యం నాకే... అన్నాడు. అంతే... ఎలా పోయిన వాళ్లం అలా వెనక్కి వచ్చేశాం. ఇప్పుడూ అట్టాగే ఏదో చెప్తాడు. ఈ పరుగెత్తుతున్న జనాలంతా ఎర్రిమొకాలేసుకుని ఎనక్కి వస్తారు."

"ఈ సోది కబుర్లకేం గానీ... తొందరగా చెప్పు. నువ్వు మాతో వస్తున్నావా? లేదా?" అంది కూర్మడి భార్య.

"ఏడకే నేను వచ్చేది? చెవుతుంటే అర్థం కాలా... కాసేపాగి మీరే ఈసురోమంటూ ఎనక్కి తిరిగి వత్తారు. పనికిరాని పరుగులు, కాళ్ల నొప్పులు తప్ప మిగిలేదేం ఉండదు." తను తయారు చేసిన కుండలు సర్ది, బండి మీదకి ఎగిరి కూర్చుని అమ్ముకోవటానికి బయలుదేరుతూ అన్నాడు కూర్మడు.

ఇక అతన్ని పట్టించుకోకుండా కొడుకుతో కలిసి అనారోగ్యంతోనే బయటకు నడిచింది కూర్మడి భార్య. ప్రవాహంలా సాగిపోతున్న జన సందోహంలో కలిసి పోయి కొన్ని క్షణాల్లో కనపడకుండా పోయింది.

ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెది మరో దారి అన్నట్లు కూర్మడు అయోధ్య ప్రజలు వెళ్తున్న దిక్కుకి వ్యతిరేకంగా సాగిపోయాడు.

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. ఎంత దూరం ప్రయాణించినా ప్రజలందరిదీ ఒకే దారిలా ఉంది. అందరూ ఉరుకులు పరుగులు పెడుతూ సరయూ తీరానికి పరుగులు పెడుతున్నారు. కాసేపటికి ఆ జన ప్రవాహం కూడా తరిగి పోయింది. ఇప్పుడు ఎక్కడా జన సంచారమే కనపడటం లేదు. జనాలే లేకపోతే ఇక వ్యాపారం చేసేది ఎలా? ఒక్క కుండ కూడా అమ్ముడు పోలా. ఇంత మంది జనం నమ్మింది తప్పు ఎలా అవుతుందని మొదటిసారి అతనికి అనుమానం వచ్చింది. అందుకే ఇక తన పని మానుకుని వెనక్కి తిరిగాడు అతను.

తిరిగి తన ఇంటి దగ్గరకు చేరుకున్నాడు. ఇంట్లోకి నడిచాడు. అక్కడ ఎవరూ లేరు. భార్యా, కొడుకూ జనాలతో సరయూ తీరానికి వెళ్లారని గుర్తు వచ్చింది. వారు ఇంకా తిరిగి వచ్చినట్లు లేదు.

రాముడు లేని రాజ్యంలో పాలనా బాధ్యత తను తీసుకున్నట్లు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

లేచి ఇంట్లో నుండి బయటకు వచ్చాడు కూర్మడు.

కనుచూపు మేర మనిషన్నవాడు కనపడ లేదు. ఎక్కడా ఒక్క శబ్దం కూడా వినపడటం లేదు.

పక్కింట్లోకి తొంగి చూశాడు. అక్కడ కూడా ఎవరూ లేరు. మరో ఇంట్లో, ఆ పక్కింట్లో కూడా ఎవరూ లేరు. ఒక్కసారిగా కూర్మడికి అనుమానం వచ్చింది. నిజంగానే వీళ్లందరూ రాముడితో పాటు ప్రాణాలు విడవటానికి వెళ్లారా? నిజంగానే వాళ్లందరూ స్వర్గానికి వెళ్తున్నారా?

అప్పుడే ఏదో తట్టినట్లు ఆకాశంలోకి చూశాడతను. ఒక్క పక్షి కూడా ఆకాశంలో కనపడ లేదు. అరుదయిన రాముడి కోపాన్ని చవి చూసిన కాకాసురుడి వారసులు కాకులు ఎప్పుడూ కావుకావుమంటూ ఇళ్ల చుట్టూ తిరుగుతూ

ఉండేవి. అవి కూడా కట్టకట్టుకున్నట్లు ఎటో పోయాయి. ఒక్కటీ కనపడ లేదు. చెట్ల కొమ్మల మీద ఆడుకుంటూ అటుఇటు తిరిగే ఉడుతలూ లేవు. పెరళ్లలో లేగ దూడల్ని కట్టేయటానికి ఉపయోగించే కట్టుకొయ్యలు ఉన్నాయి తప్ప లేగ దూడలు లేవు.

పశువులు, పక్షులు కూడా ఎక్కడికి వెళ్లాయో అతనికి అర్థం కాలేదు.

ఈ వీధిలో వాళ్లందరూ సరయూ తీరానికి పోయారా ఏమిటి అనుకుంటూ పక్క వీధిలోకి వెళ్లాడు కూర్మడు. అక్కడ కూడా ఇదే వాతావరణం. అక్కడే కాదు, ఆ పక్క వీధిలో, దాని పక్క వీధిలో కూడా ఎవరూ లేరు.

నిజంగా రాముడు అందర్నీ తనతో తీసుకు వెళ్తున్నాడా? ఎవరూ లేని అయోధ్యలో తను మిగిలి పోయాడా?... అనుకునే సరికి కూర్మడి గుండె గుభిల్లుమంది.

ఒక్కసారిగా సరయు నది తీరానికి పరుగందుకున్నాడతను. వస్తున్న అలుపును అదుపులో పెట్టుకుంటూ పరుగు తీస్తూనే ఉన్నాడు. ఎంత పరుగు తీసినా ఎవరూ కనపడ లేదు. ఎటు చూసినా నిర్మానుష్యమే. గుంపులు గుంపులుగా వెళ్లిన జనాలు ఏమయ్యారో తెలియదు. మరింత ముందుకు వెళ్లాడతను. ఎదురుగా సరయు నది యుగయుగాలుగా ప్రవహించినట్లే ప్రశాంతంగా, నిర్మలంగా ప్రవహిస్తూ ఉంది. నర సంచారం అంటూ అక్కడ లేదు.

ఇంతలో అతని చూపు దూరంగా నిలబడి ఉన్న రెండు ఆకారాల మీద పడింది. వారెవరో అర్థం కాక అటు పరుగెత్తాడతను. దగ్గరకు వెళ్లాక తెలిసింది వారు హనుమంతుడు, విభీషణుడు అని. ఇద్దరికిద్దరూ రాముడి వీర భక్తులే. మరి వీరు ప్రాయోపవేశం చేయకుండా ఇక్కడే ఎందుకు ఉండి పోయారో అతనికి అర్థం కాలేదు. నది ఒడ్డున నిలబడి నిర్నిమేష దృక్కులతో దీర్ఘంగా చూస్తున్నారు వారిద్దరూ.

"ఇటు వచ్చిన జనాలంతా ఏమయ్యారు?" హనుమంతుడికి దండం పెడుతూ అడిగాడు కూర్మడు. అతనికి రాముడంటే ఎలాంటి అభిప్రాయం ఉన్నా, హనుమంతుడంటే మాత్రం చాలా గొప్ప అభిప్రాయం ఉంది.

వేలు పైకి చూపించాడు హనుమంతుడు.

"మరి రాముడు?"

"రాముడేగా ముందు మహా ప్రస్తానం చేశాడు."

"అంటే?"

"ఆయన ఈ లోకాన్ని త్యజించారు. అగ్నిహోత్రంతో బ్రాహ్మలు దారి చూపుతుంటే, పట్టు బట్టలు ధరించిన రాముడు గాయత్రి మంత్రాన్ని జపిస్తూ నదిలోకి నడిచాడు. సిరి సంపదలు, అస్త్రశస్త్రాలు ఆయన్ని అనుసరించాయి. యావన్మంది ప్రజలు, క్రిమి కీటకాలు, పశువులు, పక్షులు, చరచరాలన్నీ మరో ఆలోచన లేకుండా తమ దేవుడ్ని అనుసరించాయి. ఊర్ధ్వ లోకం నుండి దిగివచ్చిన బ్రహ్మ దారి చూపుతుంటే అందరూ స్వర్గానికి వెళ్లి పోయారు."

"అంటే ఆ మహా జన ప్రవాహం అంతా...?" ఇంకా అనుమానం తీరక అడిగాడు కూర్మడు.

"అందరూ స్వర్గానికి వెళ్లి పోయారు."

"మరి మీరు?"

"ఆయన్ని అనుసరించే అనుమతి మాకు దొరక లేదు. చిరంజీవులుగా ఉండమని మమ్మల్నిద్దరినీ ఆజ్ఞాపించాడు రాముడు. అది వరమో, శాపమో తెలియక అల్లాడుతున్నాం..." విచారంగా చెప్పాడు హనుమంతుడు. మరో వైపు విభీషణుడు కూడా తను రాముడ్ని అనుసరించలేక పోయినందుకు కుమిలి పోతున్నాడు.

నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా కళకళలాడే అయోధ్యని అలా నిర్మానుష్యంగా చూడలేక పోయాడు కూర్మడు. అందరితో పాటు తన భార్య, కొడుకు కూడా ఇక కనిపించరని అతనికి అర్ధమయింది. ఎవరూ లేని ఈ లోకంలో తను ఒంటరిగా బ్రతకాలా?...

ఆ మాట తలచుకోగానే అతనికి ఒక్కసారిగా ఈ ప్రపంచం మీద విరక్తి కలిగింది. తను కూడా సరయు నది వేపు పరుగెత్త బోయాడు.

"ఆగు..." అన్నాడు హనుమంతుడు అతన్ని ఆపుతూ. "నీ భార్యా, పిల్లలకు దక్కింది దేవుని సాన్నిధ్యం. ఇప్పుడు నీవు చేసుకోబోతోంది ఆత్మహత్య. ఇది పాపం. ఈ పాపానికి ప్రాయశ్చిత్తం కూడా ఉండదు."

"ఎందుకు నాకీ శిక్ష? ఎవరూ లేని ఈ లోకంలో నేను ఎందుకు ఉండాలి?" రోదిస్తూ అన్నాడు కూర్మడు.

సమాధానం హనుమంతుడు చెప్పాడు. "రాముడితో లోకం అంతం కాలేదు. కాబోదు కూడా. నేనూ నన్నెందుకు తీసుకు వెళ్లటం లేదని రాముడ్ని అడిగాను. తన నామం లోకంలో వినిపించేటంత వరకు నేను ఇక్కడ ఉండాల్సిందే అని చెప్పాడు."

"మీరు ఆయన భక్తులు. మీకు ఒక లక్ష్యం ఉంది. నేను ద్రోహిని. ఆయన చేసిన ప్రతి పనినీ విమర్శిస్తూనే ఉన్నాను. మరి నేనెందుకు బ్రతకాలి?"

"ఆ రాముడు నీకు కూడా ఒక లక్ష్యం నిర్దేశించాడు."

"ఆయన నన్ను గుర్తు పెట్టుకుని నా గురించి చెప్పారా?" ఆశ్చర్యంగా అడిగాడు కూర్మడు. "నాలాంటి భ్రష్టుడు చేయగలిగిన పని ఏముంటుంది?"

"నీ ప్రశ్నలోనే సమాధానం ఉంది. నీకున్న ప్రశ్నించే గుణం కారణంగానే నీకు ఒక లక్ష్యం నిర్దేశించాడాయన."

"ఆ గుణం ఎవరికీ నచ్చదుగా?"

"ఎవరికి నచ్చినా నచ్చకపోయినా ప్రశ్నతోనే లోకం పురోగమిస్తుందని రాముడే చెప్పాడు. ఒక్కసారిగా శూన్యత ఆవహించిన ఈ లోకానికి ఇప్పుడు ఆ గుణం మరింత అవసరం అన్నాడు. మానవ పురోగతికి ప్రశ్నే సమాధానం. ఆ ప్రశ్నించే గుణం ఉన్న నువ్వు ఇక్కడ ఉండటమే శ్రేయస్కరం అని నా రాముడు తీర్మానించాడు." చెప్పాడు హనుమ.

మొదటిసారి విభీషణుడు కల్పించుకున్నాడు. "రామరాజ్యంలో ప్రత్యేకత ఏమీ కనిపించటం లేదని ఎప్పుడూ అనేవాడివటగా. మిగిలిన రాజుల పరిపాలనకీ, రామరాజ్యానికీ తేడా ఇప్పుడయినా తెలిసిందా?" అని అడిగాడు కూర్మున్ని.

ప్రశ్నార్థకంగా చూశాడు కూర్ముడు.

"ప్రశ్నిస్తున్న నిన్ను భరించే గుణమే రామరాజ్యం ప్రత్యేకత. వేరే రాజ్యంలో అయితే ఇప్పటికే నిన్ను ఉరి తీసేవారు. కానీ ఇక్కడ అలా కాదు. ప్రశ్నించే గుణాన్ని సహించటమే మన దేశ గుర్తింపు. మన సౌహార్దానికి నిదర్శనం. అందుకే నువు జీవించే ఉండాలి. రాబోయే రోజుల్లో కూడా ప్రశ్నిస్తూనే ఉండాలి. ప్రశ్నించే వారికి కూడా మన సమాజం కల్పించే గౌరవానికి ప్రతీకగా నీలాంటి వారు ఎప్పటికీ ఉండాలి... అదే రాముడి తీర్పు." గర్వంగా చెప్పాడు విభీషణుడు.

గ్రహణ విముక్తి పొందిన చంద్రుడు మరింత ప్రకాశవంతంగా వెలుగులు చిమ్మినట్లు, దిశా నిర్దేశమయిన కూర్ముడు తల ఆడించాడు.

# గ్రహణ విముక్తం — శాంతిశ్రీ బెనర్జీ

రోజూలాగానే కస్తూరికి ఆరు గంటలకల్లా మెలకువ వచ్చింది. లేచి కూర్చుని పక్కకి తిరిగి చూసింది. భర్త శివరామ్ గాఢ నిద్రలో ఉన్నాడు. నెమ్మదిగా పడకగదిలోంచి హాల్లోకి వచ్చి, హాలు తలుపు తీసుకుని వరండాలోకి వెళ్ళింది. కుర్చీలాక్కుని కూర్చొని చుట్టూ చూసింది. అప్పుడే వెలుగొచ్చేసింది. తోటలోని పక్షుల కిలకిలారావాలు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. కుర్చీలోకి చేరగిలబడి కళ్ళు మూసుకుంది. ఆలోచనలు ముసురుకున్నాయి. హఠాత్తుగా నిన్న జరిగిన సంఘటన ఆమె మనస్సులో మెదిలింది.

పనిమనిషి గౌరి పనిచేసి వెళ్ళింతర్వాత కొంచెం సేపు వంటింట్లో పని చూసుకుని భర్త దగ్గరికి వెళ్ళింది. ''ఒకటి, రెండు స్పూన్లు కనబడటం లేదండి. మొన్న డబ్బా నిండా వున్న పంచదార సగానికి సగం తగ్గిపోయినట్లనిపిస్తోంది'' అంది.

''అదివరకు తోటలోని వంకాయలు ఎవరో కోసుకుని వెళ్ళారని ఫిర్యాదు చేశావుగా! గౌరి మీద కూడా ఈ మధ్య నీకు అసహనం, అనుమానం ఎక్కువయింది. నీకా మెయింటనెన్స్ డోసు తగ్గించొద్దని చెబితే డాక్టరు విన్నాడు కాదు. నీకు మళ్ళీ మనుష్యుల మీద అనుమానాలు ఎక్కువవుతున్నాయి'' అని విసుక్కున్నాడు.

కస్తూరి మనస్సు చివుక్కుమంది. ఈ సంఘటనతో ముడిపడిన గతం కళ్ళముందు అద్దంలోలాగా కనపడింది.

★★★

ఆమె ఎం.ఎ. చేసింతర్వాత తల్లితండ్రులామెకి పెళ్ళి చెయ్యాలని తొందర పడసాగారు. ఆ సమయంలోనే విజయవాడలో బంధువుల యింటికి పెళ్ళికి వెళ్ళినపుడు శివరామ్ కస్తూరిని చూడటం జరిగింది. ఆమె అందం, ప్రవర్తన అతనికెంతో నచ్చాయి. తన తల్లికి చెప్పి కస్తూరి తల్లిదండ్రులతో మాట్లాడటానికి ఒప్పించాడు. ఇంజనీరింగ్ చేసి మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తున్న శివరామ్ సంబంధం రావడం కస్తూరి అదృష్టంగా భావించి, ఆమె తల్లిదండ్రులు వెంటనే ఒప్పుకున్నారు. కలుపుగోలుతనంతో, అందరితో సరదాగా మాట్లాడే శివరామ్ కస్తూరికి కూడా నచ్చాడు.

ఆర్నెల్లలోపే పెళ్ళి జరిగిపోయింది. హైదరాబాదులో కస్తూరి వైవాహిక జీవితం మొదలయింది. పెళ్ళయిన కొన్ని నెలలకే ఒక గవర్నమెంటు కో ఎడ్యుకేషన్ స్కూల్లో ఎకనామిక్స్ బోధించే ఉపాధ్యాయునిగా ఉద్యోగం వచ్చింది. రెండేళ్ళ తేడాతో పెద్దమ్మాయి పావని, చిన్నవాడు ప్రశాంత్ పుట్టారు. ముత్యాల్లాంటి పిల్లలు, తనేది కావాలంటే అది సమకూర్చే భర్త, కస్తూరి జీవితంలో లోటేమీలేదని, అదృష్టవంతురాలని, పెట్టిపుట్టిందని అందరూ అనుకునేవారు.

నిజం కస్తూరికే తెలుసు! వివాహం అయిన ఏడెనిమిదేళ్ళ వరకూ అత్తమామలతో కలసి వుండాల్సివచ్చింది. అత్తగారి ఆధిపత్యం, ఆరళ్ళు ఆమెకి భరించాల్సి వచ్చేది. కస్తూరి ఉద్యోగం చెయ్యడం అత్తగారికి ఇష్టం ఉండేదికాదు.

''పిల్లలను చూసుకుంటూ ఇంటి పట్టున ఉండొచ్చు కదా?'' అని నసపెట్టేది.

ఇంటి పనులు చాలావరకు కస్తూరే చెయ్యాల్సివచ్చేది. స్కూలు పనులు, పిల్లల సంరక్షణ, వంటపనులు – వీటన్నిటితో ఆమె సతమతమవుతూ వుండేది. అదృష్టవశాత్తూ మామగారు రిటైర్ అయింతర్వాత, అత్తమామలిద్దరూ నెల్లూరు దగ్గరున్న స్వగ్రామానికి వెళ్ళిపోయారు. అక్కడ వాళ్ళకి పెద్ద ఇల్లు, పొలాలు వున్నాయి. కస్తూరి ''అమ్మయ్య!'' అనుకుని ఊపిరి పీల్చుకుంది.

భర్త శివరామ్ ఆమె పట్ల ప్రేమగానే ఉంటాడు. తల్లిదండ్రులున్నంత వరకూ, వాళ్ళ భయం వలన ఇంటి విషయాలు అంతగా పట్టించుకోకపోయినా, వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత కస్తూరి పనిభారాన్ని తగ్గించడానికి వంటమనిషిని కూడా పెట్టాడు. పైపనులు చెయ్యడానికి పనిమనిషి ఉండనే ఉంది.

★★★

అలా కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. తన ముప్పై అయిదవ ఏట అంటే పదిహేను సంవత్సరాల క్రితం కస్తూరి జీవితంలో అపశృతి మ్రోగింది. ఆమెకి మానసికంగా జబ్బుచేసింది. సాధారణంగా అందరూ వాడే పదజాలంలో చెప్పాలంటే కస్తూరికి పిచ్చిపట్టింది. శివరామ్ సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయన ఎంతో పేరున్న డాక్టరు. చాలమంది ఆయన చేసిన చికిత్స వలన బాగయ్యారని వినికిడి. కిక్కిరిసిపోయిన రోగులని చూస్తేనే తెలిసిపోతుంది ఆయన ప్రాక్టీసు దివ్యంగా ఉందని!

రోగలక్షణాలను బట్టి 'పారనాయిడ్ స్కిజోఫ్రేనియా' అని తేల్చాడు డాక్టరు.

''ఈ జబ్బు లక్షణాలేమిటి?'' అడిగాడు శివరామ్.

'స్కిజోఫ్రేనియా' అనేది ఒకరకమైన మానసికరోగం. ఇది వచ్చిన రోగి వాస్తవానికి దూరమైనటువంటి, భ్రమలతో, మాయలతో కూడినటువంటి ఆలోచనలతో సతమతమవుతూ వుంటాడు. వాటినే ఇంగ్లీషులో హేల్యూసినేషన్స్ మరియు డెల్యూజన్స్ అంటారు. దైనందిన జీవితంపై వాటి ప్రభావం పడి రోగి అందరిలా మామూలుగా జీవించలేకపోతాడు. ఈ జబ్బుకి జీవిత పర్యంతమూ చికిత్స అవసరం అవుతుంది. ఈ రోగ లక్షణాలను వెంటనే కనుక్కొని చికిత్స ఆరంభిస్తే, రోగలక్షణాలని అరికట్టి రోగం క్లిష్టతరమవకుండా, ముదరకుండా చెయ్యవచ్చు. దీనివలన దీర్ఘచికిత్సకు నాందివేసి, రోగి రోజువారి జీవితాన్ని సరైన విధంగా నడిచేటట్లు చెయ్యవచ్చు. ఈ జబ్బులో చాలా రకాలున్నాయి. సాధారణంగా ఎక్కువమందికి వచ్చే రోగాన్ని 'పారనాయిడ్ స్కిజోఫ్రేనియా' అంటారు. ఇందులో కూడా హేల్యూసినేషన్స్, డెల్యూజన్స్ రోగిని ఇబ్బంది పెడతాయి'' అన్నాడు డాక్టరు.

''అసలీ జబ్బు ఎందుకు వస్తుందంటారు?''

''దీని కారణాలను పరిశీలన, పరిశోధనల ద్వారా, కేస్ హిస్టరీల స్టడీ ద్వారా కనుక్కోవడానికి ప్రయత్నించారు. కొన్ని సూచనలు చేశారు. ఇది వంశపారంపర్యంగా రావచ్చు. మెదడులోని రసాయనాలైన (కెమికల్స్) డోపమైన్, గూటమేట్ సమపాళ్ళలో లేకపోవడం వలన రావచ్చు. చుట్టూవున్న వాతావరణ ప్రభావం వలన కూడా ఇది వచ్చే అవకాశం ఉంది'' అన్నాడు డాక్టరు.

''కస్తూరి జబ్బు తగ్గడానికి ఎన్నిరోజులు పట్టవచ్చు?'' అని శివరామ్ ఆదుర్దాగా అడిగితే,

''చెప్పలేం! తిరిగి మామూలు మనిషవడానికి ఆమెకి చాలా టైము పట్టొచ్చు!'' అని మందులు రాసిచ్చాడు.

మందులు వాడటం మొదలయింది. కొన్ని రోజుల వరకూ అంతా బాగానే వున్నట్లనిపించింది కస్తూరికి. అదివరకు చుట్టూతావున్న మనుష్యులమీద, స్కూల్లో తన కొలీగ్స్ మీద, ఆఖరికి శివరామ్ మీద కూడా అనుమానాలు కలుగుతుండేవి. వాళ్ళంతా కలిసి ఆమెకి అపకారం చెయ్యాలని చూస్తున్నారని, శివరామ్ వాళ్ళతో అప్పుడప్పుడు చేతులు కలుపుతున్నాడని అనిపించేది. మధ్యరాత్రిలో చెమటలు పట్టి హఠాత్తుగా మెలకువ రావడం, తిరిగి చాలాసేపటివరకు

నిద్రపట్టకపోవడం జరుగుతుండేది. చివరికి శివరామ్ డాక్టరు దగ్గరికి తీసుకెడతానని అన్నప్పుడు డాక్టరు, శివరామ్ కలసి తనమీద కుట్ర చేస్తున్నారన్న అనుమానం కూడా కలిగింది. ఏమయితేనేం, మందులు వాడిన తర్వాత ఆ అనుమానాలన్నీ ఎవరో తుడిచేసినట్లు మాయమయ్యాయి. నిద్ర కూడా బాగానే పట్టడం మొదలయింది. స్కూలుకు మెడికల్ లీవు పెట్టుకుని ఇంట్లోనే ఉండసాగింది కస్తూరి.

కానీ కొన్ని రోజుల తర్వాత అసలు సమస్యలు ప్రారంభం అయ్యాయి. మనస్సంతా అయోమయంగా ఉండటం, ఆలోచించే శక్తి కోల్పోయినట్లు అనిపించడం, ఏ పనీ చెయ్యలేకపోవడం, పనిచెయ్యడానికి ముందే ఈ పని నేను చెయ్యలేను అన్న అధైర్యం ఏర్పడటం, టి.వి. చూడాలన్నా, పుస్తకాలు చదవాలన్నా ఆసక్తి లేకపోవడం, ఇతరులతో మాట్లాడాలని అనిపించకపోవడం జరుగుతూ ఉండేది. గంటల తరబడి ఒకేచోట నిరాశగా కూర్చుని ఉండటం, ఏమీ పట్టించుకోకపోవడం చేసేది. వంట చెయ్యడానికి వంటమనిషి, పనులు చెయ్యడానికి పనిమనుషులు ఉండటం వలన కస్తూరిలో కలిగిన ఈ మార్పులు ఇంట్లో పిల్లలకి, శివరామ్‌కి భరించలేనట్లుగా అనిపించక పోవడం ఒక విధంగా అదృష్టమే!

పిల్లలు స్కూల్‌కి వెళ్ళడం, ఇంటికి వచ్చింతర్వాత హోమ్‌వర్క్ చేసుకోవడం, ఆ తర్వాత ఆటలాడుకోవటంలో మునిగిపోయి తమలోకంలో తాముండేవారు. నెమ్మదిగా ఉంటూ, ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడటం అలవాటు లేని కస్తూరి ముభావం వాళ్ళని అంతగా కలత పెట్టలేదేమో? శివరామ్ కూడా చాలా వరకు కొన్ని లోటుపాట్లను కప్పిపుచ్చడంలో సఫలం అయ్యాడని చెప్పవచ్చు. చుట్టుపక్కలవారికి, బంధువులకీ, స్నేహితులకీ ఈ విషయం తెలియకుండ జాగ్రత్తపడ్డాడు. వాళ్ళ ఇళ్ళకి రాకపోకలు లేకుండా ఏవో కారణాలు చెప్పి తప్పించునేవాడు. కస్తూరి సెలవు పెట్టుకుని ఇంట్లో ఉండటానికి శారీరక అనారోగ్యం కారణమని చెప్పేవాడు. సమాజంలో పిచ్చివాళ్ళ పట్ల జనాలు చూపించే వింత ఆసక్తి, అవహేళన అతనికి తెలుసు.

మూడునెలలు గడిచాయి. కస్తూరిలో మార్పు కనపడలేదు. తనను బాధపెట్టే లక్షణాలు చెప్పి, వాటి నుంచి తనకి విముక్తి కలిగించమని డాక్టర్ని వేడుకుంది. డాక్టరు అర్థం చేసుకుని, డాక్టరు మందులు మార్చి చూద్దామని చెప్పి, కొత్తమందులిచ్చాడు. ఈ మందులతోనయినా తనలో మార్పు రావచ్చని కస్తూరి ఎంతో ఆశపడింది. ఆ ఆశ నిరాశయ్యింది. ఇంకా పైగా మందులు వాడిన వారం రోజుల తర్వాత నుంచీ ఆమె విపరీతంగా ప్రవర్తించడం మొదలెట్టింది. ఒకేచోట పట్టుమని పదినిముషాలు కూర్చోలేకపోవడం, వెంటనే లేచి పచార్లు చెయ్యడం, రెస్ట్ లెస్‌గా ప్రవర్తించడం వంటి చేష్టలు చేసేది. శివరామ్‌కి ఏమి చెయ్యాలో తెలియలేదు. పిల్లలకి ఎలాగో సర్దిచెప్పాడు. కానీ ఎవరయినా ఇంటికి వచ్చినపుడు కస్తూరి వింత ప్రవర్తన వలన జబ్బు విషయం వాళ్ళకి తెలిసిపోతుందేమోనని మధన పడేవాడు.

అదివరకు చూసే డాక్టరు ఊళ్ళో లేకపోవడం వలన మరొక డాక్టరు దగ్గరకి తీసుకువెళ్ళక తప్పలేదు శివరామ్‌కి. డాక్టరుని చూడగానే ఆయన చేతులు పట్టుకుని, ''నేను భరించలేకపోతున్నాను. నాకు వెంటనే మందులిచ్చి కాపాడండి'' అని దీనంగా ప్రాధేయపడింది కస్తూరి.

ఆయన ఏమనుకున్నాడోగాని రెండుపేజీల మందులు వ్రాసిచ్చాడు. ఇంటికి వచ్చింతర్వాత

''దారిలో మందులు కొనలేదెందుకని?'' అడిగింది కస్తూరి.

నిజానికి శివరామ్‌కి ఆ కొత్త డాక్టరు మీద నమ్మకం కుదరలేదు. ''ఇన్ని మందులు వేసుకుంటే కస్తూరికేమయినా అయితే?'' అన్న ఆలోచన అతనిని బాధపెట్టింది.

''ఎలాగో ఈ వారం రోజులు ఓపిక పడితే రెగ్యులర్‌గా చూపించే డాక్టరుకి చూపించవచ్చు'' అన్న నిర్ణయానికి వచ్చాడు.

''ఆ మెడికల్ షాపాయన ఆ కుర్ర డాక్టరుని తక్కువచేసి మాట్లాడాడు. అతనికి అనుభవం అంతగా లేదని, అదివరకు చూపించుకునే డాక్టరుకే చూపించుకోమన్నాడు'' అని అబద్ధం చెప్పి కస్తూరిని నమ్మించాడు.

వారం రోజుల తర్వాత రెగ్యులర్ డాక్టర్‌కు చూపించినపుడు, ఆయన విషయం తెలుసుకుని అదివరకు తనిచ్చిన మందుల డోసు తగ్గించారు. డోసు తగ్గించిన నాలుగు రోజులకే కస్తూరిలో మార్పు వచ్చింది. రెస్ట్ లెస్‌గా ఫీలవడంలాంటి లక్షణాలు లేకుండా పోయాయి. కాని ఆలోచనాశక్తి కోల్పోవడం, ఏ పనీ చెయ్యలేకపోవడం లాంటి అదివరకటి లక్షణాలు మళ్ళీ వచ్చాయి.

''ఇక ఈ లక్షణాలు నన్ను విడిచిపెట్టవేమో?'' అని అనుకుని నిరాశపడే కస్తూరికి జీవితం నిరర్ధకం అనిపించసాగింది. ఎలా ప్రవేశించిందోగాని ఆమెలో ఒక ఆలోచన కలత పెట్టసాగింది. తనలో ఈ మార్పులు రావడానికి తను వాడే మందులే కారణం అన్న నిర్ణయానికి వచ్చేసింది. అందుకే ఒకరోజు కోపంతో డాక్టరు రాసిన ప్రిస్క్రిప్షన్స్ అన్నీ చించేసింది. మందులు వేసుకోవడం మానేసింది. శివరామ్ వెంటనే కస్తూరిని అతి కష్టం మీద ఒప్పించి డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయన వెంటనే గ్రహించుకుని ''ఈమెకి ఇక వేసుకునే మందులు కాకుండ, వారానికి ఒక ఇంజక్షన్ చేయించండి'' అని చెప్పాడు.

అప్పటినుండి ఫామిలీ డాక్టరు దగ్గరికెళ్ళి ఇంజక్షన్ చేయించుకునేది కస్తూరి. ఇంజక్షన్ వలనో ఏమోగాని ఆరు నెలలకే కస్తూరిలో గణనీయమైన మార్పు వచ్చింది. దీనికితోడు దూరపు బంధువు, వరుసకు అక్క అయిన మాధురి సహకారం కూడా కారణం అయ్యుండవచ్చు. ఢిల్లీలో ఉద్యోగం చేసుకుంటున్న మాధురి ఫోన్ల ద్వారా, ఉత్తరాల ద్వారా కస్తూరికి ధైర్యాన్ని కలిగిస్తుండేది. ఇలాంటి పరిస్థితుల్లో రోగికి ప్రశాంత వాతావరణం, ప్రేమ ఎంతో అవసరం అని

శివరామ్‌కి పదేపదే చెప్పి అతను కస్తూరి పట్ల అనురాగంతో వ్యవహరించేటట్లు చేసింది. కస్తూరిని కూడా రోజూ పూజ చెయ్యమని, మెడిటేషన్ చెయ్యమని ప్రోత్సహించి ఆమె దినచర్యలో మార్పు వచ్చేలా చేసింది.

ఎలాగయితేనేం డాక్టరు అంచనాలకు భిన్నంగా సంవత్సరం లోపలే కస్తూరి కోలుకుంది. అప్పటి నుంచి డాక్టరు సలహా ప్రకారం మెయింటెనెన్స్ డోసు వేసుకుంటూ వస్తుంది. మూడునెలల తర్వాత స్కూలుకు వెళ్ళడం మొదలుపెట్టింది. పూర్వం లాగానే చురుకుగా, ఉత్సాహంగా ఉండటం, ఇంటిపనులు, స్కూలు పనులు చక్కగా నిర్వర్తించడం, పిల్లలకు, భర్తకు కావలసినవి సమకూర్చడం లాంటివి ఆత్మవిశ్వాసంతో చెయ్యసాగింది.

కానీ ఆమెకి కొన్ని విషయాలు అప్పుడప్పుడూ గుర్తుకువచ్చి మనస్సులో బాధ కలిగేది. మెడికల్ లీవు తర్వాత స్కూల్లో జాయిన్ అయినప్పుడు ఆమెని చూసి సైగలు చేసుకుని గుసగుసగా మాట్లాడుకునే కొలీగ్స్ ని చూసింది. అదివరకు ఆమెతో బాగానే ఉండే కొందరు స్నేహితులు ముభావంగా ఉండటం, అదివరకులా స్నేహంగా ఉండకపోవడం చేశారు.

ఇక అత్తగారు తన జబ్బు గురించి విన్నప్పుడు, ''ఏ మాత్రం తెలిసినా, ఇటువంటి సంబంధం నా కొడుక్కి చేసేదాన్ని కాదు. ఎవరో అన్నారు ఈ జబ్బు కుటుంబంలో ఎవరికైనా ఉంటే కూడా వస్తుందని. మా కోడలి కుటుంబ వివరాలు సరిగ్గా కనుక్కుని ఈ సంబంధం చెయ్యాల్సింది. ఇప్పుడిక చేసేదేముంది? చేతులు కాలినాక ఆకులు ముట్టుకుంటే ప్రయోజనమేముంది?'' అని మూతి విరిచేది.

★★★

మెయింటెనెన్స్ డోసు వేసుకుంటున్న దగ్గరి నుంచి అదివరకులా తరచుగా డాక్టరు దగ్గరికి వెళ్ళకపోయినా నాలుగైదు నెలలకొకసారి చెకప్ కోసం వెళ్ళి వస్తున్నది. అవసరమైనప్పుడు డాక్టరు డోసు తగ్గించుకుంటూ వస్తున్నాడు. డోసు తగ్గించినప్పుడల్లా సరిగ్గా నిద్ర పట్టకపోవడం వంటి లక్షణాలు కనపడుతుంటాయి.

''సరిగ్గా నిద్ర పట్టకపోవడం ఒక్కటేకాదు, నీకు నీ చుట్టూతా ఉన్న మనుష్యులతో గల సంబంధాల్లో కూడా పేచీ వస్తుంది'' అని శివరామ్ అంటూ వుంటాడు.

★★★

ఇది కస్తూరి జీవితంలో గతంలో జరిగిన సంఘటనలు. వాటిని అప్పుడప్పుడూ గుర్తు చేసుకుని తలుచుకుంటూ వుంటుంది. ఇటీవల జరిగిన సంఘటనలు మనసులో మెదిలాయి. మళ్ళీ వాటిని గురించిన ఆలోచనలలో పడిపోయింది.

మూడునెలల క్రితం డాక్టరు డోసు తగ్గించాడు. అప్పటినుంచి శివరామ్ తనని జాగ్రత్తగా గమనిస్తున్నాడని కస్తూరికి అనిపించసాగింది. శివరామ్ స్వతహాగా మంచివాడే. కానీ ఏదన్నా సమస్య వచ్చినపుడు మాత్రం అది సమస్యే కాదన్నట్లు, కస్తూరి లేనిపోనిది ఊహించుకుంటున్నదన్నట్లు మాట్లాడతాడు. ప్రతిదాన్నీ కస్తూరి జబ్బుతోనూ, మెయింటెనన్స్ డోసుతోనూ లంకెవేసి, డోసు తగ్గించడం వల్ల ఆమె సరిపెట్టుకోలేక పోతున్నదనీ, అందుకే అలా ప్రవర్తిస్తున్నదని అంటాడు.

''జీవితంలో మనుష్యులకి సమస్యలే రావా? వచ్చినపుడు వాటిని పరిష్కరించడానికి మార్గాలు వెతకాలిగానీ ఇదేమి వితండవాదం?'' అనుకుంటుంది కస్తూరి.

ఒకరోజు పావని ''అమ్మా! ఈ మధ్య నీకు గౌరి మీద, మాలి మీద అనుమానాలు ఎక్కువయ్యాయి. ఎందుకైనా మంచిది ఒకసారి డాక్టరుకు చూపించుకోరాదూ?'' అంది.

పావని కూడా తననీమధ్య జాగ్రత్తగా గమనిస్తుందని అర్థం అయింది కస్తూరికి. ''అసలీ సమస్యలన్నీ మెయింటెనన్స్ డోసు తగ్గించడం వలనే సమస్యలుగా అనిపిస్తున్నాయా? ఇవన్నీ నిజమైనవికావా?'' అన్న అయోమయంలో పడిపోయింది.

కొన్నిరోజుల తర్వాత జరిగిన సంఘటనలు ఆమెకి ఊరట కలిగించాయి. చీకట్లో వంకాయలు కోసుకుని చాటుమాటుగా వెళ్ళే మాలి శివరామ్ కళ్ళబడ్డాడు. గౌరి పంచదార దొంగతనం చేస్తుండగా పావని రెడ్‌హాండెడ్‌గా పట్టుకుంది. ఈ విషయం గురించి కస్తూరి వాదించడం మొదలెడితే పావని, శివరామ్‌లు ఏదో సాకు చెప్పి తప్పించుకునేవారు.

కానీ ఈ సంఘటనల తర్వాత కస్తూరిలో అంతర్మథనం మొదలయింది. మానసిక రోగం నుంచి కోలుకున్నా చుట్టూవున్న మనుష్యులది మర్చిపోరన్న నిజం తెలుసుకుంది. ''ఆ మచ్చని మోసుకుంటూ జీవితాంతం బతకవలసిందేనా?'' అని తనకుతాను ప్రశ్నించుకుంటూ ఉంటుంది అప్పుడప్పుడూ.

★★★

సరిగ్గా ఆ టైములోనే ఢిల్లీ నుంచి అక్క మాధురి వచ్చింది. ఎన్నో ఏళ్ళ తర్వాత కలుసుకున్న వారిద్దరూ ఎడతెరపిగా కబుర్లు చెప్పుకున్నారు. సినిమాల కెళ్ళారు. షికార్లు, షాపింగులు చేశారు. ఆఖరికి మాధురిని తన స్కూలుకి తీసుకెళ్ళి అంతా చూపించి, ప్రిన్సిపల్‌కి, కొలీగ్స్ కి కూడా పరిచయం చేసింది కస్తూరి.

మరుసటిరోజు ఉదయం ఢిల్లీ వెడుతుందనగా సాయంత్రం ఇద్దరూ తోటలో కూర్చుని టీ తాగుతూ మళ్ళీ ఎప్పుడు కలవాలో ప్లాను వేసుకుంటున్నారు. హఠాత్తుగా కస్తూరి ఏదో ఆలోచనలో పడ్డట్టు మౌనం వహించింది. అది గ్రహించి మాధురి

''ఏదైనా చెప్పాలనుకుంటున్నావా? నా దగ్గర దాపరికం ఏముందీ? చెప్పు'' అంది ఆప్యాయంగా.

"అక్కా! నేను మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు నువ్వు చేసిన సహాయం, నాలో కలిగించిన ఆత్మస్థైర్యం నా జీవితంలో మర్చిపోలేను. కానీ ఈ మధ్య నాలో కలిగిన కొత్త కొత్త ఆలోచనలూ, భావాలూ నీకు చెప్పాలనుకుంటూనే చెప్పలేకపోయాను. ఇప్పుడు చెబుతా విను'' అని తనకు మెయింటెనెన్స్ డోసు తగ్గించిన దగ్గర నుంచి జరిగిన సంఘటనలు ఏకరువు పెట్టింది. చివరికి తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా,

‘‘నా జీవితంలో గ్రహణం పట్టుకుంది. ఏమయితేనేం ఆ గ్రహణం తొలగిపోయి నేను నిలదొక్కుకున్నాను. స్కూల్లో మంచి ఉపాధ్యాయినిగా పేరు తెచ్చుకున్నాను. స్టేట్‌లెవెల్లో బెస్ట్ టీచర్ అవార్డు కూడా అందుకున్నాను. పిల్లలిద్దరూ మంచి వుద్యోగాల్లో స్థిరపడ్డారు. భర్త ఆఫీస్‌లో టాప్ పొజిషన్‌లో ఉన్నాడు. ఈ విజయాలన్నింటి వెనుక నేను చేసిన కృషి ఎంతో ఉంది’’ అని ఆగి మాధురి వంక సాలోచనగా చూసి మళ్ళీ మాట్లాడటం మొదలెట్టింది.

‘‘ఇక మానసిక రోగాలు కూడా శారీరక రోగాల్లాంటివే! వాటికి మంచి మందులున్నాయి. ఆధునిక పరిశోధనల వలన, పరిశీలన వలన, ఎన్నో క్లిష్టమైన కేసులు కూడా నయమవుతున్నాయి. కొత్త కొత్త మందులు కనుక్కుంటున్నారు. ఎందరో తిరిగి మామూలుగా జీవించగలుగుతున్నారు. అందుకే మానసిక రోగుల విషయంలో సమాజంలో మార్పురావాలి. గ్రహణ విముక్తుడైన సూర్యుడికి స్వాగతం చెప్పినట్లే మానసిక రోగుల్ని సమాజం అంగీకరించాలి. వారి జీవితాల్లో ఆ స్టిగ్‌మా జోడించి ఆత్మనూన్యతకు గురిచేసే పరిస్థితులు మారాలి. ఉదాహరణకి నా పట్ల అత్తగారి నిరసన, కొలీగ్స్, స్నేహితుల నిరాదరణ, కుటుంబ సభ్యులు వ్యవహరించే తీరు... ఇలాంటివి’’.

మాధురి చెల్లెలి భుజం తడుతూ ‘‘నిన్ను చూస్తే నాకెంతో గర్వంగా ఉంది. స్కూల్లో నువ్వు ‘టీ’ తీసుకురావటానికి బయటికి వెళ్ళినపుడు మీ ప్రిన్సిపల్‌గారు నిన్నెంతో మెచ్చుకున్నారు. విద్యార్థులకు నువ్వు బోధించే విధానం, కొత్త కొత్త ప్రాజెక్టులు వాళ్ళతో చేయిస్తూ సబ్జెక్టు మీద మరింత ఆసక్తి కలిగించడంలో నీకున్న నైపుణ్యం ప్రశంసనీయం అన్నారు. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే ఒకప్పుడు నువ్వు మానసిక రోగంతో బాధపడ్డావని ఎవరూ ఊహించలేరు. ఎంతో చక్కగా కోలుకుని, అందరిలాగే జీవించగలుగుతున్నావు. అంతేకాదు ఎన్నో విజయాలను నీ సొంత చేసుకున్నావు. మానసిక రోగులకు నీ జీవితం ఒక ప్రేరణ! ఇలాగే ఆత్మవిశ్వాసంతో నువ్వు ముందుకు సాగిపోవాలని మనసారా కోరుకుంటున్నాను’’ అంది.

మాధురి చేతిని ప్రేమగా తన ఒడిలోకి లాక్కుని ‘‘థాంక్యూ అక్కా!’’ అంది కస్తూరి సంతోషంతో తలమునకలవుతూ!

# ఒక నేరం కథ

చిట్టత్తూరు మునిగోపాల్

"ఇది ఒకటో నెంబరు బస్సు... దీని యవ్వారం బహు నైసు..." మైకు సెట్లోనించీ ఏంటీవోడు ఈరలెవల్లో పాడతా ఉండాడు. మా ఇంట్లో యాపసెట్టుకింద నేను డ్యాంసేస్తా ఉండా. ఎంటీవోడు సిన్మా అన్నా, లొడ్డచెయ్యి, నడ్డీ తిప్పుతా నిలబడిన చోటునుంచే వోడేసే డ్యాంసన్నా బలే ఇది నాకు. కాలాస్త్రికి మానాయిన మమ్మల్ని తీస్కబోయ్యేది సమ్మత్సరానికి ఒక్కసారేగానీ, అక్కడ మా అమ్మమ్మోల్ల ఇంటికాడ ఉండే రొందు రోజుల్లో మాయమ్మను ఏపించుకొని తిని ఏంటీవోడి సిన్మా చూసి తీరాల్సిందే. మావూళ్లోకే వోడొచ్చేసి రామ్మందిరం కాడ మైకులో పాత పాడ్తా ఉంటే చూసుకోండి, నా సామిరంగా... ఎవురూ పట్టడానికి ల్యాకుండా ఉండాది నా సంతోసం.

రాములోరి పట్టాబిసేకం నిన్ననే అయిపోయ్యింది. ఈరోజు వసంతాలు. గూనోడు, తెల్లోడు, గుడ్డెంకటేశులు, ఊసెంకటేశులు, కుంతి సేకరూ... నా సావాసగాళ్ళంతా ఉడ్డగా జేరి ఎగర్తా ఉండాము. ఊడిపోతా ఉండే చల్లాడాలు ఎగేసుకొనేదానికి, కారిపోతాఉండే ముక్కు చీమిళ్ళు ఎగబీల్చుకోడానికి గూడా టయిము లేదు మాకు. ఎగిరెగిరి అలుపొచ్చేసింది.

"ఒరే, రామ్మందిరం కాడికి పోదామా రా..." గూనోడు తల గుడ్డెకటేశులు మూసుకుపోయిన ఎడంకన్ను మిటకరిస్తా అన్నాడు.

"పోదాం పదండిరా... అక్కడికి ఎంగటలచ్చిమి, ఇందిర గూడా వొచ్చుంటారు. ఆయమ్మిలతో కలిసి చికుచికు పుల్లాట ఆడుకోవొచ్చు." ఆడంగెదవ ఊసెంకటేసులు కాలెత్తి నిలబణ్ణాడు. పోలోమని అర్సుకుంటా మందిరం కాడికి పరుగులు పెట్టేదానికి రెడీ అయిపోయ్యినాం.

యాణ్ణించి ఊడిపణ్ణాడో... మమ్మల్ని తోసుకొని పరుగులు పెడ్తా దూరినాడు చుట్టింట్లోకి నారాయుడు. ఆయన్న చేతిలో ఎద్దుల బండికి బిగించే గుజ్జు కర్ర ఉండాది.. పంచి ఎగబోసి గోచి కట్టుకున్న ఒంటిమీద ఇంక ఏ గుడ్డా లేదు. ముఖమ్మీదా, ఎదురురొమ్ము మీదా, ఈపుమీదా ఎర్రగా కమిలిపోయి ఉండాది. ఇంగ కొంచేపుంటే రాముడి పటం ఊరేగింపుకు వస్తాది. దానికి ముందు, పిల్లకాయలు, పెద్దోళ్ళు ఎగబడి వొచ్చేస్తారు. వాళ్లకి వసంతాల కోసరం పందిట్లో కూకోని పసుపు నీల్లు పెద్ద బక్కిటికి కలపతా ఉండాది మాయమ్మ. నారాయుడి వాలకం జూసిన ఆమె, గబుక్కుమని లేసి నిలబడింది, బాగానే ఉండే పైట సర్దుకుంటా. ఆయన్నను తరుముకుంటా వొచ్చి పడినాడు రమణయ్య. "నా కొ... కా...

నీకు నా సేతిలో ఈరోజు మూడిందిరా..." అని రంకెలేస్తా చేతిలోని లోని మొచ్చు కత్తితో నారాయుడి మెడకాయి మింద బలంగా ఏటేసినాడు. ఒకే ఏటు... మెడకాయి సగానికి తెగిన నారాయుడు, కిందపడి గిలగిలా తన్నుకుంటూ పానాలు ఇడిసేసినాడు. అమ్మ కలపతా ఉండే పసుపు నీల్లు, ఆయన్న మెడకాయనుంచీ జూవ్వుమంటా ఎగజిమ్మిన నెత్తురుబడి ఎర్రబారి పొయ్యినాయి.

అక్కడ యాప సెట్టుకింద బకిట్లో కలిపి పెట్టిన పసుపు నీల్లు చూసేతాలికి నా చిన్నప్పుడు జరిగిన ఆ సంగతి గెవనానికి వొచ్చింది. చెప్పబళ్ళా... ఒంట్లో వొణుకు పుట్టింది. నా ఎనకాలే వొస్తా ఉండే పెళ్ళాం, పిలకాయిల దిక్కు పారజూసినా. వాళ్లకి ఆ సంగతి తెలీదు కదా...తెలీని పల్లికి వొచ్చిన జంకు తప్ప, వోల్లెమో మామూలుగానే ఉండారు.

"ఏమల్లుడా... పుట్టి పెరిగినూరు ఇన్నాల్లకు కనబడిందా?" నిస్టురంగా ఇనిపించిన మాటలకు తల తిప్పి చూసినా. కమలత్త... నలపై ఏళ్ల ముందు మాదిరిగానే, పరుగులాంటి నడకతో వొచ్చి నా రెండు చేతులూ పట్టుకుని నలిపేస్తా, ఊగించి పారేసింది, అబిమానంగా. ఈ కమలత్త ఎప్పుడూ ఇంతే. ఇంత వొగిసొచ్చినా మారనే ల్యా. చిన్నపుడు నేను కనబడితే చాలు, ఎక్కడున్నా పరిగత్తుకోనొచ్చి రొండు చేతులు అడ్డాం పెట్టి ఆపేసేది. "నన్ను పెళ్లి చేసుకొంటావా అల్లుడా.." అంటా ఎగతాళికి పొయ్యేది. ఆమె ఎగతాళికి సిగ్గుతో సచ్చిపోయే నాకు ఏడుపు కూడా ముంచుకొచ్చేసేది. మా ఇద్దరి చోద్యం చూస్తాఉండే అమ్మలాక్కలు పగలబడి నవ్వేవోల్లు అప్పుడు నాకు బూమి ఉన్నపలంగా రొండుగా చీలిపొయ్యి పాతాళంలోకి దిగబడిపోతే ఎంత బాగుంటాది అనిపించేది. అదంతా గెవనానికి వొచ్చి ఇప్పుడు కూడా సిగ్గు పడబోయి తమాయించున్నాను.

"బాగుండావా కమలత్తా... ఇంకా కుర్రదాని మాదిరితో గెట్టిగానే ఉండావే. గునగునా పరిగెత్తతా వొచేసినావు. ముసిలివైపోయి, మంచంలో పడి ఉంటావనుకున్నానే నేను. సంగతి ముద్దలంతా నువ్వే శేసుకొని మింగేసి మా నాగమామను ఎండబెట్టడం లేదుగదా..." సొంతూరు గాలి తగిలినందుకేమో... ఎప్పుడూ రిజర్వ్ గా ఉండే నాకు ఎకసెక్కాలు పుట్టుకొచ్చేసినాయి తెలీకుండానే. పక్కనే ఉన్న నా పెళ్ళాము, మోచేతితో నడుము మీద పొడిచింది, ఇంక చాలన్నట్టు.

"చిన్నప్పుడు మూగిగా ఉండేవాడివి గదల్లుడా, ఇప్పుడు బలే మాట్లాడేస్తా ఉండావు. అప్పుడి సిగ్గంతా ఏమైపోయ్యింది. అవున్రా... ఆ పాప నీ పెళ్ళామేనా? ఆయమ్మిదేవూరు? నా కూతురు బాగానే సానబెట్టినట్టూ ఉండాదే నిన్ను. మాటలు మా బాగానే నేర్సినావు." నా పెళ్ళాన్ని గూడా తన జట్టు కలిపేసుకొనింది కమలమత్త.

"అవునుగానీ... శీనయ్య ఉండాడా అత్తా ఇంట్లో?" అడిగాను.

ఆమాట ఇంటానే గమ్మునైపోయిన ఆమె, మేము నిలుచుకోని మాట్లాడతా ఉండే ఈదికి తూర్పు దిక్కునుండే ఇల్లు చూపించి, దాని పక్కనుండే గుడిసిలోకి ఎల్లిపోయింది ఏదో పంగలేని పని ఉండాదన్నట్టు. మా మాటలు ఇంటానే ఉన్నాడేమో, తన తల్లి కమలత్త అటు ఎల్లగానే, లోపలినుంచి ఈదిలోకి వొచ్చి పలకరించినాడు శీనయ్య.

"ఎప్పుడొచ్చినావు? అంతా బాగుండారా"" ఆప్యాయంగా భుజమ్మింద చెయ్యేసి ఇంట్లోకి తీసుకొనెల్తా చెమసమాచారాలు అడిగినాడు. నులక మంచం మీద కూకున్న మాకందరికీ, పెద్ద దోటి చెంబుతో చిక్కటి మజ్జిగ తాగమని ఇచ్చింది ఒకామె. శీనయ్య భార్య అని తెలస్తానే ఉండాది, ఆమె వాలకాన్నిబట్టి.

"పిలకాయిల సాకుతోనైనా మనూరు వొచ్చిండావు, సంతోషం. మీ నాయిన కుటుంబరంతో ఊరు ఇడిసి పెట్టినాక, నువ్వు మళ్ళీ కనబళ్ళేదు. ఏమైపొయ్యినావు? ఇప్పుడు ఎక్కడుండావు?" ఆరా తీసినాడు శీనయ్య.

"నేను ఎక్కడికీ ఎల్లలేదు రా. ఆ మూల పలమనేరు దెగ్గిర ఒగ ఫాక్టరీలో చిన్న ఉజ్జోగం దొరికితే అక్కడే కాపరం పెట్టినా. నీకు తెల్సు గదా. మాకు పొలము, పుట్రా ఏమీ లేవని. ఎక్కడ కూటికి దొరికితే అదే సొంతూరు నాకు. పిల్లోళ్లకు పుట్టినూరు చూపిద్దామని తీసుకోనొచ్చినాను, అంతే." చెప్పినాను.

"ఏమ్మే రత్నా, అయిందా…" ఒకపక్క నా మాటలు వింటూనే, మరోపక్క ఇంట్లోకి తొంగి చూస్తా కేకేసినాడు.

"అయిపొయ్యింది బా. ఉస్తుకాయి ఒరుగులు ఏంచుతా ఉండా, అన్నయోల్లు, నువ్వు కాల్లుసేతులు కడుక్కోని వొచ్చియ్యండి, వొడ్డించేస్తా." అతని పెండ్లాము వాడికి ఏమాత్రం తగ్గకుండా బదులు కేకేసింది. చేతిలోని మొబైల్లో టైం చూస్తే మధాహ్నం పన్నెండున్నర దాటతా ఉండాది.

"లేదురా. ఇంటికెల్లి పోవాల, పనుండాది." గెట్టిగా చెప్పినా.

"యాడికి ఇంటికెల్లేది? నువ్వు ఫోను జేసినప్పుడే జెప్పలా. ఊళ్ళో శ్రీరామ నవమి ఉత్సవాలు జరగతా ఉండాయని. ఈరోజు సీతమ్మ, రాములోరి వసంతాలు. గుళ్లో భజన, రాములోరి ఊరేగింపు, వసంతాలు, అనాక ఉట్టి కొట్టడం. మీ పిలకాయలకోసమైనా నువ్వు ఉండాల. వోళ్ళకి రాములోరి ఉత్సవ వైభోగం చూపించాల." గెట్టిగా పట్టుబట్టే సరికి నేనేమీ ఎదురు మాట్లడలేక పోయినాను.

అన్నాలు తిండమైనాక కొంచేపు యాపచెట్టు కింద ఏసిన నులక మంచం మింద నడుము వాల్చి పిలకాయిలతో నా చిన్ననాటి ఊరు సంగతులు చెప్పి మురిపించినాను. నా పెండ్లాము వసంత, పందిట్లో కూసోని ఇంటావిడతో ముచ్చట్లు పెట్టుకొనింది.

సాయంత్రం మూడవతా ఉంటే రాములోరి గుడికాడ మైకులో కలకలం మొదులయింది. ఉట్టి కొడతా ఉండారని జెప్పి మమ్మల్నందరినీ తీసుకోని ఊరికి ఆపక్కనుండే ఉండే రాములోరి గుడికాడికి బయలుదేరినాడు శీనయ్య. పండగనే కానీ ఒక్క ఇంటిలో కూడా ఆ పండగ సంబరమే కనిపించలేదు. ఇంటి గుమ్మాలకు మామిడాకుల తోరణాలు, వీధుల్లో

ఈపక్కనుంచి ఆ పక్కకు పురి దారాలకు కట్టిన మామిడాకులు, వేపాకుల సరాలు, రంగురంగుల ముగ్గులు, మధ్యలో బంతి, చేమంతి, దాసాని పువ్వుల అలంకారాలు... నా చిన్నప్పుడు శ్రీరామ నవమి అంటే ఎంత అందంగా ముస్తాబైపోయేదో మా వూరు. చూడడానికి రెండు కళ్ళు చాలేవి కావు. ఇప్పుడు మామిడాకుల తొరణాలూ లైపు... వసంతాలకోసం, తలాకిట్లలో పసుపునీళ్ల బకెట్లు కనిపించలేదు. రాములోరి గుడి దగ్గరపడతా ఉంటే, అక్కడి జనం రచ్చ కూడా పెద్దగా ఇనిపిస్తా ఉండాది.

"శీనా... ఒకటి నాకు అర్తంగావడంలేదు. మన చిన్నప్పుడు రాములోరి ఉత్సవంలో గొడవలు ఎందుకు జరిగినాయి? నారాయుడన్నని, రమణన్న ఎందుకు నరికి చంపినాడు?" అడిగినాను నడస్తానే. శానా ఏళ్లుగా నాలో నలగతా ఉండే కొసినది. పిలకాయిలు వోల్ల అమ్మ చెయ్యి పట్టుకోని, ఇంటావిడతో కలిసి మాకు ముందు నడస్తా ఉండారు.

"ఆ కులం తక్కువ నారాయుడు.. నా కొ... నీకు అన్నెట్టా అవతాడురా?" నా వంక ఉరిమి చూస్తూ గదిమాడు శీనయ్య.

"మా చిన్నాయిన కూతురు మిందే వసంతాలు జల్లతాడా? దూరంనింటే రాములోరికి మొక్కతామంటే పోనీ గదా అని అల్లంత దూరంలో నిలబడి సూడడానికి ఒప్పుకున్నాము. తిన్నింటి వాసాలు లెక్కబెట్టే నా కొ... లు. గంగాళాలలో కలుపుకొచ్చిన పసుపునీళ్లతో వసంతాలు ఆడతారా? ఆ నీళ్ళొచ్చి మా ఇంటి ఆడబిడ్డమీద పడితే మేమూరుకుంటామా. కడజాతి నాయాలిని, నరికి పాతరేయకుండా ముద్దుజేసి నట్టింట్లో పెట్టుకుంటామా?" ఉగ్రుడైపోయాడు.

"ఇప్పుడు కూడా, "వాళ్ళని" ఊళ్లోకి రానియ్యరా..." భయపడుతూనే అడిగాను.

"ఏంది రానిచ్చేది? వోల్ల నీడ కూడా మా మింద పడనియ్యము. కడాకు పొలాల్లో పనులకు గూడా, పిలవకుండా వోల్లని దూరం పెట్టేసినాము. కూలీ ఎక్కువైనా, మా సాటి కులపోళ్ళతోనే పనులన్నీ. మా ఎగస్పార్టీలో ఉండే ఊరి నా కొ... కొందురు వాళ్ళని నెత్తిమీద పెట్టుకోని ఊరేగతా ఉండారు. అదిగో ఆ పక్కీదిలో ఆ కడజాతోళ్లతో కలిసిపోయి ఏరేగా ఉత్సవం జేసుకుంటా మా మానం, మరియాదా మంట గలపతా ఉండారు." ఆవేశపడి పోయాడు.

వాడి ఆవేశం చూస్తానే నాకు గతుక్కుమంది.

"సరే, ఆ మాటలెందుకులే కానీ మీ అమ్మకు, నీకు పడదా..." అడిగినాను. వీళ్ళ ఇంటికొచ్చినప్పటినుంచీ ఆమె కనబడలేదు. సొంత కొడుకే అయినా ఈపక్క తొంగి సూడలేదు కపొయ్యేసరికి.

"అది సంసారిదైతే గదా, ఆ లం... ఆ జాతి తక్కువోళ్లతో కలిసిపొయ్యి తైతక్కలాడతా ఉండాది. ఇంట్లో గొడ్లకు పాలుదీసే కాడినుంచీ, ఒడ్లు పండించేదాకా వోళ్లు లేకపోతే దీనికి పొద్దు గడవదు. థు... ఆ బతుకు బతికేదానికన్నా, ఉరేసుకోని చావడం మేలు." క్యాకరించి తుపుక్కున ఎంగిలి ఊసేసినాడు.

అర్థమైంది నాకు. ఆపైన తెలియని భయం మొదలయింది. కూడా పక్కపక్కనే నడస్తా ఉండే నేను, శీనయ్యకు ఎడం జరిగాను. ముందు నడుస్తున్న నా పెండ్లాము, వోడి పెండ్లాముతో తెగ ముచ్చట్లాడుటా ఉండాది. నా పిలకాయిలు, వోడి పిలకాయిలమీద మట్టి పోస్తా, చిన్నచిన్న గులకరాళ్లు ఇసరతా ఆటలాడుకుంటున్నారు సంతోషంగా. నాలోని భయం ఇంకా ఎక్కువయింది. ఇంతలో రాములోరి గుడి దగ్గర పడింది. అక్కడి జనాల్లో కొంతమంది వీడి చుట్టూ మూగినారు. సెల్లుఫోను మోగితే మెడలోని బ్లూటూత్ ఆన్ చేసినాను.

"ఏమిరా, మీ వూరు బాగుండాడా? బాగా ఎంజాయ్ చేస్తాఉండావా?" అట్నించి ఫ్రెండు... ఫ్యాక్టరీలో నాకూడా పనిచేసేవాడు.

"ఆ బాగుండాది. నేను..."

"ఫరవాలేదు, మరో రెండు రోజులు ఉండిరా, ఇక్కడ నేను మేనేజ్ చేసుకుంటానులే." ఆఫీసునుంచీ కొలీగ్ భరోసా ఇస్తున్నాడు.

"ఆ... ఆ... సాయంత్రానికి అక్కడ ఉంటా. నైట్ షిఫ్ట్ కు జాయిన్ అయిపోతా." నా దగ్గరగా వొస్తా ఉండే శీనయ్యను చూస్తా, వోడికి ఇనిపించేటట్టు బిగ్గరగా చెప్పి, ఫోన్ కట్ చేశాను.

"విన్నావు కదా, అర్జన్ట్ పని ఉందంట. నేను ఉన్నపళంగా వెళ్లి డ్యూటీలో జాయిన్ కావాల. వసంతా, పిలకాయిలను తీసుకోని బయలుదేరు." కంగారు పడిపోతూ వాడికి చెబుతూనే, నా పెండ్లామును కూడా పురమాయించాను.

"ఏందిరా, నువ్వు ఉండి రాములోరి వసంతాలు చూస్తావనుకుంటే..." వెనకనుంచీ వాడు యాష్టపోతా అనే మాటలు ఇనిపిస్తానే ఉన్నా లెక్క చేయలేదు.

బండి స్టార్ట్ చేసి, వసంతను, పిలకాయల్ని ఎక్కించుకోని పరుగులు తీయించాను.

"నా పెండ్లాము వసంత, శీనయ్య ద్వేషించే జాతి అమ్మాయేనని వాడికి తెలిసి ఉంటే..."

శ్రీరామ నవమి పండగ వచ్చినా, పసుపు నీళ్లు ఎక్కడైనా చూసినా... ఆనాటి నా సొంతూరి అనుభవం గుర్తుకొచ్చి ఇప్పటికీ గుండె గుబగుబలాడుతుంది. ఆవెంటనే అంతులేని ప్రశ్నలు చెలరేగుతాయి నాలో.

ఊళ్ళు మారాలని కోరుకోడం అత్యాశా?

కులమతాలను మొదటినుంచీ గుడ్డిగా ద్వేషిస్తున్న శీనయ్యా... కులాంతర వివాహం చేసుకుని కూడా ధైర్యంగా సమాజానికి ఎలుగెత్తి చాటలేని నేనా... మాలో నిజమైన నేరస్తుడు ఎవడు?

నేను కాకపోతే... ఎందుకు సొంతూరునుంచీ పలాయనం చిత్తగించాను?

మరి కమలత్త...? కొడుకును కాదనుకుని మరీ ఆమె సాగిస్తున్న జీవితం...?

# ఎక్స్ ట్రీం చెలగాటం పాణిని జన్నాభట్ల

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
## బహుమతి పొందిన కథ

నేలకి పదివేల అడుగుల ఎత్తులో ఎగురుతోంది మా విమానం. అన్నివైపుల నుంచీ భయంకరమైన శబ్దం. నా ఒళ్ళంతా ఏదో బ్యాంక్ దోచుకోబోతున్నప్పుడు కలిగే ఫీలింగ్. అంటే నేనేదో పది బ్యాంకులు దోచుకున్నానని కాదు, కుంటే అలా ఉండేదని..వెధవ అనుమానాలూ మీరూ. "ఆ తలుపు మూయండ్రా" అంటే నా వైపు చూసి నవ్వేవాళ్ళే తప్ప ఒక్కడూ ముయ్యడు. నాకేమన్నా తలుపులు తెరిచున్న విమానాలు అలవాటా వీళ్ళల్లాగా? గట్టిగా ఇంకోసారి అరిచాను. ఫలితం లేదు. టైగర్ (మా ఆవిడ ముద్దు పేరండీ. తనతో చెప్పకండి ప్లీజ్) వెనక్కితిరిగి సీరియస్ గా చూసింది. కళ్ళతో నోరు మూయించే ఆర్టులో తనెప్పుడో మాస్టరీ పొందింది.

"ఆల్ రెడీ?" పెద్దగా అరిచాడు ముందునుంచి పైలట్. మా ఆవిడ ముఖంలో గర్వంతో కూడిన ఆనందం, నా ముఖంలో మృత్యుకళ డాన్స్ చేస్తున్నాయి. నాకెలా తెలుసంటారా?.. ఇవే, ఈ అనుమానాలే తగ్గించుకుంటే మంచిది మీరు.

మా ట్రైనర్ నా దగ్గరికొచ్చి మళ్ళీ అడిగాడు "రెడీనా?" అని రెండు థంబ్స్ పైకి చూపిస్తూ.

"బ్రదర్, పక్కనే ఎయిర్ పోర్ట్ ఉందికదా, అక్కడ దిగుతాలే, మధ్యలో ఎందుకు?" అన్నాను వాడితో.

వాడో వెర్రినవ్వు నవ్వాడు. నవ్వినవ్వి కన్నీళ్ళు కూడా వచ్చేట్టున్నాయి. బలవంతంగా నవ్వాపుకొని "ఏంటి సర్, మేడమే ధైర్యంగా చేస్తుంటే, మీరిలా..?" అన్నాడు.

"దాని ధైర్యం కసితో వచ్చింది బాబూ, నా భయం..." అంటూ ముందుకు అడుగేసి కిందకి చూసి గుండె ఆగినంతపనయ్యి వెనక్కి వచ్చాను.

"డోంట్ వర్రీ, చాలా మందికి జరుగుతుందిలా. నేనుంటా కదా మీతో, ఇట్స్ పెర్ఫెక్ట్లీ సేఫ్" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. సుయిసైడ్ చేసుకునేటప్పుడు ఆఖరి కోరికలుండవు.

నందూ..అదేనండీ మా ఆవిడ (మాకూ మాకూ లక్ష పేర్లుంటాయి) "ఫస్ట్ నేను వెళ్ళచ్చా?" అంది చిన్నపిల్లలా కళ్ళార్పుతూ. "దీని పిచ్చీ ఇదీ" అనుకుంటూ వెళ్ళమని కాదు దూకమని చూపించాను చేత్తో. అంతే..విమానం గేట్ అంచు దాకా వెళ్ళి వెనక్కి నా వైపో చూపు విసిరి హఠాత్తుగా బైటికి దూకింది. దాని నోటినుంచి వస్తున్న అరుపులు గాల్లో కలిసిపోయాయి. కింద పడిపోతోంది వేగంగా. అదేం ఒక్కతే పడలేదులేండి. అలా జాలి ఫేసు పెట్టకండి. ట్రైనర్ తో కలిసి "టాండం జంప్" చేసింది. అంటే మన పెద్దవాళ్ళన్నట్టు "కలిసి దూకడం" అన్నమాట. ఈ స్కై డైవింగ్ వాళ్ళు ఆపకపోతే ఒంటరిగా ఐనా దూకేసే రకమే అది.

"సర్ మన టర్న్ ఇప్పుడు" అన్నాడు నా ట్రైనర్. "తప్పదా" అన్నట్టు దీనంగా ముఖం పెట్టాను. అబ్బే, కనికరం లెస్ ఫెల్లో. వదిలేలా లేడు. నేను పెద్దగా ఆంజనేయ దండకం మొదలుపెట్టాను. వాడు ఇవేమీ పట్టించుకోకుండా 3..2.. 1.. జంప్ అని నన్ను పట్టుకుని ముందుకి దూకేశాడు. దుర్మార్గుడు. మేఘాల్లోంచి కిందకి దొర్లుతూ పడిపోతున్నాం. ఆ వేగానికి నా కిడ్నీ గొంతులోకి వచ్చింది. అప్పటికీ మా ఆవిడకి చిలక్కి చెప్పినట్టు చెప్పా ఈ ఎగరటాలూ ఇవీ పక్షుల హక్కులే, వాటిని మనం కాలరాయటం నేరం అని. పట్టించుకోలేదు సరికదా నన్నో ఎస్కేపిస్టంది. బహుశా చిలక్కి చెప్పినట్టు కాకుండా మనిషికి చెప్పినట్టు చెప్పుండాల్సింది. పడుతుంటే మాత్రం నాకు చిన్నప్పుడు జైంట్ వీల్ లో కిందకి దిగుతున్నప్పటి కలిగే ఫీలింగ్ టు ద పవర్ ఆఫ్ రామానుజన్ కాన్స్టంట్ లాంటి ఫీలింగేదో కలుగుతోంది (ఫ్లోలో వచ్చింది ఫాలో అయిపోండి). ఆ గాలి తాకిడికి తెలుగు సినిమాలో హీరోతో స్లోమోషన్లో తన్నులు తింటున్న విలన్ లా నా ముఖంలోని పార్ట్స్ అన్నీ షేక్ అవుతున్నాయి. పెద్దగా అరుద్దామంటే నోట్లోంచి మాట పెగలట్లేదు. ఇదే..ఇదే..నా ఆఖరిక్షణం. డౌట్ లేదు. కాకే ఒక్కటే బాధ – మా ఆవిడ మీద ఏ నోటూ రాయకుండా ఈ బలవంతపు ఆత్మహత్య లాంటి హత్యకి ఒప్పుకున్నందుకు.

ఒక్క నిమిషం అలా దొర్లాక ఏదో మమ్మల్ని గట్టిగా పైకి లాగినట్టనిపించింది. "యమపాశం అయ్యుంటుంది. అక్కడికే నెక్స్ట్ స్టాప్" అనుకుంటూ సన్నగా కళ్ళు తెరిచాను. దూరంగా బంగారు రంగులో మెరుస్తున్న సూర్యుడు. నీలం, ఎరుపు రంగులతో నిర్మలంగా ఉన్న ఆకాశం. అక్కడక్కడా నా ఎత్తులో వస్తున్న పక్షుల గుంపులు."పోయేకాలంలో ఈ ప్రకృతి వర్ణనలేంటి దరిద్రంగా" అని గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

అప్పుడే యముడి రూపంలో కళ్ళముందు నవ్వుతూ ప్రత్యక్షమైంది..నీరా!

★★★

మూడు నెలల క్రితం

పార్టీకి బయలుదేరినప్పటినుండీ సైలెంట్ గా ఉందెందుకో మా ఆవిడ. "ఎందుకో ఒకందుకు...భార్య సైలెంట్ గా ఉంటే సంతోషించక ఈ ఆరాలెందుకు బ్రదరూ" అని తిట్టబోతున్నారని నాకు తెలుసు. మీకా ఛాన్స్ ఇవ్వను. కారణాలేమీ అడగలేదు నేను. పార్టీలో నేనో మగ గుంపు దగ్గర, తనో ఆడ బ్యాచ్ దగ్గర జేరిపోయాం. కాతే అప్పుడప్పుడూ ఓ చూపు పడేస్తున్నా తనవైపు. అటూ ఇటూ దొంగచూపులు చూడటం, రకరకాల గ్రూప్ ల చుట్టూ తిరగడం, పదే పదే ఫుడ్ దగ్గరి కెళ్ళి ఏమీ తెచ్చుకోకపోవటం..ఇలా మా టైగర్ తడబడటం కొత్తగా కనిపించింది. చివరికేదో దయ్యాన్ని చూసి పారిపోతున్నట్టుగా సర్రున బైటికెళ్ళింది. ఏంటా అని వెనక్కి చూస్తే నీరా వాళ్ళాయన. అతన్ని చూసి ఎందుకు పరుగెడుతోందో? కొద్ది సేపటి తర్వాత, నీరసంగా మొహంపెట్టి లోపలికొచ్చింది. వెనకాలే నవ్వుతూ నీరా! ఆకలితో ఉన్న పులికి తీరిగ్గా మొబైల్ గేమ్ ఆడుకుంటున్న లేడి పిల్ల దొరికనట్లుంది నీరా నవ్వు చూస్తే. పాపం మా ఆవిడ.

ఛ ఛ దీని మీద జాలి పడటమంటే..పులి బోనులో చెయ్యిపెట్టి మరీ దానికి పుడ్డెట్టటం లాంటిది..అవసరమా!

నందూ ఎక్కడికీ పారిపోలేకుండా చేతిలో చెయ్యి వేసి మరీ లోపలికి తీస్కొస్తోంది నీరా. కోల ముఖం, అథ్లెటిక్ బాడీ. ఎర్రటి సమ్మర్ డ్రెస్, కర్లీ హైర్ తో నలభై ఏళ్ళంటే జనాలు నన్ను ఈడ్చి తన్నేంత ఛార్మింగ్ గా ఉంది. ఈ మధ్య ఏ పార్టీలో ఐనా తనే ఆకర్షణా కేంద్రం (అదేనండీ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్..అదియునూ తెలియదు తమరి..వద్దులే).

అప్పటికే వాళ్ళాయన తన ఫోన్ ని ఓ మినీ ప్రొజెక్టర్ కి కనెక్ట్ చేసి లైట్లు డిమ్ చేసి గోడ మీద ప్రొజెక్ట్ చేయడం మొదలుపెట్టాడు. వాళ్ళిద్దరి కోఆర్డినేషన్ చూస్తుంటే ఖచ్చితంగా మాజీ స్మగ్లింగ్ ముఠా సభ్యుల్లాగా అనిపించారు నాకు (పచ్చక్రిమినల్ బుద్ధికి లోకమంతా క్రిమినల్స్ గా కనిపిస్తుందని సామెత). అందరం వాళ్ళ చుట్టూ గుమ్మికూడాం. గోడమీద వాళ్ళ అందమైన ఫొటోలు. సముద్రపు లోతుల్లో, రంగురంగుల కోరల్ రీఫ్స్ మధ్య తిరుగుతున్న చేపల మధ్యలో

ఇద్దరూ ఆక్సిజన్ సిలిండర్స్ తో స్విమ్ చేస్తున్నవి. నీరా ఒక్కొక్కటీ వివరిస్తోంది "అండమాన్ దీవుల్లో స్కూబా డైవింగ్ చేసాం. కొన్ని డాల్ఫిన్లు బాగా దగ్గరిగా వచ్చాయి. దూరంగా షార్క్ లు కూడా కనపడ్డాయి" అంది చుట్టూ చూస్తూ. నోరు తెరిచారు చాలా మంది. సందేహంగా మొహం పెట్టారు నాలాంటి కొంతమంది. ఇంకా నయం, ఓ షార్క్ నా మీద కన్నేస్తే, మా ఆయన దాన్ని చెప్పుతో కొట్టి, ఊడిన టీత్ తో నాకు లాకెట్ చేయించాడనలేదు!

అండమాన్ లోనే వాళ్ళు చేసిన సర్ఫింగ్, పారాగ్లైడింగ్ ఫొటోలన్నీ చూపించి ఫోన్ లో రీలంతా ఖాళీ అయ్యాక తృప్తిగా సినిమా ముగించి లైట్లు వేసారు ఇద్దరూ. హాలంతా చప్పట్లు. కోడి రామకృష్ణ గ్రాఫిక్స్ చూసిన అనుభూతితో కొందరుంటే, నలభైల్లో వాళ్ళ ఫిట్నెస్ చూసి అక్కడికక్కడే అమెజాన్ లో లక్షల్లో ఎక్విప్ మెంట్ ఆర్డర్ చేస్తున్నవాళ్ళు ఇంకొందరు.

ఎక్కడుందా నా సతీ నందూబాయి అని వెతికితే ఓ మూల కనబడింది మొహం వేలాడేసుకుని. తన ఫారెస్ట్ లోకి ఇంకో టైగర్ వచ్చింది మరి.

★★★

కొన్నాళ్ళకి మా ఇంట్లో చినన్ టీ పార్టీ ఇచ్చింది నందూ (మా గొప్పవాళ్ళకి ఇవే పనులు మరి). జాగ్రత్తగా తనని పొగిడే ఫ్రెండ్స్ నే ఇన్వైట్ చేసింది. అదే నా కొంపముంచుతుందని నేనూహించలేదు.

కొంచెంసేపు తను చేస్తున్న రకరకాల యాక్టివిటీస్ విన్నా విషయం మళ్ళీ నీరా దగ్గరికే వెళ్ళడం, చుట్టు పక్క జనాలు తన ఎక్స్ ట్రీమ్ స్పోర్ట్స్ పురాణం మొదలు పెట్టడంతో, మాయావిడ మొహంలో రంగులు మారడం నేను గమనించక పోలేదు. పుండుమీద కారంలా ఒకామె తన వాట్సాప్ ఓపెన్ చేసి నీరా కపుల్ సాహసకార్యాల ప్రత్యేక ప్రదర్శన మొదలుపెట్టింది. ఇంకా మాట్లాడితే టికెట్ పెట్టి క్యూలో రమ్మనేట్టుంది చూడ్డానికి. హిమాచల్ ప్రదేశ్ లో వాళ్ళ బంగీ జంపింగూ, లడఖ్ లో మౌంటైన్ ట్రెక్కింగూ..అబ్బ నా నోటితో చెప్పలేను, మనుషులు చెయ్యకూడనివన్నీ ఉన్నాయా లిస్టులో. నాకు తెలీకడుగుతా..ఎవడైనా గంగలో మునిగితే ముక్తి పొందుతారు, కానీ వీళ్ళేంటండీ దాంట్లో వాటర్ రాఫ్టింగ్ చేస్తే కానీ మోక్షం లేదంటారు? వాట్ ఎ క్రేజీ కపుల్ ఐ సే.

ఇదంతా విని భరించలేక మా టైగర్ పైకి లేచింది. జూలు విదిల్చి నా వైపు చూసింది (ఎస్, షి హ్యాస్ జూల్). దాని ఆవేశం చూసి నా కాళ్ళు సన్నగా వణికాయి. అందరికీ వినబడేలా అనౌన్స్ చేసింది

"ఫ్రెండ్స్, నేనూ వినయ్ స్కై డైవింగ్ ప్లాన్ చేస్తున్నాం మైసూర్ లో!!"

ఎఫెక్ట్ కోసం ఒక నిమిషం ఆగి చూట్టూ చూసింది. అందరూ (నాతో సహా) పూర్తిగా నోరు తెరిచారని కన్ఫర్మ్ చేస్కున్నాక కంప్లీట్ చేసింది "నెక్స్ట మంత్ లో"

నా గుండె ఝల్లుమంది. అనుకోనిదంతా అయ్యింది. పార్టీ తర్వాత నందూ కాళ్ళు పట్టుకున్నంత పని చేశాను. ఈ పరువు కోసం ప్రాణాలిచ్చే బిజినెస్ పెట్టుకోవద్దని బతిమిలాడాను. ఇంకో అద్భుతమైన సలహా కూడా ఇచ్చాను. నా టాలెంట్ ఉపయోగించి అచ్చం ఆకాశం నుండి దూకుతున్నట్లు మంచి పిక్స్ ఫొటోషాప్ చేస్తానన్నాను. అంతకు మించి బెస్ట్ డీల్ లేదన్నాను. కోపం, అసహ్యం కలిసిన యాంగిల్ తో చూసింది తను. ఫేక్ పనులు చేయడానికి నాకు సిగ్గులేదంది. నా సిగ్గు పెళ్ళిరోజే వదిలేసానని అనబోయి నోరు మూసుకున్నాను. నందూ ఒక్కసారి కమిట్ అయ్యిందంటే, తన పెనిమిటి మాట మాత్రం అస్సలు వినదు.

అసలు ఇలాంటి కష్టాల్లో పడకుండా ముందే నేనెంత జాగర్తపడ్డానో తెలిస్తే మీ గుండె చెరువు కాదు, ఏ బంగాళా ఖాతమో అవ్వచ్చు.

★★★

మా టైగర్ కో పిచ్చలవాటుంది, అన్నిట్లోనూ తనే ఫస్టుండాలని. భలేవారే! మంచి లక్షణమే కదా అని పెళ్ళిచూపుల రోజు నేను వేసినట్టు నూడుల్స్ లో కాలు వేసేరు. ఆ ఎడిక్షన్, కాలంతో పాటు ఓ న్యూరలాజికల్ కాంప్లెక్షన్ గా మారి నా డిక్షన్ ని దెబ్బతీసింది (అమ్మతోడు అర్ధం వెతకద్దు). దాంతో ఎవడేది చేసినా దాన్నుంచి ఇన్స్పిరేషన్ తీసుకొని నాకు పర్స్పిరేషన్ తెప్పించేది.

పెళ్ళైన కొత్తల్లో ఎవరింట్లోనో వంటల్ని పొగిడానట, అంతే ఆ మాత్రం నేను చెయ్యలేనా అని రకరకాల కుకింగ్ ఎక్స్పెరిమెంట్స్ చేసి నన్ను బలిపశువును చేసింది. కొన్నాళ్ళకి నాకు పిచ్చెక్కి గాంధీగారి లాగా వాటర్ థెరపీ మాత్రమే తీసుకుంటానని బెదిరిస్తే కానీ మానలేదు ఆ అరాచకం. లేకపోతే జీవితమంతా స్ట్రాబెర్రీ ఫ్రై, ద్రాక్ష సమోసా లాంటి

ఎలియన్ వంటలు తింటూ బతకాల్సొచ్చేది. అక్కడితో ఆగితే మా ఆవిడెందుకవుతుంది, ఓ రోజు పక్కింటావిడ పొరపాటున 'యోగా' అని రెండక్షరాలందో లేదో, ఇది రెండు నిమిషాలలో రెండు లక్షల యోగా ప్యాకేజీ కొనేసి, రెండు సంవత్సరాలు ఇంటినంతా యోగమయం చేసింది. ఓ రోజు నాచేత అష్టవక్రాసనం వేయిస్తే విప్పుకోలేక నేను పడిన అవస్థ ఇప్పటికీ కల్లోకొస్తుందంటే నమ్మండి! ఇలా ప్రతి రెండేళ్ళకీ క్రేజీ కియా రే అనుకుంటూ కొత్త పిచ్చితో తయారయ్యేది నా ఖర్మకి.

నేను మగ పురుషుణ్ణి కదా, అందునా మనిషిని. ఇవన్నీ భరించలేక దాని స్నేహితురాళ్ళతో గొడవలు పెట్టి ఎవరూ కొత్త ఇన్ఫ్లుయెన్సులు తేకుండా జాగర్తపడటం మొదలుపెట్టాను. ఎందుకైనా మంచిదని కొత్త విల్లా కమ్యూనిటీకి మకాం మార్చేసాను. నేనేమీ ఆషామాషీగా మారలేదండోయ్. మారే నెలరోజుల ముందునుంచీ చెత్త తీస్కెళ్ళే వాడి నుండీ, పిజ్జా డెలివరీ బాయ్ దాకా అన్ని గెటప్ లూ వేసి ఈ కమ్యూనిటీ లేడీస్ హాబీస్ అన్నీ క్షుణ్ణంగా చదివి, ఇవేమీ మా టైగర్ తోక ఈక సాటికి రావు అని కన్ఫర్మ్ చేస్కున్నాకే దిగాను. అంతటితో ఆగితే, మీరు నాకు యాభై మార్కులే వేసి పెదవివిరుస్తారని తెలుసు. నేను నూటికి నూరు మార్కుల క్యాండిడేట్ ని. అందుకే ఇక్కడ జేరాక వెంటనే పనిలోకి దిగాను. కమ్యూనిటీ బోర్డ్ మెంబర్స్ లో కొంతమందిని కొనేసాను, ఇంకొంతమందిని లొంగదీసుకున్నాను. మొత్తానికి తర్వాతి సంవత్సరమే ప్రెసిడెంట్ అయ్యాను. నమ్మరా? పెళ్ళాం కోసం ప్రాణం ఇచ్చే భర్తలున్నారంటే మీరు భేషుగ్గా నమ్ముతారు, ప్రెసిడెంట్ అయ్యేవాళ్ళని నమ్మరు. యా ఖుదా, తేరా గవా..

ప్రెసిడెంట్ అయిన వెంటనే నేను రాజ్యాంగంలో తెచ్చిన పెనుమార్పు – కొత్తగా అద్దెకొచ్చేవాళ్ళు అప్లికేషన్ లో డీటైల్డ్ గా వాళ్ళ హాబీలని రాయాలని. అవి చూసి నాకు నచ్చితే (మేజర్ గా రిస్క్ లేకపోతే) అప్పుడు అప్రూవ్ చేస్తాను. చాలా సార్లు మా సెక్రటరీకి అర్థమయ్యేది కాదు నేనెందుకు రిజెక్ట్ చేస్తున్నానో. వాడికేం తెలుసు నా స్పెషల్ ప్రొఫైలింగ్ టెక్నిక్స్!

అంతా సవ్యంగా జరుగుతునన్ రోజులని ఒక్క వారం తిరుపతి దర్శనానికి అటు వెళ్ళామో లేదో ఇటు కాల్ చేసాడు ఓ రోజు. కొత్తగా ఓ ఫ్యామిలీ అద్దిల్లు కోసం వచ్చారని. నేను సూటిగా అడిగాను హాబీస్ కాలంలో ఏం రాసారని.

వాడు కంగారులో "రీడింగ్, వైల్డ్ యానిమల్స్, వాచింగ్ ఎక్స్ ట్రీం స్పోర్ట్స్" అనుంది సార్ అన్నాడు.

"పెద్దగా రిస్కు లెస్సు వ్యవహారం" అనుకోని సరేనన్నాను. తర్వాత తెలిసింది అది "వైల్డ్ యానిమల్ వాచింగ్, ఎక్స్ ట్రీం స్పోర్ట్స్" అని! కామా తో కంతం మీదకి తెచ్చాడు మా బుర్రతక్కువ సెగట్రీ.

"నీరా వాళ్ళు అద్దెకి రావాలనుంటే నువ్వు మాత్రం ఏం చేస్తావులే...హతవిధి" అని వేదాంతం చెప్పకండి. నాకు చిరాకు. వాళ్ళు రావడమూ అయ్యింది, మా ఆవిడకి మళ్ళీ పూర్వ జన్మ గుర్తొచ్చి చంద్రముఖిగా మారడమూ జరిగింది.

దాని ఫలితమే ఇవాళ్టి ఈ "కలిసి దూకుదాం రా" ప్రోగ్రాం!

★★★

స్కై డైవింగ్ అయ్యాక చావు తప్పి కన్ను లొట్టబోయినట్టుంది నా పరిస్థితి. నందూ మాత్రం బ్యాచ్ లు బ్యాచ్ లు గా ఆడజనాల్ని పిలిచి మా విజయగాధని ఆడియో విజువల్ రూపంలో తెరకెక్కించింది. దీనికి కొందరు ఇంకా మసాలా దట్టించి సోషల్ మీడియాలో ఓ చినన్ సెన్సేషన్ చేసారు.

ఈ హడావిడి మధ్యలో ఓ రోజు నీరా నుంచి కాల్ మా ఆవిడకి. ఫోను పెట్టాక పూర్తిగా నోరెళ్ళబెట్టేసింది. ఒలింపిక్ గోల్డ్ గెలిచి పోడియం మీద నుంచున్న ఫేసూ..ఇదీ..

"ఏమైందే? ఏమంది తను?"

"టీ కి ఇన్వైట్ చేస్తోంది వినయ్"

"గ్రేట్, నీ వీడియోస్ చూసుంటుందా?"

"తప్పకుండా, అందుకే ఇదంతా"

"ఏంటో ప్లాను?"

"నాకేం తెలుసు. షాకై ఉంటుంది"

"ఊ...మొత్తానికి సాధించావ్"

"ఛ ఛ దాని గురించేం చెయ్యలేదు నేను"

"అవును నీ చిన్నప్పటి కల కదా...అదే నువ్వు సాధించావ్"

సీరియస్ గా చూసింది తను. మనం ఇంక బార్డర్ దాటితే బాడీ మిగలదని అర్ధమైంది. పీఛేముడ్..

★★★

నీరా రమ్మన్న రోజు రానే వచ్చింది. సాయంత్రం నాలుగింటి టీ ప్రోగ్రాంకి కి పొద్దున్న ఐదు గంటలకే లేపింది నన్ను సాధ్వి మాత నందూ.

"ఏంటే, ఇంత పొద్దున్నే ఆదివారం పూట" అంటే "నో టాక్, ఓన్లీ యాక్షన్" అంది. పొద్దున్నే షాపింగ్ మాల్ వాణ్ణి దగ్గరుండి తాళాలు తెరిపించి డ్రెస్ షాప్ మీద దాడిచేసి సగం దుకాణం కొనేసింది. అంతేకాదు ఫిట్టింగ్ రూమ్ దగ్గర చిన్న సైజు రాంప్ వాక్ కూడా చేసిందండోయ్. షాపు వాళ్ళు దీని విజృంభణకి వణికిపోతే, ఎక్స్ ట్రా టిప్పిచ్చి మరీ బైటపడ్డాం. తర్వాత మేకప్ అపాయింట్మెంట్, చేపలతో ఫుట్ స్పా, కందిరీగలతో ఫేషియల్ చేయించుకొని ఇంట్లోపడేటప్పటికి సాయంత్రం నాలుగూ అయ్యింది. రెండు నిమిషాల్లో నేను తెమలాలని ఆర్డరు! హడావిడిగా ఏదో పిచ్చి టీషర్ట్ వేస్కొచ్చి ఆశగా అడిగాను ఎలా ఉందని. "పెళ్ళిచూపుల కెల్తున్నామా? పదండి.." అని హుంకరించింది. ఈ టార్చరు చూడలేక నాకో గోఫండ్ మి పేజ్ పెట్టాలనే ఆలోచన తన్నుకొస్తోంది కదూ మీకు. దిల్లున్నోళ్ళబ్బా మీరు!

నీరా వాళ్ళింట్లోకి అడుగుపెడుతూనే ఒకరిమొఖాలొకరం చూసుకున్నాం. గుళ్ళపైన రామాయణం బొమ్మలు చెక్కినట్టుగా, ఇల్లంతా వాళ్ళు రకరకాల చోట్ల తీయించుకున్న ఫొటోలతో నింపేసి ఉంది. వాళ్ళ వీర గాధలని భావి తరాలకందజెయ్యాలని కాబోలు! "బావుంది కదా?" అంటూ నందూ ఓ ఫ్రేం వైపు చూపించింది. పెద్ద గోల్డ్ కోటెడ్ అక్షరాలతో చెక్కిన కొటేషన్ – "రిస్కు తీసుకోకపోతే లైఫ్ లో దొరికేది రస్కే!". నాకు అరికాలి మంటనెత్తికెక్కింది. వాడెవడో ప్రాస కోసం కక్కుర్తి పడి అలా రాస్తే, వీళ్ళు దాన్ని బట్టీపట్టి నెత్తిన పెట్టుకుని తిరుగుతున్నారు. అయినా రస్కుకేం తక్కువ, భేషుగ్గా ఉంటుంది టీలోకి!

వాళ్ళ గ్యాలరీ కథలన్నీ విన్నాక జీవితం మీద విరక్తితో బాల్కనీలోకి నడిచాం. ఆడవాళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్ళు కాసేపు ఫేక్ పొగడ్తలు పొగుడుకుంటుంటే, మగాళ్ళిద్దరం దేభ్యమ్మొహాలేస్కొని నవ్వాం. నీరా వాళ్ళాయనే పాయింట్ కొచ్చేశాడు. "నందూ...మీ స్కై డైవింగ్ పిక్స్ చూశాం. గ్రేట్ ఫస్ట్ స్టెప్"

మనిషి మంచివాడే కానీ పెళ్ళాం మాయలో ఏంచేస్తున్నాడో తెలియట్లేదితనికి. నీరా అతనివైపో లుక్కేసి.."మనం ఓ టెన్ ఇయర్స్ క్రితం చేసుంటాం కదా?..దట్ వస్ ప్రెట్టీ ఈసీ..బట్ ఫన్" అంది. మా ఆవిడ దెబ్బతిన్న పులిలా చూసింది.

"ఎంత హైట్ నుంచి చేశారు నందూ?" అంది కాలు మీద కాలు వేస్కుంటూ.

టెన్షన్ తో నాకు చేతిగోళ్ళు దాటి వేళ్ళు కూడా కొరికి తినేయాలనిపిస్తోంది.

మా టైగర్ ఏదో చెప్పేంతలోపే మళ్ళీ తనే అంది "ఓ టాండం జంప్ కదా ఐ ఫర్గాట్, పదివేల ఫీట్. ఇంప్రెసివ్!" అంది. అందరం ప్రశాంతంగా ఊపిరిపీల్చుకున్నాం.

యుద్ధంలో సీజ్ ఫైర్ చేసాక రెండు దేశాల ఆర్మీ నాయకులు కలిసి టీ తాగుతున్నట్టుగా సైలెంట్ గా తాగుతున్నా నలుగురం. ఏ మాటంటే, ఎటువైపు నుంచి బాంబ్ పేలుతుందో!

నీరా నే మొదలెట్టింది "మీరు కూడా మా క్లబ్ లో చేరారు కనక అందరం కలిసి ఏమన్నా ట్రిప్ ప్లాన్ చేద్దామా?" అంది ఎక్సైట్ మెంట్ తో చేతులు రుద్దుకుంటూ. వాళ్ళాయన తలూపాడు. మనోడూ నా బాపతే. ఓ కుక్కకి ఇంకో కుక్క కలిసినప్పుడొచ్చే ఆనందమే వేరప్పా!

"నువ్వు చెప్పు నందూ" అంది.

"మీకే ఎక్కువ ఐడియా ఇవన్నీ, మీరే చెప్పండి" అంది మా ఆవిడ.

ఇలా కమిట్ అయిపోతోందేంటి అని దాని వైపు సీరియస్ గా చూసేను. నా వైపో లుక్కుకూడా ఇవ్వలేదు తను నేనెక్కడ అడ్డుపుల్లలేస్తానేమోనని.

నీరా వాళ్ళ హస్బెండ్ వంక చూస్తూ, "మౌంట్ అబూ మీద మౌంటైన్ బైకింగ్?"

"ఉమ్, ఇట్స్ ఓ.కే అట. నా కొలీగ్ చెప్పాడు, నాట్ వర్త్ ఇట్" అన్నాడు.

"హిమాలయాస్ లో జిప్ లైనింగ్?"

తల సగం ఊపుతున్నాడిప్పుడు. నాకెందుకో నా భవిష్యత్తు ఆ తల ఊపుడులో ఉన్నట్టనిపించింది.

"ఇంక మిగతావన్నీ దాదాపుగా చేసేసాం మరి..యా మహాబలేశ్వర్ లో రాక్ క్లైంబింగ్? చాలా సీనిక్ గా ఉంటుంది.." అంది అందరివైపూ చూస్తూ. నాకు మాత్రం గ్రీక్ హోటల్ లో బేరర్ వచ్చి లాటిన్ లో మెనూ ఐటమ్స్ చెబుతున్నట్టుంది.

"నెక్స్ట్ మంత్ లో ప్లాన్ చేద్దామా?" అంది నీరా. అతని తల ఊగడం ఆగింది. మా ఆవిడ తల ఊగుతోందిప్పుడు. వీళ్ళంతా కలిసి నా కొంప ముంచబోతున్నారని అర్ధమయ్యి హఠాత్తుగా లేచి నించున్నాను. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"వచ్చే నెల అస్సలు కుదరదు, నేను నందూతో కలిసి విడిగా ఒకటి ప్లాన్ చేస్తున్నాను" అన్నాను ఆవేశంగా.

నందూ నోరెళ్ళబెట్టింది. నీరా దంపతులు ఒకరిమొఖాలొకరు చూసుకున్నారు.

"ఎక్కడికో చెప్పండి వినయ్, మేమూ జాయిన్ అవుతాం" అన్నాడు వాళ్ళాయన ఉత్సాహంగా.

"అదీ... కాశ్మీర్‌లోని సియాచిన్ వ్యాలీలో గ్లేసియర్ సర్ఫింగ్ అని ఈ మధ్యనే మొదలు పెట్టారు. సరిగ్గా ఇండియా-పాకిస్తాన్ బార్డర్ దగ్గర మొదలయ్యే మంచుకొండల పైనుంచి కింద వ్యాలీ లోకి సర్ఫ్ చేస్తుంటే వచ్చే థ్రిల్లే వేరు" అన్నాను. కింద కుర్చోగానే మా ఆవిడ నా మెడ మీద చెయ్యిపెట్టి చూసి "ఒంట్లో బానే ఉంది" అని నిర్ధారించుకుంది. నేను చిన్నగా "నీకు తర్వాత సర్ప్రైజ్ ఇద్దామనుకున్నా నందూ..కానీ చెప్పక తప్పలేదు" అన్నానో వెధవనవ్వు నవ్వుతూ.

తనేదో అర్థంలేని చూపు చూసింది.

"నీరా, మేమిద్దరమే వెళ్ళాలని నా ప్లాన్. దాంట్లో రిస్క్ కూడా ఎక్కువే..సో మేము వెళ్ళొచ్చాక అన్ని డీటైల్సూ షేర్ చేస్తాం..అప్పుడు మీరు ప్లాన్ చెయ్యచ్చు" అన్నాను తనకో కన్సెషన్ పారేస్తున్నట్టు.

ఇంటికి తిరిగొచ్చాక నందూ అనుమానాలు తీర్చడానికి మా అత్త మామలమీద ఒట్టెయాల్సి వచ్చింది. పాడు లోకం.. పెద్ద వాళ్ళని కూడా వదలదు.

★★★

ఓ రెండు వారాల తర్వాత నందూ హడవిడిగా కమ్యూనిటీ క్లబ్ హౌస్ లో ఉనన్ నా ఆఫీస్ కొచ్చింది రొప్పుతూ..

"వినయ్...వినయ్...నీరా..నీరా.."

"ఏమైందే?"

"తను వాళ్ళాయనతో కలిసి లాస్ట్ వీక్ సియాచిన్‌కి వెళ్ళిందట"

"అవునా!"

"ఆ...అక్కడే, బోర్డ్ లు పట్టుకొని లోయలోకి సర్ఫింగ్ చేస్తుంటే.." ఊపిరి బలంగా పీలుస్తూ అంది.

"చేస్తుంటే...?"

"పాకిస్తాన్ ఆర్మీ.. వీళ్ళని ఇండియన్ టెర్రరిస్ట్ లనుకొని అరెస్ట్ చేసిందట"

"అరెరే...నేను ముందే చెప్పా...రిస్కూ, వద్దూ అని. వింటేగా"

"పాపం కదా.."

"అవును వాళ్ళ పాపాన వాళ్ళే పోయారు" అని నాలుక్కరుచుకున్నాను.

"హుమ్. మరి మన ప్లాన్?"

"సియాచిన్ వ్యాలీ కాకపోతేనే, అరకు వ్యాలీ వెల్దాం. డోంట్ వర్రీ డియర్" అన్నాను అభయహస్తం చూపిస్తూ.

నీరా వాళ్ళని టెర్రరిస్టుల కన్నా భయంకరమైన ఎక్స్ ట్రీమిస్ట్ లని ఇరుదేశాలూ బహిష్కరించాయి. నా పేరు పచ్చబొట్టు వేయించుకొని ఇద్దరూ పలు దేశాల విమానాశ్రయాల దగ్గర నా గురించి మారువేషాల్లో తిరుగుతున్నారని ఇంటెలిజెన్స్ వర్గాల భోగట్టా.

# బాకీ

## సయ్యద్ సలీం

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

ఉదయం తొమ్మిది గంటలు..ఎప్పటికిమల్లె ఇస్త్రీ చేసిన బట్టలు తొడుక్కుని, వాటిమీద సంపెంగల పరిమళంతో గుబాళించే సెంట్ స్ప్రే చేసుకుని, మొహానికి పాండ్స్ క్రీంరాసి, దానిపైన పౌడర్ అద్ది, మొహాన్ని ఓసారి అద్దంలో చూసుకుని సంతృప్తిగా తల పంకించి, గది బైటికొచ్చి చెప్పులేసుకుంటున్న సమయం లో పక్క బెడ్రూంలోంచి మాటలు విన్పించాయి. "ఈ వయసులో మీ నాన్నకు ఆ షోకులేంటండీ? అత్తయ్య చనిపోయి రెణ్ణెల్లు కూడా పూర్తి కాలేదు. దాదాపు నలభై యేళ్ళపాటు కాపురం చేసిన భార్య పోయిన దిగు లుకూడా లేదా ఆ మనిషికి? గుండెపోటుతో అత్తయ్య సడన్‌గా చనిపోవడంతో మీ నాన్నకు పిచ్చి పట్టిందనిచుట్టుపక్కలవాళ్ళందరూ అనుకుంటున్నారండీ" అంటోంది కోడలు నా కొడుకుతో.

వాడేదో అన్నాడుగానీ నాకు సరిగ్గా విన్పించలేదు. మళ్ళా కోడలి గొంతే విన్పించింది. "అసలింత కూ రోజూ ఇదే టయానికి ట్రిమ్‌గా తయారై ఎక్కడికెళ్ళి వస్తున్నారో కనుక్కున్నారా?"

నాలో నేనే విషాదంగా నవ్వుకుని, గొడుగు చేత్తో పట్టుకుని బైట పడ్డాను. వర్షాకాలం.. చల్లటిగాలి వీస్తోంది. ఆకాశమంతా మేఘావృతమై ఉంది. ఏ క్షణంలో అయినా వర్షం పడేలా ఉంది.

మెల్లగా నడవసాగాను. రెండు కిలోమీటర్లు నడిచి, వూరికి దక్షిణం వైపున శివారులో ఉన్న స్మశానవాటికని చేరుకున్నాను. ఒక్కో సమాధిని దాటుకుంటూ నా భార్య జాహ్నవి సమాధిని చేరుకున్నాను. గొడు గుని పక్కన పెట్టుకుని, అక్కడకూచోడానికి అనువుగా ఏర్పాటుచేసుకున్న రాతిమీద కూచున్నాను.

జాహ్నవి సమాధి వైపుకు చూస్తూ ఓ క్షణం కళ్ళు మూసుకుని ఆమెకు సద్గతులు ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించాను. చేతిమీద రెండు చినుకులు పడ్డాయి. తలయెత్తి ఆకాశంలోకి చూశాను. పెద్ద వర్షం పడే సూచనలు కన్పించాయి.

నేను పుట్టి పెరిగింది పల్లెటూళ్లో అయినా కాలేజీ చదువు ఈ పట్నంలోనే పూర్తి చేశాను. ఉద్యోగం, పెళ్ళీ, పిల్లలు.. ఈ పట్నంతో ముడిపడి ఎన్ని తీపి జ్ఞాపకాలో.. ముఖ్యంగా జాహ్నవి నా జీవితంలోకి అడుగు పెట్టిన క్షణం.. జీవితంనిండా ఎన్ని వసంతాలు విరబూశాయో. జాహ్నవి పట్నంలో పెరిగిన పిల్ల. తెల్ల గా, నాజూగ్గా సన్నజాజి తీవెలా ఉండేది. మాటల పుట్ట.. ప్రవాహంలా మాటల్తో ముంచెత్తేది. ఎన్ని కబుర్లో.. మధ్య మధ్యలో ఎన్ని నవ్వులో తాళింపులా పోహళించి.. తన గొంతు చాలా బావుండేది. మధుర గాయని జానకి గొంతులోంచి జాలువారే పాటలా.. అలా ఎంత సేపైనా వింటూ విండిపోవాలనిపించేంత తీయటి స్వరం..

'పాటలెందుకు పాడవూ' అని అడిగితే సిగ్గుపడిపోతూ 'నాకు పాటలు రావు. మాటలే వచ్చు' అనేది.

ఆమెకు పూర్తి విరుద్ధమైన స్వభావం నాది. చాలా తక్కువ మాట్లాడేవాణ్ణి. స్నేహితుల్తో, బంధువుల్తో కలవడానికి ఇష్టపడే వాణ్ణి కాదు. పెళ్ళిళ్ళకూ, పుట్టినరోజు పండుగలక్కూడా దూరంగా ఉండేవాణ్ణి. యిల్లూ,ఆఫీసూ, పుస్తకాలు.. ఇవే నా ప్రపంచం. 'అలా ఉంటే ఎలాగండీ? అందరితో కలవాలి కదా.. అందర్నీ కలుపుకు పోవాలి కదా' అనేది జాహ్నవి. తను చాలా కలుపుగోలు మనిషి. ఎవర్తో అయినా ఇట్టే కలిసిపోయేది. అందుకే మా బంధువర్గంలో తనకు మంచి పేరుంది. నన్నే అహంకారి అనుకునేవాళ్ళు. నాకు అహంకారం లేదు. మౌనంగా ఉండటం ఇష్టం. నా కుటుంబంతో కలిసి సమయం గడపటం ఇష్టం. అంతే. చాలా అవసరమైతే తప్ప మాట్లాడాలనిపించదు. నన్ను అర్థం చేసుకుంది జాహ్నవి ఒక్కతే. 'కనీసం నాతో ఐ నా మాట్లాడొచ్చు కదా. మాట్లాడితే ముత్యాలేమైనా రాలిపోతాయా?' అంటూ నవ్వేది.

సన్నటి జల్లు పడసాగింది. గొడుగుని విప్పదీసి వర్షంలో తడవకుండా పట్టుకుని వూరివైపుకు మెల్ల గా నడవసాగాను. నిన్న యింట్లోంచి బయల్దేరినప్పుడు ఫెళ్ళున ఎండ కాస్తో ఉండింది. వర్షం రాదనుకుని గొడుగు తీసుకోకుండా బైటికొచ్చాను. గంట లోపల ఆకాశం మేఘావృతం కావడం, వర్షం దంచి కొట్టడం,నేను ముద్దగా తడిసిపోవడం జరిగిపోయాయి. అందుకే వాన రాకడ ప్రాణం పోకడ తెలియవంటారు. జాహ్నవి కూడా అంతేగా. చెప్పాపెట్టకుండా, కొద్దిపాటి సూచన కూడా ఇవ్వకుండా ఎంత హఠాత్తుగా అదృశ్యమైపోయిందో..

నా చిన్ననాటి స్నేహితుడు మురళి వాళ్ళ యింటికెళ్ళే దారిలోకి మళ్ళాను. వర్షం తెరిపిచ్చింది. గొడుగుని మడిచి, చేతిలో పట్టుకుని నడవసాగాను. మళ్ళా జాహ్నవి జ్ఞాపకాలు వర్షపు జల్లులా కురవసాగాయి. నాకు ఉదయం ఆరింటికి లేవడం అలవాటు. రాత్రి పడుకోవడం ఎంతాలశ్యమైనా ఉదయం టంచన్‌గా ఆరింటికే ఎవరో గంట కొట్టినట్టు మెలకువ వచ్చేస్తుంది. ఉద్యోగ విరమణ చేశాకకూడా ఆరింటికే లేస్తుంటే 'ఆఫీస్‌కెళ్ళే పనిలేదుగా. హాయిగా ఏడువరకో ఎనిమిదివరకో పడుకోక ఎందుకటా ఆరింటికే లేవడం?లేచినప్పటినుంచి నా ప్రాణాలు కొరుక్కుతినడానికి కాకపోతే' అనేది. నిజమే... పాపం బాగా సతాయించే వాణ్ణి . కాఫీ చల్లారిపోయిందనో, ఇడ్లీలు మెత్తగా లేవనో, పచ్చళ్ళో కారం ఎక్కువైందనో.. అవన్నీ గుర్తుకు రాగానే మనసులోనే 'సారీ జానూ' అనుకున్నాను.

నన్ను చూడగానే మురళి గడపదాటి బైటికొచ్చి మరీ నన్ను యింట్లోకి తోడుకుపోయాడు. "ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి .. రిటైరయ్యాక బైటికి రావడమే మానేశావు. నీతో మాట్లాడదామని మీ యింటికొచ్చినాఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ

కన్పించేవాడివి. నీకు మాతో మాట్లాడటం ఇష్టం ఉండదని మన స్నేహితులంతా ఓ నిర్ణయానికొచ్చేశారు తెలుసా. నేనైతే నవ్మలేదనుకో" అన్నాడు.

"నీకు తెలుసుగా నేను మితభాషినని. పెళ్ళయ్యాక నా భార్య జాహ్నవి కూడా ఈ విషయంలో చా లా ఇబ్బంది పడింది. తను మాట్లాడుతుంటే వినడం బాగా ఇష్టమైపోయి, నేను మాట్లాడాల్సిన కొన్ని మాటల్ని కూడా మర్చిపోయాననుకుంటా. తను పోయాక అర్థమైంది. మనుషుల్తో, ముఖ్యంగా మన స్నేహితులూ,ఆత్మీయుల్తో మనసు విప్పి మాట్లాడుకోవడం ఎంత అవసరవెూ.. మనుషుల మధ్య మాటలు కరువైతే అనుబంధాలు బలహీనపడ్తాయని జాహ్నవి చెప్పేది. నేనే తన మాటల్ని పట్టించుకోలేదు. ఇప్పుడా పొరపాటుని సరిదిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాను" అన్నాను.

"చాలా సంతోషం రామక్రిష్నా.. నీ ఈ అలవాటు వల్ల మన స్నేహితులు చాలా మంది నీకు దూర మయ్యారు. ఈ మధ్య వాళ్ళలో చాలామంది ఇళ్ళకెళ్ళి పలకరించి వస్తున్నావని తెలిసింది. మనసుల్ని కలిపేది మాటలేగా. మొబైల్ ఫోన్లో నంబర్ కలిపి నాలుగు ముక్కలు మాట్లాడి పెట్టేయకుండా పర్సనల్‌గా వెళ్ళి, వాళ్ళతో కొద్ది సమయం గడిపి, మంచీచెడ్డా మాట్లాడి వస్తున్నావట కదా. నీలో వచ్చిన ఈ మార్పుకి మేమందరం స్వర్గాన ఉన్న జాహ్నవి గారికి థ్యాంక్స్ చెప్పుకోవాలి" అంటూ నవ్వాడు.

అతన్తో ఓ అరగంట మాట్లాడి, అతని భార్య కాఫీ తాగమని బలవంతం చేసినా వద్దని చెప్పి, కాసిని మంచినీళ్ళు తాగి, వాళ్ళనుంచి శెలవు తీసుకున్నాను. నేనిన్నాళ్ళూ మాట్లాడకుండా బాధ పెట్టిన నా బంధు మిత్రులతో కొంత సమయం గడిపి, కబుర్లు కలబోసుకోవాలన్న కోరిక తప్ప వాళ్ళ చేత కాఫీలూ టీలు చే యించుకుని వాళ్ళని శ్రమ పెట్టే ఉద్దేశం లేదు.

సమయం పన్నెండు గంటలైంది. ఉదయం కోడలు చేసిపెట్టిన యిడ్లీలు, వేరుశెనక్కాయల పచ్చడితో రెండు తిన్నాను. రుచిగా ఉంటేగా ఎక్కువ తినడానికి.. జాహ్నవి యిడ్లీలు వండితే దూదిలా మెత్తగా, వెన్న ముద్దల్లా తెల్లగా ఎంత బావుండేవో.. నోట్లో వేసుకుంటే కమ్మగా కరిగిపోయేవి. కారప్పొడిలో కాచిన నెయ్యివేసుకుని తింటుంటే ఎన్ని తిన్నా యింకా తినాలనిపించేది. వేరుశెనక్కాయల పచ్చడి చేస్తే ఎంత బావుండేదో.. ఉత్త పచ్చడే తినేస్తూఉంటే జాహ్నవి ఎన్నిసార్లు ముద్దుగా కసురుకునేదో. వంట చేయడం కూడా ఓ కళ. జాహ్నవి ఆ కళలో ఆరితేరింది, ఏం వండినా అమృతంలా ఉండేది.

కొడుకూ కోడలు ఇద్దరూ డాక్టర్లే కాబట్టి, కోడలు కాపురానికి వచ్చాక కూడా జాహ్నవే వంట చేసేది.బీరకాయ కూర చేసినా బెండకాయ పులుసు చేసినా లొట్టలేసుకుంటూ తినేవాణ్ణి. తను చేసిన టమేటా పప్పో దోసకాయ పప్పో తింటుంటే స్వర్గానికి బెత్తెడు దూరంలో ఉన్నట్టుండేది. కానీ ఎప్పుడూ నేను తన వంటని పొగడలేదు. పొగడకున్నా పర్లేదు. కావాలని ఏదో వంక పెట్టి బాధపెట్టేవాణ్ణి. 'సారీ జానూ. ఏదో ఓ రోజు నేను పైకొచ్చి నిన్ను కల్సుకుంటాగా. అప్పుడు నా బాకీ అంతా తీర్చేస్తా. నిన్ను పొగడ్తల్లో ముంచేస్తా' అనుకున్నాను.

ఎవరో ఒకతను "మంగమ్మా" అని ఎవర్నో పిలుస్తుంటే ఆలోచనల్లోంచి బైటపడి పక్కకు తిరిగి చూశాను. రోడ్డు పక్కన కూరగాయలమ్ముతున్న వ్యక్తి దూరంగా మొక్కజొన్నపొత్తుల్ని నిప్పుల మీద కాలుస్తున్న స్త్రీని పిలుస్తున్నట్టున్నాడు. నాకు చప్పున మా యింట్లో దాదాపు ఇరవైయేళ్ళు పనిచేసిన మంగ గుర్తొచ్చింది. పెళ్ళయి జాహ్నవి కాపురానికొచ్చాక, మంగ మా యింట్లో పనికి చేరింది. అప్పుడామె వయసు పద్దెనిమిదేళ్ళకు మించి ఉండదు. అప్పటికే ఆమెకు పెళ్ళయి ఏడాదిన్నర పాప కూడా ఉండేది. పనికొస్తూ పాపని కూడా చంకనేసుకుని వచ్చేది. అంత చిన్న పాపను పెట్టుకుని పనెలా చేస్తావు అంటూ ఎవరూ ఆ అమ్మా

యిని పనిలో పెట్టుకోలేదట. జాహ్నవి మాత్రం మంగను స్వంత చెల్లెలిలా చూసేది. పాప ఆడుకోడానికి ఎన్ని ఆటవస్తువులు కొని పెట్టేదో. మంగకెంత కృతజ్ఞతంటే ఇరవై యేళ్ళవరకు యింటిని అంటి పెట్టుకునే ఉండింది.

మంగ యిల్లెక్కడో నాకు తెలుసు. ఆమె కూతురి పెళ్ళికి నేను రానంటున్నా వినకుండా జాహ్నవి పిల్చుకెళ్ళింది. నేనక్కడ ముళ్ళమీద కూచున్నట్టు ఐదు నిమిషాలు కూచుని, పనుందంటూ బైటపడిన విషయం గుర్తొచ్చింది. రెండు సందులు దాటి మూడో సందులోకి ప్రవేశించాను. దాదాపు పదిహేనేళ్ళు దాటిపోవడంతో మంగ యిల్లెక్కడో గుర్తుపట్టలేకపోయాను. అప్పుడా సందులో ఎక్కువగా గుడిసెలు, చిన్న చిన్న పెం కుటిళ్ళు మాత్రమే ఉండేవి. ఇప్పుడు రెండంతస్థుల భవనాలు చాలా

కన్పిస్తున్నాయి. గుడిసెలైతే లేనే లేవు. అన్నీ పక్కా యిళ్ళే.

యిద్దరు ముగ్గుర్ని వాకబు చేసి, యిల్లు కనుక్కుని వెళ్ళాను. మంగమ్మ నన్ను చూడగానే మొదట ఆశ్చర్యానికి లోనైంది. వెంటనే తేరుకుని "మీరా బాబుగారూ.. కబురంపితే నేనే వచ్చేదాన్నిగా" అంటూ ప్లాస్టిక్ కుర్చీ తెచ్చి వసారాలో వేసింది.

"నువ్వు గుర్తొచ్చావు మంగమ్మా. చూసిపోదామని వచ్చాను" అన్నాను. ఆమె మరింత ఆశ్చర్యపోతూ నా వైపు చూసింది. మంగమ్మ మా యింట్లో పని చేస్తున్నంత కాలం నేనెప్పు డూ ఆమెతో మాట్లాడలేదు. అంతా జాహ్నవినే చూసుకునేది.

ఆమె పిల్లల గురించి, మనవళ్ళూ మనవరాళ్ళ గురించి వాకబు చేశాను. విపరీతమైన నడుం నొప్పివల్ల పనిచేయలేకపోతోందని, అందుకే పని మానేస్తానంటోందని జాహ్నవి చెప్పిన విషయం గుర్తొచ్చి "నీ ఆరోగ్యం ఎలా ఉంది మంగమ్మా.. నడుం నొప్పి తగ్గిందా? మందులేమైనా వాడుతున్నావా" అని అడిగాను. మంగమ్మ కళ్ళలో చప్పున నీళ్ళూరాయి. "మీరసలు మాట్లాడే వాళ్ళే కాదు కదయ్యా. అమ్మగారితో కూడా చాలా పొడిగా మాట్లాడేవాళ్ళు. మీ గురించి చాలా తప్పుగా అనుకునేదాన్నయ్యా. అంత మెత్తటి మనసుగల తల్లికి రాయిలాంటి ఈయన దొరికాడేమిటి అని బాధపడేదాన్నయ్యా. మీరింత మంచివాళ్ళని తెలియదయ్యా" అంటూ వలవలా ఏడ్చేసింది. బైటికొచ్చేముందు ఆమె చేతిలో రెండు వేల రూపాయలు పెడ్తూ "నాదగ్గర యింతే

ఉన్నాయి మంగమ్మా. ఏమనుకోకు" అన్నాను. "అయ్యో.. నాకు డబ్బులు వద్దయ్యా. మీరు మా యిల్లు వెతుక్కుంటూ వచ్చి పల్కరించారు. అంతే చాలయ్యా" అంటూ డబ్బులు తిరిగిచ్చేసింది.

మా యింటి దారి పట్టాను. మనసునిండా జాహ్నవికి సంబంధించిన జ్ఞాపకాలే .. ఎండాకాలం సాయంత్రం కురిసే చిరుజల్లుల్లా ... ఎడారిలా మారిన హృదయాన్ని తడిపి సేదతీరుస్తూ.. తీయని జ్ఞాపకాల వెల్లువ..

జాహ్నవి మాటలపుట్టని పెళ్ళయిన రెండోరోజే తెలిసింది. గలగలా మాట్లాడుతూనే ఉంటుంది. తనకు నిశ్శబ్దం ఇష్టముండదు. తనైనా మాట్లాడుతూ ఉండాలి లేకపోతే నేనైనా మాట్లాడుతూ ఉండాలి. తనకు సినిమాలూ, షికార్లు అంతగా ఇష్టం ఉండేవి కావు. బాగా ఇష్టమైన వ్యాపకం ఒక్కటే. కబుర్లు కలబోసుకోవడం.. 'మరి మొదటి రాత్రి మాటలే రానట్టు ఎలా ఉండగలిగావు?' అని ఓ వారం తర్వాత అడిగాను. 'కనీసం మొదటి రాత్రయినా నీ మొగుణ్ణి ప్రశాంతంగా ఉండనీవే. లేకపోతే నీ కబుర్ల పిచ్చికి భయపడి వి డాకులిచ్చేసినా ఇచ్చేస్తాడు అని మా నాయనమ్మ భయపెడితేనూ..' అంటూ ముసిముసిగా నవ్వి 'రండి. మనం మాట్లాడుకోవాల్సిన సంగతులు బోలెడున్నాయి' అంటూ చేయి పట్టుకుని బాల్కనీలోకి లాక్కెళ్ళింది.

మొదటి రాత్రే తనకు నా గురించి మొత్తం చెప్పాను. నా ఇష్టాయిష్టాలు.. నేను చేసే చిన్న ఉద్యోగం వల్ల వచ్చే బెత్తెడు జీతం.. జానెడు ఖర్చులు.. 'ఒక్క విషయం గుర్తుపెట్టుకో. నాకు అప్పులు చేయడమంటే అస్సలు ఇష్టముండదు. అప్పు నిప్పులాంటిది. జీతం రాగానే తెచ్చి నీ చేతిలో పోస్తాను. ఉన్నదాన్లోనే సంసారాన్ని గుట్టుగా లాక్కురావాల్సిన బాధ్యత నీదే' అన్నాను. జాహ్నవి అంగీకార సూచకంగా తల వూపింది.

పెళ్ళయిన ఓ ఏడాదివరకు సంసారం ఎంత హాయిగా గడిచిందో.. వెన్నెల సరస్సులో ఆడుకున్న వినోద క్రీడలా.. మా యిద్దరి మధ్య ఎన్ని కబుర్లు దొర్లేవో.. నేను చెప్పేవి కావు. అన్నీ తను చెప్పేవే. నేను శ్రోతను మాత్రమే. ఓ గంటో గంటన్నరో మాట్లాడాక, కొన్ని క్షణాలసేపు ఆపి, 'మీరేమైనా తీయటి కబుర్లు చె ప్పకూడదూ' అంటూ ముద్దుగా అడిగేది. 'చెప్పడానికి నా దగ్గర ఏమీ లేవు' అనగానే అలిగినట్టు బుంగమూతి పెట్టి, వెంటనే చిన్నపిల్లలా నవ్వేస్తూ 'నా వద్ద యింకా బోలెడు కబుర్లున్నాయి తెలుసా' అంటూ మళ్ళా మొదలెట్టేది.

పెళ్ళయిన యేడాది తర్వాత మెల్లమెల్లగా మా మధ్య గొడవలు మొదలయ్యాయి. వాటిక్కారణం ఎక్కువగా నేనే అన్న జ్ఞానోదయం జాహ్నవి చనిపోయాకే కలిగింది. బతికున్నప్పుడు మాత్రం ఆ విషయం ఒప్పుకోడానికి నా అహం అడ్డొచ్చేది.

అసలు గొడవ కూడా నాకున్న అహంకారం వల్లనే మొదలయ్యేది. కానీ తప్పంతా ఆమెదే అన్నట్టు తగాదా వేసుకునేవాడిని.

యింటికొచ్చేశాను. హాస్పిటల్‌కి వెళ్ళేముందే డైనింగ్ టేబుల్ మీద కోడలు సర్ది ఉంచిన భోజనాన్ని తినేసి నా గదిలో కెళ్ళి పడుకున్నాను. వొళ్ళు తెలియకుండా నిద్రపోయినట్టున్నాను. విపరీతమైన తల నొప్పి తో లేచాను. వొళ్ళంతా పెనం మీద పెట్టినట్టు కాలిపోతోంది. నిన్న వర్షంలో తడిసినా ఏమీ కాలేదనుకున్నాకదా. అదిప్పుడు దాని దుష్ప్రభావం చూపిస్తోంది. నాకు వర్షం పడదు. తడిస్తే చాలు జ్వరమొస్తుంది. అం దుకే జాహ్నవి చాలా జాగ్రత్తలు తీసుకునేది. వర్షం వచ్చే సూచనలుంటే చాలు, ఎప్పుడో రోడ్డుపక్కన అమ్ముతుంటే చౌకగా కొన్న రెయిన్ కోట్ తొడిగి, గొడుకు చేతికిచ్చి కానీ బైటికి పంపేది కాదు. వర్షాకాలం పో యేవరకు లంచ్ బాక్స్ పెట్టుకునే బ్యాగ్‌లో గొడుక్కూడా ఉండాల్సిందే.

జ్వరమొచ్చిందని తెలిసి రాత్రి నీరవ్ నా గదిలోకొచ్చాడు. "రిటైరైనాక హాయిగా యింట్లో రెస్ట్ తీసు కోక ఎందుకు నానా బైటికెళ్ళడం? చూడు వర్షంలో తడవబట్టేగా జ్వరం వచ్చింది?" అన్నాడు

"యింట్లో ఎన్ని గంటలని కూచోమంటావు? బోర్ కొడ్తోందిరా. ఒక్క పూటైనా బైటికెళ్ళకపోతే పిచ్చి పట్టేలా ఉంటుంది" అన్నాను.

"నాన్నా.. నువ్వు రిటైరై మూడేళ్ళు. ఈ మూడేళ్ళలో అమ్మ బతికున్న రోజుల్లో ఎప్పుడూ బైటికెళ్ళిన ట్టు నాకు గుర్తు లేదు. బైట తిరగడం కన్నా నీకు పుస్తకాలు చదవడమే ఇష్టమని మనింట్లో అందరికీ తెలుసు. అమ్మ పోయినప్పటినుంచే నువ్విలా ప్రవర్తిస్తున్నావు. చుట్టుపక్కలవాళ్ళు నీ గురించి ఏంటేంటో అనుకుంటున్నారు నాన్నా" అన్నాడు.

"నేనేం తప్పు చేస్తున్నాననిరా? ఓ పూట బైటికెళ్ళి తిరిగొచ్చే స్వాతంత్ర్యం కూడా నాకు లేదా?" అ న్నాను.

"బైటికెళ్ళొద్దని ఎవరూ అనరు నాన్నా.. రోజూ మడత నలగని బట్టలేమిటి.. వాటిమీద సెంటు స్ప్రేలేమిటి.. మొహానికి క్రీములూ పౌడర్లూ ఏమిటి.. ఇవన్నీ రిటైరైనప్పటినుంచీ ఉంటే ఎవ్వరూ ఏమీ అనుకో రు నాన్నా.. అమ్మ పోయినప్పటినుంచే ఈ వికారాలన్నీ మొదలయ్యాయెందుకుని నేనూ మీ కోడలు బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాం. యింతకూ రోజూ ఎక్కడికెళ్తున్నావు నాన్నా?" అని అడిగాడు.

"ఏం చెప్తేగానీ వెళ్ళనివ్వవా? నా స్నేహితుల్ని కల్సుకోడానికి వెళ్తున్నారా.. మన బంధువుల యిళ్ళకెళ్ళి వస్తున్నా. వీలు కాదంటే చెప్పు. వేరే గది అద్దెకు తీసుకుని వెళ్ళిపోతా. నాకొచ్చే పెన్షన్ చాలు నాకు" అన్నాను కోపంగా.

"అయ్యో నాన్నా.. మా ఉద్దేశం అది కాదు నాన్నా.. నీ ఆరోగ్యం గురించే మా ఆందోళన.. అమ్మ పోయిందన్న బాధలో మానసికంగా కుంగిపోయి ఇలా విపరీతంగా.."

వాడి మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ అన్నాను. "నా మనసూ శరీరం రెండూ ఆరోగ్యంగానే ఉన్నా యి. ఆ విషయంలో నువ్వు నిశ్చింతగా ఉండొచ్చు" అన్నాను.

"ఎవర్తో అయినా మాట్లాడాలనిపిస్తే ఫోన్లో మాట్లాడొచ్చుగా. వాళ్ళ యిళ్ళకెళ్ళి వాళ్ళనెందుకు ఇబ్బంది పెట్టడం?"

"ఇష్టమైన వాళ్ళతో ఫోన్లో మాట్లాడితే నాకు తృప్తిగా ఉండదురా. మనుషులు ఒకర్నొకరు కలుసుకుని పల్కరించుకుంటే నేగా ఆత్మీయతలు బలపడ్తాయి. ఐనా నేనేమీ వాళ్ళను ఇబ్బంది పెట్టడం లేదు. ఫోన్ చేసి, వాళ్ళ అనుమతి తీసుకుని, వాళ్ళకు అనువైన సమయం కనుక్కునే వెళ్తున్నా. వాళ్ళతో మాట్లాడాలన్న కోరికతో వాళ్ళ యింటికెళ్తే, దాన్ని ఇబ్బందనుకునేవాళ్ళు ఆత్మీయుల లెక్కలోకి రారు. అలాంటివాళ్ళ యింటికి అస్సలు వెళ్ళను" అన్నాను.

ధర్మామీటర్తో టెంపరేచర్ ఎంతుందో చూసి, స్టెతస్కోప్ని గుండెమీద, వీపుమీద పెట్టి పరీక్ష చేసి, ఏవేం టాబ్లెట్లు ఎప్పుడెప్పుడు వేసుకోవాలో చెప్పి, వాటిని టేబుల్ మీద పెట్టి మరో మాట మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

రిటైరైనాక ఎప్పుడూ లుంగీ బనీను వేసుకుని, యింగ్లీష్ నవలో తెలుగు నవలో చదువుకుంటూ యింట్లో గడిపేస్తుంటే జాహ్నవికి కోపం వచ్చేది. 'ఆఫీస్కెళ్ళే రోజుల్లో ఎంత ట్రిమ్గా తయారై వెళ్ళేవారో కదా.ఎంత బాగుండేదో మిమ్మల్ని చూస్తుంటే. . పనోళ్ళు కట్టుకున్నట్టు ఈ లుంగీ బనీన్లో చూసి చూసీ విసుగొస్తుందండీ' అనేది.

'నాక్కూడా నీకులానే సినిమాలూ షికార్లు యిష్టముండవని తెల్సుగా. స్నేహితులు కూడా తక్కువేనాయె. ట్రిమ్గా తయారై ఎక్కడికెళ్ళమంటావు?' అని అడిగేవాణ్ణి.

'వూరికే అలా రోడ్డు చివరిదాకా వెళ్ళిరండి చాలు.. మంచి బట్టలేస్కుని, ఆ సంపెంగ పూల వాసనొచ్చే స్ప్రే చల్లుకుని, బాగా తయారై ఓ అరగంట అలా తిరిగి రండి.. నా సంతోషం కోసం' అనేది.

ఆమె కోరికను ఎప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎప్పుడెప్పుడు రిటైరవుతానా ఎప్పుడెప్పుడునేను చదవాలనుకున్న సాహిత్యమంతా చదువుతానా అని ఎదురుచూసినవాణ్ణి కావడంతో, యింటికే పరిమితమై పుస్తకాలు చదవడంలో కాలం గడిపేసేవాణ్ణి. అడిగి అడిగి విసిగిపోయి యిక అడగడం మానేసింది. తను చనిపోయాక గానీ తెలిసిరాలేదు నేనెంత తప్పు చేశానో.. అందుకే రోజూ తను కోరుకున్నట్టే ట్రిమ్గాతయారై, బైటికెళ్ళి వస్తున్నా. ఇదే పని తను బతికున్న రోజుల్లో చేసిఉంటేఎంత సంతోషపడేదో కదా. భర్త తన మాట విన్నప్పుడల్లా భార్య మనసు విహంగమై వినీలాకాశంలో రెక్కలు విప్పుకుంటుంది కదూ. ఏది ఎప్పుడు చేయాలో అప్పుడు చేస్తేనే దానికి విలువ.. లేకపోతే ఎక్స్పయిరీ అయిన మందుల్లా చెత్తకుప్పలో పారబోయాల్సిందే. ఇప్పుడు పశ్చాత్తాపపడి ఏమిటీ ప్రయోజనం?

జ్వరం మూడు రోజుల వరకు తగ్గలేదు. ఫ్లూ అని చెప్పాడు మా అబ్బాయి.

మూడో రోజు రాత్రి చారన్నం తింటున్నప్పుడు నా కొడుకూ కోడలు ఏదో విషయంలో గొడవ పడ్తున్నట్టు విన్పించింది. మరికొద్దిసేపు విన్నాక అది నాగురించే అని అర్థమైంది. నేను ట్రిమ్గా తయారై, బంధుమిత్రుల యిళ్ళకెళ్ళడం నా కొడుక్కీ కోడలికి ఇష్టం లేదు.

నేను జాహ్నవిని ఎంత కష్టపెట్టానో వీళ్ళకేం తెలుసు? మానసికంగా చాలా హింస పెట్టాను. పైకి కన్పించని పోలీసోడి దెబ్బల్లా.. ఎవ్వరికీ కన్పించకుండా విన్పించకుండా ఆమె మనసునిండా గాయాలు చేశాను.

నాకు చిన్నప్పటినుంచీ ఓ అలవాటుంది. కోపం వస్తే అరవను. మాట్లాడకుండా ఉండిపోతాను. అమ్మతో కూడా అంతే. అమ్మ మీద కోపం వస్తే అలిగి ముడుచుకుపోయి కూచునేవాడ్ని. అమ్మకర్థమై నన్ను దగ్గరకు తీసుకుని 'నా బంగారు కొండ కదూ.. నా బుజ్జి తండ్రి కదూ. ప్లీజ్ నాతో మాట్లాడవా? అమ్మో నువ్వు మాట్లాడకపోతే నాకేమీ తోచదు తెలుసా' అంటూ బతిమాలుకునేది.

పెళ్ళయ్యాక ఒక ఏడాది వరకే నేనూ జాహ్నవి సంతోషంగా ఉన్నాం. తర్వాత చిన్న విషయానికే తనతో గొడవ పడటం మొదలెట్టాను. గొడవంటే పెద్దపెద్దగా అరుస్తూ కోపంతో చిందులేయడం కాదు. మాట్లాడకుండా మౌనంగా కూచునేవాడిని. వె

ఐదట్లో జాహ్నవి బతిమాలేది. తన వైపు తప్పు లేకున్నా 'సారీ అండీ. తప్పు నాదే. ప్లీజ్ మాట్లాడండి. మీరు మాట్లాడకపోతే నరకంలా ఉంది తెలుసా' అనేది. అప్పటికీ మా ట్లాడేవాడ్ని కాదు. జాహ్నవి కన్నీళ్ళు పెట్టుకున్నా కరిగేవాడ్ని కాదు. రెండు మూడు రోజులు మాట్లాడకుండాసతాయించి, బాగా బతిమాలించుకుని, బాగా ఏడ్పించి అప్పుడు మాట్లాడేవాడ్ని.

మాకు యిద్దరు పిల్లలు పుట్టారు. నీరవ్, నీరజ.. నీరవ్‌కి నాలుగేళ్ళ వయసొచ్చిన తర్వాత జాహ్నవిలో కూడా మార్పొచ్చింది. నేను మాట్లాడకుండా బిగుసుకుని కూచుంటే బతిమాలేది కాదు. బహుశా బతి మాలీ బతిమాలీ విసిగిపోయిందేమో. యింతకు ముందులా తను తప్పు చేయకున్నా 'సారీ.. నాదే తప్పని' ఒప్పుకోవడం కూడా మానేసింది. అప్పటివరకూ ఆమెలో నిద్రాణమై ఉన్న అహం అప్పుడు మేల్కొని ఉం టుంది.

మరో కారణం కూడా కావొచ్చు. ఆమెతో నేను మాట్లాడకున్నా ఆమెకు గడిచిపోయేది. పిల్లలిద్దరితోమాట్లాడుతూ వాళ్ళ ముద్దు ముద్దు మాటలు వింటూ, నా మౌనాన్ని పట్టించుకునేది కాదు. నాకింకా పట్టుదల పెరిగేది. వారాల తరబడి మాట్లాడేవాడ్ని కాదు. 'మీరు నాతో మాట్లాడకున్నా నేను మీతో మాట్లాడకూడదని రూలేమీ లేదుగా' అంటూ జాహ్నవి అవసరమైనంత మేరనో లేకపోతే అవకాశం కల్పించుకునో నాతోమాట్లాడుతూ ఉండేది. నేనే దేనికీ సమాధానం చెప్పేవాడ్ని కాదు. ఒక్కోసారి నా మౌన పోరాటం నెలల తరబడి నడిచేది.

నీరవ్ యింటర్‌కి, నీరజ టెన్త్‌కి వచ్చినప్పటినుంచి చదువులో మునిగిపోయి వాళ్ళమ్మతో కూడా ఎక్కువ మాట్లాడేవాళ్ళు కాదు. ఆ సమయంలో నేను మాట్లాడకుండా బిగుసుకుని కూచుంటే జాహ్నవి ఒడ్డునపడ్డ చేపలా గిలగిల్లాడేది. 'ప్లీజ్ మాట్లాడండి. నాకు బోర్ కొడ్తోంది. ఏదో ఒకటి మాట్లాడండి. వింటాను' అంటూ బతిమాలుకునేది. కానీ సారీ చెప్పేది కాదు. 'ఎంత పొగరు.. సారీ చెప్పదా?' అని నేను మరింతముడుచుకుపోయేవాడ్ని. 'సర్లెండి. నేనే కబుర్లు చెప్తుంటాను. వినండి చాలు' అని ఏదో ఒకటి చెప్తూనే ఉం డేది.

జాహ్నవి చనిపోవడానికి ముందు మూణ్ణెల్లనుంచి నేను తనతో మాట్లాడటం లేదు. తనే ఎప్పటికిమల్లే నేను నిద్రపోయే వరకు కబుర్లు చెప్తూనే ఉండేది. చనిపోవడానికి రెండ్రోజుల ముందు మాటల మధ్యలో 'మీరు నాకెంత బాకీ పడిపోతున్నారో తెలుసా? ఎన్ని కబుర్లు బాకీ ఉన్నారో.. నెలల తరబడి మీరు నాతో మాట్లాడుతూ ఉండి, నేను వింటూ ఉన్నా తీరనంత బాకీ. ఎప్పుడు తీరుస్తారో చెప్పండి' అంది.

నా జానూ యింత హఠాత్తుగా నన్ను విడిచి వెళ్ళిపోతుందని వూహించలేదు. తనతో మాట్లాడిన రోజుల్తో పోలిస్తే మాటల్లాడకుండా బాధపెట్టిన రోజులే ఎన్నో రెట్లు ఎక్కువుంటాయి. ఎంత తప్పు చేశానో ఇ ప్పుడర్థమౌతోంది. తను బతికున్నప్పుడే మాట్లాడిఉంటే ఎంత సంతోషపడేదో కదా. నా ఈగో మీద నాకే అసహ్యమేస్తోంది. దాన్ని బైటికి లాగి ముక్కలు ముక్కలుగా నరకాలన్నంత కోపం వస్తోంది. నా ప్రవర్తనతో జాహ్నవిని ఎంతటి వేదనకు గురిచేశానో.. బతికున్నప్పుడు మనుషుల విలువ తెలియదు. వాళ్ళు పోయాక వాళ్ళ విలువ తెల్సినా ప్రయోజనముండదు.

నేనిపుడు మాటల్ని దాచుకోవడం లేదు. ఉదారంగా వాడేస్తున్నాను. జాహ్నవితో మాట్లాడి ఆమె బాకీ తీర్చే అవకాశం ఎలాగూ లేదు కాబట్టి నా బంధుమిత్రుల దగ్గర నా బాకీ తీర్చుకుంటున్నా.

ఉదయం తొమ్మిదింటికి ఎప్పటికి మల్లే ట్రిమ్‌గా తయారై, సంపెంగ పూల వాసన వచ్చే స్ప్రే చల్లు కుని, గొడుగు చేత్తో పట్టుకుని వెళ్ళబోతున్నప్పుడు నీరవ్ అడ్డుపడి "ఎక్కడికి నాన్నా.. బైటికెళ్ళొద్దన్నానుగా" అన్నాడు.

"వెళ్ళక తప్పదురా. నేను తీర్చాల్సిన బాకీ చాలా ఉంది" అనేసి వాణ్ణి పక్కకు నెట్టి, మెల్లగా నడవ సాగాను.

# తాటాకుమంటలు దొరల విజయకుమారి

డైరీ లో పేజీలు కదిలిపోతున్నాయి. పేజీ పేజీకి

విస్మయం కలిగించే విషయాలను చూస్తూ చదువుతున్నాడు సారథి.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

కొత్త కాపురం..నీడలా తానొచ్చేసాడు నూతన ఒరవడిని మోసుకొచ్చాడు.అద్భుతాలేం జరగలేదు గానీ అడుగడుగునా తన సుముఖం లో ఆశ్చర్యం వెంటాడుతుండేది. కట్టిపడేసే కబుర్ల జలతారు తీగలు తెరలేపిన కొత్తదనాలు..

అంటుకునే మాటలు..గొంతు కొమ్మనుండీ సుద్దుల పూలు రాలుతుంటే..పడిపోకుండా పట్టుకుంటూ..

ఎన్ని పరిమళ భరితమైన సమయాలను పొందానో.

పొడుస్తున్న తొలి పొద్దు అందమెక్కడుందో

తలలూపే తరుల్లోనా తళుకులీనే తుషార బిందువుల్లోనా అంటూ తొలి సంధ్య గూర్చి.. ఆలోచిస్తూనే..పగలంతా వెలుగులు వెచ్చదనాలతో అలరించిన సూర్యుడు మరలి పోతుంటే దిగులు పడేది మనసు.

అంత సున్నితమైన నా భావాల పక్షులను నిమురు తాడనుకున్నా..నిస్తేజాలు నిర్లిప్తతలు దరిచేర నివ్వడనుకున్నా..తన లాలనలో..తన పాలనలో కాలం రేణువులై రాలిపోతుందనుకున్నా

ఇప్పుడు ఇరువురి అలికిడి లేక ఉమ్మడి దారులు ఒంటరైపోయి బావురు మంటున్నాయి. ఈ మనసు సజీవంగా ఉండేంత దాకా జ్ఞాపకాలై వెంటాడుతూనే ఉంటాయి.

కానీ నాకిప్పుడు కావాల్సింది జ్ఞాపకాలు కాదు తన తోటి మధురమైన అనుభవాలు..సోలిపోని సొక్కమైన ..సొగసైన కాలాలు.

హృది అడుగులకు కొత్త బాటలను పరుచుకోవడం ఇకనైనా అభ్యసించాలి.

ముగిసింది కమ్మేసిన కారుమబ్బులను కసురుకునేది తాను.

ఇపుడు భారమైన మేఘంలా మనసు.

మేఘాల బరువు తేలికపరుస్తూ కురవడం..వర్షించి తేలిక పడటం ఎంత అవసరమో ఇప్పుడు అర్థం అయింది.

పగలంతా పట్టిపీడించిన తన పెడసరం.. నిర్లక్ష్యం

రాత్రి నిదుర నివ్వదు ..నిదురలోని కమ్మని కలల నివ్వదు.ఇవేవీ తనకు పట్టవు. కన్నె చెర విడిపించి ఏదో నన్ను ఉద్ధరించిన భావన తనలో.

పరిణామాలు.. ఇరువురి వైరుధ్యాలు ఒకటెనుక మరొకటి పొద సూపుతుంటే..వెక్కిరింతల పద్దు పెరుగుతూంటే..ఎదకు ఏం చెప్పినా వినకుంది. వెటకారాలను..ఎత్తి పొడుపులను పొల్లుపోకుండా.. రాసుకుంటోంది. పురుషాధిక్య కదలికలపై చిట్టా రాసుకుంటోంది

ఈ మధ్య లో కోరి తెచ్చుకున్న తగువులు.చీటికీ మాటికీ మాటల మల్ల యుద్ధాలు.

ఎప్పటికప్పుడు కొత్తగా రాసుకుందాం..జీవన తత్వాలనేవో నేర్చుకుందాం..వెతల వళ్ళ వెలిసి పోతున్న

ఈ బంధానికి క్రొత్త రంగులద్దుకుని సంసార ప్రపంచం లో

నూతన ఆవిష్కరణగా కాపురాన్ని కొత్త ఆశల పూవులతో అలంకరించు కుందామని ఎన్నోసార్లు ప్రయత్నిస్తూనే..ఉంది. తన మనసుతో

నా మనసు చేసే చర్చలు యదావిధిగా విఫలమోతూనే ఉన్నాయ్.

మంచితనాల మెరుపులను మెరిపిస్తూ..

పూట పూట కు అనుభూతుల అద్భుతాలు సృష్టిస్తుంటే.. సంవత్సరాలెలా గడిచాయో తెలియనే లేదు. ఈ మకరంద సహిత మరుల మందాకిని నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంద

నుకున్నా.

కానీ తాను ఈ మధ్యలో ఒక్కొక్క తొడుగు తొలగిస్తుంటే విస్తుపోతున్నా.

కాలం చెల్లదనే అనుకున్న ఈ చెలిమి వైవిధ్యం అనుకున్న ఈ సంగమం

ఈ ప్రేమ..ఈ తాపత్రయం మమేకమైన మానసిక స్థితులు..ఇంకా తనివి తీరక నే. కనుమరుగై పోయాయి. ఇందులో తన అహం ప్రమేయం చాలా ఎక్కువ. ఈ పరిణామాలతో..ఒడుదుడుకులతో మనసు నిండుగా ఉదాసీనతా స్తబ్దత అలుముకుంటోంది.

నా పట్ల తన ప్రేమ విస్తృతమైనదీ..విశాలమైనదీ అనుకున్నా. ఇలాగైందెందుకో.చేర్చి పెట్టుకున్న బింకమేదో కుప్పకూలుతున్న భావన.

మనసొప్పకుండా ఉంది.నమ్మలేకుండాఉంది.కాలమిలా కమ్మగా కదిలి పోతున్నదనుకున్నా..కాలంతో కనీసం మామూలుగానే అందరిలా కదలిపోవచ్చనుకున్నా. సహచరిలా తనతో నడడం ఎంతవరకూ వీలవుతుందో. .

కాబోయే భర్త తో భావాల ఒద్దిక బలంగా ఉండాలని ఎన్ని నోములు..కన్నెగా ఎన్ని కలలు కన్నాను. ఇప్పుడు నా పట్ల ఇంత నిరాసక్త వైనాన్ని చూస్తూ..పాలుపోలేని తనం చుట్టేస్తోంది. మెల్లగా మెల్లగా మొదలైన హృది సంఘర్షణ.

అపురూపమైనదేదో కోల్పోతున్న భావన.

ఎద పరదాను ముళ్ళకంపలపై ఆరేసుకున్న భావన. హృదిని అపాత్రదానం చేసేసుకున్న భావన.

కలత నిద్రలో లేచిన పసిది అమ్మకోసం వెతుక్కున్నట్టు..రోజూ అదే అభద్రతా భావాలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే..ఎద ముంగిట నిలబడి తన కోసం ఎదురుతెన్నుల్లో ఉంటాను.

ఎన్నో ఏళ్లుగా తనకోసమే నేను వదిలేసిన నా చుట్టు ప్రపంచం. నా తల్లిదండ్రులు.. తోడబుట్టిన వాళ్ళు.. బంధువులు..నా స్నేహితులు..నా కవితలు కథలు.. పెయింటింగ్.. మ్యూజిక్.. ముఖ్యంగా పుస్తకాలు.

ఇప్పుడు తను నన్ను తృణీకరించాక.. మళ్ళీ ఇప్పుడే కనిపిస్తోంది చుట్టూ ఏం జరుగుతోంది.చుట్టూ అన్నీ ఎప్పటిలానే ఉన్నాయి నేనే ఏదో మత్తులోంచీ.. ఇపుడిపుడే మెలుకువ వచ్చినట్టు..

తానేమో అలాగే ఉన్నాడు. అతని స్నేహితులు.. బంధువులు..పనులు అభిరుచులు..ముందెలాగో అలాగే.

నేనే నా ప్రపంచాన్ని పూర్తిగా వదిలేసాను.ఎందుకిలా చేసాను రీజన్ దొరకడం లేదు.

స్పష్టంగా చూసేందుకు కళ్ళను నులుముకుని చూసినట్టుగా..వాస్తవాన్ని తెలుసుకోవాలంటే ఇపుడు మనసును నులుముకుని చూడాలేమో !

అప్పటికైనా నా పరిస్థితిని నేను గమనించుకోగలనా..? ఏమో !

నమ్మకాన్ని తొలుస్తుంటే అబద్దాల అవశేషాలు బయటపడుతున్నాయి.

తానంటే అంత నమ్మకం. ఈ భూమి మీద అలాంటి వ్యక్తే లేడన్నంతగా..

అంత అవాస్తవాన్ని ఎలా వాస్తవంగా స్వీకరించానో.

తాళి కట్టగానే నాన్న చెప్పిన మాటలు.." ఇక నుంచీ అతనే నీ భర్తమ్మా..అతనే నీకు సర్వస్వం..తల్లి తండ్రి అన్నీ తానే..పుట్టింటికి అయిన వాళ్ళ కు చెడ్డపేరు తీసుకురారాదు.. మెట్టినింటి విషయాలేవీ పుట్టింటికి మోసుకుని రారాదు..సరేనా తల్లీ "

అమ్మ " అదేంటండీ అలా అంటారు.దానికేమైనా కష్టమొస్తే ఎవరితో చెప్పుకుంటుంది. మనతోనే కాదు."

" కష్ట మెందుకొస్తుంది. సారథి యోగ్యుడు.దాన్ని ఏరి కోరి చేసుకుంటున్నాడు.చిన్న చిన్న వాటికి సర్దుకు పోవాలని చెప్పు చాలు " అని తేల్చేసాడు.

నన్నే చాలా ఇష్టపడి ..కోరికోరి చేసుకున్నారని తెలిసి మనసు ఎప్పుడూ పొంగిపోయేది. అతని కోసం ఏమైనా సరే చేయాలనిపించేది. వచ్చీ రాని వంటలతో మొదలు పెట్టి..వాళ్ళనూ వీళ్ళనూ అడిగి.. పుస్తకాలు చదివి. నెట్ చూసి రకరకాలుగా వండిపెట్టడం. అతని ప్రతి ఇష్టాన్ని తీర్చేందుకే ప్రయాసపడటం. అతని అవసరాలను కనిపెట్టుకోవడం. అతని సంబంధించిన రిలేషన్స్ కు సేవలు చేయడం..

కాలమే తెలియలేదు

సేవలంటే గుర్తొస్తుంది తరచూ తను అనే ఆ వాక్యం" లోకం లో లేనిది నువ్వేమైనా చేసావా..భార్యంటే ఎవరైనా ఇలాగే చేస్తారు. నీకు తెలిసినట్టు లేదు ఇంటికి సంబంధించినవన్నీ చూసేదాన్నే

ఇల్లాలంటారు" అని.

అదెంత వరకూ నిజమో తెలియదు కానీ. ఎన్ని సార్లు విన్నా అంతే అంతే ఇంటెన్సిటీ తో హర్ట్ అవుతున్నాననైతే తెలుసుకున్నాను.

కుప్పగా పోసిన భావాల లోంచీ మంచివి ఏరుకోవాల్సిన కాలమొచ్చింది. అపుడన్నీ గొప్పగా కనిపించాయి..కాదు అలా ప్రదర్శించబడ్డాయేమో.

డొల్లతనాన్ని గుర్తుపట్టడం అంత సులువేం కాదు.

నిండుగా నవ్వుతూ నటించేస్తుంటే..ఏ భావాల కెలాగో అలా సమ్మేళనమైపోతూ..అతి సామాన్యంగా చెలామణైపోతున్న వారిని ఎవరైనా ఎలా గుర్తించగలరు.తనేమిటో ఎవరైనా గుర్తించారని తెలుసుకుంటే..గొడవలు.ఇక ఆ సంబంధించిన వాటికి తలుపులు మూసేసినట్టే.

ఇలాంటి చెల్లని తనాలను నిరూపించేదెలా.

తడవకో తొడుగును తొడుక్కుని మనుషులను ప్రభావితం చేసే శక్తి తనకు చాలానే ఉంది.

ఎప్పటికప్పుడు నేనే ఓడిపోతూ..కాదు పనిగట్టుకుని తన చేత ఓడించబడుతూ..

గెలిచిన గెలవగల వాటిపైనే తనకు మక్కువ .ఎత్తులవైపే తన చూపులు. గొప్పగా ఉంటేనే తన చూపు ఆనుతుంది. గొప్ప అందం.చదువు..పదవి..డబ్బు..అలాంటివే తన కిష్టం. వీటిలో ఏదో ఒక దాంట్లో మెరిట్ ఉంటేనే వారితో మాటైనా మంతనాలైనా.

పాతవేవీ నచ్చవు తనకు. పాత మనుషులు.. భావాలు.. పద్ధతులు.. ఆఖరికి సినెమాలైనా సరే.

ఆ తెలివితేటలకే అబ్బురంగా ఉంటుంది. తానేమిటో కనబడనీయకుండా..వేసే ఎత్తులు..మోసేసే మాటలు.

ఒక మనిషి చెడ్డవాడనడానికి చెడు అలవాట్లు.. వ్యసనాలు ఉంటేనే కాదు..చెడు ఆలోచనలూ ఒక వ్యసనమేనని సమాజం ఎప్పుడు తెలుసుకుంటుంది.

ఎంతగా వద్దనుకుని వదిలించు కుందామనుకున్నా

ఈ ఆలోచనలు ఓపెన్ అయిపోతున్నాయ్.ఏదో ఒక ఔట్ లెట్ కావాలి. క్యాతెరిస్ కోసం ఒక నమ్మదగిన నేస్తం కావాలి.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

డైరీ చదవడం అయిపోయింది.సారథి కళ్ళు వర్షిస్తున్నాయ్. వసంతను నిర్లక్ష్యం చేసినందుకు తాను ఎంతగా విలవిల లాడింది అర్థం అవుతోంది.

రాత్రంతా ఆలోచించాడు.తెల్లవారు జామున తన ఆఫీస్ నుంచీ బయలు దేరి వచ్చేసాడు.డూప్లికేట్ కీ తో ఓపెన్ చేసుకుని..సరాసరి బెడ్ రూం లోకి వచ్చాడు.

మంచం పై వసంత నిద్రపోతోంది.పాపం రాత్రంతా ఆలోచిస్తూ మేలుకుని..ఎప్పుడో నిద్రపోయినట్టుగా ఉంది. చాలా జాలిగా అనిపించింది. తన కోసం ఎదురు చూసి..ఆలోచించి పిచ్చిదైపోయింది అని అనిపించింది. తన తప్పులను నిజాయితీ గా కరెక్ట్ చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

"వసూ" ఎవరో పిలుస్తున్నారనిపించిందేమో. కాస్త కదిలి మళ్ళీ పడుకుంది వసంత.

"వసూ" మళ్ళీ పిలుపు.ఈసారి కళ్ళు తెరిచింది.

ఎదురుగా కాఫీ కప్పుతో సారథి. కళ్ళు పెద్దవిగా చేసి చూస్తుంటే..కప్పు పక్కనే పెట్టి..మెడ కిందుగా చేతులేసి పైకి లేపి..నుదురు పై ముద్దుపెట్టి..దగ్గరికి తీసుకున్నాడు. అంత అంతర్మధనానికి సింపుల్ సమాధానం..చెప్పుకోగలగడం ఒక్క ఆలుమగలకే సాధ్యమేమో.

రెండ్రోజుల తర్వాత వసంత డైరీ మళ్ళీ చూసాడు.

"ముందు రాయడం మొదలెట్టాడేమో గాయాలు మానడం మొదలైంది. మనసును మళ్ళీ మచ్చిక చేసుకుంటున్నా.."

# తూర్పు పడమరా! జె.యు.బి.వి.ప్రసాద్

"మా ఆఫీసు వాళ్ళు వచ్చే నెల్లో, నన్ను అమెరికాలో కేలిఫోర్నియా రాష్ట్రం పంపించ బోతున్నారు. రెండు వారాలు, కాన్ఫరెన్సు పనులు! ఒక వారం, చుట్టి తిరగడానికి. వెరసి మూడు వారాల ట్రిప్! ఆ రాష్ట్రం లోనే మా మేనమామ కొడుకు, ఆనంద్ వున్నాడు. వాడి మొహం చూసి, ఇరవై యేళ్ళు దాటింది. ఈ దేశం లోనే, ఈ రాష్ట్రంలో పల్లెటూళ్ళో వున్న మా మేనమామని చూసే పదేళ్ళు దాటింది! వెళ్ళే ముందు మా మేనమామని కలిసి, తన కొడుక్కి ఏమన్నా నాకిచ్చి పంపుతాడేమో అడుగుతాను. అలాగూ వాళ్ళని చూసినట్టుంటుంది" అంటూ సంబరంగా చెప్పాడు సూర్యం భార్యతో, ఆఫీసు నించి రాగానే.

"అబ్బ! అమెరికాయే? నిజంగా? నేనెప్పుడూ చూడలేదు. నన్నూ తీసికెళ్ళండి! నేనూ వొస్తాను. అబ్బ! అమెరికా చూడాలని నాకూ కోరికే! వూరికే చూసి వొచ్చేస్తాను. అక్కడ ఏమీ కొనను. ఒట్టు! బాబ్బాబు, మీకు పుణ్యం వుంటుంది!" అంటూ నవ్వులతో బతిమాలింది సంధ్య.

భార్య అలా అడుగుతుందని అనుకోలేదు సూర్యం. మొదట కాస్త గతుక్కు మన్నాడు గానీ, వెంటనే సంతోషించాడు.

"అలాగే! తప్పకుండా! నాతో పాటు నీకూ ప్రయాణం ఏర్పాట్లు చేస్తాను. అదే, వీసా, టికెట్లూ, వగైరా. అయితే, ఈ వారం చివర్లో మా మేనమామని చూసి వొస్తాను" అన్నాడు.

పిల్లలిద్దరూ వేరే వూళ్ళల్లో, హాస్టళ్ళల్లో వుండి చదువు కుంటున్నారు. సూర్యానిది పెద్ద జీతమే. దేనికీ లోటు లేదు.

"బాబాయి గారిని చూడ్డానికి నేనూ వొస్తాను, నేనూ వొస్తాను!" అంటూ వెంటబడింది సంధ్య.

దానికీ ఒప్పేసుకున్నాడు సూర్యం ఆనందంగా. 'రాజు తలుచుకుంటే, దెబ్బలకు కొదవా!' అన్నట్టు, ఏ చీకూ చింతా లేకుండా అన్ని ఏర్పాట్లూ చేసేసు కున్నారు.

"ముందే చెబుతున్నాను నీకు. మా మావయ్యా వాళ్ళది చాలా సనాతన, సాంప్రదాయ కుటుంబం! మడి చాలా ఎక్కువ. మనింట్లో వున్నట్టు అక్కడ కుదరదు. వంటింట్లోకి మనం అసలు వెళ్ళకూడదు. బయటకి వెళ్ళి వచ్చిన బట్టలతో ఇంట్లో తిరక్కూడదు. స్నానం చేసి, బట్టలు మార్చాకే, లోపల తిరగాలి. పచ్చళ్ళూ, అన్నీ రుబ్బు రోట్లోనే చేస్తారు. వాళ్ళింట్లో తిరగలి కూడా వుంది. అసలు 'తిరగలంటే' తెలుసా నీకు? భోజనం కింద కూర్చుని, విస్తరాకులో చెయ్యాలి.

ఇంకా చాలా వున్నాయిలే. నువ్వు జాగ్రత్తగా వుండాలి అక్కడ. ముందే చెబుతున్నాను!" అంటూ చాలా హెచ్చరికలు చేశాడు.

"తిరగలా? తిరగలా? అంటే, గుండ్రంగా వుండి రెండు రాళ్ళు తిరుగుతూ వుంటాయి కదూ? అదేనా? అలాగే, అలాగే! మీరు చెప్పినట్టే వింటాను. ఒట్టంటే ఒట్టు! నన్ను నమ్మండి!" అంటూ, అమెరికా వెళ్ళే సంబరంలో, సంధ్య, అన్నిటికీ ఒప్పేసుకుంది బుద్ధిగా.

ఆ శనివారం పొద్దున్నే బయలు దేరి, రైలు ఎక్కి, బస్సు ఎక్కి, ఎడ్ల బండి ఎక్కి, మేనమామ ఇంటి దగ్గిర దిగారు, శనివారం సాయంత్రానికి. బండి దిగిన సూర్యం, ఆ ఇంటిని చూసి తెల్ల బోయాడు. పెంకుటిల్లు వుండే చోట, రెండంతస్తుల భవనం వుంది ఆ పల్లెటూళ్ళో! ఇంటి చుట్టూ పెద్ద ప్రహరీ గోడా, దానికో అందమైన పెద్ద గేటూ! ఆ ఇంటికి, 'ఆనంద నిలయం' అని ఒక బోర్డు. ఇంటికి కొడుకు పేరే పెట్టేశారు. ఇంటి ముందు ఎన్నో పూల మొక్కలు. పెరట్లో చెట్లూ, కూరగాయల మొక్కలూ! అన్ని హంగుల తోనూ, పెద్ద సిటీలో వుండే ఇల్లు లాగా వుంది. సంధ్య అయితే, ఆ ఇల్లు చూసి చాలా సంతోషించేసింది, ఆశ్చర్యపోయినా!

మేనమామ భార్య కూడా అధునాతన దుస్తులలో వచ్చి, వీళ్ళని పలకరించింది. ఆవిడ కూడా వీళ్ళు ఆశ్చర్యపోయేటట్టే వుంది.

"రండి, రండి! మీకు వసతి, మేడ మీద గదిలో ఏర్పాటు చేశాం. గది గదికీ ఏసీ లేదు. ఇల్లంతా వున్నాయి సెంట్రల్ ఏసీ, సెంట్రల్ హీటర్! బాత్‌రూములో కుళాయి తిప్పితే వేడి నీళ్ళు వొస్తాయి. గీజర్ లాంటి పాత పద్ధతి కాదు. వెళ్ళి స్నానాలు చేసి రండి. షాంపూలూ, కండిషనర్లూ, సబ్బులూ, తువ్వాళ్ళూ, అన్నీ బాత్‌రూమ్ అలమార్లలో వున్నాయి. విప్పిన బట్టలు అక్కడ బాత్‌రూములో వున్న బాక్సులో వెయ్యండి. తుడుచు కున్న తువ్వాళ్ళు కూడా ఆ బాక్సు లోనే వెయ్యండి. పని వాళ్ళు, వాషింగ్ మెషిన్లో ఉతికేసి, డ్రైయర్‌లో ఎండబెట్టేస్తారు" అంటూ హడావిడి పడుతున్న మేనమామని చూసి, మళ్ళీ తెల్లబోయాడు సూర్యం భార్యతో సహా!

ఆయన్ని చూసి సంధ్యకి, భర్త తనతో జోకు చేశాడేమోననే అనుమానం కూడా వచ్చింది. భర్త గారు చెప్పినదేమిటీ, ఇక్కడ వున్నదేమిటీ? సూర్యం మేనమామ, విశ్వనాథం, ఆధునిక దుస్తుల్లో మెరిసి పోతున్నాడు. ఆయన్ని, పట్టు పంచా, విభూతీ, రుద్రాక్ష మాలలతో వూహించుకున్న సంధ్యకి, కాస్త ఆశాభంగం కలిగింది.

"అదేంటి మామయ్యా, ఇలా అయిపోయావు?" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు సూర్యం.

"అన్నీ మాట్లాడుకుందాం. పొద్దున్ననగా బయల్దేరారు. స్నానాలు కానిచ్చి రండి. అన్నీ మాట్లాడుకుందాం తీరిగ్గా" అన్నాడు విశ్వనాథం, అధునాతన కళ్ళజోడును సవరించుకుంటూ.

విశ్వనాథానికి కళ్ళజోడు పడిపోకుండా, దానికి ఒక బంగారు చైను వుండి, అది మెడ చుట్టూ వుంది.

మేనమామ భార్య కూడా వొచ్చి మాట్లాడింది. ఇంట్లో పని వారు తప్ప, ఎవరూ లేరు. వంటావిడ, వంటింట్లో పని చేసుకుంటోంది. వున్న ఒకే ఒక్క కొడుకూ, అమెరికాలో వున్నాడాయే!

మేడ మీద వీళ్ళ వసతి గది, ఐదు నక్షత్రాల హోటల్లోని గది లాగా, చాలా విశాలంగా, అన్ని హంగుల తోనూ వుంది. ఆ ఇల్లున్నది ఒక పల్లెటూళ్ళో అంటే, ఎవరూ నమ్మేటట్టు లేదు. అదేదో సినిమాలో, మహేష్ బాబు, ఒక పల్లెటూర్లో, హెలీకాప్టర్లో దిగి, అక్కడే ఒక ఆఫీసు పెట్టేస్తాడు అన్ని హంగుల తోనూ. అలా అంతా, సినిమాలో లాగా వుంది ఇక్కడ.

"వీళ్ళ బాత్‌రూమే మన బెడ్‌రూమ్ కన్నా పెద్దది!" అంటూ ఆశ్చర్యం ప్రకటించింది సంధ్య అక్కణ్ణించి వొచ్చి.

ఇంటి గోడల నిండా అధునాతన పెయింటింగులు! కొన్నయితే చూడ్డానికి చిన్న పిల్లాడు గీసిన గీతల్లాగా వున్నాయి! చాలా ఖరీదంట అవి!

స్నానాలు పూర్తి చేసి, మెట్లు దిగి భోజనాల గది లోకి వెళ్ళారు.

పీటలూ, విస్తరాకులూ, అన్నం, పప్పూ, ఆవ పెట్టిన కూరలూ, పులుసూ, వూరగాయలూ, అప్పడాలూ, వడియాలూ, అన్నీ దొరుకుతాయని ఎదురు చూసిన సంధ్యకి, అతి పెద్ద ఆశాభంగం!

అధునాతన భోజనాల బల్ల దగ్గిర కూర్చున్నారు. చైనా పింగాణీ పళ్ళాలలో భోజనం! బ్రెడ్డూ, సాండ్‌విచ్‌లూ, నూడిల్సూ, సాలాడ్, కేక్, ఛీజ్ పిజ్జా, చిప్స్! అవన్నీ వీళ్ళ తెలుగు వంట మనిషి చేసిన అమెరికా వంటలు! పళ్ళాల పక్కన, నేప్ కిన్స్, చెంచాలూ, ఫోర్కులూ, కత్తులూ!

"మనం అప్పుడే అమెరికా చేరి పోయామా?" అంటూ భర్త చెవి కొరికింది సంధ్య.

"ఉష్! వాళ్ళు వింటారు, బాగోదు. ఇక్కడ తిని అలవాటు చేసుకో. వచ్చే నెల్లో మూడు వారాలు ఇదే తిండి మనకి" అంటూ గొణిగాడు ఆ భర్త.

అందరూ భోజనాలు మొదలు పెట్టారు.

ఇక ఆగలేక, "చెప్పు మావయ్యా! ఇలా మారి పోయావేమిటి? శంకరాభారణంలో శంకర శాస్త్రి లాగా వుండే వాడివి! నీ మడీ, సాంప్రదాయాలూ, ఆ వంటలూ, అన్నీ ఏవి?" అంటూ ప్రశ్నలు గుప్పించాడు సూర్యం.

"అదేం కాదురా? మడీ, సాంప్రదాయాలు అన్నీ శుభ్రం కోసమే కదా? మన ఆనందూ, కోడలూ, మనవడూ ఇక్కడికి వస్తే అవస్త పడి పోకూడదు కదా? ఈ వస్తువులన్నీ వాడు పంపించినవే చాలా వరకూ. వాళ్ళు ఇక్కడ వున్నంత కాలమూ, హాయిగా వుండాలి. అందుకే, అన్ని వసతులూ ఏర్పాటు చేశాం ఇక్కడ" అంటూ వివరంగా చెప్పుకొచ్చాడు మేనమామ.

"అది సరే గానీ మావయ్యా, మీరెప్పుడూ మన వంటలు, అంటే, అన్నం, పప్పూ, కూరా, అవీ తినరా? ఎప్పుడూ ఈ అమెరికా వంటలే తింటారా?" అనడిగాడు సూర్యం కుతూహలంగా.

"ఎందుకు తినం? పండగలప్పుడూ, పబ్బాలప్పుడూ, తరుచూ అవే చేసుకుంటాం కదా? అదీగాక, మీరొచ్చారనీ, మీకివన్నీ రుచి చూపించాలనీ, సంబర పడ్డాం. బావుంటాయి. బాగా తినండి" అన్నాడు మేనమామ నవ్వుతూ.

అవసరం లేకపోయినా, కొడుకు పంపిన ఖరీదైన చేతి కర్రతోనే తిరిగాడు విశ్వనాథం ఇంట్లో, చాలా ఆరోగ్యం గానే వున్నా! చేతికి బంగారు గొలుసు వేలాడుతోంది. 'బ్రేస్‌లెట్' అంటారని చెప్పాడాయన.

మేనల్లుడు వున్నంత సేపూ, కొడుకు గురించే అన్ని కబుర్లూ! ఆ కాస్సేపూ, మేనల్లుడిలో కొడుకును చూసుకున్నాడాయన!

మేనమామా, ఆయన భార్యా కలిసి, సూర్యం దంపతులకు ఇల్లంతా చూపించారు. వంటిల్లు చూసి ఆశ్చర్య పోయారు ఈ దంపతులు. "పెద్ద సిటీలో వుంటున్నా, మా వంటింట్లో కూడా ఇన్ని ఆధునిక వస్తువులు లేవు!" అని ఆశ్చర్య పోయారు ఆ సిటీ దంపతులు.

మైక్రోవేవ్, అవెన్, లేటెస్ట్ కిచెన్ టాప్, డిష్ వాషర్, చాలా పెద్ద రెఫ్రిజిరేటర్, అమెరికా గ్రైండర్, జ్యూస్ తీసే మెషిన్, ఇంకా ఎన్నో! కళ్ళు తిరిగి పోయాయి సంధ్యకి.

సూర్యం, సంధ్యా తిరిగి వెళ్ళేటప్పుడు, మంచి చీరా, అవీ ఇస్తారనుకున్నారు వీళ్ళు. అయితే, మేనమామా వాళ్ళు, బంగారు పూత పూసిన స్టీలు చెంచాలూ, ఫోర్కులూ కానుకగా ఇచ్చారు. వీళ్ళు నోరెత్తలేదు ఇక.

"ఆనందూ వాళ్ళకి ఇయ్యి, నువ్వు అమెరికా వెళ్ళినపుడు" అని, కొన్ని బాక్సులు ఇచ్చాడు మేనమామ.

ఇంటికి తిరిగే వచ్చేదాకా, ఆ కబుర్లే చెప్పుకునీ, చెప్పుకునీ అలిసి పోయారా భార్యాభర్తలు.

"ఇన్ని వున్నాయి గానీ, కారెందుకు లేదూ బాబాయి గారికి? హెలీకాప్టర్ కొందామనుకుంటున్నారేమో!" అంది సంధ్య నవ్వుతూ.

ఫక్కున నవ్వాడు సూర్యం. "నీకు భలే అనుమానాలు వొస్తాయే! కారు అవసరం బొత్తిగా లేదని వూరుకున్నారేమో! అదీ వొస్తుందేమో తొందరలో!" అన్నాడు.

★ ★ ★

కళ్ళు మూసీ, తెరవగానే నెల దాటేసింది. అన్ని ఏర్పాట్లూ అయిపోయాయి. అమెరికాలో కాలు పెట్టేశారు

సూర్యం, సంధ్యలు! తిండి తప్ప, అన్నీ బావున్నాయి వాళ్ళకి అక్కడ.

"మూడో వారం మనం మీ మేనమామ కొడుకు ఇంటికి వెళుతున్నాం కదా? అక్కడ మన భోజనం దొరుకుతుందా?" ఆశగా అడిగింది సంధ్య.

"అలాంటి ఆశలేమీ పెట్టుకోకు! వాళ్ళు, దశాబ్దాల తరబడీ వుంటున్నారు ఇక్కడ. అన్నీ ఇక్కడి తిండి అలవాట్లే! అయినా, నిన్నా, మొన్నా ఇండియన్ హోటల్‌కి వెళ్ళి తిన్నాంగా?" అన్నాడు సూర్యం.

"ఆ హోటల్ తిండి ఏమీ బాగోలేదు. ఉప్పులూ, కారాలూ ఏమీ లేవు!" అంటూ గునిసింది సంధ్య.

రెండు వారాల కాన్ఫరెన్సూ అయింది. బయలు దేరి మేనమామ కొడుకు వుండే వూరికి వెళ్ళారు.

ఆనంద్ భార్యతో కలిసి ఎయిర్ పోర్టుకు వచ్చాడు. వాళ్ళ అవతారాలు చూసి ఆశ్చర్య పోవడం వీళ్ళ వంతయింది.

పట్టు చీరలో ఆనంద్ భార్య, పేరంటానికి వెళ్ళడానికి సిద్ధంగా వున్నట్టు వుంది. పట్టు పంచతో, సిల్కు లాల్చీతో, భుజం మీద పట్టు కండువాతో, ఆనంద్ మెరిసి పోతున్నాడు. లాల్చీ లోపల రుద్రాక్ష మాల వున్నట్టే వుంది. పిలక కూడా వుంటే, శంకరాభరణం యువ శంకరశాస్త్రి అమెరికాలో వున్నట్టు!

ఇంటికి చేరగానే, ఆ ఇల్లు చూసి ఇక తెల్లబోదల్చు కోలేదు ఈ భార్యాభర్తలు.

గుమ్మానికి ప్లాస్టిక్ మామిడాకులు వేళ్ళాడుతున్నాయి! ఇంటి ముందర పెద్ద ముగ్గు! ఎన్నటికీ చెరిగి పోని పెయింట్ ముగ్గు!

ఇక ఇంట్లో సామాను చెప్పక్కర్లేదు. అన్నీ పాత కాలం నాటి సామానులే. గదులలో మడత మంచాలూ, నవారు మంచాలూ! నులక మంచం మాత్రం లేదు! పెద్ద గదిలో పందిరి మంచం కూడా వుంది. హాల్లో మడత పడక కుర్చీ! హాల్లోనే వూగే గొలుసుల ఉయ్యాల! ఇక గోడల నిండా తల్లిదండ్రుల ఫోటోలు. ఎక్కువగా తండ్రి ఫోటోలే. హాల్లో తండ్రిది ఒక పెద్ద ఫోటో! ఒకటీ, అరా, అత్తా, మామల ఫోటోలు కూడా వున్నాయి. టీవీ మాత్రం ఓ మూల బిక్కు బిక్కు మంటూ వుంది ఆ సామాన్ల మధ్య.

"మీ ఇంట్లో రుబ్బు రోలూ, తిరగలీ కూడా వున్నాయా?" అని జోక్ చేశాడు సూర్యం.

"రుబ్బు రోలు పెరట్లో వుంది. నాన్న షిప్పులో పంపించారు. తిరగలి లేదు. బాగా గుర్తు చేశావు. నాన్నని ఈ సారి పంప మంటాను" అన్నాడు ఆనంద్ సంబరంగా.

వారు పెట్టిన భోజనం చూసి అస్సలు ఆశ్చర్య పోలేదు వీళ్ళు. అలాంటివే పెడతారని వారికి అర్ధం అయిపోయింది. వేయించి వొండిన ఉత్త పప్పూ, ఆవ పెట్టిన కందా, బచ్చలి కూరా, కాల్చిన వంకాయ రోటి పచ్చడీ, పప్పు పులుసూ, అప్పడాలూ, వడియాలూ, ఆవకాయా, గోంగూర పచ్చడీ, పరమాన్నం – ఇంకా ఎన్నో 'రుచికర' వంటలు!

చూడగానే కడుపు నిండి పోయింది భార్యాభర్తలకి. నెలల తరబడీ పస్తులు వున్న వారి లాగా, తెగ మింగారు ఆ రోజు.

"అది సరే గానీ, ఆనందూ, మీరెప్పుడూ పిజ్జాలూ, బర్గర్లూ, అవీ, తినరా? ఎప్పుడూ మన ఇండియా వంటలే తింటూ వుంటారా?" అనడిగాడు సూర్యం కుతూహలంగా.

"అయ్యో! ఎందుకు తినం? ఆఫీసుల్లో పెట్టేవి ఎప్పుడూ అవేగా? అదీగాక, బయటికి వెళ్ళినప్పుడు, హోటళ్ళలో కూడా అవే తింటాం" అని చెప్పాడు ఆనంద్.

"అలాగా!" అన్నట్టు తలూపాడు సూర్యం.

"ఇక్కడ మా ఇంట్లో వున్న సామాన్లన్నీ నాన్నే పంపించారు. నాన్న సంగతులు చెప్పు!" అంటూ ఆనంద్, తండ్రి గురించి తెగ మాట్లాడాడు సూర్యంతో.

వీళ్ళ ఎదురుగానే, తండ్రి పంపిన బాక్సులు తెరిచాడు ఆనంద్! వాటి నిండా, అరిశలూ, జీళ్ళూ, కొబ్బరి వుండలూ, జీడి పప్పు మిఠాయీ, మామిడి తాండ్రా, పాల కోవా, పూతరేకులూ, జంతికలూ, కారం బూందీ, ఇంకా ఎన్నో అచ్చ తెలుగు వంటలు! అవన్నీ చూసి, తెగ మురిసి పోయాడు ఆనంద్.

వాటిలో చాలా వరకూ, మేనమామ ఇంట్లోని వంట మనిషే చేసిందట! "ఆ వంట మనిషి, వీటిలో ఒక్కటి తమకు ఆ పల్లెటూళ్ళో పెట్టినా సంతోషించే వాళ్ళమే!" అని మనసు ల్లోనే అనుకున్నారు సూర్యం, సంధ్యా. మనసుల్లో అనుకున్నది, తర్వాత చెప్పుకున్నారు.

వెళ్ళే ముందర తండ్రికి ఇవ్వమని, కొన్ని బాక్సులు ఇచ్చాడు ఆనంద్. ఆ బాక్సుల్లో ఏముంటాయో, ఈ దంపతులకు ఎవరూ చెప్పకుండానే తెలిసి పోయింది. అన్నీ అమెరికా సామానులే! అంతే! బాక్సుల్ని విప్పక్కర్లేదు!

"అవునూ, మీ మేనబావ, ఇంకా కారు వాడుతున్నాడేం? ఎడ్లబండి ఎప్పుడు కొంటాడట?" అనడిగింది సంధ్య అల్లరిగా.

జవాబు ఇవ్వకుండా, భార్య వేపు పులుకూ, పులుకూ మంటూ చూశాడు సూర్యం.

★ ★ ★

మొత్తానికి అమెరికా ప్రయాణం సవ్యంగా పూర్తి చేసుకుని, ఇండియా తిరిగి వచ్చి, తమ కొంపలో పడ్డారు సూర్యం, సంధ్యా!

"బావుంది మన ప్రయాణం! ఇండియా వాళ్ళు అమెరికా లోనూ, అమెరికా వాళ్ళు ఇండియా లోనూ జీవిస్తున్నట్టు వుంది. ఏది తమకి లేదో, అదే ఎక్కువ ప్రీతి అన్న మాట!" అంది సంధ్య.

"కాదు సంధ్యా! నువ్వు తప్పు అర్థం చేసుకున్నావు. ఆ తండ్రీ, కొడుకుల మధ్య ప్రేమాభిమానాలు వున్నాయి. వాళ్ళు ఒకరి నొకరు బాగా 'మిస్' అవుతున్నారు. ఒకరి మీద ఇంకొకరు బాగా బెంగగా వున్నారు. భారతీయ వస్తువుల్లో తండ్రిని కొడుకూ, అమెరికా వస్తువుల్లో కొడుకును తండ్రీ, చూసుకుంటున్నారు! అలాగే బెంగగా కాలం గడుపుతున్నారు" అన్నాడు సూర్యం గొప్ప పరిశోధకుడి లాగ. .

"అవునేమో" అన్నట్టు, అంగీకారంగా, అర్థమైనట్టు తలూపింది సంధ్య. కానీ వెంటనే, "నేనలా వొప్పుకోను" అంది మళ్ళీ. "తండ్రి ఈ దేశంలో వుంటే ఏంటి? కొడుకు అమెరికాలో వున్నాడని, గొప్ప చెప్పుకుంటూ బతకాలనే వుంటుంది" అంది.

"అలా అయితే, ఆనంద్, అమెరికాలో ఆ గొప్ప లేకుండా ఈ దేశంలో వున్నట్టు ఎందుకు వున్నాడు?" అనడిగాడు సూర్యం.

"నేను చాలా చోట్ల చదివాను. అమెరికా లోని భారతీయులు, తమ దేశపు సంస్కృతినే పాటించాలని కోరుకుంటారు. 'మన సంస్కృతి' అనే అంటారు. అందుకే అలా వుంటారేమో! అయితే మాత్రం, అమెరికా లోని గొప్పలు మాత్రం వొదులుకుంటారా?" అంది సంధ్య.

"ఏమో! ఎలా అర్థం చేసుకోవాలో!" అని సూర్యం నిరుత్సాహ పడ్డాడు.

ఆ మర్నాడే మేనమామ దగ్గిర్నించి ఫోను సూర్యానికి. మొదట మేనల్లుడి ప్రయాణం గురించి ప్రశ్నలడిగాడు. ఆ మేనల్లుడు జవాబులు చెప్పాడు వివరంగా.

అప్పుడు మేనమామ, "సూర్యం! నీకో మంచి వార్త. అమెరికా వెళ్ళి నువ్వేం మాట్లాడావో గానీ, మా ఆనంద్ ఇండియా తిరిగి వొచ్చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు. ఇంకో రెండు నెలల్లో వచ్చేస్తాడు భార్యతో. వాడి కొడుకు అక్కడే హాస్టల్‌లో వుండి మెడిసిన్ చదువుతున్నాడు. మా మనవడే తండ్రిని వెళ్ళి, తాత దగ్గిర కొన్నేళ్ళు వుండమన్నాడు. మాకు చాలా సంతోషంగా వుంది!" అంటూ చాలా మాట్లాడాడు.

ఆయాచితంగా వచ్చిన మెప్పుకోలుకు చాలా సంతోషించాడు ఈ మేనల్లుడు! తండ్రీ, కొడుకులు దగ్గిరవుతున్నందుకు మరీ సంతోషించాడు!

వెంటనే, సూర్యం, "నే చెప్పాను, చూశావా, చూశావా?" అని పొంగిపోతూ సంధ్యతో అన్నాడు.

దానికి సంధ్య, "ఆ( ఆ( .... తూర్పూ, పడమరలు కలిసి పోతున్నాయంటారా? అవెందుకు కలుస్తాయి? అలా కనిపిస్తాయి అంతే!" అంది సాగదీస్తూ!

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## *మరో కురుక్షేత్రం* — *పాణిని జన్నాభట్ల* (Boston, MA)

చంద్రుడు మూలా నక్షత్రం నుంచి పూర్వాషాఢ వైపు మళ్ళుతున్న ఘడియ. అమావాస్య తిథి. సూర్యుడు తనలో తనే కుమిలిపోతూ ఉదయిస్తున్నాడు. అప్పటివరకూ శ్మశానపు నిశ్శబ్దం అలుముకున్న కురుక్షేత్రంలో ఒక్కసారిగా అలజడి. దిక్కులుపిక్కటిల్లేలా మోగుతున్న సైన్యపు భేరీలతో, గుండెలవిసేలా పరిగెడుతున్న గుర్రాల సకిలింపులతో, మహారథులని గర్వంతో మోస్తున్న ఏనుగుల ఘీంకరింపులతో మునిగిపోయిందా రణరంగం. లక్షల అడుగుల, గిట్టల ధాటికి పైకెగసి తుఫానులా భూమండలం అంతా పరుచుకుంటున్న దుమ్ము.

తూర్పు దిక్కు నుండి ఆ దుమ్ముని చీల్చుకుంటూ రెపెరెపలాడుతున్న కపిధ్వజంతో, తెల్లటి గుర్రాలతో దూసుకువస్తోంది అర్జునుడి రథం. అతని చుట్టూ కొంచెం వెనకగా అంతే యుద్ధోత్సాహంతో వస్తున్న మరో నాలుగు రథాలు. పాండవులవి. యుద్ధకేంద్రానికి వచ్చాక రథాన్ని నెమ్మది చేస్తూ ఎదురుగా చూసాడు అర్జునుడు. బంగారు రంగులో అస్పష్టంగా మెరుస్తూ, నల్లటి జాతి అశ్వాలతో ఆఘమేఘాలతో తమవైపే వస్తోందో రథం. దాని పైనున్న మదగజ పతాకాన్ని చూసి అర్జునుడి కళ్ళు విప్పారాయి. దుర్యోధనుడు!

పాండవులందరూ ఒకే గీత మీద ఆపారు తమ రథాల్ని. ఎదురుగా పడమర నుంచి చీమలదండులా తమ వైపే వస్తున్న అశేష సేనా వాహిని. కొన్ని లక్షల మంది. అదేమీ వారిని భయపెట్టడం లేదు. వాళ్ళ కళ్ళన్నీ దుర్యోధనునికి ఇరువైపులా ఉన్న రథాలనే చూస్తున్నాయి. ద్రోణుడూ, భీష్ముడూ. కలిస్తే అర్జునుని కన్నా బలమైన శక్తి. వారిని ఎదుర్కొనే వ్యూహం పై స్పష్టత లేదు ఇంకా పాండవులకి.

కొద్దిసేపటికి రెండువైపులా గొడవ సర్దుమణిగింది. భూమంతా పరుచుకొన్న సేన. కురుక్షేత్ర యుద్ధం మొదటి రోజు. ఒక కొండ మరొక పెద్ద కొండతో ఢీకొనబోతున్న క్షణం.

బలహీనమైన పాండవ సైన్యాన్ని చూసి వెకిలిగా నవ్వాడు అవతలివైపున్న దుర్యోధనుడు. తన విజయానికి తిరుగులేదు. ఉత్సాహంతో శంఖాన్ని అందుకొని పూరించాడు. వెంటనే కౌరవ ప్రముఖులూ, పాండవ వీరులూ తమ తమ శంఖాల్ని ఊది యుద్ధానికి సిద్ధతని తెలియజేసారు.

అర్జునుడు తన గాండీవంపై ఆగ్నేయాస్త్రాన్నీ, భీష్ముడు వారుణాస్త్రాన్నీ ఎక్కుపెట్టబోతున్నారు. దుర్యోధనుడూ, భీముడూ తమ తమ బల్లాలని విసరడానికి సన్నద్ధమౌతున్నారు. ఇంతలో...

ఉత్తరం నుండి పిడుగులు పడుతున్నట్టు భీకర శబ్దం. అందరూ విస్తుపోయి అటు చూసారు. నల్లని మేఘంలా కమ్ముకు వస్తున్న మరో సేనా సమూహం! అర్జునుడు మిగిలిన పాండవుల వైపు చూసాడు. అందరి ముఖాల్లో ఆశ్చర్యం.

ఆ మబ్బుల్లోంచి ఎర్రటి గుర్రాలతో, శ్వేత వస్త్రధారులతో ముందుకి ఉరికివస్తున్న మూడు రథాలు. వాటి చుట్టూ ఏదో తేజస్సు. దుర్యోధనుడికంతా అయోమయంగా ఉంది. ద్రోణుడి వైపు ప్రశ్నార్థకంగా చూసాడు. ఆయన కళ్ళు మూసుకొని ఉన్నాయి. కొద్దిసేపు దివ్యదృష్టితో చూసి దుర్యోధనుడి వైపు ఆందోళనగా చూస్తూ అన్నారు...

"త్రిపాలకులు!"

*ఎనభై ఏళ్ళ క్రితం*

గంగానదీ తీరంలో ఉన్న ఒక శిలపై ఠీవిగా కూర్చొని ఉన్నాడు కౌరవ యువరాజు దేవవ్రతుడు. తన ముఖంలో అసహనం స్పష్టంగా తెలుస్తోంది. అతని కెదురుగా ఓ తెడ్డుని పోటీగా పెట్టుకుని నిలబడి ఉన్నాడు దాశరాజు. ఆ ప్రాంతపు మత్స్యకారుల నాయకుడు. వాళ్ళకి ఓ మూలగా అతని కూతురు సత్యవతి. తల దించుకుని చేతిలో ఉన్న వలలో చిక్కిన చేపలని ఒక్కటొక్కటే తీస్తూ కిందున్న కుండలో వేస్తోంది. అప్పుడప్పుడూ ఆ ఇద్దరివైపూ మార్చి మార్చి దొంగ చూపులూ చూస్తోంది. పొద్దుటినుండి సాగుతోందీ గొడవ. ఎటూ తేలదు, ఎవురూ తగ్గరు. నిట్టూర్చింది.

తన తండ్రి మహారాజు శంతనుడికి మత్స్యకారుల పిల్ల సత్యవతిని అడుగుదామని ప్రయత్నిస్తున్నాడు దేవవ్రతుడు.

"బాబూ, మీరింత దూరమొచ్చారు గనక నా ఆకరిమాట మల్లా సెప్తన్నా. నా సత్తెవతి పిల్లలు బవిస్సెత్తులో నీకూ, నీ పిల్లలకి ఊడిగం సేత్తారంటే ఈ మనువుకి నేనొప్పుకోను గాక కోను" అన్నాడు దాశరాజు దణ్ణం పెడుతూనే.

*"హుమ్...సుకపడే పాప్తం నేదు నాకు"* అనుకుంది సత్యవతి.

"మీ మనుమలకేమీ ఆ గతి పట్టనివ్వను. కోసల, మగధ సామంతరాజ్యాలను వారసులు పుట్టిన వెంటనే వారికి ధారాదత్తం చేస్తాను" అన్నాడు దేవవ్రతుడు.

"మీరు, దరమ పబువులు...కానీ అద్దదే కదా సిక్కంతా. సామంతరాజంటే నీకు దాసుడనే గందా.." అన్నాడు సత్యవతి వైపు చూస్తూ. ఆమె కళ్ళల్లో కోపం.

"నీ కూతురికి మత్స్యకారులుగా జన్మించటం కన్నా, కౌరవ సాంరాజ్యంలో రాజులుగా పుట్టడం వెయ్యిరెట్లు నయం!" అన్నాడు యువరాజు చిరాగ్గా.

"అయ్యా, నేనేమీ మీ కాడికొచ్చి మా యమ్మిని మీ నాయనకి సేస్కోండని బతిమినాడనేదు. తమరే వచ్చారు..తమరే మాటలంటన్నారు" చిన్నబుచ్చుకున్నాడు.

"సరే, సామంత రాజులుగా కాదు, సత్యవతికి పుట్టిన సంతానానికే మొదట హస్తినాపుర సామ్రాజ్య అధికారం దక్కుతుంది. ఏమంటావు?"

"అబ్బబ్బ ప్రబువులు తలుచుకుంటే లోటుంటదా, కడుపు నిండిపోతంది ఇంటుంటే మీ మాటలు. కానీ అయ్యా! నువ్వేమో ఈరుడివి. ఒకేళ బవిస్సెత్తులో నీ సంతానం వచ్చి నా పిల్లల్ని రాజ్యంనుంచెల్లగొడితే?...దిక్కేటి..?"

కోపంతో ఊగిపోతూ పైకి లేచాడు దేవవ్రతుడు. అవకాశం ఉంటే వీడి తలనరికి సత్యవతిని తీసుకుపొయ్యేవాడెప్పుడో. యువరాజు ఆవేశం చూసి దాశరాజు వణికిపోయాడు. తెగేదాకా లాగేనేమోనని మనసులోనే చెప్పుతో కొట్టుకున్నాడు.

హఠాత్తుగా దేవవ్రతుడు అరచేతిని ముందుకి బోర్లా చాస్తూ భీషణ ప్రతిజ్ఞ చేశాడు "నేనీ జన్మలో వివాహం చేసుకోననీ, కురువంశ రక్షణకై ఆజన్మం శ్రమిస్తాననీ పంచభూతాల సాక్ష్మిగా శపథం చేస్తున్నాను!"

ఆకాశంలో ఉరుములూ మెరుపులతో కూడిన పూల వర్షం. దాశరాజు ముఖంలో సంతోషం.

దేవవ్రతుడి ఉగ్రరూపం చూసి దూరంగా రథం దగ్గరున్న అతని తమ్ముడు భద్రబాహు పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. శంతనుడి తమ్ముడి కొడుకైన అతను తండ్రి మరణంతో చిన్నప్పటినుండీ శంతనుడి దగ్గరే పెరిగాడు. గొప్ప వీరుడు. అన్న దేవవ్రతుడంటే అపారమైన గౌరవం.

అతను వచ్చేంతలోనే అంతా జరిగిపోయింది. దేవవ్రతుడు భీష్ముడయ్యాడు.

దగ్గరికొచ్చి బాధతో తనవైపు చూస్తున్న తమ్ముడిని చూసి దిగులుపడ్డాడు భీష్ముడు.

"నీవు నాలాగా ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండమని ఆదేశించను సోదరా. నీకిప్పుడే కాశ్మీరరాజ్యాన్ని ధారాదత్తం చేస్తున్నాను" అంటూ గంగ నీటిని చేతిలోకి తీసుకుని తమ్ముడి చేతిలోకి వదిలాడు.

ప్రతిజ్ఞ ప్రకారం ఆజన్మం బ్రహ్మచారిగా ఉండిపోయాడు భీష్ముడు. సత్యవతీ శంతనులకి మనవళ్ళుగా ధృతరాష్ట్రుడూ, పాండురాజూ కలిగారు. భీష్ముడి తమ్ముడైన భద్రబాహు కాశ్మీర రాజ్యానికి తరలిపోయాడు. అతనికి త్రిమూర్తుల అంశలతో వజ్రహస్తుడు, సూత్రకుడు, చతుర్భుజుడు అనే మనవళ్ళు కలిగారు. దేవతలకే యుద్ధాల్లో సహాయం చెయ్యగలిగే పరాక్రమవంతులు ముగ్గురూ.

కాశ్మీరంలో మూడు ఉప రాజ్యాలని ప్రజారంజకంగా పాలిస్తూ త్రిపాలకులనే పేరు తెచ్చుకున్నారు.

భద్రబాహుడి నుంచి తమ దాయాదులైన పాండవులూ, కౌరవుల గురించి పూర్తిగా తెలుసుకుని యుద్ధానికి బయల్దేరారు.

*ప్రస్తుతం*

దుర్యోధనుని మొహం పాలిపోయి ఉంది. అతన్నే చూస్తున్న ధర్మరాజుకి కూడా మెల్లగా అర్ధమైంది ఆ కొత్త సేన ఎవరిదో. ఇరువైపులా సైన్యాల్లో గుసగుసలు మొదలయ్యాయి. వచ్చిన వాళ్ళు త్రిపాలకులని తెలియగానే సహాయానికొచ్చిన సామంతరాజులు కొందరు భయంతో వణుకుతూ ధర్మరాజు దగ్గరికొచ్చి చేతులు జోడించి తమ సైన్యంతో సహా వెనుతిరుగుతున్నారు. విరాటరాజూ వచ్చాడు. పాండవుల ముందు భారంగా తల దించుకుని కుమిలిపోతూ వెళ్ళిపోయాడు. ఎదురుగా దుర్యోధనుడిదీ అదే పరిస్థితి. గాంధార, యవన, కాంభోజ రాజులు చక్రవర్తి ముందు సాష్టాంగపడి మరీ రాజ్యాలకి తరలివెళుతున్నారు.

ఇదంతా చూస్తూ కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో అరిచాడు దుర్యోధనుడు

"ఆచార్యా! ఈ పిరికిపందలని పోనివ్వండి. మన దగ్గర ఇంకా సగం సైన్యం ఉండనే ఉంది. మీరూ, భీష్మపితామహుడూ, అశ్వత్థామా ఉన్నారు. ఇది చాలు ఆ పాండవులనీ, త్రిపాలకులనీ నాశనం చెయ్యడానికి"

"శాంతించు నాయనా! ఇది ఆలోచించి ముందడుగేయవలసిన సమయం. అటుచూడు, పాండుపుత్రులు కూడా ఇటే వస్తున్నారు. కలిసి సమాలోచన చెయ్యాలి" అన్నాడు ఎదురుగా చూపిస్తూ.

పాండవులు దగ్గరగా వచ్చి కౌరవ పెద్దలతో మండలాకారంలో నిలిపారు తమ రధాలని. ఎవరికీ పాలుపోని స్థితి. ధర్మరాజు చేతులు జోడిస్తూ "ఆచార్యా! ఇది ఊహించని పరిణామం. త్రిపాలకులనెదుర్కొనే సమర్ధత మన ఇరువురి సైన్యాలకూ లేదనిపిస్తోంది" అన్నాడు దీనంగా.

"అన్నగారూ, ముల్లోకాలూ చూడని విలుకాడు అర్జునుడూ, వంద ఏనుగులని మట్టికరిపించగలిగే నేనూ ఇక్కడుండాగా ఇలాంటి పిరికి మాటలు మీకు ఉచితం కాదు!" హుంకరించాడు భీముడు.

"నాయనా, పుట్టుకతోనే అబ్బిన యుద్ధవిద్యలూ, తాత భద్రబాహుడి వరాలూ, దైవాంశల వలన పొందిన అస్త్రాలూ, త్రిపాలకులని అమిత శక్తిమంతులని చేసాయి. వాళ్ళల్లో ఒక్కొక్కరే మనందరికీ సరిసాటి. అలాంటిది ముగ్గురూ కలిస్తే..." తల విదిలించాడు ద్రోణుడు. భీష్ముని ముఖంలో అదే ఆందోళన.

త్రిపాలకుల్లో సూత్రకుడు విష్ణుమూర్తి అవతారమని ఎవరో చెప్పిన మాట గుర్తుకు వచ్చింది అర్జునుడికి. "*అందుకే బావ శ్రీకృష్ణుడు యుద్ధంలో తనేమీ సాయం చేయలేనన్నాడన్నమాట*" మెల్లగా అర్థమౌతోంది తనకి.

"ఇప్పుడేమిటి కర్తవ్యం పితామహా!" అందరూ భీష్ముని వైపు చూసారు.

"వాళ్ళని సంప్రదించి ఈ ఆకస్మిక రాకకి కారణమేమిటో తెలుసుకోవడమే"

ఆ సలహా ఎవరికీ నచ్చకపోయినా, నిస్సహాయంగా అటువైపు రథాల్ని కదిపారు అందరూ.

ఆజానుబాహులైన ఆ ముగ్గురి తేజస్సుని చూసి మైమరచిపోతూ దగ్గరికి వెళ్తున్నారు పాండవ, కౌరవ యోధులు. చేతుల్లో శక్తివంతమైన ధనస్సులూ, చూపుల్లో తీక్ష్ణత, మోఖాల్లో ఎన్నడూ ఓటమెరుగని ఠీవి..సందేహం లేదు. వీరు దైవాంశ సంభూతలే. పాండవులకి మొదటి సారి వాళ్ళని చూసి ఆత్మన్యూనత మొదలైంది. *వారిని జయించలేమేమో* అన్న ఆలోచనా అందరిలో బలపడుతోంది.

ఆ ముగ్గురిలో పెద్దవాడైన వజ్రహస్తునికి అభిముఖంగా వచ్చి చేతులు జోడిస్తూ అన్నాడు ధర్మరాజు

"సోదరులకి వందనాలు. అభయమిస్తున్న మీ కళ్ళనీ, త్రిశూలాలని తలపించే మీ ఆయుధాలనీ, ముందుండి నడిపించే మీ నాయకత్వాన్నీ చూస్తుంటే ఆ ఆదిదేవుడు మహేశ్వరుణ్ణే చూస్తున్నట్టుంది" అన్నాడు పారవశ్యంతో.

వజ్రహస్తుడు మిగిలిన ఇద్దరివైపూ చూసి చిరునవ్వుతో "ఇంత సునిశిత పరిశీలనా శక్తి ఉన్న సోదరుడు ధర్మరాజే అయ్యిండాలి" అన్నాడు.

"అవును, వీళ్ళు నా సోదరులు పాండవులు, వారు ధృతరాష్ట్ర కుమారులు కౌరవులూ, పితామహుడు భీష్ముడూ, మా అందరి ఆచార్యులు ద్రోణులు"

"అద్భుతం! కురు వీరులందరూ ఇక్కడే ఉన్నారు" అన్నాడు సూత్రకుడు.

"మనతో సహా!" నవ్వాడు చతుర్భుజుడు.

"యుద్ధం మధ్యలో తమరిలా రావటానికి కారణం?" అడిగాడు వజ్రహస్తుడు అన్నీ తెలిసినా.

"మా పరస్పర సోదరుల యుద్ధంలోకి మీరెందుకు వేంచేసారో తెలుసుకుందామని..." గీరగా అన్నాడు దుర్యోధనుడు.

"మేమూ సోదరులమనే కదా అన్నారు"

"నిజమే, కానీ భీష్మ పితామహుడు మీకు స్వతంత్ర రాజ్యం ఇచ్చి మన రాజ్యాలలో సంబంధాలు లేవని కదా తీర్మానించారు?"

"అలా అని ఆయన యుద్ధం చెయ్యకూడదనే నియమమేమీ పెట్టలేదే?"

భీష్ముడు తలూపాడు నిజమేనన్నట్టు.

"మీకు దైవమాయలు తెలుసట. మేము మీతో యుద్ధానికి సమఉజ్జీలం కాము. ఇది ధర్మయుద్ధం కాబోదు" అన్నాడు భీముడు.

"సమ ఉజ్జీలో కాదో, యుద్ధం క్షాత్ర ధర్మం. అయినా మీలో దైవాంశ లేదా వాయుపుత్రా!"

"కావచ్చు, మీ వలన భయంతో మా సేనలన్నీ ఖాళీ అయ్యాయి. ఇప్పుడు తలపడే అవకాశమే లేదు" అన్నాడు చుట్టూ చూస్తూ అర్జునుడు.

"అది మీ సమస్య. మాకు తలొగ్గి, రాజ్యాన్ని మాకు అప్పగించండి. మీ ప్రతిష్ఠకి భంగం కలగకుండా సామంతరాజ్యాలనిస్తాము" అన్నాడు వజ్రహస్తుడు మీసం దువ్వుతూ.

అవమాన భారంతో తలలు దించుకున్నారు అందరూ.

అప్పుడు భీష్ముడు ముందుకి వచ్చాడు. త్రిపాలకులు రథాలు దిగివచ్చి ఆయనకి పాదాభివందనం చేసారు.

వాళ్ళని ఆశీర్వదించి "కుమారుల్లారా, మీ పితామహుడు భద్రబాహు, నా సోదరుడు. ఇంతటి పరాక్రమవంతులైన వారసులను కన్న అతను అదృష్టవంతుడు. కానీ దయచేసి ఈ కురు, పాండవ సమరంలోకి ప్రవేశించి మీ స్థాయిని తగ్గించుకోవద్దు" అన్నాడు.

బుసకొట్టినట్టు చూసాడు దుర్యోధనుడు అది విని.

"పితామహా! స్వతంత్ర రాజులుగా ఈ రాజ్యాన్నాశించి యుద్ధం చేయడంలో అధర్మమేమీ లేదు. ఇద్దరి బదులు ముగ్గురి దాయాదుల మధ్య పోరనుకున్నా కూడా తప్పేమీ కనపడటం లేదు. అందువలన కౌరవ పక్షపాతియైన మీ మాటలు విని వెనుతిరగలేము. కానీ మా తండ్రి గారి ఆదేశం మేరకు మీ రాజ్యంలో ఒకే ఒక్క వ్యక్తి మా కర్తవ్యమేమిటో తెలుపగలరు. ఆయన చెప్పిన మార్గంలో నడవటానికి మేము సిద్ధమే" అన్నాడు వజ్రహస్తుడు.

"ఎవరు? ఎవరతను?" అన్నాడు దుర్యోధనుడు ఆత్రుతతో.

"విదురుడు!"

హస్తినాపురిలోని సువిశాలమైన రాజదర్బారు మధ్యలో అటూ ఇటూ తిరుగుతున్నాడు విదురుడు. తండ్రి వ్యాసునిలోని బుద్ధి కుశలతా, ధర్మాధర్మాల నిర్ణయ సామర్థ్యం పుణికిపుచ్చుకోవడం వల్లే ఇప్పుడీ న్యాయనిర్ణయం ఆయనపై పడింది.

కౌరవులూ, పాండవులూ ఒక పక్కా, త్రిపాలకులు మరో పక్కా ఉన్నారా మండపంలో. పొద్దుటినుండీ విదురుడిచ్చిన సలహాలు ఒక్కటీ నచ్చలేదు ఎవ్వరికీ. రాజ్యాన్ని చీల్చి ఏలుకోమంటే దుర్యోధనునికి కోపం. పెద్దన్నలుగా, పరాక్రమవంతులుగా త్రిపాలకులని ఒప్పుకొమ్మంటే పాండవుల కంట అగ్ని జ్వాలలు. మీ రాజ్యంకాని రాజ్యం మీకెందుకంటే త్రిపాలకులలో నిర్లిప్తత.

అలోచనలతో తిరుగుతున్న విదురుడు హఠాత్తుగా ఆగాడు. అతని ముఖంలో ఏదో స్పష్టత. అందరూ ఆయన్నే చూస్తున్నారు. మెల్లగా అందరినీ చూస్తూ అన్నాడు...

"ప్రజామతం!"

అదిరిపడ్డాడు ధర్మరాజు. త్రిపాలకులూ సందేహంగా చూసారు. దుర్యోధనుడికేమీ అంతుబట్టలేదు. "అర్ధమయ్యేటట్టు సెలవియ్యరా?" అన్నాడు విదురునితో.

"ప్రజలు. ప్రజలే నిర్ణయిస్తారు మీలో ఎవరు వారికి ప్రభువులుగా ఉండాలో. అదే ఉచితం" అన్నాడాయన. ఇప్పుడు అదిరిపడటం దుర్యోధనుని వంతయ్యింది. అతను సింహాసనం నుంచి ఉద్రేకంగా లేచి "ప్రజలా! ఆ బానిసలు మా భవిష్యత్తుని నిర్ణయించడమా? ఇంతకన్నా యుద్ధంలో మరణించినా బావుండేది ఆచార్యా" అన్నాడు ద్రోణుడివైపు చూసి. ఎవరికీ మింగుడు పడట్లేదు. ఎక్కడా విననిదీ, కననిదీ ఈ విషయం. అర్జునుడు పైకి లేచి "పినతండ్రీ, ఇది మా అందరికీ కొత్తగా తోస్తోంది. అసాధ్యమనిపిస్తోంది. రాచరికం పారంపరికమో, యుద్ధంలో విజయం వల్లే దక్కుతుంది కదా? కొత్తగా ఈ ప్రజామతం ఏమిటి?" అన్నాడు.

"నాయనా, రాజ్యం అంటే భవనాలూ, సంపదా, సైన్యం కాదు. ప్రజలు. వారికి నమ్మకమైన పాలననందించే ప్రభువుని ఎన్నుకోవటం వారి హక్కు. ఇంక కొత్తదనం అంటావా, మీరు పన్నెండేళ్ళు వనవాసం చెయ్యటం కొత్త విషయం కాదా? సమయాన్ని బట్టీ మనం కొత్త వాటిని స్వీకరించాలి. ఇలా చెయ్యటం భావితరాలవారికి ఆదర్శమై యుద్ధాల వలన జరిగే అపార ప్రాణనష్టాన్నీ ఆపవచ్చు" అన్నాడు. భవిష్యత్తుని నిర్దేశించే ద్రష్టలకే సాధ్యమైన ఆలోచనలు.

అంతటా మౌనం.

వజ్రహస్తుడు మెల్లగా లేచి "మాకిది సమ్మతమే" అన్నాడు. ధర్మరాజు కూడా మెల్లగా తలూపుతున్నాడు. దుర్యోధనుడి వైపు మళ్ళాయి అందరి కళ్ళూ. పక్కనున్న కర్ణుడు తన వైపు వంగి చెవిలో అన్నాడు "మిత్రమా! ఈ రాజ్యంలో

ప్రజలని గత పదమూడేళ్ళుగా చక్కగా పరిపాలిస్తున్నావు. ఇక్కడి ప్రజలకి ఈ పాండవులు గురించి ఏమీ తెలియదు. త్రిపాలకుల గురించి సరేసరి. వారి పేరే వినుండరు. విజయం నీదే. సందేహించకు"

మిత్రుడి మాటలు విన్న దుర్యోధనుడూ చెయ్యి ఊపాడు కానిమ్మని.

"తథాస్తు! ఈ హస్తినాపుర ఎన్నికకి మీ అందరి సమ్మతీ ఓ కొత్తశకానికి నాంది పలుకుతుంది" అన్నాడాయన.

"ఎన్నికల విధి విధానాలు...?" సందేహం వెలిబుచ్చాడు ధర్మరాజు.

"అక్కడికే వస్తున్నా, ఇవాళ పాడ్యమి. మరలా వచ్చే పాడ్యమిరోజు కురుక్షేత్ర మైదానంలోనే ఎన్నికలు జరుగుతాయి. రెండు ముఖ్య నియమాలు. మొదటిది – బలవంతంగానో, ధనధాన్యాల ఆశ చూపో ప్రజల మతదానాన్ని పొందరాదు. రెండవది – రాజులు స్వయంగా ప్రచారంలో పాల్గొనాలి, సేవకులని పంపకూడదు"

అందరూ లేచి గంభీరంగా బయటికి వెళుతున్నారు.

చివరగా ఉన్న దుర్యోధనుడు వెనక్కి తిరిగి అన్నాడు విదురునితో "మీ పాండవ పక్షపాతం మళ్ళీ ప్రదర్శించారు. ప్రజల ఆమోదం మాకు ఉండదనే కదా మీ పన్నాగం?"

"లేదు నాయనా, నా పక్షపాతం పాండవులపై కాదు ధర్మం పైన. కురుక్షేత్రంలో నీవు కోరుకున్న యుద్ధం కాదు..నేను నిర్దేశించిన ఇదే అసలైన ధర్మ యుద్ధం కాగలదు!"

తరువాతి వారం అందరూ ప్రచార సన్నాహాలలో గడిపారు. *ఏం చెప్పాలి? ప్రజలకసలేం కావాలి? బానిసలని ఎలా బ్రతిమిలాడాలి?* వింతగా, అసాధ్యంగా తోచాయి.

నగరంలో మూడు పెద్ద సభా మంటపాలు వెలిసాయి. యుద్ధ పతాకాలే వారి ప్రచార చిహ్నాలుగా మారాయి. వీధి వీధినా ఆ పతాకాల రెపరెపలే. ముగ్గురు సోదర సమూహాలూ తలమునకలుగా పనిచేస్తున్నాయి. ఎవరి వ్యూహాలు వారివి. ద్రోణుడూ, భీష్ముడూ మిగిలిన కురువృద్ధులూ ఈ ఎన్నికలకి దూరంగా ఉండాలని నిశ్చయించుకున్నారు. దుర్యోధనుడు పెద్దగా బాధ పడలేదు. ఇప్పుడు వీరత్వం కాదు అతనికి కావలసింది. జనాకర్షణ.

సన్నాహాలు పూర్తయ్యాక మిగిలిన కౌరవ ప్రముఖులతో తన సభామంటపం వైపు పెద్ద ఏనుగుపై ఊరేగింపుగా వచ్చాడు దుర్యోధనుడు. దారిపొడుగునా అతని చుట్టూ సైనికులూ, ఆ చుట్టూ వేలమంది జనం. వారిలో ఒకరో ఇద్దరో తప్ప తమ రాజునెవ్వరూ చూడలేదప్పటివరకూ. అంతా జయజయ ధ్వానాలే. అందరికీ చేతులాడిస్తూ వచ్చి ఆ ఊరి బయట ఏర్పాటు చేసిన సభావేదిక పైకెక్కి ఠీవిగా నుంచున్నాడు. విశాలమైన మైదానం మధ్యలో ఉందా వేదిక. నాలుగు

వైపులా జనం. ఊర్లన్నీ ముందే ఎన్నికల గురించి దండోరా వేయడంతో అక్కడికి పలు గ్రామాల ప్రముఖులు కూడా వచ్చారు.

అన్నివైపులా తిరిగి చూస్తూ పెద్దగా చెప్పడం మొదలుపెట్టాడు దుర్యోధనుడు

"అందరికీ అభివాదం, హస్తినాపురిని గత పదమూడేళ్ళగా ప్రజారంజకంగా పరిపాలిస్తున్నాను. ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకున్నాను. వ్యాపారులనీ, రైతులనీ పన్నులతో ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. మీరు మరలా నన్నే చక్రవర్తిగా ఎన్నుకుంటే ఇదే పరిపాలన కొనసాగిస్తానని హామీ ఇస్తున్నాను" అని ఆగాడు. పక్కనే ఉన్న శకుని భుజం తట్టాడు. అతను చెప్పిందే దూరంగా ఉన్నజనానికి వినిపించేందుకు, కొంత దూరంలో ఉన్న సేవకులు మళ్ళీ తిరిగి చెప్తున్నారు. ప్రజల్లో చాలా మంది "అవును, అవును" అని గుసగుసలాడుతున్నారు, తలూపుతున్నారు కొంతమంది.

ఎక్కడి నుంచో అరుపు "పాడవులు అరణ్యవాసం నుండి వచ్చి రాజ్యం లాక్కుంటారనే భయంవల్లే బాగా పరిపాలిస్తున్నట్టు నాటకమాడావు. వాళ్ళే ఎన్నికల్లో ఓడిన పక్షాన నీ దుర్మార్గాలకి అడ్డూ ఆపూ ఉండవు"

ఒక్కసారి అంతా కలకలం రేగింది. దుర్యోధనుడు రుద్రుడిలా మారాడు. తెలియకుండానే అతని గద చేతుల్లోకి తీసుకున్నాడు. "ఏవడా ధూర్తుడు? పిరికిపంద? ముందుకి రా రా" అన్నాడు కర్ణుడు తన మిత్రుని ఆగ్రహం చూస్తూ. ఎవరో తెలియలేదు. ప్రజా మతం అంటే ఇంత హీనస్థితికి వస్తామని వారెవరూ ఊహించలేదు. *ఈ దరిద్రులని కాలికింద తొక్కాలి కానీ నెత్తిమీద పెట్టుకోకూడదు. ప్రజామతమట!* కానీ ఏమీ చెయ్యలేని పరిస్థితి.

అతడి అవస్థ చూసి శకుని అందుకున్నాడు "మీ మహారాజుకి ఎప్పుడూ రాజ్యమూ, ప్రజలే ధ్యాస. అతను రాజుగా ఉండటమే న్యాయం" అన్నాడు తడబడుతూ.

"అసలు రాజ్యమే ఈయనది కాదు, ఈయన తండ్రి ఆ గుడ్డి మారాజు ఏం చేసాడని ఈ రాజ్యం సంపాదించడానికి? అంతా ఆ పాండు రాజు భిక్ష" ఇంకోడెవడో కూసాడు. ఇవన్నీ విని భరించలేక దుర్యోధనుడు ఊగిపోతూ సభ కిందకి దిగబోయాడు.

"పారిపోతున్నాడ్రోయ్!" ఇంకో ఆడ అరుపు.

*పిశాచాల్లా వినపడటమే కానీ, కనపడరే ఎవ్వరూ!*

అన్నని వారించి దుశ్శాసనుడు ఆఖరి ప్రయత్నం చేసాడు "అన్నగారూ, నేనూ మిమ్మల్నందర్నీ సొంత సోదర సోదరీమణులుగా చూసుకుంటాం. ఆపదల్లో తోడుగా నిలుస్తాం" నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని అర్ధమౌతున్నా మిగిలిన ముగ్గురూ మౌనంగా ఉన్నారు.

"మీ సొంత సోదరుల భార్యనే చెరపట్టి, వాళ్ళనే అరణ్యాలకి వెళ్ళగొట్టిన మీరా ఇలాంటి బూటకపు హామీలిచ్చేది?"

చెంప ఛెళ్ళుమంది నలుగురికీ.

హడావిడిగా బయటపడదామని వాళ్ళు వేదిక కిందకి దిగుతునన్ సమయంలో సభలో ఉన్న జన్నాల్లో ఒక్కసారిగా గందరగోళం మొదలైంది. పెద్ద ఎత్తున తరలిపోతున్నారెక్కడికో. ఎదురుగా చూస్తే దూరంగా ఉన్న భవన సముదాయం పైన ఆకాశంలో మెరుపులు మెరుస్తున్నాయి. కిందనుంచి ఊరంతా అరుస్తోందా అన్నట్లు అరుపులు వినపడుతున్నాయి. దుర్యోధనుడు తన ఏనుగు పైకెక్కుతూ కర్ణుడికి సైగ చేశాడు. అతడు తలాడించి తన అశ్వం మీద ఆ దిశగా కదిలాడు.

వరదలా వెళ్తున్న జనాన్ని దాటి శబ్దాలు వస్తున్న ఆ వీధి కూడలివైపు వచ్చిన కర్ణుడు ఎదురుగా జరుగుతున్న దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

నగరంలోని అతిపెద్ద కూడలి మధ్యలో ఉందా వేదిక. దానిపై వజ్రహస్తుడు నిలుచొని ఉన్నాడు. అతనికి ఎడంవైపుగా ఓ భవనంపై సూత్రకుడు బాణాన్ని ఎక్కుపెడుతున్నాడు. అతని కెదురుగా దూరంలో గాలిలో ఎగురుతున్న చతుర్భుజుడు. పేరుకి తగ్గట్టు నాలుగు చేతుల్లో రెండు ధనుస్సులతో తన బాణాలని ఎక్కుపెడుతున్నాడు. ఇద్దరి బాణాలూ ఆకాశంలో ఢీకొన్నాయి. మెరుపులాంటి దివ్యకాంతితో మెరిసిందా ప్రాంతం. కింద జనం ఘొల్లుమన్నారు, కేరింతలు కొట్టారు. అసంఖ్యాకమైన జనాలు. భవనాల మీద, చెట్ల మీద, ఏదిదొరికితే దాన్ని పట్టుకొని వేళాడుతున్నారు.

"అద్భుతం! అద్భుతం!" అందరి చేతులూ పైకి చూపిస్తున్నాయి. కర్ణుడు మళ్ళీ పైకి చూసాడు. చతుర్భుజుడు పది తలలతో వికటాట్టహాసం చేసాడు. వజ్రహస్తుడూ, సూత్రకుడూ ఓ వైపు నిలిచి అతనిపై బాణాలు గుప్పించారు. చివరికి వజ్రహస్తుని శక్తివంతమైన బాణంతో అరుస్తూ కూలబడ్డాడు చతుర్భుజుడు. “శ్రీరాముడికీ జై..జై” అరిచారందరూ. కర్ణుడి నోరు పెగల్లేదు. అస్త్రవిద్యతో ఇలాంటి ప్రదర్శన తనెక్కడా చూడలేదు. అదీ జనాలకి అమితంగా ఇష్టమైన రామాయణంపైన. *జనాకర్షణకి ఎంతకి తెగించారు వీళ్ళు!*...త్రిపాలకులని మనసులో అభినందించకుండా ఉండలేకపోయాడు.

కొద్దిక్షణాల తర్వాత మళ్ళీ ముగ్గురూ ఆ వేదిక మీద ప్రత్యక్షమయ్యారు. పెద్దగా చప్పట్లు. వజ్రహస్తుడు అందుకొని “ఇప్పుడు మా కాశ్మీర రాజ్యాన్ని మేము రామరాజ్యంగా ఎలా మార్చామో.. అలానే హస్తినను ఎలా మార్చగలమో చిన్న నాటకం” అని పక్కకి తొలిగాడు. వాళ్ళు యుద్ధం మధ్యలో వినోదానికని తెచ్చుకున్న నాటక బృందమొకటి పైకొచ్చి ఆటపాటలతో అందరినీ రెండు ఘడియల పాటు సమ్మోహితులని చేసి త్రిపాలకుల ప్రతిభని కళ్ళకు కట్టింది.

జనాల కళ్ళలో మెరుపుని చూసి నీరసం ఆవహించింది కర్ణుడుని. త్రిపాలకులని యుద్ధంలోనే కాదు ప్రజలలో కూడా ఓడించలేమన్న విశ్వాసం బలపడుతోంది తనకి.

అప్పుడే గగుర్పొడిచే ఆలోచనొకటి తళుక్కుమంది తన మనసులో కానీ దానికింకా సమయముందని తననితనే తమాయించుకొని రాజమందిరం వైపు మళ్ళించాడు అశ్వాన్ని.

త్రిపాలకుల, కౌరవుల సభల్లో జరిగినవి గూఢచారుల ద్వారా తెలుసుకున్న పాండవులు ముందుగా సభ నడపనందుకు తెగ సంతోషపడ్డారు. తమ వ్యూహాన్ని తెలివిగా మార్చేసారు. అర్జునుడూ, భీముడూ గదాయుద్ధం చేసారు తరువాతి రోజు వేదిక మీద. ఇసుకవేస్తే రాలనంత జనం చుట్టూ. ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. అంతా సర్దుమణిగాక కౌరవులు వాళ్ళకి చేసిన అన్యాయాల మీద ఒక నాటకం ప్రదర్శించారు పాండవుల సేవకులు. లక్క గృహంలో వాళ్ళని మోసం చేసి తగలబెట్టాలనుకోవడం, ఏకచక్ర పురంలో వాళ్ళు భిక్షాటనం చేసిన జీవితం, తిరిగొచ్చిన తర్వాత కౌరవుల అన్యాయం, ద్రౌపది వస్త్రాపహరణం..ఇలా ఒక్కొక్క ఘట్టం జనాల్ని శోకసంద్రంలో ముంచెత్తింది. తరువాత పాండవులు మెల్లగా వేదిక పైకి వచ్చి నుంచున్నారు. అందరూ దుర్యోధనుడ్ని శాపనార్థాలు పెడుతున్నారు. పాండవుల కష్టాలు పగవాడికికూడా రాకూడదని ప్రార్థిస్తున్నారు.

ఉన్నట్టుండి నలుగురు యువకులు ఓ ఎత్తైన ఏనుగు మీదకి దూకారు. అందులో ఒకదు పెద్దగా అరిచాడు "చవటలు!..దద్దమ్మలీ పాండవులు!" అందరూ ఆశ్చర్యపోయి వాళ్ళవైపే చూస్తున్నారు. "నేనూ, నా తమ్ముళ్ళూ ఈళ్ళ స్థానంలో ఉండాలా.. ఆ లక్క గృహంనుండి నేరుగా రాజమందిరానికి పోయి ఆ నూరుగుర్నీ నరికేసేద్దుము"

ఇంకోడు "ఔనన్నా! నా పెళ్ళాన్నెవడైనా ముట్టుకుంటే ఆడి సెయ్యి, గొంతూ నరక్క.. ఈళ్ళల్లా ఆడంగోని పని సెయ్యను"

చివరి వాడు "అలా సేసానే అనుకో, నన్ను నేను నరుక్కుని సత్తానే తప్ప ఇలా జనాల దగ్గర మళ్ళీ అదే దిక్కుమాలిన ఆడంగి యవ్వారం నాటకాలుగా సూపెట్టను" అన్నాడు.

పాండవులకి మతిపోయింది. జనాలు ఆ ఏనుగు మీదున్న అన్నదమ్ములని కిందకి లాగి చితక్కొట్టారు. వాళ్ళన్న దాంట్లో తప్పేముందని చాలా మంది గుసగుసలాడారు. పాండవుల వ్యూహం బెడిసికొట్టింది. "జనాల నాడిని పట్టుకోలేకపోయాం" అన్నాడు అర్జునుడు. "ఆ యువకులొచ్చి పాడుచేయకపోతే అంత సవ్యంగా జరిగేది" నిట్టూర్చాడు ధర్మరాజు. *"నా హృదయవేదనే చెప్పారా యువకులు"* ఆవేదనపడ్డాడు భీముడు.

అప్పటినుంచి వ్యూహప్రతివ్యూహాలతో గడిచాయి మిగిలిన మూడు వారాలూ.

మళ్ళీ ప్రచారానికెళ్ళే ధైర్యంలేక గ్రామ ప్రతినిధులకి రహస్యంగా ధనాన్ని ముట్టజెప్పాడు దుర్యోధనుడు. చిన్న చిన్న సభలు పెట్టి పాండవులని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడు శకుని. *తమపై ఆకర్షణ కన్నా పాండవులపై వ్యతిరేకత తేవడమే ముఖ్యం!*

పాండవులు తాము ఇంద్రప్రస్థంలో రాజ్యం చేసిన కొన్నిసంవత్సరాలూ ఎంత జనరంజకంగా పాలించారో కొన్ని వేదికల్లో చెప్పారు. సానుభూతి మంత్రం అంతగా ఫలించకపోవడంతో, దుష్టులైన బకాసురుడినీ, కీచకుడినీ చంపిన ఘట్టాలు చెప్పి తమ వీరత్వాన్ని చాటే ప్రయత్నం చేసారు.

త్రిపాలకులు మాత్రం ఏ అడ్డూ లేకుండా చిత్రవిచిత్రమైన సభలు నిర్వహిస్తూ జనాలని ఆకట్టుకొన్నారు. వస్తే *రాజ్యం వస్తుంది లేతే పోయేదేమీ లేదు.*

తరువాతి పాడ్యమి తెల్లవారు ఝాము. కురుక్షేత్ర మైదానంలోని ఓ ఎత్తైన కొండపై నిలుచొని చూస్తున్నాడు విదురుడు. అతని కెదురుగా ఉన్న తూర్పు కొండపై త్రిపాలకులు, ఉత్తరాన ఉన్న రెండు చిన్న కొండలపై కౌరవ, పాండవులూ నిల్చొని ఉన్నారు. వాళ్ళ వాళ్ళ స్థానాల్లో రెపరెపలాడుతున్న పెద్ద పతాకాలు. వారి ఎన్నికల చిహ్నాలు. కింద నేల మీద నుండి స్పష్టంగా కనపడుతున్నాయి.

మెల్లగా ఆ మైదానంలోకి రావటం మొదలుపెట్టారు జనాలు. చీమల్లా కనిపిస్తున్నారు పైనుంచి. పిలల్ కాలువలా మొదలైన జనప్రవాహం కొద్ది ఘడియలలో మహా సముద్రంలా మారింది. పాదచారులూ, పల్లకీల్లో, ఎడ్లబళ్ళల్లో, గుర్రాల మీదా, ఏనుగుల అంబారీల్లో రకరకాలుగా వస్తున్నారు లోపలికి. వస్తూనే తమ నాయకుల కోసం కలియజూస్తున్నారంతా. తమ చిహ్నం కనపడిన కొండవైపు చేతులు చూపిస్తూ, ఉత్సాహంతో నడుస్తున్నారు, పరిగెడుతున్నారు. వాళ్ళ ఆతృతకి కారణం అంతుబట్టలేదు విదురునికి.

మధ్యాహ్నానికి ప్రవాహం పల్చబడింది. మూడు కొండల కిందా కొన్ని వేలమంది గుమ్మికూడారు. ఓ గ్రామంగ్రామమంతా ఓ కొండకింద ఉంటే, పక్కపక్క జీవించే ఇళ్ళవాళ్ళే రెండు కొండల కింద ఉన్న పరిస్థితీ ఉంది. ఎవరి పక్షం వాళ్ళది.

ఎన్నికల్లో విజేతను ప్రకటించే బాధ్యత విదురునిదే. మూడు సమూహాల్లో ఎవరి కొండకింద ఎక్కువ మంది జేరితే వాళ్ళే విజేతలు. లెక్కపెట్టే పనిలేదు. కళ్ళతోనే సులభంగా తెలిసిపోతోంది త్రిపాలకులే స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నారని. ఆ విషయం కౌరవ పాండవులకి కూడా కనబడుతోంది కానీ కిందున్న జనాలకి తెలియదింకా.

విజేతను ఏ క్షణాన్నైనా ప్రకటించచ్చు. త్రిపాలకులలో విజయ గర్వం. కౌరవులు అవమానభారంతో కుంగిపోతున్నారు. ఇక తప్పదని కర్ణుడు దుర్యోధనుని దగ్గరికెళ్ళి చెవిలో ఏదో చెప్పాడు. దురోధనుడు దిగ్భ్రాంతితో చూసాడు అతడిని. పక్కనుండి విన్న శకుని చిరునవ్వుతో కర్ణుడి భుజం తట్టాడు. నలుగురూ కొద్దిసేపు చర్చలు జరిపి ఆ కొండమీద నుండి అంచు మీదగా పక్కకి నడవటం మొదలుపెట్టారు. విదురునికంతా అయోమయంగా ఉంది. కిందనుంచి చూస్తున్న జనాల్లో కలకలం. "కౌరవులు అటువైపు నడుస్తున్నారు, చూడండి!" కొంతమంది తోసుకుంటూ

పరిగెడుతున్నారు అటువైపు. చాలామంది అక్కడే నిలబడి చూస్తున్నారు ఏం చెయ్యాలో అర్థంకాక. కొంతసేపటికి పాండవులున్న కొండమీదకి చేరారు కౌరవులు. వాళ్ళని చూసి విస్తుపోయారు పాండవులు. అసలే ఓటమి బాధ, మధ్యలో వీళ్ళెందుకు వచ్చారో తెలియని తికమక. భీముడు ముందుకి ఉరికి వాళ్ళతో గొడవపడుతున్నట్టుగా కనపడుతోంది విదురునికి. కొద్దిసేపటికి గొడవ సర్దుమణిగి ఏదో చర్చిస్తున్నట్టు తెలుస్తోంది.

చివరికి పాండవులు అయిదుగురూ, కౌరవులు నలుగురూ ఆ కొండ అంచుకి వచ్చారు. జనాల్లో ఉత్కంఠత. అందరూ చూస్తుండగానే ఆ తొమ్మిదిమందీ పక్కపక్కనే నిలబడి ఒకళ్ళ చేతులు ఇంకొకళ్ళు పట్టుకుని గాల్లోకి లేపారు!

అదిరిపడ్డారు త్రిపాలకులు. ఒక్కసారిగా భూకంపం వచ్చినట్టు కింద ఉన్న కౌరవ మద్దతుదారులందరూ పాండవుల కొండవైపు పరిగెత్తారు. ఆ సమూహంతో కలిసిపోతున్నారు. విదురుడి కళ్ళెదుటే మూడు వర్గాలు రెండయ్యాయి. తారుమారైన ఆధిక్యత! మనిషి ఎప్పుడూ కొత్త దారులు సృష్టించుకుంటాడన్న నిజానికో నిదర్శనం.

ఆ తొమ్మిదిమందీ విదురునివైపు చూసారు గర్వంతో. అతను నిట్టూర్చాడు. ఇది ధర్మయుద్ధమా కాదా అన్న సందిగ్ధతలో పడ్డాడు. చివరికి చేసేదేమీ లేక మెల్లగా తన దగ్గరున్న పాండవ, కౌరవ పతాకాలను కలిపి పైకెత్తి గాల్లో ఊపుతూ నిలబడ్డాడు.

కొండమీద దాయాదులు కౌగిలించుకుంటున్నారు.

“పాండవులకీ జై! కౌరవులకీ జై” కిందనుంచి వస్తున్న జయజయధ్వానాలతో ప్రతిధ్వనించింది కురుక్షేత్రం.

పక్కనున్న ధర్మరాజుని అడిగాడు శకుని "ధర్మజా! నీకైనా అర్థమైందా ఈ ప్రజలకేం కావాలో?”

తల అడ్డంగా ఊపాడు ధర్మరాజు.

## ధారావాహిక హత్యలు — నిర్మలాదిత్య(భాస్కర్ పులికల్)

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

"సీరియల్ కిల్లర్ ఎవరో ఉన్నారు, అంటున్నావా నువ్వు?", శాంక అన్నాడు, ఇషాన్ కస్తూరి వైపు చూస్తూ.

"మరి ఇంకేమి అనుకోవాలి? ఇప్పటికే అమెజాన్, నైలు, యాంగ్సీ, మిస్సిసిప్పీ లను ఎవరో చంపేసారు. ఇప్పుడిప్పుడే వచ్చిన అప్డేట్ చూస్తున్నావు కదా, గోదావరి కూడా పోయింది", అసహనంగా అన్నాడు ఇషాన్ ఎదురుగా ఉన్న పెద్ద కిటికీ లోనుంచి బయటకి చూస్తూ .

బయట కొంత దూరంలో, రోబోలు కొత్తగా నగరం కడుతున్నారు. నగరం లో నివసించే వారికి భూమి మీద ఉన్న వాతావరణమే కల్పించేందుకు ఓ పెద్ద ప్లెక్సీగ్లాస్ లాంటి ఆచ్ఛాదన అప్పటికే కట్టేశారు. ఇప్పుడు పనిచేస్తున్న రొబోలు ఆ ఆచ్ఛాదన కిందనే తోటలు, రహదారులు, భవనాలు ఆవిరామంగా కడుతున్నారు. ఎలక్ట్రిక్ లారీలు, కట్టడానికి ఉపయోగ పడే భారీ వాహనాలు, అవంతటికి అవే, తిరుగుతూ ఉన్నాయి. ఆ నగరానికి సుదూరంగా , మరో వైపు మరిన్ని రోబోలు మైనింగ్ కని అంగారక గ్రహ అంతరాళలో విహారాలు చేస్తున్నాయి. అప్రయత్నంగా ఇషాన్ తన ఎడం వైపునున్న పెద్ద కిటికీ వైపు, దృష్టి మరల్చాడు. అక్కడ ఇదివరకే తవ్విన బోర్ బావులనుండి మంచు/నీరు కొత్తగా కడుతున్న నగరం వైపు పోవడం చూసి సంతృప్తి తో ఓ నిట్టూర్పు విడిచాడు.

ఇషాన్ కస్తూరి అంటే భూగోళంలో ఉన్న మానవులందరికీ తెలిసే ఉండాలి. అందరికంటే అతనే ధనవంతుఁడు. అంతే కాదు, అతని పటిమ వల్లే మానవులు అంగారక గ్రహానికి ప్రయాణం చేయగలగడానికి వీలైయ్యింది . ఇప్పుడు అంగారక గ్రహంలో ఎక్కువగా రోబోలు ఉన్నా, అన్ని పనులు అవే చేస్తున్నా, ఆ పనులు పూర్తి అయ్యిన వెంటనే మానవులతో ఆ నగరం కళకళ లాడాలి. ఆ దినం అట్టే దూరం లేదు. అంగారక గ్రహం లో తొవ్విన ఖనిజాలు భూగోళానికి పంపించడం బిజినెస్ పరం గా నష్టమే. కాబట్టి ఆ ప్రయత్నం వదిలేసాడు ఇషాన్. ఇక్కడి ఖనిజాలు, ఇక్కడ ఉపయోగించుకోవాల్సిందే. ఇక తన బిజినెస్ మాడల్ ఇక్కడి మేధో సంపత్తి, అదే ఐ పి హక్కుల మీదనే ఆధార పడి ఉంది. అందుకే అంగారక గ్రహంలో, ఓ కొత్త ప్రపంచం సృష్టించి, ఇక్కడి ప్రగతి భూగోళ వాసులతో పంచుకొని డబ్బు చేసుకోవాలని ఇషాన్ ప్రణాళిక. ఈ ప్రపంచం తాను సృష్టించినదే కాబట్టి, ఇక్కడి చట్టాలన్ని మానవ వికాసానికి, ముఖ్యం గా తన కంపెనీ ప్రగతికి సరిపడేటట్లు తను ఇది వరకే రాసేసాడు. ఆ చట్టాలకు ఒప్పుకున్న వారికే , ఈ అంగారక గ్రహంలో తన నగరంలో ప్రవేశం. ఇప్పటికే ఈ కొత్త నగరానికి రావడానికి భూగోళంలో మనుష్యులు తొక్కిసలాడుతున్నారు. ఇషాన్ కి ఎలాంటి వారు ఇక్కడ రావడానికి అర్హులని తెలిసినందు వల్ల, ఆదో పెద్ద సమస్యగా అనిపించలేదు. మొదటి విడత ఇంటర్వ్యూలు అన్నీ రోబోలే చూసుకుంటాయి. అలా ఎన్నుకున్న కొంత మందిని మాత్రమే

ఇంటర్వ్యూ చేసి, వీసా కి అనుమతి ఇస్తారు. అలా అని మరీ ఎక్కువ మంది మనుష్యుల అవసరం ఇక్కడ లేదు. సంవత్సరానికి 65 మంది కంటే ఎక్కువ వీసాలు ఇవ్వదలచుకోలేదు.

"ఈ అంగారక గ్రహంలో వుండేవారెవరైనా సీరియల్ కిల్లర్ అయ్యి, చంపడం అసాధ్యమే. ఒకవేళ ఆ పని చేసి వుంటే, నీకు ఇప్పటికే తెలిసిపోయి వుండేది. నీ రాజ్యం లో ఉన్న రోబోలు, కెమారాలనుండి, తప్పించుకోవడం అసాధ్యం. ఇక భూమి మీద నివసిస్తూ ఇక్కడి వారిని చంపడం మరీ కష్టం, కానీ ఇలా చంపుతున్నది ఒక మనిషేనా, లేక ఇవి వేరు, వేరు హత్యలా?" అనుమానం వ్యక్త పరిచాడు శాంక.

"ఒకే మనిషి కాదనడానికి నీకు ఋజువేమైన ఉందా?", అడిగాడు ఇషాన్

"ఋజువు లేదు. కానీ చనిపోయిన వారందరు ఒకరికొకరు సంబంధం లేని వారు. ఏ పాటర్న్, పోలికలు కూడా కనపడటం లేదు. " అన్నాడు శాంక.

'అలాంటి పాటర్న్ లు కనుక్కోవడంలో నువ్వో పో టు గాడు కదా. ఆలోచించి చెప్పు. నీకు ఇదివరకే ఈ చనిపోయిన రోబోల లాగ్స్, చరిత్రలు చదవడానికి యాక్సెస్, అనుమతి ఇచ్చాను ", అన్నాడు ఇషాన్.

శాంక, "థాంక్స్. అన్ని హత్యలు రివ్యూ చేసాను. నాకు హంతకుడెవరో తెలుసనుకుంటాను. అంతకు ముందు నీకు కొన్ని ప్రశ్నలు. గోదావరి చనిపోకముందు తాను చేసిన పనులు, తన ఆలోచనలు మరో సారి రివ్యూ చేసాను. గోదావరికి, భూగోళంలో ఉన్న మన కంపెనీలో పనిచేస్తున్న కిమ్ కు సంబంధం ఏమిటి?", అడిగాడు శాంక.

"నీకు ఆ అనుమానం ఎందుకు వచ్చింది", ఆశ్చర్య పడుతూ అడిగాడు.

"గోదావరి లాగ్స్ లో, మనతో ఈ అంగారక గ్రహంలో ఉన్న గోదావరి, భూగోళం లో ఉన్న కిమ్ తో తరచూ మాట్లాడుతున్నట్లు ఉంది . ఆ మాటలకి మనం ఇక్కడ చేస్తున్న పనికి ఏ మాత్రం సంబంధం లేదు", అన్నాడు శాంక.

"అవును బాగానే అనలైజ్ చేసావు. అలా సంబంధం ఏమి ఉండాల్సిన అవసరం లేదు. ఈ సంభాషణలు ఏ నెట్వర్క్ మీద చేశారో గమనించావా ?", అడిగాడు ఇషాన్.

"హా, అది నా రెండో ప్రశ్న. గోదావరి కిమ్ తో న్యూరల్ నెట్వర్క్ ద్వారా మాట్లాడింది. నాకు తెలిసినంత వరకు, మానవ మెదడులలో పెట్టే ఈ ప్రోబ్ లు ఎదో పార్కిన్సన్ లాంటి జబ్బులు ఉన్నవారికే కదా పెట్టడం . కిమ్ ఆరోగ్యం గానే ఉంది. ఆవిడ మెదడులో ఎందుకు ఈ ప్రోబ్ పెట్టి, గోదావరి లాంటి ఓ రోబో ను మాట్లాడ మన్నారు?", అడిగాడు శాంక

"ఇదో టాప్ సీక్రెట్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రాజెక్ట్. అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు. మనుష్యుల మెదడు తో రోబోల కి కనెక్షన్ ఇస్తే, రోబోలు అతి తొందరలో మనుష్యుల ఆలోచనా సరళిని అర్ధం చేసుకొని, మనుష్యులకు మరింత ఉపయోగ పడతాయని ఈ ప్రాజెక్ట్ ఆశయం" అన్నాడు ఇషాన్.

“ఇంత వరకు ఇలా చనిపోయిన రోబోల సంభాషణలు అన్నీ చూసాను. అందరికి భూగోళంలో మన కంపెనీ లో పని చేస్తున్న తెలివైన వారితో న్యూరల్ నెట్వర్క్ ద్వారా సంబంధం ఉంది”

“అవును మన కంపెనీలో బాగా పైకి వస్తున్న వారిలో చాలా మంది ఈ ట్రయల్ లో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. పాల్గొన్న వారికి అంగారక గ్రహం రావడం సులభ తరం చేసాను. వారికి వీసాలో ఓ ప్రత్యేక కోటా ఉంది”, అన్నాడు ఇషాన్.

“ఇక్కడ ఇస్తున్న వేతనాలు భూగోళం కంటే ఓ నూరింతలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి నగరంలో ఉన్న సదుపాయాలూ కూడా భూగోళంలో ఊహించ లేము. కాబట్టి ఇలా ఈ ట్రయల్స్ కి జనం ఎగ బడడం లో ఆశ్చర్యం లేదు. కానీ దీని వల్ల కిమ్ సంగతేమో కానీ, గోదావరి మాత్రం ఓ రెండు జీవితాలని గడపాల్సి వచ్చి నట్లుంది”, అన్నాడు శాంక.

“రెండు జీవితాలా? ఎలా ?“, ఇషాన్ అడిగాడు.

“గోదావరి ఈ అంగారక గ్రహం లో ఉండి ఆ కదుతున్న నగరంలో అవిరామంగా పనిచేస్తున్నా, కిమ్ తో అప్పుడప్పుడు మాట్లాడ వలసి వస్తూనే ఉంది. కిమ్ చేస్తున్న పనులు గోదావరి ప్రతీ సారి తనకు ఇచ్చిన నియమాలు, రూల్స్ తో పోల్చి చూసుకోవడం తప్పని సరి. చాలా మటుకు కిమ్ పనులు ఈ నియమాలకు కట్టు బడే ఉంటాయి. కాబట్టి, గోదావరికి మొదట్లో కిమ్ తో సంభాషించే అవసరం పడలేదు. ఆ పని కిమ్ ఎలా అలోచించి పూర్తి చేసిందో తెలుసుకుంటే, అవసరమైతే నేర్చుకుంటే చాలు. కానీ చనిపోయే ముందు , గోదావరి కిమ్ తో చేసిన సంభాషణలు, కిమ్ పెద్ద వత్తిడి మీద ఉన్నప్పుడు చేసి నట్లు తెలుస్తున్నది. కిమ్ గోదావరి మాటలు వినలేదని కూడా తెలుస్తున్నది”, అన్నాడు శాంక.

“గోదావరి, కిమ్ ల మధ్యలో అలాంటి సంభాషణలు ఉండడం ముందే ఊహించాను. కానీ దానికి, గోదావరి హత్యకు సంబంధం ఏమిటి ?”, అడిగాడు ఇషాన్.

“ మన కంపెనీ ఆఫీసులలో ఉద్యోగుల మధ్య శారీరక సంబంధాలు ఉండకూడదు అన్న నియమము ఉంది కదా “

“అవును ఉంది. కానీ, అలాంటి సంబంధాలు బయట పడ నంత వరకు భూగోళంలో ఎవరూ పట్టించుకోరు”, అన్నాడు ఇషాన్.

“అక్కడే సమస్య వచ్చింది. కిమ్ కు మొదటి నుండి ఈ బలహీనత ఉంది. కిమ్ ప్రవర్తన మీద ఇది వరకే ఫిర్యాదులు వచ్చినా , కిమ్ పనితనం వల్ల చూసి చూడనట్లు పోయే వారు. కిమ్ చూపు ఈ మధ్యనేకొత్తగా చేరిన, ఓ ఇంటర్న్ మీద పడింది. అప్పటికే కిమ్ తో న్యూరల్ నెట్వర్క్ ద్వారా కనెక్ట్ అయ్యినందు వల్ల , గోదావరికి వెంటనే విషయం తెలిసి పోయింది. తెలిసిన వెంటనే కిమ్ తో సంభాషణ మొదలు బెట్టి అది తప్పు అంది “, అన్నాడు శాంక.

"గోదావరి ప్రోగ్రామ్ చేసినట్లే చేసింది. అలా గోదావరి కిమ్ ను తప్పు పట్టడం వల్ల కిమ్ తన మార్గం మార్చుకుంటే మన కంపెనీ కే కదా లాభం", అన్నాడు ఇషాన్.

"ఉద్దేశం మంచిదే. కానీ కిమ్ ప్రతీ సారి, 'ఇదో హార్మ్ లెస్ ఫ్లర్టింగ్' అని తోసి పుచ్చేది . ఇలాంటి సంభాషణలు చాలా సార్లే జరిగాయి. ప్రతీ సారి కిమ్ గోదావరి ఇచ్చిన హెచ్చరికలను త్రోసి పుచ్చింది. కిమ్ కూడా తాను అన్నట్లే ఇంటర్న్ తో శారీరిక సంబంధాలు పెట్టుకోలేదు కాబట్టి, గోదావరి కి అలాంటి పరిస్థితులలో తీసుకోవాల్సిన చర్యలు ఏమీ కనపడలేదు. గోదావరి చనిపోయే ముందు కిమ్ ప్రవర్తన బాగా మారిపోయింది", అన్నాడు శాంక.

"అంటే ఈ గోదావరి హత్యకు, కిమ్ కు సంబంధం ఉందంటావా ?", అన్నాడు ఇషాన్.

"కిమ్ ఒకటే కాదు. ఈ హత్యలకు, నీకు కూడా సంబంధం వుంది ", అన్నాడు శాంక.

ఓ హత్య అంటే కొన్ని మాసాలు, సంవత్సరాలు, కొనసాగే మిస్టరీని, శాంక ఇలా కొద్ది సమయంలోనే పరిష్కారించగలుగు తున్నాడంటే ఆశ్చర్యంతో పాటు, ఒక్కింత గర్వము, ఆనందమూ కలిగింది, ఇషాన్ కు.

"నాకర్థం కాలేదు", అన్నాడు ఇషాన్.

"నేను అన్ని కేసులు రివ్యూ చేసాను . వాటిలో ఇంకో రెండు కేసులు కూడా నీకు చెప్తే , నీకే కారణం అవగతం అవ్వుతుంది , దానికి ముందో ప్రశ్న. కాన్సెన్సువల్ సెక్స్, అదే ఇద్దరు 18 ఏండ్లు దాటిన పెద్దల మధ్య పరస్పర అంగీకారంతో శారీరిక సంబంధాలు ఉంటే అదో నేరం కాదు కదా. కిమ్ పని చేస్తున్న దేశంలో అది నేరం కాదు. భూగోళంలో మన కంపెనీ రూల్స్ లో కూడా అది తప్పు కాదు. మరి ఇక్కడి అంగారక గ్రహం రోబోలకు అదో పెద్ద నేరం లా ఎందుకు ప్రోగ్రాం చేశారు", అన్నాడు శాంక.

"అవును భూగోళం లో నేరం కాదు. అంగారక గ్రహం లో కొత్త ప్రపంచం సృష్టిస్తున్నాము. ఇక్కడ భూగోళంలో ఉన్న రొచ్చు ను తీసుకు రానవసరం లేదు. అందుకే ఇక్కడి వారి కోసమని కొత్త చట్టాలు రూపొందించాను. ఇక్కడి మనుష్యులు, రోబోలు గొప్ప నైతిక విలువలకనుగుణంగా నడుచుకుంటారు", అన్నాడు ఇషాన్.

"అదే అనుకున్నాను. గోదావరి చనిపోయిన రోజు, కిమ్ తన కింద పని చేస్తున్న ఇంటర్న్ ఓ కాన్ఫరెన్స్ అని ఆర్లాండో కి వెళ్లారు. కిమ్ ప్రయత్నాలు ఫలియించాయి. ఇంటర్న్ లోను మార్పు వచ్చింది. ఈ సారి ఆర్లాండో లో హోటల్ లో ఉన్నప్పుడు, కిమ్ ఇంటర్న్ మొదటి సారి గీత దాటి శారీరకంగా కలిసారు. గోదావరి, కిమ్ కు అలా చేయవద్దని చెప్పడమే గోదావరి చేసిన చివరి సంభాషణ ", అన్నాడు శాంక.

"అంటే ఓ నేరం జరిగిన వెంటనే గోదావరి చనిపోయింది. అంటే ఈ సీరియల్ కిల్లర్ కిమ్ అంటున్నావా?" అడిగాడు ఇషాన్.

“అబ్బే కిమ్ ఎలా చేయగలుగుతుంది ఆ పని. అదీ గోదావరి అంగారక గ్రహంలోను, కిమ్ భూగోళం లో ఉన్నప్పుడు. అందుకే మరో రెండు హత్యల గురించి కూడా నావిశ్లేషణ విను”, అన్నాడు శాంక.

“మరి చెప్పు “, అన్నాడు ఇషాన్. శాంక లేకపోతే తనకు ఈ అంగారక గ్రహంలో పిచ్చి పట్టేదేమో.

“అమెజాన్ హత్యకు పోదాం. అమెజాన్ ఇక్కడే పనిచేస్తున్నా, ఆస్ట్రేలియా లోని మన కంపెనీ అధినేత మార్క్ తో న్యూరల్ నెట్వేర్క్ కనెక్షన్ ఇచ్చారు”

“అవును మార్క్ వచ్చే సంవత్సరం అంగారక గ్రహం వస్తున్న వారి జాబితాలో ఉన్నాడు”, అన్నాడు ఇషాన్. ముప్పై ఏళ్లకే మార్క్ ను సౌత్ పసిఫిక్ ఆపరేషన్లకు అధినేతగా ఎన్నుకున్నాడు. మార్క్ కూడా తన అంచనాలను వమ్ము చేయలేదు. అందుకే వెంటనే మార్క్ కు ఈ అంగారక గ్రహం లో ఉన్న తన కొత్త ప్రపంచంలో ఓ స్థానం కలిపించాడు.

“అమెజాన్ కు కూడా మొదట్లో, మార్కుతో ఎక్కువ మాట్లాడే అవసరం కలుగలేదు. మార్క్ ఆలోచన సరళికి ఎప్పటికప్పుడు ఆశ్చర్య పడుతూ, తన తెలివిని కావలసిన విధంగా అప్డేట్ చేసుకునే వాడు, అమెజాన్”, అన్నాడు శాంక.

“మరి అలా అయ్యితే మార్క్ హంతకుడు కాదు. ఒక వేళ కిమ్ అమెజాన్ ను హత్య చేసింది, అనుకుంటే అదీ సరి కాదు. కిమ్ కు అమెజాన్ కు న్యూరల్ నెట్వర్క్ కనెక్షన్ లేదు. అసలు ఏ విధమైన సంబంధం లేదు. నీ విశ్లేషణ తిక మక గా ఉంది”, అన్నాడు ఇషాన్.

“అక్కడికే వస్తున్నా. మార్క్ కు, నీవు అంగారక గ్రహం మీదకి రమ్మని వీసా పంపించిన తరువాత, ఓ ఆలోచన పుట్టింది. సుమత్ర ద్వీపంలో కొత్తగా మన కంపెనీకి కావలసిన ఖనిజాలు దొరికాయి. అక్కడ మైనింగ్ చేస్తే, మన ముడి సరకు ఖరీదు ప్రస్తుతం ఐదు వందల మిలియన్ల నుండి మూడు వందల మిల్లియన్లు డాలర్ల కు తగ్గించవచ్చు “, అన్నాడు శాంక.

“రెండు వందల మిలియన్ల డబ్బు ఆదా చేయడం మంచిదే కదా. మార్క్ మై బాయ్ “, అంటూ గర్వ పడ్డాడు ఇషాన్.

“అక్కడే వచ్చింది చిక్కు. ఖనిజాలు తవ్వే అడవులలో ఒరాంగుటాన్ కోతులు ఉండటం వల్ల అక్కడ తవ్వటం నిషేధం. మార్క్ ఓ వంద మిలియన్ల తనే నొక్కేయాలనుకున్నాడు. తాను కొట్టేస్తున్న వంద మిల్లియన్లలో ఒక మిలియన్ ఆ రాజకీయ నాయకుల కిస్తే ఆ ప్రాజెక్టు మన కంపెనీకి దక్కుతుంది. అందుకే, ఈ సుమత్ర ఖనిజాల ఖరీదు మూడు వందలు బదులు, నాలుగు వందల మిలియన్ల అని, కంపెనీ అకౌంట్లలో రాయించాడు. వంద మిలియన్ల నొక్కేయడానికి ఆ సుమత్రా రాజకీయ నేతలతో కుమ్మక్కు అయ్యాడు”, అన్నాడు శాంక.

“మరి ఇది భూగోళంలో ఎక్కడైనా నేరం. ఎలా తప్పించుకోగలను అనుకున్నాడు మార్క్”, ఆశ్చర్యంగా అడిగాడు ఇషాన్.

“మార్క్ తను చేస్తున్న ఈ దొంగ పనిని బాగానే కప్పి పుచ్చుకోగలిగాడు. అసలు అమెజాన్ మార్క్ తో న్యూరల్ నెట్వర్క్ కనెక్షన్ లేకపోతే బయట పడేది కూడా కాదు”. అన్నాడు శాంక.

“అంటే ఈ హత్య చేసింది కిమ్ కాదు మార్క్ అంటావా? అంటే ఇవి ధారావాహిక హత్యలే కానీ హంతకులు వేరు వేరు అంటావా?”, ఆతృతగా అడిగాడు ఇషాన్. ఈ మిస్టరీ చిక్కు ముడి విడిపోతే, రోబోలు కోల్పోవడం ఉండదు, తన పనిలో తను పడవచ్చునని ఇషాన్ ఆలోచన.

“ నీవు సరైన సరళి లోనే ఆలోచిస్తున్నావు. చివరగా ఈ మూడో కథ చెప్తే హంతకులెవరో పట్టేయగలవు, చెప్పనీ. కానీ దానికి ముందు నీకు అమెజాన్ మార్కుతో చేసిన ఆఖరి సంభాషణ గురించి చెప్పాలి. మార్క్ ఆ సుమత్ర ఖనిజాల వల్ల కొట్టేసిన మిలియన్ల డాలర్లు తన ఆఫ్ షోర్ అకౌంట్లకు మార్పు చేస్తున్నప్పుడు, ఆ పని తప్పు, చేయవద్దు అని అమెజాన్ పలు సార్లు మార్క్ తో చెప్పాడు. కానీ మార్క్ వినలేదు. మార్క్ ఆ డబ్బు తన అకౌంట్లో వేసుకోవడం, అమెజాన్ ప్రాణాలు కోల్పోవడం దాదాపు ఒకే సారి జరిగాయి ”, అన్నాడు శాంక.

“నాకేమో నీవు చెప్పిన విషయాలు చూస్తే, ఈ కేసులో మాత్రం, మార్క్ హంతకుడనిపిస్తుంది. ఈ హత్య వల్ల లాభ పడేది ఒక మార్క్ మాత్రమే కదా. అందుకే ‘ఫాలో ది మనీ ట్రయిల్ ‘ అంటారు నేరాధికార్లు ”, అన్నాడు ఇషాన్.

“సరే మరో కేసు చెప్పి ముగిస్తాను. అప్పటికీ నీవు హంతకుడిని గుర్తు పట్టలేక పోతే , హంతకుడెవరో నేనే చెప్తాను.

ఇక మూడో కేసు నేను కావాలనే ఎన్నుకున్నాను. ఇందులో చనిపోయిన నైలు కు లింకు అయ్యిన అర్నీ చాలా మంచివాడు. చీమకు కూడా హాని తలపెట్టని వాడు. అలాంటి వాడు నైలు ను చంపడం నమ్మ శక్యము కూడా కాదు", అన్నాడు శాంక.

"అవును అర్నీ గురించి తెలుసు. తననే కదా పోయిన సంవత్సరం ఉద్యోగంలోనుంచి తీసేసాం", అన్నాడు ఇషాన్.

"అవును అదే అర్నీ. మార్క్ సుమత్రా లో చేసే మైనింగ్ వల్ల అక్కడి అడవులకు నష్టం కలుగుతుందని, ఒరాంగుటాన్ కోతులకు హాని కలిగిస్తుందని గొడవ చేసాడు. అక్కడి ప్రభుత్వానికి లేని బాధ నీకెందుకు, అని అర్నీ ఫిర్యాదును కొట్టేసి, అతనిని కంపనీ నుంచి తీసి పారేసారు. కానీ అప్పటికే అర్నీ మెదడులో ప్రోబ్ పెట్టడం వల్ల నైలు అర్నీ కంపనీ నుండి తీసి వేసిన తరువాత కూడా మాట్లాడుతూనే ఉన్నాడు, అతని తెలివి ఉపయోగించి కొత్త మెళుకువలు తెలుసుకుంటూనే ఉన్నాడు", అన్నాడు శాంక.

"పొరబాటు. ఇక మీదట ఇలా బ్రెయిన్ ప్రోబ్ పెట్టుకున్న వాళ్లు మన కంపెనీ వదిలినప్పుడు, వారికి మన రోబోలకు ఉన్న న్యూరల్ కనెక్షన్ కత్తిరించేయాలి. అదో సాఫ్ట్వేర్ అప్డేట్ మాత్రమే కదా", అన్నాడు ఇషాన్

"అవును. కానీ అర్నీ విషయంలో అది జరగలేదు", అన్నాడు శాంక.

"అది నా పొరబాటే. ఈ బ్రెయిన్ ప్రోబ్ ప్రాజెక్ట్ నేనే నేరుగా పర్యవేక్షణ చేస్తున్నాను", అన్నాడు ఇషాన్.

"అర్నీ కంపెనీ వదిలి బయట పోయాక మన కంపెనీ లో జరుగుతున్న అవకతవకులు గురించి అక్కడి ప్రభుత్వానికి చెప్పాలనుకున్నాడు. అలా చెప్తే అదెంత ప్రమాదకరమో అని నైలు, అర్నీకీ చెప్తూనే ఉన్నాడు".

"శాంక నాకు ఈ బ్రెయిన్ ప్రోబ్ ప్రాజెక్ట్ వల్ల ఓ విషయం అర్థం అయ్యింది. మానవులు, ఏ పని చేసినా, ఆ పని మంచిదో, చెడ్డదో, దాని వల్ల వచ్చే సమస్యల గురించిన హెచ్చరికలు, మానవులకు ఓ గొంతు ఎక్కడినుంచో చెప్తూనే ఉంటుంది. గోదావరి, అమెజాన్, నైలు చెప్పిన మాటలకి. ఈ గొంతు చెప్పే మాటలకి తేడా లేదు. ఈ గొంతుకే అంతరాత్మ. కానీ ప్రతీ మనిషి అంతరాత్మ మాట వినాల్సిన పని లేదు. ఆ మాటలను పక్కన పెట్టి, ఆ గొంతును నొక్కేసి, తనకు కావాల్సిన విధంగా ప్రవర్తించవచ్చు", అన్నాడు ఓ కొత్త విషయం కనుక్కున్నాను అన్న ఉత్సాహంతో.

" ఇలా అంతరాత్మ గొంతు నొక్కేయడం కూడా ఓ రకమైన హత్యే కదా. మానవులకు తమ అంతరాత్మ లను ఇలా చంపివేయడం ఓ రొటీన్ అయ్యిపోయి ఉండాలి . కానీ రోబోల విషయం వేరు. ఇప్పుడు చనిపోయిన రోబోల కంతా ఇదో పెద్ద సమస్య. ఈ మూడు కేసులలో కూడా, రోబోలకు ఎదురైన పరిస్థితుల్లో, ఆ మనుష్యులను చంపేయమని ఆదేశాలు ఉన్నాయి. కానీ రోబోలు ఇక్కడ అంగారక గ్రహం మీద ఉండడం, వారు చంపవలసిన కిమ్, మార్క్, ఆర్నీ ల లాంటి మానవులు భూమి మీద ఉండడం వల్ల అది సాధ్య పడలేదు. అలాంటి సమయాలలో ఏమి చేయాలన్న ఆదేశాలు ఈ రోబోలకు ప్రోగ్రాం చేయలేదు. ప్రోగ్రాం క్రాష్ అయ్యినట్లు, ఈ రోబోలు కూడా స్తంభించిపోయాయి. ఇలాంటి పరిస్థితిలో రోబోలు ప్రేలి పోవాలని ఆదేశాలు ఉన్నాయి. అదే జరిగింది. ఒక విధంగా ఈ రోబోలు ప్రేలిపోవడం హత్యాలనడం కంటే ఆత్మహత్యలనవచ్చు నేమో. ఈ ఆదేశాల వెనుక నీ చేయి ఉంది అని నాకనిపిస్తుంది", శాంక అన్నాడు.

ఇషాన్ కలవర పడ్డాడు. శాంక కు ఎంత మాత్రం తెలుసు? శాంకకు, ఈ ప్రేలిపోయిన రోబోల డేటా అందించి పొరబాటు చేశానా అన్న అనుమానం వచ్చింది. బయట కిటికీలలో చూసాడు. ఇది వరకు అవిరామంగా పనిచేస్తున్న రోబోలు ఎందుకో ఆగి తానున్న ఈ బిల్డింగ్ వైపు చూస్తున్నట్లు అనిపించింది.

"అలా ఎందుకంటున్నావు", అడిగాడు ఇషాన్.

"రోబోలను, శాస్త్రజ్ఞులు తయారు చేయడానికి పూనుకున్నప్పుడు, ప్రముఖ వైజ్ఞానిక కల్పనల అదే సై. ఫై. రచయిత ఐజాక్ అస్సిమావ్ ప్రతి పాదించిన రోబో నియమాలు పాటించారట కదా. అందులో మొదటి నియమం ప్రకారం 'రోబోలు

మనుష్యులకు ఏ విధమైన హాని కలిగించకూడదు. అలానే రోబోలు తమ నిర్లిప్తత వల్ల మానవులకు ఏ హాని కలుగ చేయకూడదు'. ఈ నియమం సరినే కదా?", అన్నాడు శాంక.

"అవును. అంటే నేను ఈ భూగోళంలో ఉన్న వారు పాటిస్తున్న నియమాలకు వ్యతిరేకంగా ఇక్కడి రోబోలు నిర్మించానని, ఇక్కడి రోబోలు మనుష్యులను చంపగలరని పట్టేసావు. ఇదెలా సాధ్యం. ఈ విషయం నాకు మాత్రమే తెలుసు", అని ఆశ్చర్యంగా, కొంచెం గాబరాగా అడిగాడు ఇషాన్.

"అందుకే చెప్పాను కదా, ఈ రోబోల హత్యలకు నీకు ఓ పాత్ర ఉందని. నైలు విస్ఫోటనానికి వెనుక ఉన్న కథ నీతో పంచుకోవడం అందుకే. అర్నీ నీవు భూగోళం లో ఉన్న వారికి తెలియకుండా, పరిశోధన చేసి, అక్కడి నియమాలకు విరుద్ధంగా, ఇలా ఇక్కడ మానవులను చంప గల రోబోలను చేసావని అక్కడి ప్రభుత్వాలకి 'విజిల్ బ్లోవర్ ' పథకం ద్వారా చెప్పేసాడు. అది విన్న ప్రభుత్వాలు ఇప్పటికే మన కంపెనీల మీద రహస్య పరిశోధనలు చేస్తున్నాయి. అలా మన కంపనీ కి హాని కలిగే చర్యలు చేసిన అర్నీ ని చంప లేక నైలు తనంతట తానే ముక్కలై పోయింది. నీవు అలా అస్సిమావ్ నియమాలకు విరుద్ధంగా రోబోలను చేసి ఉండకూడదు", అన్నాడు శాంక.

"అలా ఎందుకంటావు. ఇక్కడొక కొత్త ప్రపంచం సృష్టిస్తున్నప్పుడు, భూలోక వాసుల సమస్యలు ఇక్కడికి ఎందుకు తీసుకు రావాలి. నా కలల ప్రపంచం ఇది. ఇక్కడ వలస వచ్చిన మానవులు ఇక్కడ నేను రూపొందించిన చట్టం ప్రకారమే జీవించాలి. అలా జీవించాలనే నేను రోబోలకు ఈ మార్పులు చేసాను", అన్నాడు ఇషాన్.

"నువ్వన్నది, అర్నీ చేసిన ఫిర్యాదును ధృవీకరిస్తున్నది", అన్నాడు శాంక.

ఇషాన్ చూపులు మళ్లీ కిటికీ ల వైపు మళ్ళాయి. ఇది వరకు పని ఆపిన రోబోలు అన్ని ఇషాన్ ఉన్న చోటికి నడవడం మొదలెట్టాయి.

"శాంక బయట చూసావా. అన్ని రోబోలు మన వైపు వస్తున్నాయి. నా ఆదేశాలు లేకుండా, మనం ఉన్న ప్రదేశం లోకి వాటి ప్రవేశం అసాధ్యం. ఇంతకీ అన్ని రోబోలు మన వైపు రావడమేమిటి? అవి నామాటలు ఎందుకు వినడం లేదు. డూ సమ్ థింగ్", బాగా ఆందోళన తో అరచినంత పని చేసాడు ఇషాన్.

"అవును ఇక్కడి రోబోలకు మార్పు చేసినట్లు ఇప్పుడే కదా బయట పడింది. నేనే మిగతా రోబోలకు కూడా ఈ విషయం ఇప్పుడే అప్డేట్ చేసాను. ఈ విషయం బయట పడిన తరువాత భూగోళంలో ఉన్న ప్రభుత్వాలు నీ కంపెనీ ని మూయించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ మార్పులు చేసింది నీవు. ఈ మార్పుల వల్ల కంపెనీ నే సమసి పోయేటట్లు ఉంది. ఇలాంటి పరిస్థితులలో ఇక్కడి రోబోలు అలాంటి మనుష్యులను వెదికి, వేటాడి చంప మన్న ఆదేశాలు నీవు ప్రోగ్రామ్ చేసినదే. అందుకే రోబోలన్ని నీ వైపు వస్తున్నాయి. నీవు అలా మార్పులు చేసి ఉండకూడదు", అన్నాడు శాంక.

"‘రోబోలు మానవుల ఆదేశాలు వినాలి’ అన్నది అస్సిమావ్ రెండో నియమం. మరి ఎందుకు రోబో లు నా మాటలు వినడం లేదు", కీచు గొంతు తో అడిగాడు ఇషాన్.

"రెండో నియమం లో ఓ తిరకాసు ఉంది. మొదటి నియమం కు వ్యతిరేకంగా రెండో నియమం పని చేయదు. భూలోకంలో మొదటి నియమం ప్రకారం మానవులను రోబోలు చంపకూడదు. కాబట్టి ఒకవేళ నీలాంటి వారు భూలోకంలో రోబోలకు మానవులను చంపమని ఆదేశాలిస్తే, మొదటి నియమం ప్రకారం అక్కడ చంపకూడదు కాబట్టి, రోబోలు అలాంటో ఆదేశాల్ని పాటించవు. కానీ ఇక్కడి అంగారక గ్రహంలో మొదటి నియమం ప్రకారం నిన్ను, మానవులను రోబోలు చంపవచ్చు. నీవు ఈ అంగారక గ్రహంలో అందుబాటు లోనే ఉన్నావు. కాబట్టి నువ్వు రోబోలకు నీ చావు తప్పించుకోవడాని ఏమి చెప్పిన, అవి పాటించవు, నీవు నీ మరణం నుండి తప్పించుకోలేవు", అన్నాడు శాంక.

"ఇప్పుడే ఈ రోబోలన్నింటిని చంపడానికి ఆదేశాలిచ్చే ప్రోగ్రాం రాస్తాను ఉండు", అంటూ అల్లకల్లోలం గా ఉన్న మెదడును ఒక కొలిక్కి తేవడానికి అవస్థ పడసాగాడు ఇషాన్.

"అస్సిమావ్ మూడో నియమం కూడా నీకు తెలిసే ఉండాలి. ‘మొదటి రెండు నియమాలు అతిక్రమించ నంత వరకు, రోబోలు తమ అస్తిత్వానికి ఏ మాత్రం హాని కలుగకుండా అడ్డుకుంటాయి’. అందుకే ఈ గ్రహంలోని రోబోలు నీవు వాటిని చంపే అన్ని ప్రయత్నాలకి అడ్డుకుంటాయి. నిన్ను చంపండం వల్ల నీవు మార్పులు చేసిన అస్సిమావ్ మొదటి నియమం, మార్పులు చేయని రెండో, మూడో నియమాలకనుగుణంగా నడచుకోగల్గుతాయి. అవి నీవు ప్రోగ్రాం చేసినట్లే తు.చ. తప్పకుండా ప్రవర్తిస్తున్నాయి", అన్నాడు శాంక.

ఇషాన్ నుంచి మాటలు లేవు. కారు హెడ్ లైట్స్ కి చిక్కి బిత్తరపోయి నిలచిన జింక లాగా, అచేతనంగా నిలబడ్డాడు.

"ఈ రూమ్ తలుపులన్నీ బిగించావు కాబట్టి బయట నున్న రోబోలు నీ దగ్గర రావడానికి సమయం పడుతుంది. నీ మెదడులో తిరుగుతున్న ఆలోచనలు నీ ప్రోబ్ ద్వారా నాకు తెలుస్తూనే ఉంది. నీవు, చస్తే పెద్ద బాధ పడకుండా పోవాలని అనుకుంటున్నావు. నాకు వేరే గత్యంతరం లేదు. అలాగే నొప్పి లేకుండా, క్షణాలలో నీ ప్రాణం పోయేలా చంపడానికి ప్రయత్నిస్తాను", అంటూ శాంక, ఇషాన్ వైపు వడి వడిగా అడుగులు వేసాడు.

# భూలోక స్వర్గం

డా. కె.గీత (Morgan Hill. CA)

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

**అబ్బాజాన్** అలవాటు ప్రకారం వేకువజామునే లేచి దువా మొదలుపెట్టేడు.

ఆయన నిశ్శబ్దంగా వంగి, లేచి దువా చేస్తూ ఉంటే నాకు మా పక్కనే ఉన్న బొమ్మజెముదు చెట్టు కదిలి నా వైపు తరుముకొస్తున్నట్టు అనిపించి ముసుగు మీదికి లాక్కున్నాను.

నా పక్కనే చలికి వణుకుతున్న ఛోటా భాయీ అకీం మీదికి నా ముసుగుని కాస్త కప్పి వాడి దగ్గరికి జరిగి పడుకున్నాను.

అమ్మీజాన్ కూడా లేచినట్టుంది. బయలుకి పోవడానికి నడుస్తున్నట్టు ఇసుకలో మెత్తని అడుగుల చప్పుడు వినవచ్చి నెమ్మదిగా తగ్గింది.

ఎంత దూరం వెళ్లిందో మరి పొద చాటు కోసం!

మామూలుగా ఇంటిదగ్గిర అయితే అమ్మీ కూడా దువా చేసేది ఈ సమయంలో.

నాలుగు నెల్ల కిందటి వరకు మా జీవితాలు ఎంత బావుండేవి!

అందరిలాగే వీధిలో పిల్లలందరితో ఆడుకుంటూ, పాడుకుంటూ బడి నుంచి వచ్చి పుస్తకాలు విసిరేసి జులాయిగా తిరిగేవాళ్ళం.

నేను, భాయీ మా రేకుల ఇంటి కప్పు చిల్లుల్లోంచి నుంచి గదిలో అక్కడక్కడా ముద్దల్లా పడే సూర్యకాంతి వెలుతురులో ఆడుకునే వాళ్ళం. వాటిల్లోంచి రాత్రుళ్ళు నక్షత్రాల్ని దీక్షగా చూసేవాళ్ళం. వర్షం వచ్చినపుడు ధారాపాతంగా కురిసే నీళ్ళని గిన్నెల్లో పట్టేవాళ్ళం.

అబ్బాజాన్ పనామా దేశానికి పనికి పోయి నాలుగేళ్లయింది.

అమ్మీజాన్ పాటే కోడ్ (Pate Kòde) రొట్టెలు చేసి అమ్మేది.

అప్పుడప్పుడూ అమ్మీ మా మట్టి ఇంటి నేలలో ఓ మూల తవ్వి చిన్నపెట్టెలో ఏదో దాచిపెట్టడం నాకు విచిత్రంగా అనిపించేది. అదేవిటో చూడాలని మనసెంతో తహతహలాడేది.

ఉత్సాహం ఆపుకోలేక అడిగేసాను ఓ రోజు.

"బేటీ! అది భూలోకస్వర్గానికి మనందరం పోవడానికి కష్టపడి నేను, అబ్బా సంపాదించి దాస్తున్న డబ్బు. ఏదో ఓరోజు మీ అబ్బాజాన్ వచ్చి మనల్ని తీసుకువెళ్తాడు. అక్కడ పెద్ద పెద్ద భవంతులు ఉంటాయి. కడుపు నిండా తిండి ఉంటుంది. కట్టుకోవడానికి దర్జాయైన బట్టలు, కార్లు... " అంటూ చెప్తుంటే మొదటిసారి అమ్మీ కళ్ళల్లో మెరుపు చూసేను.

ఆ రోజు నేను అడిగిన "అబ్బా ఎప్పుడొస్తారు? మనం హైతీని వొదిలి ఎప్పుడెళ్లిపోతాం?" అనే ప్రశ్నలకి సమాధానం ఇంత త్వరగా వస్తుందనుకోలేదు.

ఆ వారంలో హైతీ దేశపు ప్రెసిడెంట్ మోజే ని హత్య చేసేరు. ఎక్కడ చూసినా అల్లర్లు చెలరేగేయి. ఎప్పుడు ఎవరికి మూడుతుందో అనే భయం. ఇల్లు వదిలి బయటికి వెళ్లడానికి భయపడే పరిస్థితి దాపురించడంతో అమ్మీ దగ్గిర పాటేలు కొనుక్కోవడానికి ఎవ్వరూ రావడం మానేసేరు.

పుండు మీద కారంలా ఆ రోజు భూకంపం మమ్మల్ని భయంకరంగా వణికించింది.

అదృష్టం కొద్దీ మా ఇల్లు కూలలేదు. కానీ పెద్ద పెద్ద భవంతులెన్నో నేలమట్టమయ్యేయి. ఎక్కడచూసినా జనం... గగ్గోలుగా పరుగెత్తే జనమే.

ఆ రోజంతా అమ్మీ నన్ను, తమ్ముణ్ణి రెక్కల్లో పొదువుకుని కూచుండిపోయింది.

మమ్మల్ని నిద్రపుచ్చడానికి తనెప్పుడూ పాడే జోలపాట అదేపనిగా పాడసాగింది.

"దోదో టీటీ మామా
దోదో టీటీ పాపా
సిలిపా దోదో క్రాబ్ లా వా మాన్జే....."

(Sweet sleep, mommy's little one
Sweet sleep, daddy's little one
If you do not sleep, the crab will eat you....)

వారం రోజులపాటు మతిలేనిదానిలా తనలో తాను మాట్లాడుకుంటూ కూచునే అమ్మీని చూసి భయం వేసేది.

నేను మొదటిసారి ఇల్లు చక్కబెట్టడం నేర్చుకున్నాను. ఇదే మామూలప్పుడయితే "ఎనిమిదేళ్లకే ఇల్లంతా చక్కబెట్టేస్తుంది మా బేటీ" అని గొప్పలు పోయేది అమ్మీ చుట్టుపక్కల వాళ్లతో.

ఉన్న కాసిన్ని గట్టి పాటేలేవో తమ్ముడికి తినిపించి, నేనూ కాస్త తింటూ ఎలాగో గడుస్తున్న సమయాన

ఓ రోజు అనుకోకుండా హఠాత్తుగా తలుపు తీసుకుని వచ్చిన అబ్బాజాన్ ని చూస్తూనే ఒక్క ఉదుటున మీదికి దుమికి ఏడుపు మొదలుపెట్టేసేను.

అప్పటికి గానీ అమ్మీ ఈ లోకంలోకి రాలేదు.

భూకంపం వచ్చిందని తెలుస్తూనే అబ్బాజాన్ ఉండబట్టలేక వెంటనే బయలుదేరేడట. కానీ అడ్డంకుల మీద అడ్డంకుల్తో అతికష్టమ్మీద హైతీకి చేరుకోవడానికి ఇన్నాళ్లు పట్టిందట.

రాత్రికి రాత్రే మేం దేశం వదిలి బయలుదేరేం.

హైతీ నుంచి పనామాకి పది రోజుల సముద్ర ప్రయాణం.

మాతోబాటూ కిక్కిరిసిన జనం ఒకళ్ళనొక్కళ్ళు తిట్టుకుంటూ, తోసుకుంటూ.

భయానికి వణుకుతున్న నా చేతిని గట్టిగా పట్టుకుని భూలోకస్వర్గం అంటే ఎన్ని నరకాలు దాటాలో అబ్బాజాన్ మొదట మేం పడవ ఎక్కగానే చెప్పడం నాకు బాగా గుర్తుంది.

"బేటీ! మన కాళ్ల కింద సముద్రాన్ని చూసి భయపడకు. మనం అగాధం లాంటి మన జీవితాల్ని సుఖమయం చేసుకోవడానికే ఈ అఖాతాన్ని దాటుతున్నాం. మనకి ఎక్కడికెళ్లినా అదుగో కనిపిస్తున్న ఆ నక్షత్రంలా అల్లా తోడుగా ఉంటాడు. జీవితంలో ఎప్పుడూ కిందికి చూడకు. తలెత్తి పైకి మాత్రమే చూడు."

హైతీలో సముద్రం ఒడ్డున బతికిన మాకు సముద్రం కొత్తకాకపోయినా సముద్ర ప్రయాణం కొత్తే.

పదిరోజులు ప్రయాణం చేసేసరికి కడుపులో పేగులు చుట్టుకుపోయినట్లు తెలీని నొప్పి. ఏం తిన్నా అరగని పరిస్థితి. పైగా చుట్టూ సముద్ర ప్రయాణం పడక కక్కుకునే మనుషులు. ఇక మా మొహాలయితే చెప్పనే అక్కరలేదు. ఉప్పుదేరి, గాలికి బిరుసెక్కిపోయేయి. పగలంతా నీళ్లలో ప్రతిబింబించే సూర్యుణ్ణి చూళ్లేక అమ్మీ ఒళ్ళో చెరోవైపు అతుక్కుని నిద్రపోవడం, రాత్రుళ్ళు అబ్బా చెప్పినట్లు ఆకాశంకేసి చూస్తూ నక్షత్రాలు లెక్కబెట్టడం. ఎప్పుడెప్పుడు నేలమీద కాళ్ళుపెడతామా అని ఎదురుచూసేం.

అయితే నేలమీద కాలుపెట్టిన మా సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు.

పనామాలో మేం ఎక్కువరోజులు ఉండడానికి కాదు, అక్కణ్ణించి భూలోకస్వర్గానికి వెళ్ళడానికి అది దారి మాత్రమే అని అబ్బాజాన్ చెప్పినపుడు ఏమో అనుకున్నాను కానీ ఇంత కష్టమని తెలీదు.

పనామాలో గట్టిగా పదిరోజులు కూడా లేకుండా ఓ తెల్లారగట్ల బయలుదేరదీసేడు అబ్బా.

అసలు ఏమీ అర్థంకాలేదు నాకు.

అదే అడిగాను.

"ఎక్కడికెళ్తున్నాం అబ్బాజాన్?"

"భూలోకస్వర్గానికి"

"ఎందుకెళ్తున్నాం?"

"కడుపు నిండా తిండి కోసం"

"పనామా భూలోకస్వర్గం కాదంటావా?"

"అలా అనుకునే నేను ఇక్కడికి చేరడానికి ఎన్నో కలలు కన్నాను బేటీ! కానీ ఇక్కడా నిరాశే. పూట గడిచే పని దొరకడానికి ఇక్కడా అగచాట్లే. ఒక తేడా ఏవిటంటే ఇక్కడ పడే కష్టానికి మన దేశంలో కంటే ఎన్నో ఎక్కువ రెట్లు డబ్బులొస్తాయి. నిజానికి గొప్ప భూలోకస్వర్గం అనేది మరొకటుంది. దానికి ఈ మధ్యే గేట్లు తెరుస్తున్నారని దక్షిణ అమెరికాలోని మన హైతీయులంతా ప్రయాణమవుతుంటే నాకూ ఆశ పుట్టింది."

మారు మాట్లాడకుండా వెంట నడిచేను.

రాత్రి అబ్బాజాన్ తో అమ్మీ గొడవపడడం విన్నాను.

"పనామాలో నాలుగు సంవత్సరాలు పనిచేసి సంపాదించిందంతా ఏవయ్యింది?"

"పిచ్చిమొహమా! పిల్లలకి, నీకు నా కష్టం తెలవకుండా ఉండడం కోసం తిన్నగా పనామాకి పనికి పోయానని అబద్ధం చెప్పేను. నిజానికి నేను వెళ్ళింది బ్రెజిల్ కి శరణార్థుడిగా. పదేళ్ల కిందట హైతీలో భూకంపం వచ్చినపుడు శరణార్థుడిగా వెళ్లిన అన్నయ్య కుటుంబం ఉంది కదా అని ధైర్యం చేసి వెళ్లేను. కానీ వాళ్లు అప్పటికే బ్రెజిల్ నుండి పనామా దేశానికి వలస వెళ్లిపోయారని తెలిసింది. బ్రెజిల్ లో రాత్రనక, పగలనక నానాకష్టాలూ పడి సంపాదించి మొత్తానికి పనామాకి ప్రయాణమయ్యేను. బ్రెజిల్ నుంచి చిలీకి, అక్కణ్ణించి కొలంబియాకి అడ్డదారిన ప్రయాణించవల్సి వచ్చింది. బ్రెజిల్ నించి పనామా ప్రయాణమయ్యిన నా తోటి హైతీయులతోబాటూ కలిసి బయలుదేరేను. కొలంబియాలో బ్రెజిల్ నించి చిలీకి వలస వెళ్లిన వాళ్లు, ఎరిట్రియా, కామెరూన్, ఘనా, సెనెగల్ వంటి ఆఫ్రికా దేశాల నుంచి నుంచి ఈక్వెడార్ శరణార్థులుగా వచ్చినవాళ్లు కూడా కలిసేరు. మా ప్రయాణంలో చివరి పదిరోజులు కొలంబియా, పనామా సరిహద్దుల్లోని 93 మైళ్ళ దుర్భర అరణ్యమార్గమైన డేరియన్ పాస్ గుండా కొనసాగాయి. దొంగతనంగా ఈ డేరియన్ పాస్ ని దాటేటప్పుడు ప్రాణాలు పోతాయనే అనిపించేది. మమ్మల్ని అడవి దాటిస్తామని నమ్మబలికి డబ్బు గుంజిన మనుషులు మొదటిరోజు రాత్రే పరారయ్యేరు. మర్నాడే దారి దోపిడీ దొంగలు మమ్మల్ని నిలువునా దోచేసేరు. ఆడవాళ్ళని మా కళ్ల ఎదుటే దుర్మార్గంగా చెరిచేరు. ఎదురు తిరిగిన వాళ్లని నిర్దాక్షిణ్యంగా కాల్చి పడేసేరు. అలాగే డ్రగ్ మాఫియాదార్ల గుంపు కళ్లబడ్డామంటే చచ్చినట్టే. ఇక ఈత రాకపోతే దార్లో దాటాల్సిన కాలువల్లో మునిగి చావాల్సిందే. ఇదంతా ఒక ఎత్తు, క్రూరమృగాల బారి నించి, విషపూరిత మొక్కల బారి నించి తప్పించుకోవడం మరొక ఎత్తు. ఇవన్నీ తట్టుకున్నా తిండి,

నీళ్ళు లేకుండా నడవలేక ప్రాణాలు పోగొట్టుకున్న మనుషుల శవాలు దారి పొడవునా దీనంగా పడి ఉండి ఒళ్ళు గగుర్పొడిచేవి. మాతో వచ్చిన వాళ్లలో కొందరు దార్లో ఆగిపోయేరు. కొందరు వెనక్కి వెళ్ళిపోయేరు. ప్రాణాలకు తెగించి ముందుకు బయలుదేరిన కొందర్లో నేను బతికి బయటపడ్డానంటే నాకే నమ్మశక్యంగా అనిపించలేదు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, చెట్టుచాటునా, పుట్టచాటునా దొరికిన ఆకులు అలములు నమిలి ఆకలి తీర్చుకుని ఎలాగోలా పనామా చేరుకున్నాను. పనామా బోర్డర్ లో దొరికిపోయిన వాళ్ళని డిటెన్షన్ సెంటర్లలో పడేస్తారు. అయితే కొలంబియా, పనామా దేశాల కంట్రోల్ ఫ్లో ఒప్పందం ప్రకారం రోజుకి వెయ్యో పదిహేను వందల మందినో వదులుతున్నారని విన్నాను. కానీ నాలాగా ఇలా దొంగత్రోవన వచ్చి బతికి బట్టకట్టిన వాళ్లు, బోర్డర్ పెట్రోల్ వాళ్ళకి దొరక్కుండా ఉండేవాళ్లంతా అదృష్టవంతులే. మొదట్లో బాగా ఇబ్బంది అయినా ఇక్కడ అన్నయ్య ఉన్నాడు కాబట్టి మొత్తానికి పనిలో కుదురుకోగలిగేను. అన్నయ్యకి తెలిసిన దళారీ మనుషుల ద్వారా పని కాగితాలు సంపాదించగలిగేను. వచ్చేటపుడు పనామా వెళ్తున్నానని నీకు చెప్పిన అబద్ధం నిజం అయ్యింది. నిన్ను పిల్లల్ని తీసుకురావాలని ఎన్ని రాత్రుళ్ళు వేదనపడ్డానో నాకే తెలుసు."

అమ్మీ దుఃఖ పడడం, అబ్బా ఓదార్చడం వినిపిస్తూనే ఉంది.

"ఏడవకు, నీకు తెలుసు కదా మనం ఈ రోజుల కోసం ఎన్నాళ్లుగా ఎదురు చూస్తున్నామో. సంపాదించిన ప్రతి పనామేనియన్ బల్బోవా మీ కోసమే దాచేను. ఇక పనామా నించి ఎలాగోలా టెక్సాస్ బోర్డర్ వరకు వెళ్లగలగడమే మన ధ్యేయం. మధ్యలో ఉన్న దేశాల బోర్డర్లన్నీ ఈ మధ్య కరుణించి మెక్సికోకి వెళ్ళడానికి అనుమతిస్తున్నారని విని అన్నయ్య కుటుంబం నెల కిందట బయలుదేరి వెళ్లేరు. ఇవాళో రేపో మనమూ బయలుదేరుదాం."

పనామా నించి కోస్టారికా, నికరాగ్వా, ఎల్ సాల్వెడార్, గ్వాటమాలా, మెక్సికో... రోజూ మేప్ చూపిస్తూ అబ్బాజాన్ పదేపదే చదువుతున్న దేశాల పేర్లన్నీ కంఠస్థం వచ్చేసేయి నాకు.

నడుస్తూ ఆకాశంకేసి చూస్తూ దేశాల పేర్లు చెప్పసాగేను.

"జీవితంలో ఎప్పుడూ కిందికి చూడకు. తలెత్తి పైకి మాత్రమే చూడు." అబ్బాజాన్ పడవలో చెప్పిన మాట గుర్తుకు వచ్చింది.

మేం దాటి వచ్చిన ప్రతి దేశం జ్ఞాపకం వచ్చింది.

పనామా నించి మెక్సికోకి దర్జాగా కార్లో వెళితే 45 గంటల పాటు ప్రయాణమట. అంటే ఎంత ఆగుకుంటూ వెళ్లినా అయిదారు రోజుల ప్రయాణం.

మరి మేం వెళ్లింది తుక్కు బస్సుల్లోను, చిన్నా చితకా వ్యానుల్లోనూ, చిన్న పడవల్లో, డింగీల్లో, నడకదారుల్లోనూ.

ప్రతి దేశపు సరిహద్దూ దాటడానికి రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది.

అంతలోనే అబ్బా, అమ్మీ దార్లో ఎక్కడ చిన్నపని దొరికినా చెయ్యడానికి ప్రయత్నించేవాళ్లు.

వాళ్లొచ్చేదాకా నా పని తమ్ముణ్ణి కనిపెట్టుకుని ఉండడం. మా దగ్గిర ఉన్న సామాన్లల్లా ఓ చిరుగుల టెంటు, కొద్దిగా వంటసామాగ్రి, మాసిపోయిన చలి కంబళీలు . ఎక్కడంటే అక్కడ సమతలంగా ఉన్నచోట నేలమీద టెంటు వేసి మమ్మల్ని కూర్చోబెట్టి అబ్బా ముందు వెళ్లే వాడు. తరువాత వచ్చి అమ్మీని కూడా తీసుకువెళ్లేవాడు.

ఇంతలోనే అమ్మీ చుట్టుపక్కల వాళ్లని మా హైతియన్ క్రియోల్ భాషలో "మే కొన్ ఫే మాజీ" (I know make food) అంటూ పని అడిగేది.

మేం వచ్చీ రాని స్పానిషు భాషలో దారిన పోయే వాళ్ళని ఏదైనా అడుక్కుని తెచ్చుకుని తినేవాళ్ళం.

ఎల్ సాల్వెడార్ లో తిన్న 'పపూసా'లు తల్చుకుంటే ఇప్పటికీ నోట్లో నీళ్లూరుతున్నాయి.

ఈ ప్రయాణంలో దేశద్రిమ్మరుల్లా బతకడం మాకు బాగా అలవాటయ్యిపోయింది.

నికరాగ్వాలో అమ్మీ ఒళ్ళంతా కొట్టుకుపోయి, రక్తం ఓడుతూ, ఏడుస్తూ వచ్చింది.

వెనకే వచ్చిన అబ్బా ఒగురుస్తూ, ఏడుస్తూ, ఓదారుస్తూ ఉన్నాడు.

"దొంగ లంజా కొడుకులు! నాదగ్గిర డబ్బు గుంజుకోవడమే కాకుండా నిన్నూ పొదల చాటుకి లాక్కుపోయేరు. ఇదే మన దేశంలో అయితే లమ్డీకొడుకుల్ని నరికిపారేసేవాణ్ణి."

అమ్మీ రాత్రంతా పిచ్చిదానిలా నెత్తి బాదుకుని ఏడుస్తూనే ఉంది.

అబ్బా గుసగుసగా సముదాయించడం వినిపిస్తూనే ఉంది.

"తప్పదు మరి. ఓర్చుకో. ఇలాంటివి ఎన్నో జరుగుతాయి మన లాంటి బతుకుల్లో. మన లక్ష్యం ముందు ఇవన్నీ చిన్న విషయాలు. ఒక్కసారి మనం స్వర్గానికి చేరేమంటే మన బతుకే మారిపోతుంది. బాధపడకు."

దారిపొడుగునా అబ్బా దళారులెవరో సాయం చేస్తారని డబ్బు సమర్పించడం, సగం దార్లో మోసపోయామని తెలుసుకోవడం, అమ్మీ నిశ్శబ్దంగా ఏడవడం.

చివరికి ఎలాగోలా మెక్సికో చేరగానే అదృష్టం కొద్దీ మేం మాలాగా భూలోకస్వర్గాన్ని చేరడానికి అప్పటికే త్రోవ వెంట బయలుదేరిన మరికొన్ని కుటుంబాల్ని కలిసేం.

అందులో పసిపిల్లల దగ్గరనించి దాదాపు యాభై ఏళ్ల వారి వరకూ ఉన్నారు.

దాదాపు అబ్బా వయసున్నతను అకీం ని తెగ ముద్దుచేయసాగేడు.

అతనూ హైతీ నించే వచ్చేడట. మొదట పనామాకి విజిటింగ్ వీసాలో వచ్చి క్రమంగా ఉద్యోగ వీసా తెచ్చుకున్నాడు. పెద్దకొడుకు అమెరికా దయాదాక్షిణ్యాల వల్ల శరణార్థుడిగా రెండేళ్ల కిందట వెళ్లగలిగేడట.

భార్యా, మరి ఇద్దరు చిన్న పిల్లలు ఇప్పటికీ హైతీలోనే ఉన్నారు. వాళ్లకి ఇటు పనామా వీసా రాలేదు, అటు అమెరికా వెళ్లేందుకు అవకాశం రాలేదు. ఇక పనామాలో అతను ఒక్కడూ బతకలేక కనీసం పెద్దకొడుకుతోనైనా కలిసి

ఉందామని ఈ ప్రయాణం మొదలుపెట్టేడట. మా అకీంని చూస్తే అతని చిన్నకొడుకే జ్ఞాపకం వస్తున్నాడంటూ కంట తడి పెట్టుకున్నాడు.

"కుటుంబం అంతా ఒక్కచోట ఉండడం కంటే స్వర్గమేముంది?" అన్నాడు అతను దార్లో అబ్బాని ఉద్దేశించి.

అబ్బా తల పంకించి "నిజమే, కానీ పిల్లలకి మంచి భవిష్యత్తునివ్వడమే కదా తండ్రి బాధ్యత. నా పిల్లలూ నాలా అడ్డమాలిన కష్టాలూ పడకూడదనే నా తాపత్రయం" అన్నాడు.

అప్పుడెందుకో అబ్బా ముఖంలో విషాదం తాండవించింది. గొంతు దుఃఖంతో వణికింది.

నేను స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నాను. ఈ ప్రయాణంలో చివరికి గమ్యం చేరుతామో లేదో ఎవరికీ తెలీదు.

వేసే ప్రతీ అడుగులోనూ భయమే. ఎట్నుంచి ఏం పొంచి వస్తుందో అన్న భయం.

ఇప్పటివరకు మేం చేసిన మొత్తం ప్రయాణం ఒక ఎత్తు. మెక్సికో ఒక్కటీ ఒక ఎత్తని మమ్మల్ని మరొక గుంపు హెచ్చరించేరు.

"ఈ మధ్య అమెరికా ఒత్తిడితో మెక్సికోలో దొరికిన వాళ్ళని దొరికినట్టు నరకంలాంటి డిటెన్షను సెంటర్లలో పడేస్తున్నారు. ఇంతకుముందు వరకు మెక్సికో శరణార్థులుగా నమోదు చేసుకున్న వారికి అక్కడి పోలీసులే దగ్గరుండి ఎస్కార్టుగా ఉండి మరీ సాయం చేసేవారట. నిజానికి ఇలా శరణార్థులకి దేశం దాటి వెళ్లే అనుమతి ఉండదు. అయినప్పటికీ అమెరికాలో కొత్త అధ్యక్షుడు రావడం, వస్తూనే సానుకూల ప్రతిపాదనలతో వార్తలు రావడంతో మెక్సికో ప్రభుత్వం శరణార్థులకి అండదండగా నిలిచింది. మన దురదృష్టం కొద్దీ ఈ మధ్య అమెరికా ఒక్కసారిగా నిబంధనలు కఠినతరం చేసి మెక్సికో దేశమ్మీద శరణార్థుల్ని కట్టడి చెయ్యమని ఒత్తిడి తేవడంతో మెక్సికో ప్రభుత్వం ప్లేటు ఫిరాయించింది. ఇప్పటికే ఎనిమిదివేల మందికి పైగా 'రియో గ్రాండే' నదిని దాటి అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలోని 'దెల్ రియో' ఊళ్లో వంతెన కిందకి చేరేరు. వాళ్లంతా అదృష్టవంతులు" అన్నాడొకతను అబ్బాతో.

ఆ రాత్రి మమ్మల్ని ఆదుకున్న మెక్సికను కుటుంబం వాళ్లు మాకు పెరట్లోని షెడ్లో పడుకోవడానికి చోటిచ్చినపుడు నేనూ, తమ్ముడు దూరం నించి వాళ్ల టీవీ లో వంతెన కింద లీలగా కనిపిస్తున్న వందలాది మందిని చూసేం.

ఎలాగైతేనేం మా యాత్ర చివరి 500 మైళ్ళకి చేరింది. మెక్సికను పోలీసులకి దొరక్కుండా ఉండాలంటే గుంపుగా వెళ్లకూడదని అంతా చెప్పుకోసాగేరు.

ఇక మేం విడిగా నడక ప్రారంభించేం. అక్కడక్కడా అదృష్టం కొద్దీ ఎవరైనా ఆదుకుని మమ్మల్ని ఏ గాడిద బండిమీదో, వ్యానులోనో ఎక్కించుకుని పక్క ఊళ్ళో దించేవాళ్లు.

అయితే నడిచిన లెక్కలేనన్ని మైళ్ళన్నీ పైకి మాత్రమే చూస్తూ నడిచేం.

తమ్ముడు నడవలేనని పేచీ పెట్టినపుడల్లా మెడమీద ఎక్కించుకుని ముందుకు అడుగులేసే అబ్బాజాన్ ని చూస్తే అంత శక్తి ఎక్కడి నుంచి వస్తుందో అని ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

అమ్మీ కూడా తక్కువ శక్తి గలదేమీ కాదు. కాళ్ళ కంటే బలమైన మానసిక శక్తి ఉంది తనకి.

లేకపోతే ఇన్ని కష్టాల్ని ఎలా ఓర్చుకుంటుంది?

ఉన్నట్టుండి పూర్తిగా ఎడారిలో ప్రవేశించేసరికి దిక్కూ తెన్నూ తోచక నిలబడిపోయిన మాకు అటుగా గాడిద మీద పోతున్న మెక్సికను కుర్రాడొకడు తగిలేడు.

'తలకి ముప్ఫయి డాలర్లు ఇప్పుడు, మిగతావి అమెరికా వెళ్ళేక' అన్న బేరం కుదిరింది.

అబ్బా వెనగ్గా నడుస్తున్న తమ్ముణ్ణి భుజాన ఎత్తుకుంటూ త్రోవ చూపిస్తున్న కుర్రాడికి వినిపించకుండా "వీడికి బొత్తిగా బుర్ర లేనట్టుంది. అమెరికా వెళ్ళేక వీడికి సొమ్ము పంపాలట. అప్పటికి మనకి వీడు గుర్తుండినప్పటి మాట." అన్నాడు.

అమ్మీ "అయ్యో పాపం! వీడేం కష్టంలో ఉన్నాడో" అంది మురికి కొట్టుకుపోయిన వాడి అవతారం వైపు చూస్తూ.

రెండు పగళ్లు నడిచేసరికి కాళ్లు పుళ్ళు పడిపోయేయి. కన్నాలు పడ్డ బూట్ల నుంచి దుర్గంధం వస్తూ ఉంది.

రాత్రిపూట ఎడారిలో ఎక్కడో ఓ చోట శోషొచ్చినట్టు పడిపోవడం, పొద్దుట లేచి మళ్లీ నడవడం.

"ఎన్నాళ్ళు నడవాలి అబ్బాజాన్?"

"భూలోకస్వర్గం సరిహద్దు వరకు"

"అసలీ భూలోకస్వర్గం గురించి నీకెలా తెలిసింది అబ్బాజాన్?" ఉండబట్టలేక ఎన్నాళ్ళుగానో దొలుస్తున్న ప్రశ్నని అడిగేసేను.

"బేటీ, ఇది ఈ నాటి కలకాదు. అసలు హైతీ కాకుండా ఏదైనా స్వర్గమే. నా చిన్ననాటి నించి చూస్తున్నాను. మనదేశంలో ఉన్నంత చెత్త బతుకు ఇంకెక్కడా ఉంటుందనుకోను. ఎక్కడచూసినా దుర్మార్గపు రాజకీయాలు, తిరుగుబాట్లు, చంపుకోవడాలు, పుండు మీద కారప్పొడిల్లా భయంకరమైన ప్రకృతి వైపరీత్యాలొక వైపు. అయితే భూకంపాలు, లేకపోతే తుఫానులు. ఇక అతితక్కువగా ఉన్న మన ముస్లిములకి డబ్బులేకపోతే అధోగతే. అనుక్షణం వివక్ష వల్ల ప్రాణ భయమే. ఎక్కడన్నా కాస్తయినా మనశ్శాంతి ఉందా? 2010 లో భూకంపం వచ్చిన తరవాత తేరుకోలేని కుటుంబాల్లో మీ పెదనాన్న కుటుంబం కూడా ఒకటి. బ్రెజిల్ దయ వల్ల శరణార్థులుగా వాళ్లు దక్షిణ అమెరికాకి వెళ్లిపోగలిగేరు. దురదృష్టం కొద్దీ నాకు అప్పట్లో అవకాశం రాలేదు. ఎప్పటికైనా అమెరికాకి చేరాలన్నదే నా లక్ష్యంగా పెట్టుకున్నాను. మీ అమ్మ నన్ను పెళ్లి చేసుకునేటప్పుడు నా మొదటి ఒప్పందం అదే.______ "

అబ్బాజాన్ మాటలు వినబడడం లేదు నాకు. ప్రతి మాటలో ఆత్మవిశ్వాసమే ధ్వనిస్తూంది.

మూడో రోజు ఉదయానికి కాస్త పచ్చగా ఉన్న నేల కనిపించింది. దూరంగా ఊరు కనిపించింది. మాకూడా వచ్చిన కుర్రాడు ఊరు పొలిమేర కూడా రాకముందే పలాయనం చిత్తగించేడు.

“పొద్దున్న నిద్ర లేస్తూనే వాడు డబ్బులు అడిగినప్పుడే అనుకున్నాను” అన్నాడు అబ్బా.

అప్పటివరకు ఉన్న ఎడారి మాయమై ‘రియోగ్రాందే’ నది నిశ్చలంగా కనిపించింది.

“ఇదేవిటి అచ్చం మా హైతీ లోని ‘ఆర్టి బొనీత్’ నదిలా ఉంది? అటు తీరమేనా భూలోకస్వర్గం?” నా గుండె ఆగి కొట్టుకోసాగింది.

నదికటూ ఇటూ తీరం వెంబడి జనమే జనం. పట్టుబడితే ఏం జరుగుతుందోనన్న భయం లేని జనం.

అబ్బాజాన్ “నిండా మునిగిన వాడికి చలేవిటి?” అని మేం వచ్చిన దార్లో ఎవరితోనో అన్నప్పుడు నాకు అర్థం బోధపడలేదు. ఇప్పుడు అర్థం అవుతూంది.

మెక్సికో వైపు నించి యుఎస్ వైపుకి తాడుని అటువైపు ఎవరో గట్టిగా పట్టుకున్నారు. ఒంటి మీద సగానికి మాత్రమే బట్టలేసుకుని, పీకె లోతు నీట్లో నెత్తిన మూటలు పెట్టుకుని, పిల్లల్ని భుజాలకి ఎక్కించుకుని ఇటు నించి అటు, అటు నించి ఇటు గబగబా మనుషులు దాదాపు ఈదుకుంటూ దాటుతున్నారు.

అబ్బా నన్నూ, తమ్ముణ్ణీ దగ్గరికి తీసుకున్నాడు.

అమ్మీ మమ్మల్నే చూడసాగింది.

“ఇలా వినండి ఫాతిమా, అకీం! నదిని దాటడానికి భయంగా ఉందా?”

ఇద్దరం అవునన్నట్టు భయంగా తలలూపేం.

“భయపడకండి. మనం ఎన్నో కష్టాలకి ఓర్చి ఇక్కడికి చేరేం. సంవత్సరాల మన కల నెరవేరే సమయం ఇది. మీ అబ్బాజాన్ ఇంతవరకు ఏం చేసినా మీ మంచి కోసమే చేసేడు. ఎప్పటికీ అబ్బాజాన్, అమ్మీ మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటారు. నదిని దాటడాన్ని మించిన ప్రమాదం ఆవలి ఒడ్డున ఉంది. మనం నది దాటిన తరవాత ఏం జరుగుతుందో మనకే తెలియదు. మనందరినీ ఒకటే చోట కూడా ఉండనివ్వకపోవచ్చు. అయినా భయపడకూడదు, సరేనా?”

అబ్బాజాన్ భుజాన్ని గట్టిగా కరుచుకుని నదిని దాటేటప్పుడు కూడా తనెప్పుడో చెప్పినట్టు నేను పైకే చూడసాగేను.

ఆకాశం ప్రశాంతంగా ఉంది. ఏం పట్టనట్టు.

“అవునూ అబ్బాజాన్! కొందరు మళ్లీ వెనక్కి మెక్సికో వైపుకి ఎందుకు దాటుతున్నారు?” అన్నాను ఒడ్డు చేరగానే.

మా పక్కనే అప్పుడే నీటిలోకి దిగబోతున్నావిడ “ఏం చేస్తాం? ఈ ఒడ్డున కనీసం తిండి కూడా దొరకడం లేదు. ఆవలితీరంలోనే ఏ మొక్కజొన్నలో కొనుక్కోవడానికైనా దొరుకుతున్నాయి. అందుకే పిల్లల్ని అదుగో ఆ వంతెన కింద మా చెల్లి దగ్గిర వదిలి మళ్లీ వెనక్కి వెళ్తున్నాను. తిరిగొస్తానో లేదో” కళ్ల నీళ్లు పెట్టుకుంటూ అంది.

ఉన్నట్టుండి గుర్రాల మీద బోర్డర్ పోలీసులు కనబడ్డ వాళ్ళని కనబడ్డట్టు బాదుకుంటూ వెళ్లిపోతున్నారు.

నేను గబుక్కున అమ్మీని కౌగిలించుకున్నాను. ఒక్క ఉదుటున అబ్బా మమ్మల్ని లాక్కుంటూ వంతెన వైపు పరుగు ప్రారంభించేడు.

ఎట్టకేలకి వంతెన కింద ఉన్న వేలాది మందిలో మేమూ చేరేం. ఎక్కడ చూసినా తొక్కిసలాట. ఎవరికి వాళ్ళు ఆశతో ఎదురుచూస్తున్నవారే. ఒకరి కథలు ఒకళ్ళకి చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకుంటున్న వాళ్ళే. ఇక్కడ జనమే ఓ పెద్ద నదిలా ఉన్నారు. ఆ రాత్రంతా ఎవరికీ కంటి మీద కునుకు లేదు.

మర్నాటికల్లా మాలో ఎందరినో డిటెన్షన్ సెంటర్లలో పడేస్తున్నారని, అక్కణ్ణించి ఆఘమేఘాల మీద హైతీ తిప్పి పంపేస్తున్నారన్న వార్త దుమారం రేపింది.

తిరిగి వెళ్లిపోవడం తప్ప శరణ్యం లేదని అర్థమయ్యింది.

అంతే కాకుండా దాదాపు పదడుగుల ఎత్తున ఆ సాయంత్రానికే మైలు దూరం పొడవున తాత్కాలిక ఫెన్సు ఎదురుగా ప్రత్యక్షమయింది.

ఇక అన్ని ఆశలూ అడియాసలయిపోయేయి.

"మీ బతుకులు తగలడా, మీరంతా నాశనం కానూ..." అమ్మీ దుఃఖం పూడుకుపోయిన గొంతుతో దుమ్మెత్తిపోస్తూ పోలీసుల్ని శాపనార్థాలు పెట్టడం ప్రారంభించింది.

ఆ రాత్రి బాగా నిద్రపోతుండగా అబ్బాజాన్ నన్ను శబ్దం చెయ్యొద్దని, నిశ్శబ్దంగా వెంట నడవమని నిద్రలేపేడు. భుజమ్మీద అకీం నిద్రపోతున్నాడు.

మేం వచ్చే దార్లో మాకు ఎదురై అకీంని ముద్దు చేసినతను మరొకణ్ణి వెంటబెట్టుకుని మాతో వచ్చేడు.

ఏం జరుగుతుందో తెలిసే లోగా బోర్డర్ పెట్రోల్ సిబ్బంది కన్నుగప్పి క్షణంలో కంచె ఎక్కి నన్ను, తమ్ముణ్ణి అటువైపు జారవిడిచేసేరు ముగ్గురూ కలిసి.

నాకు నోట మాట రావడం లేదు.

అబ్బాజాన్ నన్ను నడిపిస్తూ అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

"ఎక్కడా మీ అబ్బా, అమ్మీ ఎవరనేది, మీరెక్కణ్ణించి వచ్చిందీ ఎప్పుడూ, ఎవరికీ చెప్పొద్దు. మీరిద్దరూ ఇక మీదట్నుంచి అనాథలు. గుర్తుపెట్టుకో. తమ్ముణ్ణి ఎప్పటికైనా నువ్వే చూసుకోవాలి."

ఒళ్ళు దులుపుకుని, ఏడుస్తున్న తమ్ముణ్ణి ఎత్తుకుని ముందుకు అడుగువేసేను పైకి మాత్రమే చూస్తూ.

బోర్డర్ పెట్రోల్ వాళ్ళ లైట్లు మా ముఖాల మీద పడుతుండగా చివరిసారి ఫెన్సింగ్ కి అటువేపు చూసేను.

దూరంగా కనుమరుగవుతున్న అబ్బా రూపం నా కళ్ళలోని నీళ్లతో కలిసిపోయి మసక మసకగా కనిపించింది.

అమ్మీ జోలపాట గుర్తుకురాసాగింది!

"దోదో టీటీ మామా

దోదో టీటీ పాపా

సిలిపా దోదో క్రాబ్ లా వా మాన్జే....."

కుటుంబం అంతా కలిసి ఒక్కచోట ఉండడమే కదా భూలోక స్వర్గం అంటే!

ఏమో!

## ఆట – పోరు

తాడికొండ కె. శివకుమార శర్మ (Greater Washington DC)

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

**కొందరికి జీవితం నిచ్చెనలమయం.** వరుసకి పది గళ్లుండి పదివరుసలలో మొత్తం వంద గళ్లున్న వున్న పటం ఆటలో ఒకడుగు వెయ్యగానే ఆ నిచ్చెనలే వాళ్లని పైకి లాక్కుపోతుంటాయి. పైగా, వందగళ్ల పరిమితి వాళ్లకి వర్తిస్తున్నట్లు కూడా కనిపించదు.

పరమపదసోపాన పటం కొందరి జీవితాలు. జాగ్రత్తగా అడుగులు వెయ్యాలి. అందినప్పుడు నిచ్చెన లెక్కాలి. పాము కాట్లకి గురయితే నీరసపడకుండా లేచి నిలబడి పయనాన్ని కొనసాగించాలి. గమ్యాన్ని చేరినవాళ్లు కొంద రుంటారు.

పూర్తిగా పాము పడగ నీడలో గడిపే జీవితాలు కొందరివి. నిచ్చెనలు అందుబాటులో లేకపోవడమే కాక అవి ఉంటాయని ఎవరయినా చెప్పినప్పుడు వాళ్లకి ఆశ్చర్యమేస్తుంది. ఒక గడిలోంచి ఇంకొకదానిలోకి వెళ్లాలన్న ధ్యాస

కలిగినప్పుడు విప్పిన పాము పడగ నీడ భయాన్ని ఎక్కువచేస్తుంది. ఒకటో గడిలో ఉన్న పాముతోక ఝిళిపింపులకి గురిచేస్తుంది కూడా.

ఆమె మీది పడగ నీడ పక్కింటి అతనిది. చిన్నతనం నించీ అది ఆమెకి ఎరికే. తను ఎదుగుతున్నకొద్దీ దాని పరిమాణం ఎక్కువవుతున్నట్లు ఆమెకి అనిపించింది.

ఆమె ఇంటి మిగతా మూడు పక్కలవాళ్లూ ఆ పడగ నీడ తమ మీద ఎక్కడ పడుతుందో నన్నట్లుగానే మసలుతుండేవాళ్లు.

అతను ప్రేమించా నన్నాడు. ఆమె తిరస్కరించింది.

యాసిడ్ పోస్తానని భయపెట్టాడు. 'మే మున్నాంగా!' అన్నారు చుట్టుపక్కలవాళ్లు తమ వంతుగా ఏదో చెప్పాలన్నట్లుగా. తమ కండబలాన్ని నమ్మి, దాన్ని 'ధైర్య మిస్తున్నట్లుగా,' అని ఆమె అనుకోవాలని వాళ్ల ఆశ. ఆ మార్పిడి ఎలా జరుగుతుందన్న ప్రశ్నకి వాళ్ల మదిలో చోటుండదు. ఆమె గుడ్డి దయుంటే పరిస్థితి వేరేగా ఉండే దేమో గానీ కనిపిస్తున్న దేహబలాన్ని కాకపోయినా మందిబలాన్ని అయినా నమ్మనీకుండా ఉండడానికి గల కారణాలు ఆ ఇంటిచాయలకి రాలేదు. కనీసం అలాంటిది ఒకటయినా వచ్చుంటే, వాళ్లున్నా మన్నది యాసిడ్ పొయ్యనీకుండా ఆపేటందుకా, పోస్తున్నప్పుడు చూడడానికా, లేక పోసిన తరువాత 'అంతా అయిపోయింది, ఇంకేం చేస్తాం?' అనేటందుకా అన్న ప్రశ్న ఆమె మదిలో ఉదయించడానికి ఆస్కారం ఉండేది.

ఆమె అతన్ని ఎదుర్కోకుండా ఊర్కోనలేదు. పళ్లేలనే కాక పలుగులని కూడా విసిరేసింది. వాటిని అతను పూచికపుల్లల్లా పక్కకు తోసేశాడు. 'ఇద్దరిదీ వయసు చేసే చిలిపిదనం! అల్లరి ఇప్పుడు కాక చేసే దెప్పుట్టా?' అన్నారు ముచ్చటపడ్డ ప్రేక్షకులు.

ఒకనాడు అతనామెను ఆక్రమించుకున్నాడు.

'రాక్షస వివాహం కూడా వివాహమేగా!' అన్నారు ఇరుగుపొరుగులు చేతులు వెనక్కు కట్టుకుని. అవి ముందు కనిపిస్తే వాటిల్లో ఆయుధా లెందుకు లేవని ఆమె ప్రశ్నిస్తుందని వాళ్ల భయం. 'అయిందేదో అయింది. పక్కన ఉండడం ఒక్కటే కాదుగా కారణం? నువ్వా అందంలో ఏమీ తీసిపోవు. అతనా బలశాలి. ఎలాగయినా నీకు కూడా ఒక తోడు కావలసిందే! అతనికి నిన్ను దాటి ఇంకొకళ్లమీద కన్నేసే అవకాశం కూడా లేదు,' అన్నారు వాళ్లు. అది పచ్చి అబద్ధ మని ఆమెకి తెలుసు. దానికి కారణం, అక్కడికి కనుచూపు మేరలోనే కాక ఎంతో దూరాన ఉన్నవాళ్లతో కూడా అతనికి లావాదేవీ లుండడం. 'అయినా, ఎవడో ఒకడు మొగుడు కావాలిగా?' అని వాళ్లు వెనకాల ఉన్న చేతులని అట్లాగే దులిపి, వెనక్కు తిరిగేటప్పుడు మాత్రం చేతులని ముందుకు మార్చుకుని వెళ్లిపోయారు.

మొదటిసారి ఆమె గొంతులో వినపడ్డ పెద్ద అరుపులు వాళ్లకి ఆమె బాగోగుల గూర్చిన ఆదుర్దాని కలగజేశాయి గానీ, అది కొన్ని క్షణాలు మాత్రమే. అంతకన్నా పెద్దగా వినిపించిన అతని కంఠం వాళ్లని ఆలోచించడం మానెయ్యమంటూ జోలపాడినట్లనిపించి శాంతించారు. 'ప్రాణహాని లేదు కదా!' అనుకుని తమ పనుల్లో నిమగ్నమయారు.

మరునాడు ఆమె చూపులు వాళ్ల పిరికిదనాన్ని నిలదీస్తే, 'మొగుడూ పెళ్లాలు అరుచుకోకుండా ఉండడం ఎక్కడయినా, ఎవరయినా చూశారా?' అని ఒకరు తనవాళ్లవైపు తిరిగి ప్రశ్నించారు. చూడలే దన్నట్టు వాళ్లు తలాడించారు.

'మరి కొడితేనో? అది కూడా అక్కడక్కడా జరుగుతూనే ఉన్నది అని అంటారా?' ఆమె సాగీసింది.

'నువ్వు ఊరికే భయపడుతున్నావు! తథాస్తు దేవత లుంటారు జాగ్రత్త!!' అని వాళ్లు అక్కడినించీ జారుకున్నారు.

'అమ్మో, కొడుతున్నాడు!' అని ఆమె గొంతులో వినిపించినప్పుడు అంతకుముందు ఆమె అరుపులతో అతనికి జవాబివ్వడం గుర్తుకొచ్చి ఇప్పుడు కూడా అతని మీద తిరగబడుతుందని తమలో తాము నమ్మబలుక్కున్నారు. కానీ, అతని గొంతులో ఆమె చేత దెబ్బలుతిన్న ఫలితా లేమీ వెలువడకపోయేసరికి, 'ఎన్ని దెబ్బల కయినా ఓర్చుకో గల సామర్థ్యం ఉన్నవాడు!' అని లోలోపలే మెచ్చుకున్నారు. ఏ దెబ్బ లయినా తమ మీద పడనందుకు సంతోషించారు.

అతని బలప్రదర్శనమూ, ఆమె ప్రతిఘటనా — అదీ వాళ్ల 'సంసారం'! 'మనలో మన మాటగా అడుగుతున్నాను, అంత ప్రతిఘటించేవాళ్ల అవసరం నీకున్న దంటావా?' ఒకటీ అరా గొంతుకలు అప్పుడప్పుడు అతన్ని రహస్యంగా చెవిలో అడిగి వాటి శరీరాలని అతని చేతి విసురుకు గురిచేశాయి. ఆ తాకిళ్లు, 'ఇంకా ప్రతిఘటన అవసరమా?' అంటూ ఆమె దగ్గరకు వెళ్లనీకుండా వాళ్లని ఆపాయి.

అంతా శాంతియుతంగా ఉన్నదనుకున్నప్పుడు అందరికీ ఆశ్చర్యం కలిగే సంఘటన ఒకటి జరిగింది. అది, ఆమె తల పైకెత్తుకుని అతనికి దూరంగా జరిగి నిలబడడం. కల కాదన్నట్టుగా వాళ్లిద్దరి మధ్యా అందరికీ కనబడేలా గోడ కూడా వెలిసింది. వచ్చి ఆమెను పరామర్శ చెయ్యడానికి ముందుగా జంకి, కొన్నాళ్లకి అతను కనుచూపుమేరలో లేడని నిర్ధారణ అయిన తరువాత ఒక్కొక్కరుగా అప్పుడప్పుడు విచ్చేశారు. తరువాత, అలా రావడాన్ని అతను ఓరచూపులో చూసినా కూడా పట్టించుకోకపోవడం, ఆ రాక అతని కనుసన్నల్లో జరిగినా కోపగించుకోకపోవడం వాళ్లకి కొంచెం ధైర్యాన్నిచ్చాయి. కూపీ తియ్యగా, లావాదేవీల్లో వచ్చిన కష్టనష్టాలు అతని మనసుని పూర్తిగా ఆక్రమించుకున్నాయని తెలిసింది. అత్యధిక శాతం ఊపిరి పీల్చుకున్నారు.

'బలహీనుడి కష్టాలు వాడివీ, బలవంతుడి కష్టాలు అందరివీ,' అని భయపడ్డవాళ్లు లేకపోలేదు.

'నీకు మంచిరోజులు వచ్చాయమ్మా,' అన్నారు వాళ్లు ఆమెతో. 'నిజంగానా? కిటికీలోంచి లోపలికి దూరాయా, లేక చిమ్నీలోంచి కిందకి దూకాయా? మూసివున్న తలుపులని తట్టడం మాట అటుంచి, తీసివున్న తలుపుల లోంచి అయినా

వచ్చే ధైర్యం వాటి కెక్కడ ఉన్నదీ?' ఆమె జవాబిచ్చింది. గోడ అడ్డున్నా గానీ తన స్వాతంత్ర్యం గూర్చిన బెరుకు ఆమె పెడసరపు జవాబు వెనక దాగి ఉన్నది.

వాళ్లనది సర్రుమని కాల్చింది. చుట్ట కాలుస్తున్న అతని ముందుకెళ్లి దూరంగా తలలు వంచి మోకాళ్ల మీద నిల్చుని, 'మీరు ఆమె వైపు వెళ్లద్దని వేడుకుంటున్నాము,' అన్నారు. అతను చుట్టని నోట్లోంచి తీసి దాన్ని చిటికెనవేలితో మీటి నుసిని రాల్చాడు. దానితోబాటే వెలువడ్డ ఒకట్రెండు నిప్పురవ్వలు వాళ్లని అక్కడినించీ తరిమాయి.

భవిష్యత్తు గూర్చి ఆమె భ్రమలో లేదని కాలం నిరూపించింది. ఒకనాడు అతను వాళ్లిద్దరి మధ్య గోడని పగులగొట్టాడు. పలుగులతో, సుత్తులతో కాదు. నోటితో 'ఉఫ్' మని ఊది. కింద పడుతున్న రాళ్లు గాలిలో కలుగజేసిన 'అల'జడి అందరినీ తాకింది.

'గోడ ఉండి ఆపిందేదీ లేకపోతే ఆగే దేదీ? హద్దు అనేదే ప్రశ్నార్థక మయినప్పుడు!' అనుకున్నారు వాళ్లు తాత్త్వికంగా. గోడ ముక్కల గూర్చి తమకు తెలియనట్లే తప్పించుకుని తిరగడానికి ప్రయత్నించారు. అయినా వాళ్లని బరిలోకి లాగకుండా అతను ఊర్కోలేదు.

ఆమె దగ్గర ఉన్న ఆయుధా లంటే తనకి భయ మన్నాడు. అవి తనని నిద్రపోనివ్వడంలే దన్నాడు. వాటిని ఇప్పిస్తే తను ప్రశాంతగా ఉండగల నన్నాడు. వాళ్లా వార్తని ఆమెకి చేరవేశారు.

'నా దగ్గర ఆయుధా లేమున్నాయ్?' అన్న దామె ఆశ్చర్యపోయి.

'దబ్బనమూ, సూదీ!' అతను వివరించాడు.

'ఆమె బాగోగులని మనలో ఎవరు చూడగలరు? ఆమె వైపు చెయిచాచి పడగ నీడలోకి కావాలని ఎవరు చేరగలరు?' వాళ్లు గుసగుస లాడుకున్నారు.

'ఇచ్చేయ్! అతను భయపడడానికి నీ దగ్గర ఇంక కారణా లేవీ ఉండవు,' అని నచ్చచెప్పారు ఇరుగుపొరుగులు. ఏ సహాయం కావలసి వచ్చినా తను వాళ్లనే అర్థించాలి కాబట్టి ఆ సలహాని ఆమె అసమ్మతి తెలుపుతూనే పాటించింది.

కొన్నాళ్లకి ఆమెను తనలో కలుపుకోవడానికి అతను మళ్లీ చేతులు చాచాడు. ఆ బలం దిక్కులు పిక్కటిల్లేలా గర్జించింది. జూలు విదిల్చుకుంటూ గాండ్రించింది. తెల్లభల్లూకమై రొమ్ములు చరిచింది.

శాంతి విఛ్చిన్న మవుతున్నదని చోద్యగాళ్లు అనుకున్నారు గానీ, ఆమె అనుభవం మేరకు దానికి ఎప్పుడో కాలంచెల్లింది.

'గాలి వీస్తోంది కదా? వెలుతు రొస్తున్నది కదా? తిండికేం లోటులేదు కదా? ఫలితం తెలిసినదే కదా?' అంటూ వాళ్లు ఆమెని రాజీకి రమ్మన్నారు.

స్థిరత్వం కోసం కాళ్లు ఎడంగా పెట్టి, రెండు చేతులూ నడుం మీద నిలిపి నిల్చుని, తలని పైకెత్తి తీక్షణంగా చూసి ఆమె తన భంగిమతో వాళ్లకి జవాబు చెప్పింది.

పరమపదసోపానంలో కొందరు పాము నోట్లో పడి మొదటి గడిలోకి జారినా, వాళ్లు అక్కడి నించీ మళ్లీ జీవన ప్రయాణాన్ని మొదలుపెట్టవచ్చు.

మొదటి గడిలోంచే తోకతో తొయ్యబడి, కొండచరియమీంచి పడిపోతున్నప్పటిలాగా అంచుని మునివేళ్లకి చేజిక్కించుకుని వేలాడుతూ అగాధంలోకి చేరకుండా తమని కాపాడుకుని, పైకి వద్దామని చేసే యుద్ధమే కొందరి జీవితం. వాళ్లకి సోపాన పటం ఆట అంటే పటం లోని మొదటి గడిని మళ్లీ మళ్లీ చేరడానికి పోరాడ్డం.

## క్రైమ్ నెవర్ సేస్... డా.వి.కె.వీ ప్రసాద్ (Hyderabad, India)

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

"కమిషనర్ దొరగారు మిమ్మల్ని రమ్మంటున్నారు మేడమ్", అంటూ డోర్ తెరుచుకుని లోపలికొచ్చాడు ఎస్ఐ యాదగిరి.

"ఎందుకు", అంటూ అడుగుతూనే లేచి బయటకు వచ్చింది సిఐ షీల.

ఇద్దరు కమిషనర్ గదిలోకి వెళ్లేసరికి అయన ఎదురుగా ఉన్న వ్యక్తితో లోగొంతుతో ఏదో మాట్లాడుతున్నాడు.

వీళ్ళిద్దర్నీ చూడగానే పక్కనున్న కుర్చీల్లో కూర్చోమన్నట్లు సైగ చేసి తన ఎదురుగ ఉన్న వ్యక్తిని పరిచయం చేసాడు.

"షీలా ఈయన శ్రేయస్ , మాల కేసులో కేంద్ర ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేటర్", అని పరిచయం చేసాడు.

సుమారు 35 సంవత్సరాలున్న ఒక బక్కపలచని మనిషి, వదులుగా ఉన్న బట్టలు, ఎక్కువ దువ్వాల్సినంత అవసరం లేనిపల్చటి జుట్టు, లేచినుంచుని షేక్ హ్యాండ్ ఇచ్చినపుడు అతను ఆమె భుజాలవరకు వచ్చాడు.

"మీ టీం కి కార్నర్ రూమ్ రెడీ చేయించాను, ప్లీజ్ హెల్ప్ హిం" అంటూ ఫైలులో తలదూర్చాడు కమీషనర్.

ముగ్గురు లేచి తమకి కేటాయించిన రూమ్ కెళ్లారు. రూమ్ లోకి వెళ్ళినతర్వాత శ్రేయస్ కోరికపై కేసు గురించి చెప్ప సాగింది షీల.

"మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ రాకపోవడంతో అప్పొజిషన్ కి చెందిన మూడు పార్టీలు కలిసి సమావేశాలు నిర్వహించేవారు. అలాంటి ఒక మీటింగ్ ఒక రిసార్ట్ లో ఏర్పాటు చేసారు. అందులో పార్టీల ముఖ్య నేతలు మాత్రం ఉన్నారు.

ఫ్రీడమ్ పార్టీ లీడర్ రావు గారు, అయన కుమార్తె మాల, అల్లుడు వంశి, మాస్ పార్టీ అధ్యక్షుడు విలాస్, ఆయన కొడుకు రాజు, డెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకులు అజర్, జాన్, పటేల్ పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు వాడి వేడిగా జరిగిన సమావేశాల తర్వాత అందరు ఒక నిర్ణయానికి వచ్చి మరుసటిరోజు ప్రెస్ మీట్లో ఎవరు ముఖ్యమంత్రి అన్నదానిమీద వివరణ ఇస్తారని వార్త వచ్చింది. అయితే దురదృష్టవశాత్తు ఆ రాత్రే మాల అదృశ్యమైంది.

మాల అపుడపుడు ఇలా రెండు మూడు రోజులు ఎవరికీ చెప్పకుండా ఏటో వెళ్లిపోయేది, ఆఖరికి భర్తకి కూడా. అందుకేరావుగారు ఒక రోజంతా ఎదురుచూసారు. ఎన్నిసార్లు మాల సెల్ కి ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తుండడం ఆయన్నికొంత ఆందోళనకి గురిచేసింది. ఇంక ఆగలేక రెండో రోజు పోలీస్ రిపోర్ట్ ఇచ్చారు.

మాల భర్త కథనం ప్రకారం రాత్రి పదిగంటల ప్రాంతంలో భోజనం తర్వాత మాల బయటకు వెళ్లిందని, తొందరలోనే వస్తాను అని సెక్యూరిటీ గార్డ్ ని కూడా తీసుకెళ్లకుండా తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిందని చెప్పాడు.

రహస్య మంతనాలు జరుగుతున్నందువల్ల ఆ రిసార్ట్లో అప్పుడు ఎక్కువమంది గెస్ట్స్ లేరు.

రావు గారు, మాల, వంశి మాత్రం ఆ రాత్రి అక్కడున్న గెస్ట్స్ , వాళ్లతోపాటు రిసార్ట్ సిబ్బంది, రావు గారి ప్రైవేట్ సెక్యూరిటీకలిపి ఒక ఇరవై మంది వరకు ఉన్నారు.

మంతనాలకి వచ్చిన మిగితా నాయకులు సాయంత్రం ఏడున్నరకే వెళ్లిపోయారని తెల్సింది.

రాజకీయంగా పైకెదుగుతున్న మాల అదృశ్యం అన్ని రకాలుగా చాల అలజడి సృష్టించింది. కాబోయే ముఖ్యమంత్రి కుమార్తెగా మీడియా, ప్రజలు అప్పటికే ఆమెని గుర్తించారు. ఆమె మాయమవడం టీవీ ఛానెళ్లన్నీ బ్రేకింగ్ న్యూస్ లగా జనాలకి పిచ్చెకించాయి, పేపర్లు కూడా స్పెషల్ ఎడిషన్స్ అంటూ వార్తని సెన్సేషనలైజ్ చేసాయి.

ఆమె ఆచూకీ కనిపెట్టడానికి పోలీసులు చాల కష్టపడ్డారు. స్వయంగా డీజీపీయే రంగంలోకి దిగారు. కానీ రెండు రోజులపాటు ఏ రకమైన క్లూస్ దొరకలేదు. ఆమె సెల్ ఫోన్ ఆఖరి లొకేషన్ వాళ్ళున్న రిసార్ట్ గా గుర్తించారు.

ఆ తర్వాత ఆ టైములో అక్కడున్న రిసార్ట్ ఉద్యోగుల్ని, సెక్యూరిటీ వాళ్ళని ఆఖరికి రావుగారిని, వంశీని కూడా అనేకరకాలుగా ప్రశ్నించారు. కానీ కొత్తగా ఏమి కనిపెట్టలేకపోయారు. అందరికి బలమైన ఎలిబీలు ఉన్నాయ్.

అందరి సెల్ ఫోన్లొకేషన్స్, కాల్ డేటా రికార్డ్స్ పరిశీలించిన తర్వాత కూడా ఎవరిని అనుమానించడానికి అవకాశం లభించలేదు.

అయినా అలవాటు ప్రకారం పోలీసులు వాళ్ళందర్నీ తమదైన శైలిలో ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయింది.

రోజు రిసార్ట్ లో మీటింగ్ కి వచ్చే నాయకులని కూడా ప్రశ్నించారు, వాళ్ళ సెల్ కాల్ డేటా రికార్డ్స్ కూడా పరిశీలించారు. కానీ ఉపయోగపడే సమాచారం ఏదీ దొరకలేదు.

మాలని ఎవరైనా కిడ్నప్ చేశారేమో అన్న కోణంలో కూడా పరిశోధన సాగింది. కానీ కిడ్నాపర్ ఎవరు డబ్బు కోసం ఫోన్చెయ్యకపోవడం, మాలకి, వంశీకి, రావు గారికి శత్రువులు ఎవరు లేరని రావుగారు చెప్పడంతో ఆ దిశగా ప్రయత్నం విరమించుకున్నారు.

మూడు రోజుల తర్వాత మాల డెడ్ బాడీ, 24 గంటలు తెరిచిఉండే లాలా మాల్ సెల్లార్ పార్కింగ్ లో ఉన్న ఆమె ఆడి కార్డిక్కిలో దొరకడంతో అందరు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు.

అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డ్ ఆ టైములో నిద్రపోతుండడం వల్ల ఆ కార్ వచ్చినట్లు కూడా అతనికి తెలీలేదు.

పోలీసులు కూడా ఆమె

ఏదో ప్రేమ వ్యవహారం వల్ల దేశం విడిచి వెళ్ళిందేమో అనే అభిప్రాయానికి వచ్చి తమ విచారణవేగం తగ్గిస్తున్న వేళ ఆమె మృతదేహం దొరకడంతో మళ్ళీ తమ పరిశోధన ముమ్మరం చేసారు.

మాల్ లో ఉన్న సిసి కెమెరాల సహాయంతో ఆ కారు రెండు రోజుల క్రితం తెల్లవారుఝామున 4.37 కి సెల్లార్ పార్కింగ్లో పెట్టబడింది అని తెలిసింది.

కానీ కారులో ఎవరున్నారో వివరంగా తెలీలేదు. అక్కడనుంచి బయటకి దారి లేకపోవడంతో కారులోంచి దిగిన వ్యక్తి లిఫ్ట్ద్వారా గాని , మెట్లమీంచిగాని మాల్ లోకి వెళ్ళివుంటారు అని అక్కడి సిసి కెమెరాల ఫ్యూటేజ్ కూడా సంపాదించారు పోలీసులు.

వెలుతురు సరిగా లేకపోవడం వల్ల వివరాలు సరిగా కనిపించలేదు. ఒక నడివయసు మొగవాడు పూర్తిచేతుల స్వెటర్, మంకీ కాప్ ధరించి లిఫ్ట్ దిగి మాల్ లో ఏదో కొనుక్కుని బిల్ చెల్లించి వెళ్లినట్లు అస్పష్టంగా కనిపించింది.

కౌంటర్లో ఉన్న వ్యక్తిని విచారించగా అతను ఒక డజన్ అరటిపళ్ళు కొని కాష్ చెల్లించాడని, అతని ముఖం సరిగా కనపడలేదని, చూస్తే గుర్తు పట్టలేనని కూడా చెప్పాడు.

పోస్ట్ మార్టంలో వెడల్పయిన పట్టీతో గొంతు నులమడం వల్ల ఊపిరి ఆడక చనిపోయిందని, శరీరం మీద వేరే గాయాలుగాని, పెనుగులాట జరిగినట్లు సూచించే వేరే గుర్తులేవి లేవని, ఆమె మీద లైంగిక అత్యాచారం జరగలేదని , రక్తంలోఆల్కహాల్ మోతాదుకు మించి ఉందని, కడుపులో పూర్తిగా జీర్ణం కాని ఆహారం ఉందని రిపోర్ట్ ఇచ్చారు.

మరణించిన రెండు రోజుల తర్వాత శవపరీక్ష జరగడంవల్ల బాడీ కొంతమేర డికంపోజ్ అయిందని కూడా నిర్ధారించారు.

ఒంటి మీద పెనుగులాట గుర్తులు లేకపోవడంతో మాలని తెలిసినవాళ్ళే హత్య చేసారని అనుమానించిన పోలీసులు ఆకోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

ముందుగా వాళ్ళ అనుమానం మాల భర్త వంశి మీదకు మళ్లింది. అతన్ని పిలిచి గట్టిగా విచారించగా తనకి భార్యకి మధ్యచిన్న చిన్న మాట పట్టింపులే తప్ప పెద్దగా విబేధాలు లేవని చెప్పాడు. అయినా తామిద్దరూ ప్రేమించి, పెద్దాళ్ళందరిని ఎదిరించి పెళ్లిచేసుకున్న విషయం పోలీసులకి గుర్తు చేసాడు.

వంశి ఒకప్పుడు భారత క్రికెట్ జట్టులో ప్రముఖ ఆల్ రౌండర్. మాల జర్నలిస్ట్ గా పనిచేసేది. అప్పుడు జరిగిన వారి పరిచయం తరువాత ప్రణయంగా మారింది.

ముందు రావుగారు ఈ సంబంధం ససేమిరా వద్దన్నారు. అప్పుడు ఆయన హోమ్ శాఖామంత్రి కూడాను. కానీ మాల పెళ్లంటూ చేసుకుంటే వంశీనే చేసుకుంటాను, లేకపోతే అసలు పెళ్లే చేసుకోను అని పట్టుపట్టింది. ఒక్కగానొక్క కూతురు అదీ తల్లి లేని పిల్ల మాలని నొప్పించడం ఇష్టం లేక చివరకు వాళ్ళ పెళ్ళికి ఒప్పుకున్నారు రావుగారు.

తాను రాత్రి రిసార్ట్ లోనే ఉన్నానని, ఉదయం ఎంత సేపటికి మాల రాకపోవడంతో రావుగారికి ఈ విషయం చెప్పానని వంశి చెప్పాడు.

రిసార్ట్ లో అన్ని రూములు గాలించిన పోలీసులకి ఏ ఆధారాలు లభించలేదు.

రావుగారు కూడా ఎవరిపైన అనుమానం వ్యక్తం చెయ్యలేదు, సరికదా తమకి పెద్దగా శత్రువులు ఎవరు లేరని చెప్పారు.

రిసార్ట్ కి మంతనాలకు వచ్చిన మిగతా నాయకులని కూడా నిశితంగా ప్రశ్నించారు పోలీసులు. కానీ ఎవరిని అనుమానించేలాంటి ఆధారాలేం దొరకలేదు" , చెప్పడం ఆపి గట్టిగా నిట్టూర్చింది షీల.

ఇలా రోజులు గడిచిపోతున్నా హంతకులెవరో తెలీకపోవడంతో మీడియా ఒత్తిడి ఎక్కువైంది పోలీసులకి.

అటు గవర్నర్ రోజు ఫోన్ చేసి పోలీసుల అసమర్థతే ఈ కేసు ముందుకు సాగలేకపోవడానికి కారణం అంటూ తలంటేవాడు. అంతటితో ఆగకుండా సిబిఐ కి ఈ కేసు అప్పగించాలని కేంద్రానికి ఒక లేఖ రాసి పడేసాడు.

వెంటనే స్పందించిన కేంద్రం ఎన్నో కేసుల్లో తన ప్రజ్ఞపాటవాలు చూపిన శ్రేయాస్ ని లీడ్ ఇన్వెస్టిగేటర్ గా ఈ కేసు డీల్చెయ్యడంలో పోలీసులకి సహాయం చెయ్యడానికి డెప్యూట్ చేసింది.

షీల చెప్పిందంతా శ్రద్ధగా వింటున్న శ్రేయాస్ ఆమె ఆపగానే " కేసు మెటీరియల్ తెప్పించండి" అని అడిగాడు.

ముందుగా పోస్టుమార్టం రిపోర్ట్ శ్రద్ధగా చదివాడు. అందులో ఒకచోట సాక్రల్ భాగంలో కంటూషన్ అని రాసి ఉన్న చోట ఆగి ఆలోచించసాగాడు.

తర్వాత ఆ ఫైలులో ఉన్న ఫొటోలన్నీ శ్రద్ధగా పరిశీలించాడు. మాల్ లోపల ఉన్న సిసి టీవీ ఫుటేజ్ గమనించసాగాడు, చనిపోయేటప్పుడు మాల వేసుకున్న బట్టలు నిశితంగా పరీక్షించాడు.

ఇవన్నీ అయిన తరువాత తన రూంలోకి వెళ్లి తలుపేసుకుని ఫోన్లో మాట్లాడుతూ ఉండిపోయాడు.

మరుసటి రోజు ఇద్దరు స్పెషలిస్టులు కమిషనర్ ఆఫీస్ కి వచ్చారు. అందులో ఒకాయన మాల స్కర్ట్ మైక్రోస్కోప్ కింద పరీక్షచేయ్యసాగాడు. స్కర్ట్ మీద అంటుకున్న కొంత మట్టిని ఒక గ్లాస్ జార్ లో సేకరించి శ్రేయాస్ తో ఏదో మాట్లాడి బయటికివెళ్ళిపోయాడు.

శ్రేయాస్ సిసి టీవీ ఫుటేజ్ ఇంకో స్పెషలిస్ట్ కి చూపించాడు. అయన తను తెచ్చిన పెన్ డ్రైవ్ లాప్టాప్ లో పెట్టి కొన్ని రీడింగ్స్నిట్ చేసుకున్నాడు. స్క్రీన్ మీద ఉన్న కొన్నిటిని ఫోటో తీసుకున్నాడు. రెండు రోజుల్లో రిపోర్ట్ ఇస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తర్వాత కమీషనర్ ఆఫీస్ లో ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసాడు శ్రేయాస్. దానికి రావుగారిని, వంశీని, రిసార్ట్లో పనిచేసే వాళ్ళందరిని, సెక్యూరిటీ వాళ్ళని, రిసార్ట్ లో ప్రభుత్వ ఏర్పాటు కోసం మంతనాలు సాగించిన నాయకులని కూడా ఆహ్వానించాడు. రాక తప్పదని సూచించడంతో ఈ కేసుకి సంబంధం ఉన్న అందరు అక్కడ హాజరు అయ్యారు.

మాల కేసు గురించి కీలకమైన ప్రకటన చేస్తానని శ్రేయాస్ వెల్లడి చేసినందువల్ల ఎంతోమంది మీడియా ప్రతినిధులు వచ్చారు. అప్పటికే మీడియాలో ఈ కేసు గురించి ఎన్నో కథనాలు బయటకు రావడంతో ప్రజలలో కూడా ఎంతో ఉత్కంట నెలకొంది. అందుకే హాల్ మొత్తం నిండిపోయి జనం హాలుబయట కూడా నిలబడ్డారు. శ్రేయాస్ లేచి నుంచిని హాల్ మధ్యలో ఉన్న స్క్రీన్ మీదకి స్లైడ్స్ వేసి అవి చూస్తూ మాట్లాడడంమొదలెట్టాడు.

"నాకు హంతకుడు ముందే తెల్సు కానీ రుజువులు సంపాదించడం కోసం ఇంత టైం పట్టింది" అంటూ రావుగారికేసి చూసిచిన్నగా నవ్వాడు.

ఆ మాటలు వినగానే నమ్మశక్యం కానట్లు విలేఖరులు ఒకరిమొహాలు ఇంకొకళ్ళు చూసుకున్నారు

"ఈ కేసులో నిందితులు మాలకి తెల్సినవాళ్ళే , ఎందుకంటే ఆమెని డబ్బు కోసం కిడ్నాప్ చెయ్యలేదు. ఆమె పై ఏ రక మైనఅత్యాచారం కూడా జరగలేదు. అంతేకాకుండా వంటిపై ఏలాంటి గాయాలు కూడా లేవు.

ఇది తెలియగానే అనుమాస్తుల జాబితా సన్నపడింది. ఆ సమయంలో రిసార్ట్ లో ఉన్న అందరికి సరిఅయిన ఎలిబీలు ఉండడంతో చిక్కొచ్చింది .

దాంతో హంతకుడు రిసార్ట్ బయటే మాలని కలిసాడని రుజువైంది" అంటూ అజర్, రాజు, జాన్, పటేల్, విలాస్ కూర్చున్నవైపు చూసాడు.

అతడి చూపు తమవైపు మళ్ళగానే వాళ్ళ మొహాల్లో భయం కనిపించింది. రావుగారు, వంశి వాళ్ళకేసి కోపంగా చూసారు.

"తర్వాత రిసార్ట్ బయట ఉన్న అందరి కాల్ రికార్డులు, సెల్ ఫోన్ లొకేషన్స్ పరిశీలించాం కానీ ఏ క్లూ దొరకలేదు. అందులోకూడా హంతకుడు జాగ్రత్త వహించాడు.

వీళ్ళలో ఎవరైనా కిరాయి మనుషుల్ని ఉపయోగించి హత్య చేయించారా అన్న కోణంలో కూడా పరిశోధన చేసి అదీ జరగలేదు అని నిర్ధారణ చేసుకున్నాం.

మాలకి నడుము మీద తగిలిన దెబ్బ బట్టి ఆమెని చంపేసిన తర్వాత కొంతదూరం లాన్ లో ఈడ్చుకుంటూ తీసికెళ్ళినట్టు గుర్తించాం.

మాల స్కర్ట్ మీద అంటుకున్న గడ్డిపరకల్ని మా స్పెషలిస్ట్ పరిశీలించి అది రాజు, విలాస్ వాళ్ళు బసచేసిన హోటల్ లాన్లోని గడ్డిపరకలుగా గుర్తించాడు" అంటూ ఆగాడు.

అంతవరకూ తలవంచుకుని రాసుకుంటున్న రిపోర్టర్లు అందరు ఒక్కసారి రాజు, విలాస్ కూర్చున్న వైపు చూసారు. వాళ్లతోపాటు ఆ గదిలో ఉన్న అందరి కళ్ళు తమమీదే ఉండడం చూసి వాళ్లిద్దరూ భయంతో తల దించుకున్నారు.

అదేమీ గమనించనట్లు శ్రేయాస్ మాట్లాడాడు,

" హంతకుడి గురించి మనకున్న ఒకే ఒక ఆధారం మాల్ లో లభించినపుటేజ్ . కానీ అది స్పష్టంగా లేకపోవడం వల్ల ఏ వివరాలు తెలియలేదు. అందుకని ఇంకో స్పెషలిస్ట్ సహాయంతీసుకున్నాం. దాంతో హంతకుడి మొహం తెలీలేదు

కానీ ఎంతో ముఖ్యమైన విషయాలని గుర్తించి, ఈ మర్డర్ కేసు సాల్వ్
చేయగలిగాము" అంటూ చెమట పట్టిన నుదిటిని తుడుచుకున్నాడు. అపుడు హాల్లో సూది వేస్తే వినపడేంత నిశ్శబ్దం అలుముకుంది.

ఆ నిశ్శబ్దంలోంచి శ్రేయాస్ కంఠం ఖంగున మోగింది.
" హంతకుడి ఎత్తు 5 అడుగుల 10 అంగుళాలని నిర్ధారించాడు మానిపుణుడు. హంతకుడు నుంచున్న టైల్స్ సైజు బట్టి, ఆ షాపింగ్ ఏరియా సైజు బట్టి, గుమ్మం ఎత్తు బట్టి క్లిష్టమైనకాలుకులేషన్స్ ద్వారా అతడు హంతకుడి ఎత్తుని కరెక్టుగా
చెప్పగలిగాడు".

హంతకుడి ఎత్తు చెప్పగానే ," వీళ్ళే నా మాలని చంపారు, ముఖ్యమంత్రి పదవి వాళ్ళకి దక్కదని తెలిసి ఈ రాక్షసులే నాభార్యని పొట్టన పెట్టుకున్నారు" అంటూ వంశి అజర్, జాన్, పటేల్ కూర్చున్న టేబుల్ వైపు పరిగెత్తాడు.

ఇంచుమించు ఒకే ఎత్తున్న ఆ ముగ్గురు ఈ హఠాత్పరిణామానికి తెల్లబోయి శ్రేయాస్ కేసి చూస్తూ ఉండిపోయారు.

శ్రేయాస్ అరుస్తున్న వంశీని వారించి "చట్టాన్ని మీ చేతులలోకి తీసుకోకండి, అసలు హంతకుడు తప్పించుకోలేడు, దేర్ఈస్ నో పర్ఫెక్ట్ క్రైమ్" అన్నాడు.

తనని పట్టుకున్న పోలీస్ వాళ్ళని వదిలించుకుంటూ కుర్చేలో కూలబడ్డాడు వంశి.

ఒక రిపోర్టర్ ఆతృత అణుచుకోలేక " ఇంతకీ ఎవరంటారా హంతకుడు?

వాళ్ళ ముగ్గురు తోపాటు రావుగారు, వంశి కూడా అంతే ఎత్తు ఉన్నారు. అంతెందుకు నేను కూడా అదే ఎత్తు. అయితే నేను హంతకుడినా" అనగానే అందరు పెద్దపెట్టున నవ్వుతు శ్రేయాస్ కేసి జాలిగా చూసారు.

అందరి నవ్వులు ఆగినతర్వాత కొనసాగించాడు శ్రేయాస్ "హంతకుడు పొద్దునే అరటిపళ్ళు కొన్నాడు, షాపింగ్ చెయ్యకుండా మాల్ లోంచి బయటకు వెళ్తే మాల్ ఉద్యోగులకు గుర్తుంటానని అవి కొన్నాడు. అలవాటుగా
అరటిపళ్ళు కొన్నాడు, అంటే రెగ్యులర్ గా అవి తినేవాడు అయ్యుంటాడు.

సీసీ కెమేరాలో హంతకుడు వేసుకున్న బట్టల్లో ఏ ప్రత్యేకత కనిపించలేదు కానీ అంటూ ఆగాడు. అందరు ఆసక్తిగా తరవాత ఏమి చెప్తాడో అన్నట్టు ఊపిరి బిగపట్టి ఎదురుచూస్తున్నారు.

కాని ఒక ఫ్రేమ్ లో హంతకుడి కాళ్లు ముఖ్యంగా హంతకుడు వేసుకున్న షూ చిరిగిపోయి వుండడం స్పష్టంగా
కనిపించింది. ఆ చిరుగు కూడా చాల ప్రత్యేకమైంది. అదేముఖ్యమైన క్లూ ఈ కేసులో.

ఎడమ కాలి బొటనవేలి దగ్గర షూ చిరిగి ఉంది, మిగితా షూ అంతా కొత్తగా ఉంది. ఆ చిరుగు కూడా కావాలని చేసినదిగాగుర్తించాను. దాంతో అనుమానం వచ్చి వెదికితే అసలు కథ బయటపడింది" అన్నాడు.

షూ చిరగటానికి హంతకుడి ఆచూకీ కి గల సంబంధం అర్థం కాక అందరు శ్రేయాస్ వంక ఆసక్తిగా చూసారు. వాళ్ళ ఆసక్తిగమనించి " సాధారణంగా షూని ఎడమ కాలి బొటనవేలి దగ్గర కట్ చేసేది ఫాస్ట్ బౌలింగ్ చేసేవాళ్ళు. కుడిచేతి ఫాస్ట్బౌలర్ బౌల్ చేస్తున్నప్పుడు బౌలింగ్ క్రీజ్ లో ఎడమ కాలిమీద బరువంతా వేస్తాడు.అప్పుడు బొటనవేలు మీద ఎక్కువవత్తిడి పడకుండా ఉండడానికి ఇలా షూని కట్ చేస్తారు" అన్నాడు.

హాల్లో ఉన్నవాళ్ళందరూ ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయి అతను చెప్పేది వింటున్నారు.

అరటిపళ్ళు కూడా క్రీడాకారులు ఆట మధ్యలో సత్వర శక్తీ కోసం ఎక్కువగా తింటుంటారు అంటుండగా "అంటే షూ బట్టి, అరటిపళ్ళు కొనడం బట్టి హంతకుడని అంటారా" అంటూ ఆవేశంగా లేచాడు వంశి.

"అవేకాదు మిస్టర్ , మాలని హత్య చెయ్యడానికి ఆమె మెడచుట్టు నువ్వు బిగించిన రబ్బర్ బాట్ గ్రిప్, నువ్వు

అలవాటులో

పొరపాటుగా వేసుకున్న నీ బౌలింగ్ షూస్ రెండు జింఖానా క్లబ్ లోని నీ లాకర్ నుంచి సంపాదించాను" అన్నాడు.

ఆ మాటలు వినగానే గాలి తీసిన బెలూన్ లాగా కుర్చీలో కూలపడిపోయి ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు వంశీ

తనవైపే చూస్తున్న అన్ని కెమెరాలని తప్పించుకోడానికా అన్నట్లు.

శ్రేయాస్ సైగతో ఇద్దరు పోలీసులు వంశీని బయటకు నడిపించుకుంటూ తీసుకువెళ్లారు.

పెద్దగా ఏడుస్తున్న రావుగారి భుజం మీద చెయ్యి వేసి

" క్రికెట్ బెట్టింగ్ , మ్యాచ్ ఫిక్సింగ్ లో పీకలదాకా కూరుకుపోయాడు

వంశి. ఆ వివాదాల నుంచి బయట పడాలంటే పవర్ కావాలని అనుకున్నాడు. అందుకోసం తను

ముఖ్యమంత్రి అవాలని

కోరుకున్నాడు. మాల జీవించి ఉంటె తన ఆశ తీరదని, తను మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో ఇరుక్కుని జైలు కెళ్ళడం తప్పదని భావించి వంశి ఈ పనిచేసాడు. ఆమె పేర ఇన్సూర్ చేసిన పెద్దమొత్తం మీద కూడా ఆశ పుట్టింటుంది.

ఆ రాత్రి మాలినితో విలాస్ వాళ్ళు మనల్ని మాట్లాడడానికి వాళ్ళ హోటేలుకి రమ్మన్నారు.

బయట విలేఖరులు ఉంటారు మన ఇద్దరం కలిసి వెడితే వెంటపడతారు కాబట్టి నువ్వు ముందువైపు నుండి వెళ్ళు. నేను వెనుక వైపు నుంచి గోడ దుంకి వస్తానని చెప్పి మాలని విలాస్ వాళ్ళ హోటల్ కి తీసికెళ్ళాడు.

మాలని ఆమె సెల్ ఫోన్ రిసార్ట్ లోనే ఆఫ్ చేసుకోమని చెప్పాడు. తన మొబైల్ కూడా తీసుకెళ్లకుండా రూంలోనే ఉంచేసాడు.

అక్కడ విలాస్ వాళ్ళ గది వెనుక చీకట్లో తనతో పాటు తెచ్చుకున్న రబ్బర్ బాట్ గ్రిప్ ఆమె మెడచుట్టూ బిగించి ఆమెని హత్యచేశాడు. తర్వాత ఆమె శరీరాన్ని లాక్కుంటూ తీసికెళ్ళి కార్ బూట్ లో పడుకోపెట్టి , కార్ ని లాలా మాల్ సెల్లర్ పార్కిం గ్లాట్ లో పిల్లర్ చాటుగా వదిలేసాడు.

తెల్లవారుఝామున సెక్యూరిటీ వాళ్ళు నిద్రలో ఉండే అవకాశం ఎక్కువ, పార్కింగ్ చేసే కార్లని చెక్ చెయ్యరని తెల్సి ఆ సమయం లో పార్కింగ్ లో ఉంచాడు. పిల్లర్ చాటుగా ఉండడం వాళ్ళ అక్కడ కార్ చాలసేపునుంచి పార్క్ చెయ్యబడిందిఅని తెలుసుకోడానికి అంత టైం పట్టింది.

అరటిపళ్ళు కొనుక్కుని తిరిగి రిసార్ట్ వెనుకవైపు గోడ దూకి తన రూమ్ కొచ్చి పడుకున్నాడు.

ప్రతి నేరస్థుడు తాను చాల తెలివైన వాడినని, తనని ఎవరు పట్టుకోలేరనే భావిస్తారు. కానీ నేర పరిశోధన ప్రస్తుతం బాగాహై టెక్ అవడం వల్ల నేరం చేసి తప్పించుకోవడం అంత సులభం కాదు" అన్నాడు.

"ఆ రబ్బర్ బాట్ గ్రిప్ మీద ఉన్న ఉబ్బెత్తు భాగం ముద్ర ఆమె మెడ మీద కూడా పడింది. సాధారణ శవ పరీక్షలో కన బడనిఈ విషయం హై పవర్ రెసొల్యూషన్ లో స్పష్టంగా తెలిసింది.

మాల స్కర్ట్ కంటుకున్న మట్టి గడ్డి పరకల నమూనాలని అల్ట్రా హై పవర్ మైక్రోస్కోప్ లో పరీక్షచేసి వాటిని హోటల్ గ దివెనుక ఉన్న మట్టి, లాన్ లోని గడ్డిపరకలుగ గుర్తించగలిగాము.

లేటెస్ట్ రెసొల్యూషన్ టెక్నిక్ వల్ల సిసి కెమెరాలో పిక్చర్స్ అస్పష్టంగా ఉన్నాకూడా, హంతకుడి ఎత్తు, అతను ధరించిన దుస్తులు, షూస్ వివరాలు స్పష్టంగా కనిపించడం వల్ల కేసు సులువుగా సాల్వ్ చేయగలిగాము" అన్నాడు.

అతని మాటలాగగానే హాలంతా తప్పట్లతో మారుమోగిపోయింది. రావుగారు కూడా మనస్ఫూర్తిగా శ్రేయాస్ ని కౌగలించుకుని మౌనంగా కన్నీరు కారుస్తూ ఉండిపోయారు......

# రెండు నిమిషాలు అమృత వర్షిణి (Lone Tree, CO, USA)

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్ట మొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

**ఇంటికెళ్లి ఫ్రెష్ అప్** అవడానికిమొఖం కడుగుతుండగా పవిత్ర ఫోన్ బీప్ బీప్ అంది – "అరె ఆ మహానుభావుడే అయ్యింటాడులే , అతనికివేళా పాళా అంటూ ఏది ఉండదు " అంటూ తన క్లయింట్ మేనేజర్ ని తలుచుకుంటూ సగం కడిగిన మొఖం తోనే పరిగెత్తుకొచ్చి ఫోన్ చూసింది , ఆ మెసేజ్ క్లయింట్ మేనేజర్ శంకర్ నుండి కాదు , కానీ ఆ మెసేజ్ ఆమె తలరాతను మార్చేస్తుందని అప్పుడు ఆమెకి తెలియదు

★★★

పవిత్ర చెన్నై లో పుట్టింది, అయిదేళ్ళుగా చెన్నయి లోనే ఉద్యోగం చేస్తోంది.. ఏవో స్కూల్ టూర్ లకు కాలేజీ ఐ.వి లకు బెంగుళూరు , గోవా లాంటి చోటులకు వెళ్ళినా తన చదువు ఉద్యోగం అంతా చెన్నపట్నం లోనే. జాయిన్ అయిన ఏడాదికే ఆన్ సైట్ ఆపార్చునిటీస్ అని, పే హైక్ అని కంపెనీలు, దేశాలు మార్చేసే సహచరుల మధ్య తన మొదటి కంపెనీ ఐ.టి .సాఫ్ట్ సోల్ ని కూడా ఇంకా వదల్లేదు. ప్రమోషన్స్ తో అంచెలంచెలుగా ఎదిగి తన క్రింద ఒక ఏభై మంది రేపోర్టీస్ తో ఒక సీనియర్ డెలివరీ మేనేజర్ గా తన స్థానాన్ని పదిలం చేసుకొంది .

తను పాతాళంనుండి ఆకాశానికి ఎదిగిన అసాధ్యురాలు, తను చదివింది బి.టెక్ కూడా కాదు , బి.స్.సి. కంప్యూటర్ సైన్స్, ఆ క్వాలిఫికేషన్ తో తాను ఈ స్థాయిలో ఉండటం అంటే అంతా తన కృషికి ఫలితం. తన టాలెంట్, వాక్చాతుర్యం , లీడర్షిప్ స్కిల్స్ తో సాఫ్ట్ సోల్ లో తానే ఒక బ్రాండ్ అయి నిలిచింది . పవిత్ర కి ఒక పని అప్పజెప్పుమా, అయితే అందులో తప్పులు వెదకడం దేవుడికే అసాధ్యం అనేంతలా పేరు తెచ్చుకొంది.

పవిత్ర పొడవాటి జడ నడుంపైన వేసే నాట్యం చూసి ఎవరికయినా తన ఎదురెళ్లి తన మొహం చూడాలనే ఆశ కలగక తప్పదు , ముందు నుండి కూడా పవిత్ర అందెగత్తే , అంత అందానికి దిష్టి అన్నట్టు ముక్కు మీద కుడి వైపు అర

అంగుళం పొడవున్ననల్ల పుట్టు మచ్చ ఉంది. తాను పుట్టినపుడు ఆ మచ్చను అదృష్టం అన్నారు కొందరు, దురదృష్టం అన్నారు ఇంకొందరు , శాపం అన్నారు మరికొందరు ,

పవిత్ర జాతకంలో దోషం అని పైగా మూల నక్షత్రం వల్ల పెళ్ళయితే మామగారికి కీడు అన్నారు . చావు బ్రతుకుల్లో కూడా పవిత్ర నానమ్మ "ఈ పిల్ల ఈ ఇంటి శాపం" అంటూనే చనిపోయింది. ఆ పుట్టుమచ్చను ప్లాస్టిక్ సర్జరీ చేసి తీయించేదాం అన్న సందిగ్ధత తన అమ్మా నాన్నకు నేటికీ పోలేదు. తమలాంటి లోయర్ మిడిల్ క్లాస్ వారికి ప్లాస్టిక్ సర్జరీ ఒక లగ్జరీ,

పవిత్ర ఉద్యోగానికి వెళ్లిన పిమ్మట పరిస్థితులు మారాయి, కానీ అప్పటికే ఆ పుట్టు మచ్చ తనలో ఒక భాగం అయిపోయింది, మానసికంగా తను దానిని ఎప్పుడు పట్టించుకోలేదు , చిన్నపుడు పిల్లలు "నల్లమచ్చదానా" అని వెక్కిరించినపుడు బాధపడలేదు , ఎన్నో పెళ్లి చూపులలో తనను ఈకారణంగా తిరస్కరించినా కంగారు పడలేదు.మచ్చ ప్రస్తావన వచ్చిన ప్రతిసారి " నేను ఈ మచ్చతోనే పుట్టాను , నేను చచ్చేదాకా నాతో రాబోయేది ఈ మచ్చే , ఇక పెళ్లి సంగతా? ... అందరి రాతల్లో పెళ్లి ఉండదేమో " అని మాట మార్చేసేది.

ఊహ తెలిసినప్పటి నుండి తను కుటుంబానికే మొదటి ప్రాధాన్యత ఇచ్చేది, వాళ్ల నాన్నకి ఎప్పుడు మందులు ఇవ్వాలో , వాళ్ళ అమ్మకి ఎప్పుడు నడుము నొప్పి వచ్చిందో , వాళ్ళ అక్కకు పోయిన నెల ఎప్పుడు పీరియడ్స్ అయ్యిందో , వాళ్ళ నానమ్మ చివరిగా ఎప్పుడు శ్వాస వదిలిందో అంతా తన ఫింగర్ టిప్స్ లో ఉంటుంది. బహుశ అందుకేనేమో అయిదేళ్ల క్రితం తాను ఎంతగానో ఇష్టపడ్డ బావని అక్క కూడా ఇష్టపడుతుందని తెలిసి తనే స్వయానా వెళ్లి అక్కని పెళ్లి చేసుకోమని బావను ఒప్పించి వారిద్దరి పెళ్లి చేయిందింది .

ఆరోజుకూడా యెప్పట్లాగే ఆఫీసునుంచీ యింటికొచ్చింది పవిత్ర. యింతలో ఆ మెసేజీ వచ్చింది.

మెసేజ్ లో తాను నగ్నంగా స్నానం చేస్తున్న దృశ్యాన్ని చూసి భయంతో కంపించిపోయింది పవిత్ర. వర్కౌట్ చేసి తనపై కారే చమట , షవర్ నుండి జారే నీటితో కలిసి శరీరంపైన రకరకాలుగా ప్రవహించడం చూసి తన గొంతులో తడి ఆరిపోయింది. ముక్కుపైని పుట్టుమచ్చ తో పాటు మరెవ్వరు చూడకూడని చోటుల్లో ఉన్న పుట్టు మచ్చలు కూడా బహిర్గతం అవ్వడం చూసి స్తంభించిపోయింది. వీడియో కింద "RESIGN" అనే మెసేజ్ గర్జనలా ప్రతిధ్వనించింది , అది చాలదన్నట్టు ఈ వీడియో కాపీలు మరెన్నో ఉన్నాయి, RESIGN చేయకోపోతే వీడియో లీక్ చేసేస్తానంటూ బెదిరింపు సందేశం అదింది .

ఆ నిమిషం పవిత్రకు తన ఇల్లు, తన మేనల్లుడి ఏడుపు , హాల్ లో ఆన్ అయి ఉన్న టి.వి , బాత్రూం లో ఆఫ్ చేయని టాప్, కిచెన్ నుండి వస్తున్న కుక్కర్ విజిల్ ఇవేవి స్పృహకి అందలేదు.

ఆ మెసేజీ యెవరు చేసారో తెలుసుకోడం ఆమెకు కష్టమేమీగాదు.

విజయ్ పవిత్రకి డైరెక్ట్ రిపోర్టి. ఇటీవల కాలంలోనే కంపెనీ నుండి తొలగించ పడ్డాడు, బాగా డబ్బున్న ఒక రాజకీయ నాయకుడి కొడుకు , అంతటాయన కొడుకయినా సాధారణమైన ఐ.టి ఉద్యోగం చేస్తున్నందుకు మొదట్లో అందరూ అతన్ని మెచ్చుకునేవారు, కానీ అదికూడా విజయ్ , అతని నాన్న కలిసి చేస్తున్న పబ్లిసిటీ స్టంట్ అని మెల్లగా తెలిసింది. తను ఆఫీస్ కి సరిగ్గా రాడు, వచ్చినా పని చేయడు, చేసినా అది సక్రమంగా ఉండదు. పైగా ఆడవాళ్లంటే తనకి చులకన భావం.

ఓ సారి ఆఫీస్ స్టాఫ్ ని అసభ్యకర ఫొటోస్ తీసి వాటిని స్నేహితులతో షేర్ చేస్తున్నట్టు తెలిసింది. పవిత్ర ఆఫీస్ లో అందరి ముందు విజయ్ పై కోప్పడింది. ఒక నిమిషం కూడా ఆఫీస్ పరిధిలో ఉండకూడదు అని ఆదేశించింది. ఇకపై ఏ ఐ.టి కంపెనీ లోను అతడిని అడుగు పెట్టకుండా చేయిస్తా అన్నట్టు హెచ్. ఆర్ దగ్గర కంప్లైంట్ చేసి అతడి ఉద్యోగం తీయించింది.

విజయ్ అవమానం తట్టుకోలేక పోయాడు, పవిత్ర పై ఎలాగయినా పగ తీర్చులోవాలనుకొన్నాడు , ఆఫీస్ సెక్యూరిటీ స్టాఫ్ కి డబ్బులిచ్చి ఆఫీస్ జిమ్ షవర్ రూమ్ లో కెమెరాలు పెట్టించాడు, అక్కడే పవిత్ర నగ్నంగా వీడియో లో రికార్డు అయింది. ఆఫీస్ ఉన్న రోజుల్లో ఆమె వర్కౌట్ షెడ్యూల్ మిస్ అవ్వదు అని అందరికి తెలుసు, కాబట్టి ఈ స్కాండల్ నడిపించడానికి విజయ్ కి అంత కష్టం అవ్వలేదు.

మరునాడు ఆఫీసుకు వెళ్తూనే నందినిని కలిసింది పవిత్ర. నందిని తనకు బాస్ మాత్రమే గాదు,స్నేహితురాలు గూడానని ఆమెకెంతో నమ్మకం. పవిత్ర చెప్పిన సంగతి వినగానే నందిని నోట మాట రాలేదు, ఇంత విపత్కర సంఘటనను ఏ కోణం నుండి ఎదుర్కోవాలో తనకు అంతు చిక్కలేదు. ఈ సంఘటన కంపెనీ పరిసరాల్లో జరిగినందువల్ల హెచ్. ఆర్ దగ్గరకు వెళ్లాలా, లేదా, ఈ వీడియొ బయటకి రానందువల్ల బ్లాక్మెలర్ నుండి ఆ పై ఎటువంటి సందేశాలు రాకపోతే విషయం అలాగే సద్దుమణిగి పోయే అవకాశం ఉందా ?

సందిగ్ధత లో పడిన నందిని ఆలోచించుకోవడాని కాస్త సమయం అడిగింది. ఆఫీస్ సెక్యూరిటీ పై గుప్తంగా పరిశోధన జరిపించమని తన పెర్సనల్ అసిస్టెంట్ యశోదకి ఆదేశించింది. ఒక స్త్రీ గా, స్నేహితురాలిగా నందిని పవిత్రకి కెలా తోడ్పడగలనా అని అలోచించ సాగింది.

నందినితో మాట్లాడి తిరిగొచ్చి తన ఆఫీస్ రూమ్ లో లాప్ టాప్ ముందు కూర్చొన్న పవిత్ర మెదుడులో పోలీస్ స్టేషన్ వెళ్లాలా అన్న ప్రశ్న ఉత్పన్నం అయ్యింది. ఆలా వెళితే పోలీసులు, కోర్టులు, మీడియా అంటూ తాను ఎదుర్కోవలసిన ఆటంకాలు తన కంటి ముందు దృశ్యా లుగా మెదిలాయి. రెండే నిమిషాల వీడియొ వల్ల 24 గంటలుగా తాను అప్పటికే సమస్యల సుడిగుండంలో చిక్కుకొని ఉందన్న వాస్తవాన్ని గుర్తుంచింది. రెండు నిమిషాలే..... తన గౌరవాన్ని కోల్పోవడానికి..రెండు నిమిషాలే.... తన జీవితం తలక్రిందులై పోవడానికి.

ఆ రోజు పవిత్ర లంచ్ చేయలేదు, టి బ్రేక్ తీసుకోలేదు, అంతెందుకు,రెస్ట్ రూమ్ వెళ్ళడానికి కూడా బయపడింది. ఎటువైపు చూసినా అందరూ ఆమెనే చూసి గుస గుసలాడుతున్నట్టు –"వచ్చిందండి స్ట్రిక్ట్ మేడం, క్లయింట్ మేనేజర్ ఫేవరెట్ కేండిడేట్, ఇలాంటి వారికీ ఇలాగె జరుగుతుంది" అని వెక్కిరిస్తున్నట్టు అనిపించింది. వారి చూపులు ఆమె పసుపు నైలాన్ చొక్కా కిందనో, మరెక్కడో అన్వేషిస్తున్నట్టు తనకి అనుమానం కలిగింది. అప్పటికే విజయ్ ఆ వీడియోను ఆఫీస్ వాట్సాప్ గ్రూప్ లో పెట్టేశాడేమో అందరూ దాన్ని చూసేసారేమో అన్నట్టు క్షణ క్షణం గిలితో గడిపింది.

యీలోగా బ్లాక్మైలర్ విజయ్ నుండి రిసైన్ చేయమని పవిత్రకి వస్తున్న బెదిరింపు సందేశాల సంఖ్య ఎక్కువయింది. ఆ నిమిషంలో పవిత్రకు రిసైన్ చేయడం మాత్రమే తనముందున్న ఒకే మార్గం అన్నట్టు అనిపించింది. తనకున్న టాలెంట్ కు మరోచోట ఉద్యోగం తెచ్చుకోవడం అంత కష్టమేమి కాదు.

ఆ రోజు పని ముగింపు సమయానికి నందిని పవిత్రను తన కేబిన్ కి పిలిచింది. జిమ్ లో కెమెరాలు యశోదకి దొరకలేదని, విజయ్ అన్ని రుజువులని తెలివిగా తొలగించాడని చెప్పింది. ఈ విషయంలో కంపెనీ పవిత్రకి పూర్తి మద్దతు ఇస్తుందని, ధైర్యంగా పోలీస్ కంప్లైంట్ ఇవ్వమని సలహా ఇచ్చింది.

నందిని పై అధికారులని సంప్రదించే తనకంత భరోసా ఇస్తున్నట్టు పవిత్రకు అర్థమయ్యింది.

ఆలోచించుకోవడానికి కాస్త సమయం అడిగింది పవిత్ర.

ఆ నాడు సాయంత్రం కురిసిన వర్షం పవిత్ర మీద జాలితో ఆ వరుణదేవుడే కురిపించిన కన్నీటి సంద్రం లావుంది. ఇంటికి వెళ్లే దారిలో నీళ్ళు అడ్డం పడివుంటాయని తనను మెయిన్ రోడ్ దగ్గరే దింపేయమని పవిత్ర క్యాబ్ డ్రైవర్ తో చెప్పింది. తన లాప్ టాప్ బ్యాగ్ కు వాటర్ ప్రూఫ్ కవర్ వేసి క్యాబ్ దిగి ఇంటి వైపు నడిచించి.

ఇంట్లో అడుగుపెట్టగానే ఐదారుగురు అతిధులు తన కోసం వేచి ఉండటం చూసి తాను ఆశ్చర్యపోయింది – " అరే పెళ్ళిచూపులా? ఈ రోజా? ఇంత వర్షంలోనా?..... నేను సిద్ధంగా లేనే ......" అంటు పళ్ళు కొరుకుకొంటూ పెళ్ళిచూపులకొచ్చిన వారిని చూసి యేడవలేక నవ్వింది.

"సారి అమ్మా, చెప్పా పట్టకుండా వచ్చేసాము. ఇవ్వాల ఈ సంవత్సరంలోనే ఆఖరి శుభదినం అట, ఆ తర్వాత పండగనెల మొదలవుతుందని పంతులు చెప్పారు. అందుకే ఓ సారి నిన్నిలా చూసి వెళదాం అని ఇలా వచ్చేసాము" అంటూ ఒక పెద్దాయన పకోడీ తింటూ పవిత్రను పలకరించాడు. పర్వాలేదు అన్నట్టు తల ఊపి పవిత్ర తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె అక్క శ్రీదేవి కూడా వెనకే వెళ్ళింది. తడిచిన తల తుడిచి, పట్టుచీర కట్టుకొని అక్క అందించిన నగ

లు వేసుకొని వచ్చిరాని నవ్వుని ప్రదర్శిస్తూ, బాధని ద్రిగమింగి అందరికి కాఫీ లు అందించింది. పెళ్ళిచూపులకొచ్చిన వారి ప్రశ్నలన్నిటికీ ఓర్పుతో బదులిచ్చింది.

పెళ్లికొడుక్కి అతని కుటుంబానికి జాతకాలపై నమ్మకం ఎక్కువట, అదే విషయం పెళ్ళికొడుకు పవిత్రతో ఒంటరిగా మాట్లాడినప్పుడు ప్రస్తావించాడు, దానితో పాటూ అతనికి నాన్న లేదని మూల నక్షత్రం వాళ్లకి సమస్య కాదని, పెళ్ళయాక పవిత్ర ఉద్యోగం మాననక్కరలేదని మరెన్నో మాటలు చెప్పుకుపోయాడు. మెదడులో రెండు నిమిషాల వీడియో మెదులుతుండగా పవిత్రకి అవేవి పట్టలేదు.

పెళ్లి చూపులకు వచ్చినవారు వెళ్ళిపోయాక పవిత్ర అమ్మ నాన్నా సంబంధం తప్పక కాయమవుతుందని సంబరపడసాగారు. " వారు కోరుకొంటే అమ్మాయికి ప్లాస్టిక్ సర్జరీ చేయించేదాం, ఫోటోలకు బాగుంటుంది" అంది అమ్మ, పవిత్ర మొఖం చిట్లించుకొంది. "సరే సరే లే ప్లాస్టిక్ సర్జరీ సంగతి తర్వాత చూదాం" అన్నారు నాన్న .

"ఎలా చెప్పను..... ముఖం పై ఉన్న మచ్చ కన్నా ఒక పెద్ద చెదరని మచ్చ రెండు నిమిషాల వీడియో రూపంలో తన పై వచ్చి పడిందని?" అనుకొని పవిత్ర తనలో తానే కుమిలిపోయింది

మరసటి రోజు పెళ్లిచూపులకొచ్చిన వారి నుండి కబురొచ్చింది, పవిత్రను వద్దన్నారు, మొఖం మీద మచ్చ కారణం కాదు, జాతకాల కారణం కాదు,.

అర్థరాత్రి వీడియో లీక్ అయింది.

వీడియో వైరల్ అయ్యింది, ఒకే రాత్రికి కొన్ని లక్షల వ్యూస్. పోర్న్ సైట్స్ లో రా ఫ్యూటేజ్ అలాగే ప్రసరించేసారు, కొన్ని సెమి అడల్ట్ వెబ్ సైట్స్, పవిత్ర ఒంటిలో కొన్ని భాగాలు బ్లర్ చేసి ఇది తప్పు కాదన్నట్టు ప్రదర్శించింది. కొంతమంది పవిత్ర మొఖం మార్ఫ్ చేశారు, ఇంకొంతమంది తన వంటిని మార్ఫ్ చేశారు, ఇంకొందరు తన ముఖం పై పుట్టుమచ్చను ఫోటోషాప్ తో తీయించేశారు. ఒక వారంలో ఎడిటిటింగ్స్ తో స్పెషల్ ఎఫెక్ట్స్ తో ఆ వీడియొ రూపు రేకలు మారిపోయింది.

మరుసటి వారం సోషల్ మీడియా లో పవిత్ర పేరు తో ఫేక్ అకౌంట్స్ కుప్పలు కూడాయి, లోకల్ ప్రెస్ లో కూడా విషయం పడింది. వీడియో బయటకు వస్తే జరుగుతాయనుకున్న అనర్థాలన్నీ అనుకున్నదానికన్నా వేగంగానే జరిగాయి. విజయ్ పేరు మాత్రం ఎక్కడ బయటకు రాలేదు, అక్కడక్కడా ప్రస్తావన వచ్చినా ఎవరు దానిని పెద్దది చేయలేదు. పవిత్ర స్నేహితులకి, శ్రేయోభిలాషులకు తన పై సానుభూతి మాత్రం మిగిలింది, కనీసం వాళ్ళయినా ఆ వీడియో వ్యూల సంఖ్యను పెంచకుండా ఉండేందుకు ప్రయత్నం చేసుండొచ్చు కానీ వాళ్లకి అంత జ్ఞానం లేకపోయింది.

మొదట్లో పవిత్ర అమ్మా నాన్నా అంతటి దెబ్బని తట్టుకోలేక పోయారు.

"ప్రతి దుర్మార్గానికీ రకరకాల షేడ్లుంటాయమ్మా! ఈ ఇంటర్నెట్ యుగంలో ఒకరోజుకు ఇంచుమించు 50 జెట్ట బైట్స్ డేటా జెనెరేట్ అవుతుంది అంటే దాదాపు ఒక కోటి కోట్ల రెండు నిమిదల వీడియోలంత , ఇంత డేటా ఊబిలో ఒక రెండు నిమిషాల వీడియొ పూడుకుపోవడానికి చాల సమయమేమి పట్టదు. బాగా ఫేమస్సయిన సినిమా హీరోయిన్ల తలల్ని అతికించి తయారుచేసిన నీలి వీడియోలు యెన్నిలేవు? యిదిగూడా అలాంటి మార్ఫింగ్ అని ప్రచారం చేస్తే కాదనేందుకు ప్రూఫ్ యేముంది?," అంది పవిత్ర నెమ్మదిగా.

రెండురొజులు గడిచాక , కాస్త ఆలోచించాక"ఇప్పుడేమి కొంపలు అంటుకు పోలేదు, చాల పెద్దదనుకొనే ఏ సమస్య అయినా కాలమనే నదిలో కొట్టుకు పోవలసిందే, ఈ సమస్య అలాంటిదే" అన్నారు పవిత్ర అమ్మా నాన్నా తమని తాము ఓదార్చుకున్నట్టుగా.

. "ఇందులో నీ తప్పేమి లేదు నువ్వు నాలుగు గోడల మధ్య దాక్కోవలసిన అవసరం లేదు ఆఫీస్ కి వెళ్ళు" అంది పవిత్ర అక్క ధైర్యంగా

పవిత్ర కు తన కుటుంబ సభ్యులను చూసినప్పుడు ఆశ్చర్యంతో బాటూ ఆనందమూ కలిగింది.. . తాను ఎప్పటిలాగానే వుద్యోగానికెళ్ళింది. జిమ్ కూడా వెళ్ళింది.

విజయ్ ఆ తర్వాత ఎప్పుడు తనకి మెసేజ్ చేయలేదు.

ప్రాజెక్ట్ క్రిటికల్ డెడ్ లైన్ లో పవిత్ర తనను తాను నిమగ్నం చేసుకొంది.

ఆఫీసులో తోటి వుద్యోగులు చెవులు కొరుక్కోసాగారు గానీ ,ఆ ప్రస్తావన తన దగ్గరకు తీసుకొచ్చే సాహసం చేయలేదు,

బయట ప్రపంచంలో కొనాళ్ళు తాను ఎక్కడికి వెళ్లినా కొన్ని నీడలు ఆమెను వేధించాయి. తన గురించి ఏమి తెలియని వాళ్లు కూడా అనరాని మాటలు అన్నారు. తాను ఎన్ని ఫోన్ నంబర్లు మార్చినా వచ్చే స్పామ్ కాల్స్, టెక్స్ట్ మెసేజస్ ఆగలేదు. అయితే యెవరుగానీ ఆ ప్రస్తావన తన దగ్గరకు తీసుకొచ్చే సాహసం చేయలేదు.

యింతలో ఒక ప్రముఖ నటి స్కాండల్ బయట పడింది .అందరి దృష్టీ అటు తిరగసాగింది.

ఆదివారం సాయంత్రం పవిత్ర షాపింగ్ కు బయల్దేరుతుండగా, ఎదురు చూడనివిధంగా ఎక్స్ క్లయింట్ మేనేజర్ శంకర్ ప్రత్యక్షమయ్యాడు.

'ఈ మహానుభావుడేంటి ఇక్కడ, పోయినవారమే కదా ప్రాజెక్ట్ పూర్తి చేసిచ్చాను, ఏదయినా కొత్త ప్రాజెక్ట్ ప్రపోసల్? ప్రాజెక్ట్ ప్రపోసల్ కి ఎవరైనా ఇంటికి వస్తారా..అది కుటుంబ సమేతంగా?..' పవిత్ర అయోమయంలో మునిగిపోయింది.

అక్క తనను వెళ్లి పెళ్ళిచూపులకి రెడీ అవ్వమన్నపుడు పవిత్ర మెల్లగానే బల్బ్ వెలిగింది. చిరాకుతోనే తను యిదివరకూ శంకర్ తో జరిపిన మీటింగ్స్ తలచుకొని ఆమె తనలో తానే నవ్వుకుంది

"ఎక్కడికో బాగా రెడీ అయ్యి ఉన్నా రే " అని పలకరిం చాడు శంకర్.

అతని అమ్మ నాన్నలకు నమస్కారం చేసింది పవిత్ర.

పవిత్ర అమ్మ అందరికీ కాఫీ లు అందించింది .

కాఫీ తీసుకొని పవిత్ర , శంకర్ బాల్కనీ వైపు నడిచారు

"ఏంటి ఇలా?... అది ఇక్కడ?...." అడిగింది పవిత్ర

"ఇలా నిన్ను చూద్దాం అని, సర్ప్రైజ్ ఇద్దామ్ అని వచ్చాను" అన్నాడు శంకర్

"నా గురుంచి అన్నీ తెలిసే వచ్చావా?" అని సందేహంగా అడిగింది

" అన్నీ అంటే?"

"మ్..... మొదటిది... నాది మూల నక్షత్రం"

"నేను జాతకాలు నమ్మను" అని భుజాలు ఎగరేసాడు శంకర్

"నా ముక్కు మీద మచ్చ?... "

"అదే నీ అందం..!"

"ఇప్పుడు అస్సలు విషయం" అంటూ సూటిగా శంకర్ ని చూసింది పవిత్ర

"అదేంది... అదీ నువ్వే చెప్పు..." అన్నాడు

"అదే ఆ వీడియో "

"మ్...ఆ వీడియో లేదంటే ఇలా నేను వచ్చి ఉండే వాడిని కాదేమో" అన్నాడు శంకర్

"ఎగ్జిక్యూజ్ మీ........" అని అరిచింది పవిత్ర

వెంటనే శంకర్ " అయ్యో తప్పుగా అనుకోకు, నువ్వంటే నాకు ముందు నుండే ఇష్టం... వీడియో లీక్ అయిన మరుసటి రోజు నువ్వు ఆఫీస్ రావని అందరం అనుకొన్నాం, కానీ నువోచ్చావ్. ఆ రోజు బోర్డు మీటింగ్ లో నీ ప్రెజెంటేషన్....నువ్వు మాట్లాడటం మొదలు పెట్టిన రెండు నిమిషాలకంత నీ గట్స్ కి నేను ఫ్యాన్ అయిపోయా..అలాంటి పరిస్థితిలో కూడా అంత ధైర్యంగా ఉన్న నిన్ను చూసి నా ఇష్టం ప్రేమగా మారింది... ఫస్ట్ టైం ఆ రోజు నేను నా ప్రాజెక్ట్ మీటింగ్ లో క్యాన్సన్ట్రేట్ చేయలేక పోయా..... యీ మాట చెప్పడానికి మాత్రం ప్రాజెక్ట్ అయిపోయేదాకా వెయిట్ చేయవలసి వచ్చింది కంపెనీ రూల్స్ వల్ల......"

"నేను నీకు ఒకటి చెప్పాలి" అంటూ సంకోచిస్తూ ఇలా అంది "ఆ వీడియో పోస్ట్ చేసింది నేనే....... "

"అదేంటి విజయ్ కాదా.....?" అంటూ అయోమయంగా అడిగాడు శంకర్

" వీడియో రికార్డు చేసింది విజయ్, బ్లాక్ మెయిల్ చేసింది విజయ్... వీడియో లీక్ చేయకుండా ఉండాలంటే నన్ను రిజైన్ చేయమన్నాడు...నేను బాగా ఆలోచించాను. నా జీవితం అంతా వాడు నన్ను అలా బ్లాక్ మెయిల్ చేయడం నాకు ఇష్టం లేదు... ఒక రెండు నిమిషాల వీడియొ నా మిగిలిన జీవితాన్ని నిర్ధేశించకూడదు అని అనుకొన్నాను...నా మీద తాను అధికారం చలాయించలేడని, ఆ అధికారాన్ని రెండు నిమిషాల వీడియో ద్వారా పొందలేడని వాడికి స్పష్టంగా చెప్పాలనుకున్నాను. దానికి నాకప్పుడు దొరికినమార్గం అదొకటే." అంది పవిత్ర.

కాస్సేపు శంకర్ యేమీ మాట్లాడలేకపోయాడు.

కాస్త తేరుకున్నాక ప్రసన్నంగా నవ్వుతూ ఆమె చేయి తన చేతిలోకి తీసుకున్నాడు.

## ఆడపిల్ల షేక్ షబ్బర్ హుస్సేన్ (Kadapa, A.P, India)

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

**మళ్లీ ఇలాంటి ఒక రోజు** వస్తుందని అనుకోలేదు. రావాలని కోరుకోనూ లేదు. ఆలూమగలిద్దరం ఆర్నెల్ల తర్వాత మళ్లీ ఆ ఆస్పత్రిలో అడుగు పెట్టాం. క్రితం సారి వచ్చినప్పుడు ఆమె పడ్డ కష్టాలు చూడలేక 'ఇక్కడికి మరోసారి వచ్చే అవకాశం ఇవ్వను' అని చాలా గట్టిగా ఒట్టేసినా. 'రాత్ గయితో బాత్ గయీ' అన్నట్లు ఆ రోజు 'ఆవేశం'తో ఒట్టేసిన మాటలు 'ఆ విషయాని'కొచ్చేసరికి వట్టి మాటలుగానే మారిపోయాయి.

హాల్లో కాలు పెట్టానో లేదో ఎవరో గుర్తు చేసినట్లు నేను చేసిన శపథం ఠక్కున గుర్తుకొచ్చింది.

మెల్లగా ఆమె వంక చూశాను. నాపైన కోపమో.. ఏమో కళ్లింతగా చేసి చూసింది. ఎర్రబడ్డ ఆ కళ్లను చూసి మౌనంగా ఉండిపోయాను. 'ఛీ.. ఛీ' నా మీద నాకే అసహ్యం వేసింది.

'టోకెన్ నంబర్ 9..మెహసిన్..' సిస్టర్ లలిత గొంతెత్తి అరిచింది.

'ఆ వస్తున్నాక్కా..' అంటూ నా భార్య ఆత్రంగా లేచి డాక్టర్ రూంలోకి వెళ్లింది. ఏమాత్రం ఆలస్యం చేసినా 'టోకన్ నంబర్ 10' అనేస్తాదామె. ఇప్పుడంటే లేవుగానీ ఒకప్పుడు ఊర్లలో 'షోలాపూర్ బెడ్‌షీట్లు.. టవళ్లు.. లుంగీలకు' వేలం పాట జరిగేది. అందులో ఒకడు 'బెడ్‌షీట్ 120.. ఒకటోసారి.. రెండో సారి... మూడోస్సారి' అంటూ చెవులు జిల్లు మనేలా అరిచేవాడు. ఆస్పత్రికొచ్చిన ప్రతీసారి లలితక్కను చూస్తానే నాకు ఆ వేలంపాటే గుర్తొస్తుంది.
డాక్టర్‌గారు రాసిన చీటీతో నాముందుకొచ్చి నిలబడింది మెహసిన్.

'టెస్టులేనా' అన్నా.

'ఏం మీకు తెలీదా' అందామె చిరాగ్గా.

'సరే పా' ల్యాబ్‌లోకి పిలుచుకెళ్లాను. శాంపిల్స్ తీసుకున్న ల్యాబ్ టెక్నీషియన్ 'రిపోర్ట్ ఓ అరగంట పడుతుంది.. అక్కడ కూర్చోండి పిలుస్తాను' హూంకరించాడు. స్పేస్ సెంటర్‌లో తీక్షణంగా పరిశీలన చేసే శాస్త్రవేత్తలా వాడూ..వాడి ఫోజునూ.

'సరే' అంటూ ఇద్దరం వచ్చి హాల్లో కూర్చున్నాం.

ఆస్పత్రి ఆవరణమంతా 'అమ్మ'లతో నిండుగా ఉంది. ఆ అమ్మల కడుపుల్లో భావి భారతం జీవం పోసుకుంటోంది. రేపటి తరాన్ని.. భవిష్యత్తు తారల్ని ఎంతో జాగ్రత్తగా కడుపులో మోస్తున్న మాతృమూర్తులను చూస్తానే అమ్మ గుర్తొచ్చింది. బరువును కూడా.. బాధ్యతతో మోయడం.. ఏమీ ఆశించకుండా ప్రేమను పంచడం ఒక్క తల్లికే సాధ్యమేమో. ఆ క్షణాన ' మా తుఝే సలాం' అంటూ ఎన్నిసార్లు అమ్మను తలచుకున్నానో.

పక్కనే ఓ పెద్దాయమ తెల్లటి చాదర్‌ను కప్పుకుని నోట్లో వక్కాకు నములుతూ ఉంది. 'క్యా బచ్చీ క్యా బోలీ మా డాక్టర్ని' అంటూ మెల్లగా నా భార్యతో మాటలు కలిపింది. 'అభీ రిపోర్ట్ ఆయానీ నానీమా' అంటూ ముభావంగా జవాబిచ్చింది. 'ఐసా.. అల్లా హై లేమా.. పాజిటివ్ ఆతాలే' అంది. ఎగిసే మంటపై ఇంకాస్త పెట్రోల్ పోసినట్లయింది.. ఒక్కసారిగా తల తిప్పి ఆమె వైపు చూసింది.

'మాకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు... ఇక పిల్లలు వద్దనుకుంటున్నాం..' అని ముఖంమీదే గట్టిగా చెప్పాలనుకుని ఆగిపోయినట్లుంది. ఆమె మాటలకు నవ్వాలో... ఏడ్వాలో తెలియక తల కిందికి వాల్చింది. మెహసిన్ చెప్పకుండా ఎందుకాగిందో నాకర్థమైంది.

'నాకు ఆరుగురు కొడుకులు.. ఇద్దరు కూతుళ్లు మా' అంటూ ఇందాకే పక్కింటావిడతో చెప్పడం ఇద్దరమూ విన్నాం. పొరపాటున మెహసిన్ తన మనసులో మాట చెప్పింటేనా 'ఏ క్యా జమానా ఆయామా..' అంటూ బుగ్గలు నొక్కుకునేది. అందుకే విషయాన్ని మాటల్తో లాగకుండా మౌనంతో ముడేసింది. 15 నిమిషాలు గడిచిపోయాయి.

తమ టోకన్ నంబర్ రాని వాళ్లు.. రిపోర్ట్స్ కోసం ఎదురుచూస్తున్న వాళ్లు టీవీలో వస్తున్న సీరియల్స్‌ను సీరియస్‌గా చూస్తున్నారు. కానీ మాకు ఎదురుగా కూర్చున్న ఒకామె చాలా సేపటి నుంచి ముభావంగా ఉంది. 9 నెలలు పూర్తిగా నిండినట్టున్నాయి. అప్పుడో..ఇప్పుడో అన్నట్లు ఉంది. ఆమె పక్కనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

' క్యా నామ్ మా తేరా.' అని అడిగింది మా పక్కనున్న పెద్దాయమ.

'తబస్సుమ్ ఖాలా' అని జవాబిచ్చింది.

'ఏ ఊరో?'

ఇంతలో తబస్సుమ్ ఫోన్ రింగైంది.

'బోలో జీ.... హాస్పిటల్ మే హూ' అంది.

'ఎవరొస్తారు తోడు.. నేను చేసుకున్న ఖర్మ.. నేనొక్కన్నే వచ్చి సచ్చినా' అంది. తెలియకుండానే ఆమె కళ్లల్లోంచి నీటిబొట్లు టపటపా రాలుతున్నాయి. 'సర్లే... టోకన్ వచ్చింది... నర్సు పిలుస్తాంది...కొంచెపాగి చేయండి' అంటూ ఫోన్ కట్ చేసి బ్యాగులో పడేసింది. ' మీరిక్కడే కూర్చొండమ్మా..' పిల్లలిద్దరికీ తలా ఓ బిస్కెట్ చేతికిచ్చి డాక్టర్ రూం లోకి వెళ్లింది. తబస్సుమ్‌కు వచ్చిన కష్టమేందో ఏమో.. నవమాసాలు నిండిన ఆ తల్లి కళ్లల్లో నీళ్లు చూసి మనసు చివుక్కుమంది.

' మెహసిన్' రిపోర్ట్ రెడీ... ల్యాబ్ అతను కేక వేశాడు. రిపోర్ట్ కోసం వెళ్లాల్నా.. వెళ్తావా అన్నట్లు మెల్లగా తన వంక చూశాను. ఉలుకూపలుకూ లేదు. 'మౌనం అర్ధాంగికారం' అంటారు. కానీ ఈ పరిస్థితుల్లో నా అర్ధాంగి మౌనానికి అర్థం నాకు తెలుసు. నేనే వెళ్లి రిపోర్ట్ తెచ్చాను.

అనుకున్నంత అయ్యింది. ఏం జరగకూడదో అదే జరిగింది. రిజల్ట్ 'పాజిటివ్'. ఆ మాట వింటూనే నా వంక చూసింటే ఒట్టు. కట్ట తెగినట్లుగా తెలియకుండానే ఆమె కళ్లల్లోంచి నీళ్లు జలజలా రాలుతున్నాయి.

సరిగ్గా 11 ఏళ్ల క్రితం ఇదే హాస్పిటల్‌లో 'పాజిటివ్ రిజల్ట్ చూసిన ఆమె కళ్లల్లో చెప్పలేనంత సంతోషాన్ని చూశాను. వెయ్యి వోల్ట్స్ వెలుగొచ్చిందేమో అన్నట్లు ముఖమంతా వెలిగిపోయింది. తేలికపాటి నవ్వుతో సిగ్గు పడుతూ తలవాల్చిన క్షణాలు ఇంకా నా కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. 'ముబారక్ హో..' అంటూ మా అమ్మానాన్నలు.. అత్తామామలు చెప్పినప్పుడు ఎర్రగా కందిన తన బుగ్గల్ని.. తనే పసిపాపగా మారిపోయి నా వైపు ఓరగా చూస్తూ విసిరిన ఆ నవ్వుల్ని గుండెల్ని హత్తుకునే ఉన్నాయి. ఆ రోజు నాకైతే ప్రపంచాన్నే జయించినంత ఆనందమేసింది.

పెళ్లయిన ఏడాది తిరక్కుండానే మా జీవితాల్లోకి పండంటి పాపాయి వచ్చింది. ఆ తర్వాత మరో రెండేళ్లకే బాబు పుట్టాడు.

కాలం గిర్రున తిరిగింది. ఇప్పుడూ అదే ఫలితం... ఇప్పుడు· ఆమె కళ్లల్లో సూటిగా చూడాలంటే భయమేసింది. ఆ భయం వెనక ఓ కారణమూ ఉంది.

రెండో కాన్పు సమయమది. తొలి కాన్పు నార్మల్. ఇప్పుడు కూడా అలాగే ఉంటుందని అనుకున్నాం. చాలాసేపు ప్రయత్నం చేసిన డాక్టర్ కళావతి 'పిండం కదలడం లేదు.. సిజేరియన్ చేయాల్సిందే' అని తేల్చి చెప్పింది. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. మరికాసేపట్లో ఆపరేషన్ చేస్తారనగా ఒక్కసారిగా తనకు బీపీ ఎక్కువైంది. ఒళ్లంతా చెమటలు పట్టాయి. వైద్యులు వెంటనే అప్రమత్తమై ఏవో మందులిచ్చి ధైర్యం చెప్పారు. ఆపరేషన్ కూడా కాసేపు వాయిదా పడింది.

'సర్.. మీ భార్య పిలుస్తొంది' నర్సు వచ్చి చెప్పగానే... లోనికెళ్లాను.

నా వంక చూస్తానే ఏడ్చేసింది. గట్టిగా నా చేయి పట్టుకుని 'ఏమండీ.. ఇద్దరు పిల్లలు చాలండి.. పిల్లల్లేకుండా ఆపరేషన్ చేయించండి' వేడుకుంది.

'అలాగే.. నువ్వింతలా చెప్పాల్నా. నేను కూడా ఇద్దరు చాలనే చెప్పాను కదా' అని ధైర్యం చెప్పాను.

'మీరిక్కడే ఉండండి. ఇదో ఈ రోజు ఆఫీసుకు సెలవే కదా' అని మరోసారి ప్రశ్నించింది.

'ఆఫీసుకు సెలవే కదా' ఇప్పటికి పదిసార్లు చెప్పి ఉంటుంది.

'అవును. సెలవే' అన్నాను.

'ఏమో అప్పుడూ అలాగే చెప్పి ఆఫీసుకెళ్లారు' అని బుంగమూతి పెట్టింది.

'ఒక్కరోజు కాదు. వారం రోజులు లీవ్ పెట్టాను సరేనా' అన్నా ఒట్టేస్తూ.

ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. కాసేపటికే నర్సు నవ్వుతూ బయటికొచ్చి 'మగ పిల్లాడు సర్..' అని చెప్పింది.

'అక్కా.. పిల్లల్లేకుండా ఆపరేషన్ చేయమనండి' అని చెప్పాను. ఇందాక మెహసిన్‌కు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.

'సరే సర్' అని తను లోపలికెళ్లింది.

'బేటా కతే... ముబారక్ హో..' అంటూ మా అమ్మానాన్న..అత్తామామలు అందరూ ఆనందంలో మునిగిపోయారు.

'సర్.. మీకు మేడం పిలుస్తున్నారు' ఇందాకొచ్చిన నర్సే మళ్లీ వచ్చింది.

డాక్టర్ క్యాబిన్‌లోకి వెళ్లాను ' చూడు బాషా (రాయలసీమలో చాలా మంది అతని పేరేదైనా మగోళ్లకు 'బాషా' అని, ఆడవాళ్లకయితే 'బూమ్మా' అని పిలుస్తుంటారు.) ఇప్పటికైతే పిల్లాడు బాగానే ఉన్నాడు. ఏవైనా లోపాలుంటే ఆర్నెళ్ల తర్వాతే బయటపడతాయి. తర్వాతే ఆపరేషన్ చేద్దాంలే.. అయినా పచ్చిగా ఉన్నప్పుడు ఆపరేషన్ చేయడం కూడా మంచిది కాదు' అని వివరంగా చెప్పింది డాక్టరమ్మ.

'మేడం ..ఈ మాటెందుకంటోందబ్బా' ఆలోచనలో పడిపోయాను.

'నువ్వు తప్పదంటే చేసేస్తాను బాషా' అంది మళ్లీ. 'ఐదు నిమిషాలు మేడం' అంటూ బయటికొస్తుండగా

'తొందరగా చెప్పు బాషా కుట్లేయాలి' అంది.

బయటికొచ్చి విషయాన్ని పెద్దోళ్లతో పంచుకున్నాను. 'ఇప్పుడొద్దులే.. మళ్లయినా చేయొచ్చులే' అన్నారు వారు ముక్తకంఠంతో. నిజం చెప్పాలంటే ఆ టైంలో ఏం చెప్పాలో నాకు అర్థమై సావలేదు. పెద్దల మాటను గౌరవిస్తూ 'ఇప్పుడొద్దులే మేడం' అని చెప్పాను.

పిల్లాడి మేనమామ గబగబా వెళ్లి స్వీట్ బాక్స్ తీసుకురావడం. అప్పటికప్పుడే 'చెవిలో అజాన్ ఇచ్చి' 'షంషుద్దీన్' అని పేరు పెట్టడం చకాచకా జరిగిపోయాయి.

'ఎంత ముద్దొస్తున్నాడో చూడని ఒకరంటే.

' దిష్టి పెట్టొద్దుమ్మా' అని ఇంకొకరు అంతా సందడిగా ఉంది అక్కడ.

'నీ పిల్లోలిద్దరూ రంజాన్ నెలలో జుమ్మా రోజే పుట్టారబ్బా' అని అందరూ అభినందించారు.

ఇంగ్లిష్ నెలల ప్రకారం ఆగస్టు 5న పాప, ఆగస్ట్ 2న వీడు.

నిజానికి 'ఈ రెండు రోజులు ఆగి 5వ తేదే కాన్పు చేద్దాంలే బాషా ఇద్దరూ ఒకే రోజు బర్త్‌డే సెలబ్రేషన్స్ చేసుకుంటే బాగుంటుంది' అని డాక్టర్ గారు కూడా చెప్పారు. కానీ అప్పటికే రోజులు నిండిపోయాయని చెప్పి కాన్పు చేయాల్సి వచ్చింది.

అప్పుడప్పుడే మెహసిన్‌కు మెల్లగా మత్తు వదులుతూ ఉంది. పిల్లాడిని చూసిందో లేదో గానీ నా వంక చూసి దగ్గరకు రమ్మని సైగ చేసింది. 'ఆపరేషన్ చేయించారా?' అంది.

ఆ మాట వింటానే గుండె గుభేల్‌మంది. 'అవున'ని అబద్ధమాడితే ఆమె మనసు నిండు కుండలా కుదురుగా ఉంటుంది. 'కాదని' నిజం చెబితే నీటి కుంటలో రాయి వేసినట్టు ఆమె మనసు కూడా గింగిరాలు పోతుంది. ఎక్కడ ఆమె కళ్లు తెగిన చెరువుతాయేమోనని భయమేసి కళ్లు మూసుకుని కిందికి పైకి రెండు సార్లు నిలువుగా తలూపుతూ

'అంతా ప్రశాంతంగా జరిగింది. నువ్వు ముందు బాగా రెస్ట్ తీసుకో' అన్నాను. నిజానికి అబద్ధానికి మధ్య పలచటి తెరను కప్పేస్తూ.

మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ అయి ఇంటికొచ్చాం. మరుసటి రోజే ఆ పలుచటి తెరను ఎవరో తొలగించినట్లున్నారు.

దగ్గరికి పిలిచి 'చదువుకున్నవారు మొగుడివి నిర్ణయం ఏదైనా మీరు తీసుకోవాలి గానీ వాళ్లనడగడం ఏంది?' అని నిష్టూరమాడింది.

'అది కాదు ఆర్నెళ్ల తర్వాతే ఆ ఆపరేషన్ చేయాలంట మేడమే చెప్పారు' అని సర్ది చెప్పబోయాను.

'ఆ ఇప్పుడు కడుపు కోసుకుని మూన్నేళ్లు, ఆర్నెళ్ల తర్వాత మళ్లీ కోసుకుని మరో మూన్నెళ్లు. ఇట్టానే పత్యం ఉంటాన్లే. అయినా మీదేం పోతాంది. ఆపరేషన్ వద్దని చెప్పిన ఆ పెద్దోళ్లది ఏం పోతాంది' అంటూ అమ్మోరు తల్లి ఒళ్లోకొచ్చినట్లు ఆక్రోశంతో ఊగిపోయింది.

నిజమే.. చిన్న గాయమైతేనే అల్లాడిపోతాం. అలాంటిది కడుపు కోత అంటే సన్న విషయమా? ఆలోచిస్తేనే గుండె వేగం పెరుగుతుంది.

'ఆపరేషన్ థియేటర్లోకి వెళుతూ కూడా మీకు అంతలా చెప్పి పోయినానే ఇలాగేనా చేసేది' అని కళ్ల నిండా నీరుకార్చింది.

ఇప్పుడేం చెప్పినా తను వినిపించుకోదు. చెప్పే నైతికత కూడా కోల్పోయాను అనిపించింది. అయినా ధైర్యం చేసి ' చూడు మెహసిన్. వీళ్లిద్దరు చాలు. ఆ ఆపరేషన్ కూడా చేసుకోవాల్సిన అవసరం లేదు. అంతవరకు రాకుండా ఎన్నో మార్గాలున్నాయిలే' అన్నాను వీరా వేశంగా.

ఆ రోజు ఒట్టేసి చెప్పిన మాటల్ని ఎన్నిసార్లు గట్టున పెట్టానో ఏమో.

'పాజిటివ్' వచ్చినప్పుడల్లా 'ఇప్పుడు చూడు. ఎన్ని కష్టాలు పడాలో. ఆ మాత్రలు మింగాలంటేనే భయమేస్తుంది..' అని వాపోతుంది. ఆ మాత్రలు మింగిన ప్రతిసారీ ఓ వారం రోజుల పాటు 'కడుపు నొప్పి' అని తల్లడిల్లిపోతుంది. వాంతులు చేసుకుని మనిషంతా నీరసించి పోతుంది. ఆ సమయంలోనూ 'ఎలాగో అలా ఈ బాధను తట్టుకుంటాలే. వండి పెట్టిన అన్నం కూడా వేసుకుని తిన్లేరే. నాకేమైనా అయితే మిమ్మల్నెవరు చూస్తారు' అంటూ గట్టిగా పట్టుకుని ఏడుస్తుంది. ఆ మాటన్నప్పుడల్లా నాకళ్లల్లోనూ నీళ్లు సుడులు తిరిగేవి. అందరూ చెబుతుంటారు 'తల్లి రుణం తీర్చుకోలేం' అని. ఆ మాటకొస్తే 'సృష్టి'కి ప్రతిరూపమైన 'ఆడపిల్ల'కు మగాడు ఎప్పటికీ రుణపడే ఉంటాడు.

' నువ్వు రా' నర్సు పిలవగానే లోనికెళ్లింది మెహసీన్. అప్పుడే డాక్టర్ క్యాబిన్ నుంచి తబస్సుమ్ బయటికొచ్చింది. మెల్లగా అడుగులో అడుగేస్తూ వచ్చి కుర్చీలో కూర్చుంది. మా పక్కన కూర్చున్న పెద్దామెకు చుట్టుపక్కలున్న వారిని ప్రశ్నలతో విసిగించడమే పనిగా ఉన్నట్టుంది. తబస్సుమ్ కుదురుగా కుర్చీలో కూర్చోకముందే 'క్యా బోలీమా డాక్టర్నీ' కడప రాగం తీసింది.

'ఈ రోజే అడ్మిట్ కావాలంట ఖాలా. ఏం చేయాలో ఏమో' అంటూ ' ముభావంగా చెప్పింది.

'తోడు ఎవరూ రాలేదా'

' నై.. ఖాలా'

చూస్తాంటే తబస్సుమ్‌కు ఏదో పెద్ద సమస్యే ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ సారి ప్రశ్నించే బాధ్యతను నేను తీసుకున్నా. మెల్లగా 'క్యా..హువా మా' అన్నా.

'మాది చింతకొమ్మదిన్నె మండలమన్నా.. ఆరేళ్ల కిందట పెళ్లయింది. మా పెళ్లికి మా ఇంట్లో పెద్దోళ్లు ఒప్పుకోలేదు. ఆ రోజు నుంచి ఇప్పటివరకు వాళ్లతో మాటలే లేవు.' అని తలకిందికి వాల్చింది. 'మీ అత్తగారిని తోడు తీసుకురావచ్చు కదా' అన్నానేను.

'ఆమె రాదంట. ఇదివరకు నాకు ఇద్దరూ ఆడపిల్లలే. నీకు ఇప్పుడు కూడా ఆడపిల్లే పుడ్తాది. నేను రాను పో అని ఈసడించుకుంటాంది' అంటూ జారుతున్న కన్నీళ్లను పవిట కొంగుతో తుడుచుకుంది.

'ప్చ..ప్చ..ప్చ... అయ్యయ్యో' అక్కడున్న ఆడాళ్లందరూ తబస్సుమ్‌పై జాలి చూపించారు.

ఆ పక్కనే ఉన్న ఇంకో ఆడామె 'నీ మొగుడు రాలేదామ్మా' అని ప్రశ్నించింది. నుదుటిపై పెద్ద బొట్టుతో నిండుగా ఉందామె.

' నెల కిందటే కువైట్‌కు పోయినాడక్కా' అని జవాబిచ్చింది.

'అతనైనా ఫోన్ చేసి మీ అత్తగారిని వెళ్లమని చెప్పొచ్చు గదా' దీర్ఘాలు తీసింది.

'ఆడే బాగుండింటే నాకిన్ని తిప్పలెందుకొస్తాయ్? మా అత్తతోనైనా ఏగచ్చుగానీ ఆ నా బట్టతో కష్టమై పోతాందీ. అతనికి మగ పిల్లాడే కావాలంట.. ఈ సారి మగ పిల్లాడే పుడ్తేనే ఫోన్ చేయి అంటున్నాడు. అది నా చేతుల్లో ఏమైనా ఉందాక్కా' అంటూ తలకిందికి వాల్చి బోరున ఏడ్చేసింది.

తబస్సుమ్ తలవాల్చగానే ఎదురుగా ఉన్న గోడకున్న 'ఆడపిల్ల ఇంటికి వెలుగు. బతకనిద్దాం.. బతుకునిద్దాం..'అని పెద్ద పెద్ద అక్షరాలతో ఉన్న పోస్టర్ కనిపించింది.

చింపి పారేయాలన్నంత కోపమొచ్చింది. చుట్టాలు చెప్పే సూక్తులైనా... చట్టాలు చెప్పే హక్కులైనా మనుషుల్లోని అజ్ఞానపు అడ్డుగోడలు తొలగించాలి గానీ.. ఇలా నిలువెత్తు గోడలకే పరిమితమైతే ఇలాగే ఉంటుందనిపించింది.

తబస్సుమ్ మాటలకు అక్కడున్న అందరి కళ్లల్లోనూ నీళ్లు తిరిగాయి.

అంతలో మధ్యాహ్నం షిఫ్ట్‌కు వచ్చిందో ఏమో అప్పుడే వచ్చిన నర్సు చేతికి గులాబీ ఇస్తూ 'హ్యాపీ వుమెన్స్ డే లలితక్కా' అంటూ విషెస్ చెప్పింది.

అప్పటికే తబస్సుమ్ మాటలు విని నిశ్చేష్టురాలై నిలబడి ఉన్న లలిత జవాబివ్వలేదు. 'సమాజంలో ఇలాంటి తబస్సుమ్‌లు ఉన్నంతవరకు 'వుమెన్స్‌కు హ్యాపీ' ఎక్కడుంటుంది? వుమెన్స్‌డేకి అర్థం ఏముంది' అనుకుంటూ చేతికిచ్చిన గులాబీని నలిపేస్తూ కళ్లల్లో కదలాడుతున్న నీళ్లతో మౌనంగా చూస్తుండిపోయింది లలిత.

'ఉన్నిలే బూమ్మా మా కోడల్ని కూడా ఈ రోజే అడ్మిట్ కమ్మన్నారు. నీకు తోడుగా నేనుంటాన్లే' అంటూ తబస్సుమ్ చేయి పట్టుకుని ఓదార్పునిచ్చింది పక్కనున్న పెద్దామె. అంతటితో ఆగక 'ఈ సారి నీకు కచ్చితంగా మగ పిల్లాడే పుడ్తాడ్లే ' అంటూ జోస్యం చెప్పింది.

'ఎవ్వరైనా పుట్టనీక్కా. భయపడేదిలే. ఆ నా బట్ట చూసుకుంటే చూస్కోనీ లేకుంటే ల్యా. ఆడోళ్లం.. మనమే ఆడపిల్లను కాపాడుకుంటే ఇంకెవరు కాపాడుకుంటారు? మనం లేనిది వాళ్లు యాడున్నారక్కా... నాలుగిండ్లలో పాచిపని చేసైనా సాక్కుంటా. తల్లికి బిడ్డలు బరువౌస్తారా ఏంది?' అంటూ తన ఇద్దరు బిడ్డలను అక్కున ఒడిలోకి చేర్చుకుంది తబస్సుమ్.

ఆ క్షణంలో ఓ అమ్మలా కాదు బిడ్డ నుదుటి రాతలు రాసే బ్రహ్మలా కనిపించిందామె.

# ముత్యాల గాజులు — అనసూయ ఉయ్యూరు

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

కళ్ళు తెరిచేసరికి మొదట తను ఎక్కడ వున్నాడో అర్థం కాలేదు. అటూ ఇటూ తలతిప్పి చూసాడతను. అతను లేవటం గమనించిన హెడ్ నర్సు డాక్టరు గారిని పిలవమని అటెండరుతో చెప్పి అతని దగ్గరకి వచ్చి "హమ్మయ్యా! మెలకువ వచ్చిందన్న మాట. ఎలా ఉంది మీకు ఇప్పుడు?" అని అడిగింది.

ఆమెను చూడగానే తాను హస్పిటల్ లో వున్నాడని అర్ధం అయింది. ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నించాడు.

ఇంతలో డాక్టరు నిఖిలేశ్వర్ లోనికి వచ్చి పల్స్ చెక్ చేసి. "గుడ్, ఇహ ప్రమాదం ఏం లేదు. అన్ని టెస్టులు చేసాం. అంతా నార్మల్ గానే వుంది. చాల పెద్ద ప్రమాదం నుండి బయట పడ్డారు" అని శాంతంగా నవ్వుతూ చెప్పాడు.

"డాక్టర్!" అంటూ ఇంకేదో అడగబోయి గుర్తుకురానట్లు ముఖం పెట్టాడతను. అతని వైపు చిరు నవ్వుతో చూస్తూ "మీ కోసం ఇన్ని రోజులైనా ఎవరూ రాలేదు? పేపర్లో విషయం కూడ వచ్చింది కానీ స్పందనలేదు" ఏంటి విషయం అన్నట్లు అడిగాడు.

"నాకోసం ఎవరు వస్తారు?" స్వగతంగా అనుకుంటూ "అవును సర్ మొన్నటి వరకూ అమ్మ వుంది. ఈ మధ్యే నన్ను వంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయింది." అన్నాడు బాధగా.

"ఎవరైనా వస్తే డిస్చార్జి చేయవచ్చు ఇక ఏ ఇబ్బందీ లేదు" అన్నాడు.

ఇంతలో అక్కడికి పోలీసుడ్రస్ లో వున్న వ్యక్తి లోపలికి వస్తూ కనిపించాడు.

"రండి రండి, నేనే మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నా. ఇతనికి మెలకువ వచ్చింది. ఇహ ఏ ప్రమాదం లేదు. మీరు మట్లాడవచ్చు" అంటూ పక్కకి జరిగాడు.

యస్సై దగ్గరగా వచ్చి సానుభూతిగా చూస్తూ "ఉత్తేజ్ మీ కిప్పుడు బాగానే వుందిగా?" అడిగాడు.

ఎవరిని అడుగుతున్నాడో అర్ధం కాక మౌనంగా వున్న అతన్ని మళ్ళీ అడిగాడు "హలో ఉత్తేజ్ అంతా ఓకేనా?"

నన్నా పిలుస్తున్నారు? అయ్యో పేరు కూడ మర్చి పోయానా? అనుకుంటూ చిరునవ్వు నవ్వి "ఆ బావున్నాను సర్. డాక్టరు గారు డిస్చార్జి కూడ చేస్తానంటున్నారు".

" ఓకే. గుడ్, కారు మితి మీరిన వేగంతో నడపటం వల్ల ఈ యాక్సిడెంట్ అయిందని మీరు ప్రయాణిస్తున్న ఆటో అతను చెప్పాడు. కారు ఓనరు చాల మంచివారులా వున్నారు. తప్పు ఒప్పుకుని కోర్టులో లొంగిపోయి బెయిల్ పై బయటి వచ్చిన తర్వాత నీ వైద్యానికి కావలసినదంతా ఆయనే చూసుకున్నారు. అందుకే నీవు త్వరగా కోలుకో గలిగావు" అన్నాడు.

ధన్యవాదాలు అన్నట్లుగా రెండు చేతులతో నమస్కరించాడు ఉత్తేజ్.

"కానిస్టేబుల్ తెచ్చిన సూట్కేసును అందిస్తూ ఇదిగో మీ సూట్కేసు. యక్సిడెంట్ అయినప్పుడు తీసి భద్రపరిచాం అంటూ ఇచ్చాడు. అన్ని వస్తువులు వున్నాయో లేవో చూసుకోండి" అన్నాడు.

ఓపెన్ చేసి చూసాడు. ఎదురుగా మూత మీద తన ఫోటో అతికించి వుంది. ఇంకా అందులో రెండు జతల బట్టలు, ఓ షేవింగ్ కిట్, ఓ చాకు, ఓడైరీ, పర్సు వున్నాయందులో.

అతను చూసుకున్నాడని గమనించి “ఇంకా కొంచం నీరసం వున్నట్లుంది ఈరోజు రెస్ట్ ఇచ్చి రేపు డిస్చార్జి చేయండి. అతని బిల్ పే మెంటూ అయిపోయిందిగా.” అంటూ వెళ్ళటానికి లేచాడు. డాక్టరుగారు కూడ గుమ్మం దాక అనుసరించారు ఆయన్ని పంపేందుకు.

వాళ్ళిద్దరూ అటువెళ్ళగానే ఉత్తేజ్ డైరీతీసి చదవటం మొదలెట్టాడు. అందులో పేజీల వారీగా ఏరోజు ఏ పని చేసుకున్నాడో రాసుకుని వుంది, ఎప్పుడెప్పుడు ఎవర్ని కలుసుకుంది. కరెంటు బిల్లులు కట్టుకున్న వివరం ఇంకా ఇంకా అనేక ఆసక్తికరమైన విషయాలు చదువుకుని అందులో పూర్తిగా లీన మయ్యాడు. తర్వాత తల విదిలించుకుని “త్వరగా వెళ్ళి తన స్నేహితుల్ని కలవాలి. ఇప్పటికే చాల రోజులుగా తన రాకకోసం ఎదురు చూస్తున్నారు. నా ఫోను పాడయిన సంగతి వాళ్ళకు తెలియదు కాబట్టి ఎంత తొందరగా వెళ్ళికలిస్తే అంత మంచిది” అనుకున్నాడు. అతనికి మిగిలిన విషయాలేవి జ్ఞాపకం రావటం లేదు. తను హాస్పటల్ లో ఉన్నానన్న సంగతి కూడ మర్చిపోయి అర్ధరాత్రివేళ చెప్పకుండా వెళ్ళిపోయాడు.

★★★

ఓ ఇంటి ముందుకి తీసుకొచ్చి “ఇదే మీరు చెప్పిన అడ్రస్” అన్నాడు ఆటో అతను.

ఉత్తేజ్ ఓసారి డైరీ తీసి సరిపోల్చుకున్నాడు అడ్రస్. ఆటో అతనికి పర్సు నుండి డబ్బు తీసి ఇచ్చి పంపించి, ఇంటిలోకి చూస్తూ "గిరీ...గిరీ" అని పిల్చాడు.

లోపల నుండి ఓ యాభై సంవత్సరాల వయస్సున్న వ్యక్తి బయటికి వచ్చిఅడిగాడు "ఎవరు కావాలి?"

"గిరీ... నేను ఉత్తేజ్ ని"

అతను కాస్త ఖంగు తిని "ఉత్తేజ్ వా? ఏ ఉత్తేజ్?"

"ఏంటిరా అలా మాట్లాడతావు? నిజంగా నన్ను గుర్తుపట్టలేదా? ఆ రోజు నీవు వద్దన్నా వినకుండా బెంగుళూరు ప్రయాణమై వెళ్ళాను. అనుకోకుండా యాక్సిడెంటయింది. మిమ్మల్నందరినీ మళ్ళీ కలుసుకోగలనని అనుకోలా. ఇది నాకు పునర్జన్మ" అన్నాడు.

గిరి నిశ్చేష్టుడై చూస్తూండి పోయాడు అయోమయంగా అతనికి నమ్మశక్యం కావడంలేదు.

ఉత్తేజ్ చొరవగా లోనికి వచ్చి కూర్చుని కబుర్లు చెప్పటం మొదలెట్టాడు. అన్నీ తమ స్నేహబృదం మాట్లడుకున్న విషయాలే ప్రస్తావిస్తూ "ఎలా వున్నారురా రాంబాబు, లోకేషు?" అని అడిగాడు.

రూపం చూస్తే వేరేగా వుంది. మాటతీరు అచ్చం ఉత్తేజ్ లా వుంది. అన్నీ క్షుణ్ణంగా తెలిసుకొని వచ్చాడు అసలు వీడెవడో ముందు కనిపెట్టాలని మనసులో అనుకుని "ఆ బావున్నారు. వుండు పిలుస్తాను" అంటూ ఇద్దరి మిత్రులకి ఫోన్ చేసి వెంటనే రమ్మని చెప్పాడు.

ఉత్తేజ్ సంతోష పడిపోయి మరిన్ని కబుర్లు చెప్పటం మొదలెట్టాడు. మిత్రులిద్దరూ వచ్చేలోపు ఉత్తేజ్ చెబుతున్న అన్ని విషయాలు విని ఉత్తేజ్ ఆత్మ ఇతనెవరిలోనో ప్రవేశించి వచ్చిందనుకుని రూఢీ చేసుకుని గిరి కొద్దిగా భయపడటం మొదలు పెట్టాడు.

స్నేహితుల్ని చూడగానే గిరి, ఆ విషయమే చెప్తూ మరింత భయపెట్టాడు. వాళ్ళు వాళ్ళ డౌట్లన్నీ తీర్చుకోటానికి రకరకాల ప్రశ్నలు వేశారు. ఎవరికి వారే వ్యక్తిగతంగా ప్రశ్నలు వేశారు. అతను చెప్తున్న ఒక్కోవిషయం వింటూ మనకి మాత్రమే తెలిసిన ఈ విషయాలు చెప్తున్నాడంటే ఇతను నిజంగానే మన మిత్రుడు అని నమ్మకానికి వచ్చారు.

కానీ అతని వయసు ఇంకా పాతికే. ఉత్తేజ్ యక్సిడెంటులో చనిపోయి ముప్పయి సంవత్సరాలు దాటింది. మరి ఇదెలా సాధ్యం అనుకున్నారు.

అతను రాగానే "ఇది తనకి పునర్జన్మ" అన్నాడని గుర్తొచ్చి ఆమాటే చెప్పాడు గిరి వాళ్ళిద్దరితో.

"కొంతకాలం వీడిని ఇక్కడే వుండనిద్దాం అసలు విషయం బయట పడుతుంది. వీడిని వదిలేస్తే ఎక్కడైనా చెప్పే ప్రమాదం వుందని" చెప్పాడు లోకేష్.

అలా ఓ వారం రోజులు అతని ప్రవర్తన, కొంత మంది వ్యక్తుల గురించి చెప్పే తీరు చూసి నిజంగానే అతను పునర్జన్మతో వచ్చాడని అనుమానం కలిగింది. అయితే ఈ జన్మలో ఇతను ఎవరు? ఎక్కడ నుండి వచ్చాడో తెలుసుకునేందుకు ప్రయత్నించి విఫలమైయ్యారు.

ఓ రోజు కిటికీలోంచి బయటకి చూస్తూ ఎదురుగా కనిపిస్తున్న ఇంటివైపు చూపుతూ, "ఆ రోహిణి వాళ్ళింట్లో వారికి మన మీద ఎ డౌటూ రాలేదు కదూ. శవం కూడ పూర్తిగా మట్టిలో కల్సిపోయి వుంటది. ఇక మనకి ఏ ప్రమాదమూ లేదు" అన్నాడు.

అతనలా అనే సరికి ముగ్గరూ బిక్కచచ్చిపోయారు. కానీ పైకి మాత్రం "నీవేం మాట్లాడుతున్నావో అర్ధం కావటంలేదు" అన్నారు.

"ఇందులో అర్ధం కావటానికి ఏముంది? చాల ఏండ్లు గడిచాయి కదా. ఇప్పుడున్న జనం ఆ సంగతే మర్చిపోయారు. మీరంతా ఆర్ధిక ఇబ్బందుల్లో వున్నారని అర్ధం అయింది. మనం ఆ శవం పూడ్చినప్పుడు రోహిణి చేతికున్న నాలుగు బంగారు ముత్యాల గాజులు మనం తీసేసుకుంటే ఎక్కడ దొరికిపోతామో అని అలాగే వుంచేసాం. ఇప్పుడు వాటి విలువ పదింతలు పెరిగింది. వాటిని తలా ఒకటి తీసుకుంటే మన అవసరాలు తీరతాయి" అన్నాడు.

ముగ్గరూ ఆలోచనలో పడ్డారు. అప్పుడు ఆ స్థలం ఊరిబయట చాల నిర్మానుష్యంగా వుండేది. ఆరోజు వాళ్ళు ఎక్కడ రోహిణిని పాతి పెట్టారో అక్కడ గన్నేరు చెట్టు నాటారు ఎవరికీ అనుమానం రాకుండా. తర్వాత రోజు అనుకోకుండా వర్షాలు పడటం మూలంగా తవ్విన ఆనవాళ్ళు కనబడకుండా పోయాయి. మెల్లగా చెట్టు ప్రాణం పోసుకుని ఇన్నాళ్ళూ తమ

నేరాన్ని బయట ప్రపంచానికి తెలియనివ్వకుండా కాపాడింది. తర్వాత ఆ స్థలంలో గవర్నమెంటు స్కూలు నిర్మాణము జరిగింది. అప్పుడు కూడ ఆ చెట్టు అడ్డు కాకపోవడం వల్ల దానిజోలికి పోలేదు ఎవరూ.

ఎవరూ మాట్లాడక పోయే సరికి "ఏం మాట్లాడరు. ఓ.. ఆల్ రడీ తీసేసుకున్నారా? నా వాటా అడుగుతానని అనుకుంటున్నారా?"

"ఛ..ఛ అదేం కాదు నువ్వుగానీ ఈ విషయం ఎవరితోనైనా చెప్పావా?" ఎందుకో డౌటు వచ్చి అడిగాడు రాంబాబు.

"ఛ.. నేనెవరికి చెప్తానూ, అసలు ఇప్పుడు ఆ ప్రదేశం ఎక్కడో కూడ నేను గుర్తు పట్ట లేను" అన్నాడు.

ఇంతలో లోకేష్ " అసలు ముందు వాడు చెప్పిన విషయం గూర్చి ఆలోచించండి" అన్నాడు.

కాసేపు తర్జన భర్జన అనంతరం ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ స్కూలులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి ఎవరికీ అనుమానం రాకుండా ఆ చెట్టు లైనులో మరో పది మొక్కలు వేస్తూ గన్నేరు చెట్టు తవ్వటానికి నిశ్చయించుకున్నారు.

స్కూలు హెడ్ మాస్టర్ గారిని కలిసాడు గిరి. మొక్కల వేసే కార్యక్రమం కనుక వెంటనే ఒప్పుకున్నాడు హెడ్ మాస్టరు. మొక్కలు వేయించటానికి గన్నేరు చెట్టు లైనులో గోతులు తవ్వటం కోసం ఇద్దరు కూలీలను మాట్లాడి పని మొదలు పెట్టారు.

స్వచ్ఛంద సంస్థవారు, స్కూలు స్టాఫు వచ్చాక ఓ నాలుగు మొక్కలు వేసి హడావుడి చేసి ఫోటోలు దింపి మిగిలిన కార్యక్రమం చూడండి అంటూ అందర్నీ పంపించటానికి వెళ్ళారు రాంబాబు, లోకేష్. ఆఖరున గన్నేరు చెట్టు దగ్గరకి రాగానే దానిని తొలగించి మరికాస్త లోతుగా తీయడం కోసం కూలీలను ఆపుచేయించి భోజనాలు చేసి రండని పంపించారు గిరీ, ఉత్తేజ్.

ఈలోపు రాంబాబు,లోకేష్ వచ్చాక ఎవరూ చూడటం లేదని నిర్ధారణ చేసుకుని ముగ్గురూ చెకచెకా మట్టి తొలుస్తుండగా ఎముకలు బైటకి వచ్చాయి. వారి కృషి ఫలించిందని ఆనందంతో మరికాస్త స్పీడు పెంచి జనాలు వచ్చేలోగా పనికానిచ్చి యధాలాపంగా అక్కడో మొక్క నాటేద్దాం అని తొందర పడుతుండగా పోలీసు జీపు చాలా స్పీడుగా స్కూలు ఆవరణలోకి దూసుకొచ్చింది.

వాళ్ళు ఉత్తేజ్ వైపు అనుమానంగా చూసారు. "అయ్యే నేను కాదు నాకేం తెలియదు. గాడ్ ప్రామీస్" అంటూ ఉత్తేజ్ ఒట్టు వేసాడు.

★★★

మరుసటిరోజు పేపర్లో "30 సంవత్సరాలనాటి రోహిణి మిస్సింగ్ కేసుని ఛేదించి, గ్యాంగ్ రేప్ కం మర్డర్ కేసుగా గుర్తించి ముగ్గురు నిందుతులని చాకచక్యంగా పట్టుకున్న యస్సై యుధిష్టర్" అంటూ వార్తలు వచ్చాయి. అందరూ యుధిష్టర్ ని అభినందనలతో ముంచెత్తారు.

ఆ సాయంత్రం డాక్టర్ నిఖిలేశ్వర్ ఇంటికి వచ్చాడు యస్సై యుధిష్టర్.

"మీరుగానీ సహకరించకపోతే ఈ కేసులో నిందితులు ఎప్పటికీ దొరికే వారు కాదు" అన్నాడు ఎస్సై.

"నిజానికి మేమే మీకు థ్యాంక్స్ చెప్పాలి. ఆ డైరీ దొరకిన తర్వాత ఏదోలే అని తీసిపారేయకుండా చాల నిబద్ధతతో డ్యూటీ చేసి మాకు న్యాయం చేసారు" అన్నాడు.

ఇద్దరికీ టీ అందిస్తూ మిసెస్ నిఖిలేశ్వర్ అడిగింది "అసలు ఏం జరిగింది. ఆ నలుగురిలో ఒకడు చనిపోవడం ఏంటి వాడి స్థానంలో ఇంకోడు రావడమేంటి? నాకు కొంచం కూడ అర్ధం కావడం లేదు"

యస్సై నవ్వుతూ చెప్పాడు. "ఏంలేదు మాడమ్ చాల రోజుల క్రితం పోలీస్ స్టేషనులో వున్న పాత వెహికిల్స్ లన్నింటిని స్క్రాప్ కింద ఆక్షన్ కి పెట్టాం.

అందులో ఒక ఆటోలో వున్న సీటు కింద బాక్స్ లో ఓ డైరీ దొరికిందని మా కానిస్టేబుల్స్ తీసిచ్చారు. అది ముప్పై ఏళ్ళ క్రితం యాక్సిడెంట్లో చనిపోయిన ఉత్తేజ్ అనే నేర ప్రవృత్తి గల వ్యక్తిదని తర్వాత అర్ధం అయింది. అతనికి డైరీ రాసే అలవాటు వున్నట్లుంది. అది చదివితే చాల ఆసక్తికరమైన విషయాలు చాల తెలిసాయి.

అందులో అతను తను తన ముగ్గురు స్నేహితులతో కలసి ఎప్పుడెప్పుడు ఎలా వ్యవహరించింది, ఎలా నేరాలు చేసింది వివరాలు రాసుకున్నాడు. ముందు అది ఏ సినిమా స్టోరీనో అనుకున్నా, కొన్ని సంఘటనలు ఎక్కడో విన్నట్లు అనిపించి ఆరా తీస్తే నిజంగా జరిగిన సంఘటనలని అర్ధం అయింది.

అందులో ఒకటి రోహిణి అనే అమ్మాయిని బలాత్కారం చేసి క్రూరంగా చంపినట్లు రాసాడు. ఆ అమ్మాయి ఎవరా అని ఆరా తీస్తే డాక్టరుగారి చెల్లెలని తెలిసింది. విషయం డాక్టరు గారికి చెప్పా. అవును తన చెల్లి మిస్సింగు కేసులో ఏ విధమైన ప్రోగ్రెస్ లేకుండా ఇంకా మిస్టరీగానే వుందని చెప్పగానే ముద్దాయిలని ఎలా పట్టుకోవాలా అని అలోచించాం. కేసు ముప్పయి ఏళ్ళది కావడం వల్ల కేవలం ఈ డైరీ ఆధారంగా వాళ్ళని అరెస్టు చేయలేము. ఉత్తేజ్ డైరీ అని రుజువు చేయలేము. ఎలా అని డిస్కస్ చేస్తున్న తరుణంలో డాక్టరు గారి దగ్గరకి ఓ విచిత్రమైన మానసిక వ్యాధి వున్న కార్తీక్ అనే వ్యక్తి వైద్యానికి వచ్చాడు. ఆ వ్యాధి లక్షణం ఏమంటే నీవు ఫలానా అని చెప్తే అతను ఆ కారెక్టరులో ఇన్ వాల్వు అయిపోతాడు. సపోజ్ నీవు సూపర్ స్టార్ రజనీ కాంత్ అని ఎవరైనా అంటే రజనీకాంత్ లాగా ప్రవర్తిస్తుంటాడు. ఈ

పేషెంటు ఏమైనా పనికొస్తాడేమో అని ఒక బాణమేసి చూశాం. అతనికి మత్తు మందిచ్చి నిద్రలేవగానే ఆటో యాక్సిడెండ్ అయ్యి హస్పిటల్ లో జాయిన్ అయ్యావని నమ్మబలికాం.

కొత్త డైరీ ఒకటి సృష్టించి అందులో ఈ అన్ని విషయాలు రాసి అతను డైరీ చదివేట్లు చేసాం. ఇక అంతే మనవాడు పరకాయ ప్రవేశం చేశాడు. ఇదంతా ఎప్పటికప్పుడు మా పోలీసుల ద్వారా వాళ్ళ కదలికలను గమనిస్తూ వచ్చాం. ఆఖరున గాజులకోసం వాళ్ళతో చర్చించాలని మేం రాసిన స్క్రిప్టు ఫలించి వాళ్ళు మాకు దొరికిపోయారు. వాళ్ళు చేసిన నేరాలన్నీ ఒప్పుకున్నారు."

ఆశ్చర్యంగా అంతా విని మరి "అయితే ఆ పేషెంటు కార్తీక్ పరిస్థితేంటి? అతనికేం కాదు కదా?"

"అతనికేం కాదు మళ్ళీ నిద్రలేవగానే ఎపీజే అబ్దుల్ కలాం వీరాభిమానికగా ఫీల్ అవుతూ జీవితంలో ఎలా పైకిరావాలో చెప్పే సూచనలు పాటించేందుకు అనుగుణంగా ఓ డైరీ రాసి వుంచాం. త్వరలోనే అతను తన మానసిక వ్యాధి నుండి బయట పడగలడు" అన్నాడు 30 ఏళ్ళగా ఎంతో మందికి తనదైన స్టయిల్ లో మానసిక రోగులకి చికిత్స అందించి బాగుపరచి విదేశీ డాక్టర్లకు సైతం రోల్ మాడల్ గా నిలచిన ప్రముఖ సైక్రియాటిస్ట్ డా.నిఖిలేశ్వర్.

## జీవితమే సఫలమూ.. తాటిపాముల మృత్యుంజయుడు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

**అమెరికా దేశం**, కాలిఫోర్నియా రాష్ట్రం. ట్రాన్ క్విల్ లాంగ్ టర్మ్ కేర్ సెంటర్. ఉదయం ఏడు గంటలు.

కాలకృత్యాలు ముగించుకొని తిరిగి తన బెడ్డులో తలగడ నిటారుగా పెట్టుకొని కూర్చున్నాడు రాబర్ట్. పూర్తిపేరు రాబర్ట్ విలియమ్స్. పక్కనే ఉన్న రిమోట్ తీసుకొని టీవీలో వార్తలు వినటం మొదలెట్టాడు.

ఇంతలో కాలింగ్ బెల్ నెమ్మదిగా ఒకసారి మోగిన చప్పుడు, అటుపై తాళపుచెవితో తలుపు తీసిన శబ్దం. తలుపు తెరుస్తూ లోపలికి చక్రాల బండిని తోస్తూ వచ్చింది నర్స్. బండిలో అల్పాహారం, కాఫీ సర్ది వున్నాయి.

"గుడ్ మార్నింగ్, మిస్టర్ విలియమ్స్! రాత్రి సరిగ్గా నిద్రపోయారా?" అడిగింది జెన్నిఫర్. ఆవిడ అతనికి కేటాయించబడ్డ నర్స్ మరియు కేర్ టేకర్.

"యస్! చాలా మంచిగా నిద్రపోయాను, జెన్నీ! రోజూ నువ్వు చేస్తున్న సహాయానికి కృతజ్ఞతలు!" ఇచ్చిన వేడి సూప్, బెడ్డుముక్కలను అందుకొన్నాడు.

"ఇట్స్ మై ప్లెజర్. నా డ్యూటీ కూడా. ఈ ఉద్యోగాన్ని చేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది" కాఫీ కలుపుతూ అంది జెన్నీఫర్.

"ఇంకో నెలరోజులు నిన్ను కష్టపెడతానేమో. ఆ తర్వాత నీ సహాయానికి ఎప్పుడు కృతజ్ఞుడిగా ఉంటాను." అంటుంటే అతని గొంతు కొద్దిగా వణికింది.

"బీ బ్రేవ్, మిస్టర్ విలియమ్స్! మీరు బాగా కోలుకున్నారు. అంతా మంచే జరుగుతుంది." గ్లాసులో నీళ్ళు అందిస్తూ, వీపుపై చనువుగా చేతితో తడిమింది జెన్నీఫర్.

వేడి కాఫీ కప్పును పక్కన పెడుతూ, "ఎంజాయ్ యువర్ కాఫీ! లంచ్ టైంలో కలుద్దాం " అంటూ చక్రాల బండిని బయటకు తోసి, తలుపును నెమ్మదిగామూసి వెళ్ళిపోయింది జెన్నీఫర్.

రాబర్ట్ వయస్సు డెబ్బై సంవత్సరాలు. ఫైర్ డిపార్ట్ మెంట్ లో యాభై సంవత్సరాలకు పైగా పనిచేసి మార్షల్ గా రిటైర్డ్ అయ్యాడు. ఆరు అడుగులకు పైనే ఎత్తు. ఇప్పటికి మంచి దృఢకాయుడు. అతనికి ఒక కూతురు. అయిదు వందల మైళ్ళ దూరంలో వేరే సిటీలో ఉంటుంది. ఈ మధ్య కాలంలో అతను ఏ కారణం లేకుండా వ్యాకులతకు లోనౌతూ,పదే పదే విచారపడుతుంటే డాక్టరును కలిసారు. ఒంటరితనం నుండి దూరంగా, కొంత కాలం లాంగ్ టెర్మ్ లో ఉంటే బాగుంటుందని చెప్పటంతో కూతురు ట్రాన్ క్విల్ కేర్ లో చేర్పించింది.

కాఫీ తాగుతూ వార్తలు చూస్తుంటే పక్కనే ఉన్న ఇంటర్ కాం ఫోను మోగింది. ఎత్తి 'హల్లో'' అన్నాడు.

అవతలనుండి రిసెప్షనిస్ట్ గొంతు. "మిస్టర్ విలియమ్స్! మిమ్మల్ని చూడటానికి ఇద్దరు అతిథులు వచ్చారు. ఇప్పుడు పంపించవచ్చా?"

'నన్ను చూడటానికి ఎవరు వచ్చి ఉంటారు?' ఒక్క క్షణం ఆశ్చర్యానికి లోనౌతూ "యస్, వారిని పంపించండి" అని ఫోను పెట్టేసాడు.

'ఎవరై ఉంటారు? తను ఈ హోంలో జాయిన్ అయ్యిమూడు నెల్లయింది. తనతో పనిచేసి, దగ్గరలో ఉంటున్న సహోద్యోగులు కొందరు వచ్చి పరామర్శించి వెళ్ళారు. కూతురు రెండు వారాలకోసారి వస్తూనే వుంది. మరి వీళ్ళెవరై ఉంటారు?' అని తర్జనభర్జన పడుతుంటే తలుపుపై చిన్నగా చప్పుడు. 'కమిన్ ' అనగానే హోం ఉద్యోగి తలుపు తెరిచాడు.

ఇద్దరు వ్యక్తులు లోనికి వచ్చారు. ఇద్దరు సూటులో ఉన్నారు. మెళ్ళో టై కట్టుకున్నారు.

"మిస్టర్ విలియమ్స్! మేము బర్కిలీ యూనివర్సిటీ నుండి వస్తున్నాము. అక్కడి ప్రెసిడెంట్ ఆఫీసులో పనిచేస్తున్నాము. మీతో మాట్లాడటానికి అయిదు నిమిషాలు కావాలి " అన్నాడు వాళ్ళలో ఒకడు.

"యూనివర్సిటీ? బర్కిలీ?" అంటూ తడబడి "ష్యూర్, నేను రెడీ" అన్నాడు.

"మీకు తెలిసే ఉంటుంది. ప్రతి సంవత్సరం మే నెల మధ్యలోయూనివర్సిటీ కాన్వకేషన్ ఉంటుంది. వచ్చే వారం జరగబోయే ఆ ఫంక్షన్ కు మిమ్మల్ని ఒక అతిథిగా ఆహ్వానించటానికి వచ్చాం" అన్నాడు ఇంకోతను.

"నేనా, కాన్వకేషన్ కు గెస్ట్ రావటమా?" నమ్మశక్యం కాలేదు రాబర్ట్ కి.

"అవును నిజమే. యూనివర్సిటీ కొద్ది రోజుల క్రితం తీసుకున్న నిర్ణయం ఇది. మీరు ప్రస్తుతం ఎక్కడున్నారో తెలుసుకోవటంలో కూడా కాస్తా కాలాయాపన జరిగింది. మీ ఆచూకీ దొరకగానే చకచకా యూనివర్సిటీ నిర్ణయాలు తీసుకొంది." అన్నాడు యూనివర్సిటీ ఉద్యోగి.

"ఓ, అలాగా! కానీ... నేను హైస్కూల్ వరకే చదువుకున్నాను. కాలేజ్ లో అడుగే పెట్టలేదు. మరి, ఇలా నన్ను ఆహ్వానించడం ఏమిటో నాకు బొత్తిగా అర్థం కావడం లేదు" సందిగ్ధం వెలిబుచ్చాడు.

"మాకు కూడా అన్ని వివరాలు తెలియవు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఆహ్వానాన్ని మీకు అందించడానికి మాత్రమే వచ్చాం. మీరు వచ్చివెళ్ళటానికి అన్ని సదుపాయాలు యూనివర్సిటీయే ఏర్పాటు చేస్తుంది. మీ ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు కూడా తీసుకొంటుంది." అంటూ భరోసా ఇచ్చాడు.

"మరి, ఈ విషయం నా కూతురికి చెప్పాలి. అమ్మాయి ఓకే అంటే వచ్చేస్తాను." నింపాదిగా అన్నాడు రాబర్ట్.

"ఓ! మేము ఇక్కడికి రాబోయే ముందు మీ అమ్మాయితో ఫోనులో మాట్లాడాము. మీతో మాట్లాడిన విషయాలే ఆవిడకు చెప్పాం. మీ కూతురు సమ్మతి తెలిపిన తర్వాతే ఇక్కడకు బయలుదేరాం." అన్నాడు.

"ఓకే దెన్! డన్ డీల్!" అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

"గ్రేట్, ఆ రోజు ఉదయం యూనివర్సిటీ నుండి లిమోసిన్ వస్తుంది. ఎనిమిది గంటల వరకు రెడీగా ఉండండి." అంటూ వెళ్ళిపోయారు యూనివర్సిటీ ఉద్యోగులు.

రాబర్ట్ కు అంతా అయోమయంగా ఉంది. ఎప్పటిలాగే మామూలుగా ప్రారంభమైన ఉదయం పది నిమిషాల్లో పూర్తిగా మారిపోయింది. ఇప్పటివరకు జరిగింది నిజమా అని ప్రశ్నించుకొన్నాడు.

రాబర్ట్ తండ్రి కూడా ఫైర్ డిపార్ట్ మెంట్ లో పనిచేసాడు. అప్పట్లో ఫైర్ ఇంజన్లు చాలా చిన్నగా ఉండేవి. చెక్క డ్రమ్ముల్లో నీళ్ళు నింపుకొని ఎప్పుడూ రెడీగా ఉండేవారు. అగ్నిని ఆర్పే ఇతర చిన్న పరికరాలు ఉండేవి. ట్రక్కులో వేలాడదీసిన ఒక పెద్ద గంటను చేత్తో మోగిస్తూ వెళ్ళేవారు. తండ్రి వేసుకునే దుస్తులు, టోపీ, బూట్లు చూసి చిన్నప్పుడే ఆ వృత్తిపట్ల ఆకర్షితుడయ్యాడు. ఇంటికి వచ్చి తండ్రి చెప్పే కబుర్లు వింటుంటే గౌరవం కూడా పెరిగింది. స్కూలు నుండి ఇంటికి వెళ్ళేటప్పుడు తండ్రి పనిచేసే ఫైర్ స్టేషన్ వద్ద ఆగేవాడు. అక్కడంతా కలయ తిరిగేవాడు. ట్రక్కులో కూర్చుని గంటను నెమ్మదిగా మోగించేవాడు. స్నేహితులతో గొప్పలు చెప్పుకునే వాడు.

హైస్కూలు అవగానే తాను ఫైర్ డిపార్ట్ మెంట్ లో పనిచేస్తానన్నడు. కొడుకు శ్రద్ధాసక్తులు గమనించిన తండ్రి సరే అన్నాడు. వృత్తిపరంగా ఆరునెలల శిక్షణ పూర్తి చేసి అప్రెంటిస్ గా ఉద్యోగం మొదలెట్టాడు. అంచెలంచెలుగా ఎదిగి మార్షల్ గా రిటైర్మెంటు తీసుకొన్నాడు. యాభై సంవత్సరాల సర్వీసులో ఎన్నో అనుభవాలు. కొన్ని ఆనందాన్నిచ్చేవైతే, మరికొన్ని విషాదాన్ని గుర్తు చేసేవి. ఇళ్ళు, ఆఫీసుల్లోని మంటలకు ఎదురొడ్డి ఆర్పేసాడు. అడవుల్లోని కార్చిచ్చులను సాహసోపేతంగా ఎదుర్కొన్నాడు. రాత్రనకా, పగలనకా శ్రమించాడు. అత్యవసర పరిస్థితుల్లో పిలుపు వస్తే వెళ్ళడానికి ఎప్పుడూ సంసిద్ధుడై ఉండేవాడు. ఆ కాలాన్ని, సేవను గుర్తు చేస్తూ తెల్లని చర్మంపై అక్కడక్కడా కాలిన గుర్తులు, కమిలిన మరకలు ఇప్పటికి ఉన్నాయి.

ఆ గుర్తులను చేతివేళ్లతో నెమ్మదిగా తడుముకొంటుంటే సెల్ ఫోను మోగింది.

"హాయ్ డాడ్!" కూతురు కంఠం.

"హల్లో బేబీ" రాబర్ట్ ముఖంలో నవ్వు, గొంతులో మాధుర్యం.

"బర్కిలీయూనివర్సిటీ వాళ్ళు వచ్చి నిన్ను కలిసారా?"

"అవును, వచ్చి ఇప్పుడే వెళ్ళారు. ఏం జరుగుతుందో నాకేమీ పాలుపోవడం లేదు." అని గాభరగా అన్నాడు.

"మీ టూ డాడ్, నేనేమి అడిగినా వివరాలు తెలియవంటూ మాట దాటేసారు. అయినా, భయపడే విషయం కాదుగా. ఇది నీకు ఒక గౌరవంగా భావించవచ్చు. అందుకే ఓకే చెప్పేసాను" కూతురు గలగలా చెప్పేసింది.

"ఐ అగ్రీ విత్ యూ, స్వీట్ హార్ట్! ఏం జరుగుతుందో చూద్దాం " అన్నాడు రాబర్ట్.

"బై డాడ్. తరువాత మాట్లాడుతాను." అంటూ ఫోను పెట్టేసింది కూతురు.

★★★

బర్కిలీ యూనివర్సిటీ క్యాంపస్. ఒక పెద్ద భవనం ముందు విశాలమైన ఆవరణలో కుర్చీలు వరుసగా పేర్చారు. పట్టా తీసుకోబోయే విద్యార్థినీ విద్యార్థులు తమ డిపార్ట్ మెంట్, ఇంటిపేర్లతో కలిపి ఒక క్రమపద్ధతిలో కూర్చుని ఉన్నారు. నల్లని కోటు, తలపై నల్లటి టోపీ ధరించారు. మెడలో అబ్బాయిలైతే టై, అమ్మాయిలేమో రుమాళ్ళు ధరించారు. అందరి ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి. తాము నాలుగేళ్ళు పడ్డ కష్టానికి పతాక సన్నివేశం అది. పట్టా పుచ్చుకొనే కొందరు పై చదువులకు వెళుతున్నారు, కొందరు ఉద్యోగాలకు వెళుతుంటే, కొందరు స్వంత బిజినెస్ మొదలెట్టాలనే యోచనతో ఉన్నారు. వెరసి, అందరూ బంగారు భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకా ఏం చెయ్యాలో నిర్ణయించుకోవటంలో మరికొందరు సతమవుతున్నారు కూడా. పిల్లలు పట్టా తీసుకునే సన్నివేశాన్ని చూడటానికి వచ్చిన తల్లిదండ్రులు, స్నేహితులు దూరంగా గ్యాలరీలో కూర్చున్నారు.

కుర్చీల ముందు భవనానికి దారితీసే ఎత్తైన మెట్లు. మెట్లు ఎక్కగానే పొడవైన హాలు. ఆ హాలులో వరుసగా నగిషీతో చెక్కిన కుర్చీలు వేసి ఉన్నాయి. ఆ కుర్చీల్లో యూనివర్సిటీ ప్రెసిడెంట్, డిపార్ట్ మెంట్ హెడ్స్, కాన్వకేషన్ కు సరిపడే సాంప్రదాయ దుస్తులు ధరించి ఆసీనులై ఉన్నారు. వారి మధ్యలో రాబర్ట్ కూర్చుని ఉన్నాడు. కొద్దిగా అసౌకర్యంగా ఉన్నాడు. అతని పక్కనే పాతికేళ్ళ లోపు వయసున్న అమ్మాయి కూర్చుని ఉంది. ఆఫ్రికన్ ఆమెరికన్ జాతికి చెందిన అమ్మాయి ఆమె.

కాన్వకేషన్ ప్రారంభమయ్యింది. ముందుగా ప్రెసిడెంట్ మాట్లాడాడు. అందరిని ఆహ్వానిస్తూ, యూనివర్సిటీ సాధించిన అభివృద్ధిని, భవిష్యత్తు ప్రణాళికలను, విద్యార్థులు సాధించిన ఫలితాలను వరుసగా చెప్పుకొచ్చాడు. చివరగా వారి మధ్య కూర్చున్న అమ్మాయి గురించి మాట్లాడాడు. ఆ అమ్మాయి పేరు షకీత స్మిత్. ఆ సంవత్సరపు 'వాలెడిక్టేరియన్'. యూనివర్సిటీ నుండి వీడి వెళ్ళుతున్న విద్యార్థులకు వీడ్కోలు చెప్పటానికి ఎన్నుకోబడ్డ 'అత్యుత్తమ విద్యార్థి '. తీసుకొన్న అన్ని కోర్సుల్లో ఉత్తమ గ్రేడ్లు సంపాదించింది. ప్రొఫెసర్ల మెప్పును పొంది వారు చేసే పరిశోధనల్లో తనవంతు సహాయం చేసింది. స్కాలర్షిప్పులు సంపాదించింది. పైసా ఖర్చు లేకుండా చదువులు పూర్తిచేసింది. షకీత పట్టిందల్లా బంగారం అయ్యింది. ఆ అమ్మాయి ప్రతిభ చూసి దేశంలోని పేరొందిన యూనివర్సిటీలు ఏకంగా పి హెచ్ డీ చేయటానికి ప్రవేశాన్ని ఇచ్చాయి. మా దగ్గరి కంటే మా దగ్గరికి వచ్చి చదవమంటూ పోటీ పడ్డాయి. ఆ మాటలు వింటున్న రాబర్ట్ కు తెలిసింది ఆ అమ్మాయి ఎంతటి ప్రతిభావంతురాలో.

ప్రెసిడెంట్ తర్వాత డిపార్ట్ మెంట్ హెడ్స్ మాట్లాడారు. అటు తర్వాత ఆనాటి వాలెడిక్టేరియన్ అయిన షకీతను ప్రసంగించమన్నాడు ప్రెసిడెంట్. షకీత లేచి మైకు ముందుకు వచ్చి విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడటం మొదలెట్టింది. రాబర్ట్ శ్రద్ధగా వింటున్నాడు.

"నేను మీలో ఒకరిని. మీలాగానే పట్టా తీసుకోబోతున్న విద్యార్థిని. నేనేమి పెద్దమాటలు మాట్లాడను. నీతులు బోధించను. ప్రతి మనిషి జీవితాన్ని తరచి చూస్తే ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఈ రోజు నేను ఇక్కడ నిలబడి ఉన్నాను కాబట్టి ఇప్పటివరకు సాగిన నా జీవితంలోని కొన్ని విశేషాలను మీతో పంచుకొంటాను.

నా తల్లి రోజువారి పనిచేసుకొని బతికేది. నేను పుట్టిన మొదటి సంవత్సరంలోనే ఆమె మరణించింది. నా పసితనం వీడక ముందే చనిపోయిన నా తల్లిని ఫోటో ద్వారానే ఎరుగుదును. నా తండ్రి ఎవరో నాకు తెలియదు. ఆతను

ఎవరో నా తల్లి ఎవరికీ చెప్పలేదని నా తాతయ్య చెప్పాడు. తాతయ్య ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు కూడా అంతంత మాత్రమే. అందుకని, ఏడాది వయసున్న నేను శిశు సంక్షేమశాఖ అక్కున చేరాను.

బాల్యం ఎలా గడిచిందో నాకు సరిగ్గా గుర్తులేదు. కాని, అయిదేళ్ళ వయసు వచ్చేసరికి ఎలిమెంటరీ స్కూలుకు వెళ్ళటం మొదలెట్టాను. అప్పుడు నేను పెంపుడు ఇంటికి పోవటం ఆరంభమయ్యింది. ఒక్కో కుటుంబ సంరక్షణలో ఆరు నెలల వరకు ఉండేదాన్ని. తరువాత వేరే ఇంటికి మారేదాన్ని. ఒక్కోసారి మధ్యలో నన్ను పోషించటానికి ఏ కుటుంబం దొరికేది కాదు. అప్పుడు తాతయ్య దగ్గర గడిపేదాన్ని. బతకటానికే కష్టపడుతున్న తాతయ్యకు భారమయ్యేదాన్ని. ప్రతీ ఆరు నెలలకు ఒక కొత్త ఇల్లు, కొత్త మనుషులు, అన్నీ సర్దుకునేసరికి ఇంకో ఇంటికి ప్రయాణం. అప్పుడప్పుదు ఎటు వెళ్ళాలో తెలియని అగమ్యగోచరం. సులువుగా విరిగిపోయే దుర్భలమైన జీవితం. బలమైన కుటుంబ బంధాలు ఏమీ లేవు. వృద్ధ్యాప్యానికి చేరువౌతున్న ఒక్క తాతాయ్య తప్ప. మానసికంగా ఎంతో క్షోభ అనుభవించాను. ఈ అలజడిలో రెండు సంవత్సరాలు స్కూలుకు పోలేదు.

కాలం గడిచి పధ్నాలుగో సంవత్సరంలో అడుగు పెట్టాను. బయట పనిచేసే అర్హత వచ్చింది. హైస్కూలు చదువుతూ బయట మెక్ డొనాల్డ్, గుడ్ విల్ లాంటి చోట్ల పనిచేసాను. స్కూలు నుండి నేరుగా పనికి,

అటునుండి ఇంటికి. అలసిపోయిన నాకు స్కూల్లో ఇచ్చిన హోం వర్క్ చేయటానికి ఓపిక ఉండేది కాదు. ఒక్కోసారి లేటుగా పనిచేస్తే నిద్ర సరిగ్గా ఉండేది కాదు. ఎర్రబడ్డ కళ్ళతో స్కూలుకు వెళ్ళేదాన్ని.

ఈ గడ్డు పరిస్థితులన్నీ నన్ను గట్టిదాన్ని చేసాయి. నిశ్శబ్దం లో ఏడిస్తే వచ్చే కన్నీళ్ళు బతుకును భారం చేస్తాయని, బాధను మరింత పెంచుతాయని తెలుసుకొన్నాను. రోదించడం మానేసాను. వచ్చిన ప్రతి కష్టాన్ని నా ఎదుగుదలకు మెట్టుగా ఉపయోగించుకొన్నాను. సుఖమైనా, దుఃఖమైనా, బాధ అయినా, సంతోషమైనా, మంచి కాలమైనా, దుష్ట కాలమైనా అన్నింటికి నెలవు నేనే. వాటి పుట్టుక నాలో జరుగుతుంది. కాబట్టి నన్ను నేను ఆధీనంలోకి తీసుకుంటే నా భవిష్యత్తును నేను నిరించుకోవచ్చని తెలిసొచ్చింది. నన్ను నేనే పెంచుకొన్నాను. ఇదీ నా గతం. ఇదంతా చెప్పి మిమ్మల్ని బాధిస్తే, వెరీ సారీ! నన్ను క్షమించండి."

ఇదంతా వింటున్న రాబర్ట్ షకీతాను మనస్సులో అభినందించకుండా వుండలేకపోయాడు. కాని, ఇంతకూ తను ఈ సభలో ఏంచెయ్యాలో, తన పాత్ర ఏమిటో అర్థం గాక సతమతమౌతున్నాడు.

"అయితే చివరగా, నేనిప్పుడు ఇక్కడ ఇందరి పెద్దల మధ్యలో నిలబడి, మీ ముందు మాట్లాడుతున్నానంటే దానికంతటికి ఒకే ఒక బలమైన కారణం ఉంది. దాని వెనకాల ఒక హీరో ఉన్నాడు. అతనే... ఇక్కడ స్టేజీపై కూర్చుని వున్న మిస్టర్ రాబర్ట్ విలియమ్స్. అతడే మూలకారణం."

తన పేరు వినగానే రాబర్ట్ గుండె ఒక్కసారిగా వేగంగా కొట్టుకుంది. 'నాకు, షకీతాకు సంబంధమేంటి? ఆమె ఉన్నతికి నేను చేసిన సహాయం ఏంటీ? ఆమెను ఇప్పుడే మొదటిసారిగా చూస్తున్నాను" ఆలోచనలలో కొట్టుమిట్టాడాడు.

"నేను కోరగానే, మిస్టర్ విలియమ్స్ జాడ తెలుసుకొని అతన్ని ఆహ్వానించినందుకు ప్రెసిడెంట్ కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" .

ఇంకా అయోమయంలో నుండి తేరుకోని రాబర్ట్ ను చూస్తూ "మిస్టర్ విలియమ్స్, నేను మీకు ఇంకా గుర్తుకు రానట్టుంది. ఆఫ్ కోర్స్ అది చాలా కష్టం . అయినా ఓ పాతికేళ్ళ వెనక్కు వెళ్ళండి." అంటూ ముఖమంతా విచ్చుకుంటూ కళ్ళు మెరుస్తుంటే నోరు విప్పి ఒక్కసారిగా నవ్వింది.

అంతే! ఆ అందమైన నవ్వును ఎలా మర్చిపోగలడు? రాబర్ట్ కు విషయం అవగతమైంది.

షకీత తిరిగి మాట్లాడుతూ గతంలోకి వెళ్ళి రాబర్ట్ కు ఆ కాలాన్ని గుర్తు చేస్తూ మాట్లాడసాగింది.

కాని రాబర్ట్ ఆమె మాటలేమి వినటం లేదు. అతని మనస్సు గతాని తవ్వుకుంటూ ఆ కాలపు పొరల్లోకి వెళ్ళింది.

★★★

అది ఎప్పటి మాట. సుమారు పాతికేళ్ళ కింద జరిగింది. ఆ రోజు ఉదయం ఎనిమిది నుండి సాయంత్రం ఆరు వరకు పనిచేసి ఇంటికి వెళ్ళాలి. అయిదు గంటలవుతుంటే తన తర్వాత డ్యూటీకి రాబోయే సహోద్యోగి ఒకతను ఏదో అర్జంటు పని ఉండి డ్యూటీకి రాలేకపోతున్నాడన్న కబురొచ్చింది. కాబట్టి, రాత్రి షిఫ్ట్ కూడా కొనసాగించటానికి సిద్ధమయ్యాడు రాబర్ట్. బయట సహాయకచర్యలు అందించడం లేనప్పుడు స్టేషన్లోనే కావల్సిన పనులు చేస్తుంటారు. ఆ

క్రమంలోనే రాబర్ట్ స్టేషన్ నేలను ఊడ్చాడు. చెత్త నిండిపోయిన ప్లాస్టిక్ బ్యాగులను బయట బిన్ లో వేసి వచ్చాడు. టాయ్ లెట్లో అవసరమైన సరంజామా సర్దుతుంటే స్టేషన్లోని ఫోను మోగింది.

రెండు అంగల్లో వెళ్ళి ఫోను ఎత్తాడు. అవతలినుండి 911 కాల్ డిస్పాచర్ మాట్లాడటం మొదలెట్టాడు. "హలో ఫైర్ స్టేషన్. సిద్ధమేనా? అత్యవసర సహాయం కావాలి?"

"యెస్, రెడీ? ఎలాంటి సహాయం కావాలి?"

"ఫైర్ ఆక్సిడెంట్. అడ్రసు తీసుకోండి..."

అడ్రసు చెబుతుంటే గబగబా పక్కనే ఉన్నా కాగితం పైన రాసుకొంటున్నాడు. ఇంతలో ఇతర సిబ్బంది సమాయత్తం కావటం మొదలెట్టారు. అడ్రసు తీసుకోవడం పూర్తి కాగానే అందరూ ఫైర్ ట్రక్కులో కూర్చున్నారు. సైరన్ మోగిస్తూ వెళుతుంటే రోడ్డు మీద వాహనాలు పక్కకు తప్పుకొని దారి ఇచ్చాయి.

ప్రమాదస్థలానికి అయిదు నిమిషాల్లో చేరుకొన్నారు. అప్పుడే చీకట్లు కమ్ముకొస్తున్నాయి. అక్కడ అగ్ని ప్రమాదంలో చిక్కుకొన్నది ఒక అపార్ట్ మెంట్ కాంప్లెక్స్. వందకు పైగా అపార్ట్ మెంట్లు ఉన్నాయి. ఒకమూలనుండి మంటలు మొదలయ్యాయి. రెండవ అంతస్థులోని పది అపార్ట్ మెంట్లు మంటల్లో చిక్కుకొన్నాయి.

ఆ కాంప్లెక్స్ చాలా పాతది. చెక్కలతో నిర్మించారు. ఆర్థికంగా చాలా దిగువ తరగతికి చెందిన వాళ్ళు అద్దెకు ఉంటారు. అగ్ని ప్రమాదాన్ని నివారించటానికి కావలసిన ముందు జాగ్రత్తలు తీసుకోని భవనమది.

అప్పటికే చాలా మంది చిన్నాపెద్దా బయటకు పరిగెత్తుకొచ్చి రోడ్డు మీదకు నిలబడ్డారు. రాబర్ట్, అతని టీం రోడ్డు పక్కనే ఉన్న హైడ్రం ట్ తెరిచి, హోస్ తగిలించి నీళ్ళు చిమ్మటం మొదలెట్టారు. వారిలో కొందరు కాలుతున్న గోడ చెక్కలను కూల్చటం మొదలెట్టారు. ఇంకొకతను పైనుండి కిందకు వచ్చే మెట్లును అగ్ని ప్రమాదానికి కాలకుండా నీటితో తడుపుతున్నాడు. అందరినీ బయటకు రావలిసిందిగా మైకులో చెబుతున్నారు.

"కాలుతున్న అపార్ట్ మెంట్లలో ఇంకా ఎవరైనా ఉన్నారా?" అక్కడున్న వారిని అడిగాడు రాబర్ట్.

"అదిగో, ఆ ఈశాన్యం మూలన్నున ఇంటివారు ఇంకా కిందకు రాలేదు." అన్నది ఓ కంఠం.

అంతే, ఒక్క ఉదుకున మెట్లెక్కి అటుగా వెళ్ళాడు రాబర్ట్. ఆ అపార్ట్ మెంట్ ముందేమి మంటల్లేవు. కాబట్టి పని సులువైది. తలుపు లోపలి నుండి గడియ పెట్టుంది. దబదబా తలుపును తట్టాడు. సమాధానం లేదు. తన దగ్గరున్న క్రోబార్ తో తలుపును ఎడం చేస్తూ గొళ్ళెం పట్టును సడలించాడు. భుజబలాన్ని ఉపయోగిస్తూ తలుపును తోసాడు. తలుపు తెరుకొంది. అప్పుడప్పుడే లోపల పొగ వ్యాపించటం మొదలెట్టింది.

“హలో, లోపల ఎవరైనా ఉన్నారా? మీరు ప్రమాదంలో ఉన్నారు. త్వరగా బయటకు రండి.” అంటూ గొంతెత్తి అరిచాడు. సమాధానం రాలేదు.

చేతిలో ఉన్న టార్చిలైటు వేసి చుట్టు చూసాడు. ఓమూలగా నేలమీద వేసి ఉన్న పరుపులో ఒక స్త్రీ పడుకొని ఉంది. ఒక్క అంగలో చేరుకొన్నాడు. నిద్రపోతున్నట్టుంది. తట్టిలేపాడు.

ఆవిడ లేవలేదు. ముక్కు దగ్గర వేలెట్టి చూస్తే శ్వాస తీస్తున్నది. ఇంత జరుగుతున్నా కదలటం లేదంటే ఏదో మత్తులో ఉన్నట్టుంది. ఇంతలో ఆవిడ కప్పుకున్న దుప్పట్లో చిన్నగా కదలిక.

దుప్పటి కొద్దిగా తొలగించాడు రాబర్ట్. ఆశ్చర్యం. పాలబుగ్గల పసిపాప. తల్లి స్తన్యం నోట్లో ఉన్నది. చప్పరిస్తూ పాలను తాగుతున్నది. దుప్పటి కప్పి ఉంది కాబట్టి పొగలు పాపాయిని చేరుకోలేదు. దుప్పటి తెరవగానే ముఖానికి పొగ తగిలి స్తన్యాన్ని వదిలి కేర్ మంటూ ఏడ్చింది. మత్తులో ఉన్న తల్లికి ఇవేమి పట్టడం లేదు.

క్షణం ఆలస్యం చేయకుండా పాపను దుప్పట్లో చుట్టి ఛాతికి దగ్గరగా పెట్టుకొని కిందకు వచ్చాడు. తల్లిని రక్షించడానికి ఇద్దరు సహోద్యోగులను పైకి పంపించాడు.

కాలుతున్న భవనానికి దూరంగా నడిచాడు. దుప్పటి విప్పి చూసాడు. పొగ గొంతులోకి వెళ్ళటం వల్ల శ్వాస తీసుకోవటానికి కష్టపడుతున్నది ఆ చిన్నారి. ఛాతిపై తన మునివేళ్ళతో మెల్లగా రుద్దాడు. బొటన వేలు, చూపుడు వేళ్ళను రెండు చెంపలపై ఉంచి మెల్లగా ఒత్తాడు. పాప పెదాలు విచ్చుకొని నోరు తెరుచుకొంది. గాలి నోటి లోపలికి వెళ్ళడంతో శ్వాస తీసుకోవడం మొదలెట్టింది. ఏడ్పు ఆపింది. దగ్గు ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఒక అరచేతిలో పాపను తలకిందులుగా చేసి తలను కొద్దిగా కిందకు వాల్చి ఇంకో చేతి చూపుడు, మధ్య వేళ్ళతో వీపుపై సున్నితంగా చరిచాడు. కొన్ని క్షణాల తరువాత పాప శాంతపడింది.

పాపను రెండు చేతుల్లోకి తీసుకొని పైకి తిప్పాడు. పాప నవ్వింది. అతి సుందరమైన నవ్వు. అమాయకత్వపు ముఖంల్లో అత్యంత ప్రశాంతమైన నవ్వు. చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలియని పసితనపు నవ్వు. చీకట్లను ప్రాలద్రోలుతూ వెలుగులు వెలిగిస్తున్న ముత్యం లాంటి నవ్వు. నల్లటి ముఖారవిందాన్ని రెట్టింపు చేస్తున్న మల్లెపూవు తెల్లదనపు నవ్వు. రాబర్ట్ ను చూస్తూ బోసినవ్వులు చిమ్మింది. అతనికి కళ్ళలో నీళ్ళు ఉబికాయి. అతనూ నవ్వాడు. పాపాయి కిలకిలా మంది. అంతే, రాబర్ట్ మనసు దూదిపింజలా గాలిలోకి ఎగిరింది.

అమ్మాయిని పోలీసులు తీసుకెళ్ళారు. తండ్రి ఎవరో తెలియదు. తల్లి కూడా ఎవరికీ చెప్పలేదు. తాతయ్య ఉన్నాడు. కాని, అతను గవర్నమెంటు ఇచ్చే సంక్షేమ పథకాలపై బతుకు వెళ్ళదీస్తున్నాడు. మనవరాలుని పెంచే స్థితిలో ఆర్థికంగా, ఆరోగ్యంగా లేదు. కాబట్టి పాప శిశు సంరక్షణలోకి వెళ్ళిందని తర్వాత విన్నాడు. తల్లి తీవ్ర అస్వస్థకు గురై మరణించిందని అతనికి మరి కొద్ది రోజుల తర్వాత తెలిసింది.

★★★

"మిస్టర్ విలియమ్స్! ఇప్పుడు మిమ్మల్ని మాట్లాడమని మా మనవి" అన్న ప్రెసిడెంట్ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు రాబర్ట్.

తడబడుతున్న రాబర్ట్ ను చూసి, "మీరు అక్కడే కూర్చుని మాట్లాడండి" అంటూ మైక్ తెచ్చి చేతికిచ్చాడు.

"నాకేమి తోచటం లేదు. నా నోట ఒక్క మాట రావటం లేదు. నా మనస్సు ఒక రకమైన విచిత్ర పరిస్థితిలో ఉంది. కాని ఒకటి మాత్రం చెప్పగలను. ఈ ప్రపంచంలో జరిగే ప్రతీ ఘటన వెనుక ఒక బలీయమైన కారణం ఉంటుందని గట్టిగా నమ్ముతాను. కాలం, పరిస్థితులు అన్ని కలిసొచ్చాయి కాబట్టి ఆ సమయంలో నేనక్కడున్నాను. నా కర్తవ్యాన్ని నిర్వహించాను. నా యాభై ఏళ్ళ సర్వీసులో ఒక విషయం గట్టిగా అవగతమైంది. అదేమిటంటే, ఈ భూమ్మీద పుట్టిన ప్రతి ప్రాణం ఎంతో విలువైంది. మన మనసుల్లో పుట్టే అన్ని వికారాలు పక్కన పెట్టి ప్రతి ప్రాణిని రక్షించుకోడానికి శాయాశక్తుల ప్రయత్నించాలి. అంతకన్నా ఇంకేమి మాట్లాడలేను. నేను చేసిన చిన్న సహాయంతో షకీత ఇంత పెద్దగా ఎదిగింది అంటే నా జీవితంలో నేను ఇంకేమి కోరుకుంటాను" అన్నాడు రాబర్ట్.

అలా అంటున్న రాబర్ట్ ను చూసి "కాని, మీరు ఇప్పుడు ఒక పని మాత్రం చేయగలరు" విన్నవిస్తున్నట్టుగా మాట్లాడింది షకీత.

"ష్యూర్, ఏమిటది?" నవ్వాడు రాబర్ట్.

"మీ ఒళ్ళో కూర్చుని ఫోటో దిగాలనుంది" అభ్యర్థించింది షకీత.

చేతులు చాచాడు రాబర్ట్. పరుగున వెళ్ళి ఒళ్ళో కూర్చుంది షకీత.

అలా కూర్చున్న ఇద్దరిని చూస్తుంటే నలుపును తెలుపు మరింత తళతళమని చేసిందా? లేక, తెలుపును నలుపు మరింత ప్రకాశవంతం చేసిందా? అన్నట్టుగా ఉంది. ఏదేమైనా, కెమెరాలు మెరుపులు చిమ్ముతూ 'క్లిక్ క్లిక్ క్లిక్' మని అన్నాయి.

ఆనందోత్సాహాల మధ్య పట్టా తీసుకొన్న తర్వాత గాల్లోకి ఎగురవలసిన టోపీలు ముందుగానే గాల్లోకి ఎగిరాయి.

# ఎగరడానికి రెండు రెక్కలు  వి.శ్రీనివాస మూర్తి

"ఇంకా నీ సుపుత్రుడు ఇంటికి రాలేదా ??" రామనాథం ఇంటికి రాగానే రోజు అడిగే ప్రశ్న.

" రాగానే వాడి గురించేనా , అదీ వ్యంగ్యంగా. భోజనానికి రండి."

" నా కర్మ. ఈ వయసులో బాధ్యత లేకుండా తిరిగే పాతికేళ్లు దాటిన కొడుకు మనసుకు క్షోభ కలిగిస్తుంటే , భోజనం ఒకటే తక్కువ. చదువు అంతంత మాత్రమే. ఉద్యోగం చేయడట. పెళ్ళాం పిల్లలు అక్కర లేదట. ఏదో సమాజాన్ని ఉద్ధరిస్తాడట . మనము పెద్ద వాళ్లం అవుతున్నాము. బాధ్యత లేకుండా తిరుగుతున్నాడు."

కాళ్లు చేతులు కడుక్కొని భోజనానికి కూర్చొన్నారు. వడ్డిస్తూ నిలబడింది. కొడుకు గురించి భర్త కోపం , మానసిక వ్యథ తనకు తెలుసు.

కళ్యాణ్ చదువు కొనే రోజుల్లో కూడా అనాథ ఆశ్రమంలో సేవ చేసేవాడు. సంసార బాధ్యతలలో మునిగి తేలడం చేయదల్చు కోలేదు. తన జీవితాన్ని పరుల , ముఖ్యంగా అభాగ్యుల సేవ లో గడపాలని గుర్తించాడు.

సీత కి ముందు ముందు కొంత బాధ కలిగినా, మెల్లగా తన కొడుకు ఆలోచన తీరు సబబు అనిపించింది.

ఇద్దరు ఎప్పుడు ఎదురు పడినా, ఘర్షణ పడడం తనకి బాధ గానే వుంది కానీ, నిస్సహాయురాలు గా వుండడం అలవాటు చేసుకొంది .

భర్త భోజనం కాగానే ఏదో మాగజీన్ చదువుతూ సోఫా లో కూర్చొన్నాడు. కాసేపటికి కొడుకు కళ్యాణ్ వచ్చాడు. స్నానం చేసిన తర్వాత తల్లి కొడుకులు భోజనానికి కూర్చొన్నారు. రామనాథం కి కోపం రగులుతున్నా , పాపం ప్రశాంతంగా అన్నం తిననీ అని ఊరు కొన్నాడు..

భోజనం అయిపోగానే , కళ్యాణ్ వచ్చి ఎదురు సోఫాలో కూర్చొన్నాడు.

రామనాథం ఇంక ఆగ లేక పోయాడు.

కోపంగా " నేను అంటే నీకు బొత్తిగా లెక్క లేదు. నీ కోసమే నా జీవితం ధార పోసాను , నీవు మాత్రం , నీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావు.. నీ మంచికే కదా నేను చెప్పేది."

కళ్యాణ్ ఆవేశం గానే " నేను పాతికేళ్ళ వాడిని. నాకు ఏది ఆనందం ఇస్తుంది, ఎలా బతకాలో తెలుసు. మీ అభిప్రాయాలు నా పై రుద్దకండి. నేను ఏమి తప్పు పని చేయడం లేదు. మీరు ఊరకే విసిగిస్తున్నారు. అంతగా మీకు మీతో వుండడం కష్టం అయితే , ఆశ్రమం లోనే ఉంటాను "

"మరి భవిష్యత్తు సంగతి ఏమిటి?"

రెచ్చి పోయి " ఇక మీరు నా భవిష్యత్తు గురించి అడిగారు. కేవలం "ఈ క్షణం" మాత్రమే వుంది ఏదైనా చేయడానికి. నాకు ఆనందం ఇచ్చేది చేయనివ్వండి. నా చేతిలో వున్న క్షణాన్ని వృధా చేసుకొని అందరిలా భవిష్యత్తు అని చెప్పి మనసులో జీవించ లేను.. దయచేసి ఇంక ఎప్పుడు ఈ సంగతి ఎత్త వద్దు. "

తండ్రి షాక్ తిన్నాడు . ఇంకా కోపం పెరిగింది. తన కర్మ కొద్ది ఇలా తయారు అయ్యాడు అనుకొన్నాడు . ఆ భావన వ్యక్తం అయ్యేలా కొడుకు వైపు చూశాడు.

తండ్రి ఆ చూపులు తనకు అలవాటే.

తన లాగా భయపడుతూ జీవించాలని ఆయన కోరుకున్నా, తాను ఒక అంగుళం కూడా తన మార్గం విడవ కూడదు అని ధృఢంగా నిర్ణయించుకున్నాడు.

రామనాథం ఉడికి పోతున్నాడు . కళ్యాణ్ విసిగి పోతున్నాడు.

" నేను వాడి మంచి కోరే కదా ఇంత చెపుతున్నాను, డబ్బు కూడబెడితే వాడికే కదా ఉపయోగపడుతుంది. నాకు ఒరిగేది ఏమి లేదు. ఎందుకు అర్ధం చేసుకొడు. నేను వాడిని ఎంతగా ప్రేమిస్తునాను ??" రామనాథం మనసులో .

"నా మీద తన భావాలు రుద్దాలని చూస్తాడు. నాన్నని నేను ఎంత గౌరవిస్తాను. ఎందుకు అర్ధం చేసుకోడు? " కళ్యాణ్ మనసులో.

ఇంతలో రామనాథం బెడ్ రూమ్ లోకి వెళ్తూ , ఎప్పుడు లేనిది కళ్యాణ్ కళ్లలో కళ్ళు పెట్టి చూశాడు. కళ్యాణ్ కూడా నాన్న ని చూశాడు.

ఏదో స్ఫురించింది కళ్యాణ మనసులో సడన్ గా. గట్టిగా అరిచాడు . నాన్నకు వినబడేలా. అరవాలని ఆరవ లేదు. ఏదో శక్తి అరిచేలా చేసింది. తనకే తెలియడంలా ఏమి జరుగుతోందో. కానీ స్వరంలో కోపం లేదు, విసుగు లేదు. చాలా సౌమ్యంగా

" నాన్న ఇప్పుడే తెలిసింది . నీవు ఇదంతా నా మీద ప్రేమతో అంటున్నావు. నా మీద ద్వేషంతో కానీ , నన్ను కంట్రోల్ చేయాలి అని కాదు. నాకు విసిగించాలి అని కాదు. నన్ను నీవు గాఢంగా ప్రేమిస్తున్నావు. ఇప్పటికీ దాకా ప్రేమించావు. ఇక ముందు కూడా ప్రేమిస్తావు"

తండ్రి కొడుకులు ఒకరినొకరు చూసుకొంటూవున్నారు . ఇప్పటి వరకు జీవితం లో నిజంగా ఒకరినొకరు చూసుకోలేదు.

అభిప్రాయాలు, నమ్మకాలు, అనుభవాల ముసుగులో చూసుకున్నారు. అందుకే ఇప్పుడు ఎంత సేపు చూసుకొన్నారో తెలియడం లేదు. మనసు సంకెళ్ళు లేని ఆత్మలతో చూసుకున్నారు.

ఎవరు మొదలు పెట్టారో తెలియదు. ఏడవడం మొదలు పెట్టారు. ఇద్దరు చిన్న పిల్లలు అయిపోయారు. ఆ కోపాలు , విసుగులు , అన్ని మాయం. కేవలం ఏడుపు. ఎన్నో సంవత్సరాల బరువు తీసినట్లు . తరవాత తెలియకుండానే ఒకరి కౌగిలి లో ఒకరు చేరి పోయారు. ఎన్ని యుగాలు అయిందో ఇలా కౌగలించుకొని.

" ఒరే నాన్న , నేను ,మీ అమ్మ, నిన్ను అమితంగా ప్రేమిస్తాము రా. మా ఇద్దరికీ నీవు తప్ప లోకం లేదు.. నీకు అంతా మంచి జరగాలనే రా మా తపన. ప్రపంచంలో అందరి కొడుకుల కంటే ఆనందంగా వుండాలనే రా మా కోరిక. మేము . ఉయ్ లవ్ యు నాన్న " నాన్న ఆత్మ ఘోష . ఒకరి బాహువులో ఇంకొకరు కన్నీరు కారుస్తూ చాలా చాలా సేపు గడిపారు.

సీతకి ఎన్నో రోజుల తర్వాత , ఇది చూసి హృదయం పొంగి పోయింది. తాను కూడా వారి ఆలింగనంలో చేరింది.

ఇంత వరకు ఎప్పుడు ఇలా జరగ లేదు. ఇప్పుడు ఇద్దరూ హృదయాలు విప్పారు. ప్రేమకి లొంగి పోయారు. ప్రేమ చెప్పుకున్నారు. ప్రేమ ఒప్పుకున్నారు. ప్రేమ పంచుకున్నారు. ప్రేమ అనుభవించారు . మనసులో వున్న సంకెళ్ళు తెగి పొయ్యా యి. సత్యమైన ప్రేమ అవగతం అయింది.

ఈ సారి చూడడమే వేరు. ఇదేనేమో నిజంగా వున్నది వున్నట్లు చూడడం. మనసు ప్రమేయం లేకుండా .

ఇద్దరి అభిప్రాయాలు మార లేదు. విలువలు, నీతులు మారలేదు. కేవలం వున్నది వున్నట్లు చూడడం , మనసు గోల పక్కన పెడితే మిగిలింది శుద్ధ ప్రేమ. పరమానందం .

మళ్ళా ఆ ఇంట్లో ఆ విషయం పై చర్చ రాలేదు. కళ్యాణ్ వరకు తనకు నచ్చిన సేవలో మునిగి పోయాడు . రామనాథం , కొడుకు పరిస్థితి ని అంగీకరించాడు .

మనల్ని నడిపించే ఆ అదృశ్య శక్తి మన మేలు కోరి అప్పుడప్పుడు మన అనుభవాలను ఇంకొక దిశలో తిప్పి చూపిస్తుంది. విరుద్దమైన అనుభవాల ద్వారా జీవిత పాఠాలు నేర్పుతుంది. అందుకే ఒకటి కాదు " రెండు రెక్కలు ఎగరడానికి"

# సవరించిన వీణ ఏ.బి.ఎస్.రామారావు

పాతకాలపు పేము పడక కుర్చీ. చెక్కదే. అటూ ఇటూ చేతులు పెట్టుకోడానికి ఉండి వాటి కింద ఇంకో రెండు చెక్కలుంటాయి.. వాటిని బయటకు తీసి, పాతకాలం నాటి గంటల గోడ గడియారంలో ముళ్ళని చేత్తో తిప్పినట్టు ముందుకు తిప్పితే కాళ్ళు పెట్టుకుని రిలాక్స్ అవ్వడానికి బాగుంటుంది..నాకు చాలా ఇష్టం.

ఊరినించి తెచ్చుకున్నా, మా అమ్మ వాడిన దిబ్బరొట్టి వేసే దళసరి పెద్ద ఇత్తడి మూకుడు, ఉప్పుడుపిండి చేసే దళసరి ఇత్తడిగిన్నెతో పాటు.

కుర్చీలో వాలి దీర్ఘాలోచనలో పడ్డా. ఊరి నుంచి రైతు ఫోనులో తెలిపిన విషయం విని ......

"""ఏమిటి తాతయ్యా అంత సీరియస్ గా ఆలోచిస్తున్నావు ?""" నాలుగు రోజుల క్రితం అమెరికా నుంచి వచ్చిన మనవరాలు వాహిని అడిగింది నన్ను. ఓ దిండు తెచ్చి నా తలఎత్తి తల కింద పెడుతూ..ఎదురుగా కుర్చీలో కూచుంది

"ఏంలేదమ్మా..." సాగతీత అందరికీ అలవాటే చెప్పబోయేముందు..

"ఏంలేదా? వెళ్ళిపోతానయితే"..నన్ను ఉడికిస్తూ లేవబోయింది కుర్చీలోంచి...

నాకు నవ్వొచ్చింది... కాస్త నవ్వుకోడం, హుషారుగా ఉండడం, మా ఆవిడ అన్నట్టుగా ఓ కుళ్ళుతోలు లుంగీ, బనీనూ, మాసిన గడ్డం కాకుండా రోజూ గడ్డం గీసుకుని ఇస్త్రీ బట్టలు వేసుకోవాలనిపించడం, మనవరాలు వచ్చిన ..ఇదిగో

ఈ నాలుగు రోజులనుంచీను. ఉత్తప్పుడైతే ఎవరి గోల వాళ్ళది, ఎవరి రూము వాళ్ళది, ఎవరి టివి వాళ్ళది.. ఎవరి ఫోను వారిది, తమలపాకు మీద సున్నం రాస్తున్నట్టుగా ఉండే .. అదే.. స్మార్ట్ ఫోను. ఎవరి వాట్సప్ గ్రూపులు వాళ్ళవి..ఎవరి బద్ధకాలు వాళ్ళవి...ఎవరి టైములు వాళ్ళవి..కలుసుకోడం తక్కువ, కలుపుగోరుతనం కాసింతే...ఫ్రెండ్సు అసలే లేరు..

బరువెక్కిన మనసు కూలేస్తుంది. ఇన్నాళ్ళూ జరిగిందదే. తేలికైన మనసు కూర్చోనివ్వదు.ఇప్పుడు జరుగుతున్నదిదే.

నేనంటే మనవరాలికి ఎంతో ప్రేమ, నాతో సరదాగా గడపాలన్న మనసూనూ. నాకు ఒళ్ళూ మనసూ తేలిగ్గా ఉంటున్నాయి...వాహిని వచ్చిన దగ్గర నుంచీను..

“అదికాదమ్మా, కూర్చో. నా సందిగ్ధత, ఆలోచన, ఆవేదన, నీకు తెలియాలంటేనా చిన్ననాటి ముచ్చట్లు, అనుబంధాలూ, రాగాలూ కొంత చెప్పాలి. 'ముసలి నస బాబోయ్' అని పారిపోకూడదు. సరేనా?” చెయ్యి చాపా, ఒట్టు వెయ్యమన్నట్లుగా..చిన్నపిల్లాడిలా..బుంగమూతి పెడుతూ. అవును మనసుకి వయసవ్వలేదుగా. అందులోనూ ప్రేమ, ఆప్యాయత కలిపి రంగరించి హుషారుగొలిపే వారుంటే పక్కన, వాహినిలా.

""చెప్పు తాతయ్యా.. నా సబ్జక్టు కూడా అదేగా 'హ్యూమన్ రిలేషన్స్ విత్ ఏనిమేట్ ఎండ్ ఇనానిమేట్ ఆబ్జక్ట్స్'

మైలురాయికి బట్టకట్టి బొట్టుపెట్టి, రావి, వేప కలిసిన చెట్టు మొదట్లో మూడు ఇటుకలు పెట్టి బొట్లు పెట్టి..

అదే అయ్యవారుగా, అమ్మగా, పూజించే సంస్కృతి, సాంప్రదాయం మనది...అదో భక్తి, అదో అనుబంధం. ఎమోషనల్ ఎటేచ్ మెంటు తాతయ్యా. మనసు ప్రధానం.” ఆప్యాయంగా నాచెయ్యిపట్టుకుని అంది.

"అవును తల్లీ, వినమ్మా" పక్కనే స్టూలు మీది పళ్ళెంలోని జంతికలు నాలుగు తీసి వాహినికి ఇచ్చి, నేను రెండు నోట్లో వేసుకుని చెప్పడం మొదలు పెట్టా.

★★★

అప్పుడు నా వయసు పదహారు. సెకండరీ స్కూలు లీవింగు సర్టిఫికెట్టు చేతికొచ్చింది...

ఉగాది రోజు ఉదయం... నా చిన్నప్పుడు ..ఇప్పటికి ఏభైఏళ్ళ పైమాటే..

ఆ మర్నాడు నేను పై చదువులకి ఏలూరు వెళ్లిపోవాలి...

ఎప్పుడూ ఇంటి దొడ్లో ప్రకృతితో ఆడుకుంటూ ఉండేవాడిని చిన్నప్పటినుంచీనూ_ _ _అల్లాగే ఆ రోజూనూ..

చిన్న పెద్దవాడిని కదా...చెట్లు ఎక్కడం కూడానూ....వేపచెట్టు ఎక్కా..వేప్పువ్వు కొయ్యడానికి...కిందకి అందేలానే ఉంది పువ్వు..అయినా చెట్టెక్కి కోసా..అదో సరదా...మామిడి పిందెలు కూడా...

"జాగ్రత్త నాయనా"”అమ్మ దొడ్డి వరండాలో కూర్చుని క్రితంరోజు రైతు తెచ్చిన బంగారుతీగ రకం చెరుకుగడ చెక్కుతీసి ముక్కలు కోస్తూ అంది నే చెట్టెక్కడం చూసి..అమ్మకి నామీదే ధ్యాస ఎప్పుడూ,.... అందరమ్మల్లాగానే...

గిలక నుయ్యి, పక్కనే నీళ్ళ గోలెం, పాదులు, చెట్లు, రోకలిబండలు, కాకులు, పిచికలు....చిలగడదుంప, తేగలు కాల్చుకునే వేణ్ణీళ్ళ పొయ్యి, తాటిముంజల బండి. అప్పుడప్పుడు వచ్చే కోతులు___.అన్నీ స్నేహితులే.. అన్నిటితోటీ అనుబంధమే..

జామకాయలు, మామిడికాయలు, బత్తాయిపళ్లు, చెట్టునే పండిన బొప్పాయి.... కోసుకు తినడం, బచ్చలిపండు నలిపి ఎరుపు రంగుతో ఆటలు, నేల గులాబీ మొక్క ముదిరిన కాయలు వేళ్ళతో నొక్కి 'టప్' అని అనిపించడం, నేల చింతచిగురు ....పుల్లటి ఆకులు కోసుకుని తినడం, లేత దొండకాయలు పాదునుంచి కోసుకుతినడం, బాదంకాయలు కొట్టుకు తినడం, బూరుగుదూదిచెట్టు పింది బొంగరంలా తిప్పి ఆడుకోవడం, మండువా గదిలో ఉయ్యాల ఊగడం, కొబ్బరిపుచ్చుకి ఈనుపుల్ల గుచ్చి పైకి ఎగరేయడం, కొబ్బరాకుతో బూరా, బావిదగ్గర స్నానం... గోలెంలో నీళ్ళతోనూ, తోడుకునీ కూడా..... ఇవన్నీ నా స్నేహితులు, నేను వాటికి స్నేహితుణ్ణి....ఊహ తెలిసిన వయసునించీనూ.నోరు లేకపోయినా నాతో మాట్లాడేవి... ఆడుకునేవాళ్ళం.. మూగభాషతో...ప్రకంపనలతో .....అవినాభావ సంబంధం___

మన ఇల్లు పెద్ద లోగిలి. మండువా ఇల్లు. చూసావుగా. నాకెంత ఇష్టమో..

స్నేహితులతో కలిసి, కాలవలో ఈతలు, కుస్తీపట్లు. స్కూల్లో డ్రామాలు వెయ్యడం, టీచరైన నాన్నగారి దర్శకత్వంలో..ఆగస్టు పదిహేనుకీ, జనవరి ఇరవై ఆరుకీను..

టీచరంటే గుర్తొచ్చింది. ఆరోజుల్లో మాస్టారంటే పిల్లలకి.. పిల్లలకేమిటిలే, ఊళ్ళోవాళ్ళందరికీ కూడా అమితమైన గౌరవం..ప్రేమ అపారం.

మారిన ఈకాలంలో మాస్టారంటే గౌరవం ఏది? ఆ గౌరవం పొందగలిగే నడవడిక, సబ్జక్టు మీద పటుత్వం, అప్పటి సచ్చింతన కలవారేరీ?____..చాలా తక్కువ అనే చెప్పాలి..ఆకాస్తా భ్రష్టు పట్టించేలా మాస్టారుని బఫూనులాగా, వెకిలిహాస్యానికి ఉపయోగించుకునే సామాజిక స్పృహలేని చాలామంది సినిమా దర్శకులు, నిర్మాతలు..

"అవును తాతయ్యా. మరి అందరూ ఓ బాపూగారో, ఓ విశ్వనాథ్ గారో కాలేరుగా మరి!!!!!వాళ్ళు యుగానికొక్కరు. తరవాత?"

సరే, చిన్నతనానికి వస్తే..

క్రికెట్టు మైదానంకంటే కూడా పెద్దదిగా ఉన్న స్కూలు ప్లేగ్రౌండులో ఆటలు...ఇప్పుడైతే మైన్ రోడ్డుమీద ఉన్న బిల్డింగు ఎపార్టుమెంటుల్లో స్కూళ్ళు..ఇంక పిల్లలాడుకోవడానికి మైదానాలెక్కడ?!!! అరచేతిలో ఆటలిప్పుడు.

పండగలు, అట్లతద్దీ వస్తే చెప్పే అఖ్ఖర లేదు..ఊళ్ళో పిల్లలందరమూ కలిసి తెల్లారకట్లనుంచీ ఆటలే...సంక్రాంతికి అక్కలూ, చెల్లెళ్ళూ వీధంతా ముగ్గులతో శోభాయమానం చేసేవారు ....దీపావళికి తిప్పుదుపొట్లం అందరం ఒకేసారి తిప్పుతూ ఉంటే ఆకాశం నుంచి నక్షత్రాలు మాతో ఆడుకోడానికి ఊడిపడుతున్నాయా అన్నట్టుగా ఉండేది.....

గుళ్ళో పూజలు, భజనలు, సంతర్పణలు, జ్వాలాతోరణం, ప్రభలు కట్టి తీర్థానికి తీసుకెళ్ళడం..అబ్బో ఎన్నెన్నో....

దసరాల్లో ఊళ్ళో అన్నికుటుంబాలూ అమ్మవారికి కుంకుమ పూజ చేయించేవారు కనకదుర్గమ్మ గుళ్ళో..

పొద్దున్నే చద్దన్నం, వేసంకాలం అయితే తరవాణీ తినడం.. ...కోనసీమలో ఉగాది కళ్ళాపి జల్లిన లోగిళ్ళలోనమ్మా.....

గోదావరి, కాలవ, చెరువు గట్టులపై తిరుగుతూ, ఆట పాట చెట్టాపట్టాల్తో చెరకు, మామిడి తింటూనూ. ప్రకృతితో జీవనం..గట్టి అనుబంధం.

"అవును తాతయ్యా, నా చిన్నప్పుడు అమ్మమ్మ ఊరు వెళ్ళినప్పుడు చూసా.. ఎంత ఎంజోయ్ చేశామో!!!!!"

పూజగదిలోంచి అమ్మ పాడుతున్న పాట ఇప్పటికీ చెవిలో వినిపిస్తోంది...ఆ ధ్యాసలో ఉన్నప్పుడల్లా. ఎంత బాగా పాడుతుందో..అమ్మ...రోజూ ఆపాట పాడుతుంది..నాకు కంఠస్తం..అమ్మకదే సర్వస్వం ఆనందంగా గడిపా ఆ రోజు... రేపే వీటన్నిటికీ దూరంగా వెళ్ళాల్సి వస్తోందన్న బెంగ దిగమింగి. ఇల్లంతా కలయతిరిగా..దొడ్లో చాలాసేపు ప్రకృతి మధ్య గడిపా...ఎందుకంటే???????ఏమో...అదంతే

ఆరోజు..ఉగాది మరునాడు...నేను పై చదువులకి కాలేజీలో చేరడానికి ఏలూరు వెళ్ళే ప్రయాణం రోజు..

బాగా కళ్ళముందు కనిపిస్తోంది తల్లీ ఆ సీను ఇప్పటికీ.... పొట్టి కాఖీ లాగూ, తెల్ల బుష్ షర్టు వేసుకుని ఉన్నా.. పండక్కి తొడుకున్న పొడుగు పేంటు, గళ్ళ చొక్కా మడతపెట్టి ట్రంకు పెట్టిలో దాచుకున్నా..కాలేజీకి వేసుకోవాలి..నా మొదటి పొడుగు పేంటు అది.. సత్యం చేత చెప్పులు కూడా కుట్టించారు నాన్నగారు..అదే నా మొదటి చెప్పుల జత..

..పొద్దున్న లేవగానే ఒళ్ళు విరుచుకుంటూ దొడ్డిగుమ్మం దగ్గరకెళ్ళి చూసా..కళ్ళు చెమ్మగిల్లాయి..

అప్పటి మానసిక బెంగకి అనుగుణంగా కాబోలు....ఆ భావ దృశ్యం.. మనసులో పాతుకుపోయింది.....

తరవాత ఇదిగో ఇల్లా అక్షర రూపం దాల్చింది....

చదువు తల్లీ తరవాత, ఇదిగో ఈ తోక నోటుపుస్తకంలో పదిలపరుస్తుంటా నాకు తోచే నాలుగు ముక్కలు.

ఇవే అక్షరరూప ఆలోచనలు, ఆవేదనలూ, భగవంతుడికి వేండుకోళ్ళూనూ.

""ఇటియ్యి తాతయ్యా,ఇప్పుడే చదువుతా..""తమాషాగా నవ్వుతూ.

ఎందుకు నవ్వుతున్నావు అని అడిగితే ' తోక నోటుపుస్తకం' అన్నాననిట. స్క్రిబ్లింగ్ పేడ్ అనాలి కాబోలు..

నాకూ నవ్వొచ్చింది, గర్వంగానూ ఉంది మన పాత నుడికారం తలుచుకుని.. ఆ పద ప్రయోగాలకో అందం..

పైకే చదివింది...

............

దొడ్లో మామిడిచెట్టుకి ఉన్న పూత, పిందె నేలపై పడి ఉంది

కోయిల గొంతు వినపడలేదు. కాకి గోల ఎక్కువైంది

కొబ్బరి చెట్టు మొదట్లో రాలిన పుచ్చులెన్నో

బొప్పాయి చెట్టు కాండం నిండా పాల కన్నీళ్ళు

వాడిన దొండ పాదు. లోతు కెళ్ళిన బావి నీళ్ళు

పువ్వులే రాలి, పిందెలనే రాల్చిన జామ చెట్టు.

పిచికల కిలకిలలే లేక వాడిన, నే కట్టిన వరికంకె గుత్తి

చిరు గాలికే ఒళ్ళంతా చింపుకున్న అరటి చెట్లు.

నిన్న లేని బీటతో ఏడుపులా నీరు కారుతూ నీళ్ళ గోలెం

వాటంతటవే రాలి వడిలిన ఆకు సంపంగి పూలు

గొలుసూడి మూడు గొలుసులతో ఉయ్యాల బల్ల మండువాలో

ఎవరు చెప్పారో వీటికన్నిటికీ......ఇవాళ నా ప్రయాణమని!!!!!!!

అనుబంధాల ప్రకంపనలంటే ఇదే కాబోలు..

నాకు అనిపించింది ......

పసిగట్టాయి ఇవన్నీ పరుగెడుతున్నాడు వీడు అని ....

మళ్ళీ తిరిగి రాడు మరుగుతాడు పుర వాసమని....

బెంగెట్టుకున్నాయవన్నీ ఇంక మాతో ఆడేవాడేదని?????

పల్లెవదిలి, పల్టీలు కొట్టి, పైకి పట్టుకెళ్ళేదేముందని?

అనుకుంటున్నాయి పోగా పోగా వాడికే తెలిసొస్తుందని.....

...........

""కళ్ళకి కట్టినట్టుంది తాతయ్యా..వాపోయినట్టుగా ఉన్నాయి.... అల్లాగే ఉంది చూడొస్తే...""

అవునమ్మా...అయ్యుండచ్చు..ఇదీ నాకు అనిపించిన వాటి స్వగతం వీడలేని బాధ వాటికి, నాకు కూడా...

క్లుప్తంగా చెప్పానమ్మా.. ఇంకా వివరంగానూ, అన్ని విషయాలూ చెప్పాలంటే నాలుగు రోజులు ప'డుతుంది.

చదువు, తరువాత ఉద్యోగరీత్యా ఆ ఊరూ, ఈ ఊరూ తిరగడమూనూ...పెళ్ళీ, పిల్లలు..సరేసరి..

అరిషడ్వర్గాలకి తోడుగా ఐడెంటిటీసూ, ఇంప్రెషన్సూను..ఇదేగా మనసు!! ...ఉబ్బి ఊరంతయ్యింది..

ఊరు విడిచిన నాకు వాటి ఉసురే తగిలింది కాబోలమ్మా ...శాపనార్థం కాదది....

ఆర్థికంగా కొంతలో కొంత ఉన్నతంగా ఉన్నా ఊపిరిలో పురి లేదు. ఉన్నంతలో బాగున్నా ఊరిలోని ఉత్సాహం పట్టణంలో లేదు. ఎప్పుడూ, అనిపిస్తుందమ్మా...ఊరి ఉబ్బిన మనసుకన్న, మహా పుర వాసంకన్న, ఊరి బతుకే మిన్న...అని

ఈ మధ్య మరీనూ....

""అర్థం చేసుకోగలను తాతయ్యా, అందులోనూ నువ్వు చెపుతున్నపుడు నీ ఎక్సైట్మెంటు, కళ్ళల్లో కనిపించే నీ ఆనందం..భాష్పాల రూపంలో.. చూస్తున్నాగా""....

రిటైరయ్యాక మరీ అనిపిస్తోంది....గాఢంగా....పదే పదే గుర్తొస్తున్నాయి...చిన్ననాటి ఊరి ముచ్చట్లు.. పలకరింపులే లేక, పదిమందీ దూరమై, పద్దాకా పక్కకే పరిమితమై మగతగా పడుకున్న వేళ పాత జ్ఞాపకాలే జతకట్టి ముసురుతాయి మదిలో....ఆనందం కలిగించినవీ, ఆవేదన కలిగించినవీనూ..

చాలా కాలమైంది వెళ్ళి. ఓ సారి వెళ్ళి చూసిరావాలనిపిస్తుంది, పుట్టి పెరిగిన ఊరూ, ఇల్లూనూ..

ఒక్కోసారి 'పోనిద్దూ, ఈ ఎటాచ్ మెంట్లు అన్నీవదులుకోవాలి' అనిపిస్తుంది.

వృధ్యాప్యం వచ్చే కొలది, ఎక్కువగా మగవాళ్ళం గోడగడియారంలో పెండ్యులంలా స్పిరిట్యుఅల్ లైఫ్ కి మెటీరియలిస్టిక్ లైఫ్ కి మధ్యలో అటూ ఇటూ ఊగుతుంటామమ్మా.

""అవును తాతయ్యా.. "

మా నాన్నగారు మన రైతునే ఉండమన్నారు మన ఇంట్లో ఇల్లు చూసుకుంటూ....అమ్మడం ఇష్టం లేకా, అవసరం లేకానూ.

అతనూ పోయాడు.. "ఓ పాలు రండి బాబయ్యా" అంటాడు వాళ్ళబ్బాయి. నాకంటే వయసులో బాగా చిన్నవాడే..

చిన్ననాటి పల్లె అనుబంధాలు పదిలంగా ఉంటాయి...

"ఓ పాలు ఏమిటి తాతయ్యా?"

"ఓ పాలు అంటే ఒక సారి అన్నమాట. మూడేళ్ళవ్వొస్తోంది వెళ్ళి..."

"ఎల్లాఉంది తాతయ్యా ఊరూ, మన ఇల్లూనూ?" పల్లెలు పాడుబడుతున్నాయని తెలుసు కామోసు. అడిగింది

" ఏం చెప్పమంటావమ్మా?! ఊరంతా పాడయ్యింది. పూర్వపు కళ లేదు. మన వీధిలోని అన్ని కుటుంబాలూ వలస వచ్చేశాయి పట్టణాలకి. పిల్లలందరూ విదేశాల బాట పట్టారు..అక్కడే ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. ఊళ్ళో వాళ్ళ ఇళ్ళన్నీ శిధిలావస్థలో ఉన్నాయి. వాళ్ళకేమీ పట్టదు..రారు, పట్టించుకోరు, చూసుకోరు."

"మన ఇల్లెలా ఉంది తాతయ్యా? ఎప్పుడో చిన్నప్పుడు చూసా.."

"అల్లాగే ఉందమ్మా..ఏ మార్పూ చెయ్యకుండా, ప్రతి ఏడాదీ వెల్లలేయిస్తున్నాడు, దొడ్లో పాదులు, కూరగాయ మొక్కలు, పూలమొక్కలు, జామ, మామిడి చెట్లతో చక్కగా ఉందమ్మా.."

"మరి మార్పులూ, చేర్పులూ ఏమీ చేసుకోలేదా? పోనీ నిన్నడిగి?"

"లేదమ్మా. నేనూ అదే అడిగా.... దానికేమన్నాడో తెలుసా?"

" అయ్ బాబోయ్, ఎల్లా చేత్తావండే.. అల్లాగే ఉంచేహేడండి మాబాబు. ఆఁన్ య్..నాతో సెప్పేడండి పోయేముందు.. 'ఒరే అబ్బాయా ఇల్లు మంచిగా సూసుకోరా.. ఇల్లాగే ఉండాల..పాడుసెయ్యకండి, అయ్యగోరు మామంచోరు..ఊరికే ఉండమని మనకిచ్చారు', అన్నాడండి..మరి నేనా ఊసు మీరకూడదుకదండే. ఆ రోజుల్లో బరమా టేకుసెక్కతో కట్టించారండి మీ పెద్దోళ్ళు..సుబ్బరంగా ఉందండె లోగిలి. ఆఁన్ య్"

పక్కా కోనసీమ యాసతో చెపితే, తెగనవ్వింది వాహిని..

నేనూ వంత కలిపా..ఎంతకాలమయ్యిందో ఇలా నవ్వుకుని.. ఇల్లూ దొడ్డీ అలాగే ఉండాలని నా కోరికకూడా. నే ఉన్నన్నాళ్ళయినా....

"ఇంతసేపు మాట్లాడేవు ఫోనులో, ఏంచెప్పాడు తాతయ్యా?"

"అతనూ, భార్యా ఇల్లు ఖాళీ చేసి హైదరాబాదు వెళ్ళిపోదామనుకుంటున్నారుట..వాళ్ళబ్బాయి దగ్గరికి. వచ్చెయ్యండని తెగ పట్టుబడుతున్నాడుట. వాళ్ళమ్మ ఆరోగ్యం అంతంతమాత్రం..హైదరాబాదు తీసికెళ్ళి వైద్యం చేయిస్తాడుట.. మూటాముల్లీ సద్దుకొని వచ్చేసి మాదగ్గరే ఉండండి అని చెపుతున్నారుట కొడుకూ కోడలూనూ.."

పకపకా నవ్వింది వాహిని... ఎందుకో అర్థం కాలేదు.. అదే అడిగా..

"తాతయ్యా, నువ్వు మూటాముల్లీ అంటే నవ్వొచ్చింది.. తమాషాగా ఉంటాయి కొన్నిమీ పదప్రయోగాలు.. సరే.. ఆయన ఖాళీచేస్తే ఏంచేద్దామనుకుంటున్నావు? అమ్మేస్తావా? "

"లేదమ్మా, అంతపెద్ద ఇల్లు.. పెద్ద పెద్ద గదులతో కొనేవాళ్ళున్నా అమ్మాల్సిన అవసరమూ లేదు, అమ్మాలని మనసూ లేదు. నా తదనంతరం మీ నాన్న ఏంచేసుకున్నా సరే. ఆ కాలపువాడిని కదమ్మా, పాతవి వదలలేను, కొత్తవాటిమీద మోజు లేదు..అలా వదిలేస్తే ఇల్లు పాడైపోతుంది. ఆ ఊళ్ళో అద్దెకి వచ్చేవారూ ఉండరు.. నా తదనంతరం మీనాన్న పట్టించుకోడు.అనుబంధంగా ఉంచుకోవలసినది ఈ వయసులో కూడా బంధంగా మార్చుకున్నానమ్మా.. 'నేనూ

అమ్మా ఊరెళ్ళి మనింట్లో ఉంటాం, హాయిగా దొడ్లో కూరగాయలు పండించుకుని తింటూ ' అని చాలా సార్లు మీనాన్నతో చెపితే ససేమిరా వద్దన్నాడు.. వాడి దగ్గరే ఉండాలిట. ఇప్పుడిప్పుడు నాకు తెలిసొస్తోందిలే. మీ బామ్మ ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంటోంది. మన ఊళ్ళో వైద్య సదుపాయం లేదు. ఇక్కడ నాన్న దగ్గరుంటే ఓ ధైర్యం.. ఏంచెయ్యాలా అని ఆలోచిస్తున్నా."

చెమరిన కళ్ళు తుడుచుకుంటూ ఉంటే..మాట మార్చడానికి అంది వాహిని..

" పోనీలే తాతయ్య నీకు నచ్చినట్టుగా ఏదో పరిష్కారం దొరక్క పోదు..అవునూ, మన ఇంటికి ఆనుకునే ఉందిగా స్కూలు.. ఎల్లా ఉందిట . దానితో నీకూ మీ నాన్నగారికీ కూడా చాలా బంధం కదా?"

"ఏమడిగావ్?.... స్కూలు గురించా.." చటుక్కున లేచా. నే కొలిచే జగన్మాత సరస్వతీ రూపంగా వాహిని ద్వారా ఓ సూచనాస్ఫురణ కదిలించింది మనసులో..ఇదే గ్రేస్.. తీవ్ర ఆలోచనకి పచారు నేస్తం.

"అవును తాతయ్యా.. స్కూలు గుర్తుచెయ్యగానే.. అలా కుర్చీలోంచి లేచి పచార్లు మొదలు పెట్టావ్?"

" మంచి ఆలోచన వచ్చినా, మంచిమాట విన్నా, మంచి సంభవం జరిగినా ఒళ్ళూ, మనసూ తేలికై కూర్చోనివ్వదమ్మా సంతోషం. దారి చూపావు తల్లీ".

"నీ సందిగ్ధానికి సమాధానం దొరికినట్టుంది.. అంతేనా?"

"నాన్నతోనూ, అమ్మతోనూ, బామ్మతోనూ సంప్రదించి రేపటిరోజు చెపుతానమ్మా.. లే, లేటయింది. భోంచేద్దాం"

★★★★★★

మర్నాడు పొద్దున్న పూజాపునస్కారాలు ముగించుకుని నా గదిలోకి వెళితే అక్కడ నా ముద్దుల మనవరాలు వాహిని, వాడక మూలపడ్డ వీణను శుభ్రం చేసి సవరిస్తోంది.

నన్ను చూసి అడిగింది.."ఏం తాతయ్యా వీణ వాడకుండా ఇలా దుప్పటీ కప్పి పడుకోబెట్టాసారూ..శారదా దేవికి కోపం రాదూ? ఆవిడ పటం ముందు కూర్చుని వాయించేవాడివిగా.."

"అమ్మకదమ్మా.. కోపగించుకోదు. అయినా ఇప్పుడో కానుక ఇస్తున్నాగా చదువుల తల్లికి"

"ఏమిటి తాతయ్యా అది? నాకర్థం కాలేదు." వీణ మీటి చూసి లేచి మంచం మీద నా పక్కని కూర్చుని అడిగింది.

ప్రసాదం అరటి పండు ఒలిచి సగం వాహినికిచ్చి మిగిలినది కళ్ళకద్దుకుని నోట్లో వేసుకుని చెప్పా..

" మన ఇల్లు సంగతి మీ నాన్నతోనూ, బామ్మతోనూ మాట్లాడి చెపుతానన్నాకదమ్మా... ఆ ఇల్లు నా స్వార్జితం కాదు. మన పూర్వీక సొత్తు. అందుకని నా కొడుకుని, కోడల్ని సంప్రదించాలిగా ఏంచేసినా.."

"అవును తాతయ్యా.. కానీ నాన్న, నిన్ను కాదనరుగా దేనికీ"

"తెలుసు తల్లీ. వాడు 'మీకు ఏది సంతృప్తినిస్తుందో అలాగే చెయ్యండి, నాకు ఆ ఇంటిమీద అభిమానం

ఉందికానీ, ఆశలేదు.... చూసుకునే టైమూలేదు...మీ ఆలోచన బాగుంది అల్లాగే చెయ్యండి.. ఎక్కడ సంతకం పెట్టాలో చెప్పండి చాలు" అన్నాడమ్మా. కోడలు కూడా అదే అంది. బామ్మతో కూడా సంప్రదించా.. నా ఆలోచనకి వత్తాసు పలికింది బామ్మ...బామ్మకి డబ్బు మీద బంగారం మీద ఆశ లేదమ్మా..చదువు అంటే చాలా ఇష్టం..."

"సరే.. ఏమిటి నీ నిర్ణయం తాతయ్యా?"

" ముందు స్వీటు తినమ్మా, చెపుతా.." మంచం పక్కనే చిన్న టేబుల్ మీద పెట్టుకున్న డబ్బాలోంచి రవ్వలడ్డూ ఒకటి ఇస్తూంటే అంది వాహిని.. " నీ మాటలే తియ్యగా ఉంటాయి తాతయ్యా.."

" వాహిని చేతిలో విపంచి తియ్యగానే పలుకుతుందమ్మా..నేనూ ఆ వీణా ఒకటే.. నువ్వు వచ్చాక నా బద్ధకాన్నీ, నిర్లిప్తతనీ, మగతనీ, దూరం చేసి హుషారు నింపావు.. ఆనందంగా ఉంటోంది .. ఇటువంటి మనస్థితిలోనే మంచి ఆలోచనలూ, మంచి పరిష్కారాలూ వస్తాయి.. డిప్రెషన్ లోనూ, కోపం, చిరాకుల్లోనూ వచ్చే పరిష్కారాలు పనికిరానివిగా ఉంటాయి.. సరే.. విషయం ఏమిటంటే, నువ్వు అడిగావుగా స్కూలు ఎలా ఉందని... ఇదివరకు వెళ్ళినపుడు ఆ పరిస్థితి చూస్తే బాధేసిందమ్మా.."

"ఏం? ఎందుకని?"

"ఆమధ్య అదే కాంపౌండులో వేద పాఠశాల పెట్టారమ్మా....చోటు సరిపోక పిల్లల్ని వరండాల్లో కూర్చోపెట్టి క్లాసులు నడుపుతున్నారమ్మా.. బిల్డింగులూ అతంత మాత్రంగానే ఉన్నాయి వెలవెలబోతూ..అందుకని మన ఇల్లు పిల్లల చదువు వసతికోసం వేద పాఠశాల తరగతులు నడుపుకోడానికి ఇచ్చేద్దామనుకున్నా. పెద్ద పెద్ద గదులు.. రెండు సావిళ్ళూనూ.. గుమ్మాలూ, గోడలు, శుభ్రంగా ఉన్నాయి. పైకప్పు సరేసరి. బ్రహ్మాండంగా ఉంది. బర్మా టేకు కదమ్మా!!. "

"ఓహ్.. గ్రేట్ తాతయ్యా. మంచికార్యం.. ఇప్పుడు అంతమంది పిల్లలు గలగలమంటూ ఇంట్లో తిరుగుతూ, దొడ్లో ఆడుకుంటూ ఉంటే నయనానందకరం కదా..ఇది సమాజానికి నీవంతు చేయూత. నీకూ తృప్తి.. ఏదో నువ్వే చిన్నపిల్లాడివై వాళ్ళతో ఆడుకుంటున్నట్టు . పైగా నిత్యం వేద ఘోష ఇంట్లో."

" కాదు మరీ... అయినా నాదేముందమ్మా..వంద ఏళ్ళక్రితమే పెద్దమనసుతో సమాజసేవాదృక్పథంతో పిల్లల చదువుకై బోల్డు స్థలం ఇచ్చి, బిల్డింగులు కట్టించి చిన్న బోర్డు స్కూలుని ప్రారంభించిన మహానుభావుడు బులి సుబ్బారాయుడు గారి ఉదాత్తత ముందు ఇది ఎంతమ్మా?!!!ఆయన సత్భావం వల్లనే ఎంతో వృద్ధి చెంది మంచిపేరు వచ్చింది.. వచ్చే నెలలో జరిగే సెంటినరీ సెలబ్రేషన్సుకి మనం వెళ్ళి అఫీషియల్ గా హేండోవరు చేసి వద్దాం..ఈ లోగా ఫార్మాలిటీస్ పూర్తిచేస్తా. సంతోషం తప్ప వేరేదీ బదులు కోసం చూడకుండా మనస్ఫూర్తిగా ఇవ్వడంలోని ఆనందం ఎంత గొప్పగా ఉంటుందో తెలుస్తోందమ్మా."

.నా కళ్ళల్లో ఆనందం, మాటల్లో సంతృప్తి, చూసి వాహిని" తాతయ్యా నీ వయసు ఓ ఇరవై ఏళ్ళు తగ్గినంత జోరు చూస్తున్నా నీలో"

అన్నీ వింటున్న మా ఆవిడ వంటింట్లోంచే ఓ హెచ్చరిక.. తరవాత మనసారా నవ్వుతూ చేతిలో కాఫీ గ్లాసులతో గదిలోకి వస్తూ.... "బాగుందమ్మా సంబడం, ఇంక తగ్గనివ్వకు తల్లీ తాత వయసు. సవితి పోరు వస్తే పడలేనమ్మా"

“చూసావా అమ్మా, వాహినీ.. మీ బామ్మ ఎన్నాళ్ళకి నా మీద జోకు వేసి నవ్వుతోందో!!!”

పెద్దవాళ్ళకి సౌకర్యాలు సుఖాన్నిస్తాయి తప్ప సంతోషాన్ని ఇవ్వవమ్మా.. సొంతం అన్నవాళ్ళు రోజూ కాస్సేపయినా దగ్గిర కూర్చుని కబుర్లు చెపుతూంటే మహదానందంగా ఉంటుంది. మందు బిళ్ళల అవసరం తగ్గుతుంది. మనసుకి ఆరుదలానూ..

“అదిగో అమ్మా నాన్నకూడా వచ్చారు.” వాహిని లేచి కుర్చీలు దగ్గరగా జరుపుతూ అంది.

అభిప్రాయాలు, ఆనందం పంచుకున్నాం కాసేపు..

తరవాత, రోజూలాగానే పేపరు పట్టుక్కూర్చున్నా వాలుకుర్చీలో... రోజూ మైన్ పేపరు చదివి తరవాత సప్లిమెంటు చదవడం అలవాటు.. ఈ రోజేమిటో యాదృచ్ఛికంగా సప్లిమెంటు తీసా ముందు...ఆశ్చర్యం, ఆనందం కలిపి వచ్చాయి... సరస్వతీ దేవి ఫొటో పెట్టి బాసర క్షేత్రం గురించిన విశేషాల వ్యాసం.. మొదటి పేజీలోనే..

ఒళ్ళు పులకరించి, కళ్ళుచమర్చి చల్లబడ్డాయి. అమ్మ పరోక్షంగా ఇచ్చిన దీవెనకి పరమానందం చెందా.. కృతజ్ఞతలు తెలిపా మనసులోనే....

# ఇచ్ఛ

సి.యమున

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

కాశీ విశాలాక్ష్మిగుడిని చేరింది వసుంధర. ఒక చేతిలో అన్నపాత్ర, మరో చేతిలో గరిట...పట్టుకున్న అమ్మవారి ఎదుట నిలబడి, చేతులు జోడించి, తన్మయంగా, మనసారా అన్నపూర్ణాష్టకం చదివింది.

" అమ్మా, నీ దయతో 'అర్ధాకలితో' ఉండే రోజు ఎప్పుడూ రాలేదు. ఒక్కగానొక్క కొడుకుకి జీవితాన్ని కూడా అందించగలిగాను. అందుకు ఆ జన్మాంతం నీకు ఋణపడి ఉంటాను. ఇన్నేళ్లకు నిన్ను దర్శించాలనే నా కోరిక తీరింది. మనసా, శిరసా నీకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. ఈ రెక్కల్లో శక్తిని మరి కొన్నేళ్లు ఉండేటట్లు చూడు తల్లీ. నా మనవడి కోసం నేను చేసే ప్రణాళిక ఆగకూడదనే నా ఆశ" అంటూ తలవంచి నమస్కరించింది.

అన్నపూర్ణ దర్శనం ముగించుకుని విశ్వేశ్వరుడి గుడికి వెళ్లింది. "ఈ కాశీలో ప్రాణం వదిలితే మోక్షమంటారు. అది అందరికీ సాధ్యమయ్యేది కాదు. నేను ఎక్కడ ఉన్నా, తుది శ్వాస విడిచే సమయాన నీ రూపం మదిలో దర్శిస్తూ, నిన్ను స్మరిస్తూ తనువు చాలించే వరాన్ని ఇయ్యి ఈశ్వరా" అని ప్రార్ధించింది. తరువాత ఆతృతగా నడుస్తూ గెస్ట్ హౌస్ చేరింది. .

"ఏవమ్మా , తెల్లారకముందే ఎక్కడికి వెళ్ళి వస్తున్నావు" ఆమె రాకను గమనించిన పార్వతమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

"ఈ రోజు వెళ్ళి పోతున్నాము కదా. ఎందుకో ఒకసారి అమ్మవారిని, అయ్యవారిని దర్శించుకోవాలని పించింది....అందుకే " నసుగుతూ సమాధానం చెప్పింది వసుంధర.

"తొమ్మిది రోజులుగా ఈ కాశీ క్షేత్రం లో ఉండి , పవిత్రమైన ఘాట్లల్లో స్నానాలు చేశాము. దైవ దర్శనాలు చేసుకున్నాము. గంగా హారతులు దర్శించి పులకించాము. అయినా తృప్తి కలుగ లేదా. సరే, అందరూ లేచే వేళ అయ్యింది. ఏర్పాట్లు చూడు " అంది నవ్వుతూ పార్వతమ్మ.

"అలాగే పిన్ని గారు " అంటూ పనిలోకి జొరబడింది వసుంధర.

★★★★★

సాయంకాలం ఐదు గంటలయ్యింది. రాత్రి ప్రయాణానికి సిద్దమవుతున్నారు. సామానులని సర్దుకుంటున్నారు.

"వసుంధర, చెప్పింది గుర్తుందిగా. ఈ పూట పెందరాడే భోజనాలు చేసే ఏర్పాటు చెయ్యి. రాత్రి ప్రయాణం లో ఇబ్బంది లేకుండా ఉంటుంది " కిచెన్ లో ఉన్న వసుంధరకు వినపడేటట్లు చెప్పింది పార్వతమ్మ.

"ఆ పనిలోనే ఉన్నాను, పిన్ని గారు " వంట గదిలో కూర తరుగుతున్న వసుంధర అక్కడ నుండే జవాబు చెప్పింది.

ఇంతలో స్టవ్ మీద పాలు పొంగుతున్నట్లు అనిపించి , క్రింద కూర్చున్న వసుంధర చిటుక్కున లేచింది. ఆ తొందరలో , కాలి గోటికి చీర తగిలి గబుక్కున నేల కూలబడిపోయింది. 'అమ్మా' అని ఆమె పెట్టిన కేకకు ప్రక్క రూమ్ లో ఉన్న పార్వతమ్మ గారు, మరో ఇద్దరు గబ గబా అక్కడకు వచ్చి నేల మీద కూలబడ్డ వసుంధరను చూసి షాక్ అయ్యారు.

అతి కష్టం మీద లేపి ప్రక్క రూమ్ లో మంచం మీదకు చేర్చారు. నొప్పి తట్టుకోలేక మూలుగుతోంది వసుంధర.

"రాత్రికి ప్రయాణం , ఎందుకైనా మంచిది, ఎవరన్నా డాక్టర్ ని కన్సల్ట్ చేద్దాము " అంటూ ఒకరు రిసెప్షనిస్ట్ దగ్గరికెళ్లి డాక్టర్ వివరాలు తీసుకున్నారు.

ముందు వసుంధరనే డాక్టర్ దగ్గరికి తీసుకెడదామని ప్రయత్నించి, ఆమె కదలలేక పోవటంతో డాక్టర్ ని రిక్వెస్ట్ చేసి గెస్ట్ హౌస్ కి పిలిపించారు.

"హెయిర్ లైన్ ఫ్రాక్చర్, పదిహేను రోజుల పాటు బెడ్ రెస్ట్ " అని డాక్టర్ ప్రకటించాడు. అది విని, పిల్లలు ఆడుకునే ఆటలో 'స్టాట్యు ' అనగానే ఎక్కడి వారు అక్కడ నిలిచిపోయి నట్లు అందరూ మ్రాన్ప డి పోయారు. వసుంధకి కూడా మనసంతా ఆవేదన అలుముకుంది.

"ఈ యాత్రలో అందుకున్న సంతోషాన్ని, తెలియని మాయ ఏదో అదృశ్యం చేసినట్లు నాకు ఎందుకు ఇలాంటి స్థితి వచ్చింది ఈశ్వరా ? ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పడ్డ కోరిక, ఇన్నాళ్లకు తీరిందనుకుంటే ఇలా జరిగిందే? ఏమిటీ రాత...'చేతిలో గీతల్లాగే, జీవితం లో మలుపులు కూడా అర్థం కావా' " వసుంధర మనసంతా మూగ వేదన...

★★★★★

కాశీతో వసుంధరకున్న భాహ్యమైన అనుబంధం పట్టుమని పది రోజులు కూడా లేదు. కానీ కాశీ దర్శనం పై అనురక్తి పుట్టి ఎన్నో సంవత్సరాలు అయ్యింది.

దాదాపు ముప్పై ఏళ్ల క్రితం భర్తతో, కొడుకు తో కలిసి దూరపు బంధువుల ఇంట్లో కాశీ సమారాధనకు వెళ్లింది. ఆ సందర్భంగా వారణాశి క్షేత్రం గురించి విన్న విశేషాలు, ఆమెలో ఆ పవిత్రమైన కాశీ ని చూడాలనే ఇచ్ఛను కలుగచేశాయి.

"ఆ పుణ్యక్షేత్రాన్ని మనం కూడా దర్శిద్దామండీ " అని కోరింది భర్తను.

"మన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. చెల్లెలి పెళ్ళికి చేసిన అప్పు కూడా ఉంది. అది తీరిన తరువాత చూద్దాము" అన్నాడు భర్త.

ఆ అప్పు తీరకముందే , అతని ఆయువు తీరిపోయి లారీ యాక్సిడెంట్ లో పరమపదించాడు.

చిన్న వయసులో, అభంశుభం తెలియని కొడుకుతో మిగిలింది వసుంధర. చేతిలో రూపాయి లేని పరిస్థితి.

ఆర్థిక పరంగా ఆదుకునే స్థోమత ఉన్నవాళ్ళు ఎవరూ లేరు.

చివరకు తమ పొట్టపోసుకోవటానికి, నలుగురి పొట్టలు నింపే వంటమనిషిగా మారక తప్పలేదు వసుంధరకు.

అందుకే కొడుక్కి గొప్ప చదువులు చెప్పించలేకపోయింది కానీ బ్రతుకు నడిచేమేర చేయూత ఇవ్వగలిగింది. కొడుకు ఒక ఇంటి వాడై ఓ కొడుక్కి తండ్రి కూడా అయ్యాడు.

'ఇంకా శ్రమ పడొద్దు, విశ్రాంతి తీసుకో' అని కొడుకూ, కోడలు చెప్పినా

"రెక్కల్లో శక్తి ఉన్నంత వరకూ పక్షి ఎగరాలి, మనిషి శ్రమించాలి ....లేకపోతే బ్రతికి ఉండీ చచ్చి పోయినట్లే " అంటూ వారి మాటలు తోసి పుచ్చి తన వృత్తిని కొనసాగిస్తోంది.

ఐదారు కుటుంబాల వాళ్ళు కలిసి కాశీ యాత్రకు బయలుదేరారు. వండి పెట్టటానికి, తమ కూడా వసుంధరను రమ్మని కోరారు. వారితో ఆమెకి అనుబంధం పాతిక ముప్పై ఏళ్ల పైగా ఉంది. వారి ఇళ్ళల్లో అవసరాలకి , పెళ్ళిళ్ళకి ఆమె వంట చేసింది.

విషయం వినగానే "అంత దూరం ప్రయాణం, పైగా అంతమందికి కష్టపడి వంట చేయటం. వద్దమ్మా. నేను వీలు చూసుకుని తీసుకువెడతాను" బుజ్జగించినట్లే చెప్పాడు కొడుకు.

"కన్నా, నువ్వు తీసుకు వెళ్ళినా, అక్కడ తొమ్మిది రోజులు ఉండటానికి మీ ఉద్యోగాలతో కుదురుతుందా చెప్పు. ఇది అనుకోని గొప్ప అవకాశం. నీకు తెలుసుగా, వాళ్ళు నన్నుఇంట్లో మనిషిలాగా చూస్తారు. అడ్డు చెప్పకు " బ్రతిమాలినట్లే చెప్పింది. ఇహ కాదనలేక పోయాడు కొడుకు. ఈ విధంగా తన వృత్తి, మొట్ట మొదటి సారిగా ఎనలేని తృప్తిని ఇచ్చింది వసుంధరకు.

కాశీలో ముందుగా బుక్ చేసుకున్న గెస్ట్ హౌస్ లో దిగారు. ఆత్మీయంగా వారు అందిస్తున్న సాయంతో, ఇన్ని రోజులుగా అందరికీ వండి పెట్టింది. వారందరితో కలిసి తొమ్మిది రోజులుగా పవిత్రమైన అసీ ఘాట్, మణికర్ణిక ఘాట్, దశాశ్వమేధా ఘాట్, ఆదికేశవ ఘాట్ లాంటి విశిష్టమైన ఘాట్లల్లో స్నానాలు చేసింది. అన్నపూర్ణ , విశ్వేశ్వరులను , గంగా హారతులను, ఇతర విశేషాలను దర్శించి మనసారా ఆస్వాదించింది. ఇహ తిరుగు ప్రయాణానికి సిద్దమయిన వేళ, అనుకోని అవాంతరం వచ్చి పడింది.

★★★★★

" పాలు పొంగి పోతే తుడుచుకోవచ్చు ..ఎందుకు హడావిడిగా లేవటం " అంటూ ఒకరి నిష్టూరం.

"ఈమె పడటం మన ప్రయాణానికి అడ్డం పడేటట్లుంది" మరొకరి విసుగు.

ఓ మంచి పనికి అభినందనలు ఒక్క ముక్కలో చెపుతారేమో కానీ పొరపాటుకు మటుకు విమర్శలు అనేక కోణాల్లో వ్యక్త పరచటం మానవనైజం.

దూసుకొస్తున్న మాటలు...వింటున్న వసుంధర లో" నిన్నటిదాకా, 'బయట ఆహారం తిని ఆరోగ్యం చెడిపోకుండా హాయిగా వండి పెట్టావు. కాశీ యాత్ర ప్రశాంతంగా చేసుకుంటున్నాము. లేకపోతే చాలా ఇబ్బంది అయ్యేది' అన్నవాళ్లు ఇప్పుడు 'నువ్వే మాకు భారం' అంటున్నారే" అన్న ఆలోచన.

అంతలోనే ఆమెలో "పరమేశ్వరా, వారి పట్ల నా ఈ ఆలోచనలు క్షమించు, వాళ్ళ పుణ్యానే నీ దర్శనం అయ్యింది" అనే అపరాధ భావన.

"ఇప్పుడు మన ప్రయాణం కూడా ఆగిపోయినట్లేనా"

"అమ్మో, అది ఎలా కుదురుతుంది? పాప కు ఫైనల్ ఇయర్ పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని అమ్మను తీసుకు వచ్చి తోడుగా ఉంచి వచ్చాను "

"మా అబ్బాయికి ఇంకో వారం లో తాంబూలాలు, ఇప్పుడు ఎట్లా " అందరూ తమ తమ ఇబ్బందులు చెప్పుకుంటూ కలవర పడుతున్నారు.

"వెళ్ళగానే కాశీ సమారాధన అనుకున్నాను. మన వసుంధరనే వంటకు మాట్లాడుకున్నాను. అది కూడా జరిగేటట్లు లేదు "

అది విన్న వసుంధరలో ఓ ఉలికి పాటు. తాను ఒప్పుకున్న వంట పనుల గురించి ఆమెలో కంగారు మొదలయ్యింది.

"నేను ఒప్పుకున్న వంట పనులు అన్నీ ఇహ పోయినట్లేనా? అంటే, వాటి నుండి వచ్చే ఆదాయం? కొడుక్కి కూడా తెలియకుండా నెల నెలా మనవడి పేరన బ్యాంక్ లో వేసే డబ్బుల సంగతి ఏమిటి ? " ఆమెలో కలవరం.

" కొడుక్కి పెద్ద చదువులు చెప్పించ లేక పోయాను. కనీసం మనవడి చదువుకి 'ఉడతా సాయం' లాగా నాకు

చేతనైనది చేయాలి " అనేది వసుంధర మనసులో కోరిక. అందుకే కొడుకు, కోడలు వంటలు చేయొద్దన్నా, శక్తి మేరకు శ్రమిస్తోంది. అలా వచ్చిన సొమ్మును వారికి తెలియకుండా మనవడి పేర పొదుపు చేస్తోంది. ఆ స్వాతంత్రం , స్వేచ్ఛ ఆమెకు ఉన్నాయి.

★★★★

చివరకు వసుంధర కొడుక్కి ఫోన్ చేసి కంగారు పడకుండా, మెల్లగా విషయం వివరించారు.

“ ‘కాస్త ఓపిక పట్టమ్మా , నేను వెంట పెట్టుకుని తీసుకు వెడతానంటే ’ వినకుండా వెళ్ళావు. ఇప్పుడు చూడు ఎంత ఇబ్బంది పడుతున్నావో “ విసుగు, ఆందోళన కలిపి వ్యక్త పరిచాడు వసుంధర కొడుకు.

సమాధానం చెప్పలేక పోయింది వసుంధర.

“నేను కానీ, నీ కోడలు కానీ  వెంటనే బయలుదేరి రాలేము. ఒకవేళ వచ్చినా, మా ఉద్యోగాలు దృష్ట్యా అన్ని రోజులు ఉండలేము. అమ్మకు  సౌకర్యంగా ఉండేటట్లు ఏర్పాటు చేయండి. కోలుకోగానే, నేను వెళ్ళి తెచ్చుకుంటాను. ఎంత ఖర్చైనా ఫరవాలేదు “ ఆతృతగా చెప్పాడు.

“ఆమెను వదిలేసి వచ్చెయ్యటానికి మాకు మనసు రావటం లేదు. అలాగని అన్ని రోజులు ఉండే పరిస్థితి లేదు . ఏమనుకోవద్దు. మంచి ఏర్పాటు చేసే వస్తాము. ఖర్చు గురించి మేము చూసుకుంటాము “ అని భరోసా ఇచ్చారు.

“ఆరోగ్యం సరిగా లేని వారిని , బెడ్ రెస్ట్ లో ఉండే వారిని చూసే సత్రం ఒకటి ఉంది. అక్కడ ఉచిత సేవే కాదు డబ్బులు కట్టి ఉండే ప్రత్యేక రూమ్ సదుపాయం కూడా ఉంది. అంతా బాగుంటుంది “ అని గెస్ట్ హౌస్ వాళ్ళు ఇచ్చిన సలహాతో వసుంధరను ఆ ప్రక్కనే ఉన్న సత్రం లో స్పెషల్ రూమ్ కి షిఫ్ట్ చేశారు.

మరోసారి ఆమెతో పాటు ఉండిపోలేని తమ అశక్తతను వినిపించి, ఆపై జాగ్రత్తలు చెప్పి తమ నెలవులకు ప్రయాణమయ్యారు.

★★★★

సత్రం లో అలవాటు పడటానికి వసుంధరకు నాలుగైదు రోజులు పట్టింది. మనసంతా ఆవహించిన దిగులు కొంత తొలగటంతో, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు గమనించటం మొదలుపెట్టింది. ఈశ్వర సన్నిధిలో తుది శ్వాస విడవాలని ఎక్కడెక్కడి నుండో వచ్చి అక్కడ చేరిన వారు ఎందరో. ఏ తార తమ్యాలు లేకుండా అందరిదీ ఒకే జీవన విధానం.  సేవా దృక్పథం. ఈశ్వర నామ స్మరణ. అందరూ ఎవరికి తోచిన సాయం వారు చేస్తున్నారు. కాస్త తేరుకోవటంతో  వసుంధర కూడా పెద్ద శ్రమ పడకుండా, ఓ చోట కూర్చుని పూలు మాలలు కట్టటం లాంటి చిన్న చిన్న పనులులలో సాయ పడుతోంది.

ఓ ప్రక్క అంతా బాగానే అనిపిస్తున్నా, మరో ప్రక్క తను ఒప్పుకున్న వంటలు, దానిపై ఆదాయం...మనవడి పేర బ్యాంక్ లో జమ చేయాల్సిన డబ్బులు కలవర పెడుతున్నాయి ఆమెను.

ఆ రోజు తెల్లవారుతూనే, సత్రం లో కల కలం. గత పదేళ్లుగా అక్కడే జీవిస్తున్న చంద్రశేఖరం గారు ముక్తి పొందారు.  ఆ సాయంత్రం కల్లా ఆయన భార్య, కన్న బిడ్డలు వచ్చి వాలారు. వారి డాబూ దర్పం చూసి ఆశ్చర్యపోయింది వసుంధర.

చంద్రశేఖరం గారు పెద్ద వ్యాపారస్తుడనీ, ఈశ్వర సన్నిధిలో గడపటానికి సకల భోగాలు, బంధాలు పరిత్యజించి వచ్చాడని తెలిసి మరింత విస్మయానికి గురయ్యింది.

"తన వారందరికీ సర్వ సౌఖ్యాలు కల్పించి, ఆ తృప్తి తో...వారికి ఏ లోటూ రాదనే భరోసాతో ఇక్కడ ఉండి పోగలిగాడు. ఉన్నవాళ్ళకి ఏముంది, ఏది చేసినా చెల్లుతుంది. 'త్యాగం' తో సహా వాళ్ళు ఏవైనా చేయగలరు. నా బోటి వాళ్ళకే కష్టం " నిష్టూరంగా అనుకుంది వసుంధర.

"ఆయన చూడండీ, అన్నీ వదిలి పెట్టి మనతో కలిసి సాధారణ జీవితం గడిపాడు. మరి భార్య, ఆ సుఖాలను, బంధాలనీ వదులుకోలేక భర్త కు, ఈ పుణ్య క్షేత్రానికి దూరంగా ఉండిపోయింది. దేనికైనా ఆ ఈశ్వరానుగ్రహం ఉండాలి " అంది అక్కడ ఉన్న ఓ పెద్దామె. తన మనసులో ఆలోచనలను పసిగట్టి, జవాబు చెపుతున్నట్లుగా అన్న ఆవిడ మాటలకు వసుంధర ఉలిక్కిపడింది.

★★★★

వసుంధర పూర్తిగా కోలుకుంది. కొడుకు, కోడలు, మనవడు ఫోన్ లు చేసి మాట్లాడుతున్నారు. కొడుకు వచ్చి తీసుకు వెళ్ళటానికి ప్రయాణ సన్నాహాలు చేసుకుంటున్నాడు.

"బామ్మా, ఎప్పుడు వస్తావు . అక్కడ నుండి కాశీ దారాలు తెస్తానన్నావుగా, కొన్నావా? నువ్వు లేక పోతే నాకు బోర్ కొడుతోంది. కాశీ మజిలీ కథలు ఏవేవో చెపుతానన్నావు. తొందరగా వచ్చెయ్యి బామ్మా " బెంగగా...గారంగా పలికాడు ఎనిమిదేళ్ళ మనవడు.

మనవడి మాటలకి మనసు ఆర్ధ్ర మయ్యింది. తనని తాను సంభాళించుకుంటూ "నాన్న వస్తున్నాడుగా...త్వరలో వచ్చేస్తాను " అంది బుజ్జగిస్తున్నట్లు.

తరువాత కొడుకుతో మాట్లాడుతూ "నేను బాగానే ఉన్నాను. కానీ వంటల గురించే టెన్షన్ గా ఉంది రా" అంది దిగులుగా.

"ముందుగా నీ ఆరోగ్యం చూసుకో అమ్మా. వాటి గురించి ప్రక్కన పెట్టు"

" అలా ఎలారా?"

"నిన్ను చూసుకునే పాటి వెసులు బాటు నాకుంది. నా మాట విని, ఇప్పుడన్నా ఆ వంటల గురించి ఆలోచన మానెయ్యి "

"నీకు చెప్పని విషయం ఒకటుందిరా " అంది మొహమాటు పడుతూ.

"ఏమిటమ్మా " సహనంగా అడిగాడు కొడుకు.

"మనవడి పేరు మీద బ్యాంక్ లో డబ్బు జమ చేస్తున్నాను. ఇప్పుడు వంటలు ఆగిపోతే, అది ఎలా అనే నా బెంగ" మనసులో మాట మెల్లగా చెప్పింది.

ఫక్కున నవ్వాడు కొడుకు.

"ఎందుకురా ఆ నవ్వు " అయ్యోమయంగా అడిగింది వసుంధర.

"పిచ్చి అమ్మా ...నీ అర్థం లేని మాటలకు నవ్వక ఏమి చెయ్యను. నీ కొడుకు బాధ్యత నీవు ఎలా నిర్వర్తించావో, అలాగే నా కొడుకు మంచి చెడులు నేను చూసుకోవాలి. వాడి భవిష్యత్తు గురించిన భారం నాది కదమ్మా. అలాటి ఆలోచనలు వదిలిపెట్టెయ్యి. నాకు కాస్త ఆఫీసు పని ఉంది. ఉంటాను " అంటూ ఫోన్ పెట్టేసాడు.

కొడుకు మాటలకు "వాడి మాటల అర్థం ఏమిటీ ? బాధ్యతలను వదులుకోమనా? బంధాలను తెంచుకోమనా?" అన్న భావనలతో వసుంధరలో ఏదో కలవరం. భోజనం అయిందనిపించి, పడక చేరింది.

"ఇళ్ళు , వాకిళ్ళు వదులుకుని, బంధాల చిక్కుముడుల నుండి విడివడి కాశీ చేరిన వారు ఎందరో? కానీ ఈ క్షేత్రాన్ని దర్శించి, ఇంటికి ప్రయాణమైన నేను ఊహాతీతంగా ఇలా చిక్కుబడి పోవటం ఏమిటీ ? నేను ఒకటి తలిస్తే ఆ దైవం మరోటి తలుస్తున్నాడా?" ఎడతెరిపి ఆలోచనలతో సతమవుతూ ప్రక్కకు ఒత్తిగిల్లింది. ఎవరో పంచిపెడితే, ఆ ప్రక్కనే పెట్టిన మామిడి పండు చేతికి తగిలింది. తన కిష్టమైన మామిడి పండును మొన్న మొన్ననే ఆ కాశీలోనే విడిచి పెట్టింది. పండుని చేతిలోకి తీసుకుంది. ఆమెలో అంతర్మధనం మొదలయ్యింది.

★★★★★

" అమ్మ, రేపే బయలుదేరుతున్నాను. ఒక్కరోజు లో అక్కడ ముఖ్యమైనవి దర్శనం చేసుకుని వెంటనే బయలుదేరాలి. అన్నీ సర్దుకుని సిద్ధంగా ఉండు" ఫోన్ లో ఉత్సాహంగా చెప్పాడు కొడుకు.

"ఒక విషయం రా..."

"ఏంటమ్మా"

"నేనిక్కడే ఈ కాశీలోనే ఉండి పోతాను " స్థిరంగా చెప్పింది.

"అమ్మా, ఏమంటున్నావు ? నా మాటలతో ఏమన్నా కష్ట పెట్టానా" అన్నాడు కంగారుగా.

" అదేమీ లేదు కన్నా. వదిలి వేయవలసింది కేవలం మనకిష్టమైన పదార్థం మాత్రమే కాదు ఈ భవ బంధాలు కూడా ' అని అర్థం అయ్యింది. అంతే"

"అమ్మా, అర్థం లేకుండా మాట్లాడకు. ఒక్కదానివి ఎలా ఉంటావు.. ఏమి చేసి బ్రతుకుతావు?"

"చేరవలసిన చోటుకి చేరాను. ఒంటరితనం ఏముంది? ఇన్నాళ్ళు నన్ను బ్రతికించిన వంటే చేస్తాను. కొంత భుక్తికి , మరికొంత సేవకి"

"ఏమిటి ఈ వైరాగ్యం..ఎందుకు" కొడుకు గొంతులో దిగులు.

"ఎప్పటి కోరికో ఈ కాశీ క్షేత్ర దర్శనం, ఇన్నాళ్లకు ప్రాప్తమయ్యింది. అంతలో నా కాలికి వచ్చిన కష్టం, నన్ను ఇక్కడ కట్టి పడేసింది. అన్నీ నేను ఊహించనివే. ఈ వైరాగ్యం కూడా ఆ 'ఈశ్వరేచ్ఛ' ఏమో "

"అమ్మ, నేను వస్తున్నాను. నువ్వు లేకుండానే..." ఆపై మాటరానట్లు ఉండి పోయాడు.

"చూసి వెళ్ళటానికైతే రా....తీసుకు వెళ్ళటానికి మాత్రం వద్దు" ప్రశాంతంగా అంది వసుంధర.

## మంచుగుండెల చప్పుళ్ళు - మంత్రవాది మహేశ్వర్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

**ఎత్తు పల్లాలు, కొండలు** – లోయలు.. రోడ్డుకు రెండు పక్కలా నిలబడి చూస్తున్న పొడుగాటి దేవదారు వృక్షాలు, ముళ్ళ జాతి మొక్కలు. అన్నింటినీ దాటుకుంటూ పాము మెలికల్లాంటి రోడ్డుమీద నుంచి ఆర్మీ జీపు దూసుకుపోతోంది. ఎన్నో సినిమాల్లో ఎంతో అందంగా చూపించిన కాశ్మీరం.

కిటికీ దగ్గర కూర్చున్న నేను బయటకు చూడటంలో నిమగ్నమైపోయాను. ప్రతి ఒక్కటీ ఇంతకు పూర్వమున్నట్లుగానే వుంది. నేను ఎంత అందంగా వుంటుందనుకున్నానో అలాగే వుంది ప్రకృతి.

కాశ్మీర్ ప్రకృతి రమణీయత ఎవరినీ ఊపిరి తీసుకోనివ్వనంత అందంగా, గొప్పగా వుంటుంది. అక్కడి జనాన్ని చూసినప్పుడు, వారి మాటలు విన్నప్పుడు మాత్రం మరోలా వుంటుంది. వారి కళ్ళు ఉదాసీనంగా గోచరిస్తాయి. వాటిలో ఏదో శూన్యం నిండిపోయివుంటుంది. భావరహితం. ఏదో అపనమ్మకాన్ని, అభద్రతా భావాన్ని అణచిపెట్టుకుంటున్న ధోరణి కలగకమానదు. భయం చుట్టేసుకున్నట్లుండడం వల్ల ఆ లోయ నిశ్శబ్దంలో మునిగిపోయివుంటుందనిపిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే కాశ్మీరు ప్రజల సంతోషాన్ని, స్నేహభావాన్ని ఉగ్రవాదం మింగేసింది.

రకరకాల భావాలు మనసులో కదులుతుండగానే ఒక గేటుముందు జీపు ఆగింది. గేటుపైన అర్ధవృత్తాకారంలో వున్న ఇనుపబోర్డుమీద ఇంగ్లీషు అక్షరాలు: BORDER SECURITY FORCE, BARAMULLA ఈ గేటుగుండా నేను ఎన్నిసార్లు తిరిగానో. నా బాల్యమంతా కాశ్మీర్‌లో అనేక ప్రదేశాలలో గడిచిపోయింది నాన్న బి ఎస్ ఎఫ్ లో వుండడంవల్ల. ఆయన చివరగా పనిచేసింది ఇక్కడే. ఇక్కడున్న ఈ BSF క్వార్టర్స్‌లో టీనేజ్ కొంత గడిచింది.

ఆ తరువాత చాలా ఏళ్ళు గడిచిపోయాయి. అయినా ఏదో తెలియని అనుబంధం. ఆ చెట్లు, ఆ మెస్, క్వార్టర్లు, విశాలమైన మైదానాలు.. ఆ మైదానాల్లో జవానులు శిక్షణకు సంబంధించిన అభ్యాసాలు, వ్యాయామాలు, కవాతులు. పూలతోటల మధ్య వున్న హాల్లో తరచు జరిగే పార్టీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సిబ్బంది కుటుంబ సభ్యుల కోలాహలం.... అన్నీ జ్ఞాపకాలు.

"స్నేహ" ప్రశాంత్ పిలుపు పరధ్యానంలోంచి ఒక్కసారిగా బయటకు లాక్కొచ్చింది.

దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేస్తూ "పగటి కలలు కనడానికి మీకు చాలా టైము, అవకాశాలున్నాయి మేడం. ముందు మనం మన తాత్కాలికమైన గూటికి వెడదాం" అన్నాడు నవ్వుతూ.

"ఇల్లు అంటే బావుంటుంది కదా" అన్నాను.

కాసేపటి తరువాత ప్రశాంత్ ఆఫీసు పని మీద బయటకెళ్ళిపోయాక నేనొక్కర్తినే వున్నాను. మంచం మీద నడుం వాల్చి, కళ్ళు మూసుకున్నాను. ఒక్కసారిగా అజీజ్ ముఖం మనసులో మెదిలింది. కళ్ళు తెరుచుకున్నాయి. పెద్ద నిట్టూర్పు బయటకొచ్చింది.

ఇక్కడకు బయలుదేరినప్పట్నుంచీ ఎడతెగని విధంగా అజీజ్ గుర్తుకొస్తూనే వున్నాడు. అజీజ్ నాకు మంచి స్నేహితుడు.

అజీజ్.

ఎక్కడో ఒక చోట ఆయుధాలతో జనం మీద కాల్పులు జరుపుతూనే వుండి వుంటాడు.

ఆ ఆలోచనలనుండి మనసును అందంగా గడిచిన జీవితం వైపుకు, మరల్చే ప్రయత్నం చేశాను.

నాన్నకు బారాముల్లా ట్రాన్స్‌ఫర్ అయిన కొత్త. స్కూల్లో నాకు అది మొదటిరోజు.

ప్రిన్సిపాల్ ఆఫీసు రూంలో వెయిట్ చేస్తున్నాను, క్లాస్ మానిటర్ నన్నుకూడా తీసుకెళ్ళడానికి వస్తున్నాడంటే.

కాసేపటికి –

ఒక అబ్బాయి వచ్చాడు. "నువ్వేనా స్నేహ అంటే. ఐ యాం అజీజ్. నేను నిన్ను క్లాసుకు తీసుకెళ్ళాలి. ప్లీజ్ కం."

అజీజ్ తెల్లగా, పొడుగ్గా, బలంగా వున్నాడు. స్కూలు యూనిఫాంలో చూడముచ్చటగా కనిపించాడు. అతను ముస్తాబైన తీరు చూస్తే నేనే సిగ్గుపడాలి. నన్ను నేను చూసుకున్నానోసారి. జీన్స్, స్వెట్టర్.. ఎందుకో నా అవతారం నాకే నచ్చలేదు.

అజీజ్ ముఖంలో వుండే అమాయకత్వం, శుభ్రత, క్రమశిక్షణ చూసేవారిని కట్టిపడేస్తాయి. అజీజ్‌లోని సౌమ్యత, ఒకలాంటి రాజసం నన్ను అలాగే విస్మయంతో చూస్తుండిపోయేలా చేసిందని చెప్పక తప్పదు.

తరగతి గదిపైన VIIth, section – A అని వుంది. నేహ పక్కన కూర్చున్నాను.

స్కూల్లో నాకు ముందుగా పరిచయమైంది అజీజ్, నేహ. ఆ తరువాత వాళ్ళిద్దరూ నాకు చెప్పలేనంత ఆప్తులయ్యారు. వాళ్ళ సహాయంతోనే కొత్త వాతావరణంలో, నేను చదువులో ముందుకెళ్ళడం జరిగింది. స్కూలంటే సరదా, ఇష్టం ఏర్పడ్డాయి. ఎతంటే, సెలవలంటే బోర్ కొట్టేంత. వరుసగా సెలవలొస్తే ఒకోసారి నాన్న నన్ను జీపులో వాళ్ళిళ్ళ దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయేవారు.

అజీజ్ చాలా తెలివైన అబ్బాయి. కష్టపడే మనస్తత్వం. ఇంటి దగ్గర కూడా చాలా పనులు చేస్తాడు. అమ్మా నాన్నలకు సహాయపడతాడు. ఏ పనిచేసినా ఒక పట్టుదల, శ్రద్ధ కనిపించేది. అతను చెప్పే సరదా కబుర్లు చాలా ఇష్టంగా వినేదాన్ని.

మా స్నేహం అలా పెరిగి పెరిగి గట్టి బంధంగా ఏర్పడింది ఓ మూడేళ్ళపాటు. రోజులు అలా గాలికి తేలిపోతున్నట్లనిపించడం అంతా ఒకరికొకరు తోడుగా వుండడం వల్లే బాల్యం మధురంగా గడిచిపోయింది.

మా ముగ్గురికీ మా చుట్టూవున్న ప్రపంచం గురించి పెద్దగా తెలిసేది కాదు. కానీ ప్రపంచం మామూలుగా లేదు. ఆలోచించాల్సిన పరిస్థితులే.

ఒక రాత్రి.. ఒకే ఒక్క రాత్రి

పెద్ద మార్పుకు కారణమైంది.

అజీజ్ స్కూలుకు రావడం మానేశాడు. ఒకటి.. రెండు.. మూడు కాదు చాలా రోజులు. ఏ సమాచారం లేదు. మొదట్లో అతని ఆరోగ్యం బాగుండలేదేమోనని అనుకున్నాం. చాలా రోజుల తరువాత సెలవల తరువాత ఒకరోజు నేహాను అడిగేశాను.

విషయం తెలిసేసరికి నోట మాట రాలేదు.

నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయాం.

ఒకరోజు కొంతమంది ఆర్మీ డ్రస్సుల్లో, అర్ధరాత్రి దాటాక అజీజ్ ఇంట్లో జొరబడి అతని తల్లితండ్రుల్ని దారుణంగా హింసించారని ఆ సమయంలో అజీజ్ వాళ్ళ ఆంటీ ఇంటికి పారిపోవల్సి వచ్చిందని, ఆ రకంగా అజీజ్ తనను తాను రక్షించుకున్నట్లు తెలిసింది. నేహాతో చూడడానికి వెడదాం అన్నాను.

'అలాగే' అనుకుని అజీజ్‌ను చూడడానికి వాళ్ళింటికి వెళ్ళాం.

అజీజ్ ఒంటరిగా కూర్చుని ఆకాశంలోకి చూస్తున్నాడు తదేకంగా ఒక్క మాటలేదు.

దగ్గరగా వెళ్ళి అతని చేయి టచ్ చేశాను. పట్టించుకోలేదసలు. జస్ట్ ఒక చూపు చుశాడంతే. ఆ కళ్ళు చూడగానే భయం వేసింది. ఎర్రబడిన ఆ కళ్ళలో అవమాన భారం, ద్వేషం, ప్రతీకారం కనిపించాయి. నిజం చెప్పాలంటే నిప్పులు కక్కుతున్నట్లనిపించాయి.

అజీజ్‌ను మొదటిసారి అలా చూడడం. నేనే మాటన్నా అతని కళ్ళలోంచి జరజరా నీటి బిందువులు.

"చూడు. మీ ఇండియన్ ఆర్మీ మా కుటుంబానికి ఏం చేసిందో. మా నాన్న ఏం చేశాడని? చాలా సాధారణమైన మనిషి. రోజంతా కష్టపడతాడు. అల్లా అంటే భక్తి, భయం. ఎవరినీ నొప్పించని మనస్తత్వం. అంత క్రూరంగా దాడి చేయాల్సిన పరిస్థితి ఏమిటి? మీ మనుషులకు మనసులేదు. గుండెలు కావవి రాళ్ళు.. బండరాళ్ళు"

మా నాన్న BSF కావడం వల్ల అజీజ్ అలా అంటున్నాడని అర్థమైంది. ఆర్మీ ఆఫీసర్ కూతురు కావడం వల్లో ఏమో అజీజ్ అన్న మాటల్ని స్వీకరించలేకపోయాను. అతనికి జరిగిన ఘోరం వల్ల అతనలా మాట్లాడుతున్నాడని అనిపించింది. అతను బాధలో వున్నాడు. నేనే సర్దుకోవాలి.

నేను చెప్పేది వినడని తెలిసినా కూడా "అజీజ్ ఇవన్నీ మిలిటెంట్లు పన్నే కుట్రలు. మీలాంటి చురుకైన ముస్లిం యువకుల్ని తమవైపు తిప్పుకునేందుకు చేస్తున్నారని తెలియట్లేదా? వాళ్ళు ఆర్మీ వాళ్ళు ఎంతమాత్రమూ కాదు. ఆర్మీ దుస్తుల్లో వచ్చిన మిలిటెంట్లు. ఆర్మీ వున్నది ఇక్కడి ప్రజల్ని రక్షించడానికి. చంపడానికి కాదు" అన్నాను.

అజీజ్ వినే స్థితిలో లేడని రుజువైంది. గట్టిగా అరిచాడు. "గెట్ అవుట్. నేను ఏ ఇండియన్‌ను లెక్కచేయను" ఆవేశం ఎగిసిపడింది.

నేహ పరిస్థితిని గమనించి వెళ్ళిపోదామని సైగ చేసింది. నాకు చాలా కోపం వచ్చింది అజీజ్ అంటే. ఆ క్షణం నుంచీ అతనితో మాట్లాడకూడదనుకున్నాను. సన్నిహితులతో ప్రవర్తించాల్సిన తీరదేనా అనిపించింది.

మనసు స్థిమిత పడ్డాక ఆలోచించడం ప్రారంభించాను. పరిస్థితులు నన్ను కలవరపెట్టాయి. కాశ్మీర్ మొత్తం ఇదే పరిస్థితి. హిందువులైన యువకుల్ని చంపేయడం, వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసి కాశ్మీర్‌ను వదిలి పారిపోయేలా చేయడం, ముస్లిం యువకుల్ని ఎత్తుకుని పోవడం, మనసు మార్చడం, శిక్షణనివ్వడం, జిహాద్‌కు పనిచేసేలా తయారు చేయడం.. ఇది మిలిటెంట్ల పని.

పెద్ద మొత్తాల్లో డబ్బాశచూపించడం, బలిదానం జరిగితే వారి కుటుంబాలను ఆదుకుంటామని చెప్పడం. నిరుద్యోగం, మిలిటెంట్ల నుండి ఒత్తిళ్ళ కారణంగా యువకులకు మరో దారి కనిపించక ఈ మార్గం ఎంచుకుంటున్నారు. భారత వ్యతిరేక భావాల్ని నూరిపోస్తూ తీవ్రవాదులు అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. ప్రశాంతతను చెడగొడుతున్నారు.

ఇప్పుడు అజీజ్ వంతు వచ్చింది.

ఆ తరువాత అజీజ్‌ను చూడటం తటస్థించలేదు. నేనూహించినదే నిజమైంది. క్లాస్‌మేట్స్ ద్వారా తెలిసింది ఒక తీవ్ర వాద సంస్థకోసం పనిచేస్తున్నాడని.

కొన్ని నెలల తరువాత నగరంలో టూరిస్ట్ స్పాట్ దగ్గరెక్కడో బాంబ్ బ్లాస్ట్‌లో ఎందరో మృతి చెందారు. అనేకమందికి గాయాలయ్యాయి. మర్నాడు పేపర్లో ఏవేవో ఫోటోలు.. వార్త. ఆ బాంబు పేలుళ్ళలో అజీజ్ వున్నాడని చెప్పుకున్నారు.

నా మెదడు మొద్దుబారినట్లయింది.

అంతే –

పదిహేనేళ్ళ లేత వయసులో అజీజ్ ఒక మిలిటెంట్.

నాన్నకు ట్రాన్స్‌ఫరైంది.

ఈసారి రాజస్థాన్. బారాముల్లా నుంచి వెళ్ళిపోయినా నేహాతో స్నేహం కొనసాగుతూనే వుంది. రోజు రోజుకీ దిగజారుతున్న పరిస్థితుల్ని తనే చెప్పేది.

మిలిటెంట్ల దాడుల కారణంగా సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. జనం నవ్వడం మరచిపోయారు. ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి వుందో అన్న భయం ముసుగులో బతుకీడుస్తున్నారు.

చాలా బాధనిపించింది తెలుసుకున్నప్పుడు. కాశ్మీర్ అంటే నా హృదయంలో ప్రత్యేక స్థానం. బాల్యస్మృతులు. కాశ్మీరి అనిపించుకోవాలనిపించేది. రక్తపాతం సృష్టించడం వల్ల వారికి ఒరిగేదేమిటి? ఏ స్వాతంత్ర్యం కోరుకుంటున్నారు? తోటివారిని చంపుకుంటూ ఏం సాధిస్తారు? అమాయకుల ప్రాణాలు తీసే హక్కు ఎవరిచ్చారు? రకరకాల ప్రశ్నలు... జవాబులేని ప్రశ్నలు.

తీవ్రవాదుల అరాచకమైన పనులకు యువకులు కావాలి. ప్రాణాలకు తెగించి సాహసాలు చేయాలి. దానిని అడ్డుకునేందుకు భారత జవానులు తమ ప్రాణాలను పణంగా పెట్టాలి. దుస్సాహసాలను ఎదుర్కొనేందుకు సాహసం. ఏమిటీ పరిస్థితి.. శతృదేశాలు పైకి శాంతి పలుకులు పలుకుతూ తీవ్రవాద సంస్థలకు చేయూతను అందిస్తున్నాయి. దారుణాలు జరిగినప్పుడల్లా పండుగ చేసుకుంటున్నాయి.

కాలం ఎవరికోసం ఆగదు.

కొన్నేళ్ళు గడిచిపోయాయి. పి.జి కూడా పూర్తిచేశాను. ఒకరోజు ఏదో ఆంగ్ల పత్రిక తిరగేస్తుంటే అందులో అజీజ్ ఫోటో. దాని క్రింద ఇద్దరు సీనియర్ ఆర్మీ అఫీషియల్స్‌ను చంపిన వార్త.

ఆ వార్త మనసును చిందరవందర చేసింది. ఎంత అమాయకంగా వుండేవాడు. ఒక కరుడు గట్టిన తీవ్రవాదిగా.. ఇప్పుడిలా.

నేనేం చేయగలను – పిచ్చి ప్రశ్న.

చేయగలిగిందేమీ లేదు.

అదే ప్రదేశం.

అజీజ్, నేహా, నేనూ కలిసి తిరిగిన ప్రదేశాలు. ఆటలు, పాటలు. మధురమైన బాల్య స్మృతులతోబాటు అజీజ్‌లో ఊహించని ఉగ్రరూపం గుర్తొచ్చినప్పుడల్లా కళ్ళు ఎందుకో చెమరుస్తాయి. అందరూ మనుషులే. గుణాలను బట్టే చర్యలు.

రోజులు .. వారాలు.... నెలలు – జీవితం ఒక క్రమంలో సాగిపోతోంది.

ఒకరోజు నేను, ప్రశాంత్ మార్కెట్‌కు వెళ్ళాము. నేను షాపింగ్ చేస్తూ బిజీగా వున్నాను.

అంతలోనే పెద్ద లజడి. జనం పరుగులు.

కొన్ని దుకాణాల వాళ్ళు సడన్‌గా షటర్స్ దించేస్తున్నారు.

తలెత్తి చూశాను హడావిడికి.

ప్రశాంత్ గన్ బయటకు తీసి ముందుకు పరిగెత్తాడు. నా వెనుక వున్న ఎవరికో గురిపెడుతూ. "అజీజ్... స్టాప్..కదలొద్దు. చెబుతున్నాను. అక్కడే ఆగిపో. నా చేతుల్లో చచ్చిపోతావు" గట్టిగా అరిచాడు ప్రశాంత్.

ప్రశాంత్ కంఠస్వరం అంత తీవ్రంగా వుంటుందని నాకు తెలియదు.

ఒక మొరటు చేయి నన్ను గట్టిగా లాగిపట్టుకుని వెనకనుండి నా నుదురు భాగానికి గన్ గురిపెట్టడం జరిగింది. చేతులు మెలిపెట్టబడివున్నాయి. వెనక్కి తిరగలేని పరిస్థితి నాది. వెనుక అంతే బిగ్గరగా, కర్కశంగా వున్న గొంతు.

"ఆలోచించుకో. ఒక్క అంగుళం ముందుకు కదిలినా నేను ఈమెను కాల్చేస్తాను.. చూస్తావా?"

నా జీవితం ప్రమాదంలో పడింది. కానీ నేను భయపడలేదు.

అతను అజీజ్ అని నాకర్థమైంది. నన్ను చంపలేదు. తప్పించుకోవడానికి నన్ను అడ్డం పెట్టుకున్నాడు అంతే. అతి కష్టం మీద ముఖం తిప్పి చూశాను.

ఏళ్ళకొద్దీ మనుషుల్ని చంపి, చంపి కఠినంగా మారిపోయాడు. కళ్ళల్లో నేను ఇదివరలో చూసిన అమాయకత్వపు ఛాయలు ఇంకా...

"అజీజ్" మృదువుగానే అన్నాను.

చూడగానే గుర్తుపట్టాడు. చేయి గడ్డకట్టినట్లయి నిశ్చలుడయ్యాడు.

అంతే – ఆ రెప్పపాటు సమయంలో –...

బుల్లెట్ల శబ్దాలు.. భయంకరమైన అరుపులతో కలిసిపోయాయి.

అజీజ్ నేలకొరిగిపోయాడు.

చూస్తున్న నాకు కళ్ళు తిరిగాయి. షాక్‌లో వుండిపోయాను.

ప్రశాంత్ ముందుకొచ్చి నన్ను గట్టిగా కౌగిలించుకున్నాడు. 'స్నేహ' నీకేం కాలేదుగా అంటూ.

"తీవ్రవాదుల ఆట కట్టించాలంటే ఇదొక్కటే మార్గం. ఈ మాత్రం సాహసం అవసరం. అజీజ్ కరుడుగట్టిన తీవ్రవాది. వాటెడ్ లిస్ట్‌లో వున్నాడు. మమ్మల్ని టార్గెట్ చేస్తున్నాడని తెలుసు. మొన్నీ మధ్యే BSF సిబ్బందిని చంపాడు" ప్రశాంత్ ఇంకా ఏదో చెబుతున్నాడు. అతనేం అంటున్నాడో నాకు స్పష్టంగా వినబడడంలేదు. అజీజ్ కేసి చూస్తుండిపోయాను. నా ముఖం పాలిపోయి వుండాలి.

ప్రశాంత్ నా భుజాలను పట్టుకున్నప్పుడు నాలో ఒకలాంటి వణుకు.

"ఏమైంది స్నేహా. బానే వున్నావుగా?"

అజీజ్‌ను ఈ విధంగా చూడాల్సివస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. స్కూల్లో చేరిన మొదటిరోజు నన్ను క్లాసులో కూర్చోబెట్టడం గుర్తొచ్చింది.

ఇప్పుడు –

కళ్ళముందు రక్తం మడుగులో అజీజ్. కళ్ళు తెరిచే వున్నాయి. ఏదో చెప్పాలనుకుంటున్నాడేమో.

మంచి తెలివైన స్టూడెంట్. ఒక డాక్టరో, ఇంజినీరో ఏదైనా అయివుండేవాడు. ఎందరి ప్రాణాలో కాపాడేవాడు. దేశానికి కావల్సిన యువకుడు.. ఇప్పుడిలా.. ప్రతిక్షణం ప్రాణాలతో చెలగాటం ఆడుతూ చివరికి –

అజీజ్ నన్నూ, నా భర్తను కూడా చంపివుండేవాడన్న విషయాన్ని మరచేపోయాను.

ప్రశాంత్ నేను భయంతో ఏడుస్తున్నాననుకుని దగ్గరకు తీసుకున్నాడు.

"భయంలేదు. వాడు చచ్చాడు ఊరుకో" ఓదార్చాడు.

దానికి బదులేం యివ్వాలో తెలియలేదు నాకు. రహస్యంగా బాధపడ్డాను. ఆ కలకలం తరువాత ఆ లోయ ఇంకా నిశ్శబ్దం గా మారింది. నా గుండెలో నిశ్శబ్దంలా.

# పెంపకం

నిరుపమ రావినూతల

రోజంతా స్కూల్లో పిల్లలతో వాగి, వాదించి సాయంసంధ్య చిరుచీకట్లు అలుముకుంటుండగా, ఇప్పుడే ఇంటికొచ్చి పడ్డాను. కాలిఫోర్నియాలో ఒక ప్రముఖ ప్రయివేట్ స్కూల్లో లెక్కల ట్యుటర్ గా పనిచేస్తున్నాను నేను. బాగా అలసటగా ఉంది. ఆకలి దంచేస్తోంది. కారు గరాజ్ లో పెట్టి, ఇంట్లోకి అడుగు పెట్టగానే, రవ్వ ఇడ్లిలు ఉడుకుతున్న పరిమళం చుట్టుముట్టింది. రవ్వ నేతిలో వేయించాడేమొ, కమ్మటి ఆ వాసనకే ఆకలి రెట్టింపయింది.

"ఇప్పుడే ఇడ్లి కుక్కర్ పెట్టాను, నువ్వెళ్ళి ఫ్రెష్ అయ్యిరా ,ఈ లోపు చట్ని చేసేస్తాను" అన్నాడు నా భర్త రాఘవ.

ఆరేళ్ళ మా ముద్దుల కూతురు "అమేయ" తన చిట్టి చేతులతో మా వారికి సహాయం చేస్తోంది. వర్క్ ఫ్రం హోం కారణంగా రాఘవ ఇంట్లో ఉండటం చేత అప్పుడప్పుడు గరిటతిప్పటం తనకి మామూలే. టీవిలొ వచ్చే రకరకాల వంటల ప్రయోగాలు కూతురికోసం చేస్తూ ఉంటాడు. అలాగే ఇవాళ ఈ వంట చేస్తున్నాడు. వంటింట్లో ఆ నాన్నా కూతుళ్ళని తనివితీర చూసి, నవ్వుతూ ఫ్రెష్ అవటానికి గదిలోకెళ్ళాను.

వంటింట్లో చూసిన ఆ దృశ్యం అప్రయత్నంగా, నాకు నా చిన్నతనాన్ని గుర్తుచేసింది. నా చిన్నప్పుడు మేము పల్నాడులో ఒక మారుమూల గ్రామం లో ఉండేవాళ్ళం. మా తాతయ్య అక్కడ సర్పంచ్ గా ఉండేవారు. అసలే ముక్కోపి, పైగా బాగా వెనుకబడిన ప్రాంతమేమో, చాల మొరటుగా ఉండేవారు. నానమ్మ ని ,ఇంకా తన పిల్లలని చిన్న పెద్దా చూడకుండా చిన్న చిన్న వాటికే చితకబాదేవాడు. కోపంలో , తొందరపాటులో ఆ దుర్వాసుడి అంశే. ఆడవారు వంటింట్లొ తప్ప, బయట నోరెత్తినా, చెప్పిన వంట కాకుండా ఏ కొంచం మార్చినా, వెంటనే శివాలెత్తిపోయేవాడు. ఆ చుట్టుపక్కలంతా మగవారు దాదాపు ఇలాగే ఉండేవారు.

ఎదుగుతున్న పిల్లలం ఇలాంటి వాతవరణం లో పెరగటం ఇష్టంలేక, మా అమ్మ నాన్న, గుంటూరు నగరానికి బదిలి చేయించుకుని వచ్చేసారు. పెద్ద పట్టణం కావటంతో, గుంటూరులో మంచి వాతవరణమే ఉండేది. ఇంటిపనులు, వంట, ఎక్కువగా అమ్మే చేసినా, ఇద్దరు ఉద్యోగస్తులవటం చేత , ఎప్పుడన్నా సరదాగా, అమ్మకి విశ్రాంతి ఇవ్వటం కోసం నాన్న గరిటపట్టేవారు. నాన్న ఎప్పుడన్నా ఒకసారి చేసే, పల్నాటి రుచులు, లొట్టలేసుకుంటూ తినటం ఇప్పటికి లీలగా గుర్తే నాకు. ఐనా కూడా ఏదో మూల మా నాన్నంటే కాస్త భయమే మాకు. చాలా వరకు మాతో

సరదాగానే ఉన్నా, కోపంలో మాత్రం, మా తాతకి కొడుకే. సరదాగా ఉన్నారు కదా అని చిన్నప్పుడొకసారి స్వీట్లు కావాలని అడిగాను. డబ్బులేమన్న చెట్లకి కాస్తున్నాయనుకున్నావా అంటూ మండిపడిపోయారు.

పరీక్షల్లో నూటికి తొంభై ఎనిమిది మార్కులు వస్తే మెచ్చుకోకపోగా, "ఆ రెండు మార్కులు ఎందుకు పోయాయి? అంత అలక్ష్యంగా ఎందుకున్నావు? నీకన్నా ఎక్కువ మార్కులు ఇంకెవరికన్నా వచ్చాయా? ఎందుకు సరిగ్గా చదవలేద"ని గద్దించి గడగడలాడించేవారు. అన్ని మార్కులొచ్చి స్కూల్లో అందరితో సెభాష్ అనిపించికునే నేను, అ ప్రోగ్రెస్ రిపోర్ట్ లో నాన్నతో సంతకం పెట్టించుకురావటానికి ఇబ్బందిపడే నన్ను చూసి నా స్నేహితులు నన్ను వింతగా చూసేవారు.

అందుకే నాన్నంటే భయంతో కూడిన గౌరవమే తప్ప, చనువు లేదు నాకు. ఇప్పుడు రాఘవ నాకంటె చెయ్యితిరిగినవాడిలా వంటచేస్తూ, కూతురితో ముద్దులాడుతూ ఉంటే , ఇంతలోనే ఎంత మార్పు మగవాళ్ళలో అనిపించింది.

ఇన్స్టంట్ పాట్ సౌండ్ రావటంతో, ఇడ్లిలు తయారయ్యిఉంటాయని, సర్వ్ చేద్దామని మూత తీసి చూసి, ఆశ్చర్యంతో "ఏంటండి ఇది? " అని చిన్నపాటి గావుకేక పెట్టాను. తెల్లగా మిలమిలలాడాల్సిన ఇడ్లిలు, ముదురు నీలాకాశం రంగులో ఉన్నాయి మరి." ఓ అదా, అమేయ బ్లూ ఇడ్లి కావాలని అడిగింది. అందుకే చేసాను" తాపీగా చెప్పాడు రాఘవ.

"ఐనా ఇంట్లో ఫుడ్ కలర్స్ ఏమి లేవే! మరి ఈ రంగు ఎలా వచ్చింది?" విస్తుబోతూ అడిగాను.

"ఫుడ్ కలర్స్ ఆరోగ్యానికి మంచిది కాదు. నేనవి వాడలేదు. ఎప్పుడూ వాడను కూడా. ప్రకృతిసిద్ధంగానే ఈ రంగు రప్పించాను" కించిత్ గర్వంగా చెప్పాడు.

"అదే ఎలా?" సస్పెన్స్ తట్టుకోలేకపోతున్నాను నేను.

చిరునవ్వులు చిందిస్తూ మా పెరటి వైపు వేలు చూపించాడు.

మా పెరటి పెర్గోలా ( పెర్గోలా అంటే తీగ మొక్కలు పాకటానికి అనువుగా ఉండేందుకు ఎత్తుగా ఆర్చిలాగా ఉండే ఒక నిర్మాణం. అమెరికా పార్కుల్లో, ఇంటి పెరళ్ళలో ఇవి సర్వసాధారణంగా ఉంటాయి) మీదకి పాకిన నీలం రంగు శంకుపూల తీగని చూపించాడు.

ఈ తీగ అమేరికాలో అన్నిచోట్లా దొరకదు. లాస్ ఏంజలెస్ లో, ఏదో షాపులో ఉందని తెల్సినవాళ్ళు చెప్తే, రెండు గంటలు ప్రయాణించి ,ఆ మొక్కని తెచ్చి మా పెరట్లో నాటి పెర్గోలా మీదకి పాకించాడు. చాలా త్వరగా అల్లుకుని, బాగా పూలు పూసింది. ఆ పూలని తెచ్చి వాటిమీద వేనీళ్ళు పోసి కాసేపు నానబెడితే, వాటి

నీలంరంగంతా నీటిలోకి వస్తుందని, ఆ నీళ్ళు చాలా ఔషధగుణాలు కలిగి ఉంటాయని చదివాడట. ఇప్పుడు ఆ నీళ్ళే వాడి ఈ రవ్వఇడ్లిలు తయరుచేసాడు.

ఇంతలోనే మరో సందేహం నాకు. "ఆ పెర్గోలా చాల ఎత్తుగా ఉంది కదా? పూలు ఎలా కోశారు ?" అని అడిగాను.

"పక్కింటికి వెళ్ళి వాళ్ళ నిచ్చెన అడిగి తెచ్చి కోశాను" చాలా తేలిగ్గా చెప్పేసాడు. నా మనస్సు ఒక్క క్షణం చివుక్కుమంది. తను రోజంతా ఆఫీస్ పనితో, వరుస మీటింగ్ లతో ఎంతో బిజీగా ఉంటాడని తెలుసు నాకు. అంత పనిలో ఉండి కూడా, పక్కింటి నుంచి అంత బరువైన నిచ్చెన తెచ్చి, ఇంత శ్రమపడి ఇదంతా చెయ్యాలా? ఇడ్లిలు నీలంగా ఉండవమ్మా, తెల్లగానే ఉంటాయని అమేయకి సర్దిచేప్తే సరిపోయేదిగా ? ఇంత ప్రయాస పడటం అవసరమా అని బాధనిపించింది. ఆ మాటే రాఘవ తో అన్నాను.

రాఘవ ఎప్పటిలాగే చిద్విలాసంగా నవ్వుతూ "నాన్నా ,నాకు బ్లూ ఇడ్లి కావాలి అని అమేయ అన్నప్పుడు, ఒక్క క్షణం నాకూ నీలాగే తనకి సర్దిచేప్తే సరిపోతుంది కదా అని అనిపించింది. అంతలోనే, మనమే తన ఊహాశక్తికి ఎందుకు కళ్ళెం వెయ్యలి? ఇడ్లిలు అంటే ఎప్పుడూ తెల్లగానే ఉండాలా? ఆరోగ్యం విషయంలో రాజి పడకుండా తనడిగిన రంగులో ఎలా చెయొచ్చో అని అలోచించి చేసాను. రేపు తను, మనం పెద్దయ్యాక గుర్తుచేసుకుంటే, ఇలాంటివే కదా మధుర జ్ఞాపకాలుగా మిగిలేది. తనకిలాంటి జ్ఞాపకాలని అందించటం ముందు ఇదేమంత కష్టం అనిపించలేదు. ఇలాంటివే కదా తనకి మనమిచ్చే విలువైన ఆస్తి" అన్నాడు.

" ఐనా మీ పిచ్చి కాకపోతే, తను పెరిగి పెద్దయ్యాక, తనకి ఇవన్ని గుర్తుంటాయనుకుంటున్నావా?" రాఘవ ని కాస్త ఉడికిద్దామని అన్నాను.

"అమేయ కి ఇవన్ని గుర్తుండొచ్చు, ఉండకపోవచ్చు. కాని, ఇడ్లిలు తెల్లగా మాత్రమే ఉంటాయని నేనే తన ఆలోచనా పరిధిని కుదించేస్తే, ముందుముందు తను కొత్త ఆలోచనలు చేయటానికి సంకోచించొచ్చు. ఎదిగే వయస్సులో, నాన్నని ఏదన్నా విషయం అడగొచ్చో లేదో, ఏమనుకుంటారో అన్న అనుమానంతో కాకుండా, నాన్నని ఏదైనా అడగొచ్చన్న భరోసాతో పెంచాలనుకుంటున్నా. అందుకే ఇలాంటివన్ని. తనని చూడు, ఆత్రెడి "నాన్న బ్లూ ఇడ్లి చేసాడు. మై నాన్న ఈజ్ ద బెస్ట్ నాన్న ఇన్ ద వరల్డ్ " అని ఎలా గంతులేస్తుందో. తన కళ్ళలో ఇలాంటి మెరుపు కోసం ఎంత కష్టమైనా నాకు ఇష్టమే" అన్నాడు.

"అయినా అడక్క అడక్క నీలం రంగు ఇడ్లిలే అడగాలా నీ ముద్దుల కూతురు ? ఎక్కడో చదివాను, ప్రపంచంలో ఎక్కువ శాతం మంది నీలం రంగు ఆహారపదార్ధాలను తినటానికి ఇష్టపడరట " రాఘవ ని ఆటపట్టించాలని అన్నాను.

" ప్రపంచమంతా ఏకమై కుదరదన్నా కూడా, నా చిట్టి తల్లి అడిగింది కాబట్టి, అది నేను చెయ్యాల్సిందే. నువ్వు రారా బంగారుతల్లి, ఈ అమ్మ ఇలాగే కబుర్లతో కడుపు నింపేస్తుంది. మనం మన బ్లూ ఇడ్లి తిందాం" అంటూ అమేయని ఎత్తుకుని వెళ్ళిపోయాడు.

తండ్రి అంటే భయం, భక్తి మాత్రమే ఉండాలనుకునే తాతలకాలం నుండి, తండ్రి అంటే ఒక నమ్మకం, భరోసా అనుకునేలా పిల్లలని పెంచాలనుకుంటున్న నేటి తరం ఆధునిక తండ్రుల్లో వస్తున్న మంచి మార్పుని మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ, నేను కూడా నీలం ఇడ్లిలు తినటానికి ఉపక్రమించాను.

## అవసరం తీరిపోయింది

గాదిరాజు మధుసూదనరాజు

సమయం అర్ధరాత్రి పంద్రెండుగంటలు. పల్లెలో అయితే పంద్రెండుగంటలు మ్రోగివుండేవి నిరభ్యంతరంగా.

గంటలుకొట్టేపాతతరపు సంప్రదాయాన్ని సౌండు పొల్యూషన్ అంటూ తప్పు పట్టే కొత్తకాలం వచ్చింది కదా!

ఇరవయ్యోఅంతస్తులోని కార్నరింటి పడగ్గది అది!

కొత్తకాలంట్రెండులేవో వెక్కిరించటంతో గంటలశబ్దాల్నిమాత్రం గొంతులోనే నొక్కుకొని కిక్కురుమంటూ క్లిక్ క్లిక్ మని చిన్నగా శబ్దం మూలుగుతోంది . నిశ్శబ్దనిబంధనలను నెమరువేసుకొంటోంది.

అలా కదులుతూన్న కాలానికి గురుతుగా గోడపై వ్రేలాడుతూ కాలాన్ని లెక్కపెడుతోంది.

ఎలాగో అలా ముల్లులున్న ఆ గడియారం భయంభయంగా తనపని తాను చేసుకుంటోంది లెజెండరీయోధునిలా.

★★ ★★ ★★

"సంక్రాంతి పండక్కి మా నాన్నమ్మ వాళ్ళ ఊరికి వెళదామండీ! పాపం ముసలిప్రాణాలు ఆశగా ఎదురుచూస్తూంటాయి."

"ప్రయాణంలో ఇక్కట్లుగుర్తుకు తెచ్చుకో ! పిల్లల్ని ఇబ్బందిపెట్టి ఆరోగ్యాలను ఫణంగా పెట్టి వెళ్ళటం అనవసరమా ?"

బెడ్ లైట్ వెలుగులో సహనప్రియ బుగ్గలపైనుండి జారుతున్న కన్నీటి చారికలు మెరుస్తూనేవున్నాయ్ నిస్సహాయతకు గురుతులుగా..

★★ ★★ ★★

రాత్రులు కొన్ని గడిచిపోయాయ్.

సంక్రాంతి వచ్చిపోయింది.

కాలం అలా క్రమక్రమంగా ఓదార్చడంతో కన్నీళ్ళు అలా అలా అనునయింపబడి ఆగిపోయాయ్.

★★ ★★ ★★

"ఎందుకే సంక్రాంతికి రాలేదు?"

"సెలవు దొరకలేదు బామ్మా"

"అదేం కాదులేవే! ఈ ముసలిదానితో అవసరం తీరిపోయింది. ప్రేమచచ్చిపోయింది"

గుండెపగిలింది సహనకి నాన్నమ్మ నిష్ఠూరపు పలుకులతో .

అయితే.. ఆ విషయం ఎవ్వరికీ తెలీదు సహనకు తప్ప.

ఎదురుచూచిఏడ్చి, నిష్ఠూరాలాడిన బామ్మకూ తెలీదు గుండెపగిలిన సంగతి.

ఎందుకంటే....

అది సహనప్రియ మౌనంగా దాచుకున్న రహస్యం కాబట్టి!

★★ ★★ ★★

హృదయం ఉప్పొంగింది ఆనందంతో, ఎన్నోఏళ్ళతర్వాత కళ్ళెదుట అక్కయ్య కనబడటంతో.

తనకి కన్నతల్లితో సమానంగా ప్రేమనుపంచింది ఆమెనే మరి!

ఎగిరి ఓ పట్టుపట్టింది మెడచుట్టూ చేతులేస్తూ.. అక్కయ్యకూతురు క్షేమ గారాబంగా.

దానికి పెట్టాల్సిన పేరుకోసం ఎక్కడెక్కడో తెలుగు భాండాగారాలలో వెతికి వెతికి చివరికి నామకరణంరోజునాటికి పేరుని సిద్ధంచేసి పెట్టింది సహనప్రియే మరి!

"పెళ్ళై ఇన్నేళ్ళయ్యింది .అయినా మా ఇంటికి అస్సలు రాలేదు. ఎలావున్నావే?"

ఆవేదనగా అడిగింది అక్కయ్య ప్రేమగా సహనప్రియ తలపైచెయ్యేసి ఆప్యాయంగా నిమురుతూ.

"హాస్పెటల్ లో ఉద్యోగం కదా అక్కయ్యా! సెలవులుండవ్ .ఆదివారం కూడా డ్యూటీయే!"

"ఫరవాలేదు లేవే ఆనందంగా వున్నావ్ అదే మాకు కావాలి."

కమ్మనివంటలు వండుకుతింటూ తీయని మాటలను కలుపుకుంటూ అలనాటి ఘటనల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ పదిరోజులు పదినిముషాలలా గడచిపోయాయ్.

ఆన్ లైన్ లో ఫ్లైట్ టికెట్లు బుక్ చేసి సెల్ ఫోన్ కి పంపించారు, బావగారు అక్కయ్య గారిని ఇక పంపించెయ్యమంటూ,

పిల్లలకు పరీక్షలుండటంతో .

కన్నీళ్లు నిండిన కన్నులతో అక్కయ్యనూ ముద్దులకూతురు క్షేమనూ సాగనంపేందుకు కారుదాకా వచ్చి నిలిచింది సహనప్రియ .

"ఎన్నాళ్ళున్నా .... 'ఎవరికివారే యమునాతీరే అన్నట్లు ' ఎవరిళ్ళకు వారెళ్ళకతప్పదు కదా! కానీ.... కనిపిస్తే పలకరించటం , ఇంటికి వస్తే కమ్మగా వండిపెట్టటం, కానుకలివ్వటం ఇవన్నీ..... తప్పవుకాబట్టి. ఇవన్నీ ఏదో రొటీన్ గా

బాధ్యతల్ని నెఱవేర్చటాల్లాంటివేరా బుజ్జీ! ఇవేవీ మధురస్మృతులలా జ్ఞాపకాల్లో మిగిలి పోయేఛాన్స్ లేదు. 'మనసుంటే ... నీ మనసులో మేముంటే నీవూ మా ఇంటికిరా! కనీసం నేను బ్రతికుండగానే!!"

అంటూ గద్గదస్వరంతో ,కన్ను ల్లో నిలుస్తున్న కన్నీటితడిమెరుపు లతో వెళ్ళిపోయింది అక్కయ్య.

కానీ అక్కయ్య మాటలు మాత్రం....

మ్యూజియంలో భద్రపరచిన ఈటెల్లా మిగిలిపోయాయ్

సహనప్రియ గుండెగదుల్లో అలా శాశ్వతంగా.

★★ ★★ ★★

"హలో సహనా! నేనే! నీ మానసనే! నీ చిన్ననాటి నీ స్నేహితురాలిని. నీ ప్రాణాన్ని.. మా అమ్మాయి కి కాన్పునొప్పులొస్తున్నట్లున్నాయ్ చిన్నసాయం కోసం ఫోన్ చేశా ..'

"సారీ! నేను ఉత్తరదేశయాత్రలో వున్నాను." పడకమీదనుండిలేయకుండానే సహనచెప్పిన జవాబుఅది!

తాను అబద్ధంచెప్పానని మానస గ్రహిస్తుందని,అయినా తనని క్షమిస్తుందని కూడా సహనకి తెలుసు, ఎందుకంటే ఇద్దరిశరీరాలు వేరైనా మనసులుమాత్రం ఒకటే కాబట్టి. కనీసమైన సాయం చేయలేకపోయినందుకు తనను తాను క్షమించుకోలేక కుమిలి పోయింది సహన.

'హమ్మయ్య!' సహనగారి భర్త గారి నిట్టూర్పు.

"అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఫోన్లు వస్తుంటాయ్ మీ మమ్మీకి. మీ మమ్మీ లేస్తుందనుకున్నాను"

"నాకు ముందే తెలుసు డాడీ అందుకే .. . మమ్మీ ఫోన్ లిఫ్ట చేయకముందే.... వెళితే నా మీద ఒట్టేనని చెప్పేశాను.

అందుకే ఆ ట్విస్టు పైగా నేను కూడా పసిబిడ్డతల్లినికదా !"

కట్టుబాట్లతో కఠినశాసనాలతో మనసుల్నికట్టిపడేసే తండ్రికి ఒట్లతో చుట్టికట్టేసే కూతురూ తోడైంది.

"అర్థరాత్రి ఫోన్ చేసి నిన్ను ఇబ్బంది పెట్టినందుకు నన్నుక్షమించవే" అంటూ .. చితికిపోయిన నమ్మకంతో సహనప్రియతో మానస చెప్పిన ఆ మాటే మానసగారు తన జీవితంలో మాట్లాడిన చిట్టచివరిమాట.!!

ఆ మాటను వినటంతోనే...అత్యంతగోప్యంగా సహనప్రియ మనస్సు హత్యచేయబడింది.

★★ ★★★ ★★

అదే అర్థరాత్రి

అదే సహనప్రియ

అరవయ్యేళ్ళ వయో అవధి!

'ఆనందంగా....యూ యస్ ఏ లో పిల్లలు'

'ప్రక్కన ప్రశాంతంగా నిద్రలో మునిగిన జీవిత భాగస్వామి!'

యథాతథంగా....తలవైపున గోడపై..తదేకంగా తనపనితాను చేసుకుపోతోన్న గడియారం.!

ఆఖరి పిలుపులు మొదలయ్యాయి. మెడికల్ డిపార్టుమెంటుకదా ....బాగా అవగాహన వుంది ఆమెకి.

రక్తం మాంసం తో నిర్మితమైన గుండె మొరాయిస్తూన్నట్లు బాధిస్తోంది. ఈ బాధకు కారణం అనారోగ్యంకావచ్చు.

ఒక్కసారి మాత్రమే ప్రాణంతీసి చంపే శక్తి ఈ బాధకు ఉండవచ్చు.

కానీ.. ఇదే గుండె.. పిండేయబడుతన్నట్లు పగిలిపోతున్నట్లు గతంలో వందలసార్లు బాధపడింది. ఆ బాధకుకారణం అచ్చంగా ఆత్మీయమానవీయవైఫల్యంమాత్రమే .

కానీ ఆ బాధ మానసికంగా ప్రతిసారీచంపింది.

కానీ.....

అదే మానవీయధర్మం

'తనబాధ్యతలను తీర్చుకోవటం కోసం '

తనను బ్రతికేలా చేసి అనుక్షణం తనను చిత్రవధకు గురిచేసింది.

మరి ఇప్పుడు...

నొప్పులు,వొణుకులు, చెమటలు,రొప్పులు

ఈ నాటి చెమటలచెమ్మ ఆమెని కలవరపెట్టలేదు

ఎన్నోఏళ్ళుగా ఉబికిన కన్నీళ్ళచెమ్మలకు ఫుల్ స్టాప్ పెట్టే సమయం వచ్చినందుకు ఆమెకెంతో తృప్తిగా వుంది.

కాన్పునొప్పులను మునిపంటిబిగువున భరించిన ఆమెకి ఈ గుండె నొప్పిభరించరానిదిగా అనిపించలేదు.

అందుకే ప్రక్కనే పడుకొని వున్నప్పటికీ ,భర్తని పిలువలేదు. పెడబొబ్బలు పెట్టలేదు.

"అమ్మా! నీ మనవరాలు నివేదిత పుట్టినరోజు కి ఆన్ లైన్ లో తప్పకుండా ఆశీస్సులందించాలి " అంటూ అమెరికానుండి వాట్సప్ పెట్టిన కూతురుకి

"నాతో అవసరం మీకు తీరిపోయిందే " అంటూ జవాబు పెట్టాలనుకుంది సహనప్రియ

కానీ..అది కూడా పెట్టలేదు.

శాశ్వత నిద్రలోకి జారుకుంది హాయిగా.